# వీరశైవాంధ్ర వాఙ్మయము


రచన

**శిష్టా రామకృష్ణశాస్త్రి**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2012**

VEERASAIVANDHRA VANGMAYAM

*By*

**Sista Ramakrishna Sastry**

Edited by

**Prof.Ravva Sri Hari**

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved

First Edition : 1952
Revised Edition : 2012

Copies: 1,000

***Published by***

**L.V.Subrahmanyam, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P. Type Setting***
Chief Editor's Office,TTD,Tirupati.

Printed at
Tirumala Tirupati Devastanams Press
Tirupati

# వీరశైవాంధ్రవాఙ్మయము

రచన:

**శిష్ట్లా రామకృష్ణశాస్త్రి M.A; B.O.L.**

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2012**

# ముందుమాట

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతిలో సహాయాంధ్ర పరిశోధకులైన శ్రీ శిష్ట్లా రామకృష్ణశాస్త్రి గారిచే రచితమైన **"వీరశైవాంధ్ర వాఙ్మయం"** తిరుమల తిరుపతి దేవస్థానముల పక్షాన నాటి కార్యనిర్వహణాధికారి శ్రీ చెలికాని అన్నారావు గారిచే 1952లో తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాక్షరశాలలో ముద్రించబడింది.

వీరశైవాంధ్ర కవులు, వారి కాలములు, వివిధ సాహితీ ప్రక్రియలలో రూపుదిద్దుకున్న వారి గ్రంథములు మున్నగు విషయములను గూర్చిన సమీక్షలు ఉన్న ఈ గ్రంథం పది ప్రకరణాలతో విలసిల్లుతున్నది.

చక్కని పరిశీలనతో పరిశోధనాత్మకంగా సాగిన ఈ గ్రంథంలో పెక్కు ఆసక్తికరమైన అంశాలు సహేతుకంగా చర్చించబడినాయి.

వీరశైవాంధ్ర వాఙ్మయానికి విధాతవంటి వాడైన మల్లికార్జున పండితారాధ్య కవి జీవితకాలాదులు ఆయన రచనలను గూర్చి వివరములు ప్రథమ ప్రకరణంలో తెల్పబడినాయి.

ద్వితీయ ప్రకరణంలో బసవపురాణ పండితారాధ్య చరిత్రల కర్త పాల్కురికి సోమనాథుని సారస్వత వరివస్యా వైశిష్ట్యమెట్టిదో పేర్కొనబడింది.

మరి తృతీయ ప్రకరణంలో పాల్కురికి సోమనాథుని తరువాత చెప్పదగిన పిడుపర్తి సోమనాథాదుల రచనాదికము పరిశీలించబడింది.

ఇట్లే కడమ ప్రకరణాలలో శైవమతము, ఆ మతమునకు సంబంధించిన పురాణములు, మాహాత్మ్యములు, శతకములు, యక్షగానములు, రగడలు, దండకములు, పాటలు, వచనములు మొదలైన రచనలు చక్కగా సమీక్షించబడ్డాయి.

ప్రొఫెసరు పరవస్తు రామానుజస్వామివారి సంపాదకత్వాన 1952లో ప్రచురితమైన ఈ పుస్తకం మళ్లీ 60 ఏండ్ల తర్వాత 2012లో ఆచార్య రవ్వా శ్రీహరిగారి సంపాదకత్వాన వెలువడుతున్నందుకు సంతోషిస్తున్నాను.

ప్రాచీన సాహితీప్రియులను మీదు మిక్కిలి వీరశైవ వాఙ్మయాభిమానులను ఈ గ్రంథం ఎంతగానో అలరించగలదని ఆకాంక్షిస్తూ.

**తిరుపతి**
**నవంబరు,** 2012

శ్రీవారి సేవలో
లంక వెంకట సుబ్రహ్మణ్యం.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# పీఠిక

వీరశైవాంధ్ర వాఙ్మయమున పాల్కురికి సోమనాథుని గ్రంథములను, పిడుపర్తివారి కావ్యములనుమాత్రము ఇంతవఱకు పండితులు పరామర్శించిరి. కాని విశాలాంధ్ర వాఙ్మయమునఁబోలె, వీరశైవాంధ్ర వాఙ్మయమునఁగూడ గ్రంథములు శాఖోపశాఖలుగాఁ బెరిగి పురాణ, మాహాత్మ్య, ప్రబంధ, శతక, యక్షగానాది వివిధ భాగములుగా నుండుటచే, నా వాఙ్మయ మంతను గూడ నాయా భాగములుగనే యేర్పరించితిని. రామాయణ కథనే పలువురు కవులు పలువిధముల నాటక, కావ్య పురాణాదులుగ రచించినట్లుగ, వీరశైవభక్తుల కథలను గూడ ననేక కవు లనేక రూపముల రచించిరి. అట్లు రచించుట దోషము కాకపోగా, విశేషించి సుగుణమనికూడ పిడుపర్తి బసవన తన కుమారుఁడైన సోమనాథునకుఁ బద్య బసవపురాణ రచన ప్రేరణమున నుపదేశించినాఁడు. ఆ ధర్మసూత్రములనే వీరశైవ కవులందఱు గ్రహించిరి. అందుచే నేక వస్తువునే పలువురు కవులు గ్రహించి కావ్యరచనముఁ గావించుటచే తారతమ్య పరీక్షకు వీలుగా నుండుటకై వానిని కాలక్రమత ననుసరించి యొకచోటనే కూర్చి వాని యోగ్యతలను విమర్శించితిని. గ్రంథములు విశేషముగ వివిధరూపముల నున్న శివునకును, శివభక్తులకును, గురువులకు నంకిత మీయఁబడినవి. ఈ భక్తులు, గురువులును వీరశైవమత మహాపురుషులు నైనను, చారిత్రక మహాపురుషులు గాకపోవుటచే, వీరినిఁ బట్టి కవుల కాలనిర్ణయము చేయుట దుర్లభమైనది. వీలుగానున్నంతవఱకు వారి కాలమును నిర్ణయించుటకుఁ బ్రయత్నించితిని. చిల్లర కవుల కాలనిర్ణయముపట్ల శ్రీకందుకూరి వీరేశలింగముగారి యాంధ్రకవులచరిత్రనే యుపయోగించుకొంటిని.

బసవేశ్వరుని జీవితచరిత్రమును రాజకీయ మతపరిస్థితులను దెల్పు ప్రకరణమునను, మల్లికార్జున పండితారాధ్యుని జీవితచరిత్రమును శివతత్త్వసార ప్రకరణమునను దెల్పినానుగాన, తిరిగి పాల్కురికి సోమనాథుని గ్రంథములఁ బరామర్శించు సమయమున వీరి చరిత్రములను వివరింపలేదు. అల్లమప్రభుచరిత్ర,



భల్లాణచరిత్రముల కథాసార మా యా గ్రంథములఁ బరామర్శించుచోట్లనే యొసఁగితిని. ఇఁక సిరియాళచరిత్ర మొదలైనవి శ్రీనాథాదుల హరవిలాసాది గ్రంథములందు ప్రఖ్యాతములై, సర్వజన విదితములగుటచే వాని కథాసారాదుల నొసంగలేదు. యక్షగానములందలి కథలు క్రొత్తవైనచో నొసఁగితిని. అష్టాదశ పురాణములలో శైవ పరమైనవి కొన్ని గలవు. మిగిలినవి పాల్కురికి సోమనాథుని కృతులు. సాధారణముగా పురాణమాహాత్మ్య శైవమతగ్రంథములందు విభూతి, రుద్రాక్ష శివలింగాది మాహాత్మ్యము దెలుపఁబడినది. అదియే యీ గ్రంథము లన్నింటికి సామాన్య వస్తువైనది. పురాణాంతర్గతములై రసవంతములైన కథలే ప్రబంధములుగాను, యక్షగానములుగను వ్రాయఁబడినవి.

వీరశైవ కృతులలో నూటికి 10 మాత్రము ముద్రితములైనవి. వానిలోఁగూడ గొన్ని కృతులీ ప్రతిలో నుండి, తప్పులు తడికలై లిఖిత గ్రంథములకంటె నికృష్టముగా నున్నవి. మిగిలినవన్నియుఁ వ్రాతపుస్తకములే. వీని నన్నిఁటికి చెన్నపురి, ప్రాచ్యలిఖిత గ్రంథ భాండాగారము నందు పరిశీలించితిని. కాకినాడ, ఆంధ్రసాహిత్య పరిషత్తు నందలి లిఖిత పుస్తక భాండాగారమున రెండు గ్రంథములు మాత్రము క్రొత్తవి నాకు గోచరించినవి. ఆ భల్లాణచరిత్రములు క్రొత్త కవులవి. ఇవి చెన్నపురి భాండాగారమునఁ గాని మఱి తంజావూరున షాజీగారి సరస్వతీ పుస్తక భాండాగారమునఁగాని లేవు. ఇఁక తంజావూరు గ్రంథాలయమునందు వీరశైవాంధ్రవాఙ్మయమున కుపకరించు నూత్నకృతు లేమియు లేవు. ఉన్న కొలఁది కృతులు మాత్రము చెన్నపురి గ్రంథాలయమునందున్నట్టివియే.

ఈ గ్రంథమును రచించుటకు వివిధ పత్రికలందు ప్రకటింపఁబడిన పండితుల వ్యాసములన్నింటిని చూచి యుపయోగించుకొంటిని. అందులో ముఖ్యముగా ఆంధ్ర పరిషత్పత్రిక, ఆంధ్రపత్రిక, ఉగాదిసంచికలు, భారతి, విభూతి మొదలైనవానిలో శ్రీయుతులు బండారు తమ్మయ్య, చిదిరె మఠం వీరభద్రయ్య, నిడదవోలు వెంకటరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, డాక్టరు చిలుకూరి నారాయణరావుగార్ల రచనలలో సరసముగా నున్నవాని నుపయోగించు కొంటిని; విరసముగా నున్నవానిని విమర్శించితిని. వీరశైవాంధ్ర వాఙ్మయమంతయు

పాల్కురికి సోమనాథునిపై ముఖ్యముగా నాధారపడియున్నదని నే విశ్వసించి యట్లు నిరూపించినవాఁడ నగుటచే, వానినిఁ గూర్చి విపులముగను, విశేషముగను గూడ రచించి, వానిఁగూర్చి యొక ప్రత్యేక ప్రకరణమునే వినియోగించితిని. ఇందులకు మఱియొక కారణముగూడఁ గలదు. సోమనాథుని స్థలకాల విషయములఁ గూర్చి భిన్నమతము లేర్పడుటయు, నాతని గ్రంథములను ప్రభాకరశాస్త్రి, డా.చి.నారాయణ రావుగార్లు విశేషముగా భాషావిషయిక దృష్టితోడనే పరామర్శించిరిగాని, సారస్వత విమర్శకదృష్టితోఁ బరిశీలింపకపోవుటచే నా లోపము దీర్చుటకై చేసిన ప్రయత్నము మఱియొక కారణమైనది.

తర్వాత వేటూరి ప్రభాకరశాస్త్రి, డా.చిలుకూరి నారాయణరావుగార్లు రచించిన బసవపురాణ పండితారాధ్యచరిత్రల పీఠికలఁ గూడ నేను స్వేచ్ఛగా నుపయోగించితిని. ఆ యా సందర్భములందు వారివారి గ్రంథములను వ్యాసముల నా పుట యధో భాగమునఁ దెల్పుటయేకాక, యా ప్రకరణాంతములందుఁ గూడ, ముఖ్యముగా సంప్రదించిన గ్రంథముల పట్టిక నొసంగితిని. ప్రతి గ్రంథమును పరామర్శించునపు డా గ్రంథ కథావిషయ వర్ణనమందుననో, లేక చివరనో యా గ్రంథమునుండి కొన్ని భాగములందలి పద్యములను రచన, శైలి మొదలైన వానిని సూచించుటకై తెల్పితిని. ప్రస్తుత విషయము కేవలము వీరశైవాంధ్రవాఙ్మయమగుటచే సామాన్య శైవమునకు సంబంధించిన నన్నెచోడ కుమారసంభవము, శ్రీనాథుని గ్రంథములు మొదలైనవాని నన్నిటిని పరిహరించితిని. తాళపత్రములందును, కాగితములందు నున్న లిఖిత గ్రంథములు విశేషముగా జీర్ణములై, ఛిద్రములై కొన్ని చదువుటకుఁ గూడ సాధ్యపడని దుస్థితిలో నుండుటయు, నున్నవికూడ తప్పులతడికలుగా నుండుటచే వానిని గూర్చి విశేషాంశములఁ గొలఁదికాలములోఁ బరిశీలించుటకుఁ గూడ సాధ్యపడకపోయినది. కాన వానినిగూర్చి క్లుప్తముగా వ్రాసితిని.

ఈ నా గ్రంథము ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి 1947వ సంవత్సరపు 'సర్.ఆర్. వెంకటరత్నం రిసర్చి మెడలు'నకు పోటీపరీక్షలో గెలుపు నొందినది. కాని విషయ మేకమైనను, నా గ్రంథమునకు దీనికిఁ గొంచెము భేదము గలదు. పోటీ



గ్రంథమున శైవమతము, పురాణములు, మాహాత్మ్యములు, ప్రబంధములు, శతకములు, యక్షగానములు, కీర్తనలు, దండకములు మొదలైన విభాగములతో నొక్కొక్క యధ్యాయమును రచించితిని. అందుచే పాల్కురికి సోమనాథునిఁగూర్చి మూఁడు నాల్గధ్యాయములలో నక్కడక్కడ ప్రత్యేకముగ పరామర్శింపవలసి వచ్చినది. అందుకే నీ గ్రంథమున పాల్కురికి సోమనాథుని గ్రంథము లన్నింటి నొక్కచోటనే పరామర్శించి, ప్రత్యేకాధ్యాయమును గూర్చితిని. అట్లే పిడుపర్తి కవుల గ్రంథ జాలమును గూడ నేర్పరచితిని. మఱియు నిందు గ్రంథములనుండి విశేషభాగముల విమర్శించి యుదాహరణములనిచ్చి, శ్రీనాథ ధూర్జట్యాదికవులు రచించిన సమకథా రచనలతోఁ బోల్చి తారతమ్యములను గూఁడ జూపితిని. ఇంక కాలపరిమితి కొంత యెక్కుడగుటచే నిందు కొన్ని సోమవారవ్రత మాహాత్మ్యాది విశేష గ్రంథములఁ గూడ పరిశోధించి చేర్పఁగల్గితిని. ఈ కారణములచే నిది పోటీ గ్రంథముకంటె నధికమైనది. దాన గుణాగుణములు పండితలోకము గ్రహించుగాక.

ఈ గ్రంథ పరిశోధనమునకై చెన్నపురి ప్రాచ్యలిఖిత గ్రంథాలయమునకు ఖర్చులు భరించి పంపిన తిరుమల తిరుపతి దేవస్థానములవారికి నా కృతజ్ఞత.

11-08-1947

తిరుపతి

**శిష్టా రామకృష్ణశాస్త్రి**

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | పీఠిక | III |
| 2. | విషయసూచిక | |
| 3. | సంప్రదించిన గ్రంథముల పట్టిక | XIV |
| 4. | ఉపోద్ఘాతము - | XVI - XXXVI |

1. వాఙ్మయముపై మతరాజ్యాంగసాంఘిక పరిస్థితుల ప్రభావము
2. మతపరిణామము - వీరశైవమతము
3. శైవమతము
4. వీరశైవము
5. వీరశైవ సంప్రదాయములు
6. వీరశైవ సిద్ధాంతములు
7. వీరశైవసంఘము - ఆచారములు
8. వీరశైవ మతస్థాపనకాలము
9. కర్ణాటాంధ్రదేశములు - వీరశైవమతము
10. ఆంధ్రమున వీరశైవ వాఙ్మయము

**ప్రథమప్రకరణము - మల్లికార్జునపండితారాధ్యుఁడు** 1-11

1. కవిజీవితము
2. మల్లికార్జునపండితారాధ్యుఁడును, నన్నెచోడుని గురువగు జంగమ మల్లికార్జునుఁడునొకరేనా?
3. కవి కాలనిర్ణయము
4. ఈతని గ్రంథములు
5. శివతత్త్వసారము
6. కవివైదుష్యము
7. మతవిషయములు

**ద్వితీయప్రకరణము - పాల్కురికి సోమనాథుఁడు** 13-84

1. కవిప్రాశస్త్యము - వ్యక్తిత్వము
2. కవిజీవితము
3. ఈతని కులగోత్ర గురుమాతాపిత్రాదులు
4. నివాసస్థలము
5. ఈతని జీవితకాలనిర్ణయము
6. కవివైదుష్యము
7. ఈతని కవిత్వాశయములు
8. ఈతని కృతులు - వాని వివరములు
9. అనుభవసారము
10. బసవపురాణపండితారాధ్యచరిత్రములు
11. చతుర్వేదసారము
12. వృషాధిపశతకము
13. చెన్నమల్లుసీసములు
14. బసవోదాహరణము
15. బసవరగడ
16. సోమనాథుని వీరశైవమతస్వరూపము
17. ఈతని భాష
18. ఈతని శైలి
19. ఛందస్సు

**తృతీయప్రకరణము - పిడుపర్తికవులు** 85-124

1. పిడుపర్తివారి వంశవృక్షము
2. వీరి దేశము
3. వీరి వంశము
4. పిడుపర్తి బసవన

5. పిల్లనయనారుకథ
6. బ్రహ్మోత్తరఖండము
7. వీరశైవదీక్షాబోధము
8. పిడుపర్తి సోమనాథుఁడు
9. పద్యబసవపురాణము
10. ప్రభులింగలీలలు
11. పిడుపర్తి బసవప్ప
12. పద్యప్రభులింగలీలలు

**చతుర్థప్రకరణము - శైవమతము** 125-150

1. పర్వతమంత్రి లింగన : వీరమాహేశ్వరాచారసంగ్రహము
2. కుంటముక్కల తిరుమలనాథుఁడు : శైవాచారసంగ్రహము
3. శివరామలింగకవి : వీరశైవాచార సంగ్రహము
4. చెన్నాప్రగ్గడ నాగేశ్వరకవి : శైవసిద్ధాంతశిఖామణి
5. సిద్ధనాథుఁడు : షట్స్థలదర్పణము
6. నెప్పెల్ల అప్పనార్యుడు : శైవాగమశిఖామణి
7. గణపనారాధ్యుడు : మనోబోధ
8. సోమన : గురుబోధ
9. పరమానందయతి : శివజ్ఞానమంజరి
10. రేవణసిద్ధనలు : ప్రభుదేవరవాక్యము
11. శివయోగీంద్రుడు : అన్యవాదకోలాహలము
12. భద్రారాధ్యుడు : అఖండ బ్రహ్మానంద వీరశైవరహస్యపదవి

**పంచమప్రకరణము - పురాణములు** 151-178

1. కొచ్చెర్లకోట రామకవి : ప్రభులింగలీలలు - 3
2. నడకుదుటి రామనకవి : ప్రభులింగలీలలు-3



3. మహాదేవుఁడు : బసవపురాణము
4. తుమ్మలపల్లి నాగభూషణకవి : బసవ విజయము
5. నల్లనగండ్ల నాగనారాధ్యుడు : బసవ విజయము
6. బచ్చు సిద్ధకవి : (మఱి) బసవపురాణము
7. అత్తలూరి పాపకవి : చెన్నబసవపురాణము - శ్రీశైల మాహాత్మ్యము
8. వింటి ఔబళకవి : శివరహస్యఖండము
9. వంకాయలపాటి వీరభద్రకవి : శివరహస్యఖండము
10. కోడూరు వేంకటాచలకవి : శివరహస్యఖండము
11. ముదిగొండ బ్రహ్మయలింగారాధ్యుడు : శివరహస్యఖండము(తత్త్వబోధిని)
12. భద్రకవి లింగకవి : దేవాంగపురాణము
13. కొచ్చి వీరభద్రకవి : దేవాంగపురాణము

**షష్ఠప్రకరణము - మాహాత్మ్యములు** 179-202

1. నాగలూరి శేషనారాధ్యులు : శ్రీశైలమాహాత్మ్యము
2. (కవిపేరు తెలియని) : శ్రీశైల మాహాత్మ్యము
3. (కవిపేరు తెలియని : శ్రీశైల మాహాత్మ్యము
4. (కవిపేరు తెలియని) శ్రీశైలస్థల వివరణము
5. పర్వతమంత్రిలింగన : రుద్రాక్షమాహాత్మ్యము
6. అమలాపురపు సన్యాసికవి : రుద్రాక్షఫలమాహాత్మ్యము
7. పోచిరాజు వీరయకవి : విభూతిరుద్రాక్షమాహాత్మ్యము
8. రెంటాల వీరనారాధ్యుడు : పంచాక్షరీమాహాత్మ్యము
9. అక్కనార్యుడు : శివరాత్రిమాహాత్మ్యము
10. తుమ్మలపల్లి నాగభూషణకవి : సోమవారవ్రతమాహాత్మ్యము
11. శ్రీగిరి మల్లికార్జునస్వామి : సోమవారవ్రతమాహాత్మ్యము
12. (కవిపేరు తెలియని) : సోమవారవ్రతమాహాత్మ్యము
13. ఈవని వీరభద్రకవి : సోమవారవ్రతమాహాత్మ్యము

సప్తమప్రకరణము - ప్రబంధములు 203-266

1. గౌరన : నవనాథచరిత్ర
2. కూచిమంచి తిమ్మన : (1)శివలీలావిలాసము (2)రాజశేఖరవిలాసము
3. వాలేశ్వరుడు : భల్లాణచరిత్రము
4. కొలకలూరి వీరన : భల్లాణచరిత్రము
5. బసవన్న
6. నింబాద్రిరాజు : భల్లాణచరిత్రము
7. చిత్తారు గంగాధరుడు : (1)భల్లాణచరిత్రము (2) గంగావివాహము (3) సిరియాళచరిత్రము
8. గరికిపాటి తమ్మయ్య : సిరియాళచరిత్రము
9. అజ్జరపు పేరయలింగము : ఒడయనంబివిలాసము
10. కాశీనాథుని వీరారాధ్యుడు : ధర్మగుప్తాభ్యుదయము
11. మరింగంటి వెంకటాచార్యుడు : మల్లారిచరిత్రము
12. పొలిశెట్టి లింగన : నవచోళచరిత్రము
13. ఎడపాటి ఎఱ్ఱనార్యుడు : మలహణచరిత్రము
14. సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి : రేవణచరిత్రము
15. సిద్ధేంద్రయోగి : యోగీశ్వరవిలాసము

అష్టమప్రకరణము - శతకములు 267-294

1. యథావాక్కుల అన్నమయ్య : సర్వేశ్వరశతకము
2. శ్రీగిరి విరూపాక్షకవి : శ్రీకాళహస్తిలింగశతకము
3. చెన్నాప్రగ్గడ నాగరాజు : గణసౌజన్యాఖ్యానశతకము
4. అమలాపురపు సన్యాసి : శివశతకము
5. (కవిపేరు తెలియని) : శివశతకము
6. పరిమి వెంకటాచలకవి : సంగమేశ్వరశతకము



7. తటవర్తి కొండయ్య : మల్లేశ్వరశతకము
8. వేల్పూరి విసన్న; సాంబశివుడు : శ్రీవిశ్వేశ్వరశతకము
9. దెందులూరి పద్మనాయుడు : అల్లమప్రభుశతకము
10. మల్లంపల్లి బుచ్చయ్యశాస్త్రి : మహిషాసురమర్దనీశతకము
11. సోమకవి : సోమేశశతకము

నవమప్రకరణము - యక్షగానములు 295-347

1. రెగళిగ నిమ్మనాథుఁడు : (1) నిజలింగ చిక్కయ్యకథ (2) గురునంబి చరిత్రము)
2. వాలె కోటయ్య : చిఱుతొండభక్తకథానిధానము
3. అనుమోదసన్యాసి : బసవకళ్యాణము
4. కానూరి వరవీరభద్రుడు : బసవమహిమామృతవిలాసము
5. బాలపాపాంబ : అక్కమహాదేవిచరిత్రము
6. లింగమూర్తి : శివపారిజాతము
7. (కవిపేరు తెలియని) : శివపారిజాతము
8. పెదకెంపరాయడు : గంగాగౌరీవిలాసము
9. (కవిపేరు తెలియని) : సాంబశివవిలాసము
10. గురుసిద్ధలింగము : కురవంజి
11. బుక్కమసాంబయ్య : భల్లాణచరిత్ర
12. అలపాకపెద్ది : భల్లాణచరిత్ర నాటకము
13. గుఱ్ఱము చినకపోదయ్య : వీరచోడవ్వచరిత్ర
14. శివలెంక మల్లనారాధ్యుడు : వీరభద్రవిజయము

దశమప్రకరణము - పరిశిష్టము (పాటలు, రగడలు, దండకములు, వచనములు మొదలైనవి) 349-354

1. రంగనమంత్రి : శివభక్తిదీపిక
2. నడిమింటి రామయోగకవి : భల్లాణదండకము
3. పెద్ది వెంకటాచలకవి : సిద్ధేశ్వరస్వామిదండకము
4. (కవిపేరు తెలియని) : శంకరవచనాలు

15. ఉపసంహారము 355-358

16. అనుబంధము 359-367

1. వీరశైవాంధ్రకవులు : వారి గ్రంథములు
2. వీరశైవాంధ్ర ద్విపద గ్రంథములు : తత్కర్తలు
3. ఏక కథావిషయమునాశ్రయించి చేసిన వివిధరూప రచనములు। తత్కర్తలు
4. కర్తృనామములు తెలియని వీరశైవాంధ్ర గ్రంథములు
5. నష్టగ్రంథములు - తత్కర్తలు



## సంప్రదించిన గ్రంథముల పట్టిక

1. బసవపురాణము : వేటూరి ప్రభాకరశాస్త్రి ప్రతి
2. పండితారాధ్యచరిత్రము : డా॥ చిలుకూరి నారాయణరావు ప్రతి
3. *Vira Saiva Sect. : by Dr.R.G. Bhandarkar*
4. శతకవుల చరిత్ర : వంగూరి సుబ్బారావు
5. శివతత్త్వసారము : ఆంధ్రసాహిత్యపరిషత్తు ప్రతి
6. ఆంధ్రకవుల చరిత్ర : కందుకూరి వీరేశలింగము
7. భారతిసంపుటములు
8. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సంచికలు
9. ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు
10. విభూతి పత్రికలు
11. చెన్నపురి, ప్రాచ్యలిఖితగ్రంథాగారమందలి లిఖితపుస్తకములు.

# వీరశైవాంధ్రవాఙ్మయము

## ఉపోద్ఘాతము

### 1. వాఙ్మయముపై మతరాజ్యాంగ, సాంఘికపరిస్థితుల ప్రభావము

సామాన్యముగ దేశమున యుద్ధములు, విప్లవములు మొదలైన కలఁతలు లేక అది సుభిక్షమై ప్రశాంతముగ నున్నపుడేవాఙ్మయాభివృద్ధి గలుగును. తత్కాలపు ప్రభువుల రాజనీతి, పరిపాలన పద్ధతులు మొదలైన రాజ్యాంగవిషయము లాకాలపు కావ్యములందు ప్రతిఫలించును. యుద్ధములు, విప్లవములు నన్యరాజ్యములతో సంపర్కమును గూర్చి, రాజ్యాంగ విధానములందు నూత్నాదర్శములను, సంఘమున నవీన వాతావరణమును గలుగఁజేయును. ఈ నూత్నపరిస్థితులందు జనులకొక నూతనోత్తేజముగల్గి, జీవితమును గూర్చిన ప్రాచీనాభిప్రాయములు మారును. మానవులకుఁ గ్రొత్తయొకవింత పాతయొకరోఁతయుఁ గానఁ కవియు సంఘమున నొకఁడగుటచే నూత్న వాతావరణ మాతని నావేశపూరితునిఁజేసి కావ్యరచనకుఁ బ్రేరేచును. ఈ విధముగ సారస్వతాభిరుచులు మారి, వాఙ్మయమున వైవిధ్యము సిద్ధించును. ఇట్టి మార్పులుగల గ్రంథములు పాశ్చాత్య సారస్వతమున విశేషముగఁ గాననగును. ఆ యా కాలములందలి సాహసవంతుఁడైన యొక యోధుని సమరపద్ధతి, స్వార్థత్యాగియైన దేశసేవకుని జీవితచరిత్ర, తంత్రజ్ఞుఁడైన యొక యమాత్యుని బుద్ధి కుశలత, జనరంజకుఁడైన ప్రభువు ధర్మపరిపాలనా విధానము మొదలగునవి వాఙ్మయమున వస్తువులుగా గ్రహింపబడును. మఱియొకప్పుడు దేశభక్తిగీతములు, రాజభక్తి గీతములు కాలప్రవాహమునుబట్టి బయలువెడలును. విప్లవములు, యుద్ధములు దేశమును గలఁత పెట్టునపుడుకాని, యన్యజాతీయుల రాజ్యకాలమునఁ గాని ప్రజలయం దభిప్రాయభేదములును, కక్షలును బయలుదేరి, దమ కక్షలు సాధించు నిమిత్తము వాదోపవాదములతో నిండిన గ్రంథములు బయలుదేరును. ఈ విధముగ రాజ్యాంగ విషయములు వాఙ్మయముపై ప్రభావము నెఱపును.

ఇట్లే మతముగూడ సారస్వతముపై ప్రబలప్రభావము చూపును. చతుర్విధ పురుషార్థములలో మోక్ష ముత్కృష్టమైనదని యెఱిగి, యందఱు దానిపై శ్రద్ధాభక్తులు వహింతురు. దీనికి మతము సాధనముగా గ్రహింతురు. కాని ప్రతి జాతికొక మతముండును. ఇందుచేతనే లోకమందు సమస్త విషయములకంటె మతము జనులను బహు శీఘ్రముగను, తీక్ష్ణముగ నుద్రిక్తులఁజేయును. కాని ప్రతి మానవునకుండు నహంకారాభిప్రాయ భేదములవలన, నాతఁడు స్వమతాభిమానమును, బరమత తిరస్కారమును జేయును. మతమందలి దృఢ విశ్వాసము జనుల నావేశ పూరితులఁజేసి స్వమతోత్కర్షకు, బరమత దూషణకుఁ గూడఁ బ్రేరేచి తన్మత ప్రతిపాదకమైన గ్రంథజాలమును వ్రాయించును. ఇట్లు మతావేశముతో రసావేశము గలసి మేళవించును. ఇట్టి గ్రంథములే యాంధ్రమున పండితారాధ్యుని శివతత్త్వసారము, పాల్కురికి సోమనాథుని బసవపురాణ పండితారాధ్య చరిత్రాదులు. ఒకజాతి మఱియొక జాతితో సంపర్కము పొందినపుడు వారి రాజకీయ సాంఘిక నాగరికతలతోఁబాటు మతముతోఁగూడ సంఘర్షణము గల్గి, యొకరి మతముపై మఱియొక రసూయఁ జూపి తమ మత ప్రభావమును ప్రకటించుటకై గ్రంథములు రచింతురు. మతకర్తలు గొందఱు రాజుల వశ్యులఁ జేసికొనుటచే నా యా దేశపు రాజులుకూడ తన్మత విషయములఁదు బాల్గొని తమ మత ప్రచారార్థము మత కర్తలచేతను, కవులచేత నా మత ప్రతిపాదకములైన గ్రంథముల వ్రాయించి వాఙ్మయమును వృద్ధిసేయుదురు. మతప్రచారము ప్రదర్శనరూపము గోరినచో ప్రబోధ చంద్రోదయ, సంకల్పసూర్యోదయాదులవలె నాటకరూపమును, పఠన శ్రవణ యోగ్యమైనచో నష్టాదశ పురాణములును, పాడుటకైనచో బసవపురాణాదులవలె ద్విపదరూపమును వాఙ్మయము గైకొనును. ఈ రీతిగా మతము వాఙ్మయోత్పత్తికి ప్రేరకమును, దాని యభివృద్ధికి దోహదమునగును.

మతమువలెనే సాంఘిక పరిస్థితులుగూడ వాఙ్మయమందు వివిధ గ్రంథోత్పతికిఁ గారణమగును. సంఘమందుగల దురాచారముల ఖండించి, సదాచారములఁ బ్రచారముచేసి, సంఘ సంస్కరణ మొనర్చి, నూతన సంప్రదాయములఁ



బ్రవేశపెట్టుటకు వ్రాయఁబడు గ్రంథములు సారస్వతాభివృద్ధికిఁ దోడ్పడును. సంఘమందు విలక్షణముగల వ్యక్తుల వేషభాషా ప్రవర్తనల ననుకరించు పాత్రల సృష్టించి, తదనుగుణ కథా సన్నివేశములఁగూర్చి కవులు గ్రంథముల రచింతురు. సంఘ సంస్కరణమున కిట్టిగ్రంథములు ముఖ్యముగ నుపయోగించును. ఈ రీతి కావ్యములు తత్కాలపు సాంఘిక జీవితమునకు దర్పణము వంటివి. ఇందలి కథావస్తువు కల్పితమైన నీతిదాయకముగ నుండును. ఇట్టి సారస్వతమందు వైవిధ్య మధికమై సాంకేతికత్వము తగ్గి యుత్సాహానందములఁ గూర్చును. ఈ విధములగు గ్రంథములు విశేషముగ నవలలు, నాటకములునై యుండును. ఇట్టివి శ్రీనాథుని క్రీడాభిరామమును, మృచ్ఛకటిక కన్యాశుల్కాది నాటకములు, కందుకూరి వీరేశలింగముగారి గద్యకావ్యములును. ఈ రీతిగ రాజ్యాంగ మత సాంఘిక పరిస్థితులు వాఙ్మయమందు విశిష్టతఁగూర్చి గ్రంథరచనకు దోహదమగును. అందుచేతనే వివిధ యుగములందు భావములు, నాదర్శములు, రుచులు శైలి మారుచుండుటచే, నొక యుగమందు కాలప్రవాహమున పాఠకుల నానందపెట్టిన యనేకగ్రంథము లితర యుగములందు నిరసనభావముతోఁ జూడఁబడుటయుఁ గలుగుచున్నది.

## 2. మతపరిణామము - వీరశైవమతము

అపౌరుషేయములైన వేదములందుఁ దెల్పఁబడిన యజ్ఞయాగాదులకుఁ బ్రాముఖ్యతగల కర్మయోగము పుణ్యదాయకమనియు, నది విజ్ఞానసాధకమనియు మొదట జనులెంచిరి. కాని కాలక్రమమున యనిత్యమైన కర్మఫలముకంటె శాశ్వతమైన మోక్షము శ్రేష్ఠమైనదని మానవులు తలచిరి. మఱికొంతకాలమునకు జీవహింసాయుతమగు కర్మమార్గముపై ప్రజలకు విశ్వాసము సడలి జ్ఞానయోగముపై నమ్మక మధికమైనది. కాని తత్త్వజ్ఞానము సామాన్య మానవులకు దుర్గ్రాహ్యమై యందనిమ్రాని పండైనది. ఈ సమయమున సిద్ధార్థుడు, మహావీరుఁడు, మొదలైన రాజర్షులు బౌద్ధ జైనమతముల స్థాపించి, ప్రజలకు నూత్నచైతన్యమును గలుగఁజేసి ధర్మమార్గమును ప్రతిష్ఠించిరి. ఈ నూత్నమతములు వేదములు పౌరుషేయములనియు, గాన నవి

ప్రమాణము గావనియు, సదాచార దురాచారములే జీవుల రక్షణ శిక్షణఁ జేయునుగాని, యీశ్వరుఁడు లేఁడనియు, నహింసయే పరమ ధర్మమనియు చాటినవి. మఱియు జైనమతము సృష్టియు, జీవులు ననాదులుగాన వినాశము లేదనియు దెల్ప, బౌద్ధమతము, సంసారము దుఃఖమయమనియు, సర్వము క్షణికము, శూన్యమనియు జన్మరాహిత్యమునకు కర్మసన్యాసము మూలమనియు నుపదేశించెను. ఈ మతములు భరతఖండమున సుమారు వేయిసంవత్సరములుండి, దేశమందంతటను, మఠములు, విహారములు, స్తూపములు నెలకొల్పి, సన్యాసులను, శ్రవణకుల నసంఖ్యాముగ ప్రబలఁజేసెను. కాని దైవారాధన లేని యీ మతములు సంకరమై, ప్రాణప్రతిష్ఠలేక ప్రజలకు నిరర్థకమైనవి. కాలక్రమమున నా సన్యాసులుగూఁడఁ దమ పారిశుద్ధ్యమును నియమములను గోల్పోయిరి. తర్వాత శంకరాచార్యులు జైన బౌద్ధ మతముల ఖండించి, శైవ వైష్ణవాది షణ్మతముల స్వీకరించి, జగన్మిథ్యావాదముతోఁ గూడుకొనిన యద్వైతమతము నుద్బోధించెను. కాని జనసామాన్యమున కీతని బ్రహ్మజ్ఞానబోధకమత మగోచరమగుటయే కాక, కొందరకీ మాయావాదము నచ్చదయ్యె. ఈ పరిస్థితియందు రామానుజుఁడు, చైతన్యుడు, బసవేశ్వరుఁడు, మొదలైన మహాభక్తులవతరించి భక్తిమార్గమును ప్రతిపాదించిరి. రామానుజుఁడు భక్తిని విష్ణుపరముగ ప్రతిపాదించి విశిష్టాద్వైతమతమును ప్రచారము సేయఁగ, బసవేశ్వరుఁడు భక్తిని శివపరముగఁ బ్రతిపాదించి వీరశైవమతమును నెలకొల్పినాడు.

**శైవమతము**: శైవమతమనాదిగా భరతఖండమున నిల్చియున్నది. వేద మంత్రోపస్థితుఁడైన రుద్రుఁడే, వేదాంతమందు శివరూప పరిణామము నొందినాఁడు. శైవాగమములందితఁడు పరబ్రహ్మగా ప్రతిపాదింపఁబడినాడు. అష్టాదశ పురాణములలోఁ గొన్ని శివపరములైనవి వున్నవి. శైవమత మాసేతుహిమాచలము వ్యాపించినది. వివిధ మండలములలో నభిప్రాయబేధములవలన శివుఁడు పూజింపఁ బడుచున్నాడు. శైవులలో నభిప్రాయమువలన ననేక శాఖ లేర్పడినవి. వీరిలో పాశుపతము బహు ప్రాచీనమై, శివలింగపూజ ప్రధానముగాఁ గలది. భరతఖండమున లింగపూజ యనాదిగా నున్నట్లు మొహంజొదరొ, హరప్పా శిథిలములఁబట్టి



గ్రహింపనగును. పాశుపతశాఖ దక్షిణదేశమునకెప్పుడు ప్రవేశించినదో తెలియదు కాని, 10వ శతాబ్దమునుండి తమిళ దేశమునను, 12వ శతాబ్దమునుండి యాంధ్రదేశమునను గోచరించుచున్నది. ఈ మతము ప్రకారము బ్రహ్మాది పిపీలిక పర్యంతము సమస్త ప్రాణికోటి పశువులు, సంసారబంధమే పాశము, ఈ సకల పశురాశికి పతియగు శివుఁడనఁగా పశుపతి తద్భక్తులకు పాశచ్ఛేదముగావించి ముక్తి నొసఁగును. ఇదియే యీ మతమందలి సారము. లాప కులశైవము పాశుపతశాఖలో నొక భాగము. ఇది యుత్తరహిందూస్థానముననే కాక తమిళదేశమునఁ గూడ దర్వాత ప్రవేశించినది. కాపాలికశాఖగూడ పాశుపత సంప్రదాయములోనిదే. సోమసిద్ధాంతము కాపాలిక సంప్రదాయమునకుఁ జెందినది. వీరు మహావ్రతులని గూడ వ్యహరింపఁ బడుదురు. కాలాముఖులను మఱియొక శైవశాఖ దక్షిణదేశమునఁ గలదు. వీరిని శాక్తేయులని కొందఱందురు. కాలాముఖ మతాచార్యులు శాశ్వత బ్రహ్మచర్య మనుష్ఠింతురని నన్నెచోడుని కుమారసంభవమువలనఁ దెలియుచున్నది. వీరి శక్త్యారాధన యహింసారూపమైనది. కాలాముఖమతమందు పాశుపతశాఖయందు వలె కులములు గలవు. కాలాముఖశైవులలో మండలార్చన యను నొక తంతు గలదు. దీనిననుసరించి స్త్రీ పురుషులు మండలాముఖముగాఁ గూర్చుండి సుర సేవించి శివునిపై పాటలు పాడుదురు. అందుచే శివుఁడు ప్రీతుఁడగునని వారి విశ్వాసము. వీరు మత ప్రచారమునకు దండనీతి ప్రయోగించరు. వీరికి మతావేశము, నన్యమత దూషణము లేదు. బ్రహ్మయు విష్ణువును శివుని యంగోద్భవులుగా వర్ణింపఁబడిరి.

వీరుకాక యాగమము లాధారముగా గల శైవసిద్ధాంత సంప్రదాయమువారు దక్షిణదేశమునఁ గలరు. శైవాగములు శివపరముగాఁ గొన్నియు, రుద్రపరముగాఁ గొన్నియు గలసి 28 గలవు. తమిళ దేశమునఁ గల శైవసిద్ధాంతము ద్రావిడమనియు, సాంస్కృతికమనియు రెండు విధములు. మొదటిదానిని బ్రాహ్మణేతరు లనుసరింతురు. వీరిది భేదాభేద సిద్ధాంతము, లేక శివాద్వైతము. రెండవదానిని బ్రాహ్మణులనుసరింతురు. ఇది శివవిశిష్టాద్వైత ప్రతిపాదకము. ఈ రెండు సిద్ధాంతములకు విశేష భేదము లేదని కొందఱందురు. సిద్ధాంతము లాగమముల

మీఁదఁ గొంతవఱకును, శ్రుతి స్మృతి పురాణేతిహాసముల మీఁదఁ చాలావఱకు నాధారపడి యున్నవి. బసవేశ్వరునికిఁ బూర్వ మీ సిద్ధాంతమునకు వీరశైవమను పేరుండెనో లేదో తెలియదు కాని, వీరశైవ సిద్ధాంతము తమిళ శైవసిద్ధాంతము ననుసరించిందని చెప్పవచ్చును.

శైవులు లింగరూపమున శివుని పూజించి శివాలయములందు, పీఠము లందు, లింగమును ప్రతిష్ఠింతురు. అద్వైతమతస్థాపనాచార్యులైన శ్రీ శంకరా చార్యులుగూడ వారి పీఠమందు శివలింగమును ప్రతిష్ఠించి పూజించిరి. లింగము 'ఓం నమశ్శివాయ' యను షడక్షరీమంత్ర రూపమని శైవాగములు నిరూపించును. పంచభూతములం దీ లింగము గోచరించుచున్నది. ప్రాచీన వైదికకాలమున శైవ మతము కర్మలను వర్ణాచారముల నాశ్రయించి వృద్ధిపొందినది.

**వీరశైవము :** కాని వీరశైవము కర్మసంస్కారమును, యజ్ఞయాగాది కర్మలను తిరస్కరించి, లింగధారణమును శాసించి, శైవమతమునకు విశిష్టత్వముఁ గూర్చినది. స్వీయాంగ లింగధారణము గూఢార్థ బాహ్యార్థములతో వీరశైవమున కపూర్వ వై లక్షణ్యముఁ గూర్చుచున్నది. ఈ మతము వైదికమతమును, జైన బౌద్ధములను ప్రతిఘటించుట కేర్పడినది. ఇందు భక్తి ప్రధానమైనది. శివతత్త్వసారమున 'వీరభక్తి'యని 365, 429 పద్యములలోను, 'వీరహోమ'మని 398 పద్యమందు వాడబడుటవలన శివభక్తి చిహ్నమైన లింగధారణము శైవమతమును వీర్యవంతముగాఁ జేసినది కాన నీ పేరు వచ్చినది కొందఱను; 'వి'యన, విద్య యనియు, విద్యలో రమింతురుగాన వీరశైవులనియు; విద్యలలో రమించువాడు వీరుఁడనియు నీ 'వీరశైవ' పదమునకు వివరణార్థ మొసంగుదురు. కాని 'వి' యన విద్య యనియు 'ర' యన రమించుట యైనచో 'విరశైవ' మగును, గాని 'వీరశైవ'మని దీర్ఘమును వి వర్ణమునకుఁ గూర్చుట తగదు. కాన నభిమానముతోఁ గల్పించిన యీ వివరణము సరసముగ లేదు. ఇంక పాశుపతకాలాముఖాదీతర శైవశాఖలనుండి వై



లక్షణ్యము గూర్చునదై, దీని ప్రచారమునకు వీరోద్రేకముతో దండనీతినిగూడ నుపయోగింతురుగాన నీనామ మీ మతమున కౌచిత్యముతో వ్యవహరింపఁబడినది. కాని వీరాగమము ననుసరించినదిగాన వీరశైవమనుట మేలు. ఈ మతమునకు శివభక్తి, లింగధారణము, విభూతి రుద్రాక్షధారణమును, పంచాక్షరీ మంత్రమును, లింగపసాయిత, శస్త్రధారణమును, ముఖ్య లక్షణములు. వీరశైవులు వర్ణము నధికారము, స్త్రీ పురుషులు, పండితపామరులు మొదలగు బేధములు లేని శివభక్తులు, ఇట్టి జంగములెల్ల శివస్వరూపులే. శివభక్తులు వారి సర్వస్వమును జంగముల కర్పించి శివానందమును బడయుదురు. లింగధారణము లేనివారిని భవులందురు. భవతిరస్కారమును, జంగమభక్తియు వీరశైవ ధర్మములు. పితృ యజ్ఞాదికర్మలను త్యజించుటే లింగధారణమునకుఁ జిహ్నము.

**వీరశైవ సంప్రదాయములు :** వీరశైవులు గురువు నెన్నుకొనుట మొదలగు దీక్షాసమయములందు జలపూరిత పంచకలశములను నాలుగుదిక్కులందు నాలుగు రేవణసిద్ధ, మరులసిద్ధ, ఏకోరామ, పండితారాధ్యులను పూర్వాచార సంప్రదాయ పీఠములకు సంబంధించిన యాచార్యులకును, మధ్య నొకటి విశ్వారాధ్యుఁడను పూర్వా చార్యుని సంప్రదాయ గురువునకు నుద్దేశించి యుంచఁబడునని వివేక చింతామణి, వీరశైవాచార దీపికలందు తెలుపఁబడినవి. శివుని పంచముఖముల నుండి పై గురుపంచక మీ కలియుగమున జనించినట్లు పంచాచార్య పంచమోత్పత్తి ప్రకరణముఁ గలదు. శైవదర్శనము, లేక సిద్ధాంత దర్శనమని పిలువఁబడు మితవాద శైవమునకే వీరశైవముగూడఁ జేరునని కొందఱు తలఁచుచున్నారు. కాని యీ వీరశైవమత మందలి స్థలము, నంగము, లింగము మొదలగు పారిభాషిక సంకేతములు దీనికి విశిష్టలక్షణములుగ నున్నవి. ఇవి యే శైవమత శాఖయందును గానరావు.

**వీరశైవ సిద్ధాంతములు :** ఈ మతమున పరబ్రహ్మమె శివతత్త్వమై 'స్థల'మను పేరఁబరగును. శివతత్త్వమున సకల పదార్థములు నిలిచి తుదకు దానియందే లీనమగును. అవి ప్రారంభమున 'జగత్తు, ప్రకృతి, పురుషులనుండి జనించి, కడకు

వారియందే లీనమగును గాన 'స్థల' మనఁబడినది. 'స్థ' అనఁగా స్థానమనియు 'ల' యన, లయమనియు నిరూపితము. అంతరంగ శక్తి సంచాలనము వలన, స్థలమంగ లింగములని రెండువిధములైనది. అందు లింగమగు శివుఁడు పూజనీయుఁడును, రెండవది జీవాత్మ, పూజించునది యైనవి. అట్లే శక్తిగూడ ద్వివిధమై, కళ, శివాశ్రయమును, భక్తి జీవాశ్రయము నొందినది. భక్తివలన జీవునకు శివునితో నైక్యము గల్గును. శివలింగమనఁగా శివుఁడే కాని, తదీయ బాహ్యాకారము మాత్ర మెన్నఁడు గాదు. లింగస్థలము, భావలింగము, ప్రాణలింగము, ఇష్టలింగమని త్రివిధము. ఇందు మొదటిది నిరాకారమగు కళయై, భావైకమాత్రగోచరమగును. అది దేశ కాలాతీతమైన సత్తును, మహోత్తమము నైనది. రెండవది మానసగోచరమై, సాకారమును నిరాకారమునై యున్నది. మూఁడవది సాకారమై నయన గోచరమగునది. ఇది ఇష్టార్థదాయకమును, ననిష్టనివారకమునై, యిష్టముతో భజింపఁబడునది కాన నా పేరు పొందినది. ప్రాణ లింగమన పరమాత్మయొక్క చిత్తు. ఇష్ట లింగమన యానందము. ఈ లింగ త్రయములో మొదటిది మహోన్నతము, రెండవది సూక్ష్మము, మూఁడవది స్థూలమునై యాత్మప్రాణ శరీరములకు సంబంధించి, ప్రయోగమంత్ర క్రియాగుణములు గల్గి, కళానాద బిందురూపముల నొందును. జీవుఁడు మోక్షమొందుటకుఁగాను భక్తిపూర్వక సాధనమగు స్థలములో యోగాంగ, భోగాంగ, త్యాగాంగములని మూఁడు భాగములు. మొదటిదాని మూలమున జీవుడు శివునియందైక్యమై సుఖముండును; రెండవ దానివలన శివునితోఁ గూడి యానందించును; మూఁడవ దానివలన ప్రపంచము మాయ యని, యనిత్యమని గ్రహించి దానిని వర్జించును.

వీరశైవమత సిద్ధాంతములను గొందఱు శివవిశిష్టాద్వైతమందురు గాని యది యథార్థముగాదు. ఇది భేదాభేద సిద్ధాంతమునకు సంబంధించినది. వీరశైవము రామానుజుఁడు ప్రతిపాదించిన పరమాత్మ జీవాత్మల ద్వైతభావము నంగీకరించినను, శివజీవాద్వైతమును దెల్పును; కాని యీ శివజీవా భేదత్వ మీ యొక్క విషయమును మాత్రముననే ఇం దిద్దరు నిత్యులు. కాని శివుడు పూర్ణుఁడగుచో, జీవుఁ డపూర్ణుడు. ఈశ్వరుడు ప్రభువు, శక్తుఁడు, ముఖ్యుఁడు కాఁగా, జీవుడు భక్తుఁడు, నశక్తుఁడు, సముఖ్యుడు మాత్రమగును. ఈశ్వరుఁడు సర్వస్వతంత్రుఁడు కాగ, జీవుఁడు సర్వాధీనుఁడు. కాన వీరిద్దరికి భేదమే యధికము. భేదాభేద సిద్ధాంతము ప్రకారము జీవేశ్వరులకు సంసారదశలో భేదమున్నదను మోక్షదశయం దభేదమే. శంకరుఁడు ప్రతిపాదించిన యద్వైతములోని జగన్మిథ్యాత్వమును వీరంగీకరింపరు. చేతనాచేతన రూపమైన జగమీశ్వర శరీరమను రామానుజుని విశిష్టాద్వైతవాదమునుగూడ వీరు విశ్వసింపరు. మోక్షస్థితికిఁ బూర్వమందు జీవేశ్వరులకు భేదము గలదను నానందతీర్థుని ద్వైతమతమును వీరు గ్రహింపరు. శ్రీకంఠుని శివాద్వైతమునకును, భేదా భేద సిద్ధాంతమునకు శివుఁడే పరబ్రహ్మమనుటలో భేదము లేదు కాని, జగత్తు ఈశ్వరుని కంటె భిన్నమై యాతనిమీఁదనే యాధారపడియున్నదనియు, కర్తృత్వశక్తి యున్న దనియు భేదాభేద సిద్ధాంతమును, వీరశైవమతముగూడ ప్రతిపాదించును. ఈ సిద్ధాంతమును విశ్వసించి షట్ స్థలమను నభ్యానయోగమువలన శివత్వమొందుటయే వీరశైవమత సిద్ధాంతము.



**వీరశైవ సంఘము, ఆచారములు** :లింగాయతులలో లింగి బ్రాహ్మణులందా చార్యులు, పంచములని ద్వివిధము. శివుని పంచముఖములనుండి పుట్టిన వీరశైవాచార్యు లైదుగురికి వీర, నంది, వృషభ, భృంగి, స్కంధయను గోత్రములు కలవు. శివుని యీశానముఖము నుండి పుట్టిన గణేశ్వరుని పంచముఖములనుండి మఖారి, కాలారి, పురారి, స్మరారి, వేధారి యను నైదుగురు పంచములు పుట్టి, వీరినుండి యువపంచములు జనించిరి. ప్రతిపంచముఁడు పంచాచార్యులలో నేదో యొకని గురువుగా నెన్నుకొని, యాతని సంప్రదాయమునకుఁ జెంది, యాతని గోత్రమునే స్వీకరించును. సగోత్రికులకు వివాహసంబంధములు లేవు. ఈ పంచములకు ప్రత్యేక గోత్ర, ప్రవర శాఖలు గలవు. ఈ విధముగా లింగాయతులు బ్రాహ్మణ పద్ధతుల ననుకరించినట్లు తోఁచును.

మరియు లింగాయతులలో (1) జంగములు, లేక గురుశాఖ ఆచార్యులకుఁ జెందినవారు (2) శీలవంతులు - ఆచారముగలవారు (3) బణిజులు - లేక వర్తకులు

(4) పంచమ సాలీలని నాలుగు విధములు. వీరశైవసంఘమునకు బసవేశ్వరుఁడు; దండనాయకుఁడు, మహేశ్వరులు సేనాపతులు, భక్తులు, సైనికులు. లింగాయతులు మద్యమాంసాదుల నిషేధింతురు. స్త్రీ పునర్వివాహము గొన్ని శాఖలలో గలదు. పురుషుల వలె స్త్రీలుగూడ లింగమును ధరింతురు. బాలికలకుఁగూడ నీ మత దీక్ష గలదు. బహిష్ఠుసమయములందు స్త్రీలు స్నానముచేసి శివపూజ చేయుదురు. బ్రాహ్మణులం దుపనయనమువలెనే వీరికి దీక్షావిధానము గలదు. గాయత్రీ మహా మంత్రమునకు బదులు 'ఓం నమశ్శివాయ' జపమును జపించి, యజ్ఞోపవీతమునకుఁ బదులు శివలింగమును ధరింతురు. బ్రాహ్మణులకు సంధ్యా వందనమువలె వీరశైవులకు నిత్యపూజావిధానము గలదు. వీరు శివగాయత్రినిగూడ జపింతురు. వీరికిఁ దాము ధరించిన యిష్టలింగము నర్చించుటే పరమముఖ్యముగాని, శివాలయములతోఁగూడ నంత విశేషసంబంధము లేదు.

**వీరశైవమత స్థాపనాకాలము** : బ్రహ్మసూత్రములపై శ్రీకంఠ శివాచార్యులు రచించిన భాష్యమందలి శైవసిద్ధాంతములును, వీరశైవ సిద్ధాంతములును చాలావఱ కేకవిధముగనే యున్నవి. శ్రీకంఠశివాచార్యులు ప్రాచీనుఁడుగ గనిపించుచున్నాడు. వీరశైవులైన యారాధ్య సంప్రదాయమువారు గొందఱు శ్రీశంకరాచార్యునితో వాదించిన ట్లానందగిరి వ్రాసిన శంకరవిజయములోఁ గలదు. కాని మాధవ విరచిత శంకరవిజయముపై ధనపతి వ్రాసిన డిండిమమను వ్యాఖ్యానమున నీ యారాధ్యశాఖా విషయమే లేదు. కాన ఆనందగిరి సూచించిన యారాధ్యులు లింగాయతులైన యారాధ్యులే యని తలఁచినను, శంకరునికిఁ బూర్వ మీ శాఖ యున్నట్లు నిస్సందేహముగా నిర్ణయింప వలనుపడదు. ఆనందగిరి మాటల విశ్వసించినచో నీ యారాధ్యశాఖ శంకరాచార్యుల కాలమున, ననఁగా క్రీ.శ.8వ శతాబ్దమునకే యుండియుండవలయును. ఈ వీరశైవ మందలి స్థలము, సంగము, లింగము మొదలైన పారిభాషిక సంకేతాదర్శములు, మాధవాచార్యులు దెల్పిన సిద్ధాంతా దర్శములకు చాల భిన్నముగ నుండుటచేత, నీ సంకేతములే యితర శైవశాఖలందుఁ గూడ లేకుండుటచేత నీ వీరశైవము నవీన మతమనియే తలఁపవలసివచ్చుచున్నది.



కాని యిది యెప్పు డుద్భవించినదో స్పష్టముగ తెల్పుట కష్టము. బసవేశ్వరుని కాలమున నీ మతమితరమతములతో వివాదస్థితియందే యున్నట్లు స్పష్టమగుటచే నిది యింతకుముందొక వంద సంవత్సరముల పూర్వముననే వెలసియుండును. కాని వీరశైవులు మాత్ర మీ మతమునకు ప్రాచీనత్వమును గూర్చినచో గౌరవముండునని తలఁచి యిది యనాది సిద్ధమైనదనియు, రావణునికాలమునుండి రేవణుఁ డుద్బోధించెనని వాదింతురు. కాని యా కాలమున నున్నది సామాన్యశైవమే కాని వీరశైవము గాదు. మఱియు వీరశైవపంచాచార్యులలో నొకరైన పండితారాధ్యుడు మల్లికార్జునపండితారాధ్యుఁడు గాడనియు, వేఱొక ప్రాచీనుఁడనియు వాదింతురు. మతమందలి శ్రేష్ఠత్వము ప్రాచీనత మీఁద నాధారపడియుండదు.

వీరశైవ పంచాచార్యులలో నైదుగురి నామములకు నారాధ్యపదము చివరనున్నదని కొన్ని గ్రంథములలోఁ గలదు; కాని యిద్దరి నామముల చివరమాత్రము ధ్రువముగ నారాధ్యపదము గలదు. ఈ యారాధ్యులు వీరశైవులకు సంబంధించిన యొకశాఖ. పండితులు, పవిత్రులునైన పంచారాధ్యులే వీరశైవమతమున కొక యాకారమును గల్పించియుందురు. పిమ్మట బసవేశ్వరాదులు దానికి బ్రాహ్మణమత వైరస్యము, మొదలైన సంస్కారములను గలుఁగజేసియుందురు. అందుచే వేదాగమశాస్త్రముల ననుసరించి, వర్ణాశ్రమధర్మముల విశ్వసించిన సనాతనులును, పూర్వాచారపరాయణులైన పంచాచార్య సంప్రదాయమునకుఁ జెందినవా రారాధ్యులనియు, వేదాగమములను బ్రతిఘటించి, జాతితారతమ్యములఁ దిరస్కరించి సంఘసంస్కరణములసేయు బసవేశ్వర సంప్రదాయమునకుఁ జెందినవారు లింగాయతులనియు, వీరశైవులందు రెండు భేదములేర్పడెను. మల్లికార్జునపండితారాధ్యుఁడిందలి మొదటిశాఖకుఁ జెందినవాఁడు గనుకనే బ్రాహ్మణ్యముమీఁద వలపు తగ్గలేదని తెల్పెను. తెలుఁగుదేశమందు లింగమును ధరించు నారాధ్య తెగ పండిత సంప్రదాయమని పించుకొనును. కర్ణాట దేశమున బ్రాహ్మణేతరులందు మాత్రము లింగధారులు గలరు. వారిని లింగాయతులందురు. వీరిది బసవ సంప్రదాయం. ఆంధ్రదేశమందలి జంగము లిట్టివారు. తమిళదేశమందు

బహుస్వల్పముగ వీరశైవులు గలరు. అందు బ్రాహ్మణేతరులలోఁ గొందఱును, బ్రాహ్మణులలో క్వాచిత్తుగాను లింగముల ధరించుదురట. ఇది యాంధ్రకర్ణాట దేశ వీరశైవమత ప్రభావముననై యుండవచ్చును.

### 3. కర్ణాటాంధ్రదేశములు - వీరశైవమతము

12వ శతాబ్ద మధ్యకాలమున దక్షిణాపథమున మహారాష్ట్ర కర్ణాట ద్రవి డాంధ్ర కాళింగు లేకచ్ఛత్రాధిపత్యము వహింపవలెనని పట్టుదలతో వీరాధివీరులై పోరు చుండఁగా,చిన్న చిన్న సామంతరాజులును, మండలేశ్వరులును పౌరుషవంతులు గాఁజొచ్చి రాజ్యముల నార్జించుచుండిరి. పశ్చిమ చాళుక్యదేశమున దుర్బలుఁడగు రాజైన త్రైలోక్యమల్లుని యుద్ధమంత్రియు, సేనాపతియునగు బిజ్జలుఁ డితర మండలేశ్వరుల సాయమున 1157సంవత్సరములో చాళుక్య సామ్రాజ్యము నాక్రమించి 1167 వరకు కల్యాణ పురాధీశ్వరుఁడుగ నుండెను. ఈతఁడు హైహయ వంశీయుఁ డైన కాలచుర్యుఁడు. ఈతనికి బలిదేవుఁడను వాఁడు ప్రధానమంత్రిగ నుండెను. ఈ కాలమున జైన బౌద్ధ బ్రాహ్మణులు సమానస్పర్ధతోఁ జెలరేఁగుచుండిరి. బిజ్జలరాజు జైన మతస్థుడందురు గాని యట్లు తోచదు. ఈతని మంత్రియగు బలిదేవుని మేనల్లుడు బసవేశ్వరుఁడనువాఁడు లింగధారణముతోఁ బుట్టి, యెనిమిదేండ్ల ప్రాయముననే సకల విద్యల నభ్యసించి మతజ్ఞానమును బడసెనట. ఈతనిని నంది యవతార మందురు. ఉపనయనమును దిరస్కరించి యీతఁడు తన మేనమామ కుమార్తెయైన గంగాదేవిని వివాహమాడి, వీరశైవమతమును స్థాపించి ప్రచారము సేయుచుండెను. మేనమామ చనిపోయిన పిమ్మట నీతఁడు బిజ్జలుని మంత్రి పదమును స్వీకరించి, తన జ్యేష్ఠసోదరియగు నాగలాంబికతోఁగూడ కళ్యాణ పురమునకేగి సైన్యాధ్యక్షుఁ డుగను, ధనాగారాధ్యక్షుఁడుగ గూడ నియమింపఁబడెను. బసవేశ్వరుని సౌందర్య వతియగు చెల్లెలైన పద్మావతిని నీలలోచన యని బసవపురాణమునఁ జెప్పఁబడినది. నాగలాంబిక పుత్రుడైన చెన్నబసవన యనువాఁడు మేనమామయైన బసవేశ్వరునకు వీరశైవ మతప్రచారమునకు కుడిభుజముగ నుండెను. బసవేశ్వరునకు ధనాధి



కారములు రెండును చేతనుండుటచే వానిని వీరశైవమత వ్యాప్తికై వినియో గింపఁగ, రా జా విషయమెఱిగి, బసవేశ్వరునితో విరోధించి యతనిని చెఱనుంచ ప్రయత్నింపఁగా నతఁడు శిష్యులతోఁ బారిపోయెను. బిజ్జలుఁడు వెంటాడఁగ వీరశైవు లనేకులు బసవేశ్వరునిపక్షము వహించి పోరాడి రాజును జయించిరి. వీరశైవము క్రమముగాఁ బెరుగుటచే 1167 సంIIలో బసవేశ్వరుఁడు శిష్యులచే రాజును జంపించెను. అంత రాజుపక్షపు జైనులకును బసవేశ్వరునిపక్షపు వీరశైవులకు ఘోరయుద్ధము జరిగి రక్తము ప్రవాహము గట్టెను. పాఱిపోవుచున్న బసవేశ్వరుని బిజ్జలుని కుమారుఁడు వెంటాడఁగ 1168 సంIIలో నతఁడు బావిలో నురికి చచ్చెనని కొందఱును, సంగమేశ్వర క్షేత్రమున శివునిలో నైక్యమొందెనని కొందరును చెప్పుదురు. ఈతని పిమ్మట చెన్నబసవఁడు వీరశైవమతమునకు నాయకుఁడై గొప్పస్థితికివచ్చి, వీరశైవమతమునకుఁ గట్టుదిట్టము లేర్పఱిచి యుద్ధరించెను. ఈతఁడు శివునియవతారమని వీరశైవులు నమ్ముదురు.

బసవనకాలమున మల్లికార్జున పండితుఁడుగూడ నాంధ్రదేశమున శైవమతప్రచారము సేయుచుండెను. ఈతఁడమరావతిలో నుండఁగ బసవేశ్వరుఁ డాతనికి భస్మము పంపెను. పండితుఁ డాతనిఁ జూచుటకు బయలుదేరఁగ మధ్యదారిలో బసవేశ్వరుని మరణవార్తవిని, స్వల్పకాలము తర్వాతనే భార్యా పుత్రాదులతో వెల్లటూరులో లింగైక్యమొందెను. వీరశైవమతమును రాజకీయోద్యోగు లందఱు క్రమముగ స్వీకరించుటచే జైన, బౌద్ధమతములు రూపుమాసినవి.

### 4. ఆంధ్రమున వీరశైవవాఙ్మయము :

విశాలాంధ్ర వాఙ్మయమునఁ గల పురాణములు, ప్రబంధములు, చరిత్రలు, కథలు, శతకములు, స్తుతులు, మాహాత్మ్యములు, గేయములు, యక్షగానములు మొదలైన వివిధ సారస్వత శాఖలన్నియు వీరశైవవాఙ్మయమున ప్రత్యేకముగఁ గనఁబడుచున్నవి. ఇందుచే నీ మతమునకుఁ గల విశేషప్రభావము, వ్యాప్తి, జనాభిరుచి, వైవిధ్యము మొదలైనవి స్పష్టపడుచున్నవి. ఈ క్రింది గ్రంథములు

వీరశైవ వాఙ్మయమునకు మాత్రమే చెందినవగుటచే సామాన్య శైవమత ప్రతిపాదికములై నన్నెచోడ కుమారసంభవము, శ్రీనాథుని హరవిలాసాది గ్రంథము లిందు చేర్పబడలేదు.

## 1. వీరశైవమతము

1. శివతత్త్వసారము - మల్లికార్జున పండితారాధ్యుఁడు
2. చతుర్వేదసారము - పాల్కురికి సోమనాథుఁడు
3. వీరశైవ దీక్షాబోధము - పిడుపర్తి బసవన
4. వీరశైవాచార సంగ్రహము - శివరామలింగకవి
5. వీరమాహేశ్వరాచార సంగ్రహము - పర్వతమంత్రిలింగన
6. శివయోగసారము - కొలనియాది గణపతిదేవకవి
7. శైవసిద్ధాంత శిఖామణి - చెన్నాప్రగడ నాగేశ్వరకవి
7ఎ. శైవసిద్ధాంత శిఖామణి - శివయోగీంద్రుడు
8. శైవాగమ శిఖామణి - సెప్పెల్లె అప్పనార్యుఁడు
9. శైవాచార సంగ్రహము - తిరుమలనాథకవి
10. షట్ స్థల వివరణము - సిద్ధనాథుఁడు
11. అన్యవాద కోలాహలము - శివయోగీంద్రుడు
12. గణమాలిక
13. జంగమబ్రహ్మలక్షణము
14. పండిత శివపూజావిధి
15. ప్రభుదేవర వాక్యము
16. శివలింగప్రభావము
17. శీల సంపాదనము



18. షట్ స్థల నిర్ణయము
19. షట్ స్థల జ్ఞానము

## 2. పురాణములు

1. పండితారాధ్య చరిత్రము - పాల్కురికి సోమనాథుఁడు
2. బసవపురాణము - పాల్కురికి సోమనాథుఁడు
3. బసవపురాణము - పిడుపర్తి సోమన
4. బసవపురాణము - మహాదేవకవి
5. చెన్నబసవ పురాణము - అత్తలూరి పాపకవి
6. బసవమహిమామృతము - వరవీరభద్రుఁడు
7. దేవాంగపురాణము - భద్రకవి లింగకవి
8. శివరహస్య ఖండము - ఔబళకవి
9. శివరహస్య ఖండము - కొండూరు వెంకటాచలపతి
10. శివరహస్య ఖండము - ముదిగొండ బ్రహ్మయలింగారాధ్యుడు

## 3.ప్రబంధములు

1. ప్రభులింగలీలలు - పిడుపర్తి సోమన
2. ప్రభులింగలీలలు - కొచ్చెర్లకోట రామకవి
3. శివలీలా విలాసము - తిమ్మకవి
4. బసవన విజయము - మల్లంపల్లి నాగభూషణకవి
5. ఒడయనంబివిలాసము - అజ్జరపు పేరయలింగము
6. సిరియాళ చరిత్ర (ద్విపద) - గంగాధరుఁడు
7. భల్లాణ చరిత్ర (ద్విపద) - గంగాధరుఁడు
7ఎ. భల్లాణ చరిత్రము (పద్యము) - మల్లవరపు వాలేశ్వరుడు
8. ధర్మగుప్తాభ్యుదయము - కాశీనాథుని నారారాధ్యుడు

9. మల్లారి చరిత్రము - మరిగంటి వెంకటాచార్యుఁడు
10. మల్హణ చరిత్రము - ఎడపాటి ఎఱ్ఱయ
11. వీరచోడప్ప కథ - సాంబయ్య
12. రేణుక విజయము - సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి

**4. మాహాత్మ్యములు**

1. శ్రీశైలఖండము - అత్తలూరి పాపకవి
2. శివరాత్రిమాహాత్మ్యము - అక్కనార్యుఁడు
3. శ్రీశైలమాహాత్మ్యము
4. శ్రీశైల రహస్యవివరణము
5. అమరేశ్వర తీర్థమాహాత్మ్యము
6. చెన్నమల దేవస్థానమహిమ
7. రుద్రాక్షమాహాత్మ్యము (ద్విపద) - పర్వతమంత్రిలింగన

**5.చరిత్రలు**

1. గురునంబి చరిత్రము - రెగళిగె నిమ్మనాథుఁడు
2. నవచోళ చరిత్రము - లింగన సుకవి
3. మహదేవ చరిత్రము - అల్లమరాయఁడు
4. సిద్ధేశ్వర చరిత్రము

**6. కథలు**

1. చిక్కయకథ - రెగళిగె నిమ్మనాథుఁడు
2. పిల్లనైనారుకథ (ద్విపద) - పిడుపర్తి బసవన
3. అనిమిషయ్యకు లింగమిచ్చిన కథ -
4. కూన పాండ్యరాయని కథ -



5. పాల్కురికి సోమనాథుఁడు జయించిన కథ -
6. బసవదండనాయక వృత్తాంతము -

**7. దండకములు**

1. వీరభద్రవిజయ దండకము - శంకుల చోడయ
2. సిద్ధేశ్వరస్వామి దండకము - పెద్ద వెంకటాచలపతి
3. శివదండకము
4. భల్లాణ దండకము

**8. స్తుతులు**

1. బసవస్తుతి
2. శివస్తుతి
3. శివస్తుతి పద్యములు
4. సోమనాథ స్తోత్రము
5. శివనామ సంకీర్తనము

**9. వచనములు**

1. వీరయప్పగారి రచనలు - వీరప్పయ్య
2. భవానీమనోహర వచనములు -
3. శంకర వచనములు

**10. కీర్తనలు - (గేయములు)**

1. చెన్నమల్లేశ్వరుని కీర్తన
2. బసవన కీర్తనలు
3. శివకీర్తనలు
4. వీరశైవ కీర్తనలు

### 11. యక్షగానములు

1. చిరుతొండ భక్త కథానిధానము - వాలె కోటయ
2. బసవ కల్యాణము - అనుమోద సన్యాసకవి
3. సిరియాళ చరిత్రము - తిమ్మకవి
4. సిద్ధేశ్వర వసంతవిలాసము - పెద్ద వేంకటాచలపతి
5. అక్కమహాదేవి చరిత్రము - పాపమ్మ
6. శివపారిజాతము
7. వడియనంబి చరిత్రము
8. సాంబశివ విలాసము
9. భల్లాణ నాటకము

### 12. శతకములు

1. అల్లమప్రభుశతకము - దెందులూరి పద్మనాభయ్య
2. గణసౌజన్యాఖ్యానశతకము - నాగరాజు
3. భవానీమనోహరశతకము - పండితారాధ్యులవీరేశలింగం
4. మల్లేశ్వర శతకము - చేటవర్తి కొండయ్య
5. మహిషాసురమర్దనీశతకము - మల్లంపల్లి బుచ్చయ్యశాస్త్రి
6. అమరావత్యుమామహేశ్వరశతకము - విశ్వనాథకామయ్య
7. శివశతకము - అమలాపురపు సన్యాసి
8. శ్రీకాళహస్తి శతకము - విరూపాక్షకవి
9. శ్రీవిశ్వేశ్వరశతకము - వేల్పూరి విసన్న- సాంబశివకవి
10. సర్వేశ్వరశతకము - అన్నమయ్య
11. సోమేశ్వరశతకము - శివరామయ్య
12. చెన్నమల్లేశ్వర శతకము



13. బసవశతకము
14. బసవేశలింగ శతకము
15. భవానీశతకము
16. భైరవశతకము
17. మహాప్రభు శతకము
18. మురుమళ్ళ వీరశంకరశతకము
19. వీర కాళికాంబ శతకము
20. వీర గురువరేణ్య శతకము
21. వీరభద్ర శతకము
22. శ్రీశైల శతకము
23. సంగమేశ్వర శతకము
24. సోమనాథలింగ శతకము
25. మల్లీశ్వర శతకము
26. వీరశంకర శతకము
27. శ్రీశైల మల్లికార్జున శతకము

### 13. పరిశిష్టము

1. సాంబోపాఖ్యానము - మోచర్ల అన్నయ్య
2. శివజ్ఞానమంజరి - పరమానంద తీర్థుడు
3. జంగమకాలజ్ఞానము (జ్యోతిషము) - వీరప్పయ్య
4. శైవగ్రంథము - బాలకవి అనంతయ్య
5. అక్షరాంకములు - పాల్కురికి సోమనాథుడు
6. బసవరగడ - పాల్కురికి సోమనాథుడు

7. శైవ విషయశ్లోకము
8. చిక్కయరాజుకుమారజాతకము
9. చెన్నబసవేశ్వరవృత్తాంతము
10. దేవాంగఋషివంశము
11. సర్వజ్ఞ కాలజ్ఞానము
12. శంకరసంహిత
13. ప్రమథగణమాలిక
14. బసవసంబోధనము
15. శివభక్తి దీపిక - రంగనకవి
16. హైమవతీపతిచత్వారింశత్

***Books Consulted :***

1. ***Veerasaiva or Lingayat Sect - in Vaishnavisam etc. by Dr.R.G.Bhandarkar***
2. బసవపురాణ ప్రస్తావన : కాశీనాథుని నాగేశ్వరరావు
3. పండితారాధ్యచరిత్రోపోద్ఘాతము ***by Dr.C.Narayana Rao.***





# వీరశైవాంధ్రవాఙ్మయము

## ప్రథమప్రకరణము

### మల్లికార్జునపండితారాధ్యుఁడు

వీరశైవాంధ్రవాఙ్మయమునకు మల్లికార్జునపండితారాధ్యుఁడు బ్రహ్మ వంటివాఁడు; ఈతని శివతత్త్వసారము వేదమువంటిది.

**కవిజీవితము :** గోదావరి మండలమందలి దాక్షారామ భీమేశ్వరగ్రామమున, భీమేశ్వరస్వామి దేవాలయమున కులక్రమాగతమగు పూజారియు, వాణసవంశజుఁడు నగు భీమునకు గౌరవాంబయందు శ్రీశైలమల్లికార్జునదేవు వరప్రసాదమున నీతఁడు జనించి, యా దేవునామమే పెట్టఁబడెనని పాల్కురికి సోమనాథుఁడు పండితారాధ్య చరిత్రమునఁ దెల్పెను. ఈతని సూత్రగోత్రాదులఁ గూర్చి యావీరశైవ కృతియం దేమియు వ్రాయఁబడకున్నను, 'చతుర్మఠ నిర్ణయ' మను చిన్న సంస్కృత గ్రంథమందీతఁడు గౌతమ గోత్రికుఁడనియు, ఋగ్వేద శాఖాన్వితుఁడనియుఁ దెలుపఁబడినది. ఈ గ్రంథ మోరుగంట శివధర్మవర్ధనీ రామలింగేశ్వర ముద్రాక్షరశాలయందు ముద్రితమైనది; కాని దీనినెవ రెపుడు రచించినదియు తెలియదు. కాన నీ విషయ మెంతవఱకు ప్రమాణమో విచార్యము. చందవోలు కైఫీయతులో (లోకల్ రికార్డు సంపుటము 19-433) మల్లికార్జునపండితుఁడు 'వాణస' వంశోద్భవుఁడని యున్నది. కర్ణాటక కవి చరిత్రకారుఁడుగూడ నీతఁడు 'వాణస' వంశము వాఁడనియే తెల్పుచున్నాఁడు. నన్నయభట్టు మిత్రుఁడగు నారాయణభట్టు వాణసవంశజాతుఁడట. పద్మోత్తర ఖండకృతిపతి కందనమంత్రి వాణస వంశజుఁడనియు, కాశ్యపగోత్రుఁడనియు మడికిసింగన దెల్పుటచే, వాణస వంశీయుఁడైన మల్లికార్జున పండితారాధ్యుఁడుగూడ కాశ్యప గోత్రికుఁడని వేటూరి ప్రభాకరశాస్త్రిగా రూహించుకున్నారు. కాని వాణస వంశోద్భవులైన పై ముర్వురకు 'గోత్రభేదమున్న'దని, శతకవుల చరిత్రకారుఁడు నుడువుచున్నాడు. ఏకవంశ నామకులలో గోత్ర భేదములుంట నేఁడుగూడఁ గాన నగునుకదా. కాన నీ గోత్ర విషయము సందేహాస్పదమే.

భీమేశ్వర సమీపముననున్న కోటిపల్లి వాసుఁడైన యారాధ్యదేవుని శిష్యుఁడై, యాతనిచే శైవదీక్ష నొంది, శైవమత రహస్యములఁ బూర్తిగ గ్రహించి యాతఁ

యీతఁడు, శైవాచారపరుఁడును, శివపూజాతత్పరుఁడును, శివభక్తుఁడునై 12వ శతాబ్ద యుత్తరార్ధమున 1150 మొదలు 1180 వరకు నాంధ్రదేశమున శైవమత ప్రచారము సేయుచు ప్రఖ్యాతుఁడై శివతత్త్వసారాదికృతుల నొనరించెను.

ఈతఁడు గుంటూరుమండలమందలి తెనాలి తాలూకాలో నేఁడు చందవోలను పేరుగల నాఁటి ధనదపురమున వెలనాటి చోడుఁ డను పేరుగల రాజునాస్థానమున బౌద్ధ మతాచార్యులతో వివాదము చేసి, తన మతమును స్థాపించెను. శివ మతోత్కృష్టతను చాటుటకుఁ దన శిరస్సు నిచ్చుటకును, నగ్నిలో దుముకుటకు సిద్ధుఁడై యుండి 'రుద్రమహిమ' యనుకృతి నొనర్చెను. బౌద్ధమతగురువు పరాజితుఁడై పండితుని నిందింపఁగా నాతని శిష్యు లది సహింపక, యాతఁడొక ద్వీపమునఁ గల బౌద్ధాలయమున నుండఁగ, రేమయ్య, దేవయ్య అనువార లాతని చంపిరి. తన గురువు హత్యకు పండితుఁడే కారణమని రాజు గ్రహించి యాతని కన్నులఁ బెరికింపఁగ, శివానుగ్రహముచే తిరిగి యాతనికి నేత్రములు వచ్చెనట. అంత పండితుఁ డారాజు నాతని రాజ్యమును నాశమగునట్లు శపించి శిష్యసహితముగా నక్కడనుండి నమరావతికి వెడలిపోయెను. ఈతఁడు చందవోలులో నున్నపుడే 'లింగోద్భవగద్య'ను చెప్పెను. అమరావతిఁ జేరగనే 'యమరేశ్వరాష్టక'మును రచించెను. ఈతఁ డిక్కడున్నప్పుడు బసవేశ్వరుఁ డితనికి విభూతి పంపఁగనే యితనికి కర్ణాటభాషయందు కవిత్వము చెప్పుశక్తి మొదలుపెట్టెను. బసవనిశక్తి కాశ్చర్యపడి వెంటనే యతనిని గలిసికొనుటకై కళ్యాణపురమునకు బయలుదేరెను. అమరావతి, నడుగుడుములు (కృష్ణాజిల్లా, నందిగామతాలూకా, మునగాన జమీందారి యందలిది) పానుగల్లు గ్రామములుచేరి, పిమ్మట వనిపురమునకేగి, యటనుండి కళ్యాణ పురమునకు వెడలఁబోవుచుండఁగ, నంతకుఁబూర్వ మెనిమిది దినముల క్రితము బసవేశ్వరుఁడు లింగైక్యము చెందెనన్న వార్తవిని దుఃఖించెను. తర్వాత శ్రీశైలమునకై వెల్లటూరునకుఁ బోయి, తన ప్రియశిష్యుఁడైన దోనయ్యను, తనకు బదులుగా శివరాత్రినాడు శ్రీశైల పర్వతమెక్కి గిరిప్రదక్షిణముచేసి తన వ్రతమును చెల్లింప పంపించిఁ 'పర్వత వర్ణనము' నుడివెను. దోనయ్య పర్వతము దిగి రాగానే యీశ్వర ప్రార్థనము చేసి భార్యా పుత్రాదులతో వెల్లటూరునందు లింగైక్యమొందెను. శ్రీపర్వతముఁ దానెక్కలేక తనశిష్యుని పంపుటచే నప్పటి కాతఁడు వృద్ధుఁడై యుండఁ దగును. వీరశైవ పంచాచార్యులందలీ పండితారాధ్యుఁ డితడే యని కొందరందురు.



**మల్లికార్జున పండితారాధ్యుఁడును, నన్నెచోడుని గురువగు జంగమ మల్లికార్జునుఁడు నొకరేనా :**

నన్నెచోడుని కుమారసంభ వాశ్వాసాంతపద్యములలోఁ గృతిపతియగు జంగమ మల్లికార్జునయోగునకు (1) శివతత్త్వజ్ఞానసన్మానసున్ VIII 195, (2) పరవాదీంద్ర ఘనాఘనా నిలు, మహీసురేంద్రు VIII 197, (3) కవీంద్రు IX 364, (4) బ్రహ్మకులాధీశుఁడు X 568, (5) అపరిమిత విద్యాపరిణతు XI 780, (6) శివాగమవేది (7) అమోఘ వచోనిధి XI 781, (8) బ్రహ్మకులోత్తంసుఁడు (9) సంసార పదవియుక్తుడు 1008, అను విశేషణముల వాడినాఁడు. ఇందులో చివరి విశేషణము తప్ప తక్కిన వన్నియు మల్లికార్జున పండితారాధ్యునకుఁ గూడ సమన్వయించును. ఇద్దరు సుమారుగ సమీపకాల జీవులు. ఇందుచే నిద్దరు నొక్క రేమోయను భ్రాంతి గొందరకుఁ గల్గుచున్నది. కాని నన్నెచోడుని గురువు మునియు, నస్ఖలిత బ్రహ్మచారియు కాగ, మల్లికార్జున పండితారాధ్యుఁడు సంతానవంతుఁడును. లింగైక్యమును బొందెను. నన్నెచోడుఁడు తనగురువునకు పండితశబ్దము విశేషముగా వాడినట్లగపడక పోవుటయు, మల్లికార్జున పండితుని పాల్కురికి సోమన 'పండితమల్లయ' యని విశేషముగా వాడుటచేత నొక్కరు గాజాలరు. పండితయ్య బ్రహ్మచారిగా నున్నప్పుడే నన్నెచోడుని గురువుగా నుండఁ గుమారసంభవము వ్రాయఁ గూడదా యని యాక్షేపము వచ్చినది. (చూ.శతక కవులచరిత్ర. పుట -14) కాని పండితుఁడు చిరుతవయస్సులో బ్రహ్మచారిగా నుండుకాలమున నన్నెచోడునకు గురువు గాగలుగు విద్యావిశేషము లుండియుండవు. మఱియు నన్నెచోడునిగురు వాజన్మబ్రహ్మచారియగు కాలాముఖ యోగికాఁగ పండితారాధ్యుఁడు పాశుపత మతమునకుఁ జెంది, వార్ధక్యమునఁ గూడ సన్యసింపక భార్యాపుత్రాదులతో లింగైక్యముఁ జెందుటచేత నిరువురు నొక్కరు కాఁజాలరు.

**కవికాల నిర్ణయము :** పండితారాధ్యుని కాలమును నిర్ణయించుట కాతని సమకాలికుల చరిత్ర తోడ్పడుచున్నది. పండితుఁ డమరావతి యందుండఁగ బసవేశ్వరుని దూత లతనియొద్దకు వచ్చి విభూతి నిచ్చిరనియు, పిమ్మట తా నతనిఁ జూచుటకు బయలుదేరి నైజామునందలి వనిపురము చేరఁగనే బసవన లింగైక్యము చెందెనని క్రీ.శ.1168లో వినెను. కాన నీతఁ డాకాలమున జీవించి యుండెననుట స్పష్టము. మఱియు పండితుఁడు రాజసభయందు బౌద్ధులతో వాదించినది క్రీ.శ.1163 నుండి 1180 వఱకు రాజ్యముచేసిన రెండవ వెలనాటి చోళుని దగుటచేతను,

పండితుని కనులు పెఱికించిన యా రాజమంత్రియు, రాజాబావమఱదియు నగు బుద్ధరాజుగూడ క్రీ.శ.1171 వ సంవత్సరమున నున్నట్లు దెలియుటచేతను, మఱియు పండితుఁడు పానుగల్లునకుఁ బోయినపు డా దేశము నేలుచుండిన రాజగు నుదయావనీశుఁడుగూడ క్రీ.శ.1162వ సంవత్సరము ప్రాంతముననే యుండుటచే పండితారాధ్యుఁడు క్రీ.శ.1175 వఱకు జీవించి యుండవచ్చుననియు, నప్పటికి సుమారు 70 సంవత్సరముల వయస్సుగల వృద్ధుఁడై పర్వత మెక్కలేనిస్థితిలో నున్నచో క్రీ.శ.1110 ప్రాంతమున నీతఁడు జన్మించెననియు తలంపవచ్చును.

శివతత్త్వసారము బసవేశ్వరుని మరణానంతరము రచింపబడినట్లిందలి భక్తుల కథలవలనఁ దెలియుచుండుటచే నిది క్రీ.శ.1168-1175 మధ్యకాలమున రచింపఁబడినట్లూహింపవచ్చును.

**ఈతని గ్రంథములు** :వెనుకఁ దెల్పిన శివతత్త్వసారము, లింగోద్భవదేవగద్య, రుద్రమహిమ, యమరేశ్వరాష్టకమను గ్రంథములే కాక, భీమేశ్వరగద్యము, స్తుతిశ్లోక పంచకము, పర్వతవర్ణనము, శ్రీముఖదర్శనగద్య, ఆద్యభక్తగణసహస్రనామము లనువానిని రచించినట్లు పండితారాధ్య చరిత్రవలనఁ దెలియుచున్నది. పాల్కురికి సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమున

**'శతకంబు శివతత్త్వసార మాదిగను,**
**గద్య పద్యంబు లాకాంక్షఁ జదువుచు'** - వాద. ప్ర.
**'శతకంబు శివతత్త్వసార దీపకళిక'** - పర్వత. ప్ర.

అని రచించుటచేఁ గొందఱు శివతత్త్వసార మను శతకమునే రచించెననియు, మఱి కొందఱు శివతత్త్వసారమనునది యొకటియు, శతక మనునది మఱియొక గ్రంథమును రచించెనని తలంచుచున్నారు. (చూ. విభూతి Vol. II. No. 4 for June 1940, Page 177) పై గ్రంథములలో శివతత్త్వ సార శతకములు గాక మిగిలినవి సంస్కృత పుస్తకములుగాఁ గనఁబడుచున్నవి. ఈ శతకము శ్రీగిరిమల్లికార్జునశతకము గానోపు, అందలిదని యీ క్రిందిపద్యము లక్షణగ్రంథముల గలదు.

ఉ॥ **లోకములెల్ల నీ తనువులోనివ నీవట యెంత గల్గుదో,**
**నాకప పద్మసంభవ జనార్దను లాదిగ నెల్ల పెద్దలున్**
**నీకొల దింత యంత యననేరక మ్రొక్కదొడంగి రన్న ని**
**న్నేకరణిన్ నుతింతుఁ బరమేశ్వర శ్రీగిరి మల్లికార్జునా !**



ఈ పద్యభావమే శివతత్త్వసారమున 1,6 పద్యములలోఁ గలదు. కాని కొందఱు శివతత్త్వసారమే శతకమనియు, నిందన్వర్థ నామములుగా నూరుపద్యములు మాత్రమేకాని, పద్యాంతమున శతకసంప్రదాయము ననుసరించి యేకసంబోధనమే కాని లేకపోయినను శతకఫక్కిని వ్రాయఁబడి యుండుటచే శతకమని దీనికి రూఢియైన దనిరి. అందుచేతనే కాఁబోలు శతకవుల చరిత్రలో నీకవిగూడఁ జేర్పఁబడెను. ప్రకటితమైన యీ గ్రంథము 489 కందపద్యములు గల్గి యసంపూర్ణతను దెల్పుచున్నది. 'ఇటీవల చెన్నపురి రాజ్యలిఖిత పుస్తకాలయమున కన్నడ భాషయందలి శివతత్త్వసార మొకటియున్నట్లుగా వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గుర్తించిరి. అదియు నాంధ్రకృతియు నొకేవిధముగానున్నవట. కాని యదికూడ నసంపూర్ణమేనట. కన్నడ కృతిని పట్టి యీ రెండు శివతత్త్వసారములు వేయి పద్యములతోఁ గూడి యుండునను నూహకు తావిచ్చుచున్నవి. ఒకవేళ కన్నడకృతిని గూడ పండితుఁడే రచించి యుండునేమో. బసవనయనుగ్రహమున నితనికి కన్నడ కవిత్వముగూడ వచ్చెననికదా తెలియుచున్నది. లేదా, యితరులే రచించియుందురో. ఇవికాక సంసార మాయాస్తవము, శంకరగీతములు, పదములు, నానందగీతములు, పదములును, గూడ నితడు రచించె ననుకొనదగినట్లు సోమనాథుఁడు పేర్కొనినాడు *(చూ.పం.చ. దీక్షాప్రకరణము - పుట 181-182) మఱియు నితఁడు కర్ణాటక భాషయందు గణసహస్రనామము, ఇష్టలింగస్తోత్రము, బసవగీత లను గ్రంథములను రచించినట్లు గన్పడుచున్నది.

---

**పండితారాధ్యచరిత్ర - దీక్షాప్రకరణము పుట 181**

ఉద్గతస్తవన సంయుత వాక్యుడగుచు
హరలీల దేలుచు హరలీల దనర
**'హరలీల'** యను కృతి హరలీలఁ బొగడు.
మహిచెప్పఁబడు **'మహిమ్న స్తవం'** బునను
మహిమాకరుని మహామహిమను గీర్తించు
మలహరణంబగు **'మలహణం'** బునను
మలహణప్రియుని త్రిమలహరుఁబొగడు.
శ్రీమయంబైన **'యనామయంబు'** నని
రామయుండగు కరుణామయుఁ బొగడు.

నాయతప్రీతి **'హలాయుధం'** బున హ
లాయుధప్రియు త్రిశూలాయుధుఁ బొగడు
పాంచభౌతిక పంచ పంచేంద్రియ ప్ర
పంచ దూరు నుతించు **'పంచగద్య'** ముల
శివతత్త్వసార సంచిత మహామహిమ
**'శివతత్త్వసారమన్'** శివకృతిఁబొగడు
మహనీయమగు **'రుద్రమహిమ'** యన్ కృతిని
మహనీయమగు **రుద్రమహిమఁ** గీర్తించు
నలరు **'సంసారమాయాస్తవం'** బునను
నలరు సంసారమాయాదూరుఁ బొగడు
**'శంకరగీత'** భాస్వత్పదావళిని
శంకరు దురితభయంకరుఁ బొగడు
**'నానందగీతంబు'** లను పదముల స
దానందు భక్తగణానందుఁ బొగడు
**'బండారుబసవన్న భవ్యగీతముల'**
బండారు బసవన్న ప్రాణేశుఁ బొగడు.

**శివతత్త్వసారము** : ఈతఁడు రచించిన యాంధ్రగ్రంథములలో నిదే యింత వఱకు లభించినది. ఇందు స్వమతమైన శైవమత ప్రాశస్త్యస్థాపనమును, పరమతములైన వేదబాహ్యములగు బౌద్ధజైన మతములును, వేదవిహితములైన యద్వైతాది మతములు నిర్దాక్షిణ్యముగ ఖండింపఁ బడి, శివభక్తులయు, గణములయు మహిమలును వర్ణింపఁబడుటయే కాని వేరు కథా వస్తువేమియు లేదు. అందందు శివస్తుతి చేయఁబడినది. కాన నిది కందపద్యములలో వ్రాయఁబడినను కావ్యముకాక మతగ్రంథమైనది.

ఈ గ్రంథమందలి కవితాశైలి నన్నయ కవితాశైలివలె సంస్కృత పద జటిలమై భావ గాంభీర్యమునకుఁ దగిన దుందుభి ధ్వానము వంటి శబ్దాడంబరము గల్గి సామాన్య పండితులకుఁ గూడ సుబోధకమయ్యు, పామరులకు మాత్రము గ్రాహ్యమగుటలేదు.

క. **ఖరకర పద్మజ రుద్రాం, బురుహోదర ముఖ్య దివిజపుంగవ సచరా**
**చర భూతనికర పంచా వరణంబులు గొల్వనుండు వాఁడవు రుద్రా.**



క. **త్రిమలకృత దుఃఖ సంసా, రమహాబ్ధి నిమగ్న జీవరాసులు నీ యు**
**త్తమ కారుణ్యావశంబున, విముక్తులై నీవెపోలె వెలుఁగుదురు శివా.**

క. **కోరరు మఱచియు స్వర్గస్వారాజ్య ప్రముఖనిఖిల సంభూత భవా**
**పారసుఖంబులు శివరస భూరిసుఖానుభవ భక్తపుంగవులు శివా.**

క. **కావున భక్తులు త్రిజగ, త్పావనులు భవాంధతమస పటలవిఘటనో**
**ద్భావిత నిజమహిమార్క వి, భావను లవినాశు లతికృపాపరు లెందున్.**

ఇట్టివే 217, 251, 252, 259, 286, 302, 354, 355, 367, 373, 376 సంఖ్యగల పద్యములుగూడ.

ఇతఁడు కవిత్వమున సరసమగు నుపమాలంకారములను వాడును.

క. **విను, పరుసవేది సోఁకిన, యినుము క్రియ, న్నిన్ను గొలిచి యెవ్వండైనన్**
**ద్రినయన యుత్తముఁడనఁబడు, బొనరఁగ శివభక్తుఁడగ్రపూజ్యుండగుటన్.**

క. **ధరణిఁ గుల రూప విద్యలఁ, బరఁగి బవద్భక్తిలేని పాలసుఁడు గడుం**
**బరిమళము లేనికుసుమము, గరమొప్పనిభంగిఁ గొఱయుగాఁడు మహేశా.**

క. **మసి కప్పడమునఁబొదివిన, యసదృశమాణిక్యమెట్టులట్టుల దుర్జా**
**తి సమావృతుఁడయ్యును నీ, కు సదాభక్తుఁడగు మనుజకుంజరుడు శివా.**

ఇట్టివే 154, 193, 195, 198, 306, 307, 308, 323 సంఖ్యగల పద్యములుగూడ.

సందర్భోచితముగ చక్కని నిదర్శనాద్యలంకారములఁ గూడ నితఁడు కవిత్వమున చొప్పించును.

క. **ఎట్టికడుఁగీడుకులమునఁ, బుట్టియు శివ నిన్నుఁ గొలిచి పూజ్యుఁడ మనుజుం**
**డట్టిదధర్మవు రొంపిం, బుట్టియుఁబద్మంబు సాలఁ బూజ్యమకాదే.**

క. **జడమతులల్పమయెఱిగెడు, వెడవారలు శివునిమహిమ యెరుగుదురె మహిన్**
**జడనిధివెడల్పులోఁతును, గడునెఱుగునె నూతిలోని కప్పలు బుద్ధిన్.**

క. **వేదపురాణములెఱిగి స, దోదితుఁడగుశివునినెఱుఁగ నోపరు పాపుల్**
**మేదినిఁజూచియుఁబూర్వది, శాదిత్యునిఁ గౌశికంబు లనునవి గనునే.**

ఇట్టివే 135, 239, 244, 463, 464 సంఖ్యగల పద్యములుగూడ.

కాని తర్వాతి శైవకవులు వాడిన దేశికవిత, సరళరచన యిందు గానరావు.

కన్నడ పదములు వాడుట మాత్రము క్వాచిత్కముగా కలదు. ఇందన్వయ కాఠిన్యము, ప్రాతపడ్డ మాటలును గలవు. వక్కడు, ఓడు, ఆలరి, ఎయిదడు, ఆలాపు, ముద్దటలడిఁచిన, పాదఱి, సూడపెట్టు, త్రిప్పటము, నొడ్డణము, ప్రువ్వులు, బడరుడు మొదలైన పదములిప్పుడు వ్యవహారమున లేవు.

శ్రుతులందలి యనేక సంస్కృత వాక్యములను దనగ్రంథమున స్వమత ప్రమాణమునకై సునాయసముగ కందపద్య మధ్యమున నిమిడ్చినాఁడితఁడు.

క. **వసుమతిఁ జిత్రము జితచి, త్త సంభవా 'నకర్మణా నతపసా నజపై**
**ర్న సమాధి భి' రవ్యయ నీ, యసదృశ భక్తికిని బ్రియుఁడ వగుదీశానా.**

క. **భక్తియ ముక్తితెరువు వి, ధ్యుక్తముగ నమేయ ప్రియ 'చతుర్వేదా మ**
**ద్భక్తిశ్చ శుచీ' యనునా, సూక్తి ప్రధానమ్ముగాఁ బఠూత్తముల కజా.**

క. **మానుగ నెప్పుడు 'మద్భక్తా న వినశ్యంతి' యనఁగదగియుండఁగ నీ**
**శాన భవత్కారుణ్యాం, భోనిధి ననుఁదేల్చి ముక్తిఁ బొందింపు శివా.**

ఇట్టివే 4. 115, 116, 131, 147, 156, 180, 181, 203, 210, 279, 348. 461 సంఖ్యగల పదములుగూడ.

ఈ సంప్రదాయము పాల్కురికి సోమనాథాది శైవకవులలోఁ గూడఁ గనఁబడుచున్నది.

అన్యమత ఖండన మీతఁడు బహుకఠిన వాక్యములతోఁ జెసెను. వేమనవలె తనభావముల నుద్బోధించుటకై సంకోచముగాని భయముగాని చెందఁడు. ఈతని హాస్యము పరిహాసరూపమై పరులమనస్సు నొప్పించును. ఈతఁడు ప్రతిపాదించిన భక్తి యుత్తమమై, విశిష్టాద్వైతుల జీవాత్మ పరమాత్మల సంబంధమును నాయికా నాయకుల ప్రేమభావముగా వ్యక్తీకరింపఁబడినది. 'భవచ్చరణాబ్జ భక్తిలలనా పరవశ భావమున' నిన్ను ప్రణుతింతు శివా. (12) ఈ గ్రంథమున శైవధర్మ ప్రతిపాదనము తప్ప వేరుకావ్య కథాశిల్పము లేకపోవుటచే దీనికి విశ్వజనీనత్వము లేకపోవటయేకాక, యిందలి భక్తుల మహిమాది విషయములనే పాల్కురికి సోమనాథుఁడు పండితారాధ్య చరిత్ర, బసవపురాణములందు ప్రవచించి ద్విపదరూపమున పామరజనులకుఁ గూడ గ్రహణపాత్రమై, పాడుకొనుటకుఁ గూడ యోగ్యముగ జేసి కథారూపమునఁ గూర్చుటచేత, మఱియు నిందు వివిధభాగము లన్నింటికి కలిపి యేకఛందమైన కందపద్యములో వ్రాయుటచేత శివతత్త్వసారము విశేషప్రచారము నొందలేదు. ఇందు 18-20 పద్యములఁ బట్టి షష్ఠ్యంతముల నీకవి కూడ వాడినట్లు గనబడుచున్నది.



**కవి వైదుష్యము :** మల్లికార్జున పండితారాధ్యుఁడు వేదవేదాంగ శాస్త్రకోవిదుఁడని యతని రచనములే చాటుచున్నవి. ఈతఁ డొనర్చెనని చెప్పుకొనఁబడు మహిమల యాథార్థ్యములం దతిశయోక్తులని కొన్నిగీటునఁ బుచ్చినను, నితఁడు నిశ్చలభక్తిచే నీశ్వరానుగ్రహమును బొంది తన యనుయాయులను గూడ తరింపఁచేసెనని విశ్వసింపవచ్చును. ఈ గ్రంథమందలి 21-30 పద్యములఁ బట్టి యీతఁడు పాశుపత శైవమతావలంబికుఁడని తెలియుచున్నది.

**మత విషయములు :** ఈ కాలమున బౌద్ధ జైనాది వేదబాహ్యమతములు నష్టప్రాయములై, ప్రాబల్యమును గోల్పోయినను నచ్చటచ్చట శైవుల కుపద్రవము గల్గించుట మానలేదు. అద్వైతమత మితరమతముల నిర్మూలనము చేయఁ బ్రయత్నించుచుండగా, దాని యొత్తిడికి బౌద్ధ జైన మతములేకాక శైవమత మేమాత్రము తాళలేకపోయినదని శివతత్త్వసారాది శైవగ్రంథము లామతమును కఠినముగా ఖండించుటవలనను, శైవేతరుల దూషించి హింసించుటవలనను స్పష్టమగుచున్నది.

మల్లికార్జున పండితారాధ్యుఁడు పాశుపత శైవమతమునకుఁ జేరినవాఁడు. ఈ మతము ప్రకారము సకలప్రాణులు పశువులనియు, సమస్త పశురాసికి శివుడు పతియనియు, సంసారబంధమే పాశమనియు, పశుపతియగు శివుఁడు తద్భక్తులకు పాశచ్ఛేదము గావించి ముక్తి నొసఁగును. ఈ మోక్షమునకు భక్తియే ప్రధానమార్గము. ఈ మతమువారు వేదమును ప్రమాణముగ నెంచి, వర్ణవ్యవస్థ నంగీకరింతురు. పండితారాధ్యుఁడు 'భక్తిమీఁది వలపు, బ్రాహ్మ్యంబుతోఁ బొత్తు పాయలేను నేను బసవలింగ' యని బసవేశ్వరునకుఁ బంపినవార్తను బట్టి యితఁడు వర్ణవ్యవస్థయందు సంశయాత్ముఁడుగను, బసవేశ్వరుని భక్తిమతమునకుఁ దనమతమునకు సామరస్యము గల్గింప శక్తిజాలకయు, దానికై ప్రయత్నించిన వాఁడుగాఁ దోఁచుచున్నాడు. ఈతఁడు నిర్దేశించిన శివదీక్షలో రుద్రాక్ష విభూతిధారణము మాత్రమే గలదుకాని లింగ ధారణము లేదు. ఇది తర్వాత బసవేశ్వర మతప్రాబల్యమున నిందుఁ జేరి యుండవచ్చును.

శంకరాచార్యుని మాయావాదము ననిర్వచనీయానుపపత్త్యాదియుక్తుల మూలమున నితఁడు ఖండించెను.(చూ.ప.39) ఈ మార్గమునే తర్వాత రామానుజుఁడు

శ్రీభాష్యమునఁగూడ నవలంబించెను. ఈవాదమున కీతఁడు విశిష్టా ద్వైత మతముతో నేకీభవించినను, నన్యవిషయములలో నితనిది ద్వైత దృష్టియే. ఈతని మతము ప్రకారము ప్రపంచము సత్యము, నాత్మకంటే భిన్నమును. (35-37); జీవాత్మ పరమాత్మలు వేరు; శివునకు జీవునకు పర్వత పరమాణు భేదము గలదు (40-42); భక్తివలన ముక్తి గలుగును గాని, కేవలజ్ఞానమువలన రాదు. (243-4);

**కం. జ్ఞాని యగువాఁడు భక్తివిహీనుండగునేని ముక్తి కెయిదడు. (243)**

ఈ రీతిగనే పోతన విష్ణుభక్తిని భాగవతంబున ప్రతిపాదించినాఁడు. 'ధర్మతత్త్వ ధీపరిణత సాధనంబగు స్వభావముఁ దాల్చినయట్టి మర్త్యులు ... తదంఘ్రి పంకరుహము లర్థియైఁ గొలువగానమిఁ బొందరు తత్పదంబునన్ (III.510) తన మతమును ప్రతిపాదించుటలో పండితారాధ్యుఁడు కేవలము యుక్తిసాహాయ్యమే కాక, వేదోక్తిసాయమును గూడఁ బడసి యా వేదవాక్యములకు ద్వైతపరముగనే యర్థముఁ జెప్పినాఁడు.

ఈ వీరశైవమతమునఁ గొన్ని విచిత్రాచారములు గలవు. భర్త శివభక్తుఁ డుగానిచో భార్య వానిని త్యజింపవలయునట. (231-33) అట్లు చేసిన దోషములేదట. శైవమత ప్రచారముకొఱకు జీవహింస గూడఁ జేయవచ్చునట (247-280). శివ కార్యమునకై మరణించినవారి కపరకర్మలుగాని, సూతకముగాని జరపక సంతోషముతో పండుగఁ జేయవలయునట (281-83). శివనిర్మాల్యమును శివదీక్షితుఁడు తప్ప నితరులు దినరాదట (215-222).

***Books Consulted :***

1. శివతత్త్వసారము - ఆంధ్రసాహిత్యపరిషత్తు ప్రచురణము.
2. శతకవులచరిత్ర - వంగూరు సుబ్బారావు
3. పండితారాధ్యచరిత్రము - విభూతి Vol. II. No.4 - June,1940
4. మల్లికార్జున పండితారాధ్యుఁడు - వావిలాల వేంకటేశ్వరశాస్త్రి - భారతి XVII 5.

# ద్వితీయప్రకరణము

## పాల్కురికి సోమనాథుఁడు

**కవి ప్రాశస్త్యము - వ్యక్తిత్వము :** వీరశైవాంధ్ర వాఙ్మయమునకు మల్లికార్జున పండితారాధ్యుఁడు బ్రహ్మవంటివాడైనచో, పాల్కురికి సోమనాథుఁడు విష్ణువు వంటివాఁడు. వీరశైవమత ప్రతిష్ఠాపకుఁ డైన బసవన మహామహిమాన్వితుఁడును, మహాభక్తుడు, గాయకుఁడు, కవిమాత్రమేయగును గాని పండితుఁడుగాడు, కాన నీతని యనుయాయులు భక్త్యావేశముచే నీమతమునఁ జేరిరి. కాని భక్తులున్నంత కాలమే యీ మతము నిలుచును, తర్వాత దీని యునికి సందేహాస్పదమే. ఏమతమైనను బహుకాలము నిల్వవలయుననిన నన్యమతస్థులతో వాదించి, వారి మతముల ఖండించు పాండిత్యశక్తి గల మత ప్రచారకర్త లుండవలయును. ఈ లక్షణము బసవనకు లేకపోయినను నాంధ్రదేశమున పండితారాధ్యునకుండుటచే నాకార్య మతడు నిర్వహించినాఁడు. కాని యట్టిపండితుడున్నంతకాలమే యీ మతము నిల్చును. అది శాశ్వతముగ నుండవలయు ననిన పరమతముల ఖండించి స్వమతము నుద్ధరించు గ్రంథములను ప్రాచీన గ్రంథప్రమాణ పూర్వకముగ నుండి, పండితులఁగూడ సంతృప్తి పఱచునట్లు రచించగల పండితులైన కవులు కావలయును. ఇంతటితోఁ జాలదు. కొలదిపండితుల మాత్రము సంతృప్తిపరచిన మతప్రచారము బాహాటముగా సాగదు. జనసామాన్యమునకు సులభ గ్రాహ్యమగునట్లు, మతావేశము గల్గించునట్లు గ్రంథములఁ గూడ ముఖ్యముగ రచింపవలయును. ఈకార్యమును బసవనాదులు నిర్వహింపలేదు. కాన నాలోపము వీరశైవమతమునకు మిగిలిపోయినది. దానిని దీర్పగల మహనీయునకై వీరశైవలోక మెదురు చూచినది. చివరకు పాల్కురికి సోమనాథుడుద్భవించి యాలోపమును దీర్చుటకై, పండితుల సమాధానపరచు నిమిత్తము సోమనాథభాష్య, రుద్రభాష్యాదులను, సామాన్యజనుల యాదరణకై బసవపురాణ పండితారాధ్య చరిత్రములను రచించి, విదేశీయులలోఁ గూడ ప్రచారము సాగుటకై కర్ణాటభాషలో గూడ గ్రంథరచన గావించినాడు. ఈవిధముగ

వాఙ్మయ రూపముగ వీరశైవమతమునకు నిరుపమానమైన సేవయొనర్చి తన్మత ప్రచారము విశేషముగా జేసి యామతము శాశ్వతముగా నుండునట్లు చేసినవాఁడు పాల్కురికి సోమనాథుఁడు. ఈతని తర్వాతి వీరశైవు లితనిని బసవ పండితారాధ్యులతోఁ బాటు గురుపీఠముగా గ్రహించి 'భృంగి' యవతారమని భావించిరి. వీరశైవులు దమ పుత్రుల కభిమానముతో బసవనామముతోఁ బాటు 'సోమన' యనిగూడ నామకరణము చేయుచుండిరి. (1) ఈతని తర్వాత వీరశైవకవులందరు నితనికిఁ దొలిమ్రొక్కులు దమ కావ్యారంభముల చెల్లించుచు, నీతనికృతులను రూపాంతరముననో, లేక తద్గ్రంథాంతర్భాగములనో రచించి యీతని కంకిత మొనర్చుచుండిరి. (2) వీరశైవకవులేకాక తదితరులైన పోతన, శ్రీనాథ, ధూర్జటి మొదలైన కవులు గూడ వీనికవిత్వము ననుకరించిరి. గౌరన, గోనబుద్ధారెడ్డి, కోనేరుకవి, తిమ్మకవి, మొదలైన ద్విపదకావ్యకర్తల కితఁడు మార్గదర్శకుఁడు. ఆంధ్రవీరశైవులకే కాక కర్ణాటకమునఁ గూడ నీతని కీగౌరవము దక్కినది. ఈతని యాంధ్రకావ్యములు కర్ణాటక సంస్కృతము లందు భాషాంతరీకరింపఁబడినవి. వీరశైవ మతస్థాపకులైన బసవ పండితారాధ్య చరిత్రములను ప్రప్రథమున బహురసవంతముగ, నుద్రేకకరముగ వ్రాయగల్గుటయే కర్ణాటాంధ్రవీరశైవకవు లీతనిపై నింతగౌరవము జూపుటకును ముఖ్య కారణమైనది. తదుపరి యీ రెండు భాషలందుగూడ నితఁడు కవియై, యా మతప్రతిపాదకవిశేష గ్రంథముల వ్రాయుట మరియొకటి. ఇతఁడు భవిపాకవర్జనాది వీరశైవ నియమాచార ధురంధరుడై, వీరశైవభక్తుడై, తన్మత రహస్యములను, ప్రామాణికగ్రంథములను బూర్తిగ పరిశోధించి, వాదములం దన్యమతముల ఖండించి, వీరశైవ మతాభిమానాభినివేశములుగల విద్వత్కవి. వీరశైవలోకమున కితడుపదేష్ట. గొప్ప ప్రతిభావంతుఁడు. వీరశైవాంధ్ర వాఙ్మయ మంతయు నితని రచనలపై నాధారపడి యున్నది. ఈతనికిఁ బూర్వముగల వీరశైవాంధ్ర కావ్యములైన శివ తత్త్వసారాదు లీతని కృతులముందు మాటు పడిపోయినవి. ఈతని తర్వాత కృతులన్నియు, రూప, భావ భాషలందితని రచనలమీఁదనే యాధారపడి యున్నవి. పాల్కురికి సోమనాథుఁడు లేకపోయిన వీరశైవాంధ్ర వాఙ్మయము లేదనియే చెప్ప వచ్చును. కాన వీరశైవాంధ్ర వాఙ్మయమునం దీతని కున్నంత స్థానగౌరవ ప్రపత్తులిట్టివి.



గ్రుడ్డియెద్దు చేనఁబడినట్లుగాక, ఆంధ్రవాఙ్మయమున భాష, భావము, రూపము మొదలైన ప్రతివిషయమునందు నూతనపథంబును త్రొక్కి తన ప్రతిభను పాల్కురికి సోమనాథుఁడు చాటినాఁడు. వివిధ మతముల గుర్తెరింగి వివిధభాషల నభ్యసించిన వాఁడగుటచే వానిలోగల గుణసౌకర్యముల నెఱింగి, వానిని తనమత ప్రచారమునకు, కావ్యరచనకు నుపయోగించుకొనెను. వీరశైవమతము మొట్టమొదట యనాదిసిద్ధమైన బ్రాహ్మణమతము నెదుర్కొనవలసి యుండుటచే, నామత వాఙ్మయమం దున్నట్లుగా నీ మతమునఁ గూడ శ్రుతి స్మృతి పురాణేతిహాస కావ్యస్తుత్యాదుల నెలకొల్పవలయునని యెంచి, చతుర్వేదసార, యనుభవసార, రుద్ర భాష్య, బసవపురాణ, పండితారాధ్యచరిత్ర, వృషాధిపశతక, బసవరగడ, బసవో దాహరణాదుల క్రమముగా ప్రతిజాతికి నొకదానికి ప్రతినిధిగా రచించి తదుచితముగ నా గ్రంథములకు బ్రాహ్మణ వాఙ్మయానుకరణమున వేద సార, భాష్య, పురాణ, చరిత్ర, శతకోదాహరణాది నామముల నన్వర్థముగానొనర్చి యామతవాఙ్మయమునకు తగిన ప్రతిష్ఠాగౌరవముల గూర్చినాఁడు. క్రీ.శ.5-8 శతాబ్దములందు దక్షిణదేశమున జైనబ్రాహ్మణమతముల కలహములందు పేర్గాంచిన శైవభక్తులగు నయనారులఁ చరిత్రము 'అరువత్తుమూవురు' భక్తుల చరిత్రలు వ్రాయఁబడగా, వారి జీవితకథల నవకాశముతీసికొని బసవపురాణ పండితారాధ్యచరిత్రలం దుపయోగించుకొని వారిని వీరశైవభక్తులుగా ప్రతిపాదించినాఁడు. మఱియు బ్రాహ్మణ మతగ్రంథములన్నియు సంస్కృతభాషయం దుండుటచే నామతము సామాన్యజనులకు గ్రహణయోగ్యముగా లేదనియు, జైన బౌద్ధులు తమ మతగ్రంథములను సామాన్య జనులలో విశేషప్రచార మొందించుటకై దేశభాషలలో సులభశైలియందు రచించుటచే శీఘ్రప్రచారమొంది సాయపడినదనియు గ్రహించి తన కావ్యములను దేశీయపద్ధతి నవలంబించి దేశీయ ఛందమగు ద్విపదలో, జానుతెలుఁగు భాషయందు సులభగ్రాహ్య మగునట్లు రచించెను. అందుచే పామరజనుల కందుబాటులో లేని బ్రాహ్మణ మత గ్రంథములం దాదరణ సన్నగిల్లి యీ మతమందు భక్తి హెచ్చుటకుపయోగించినది. బౌద్ధ జైనమతములకన్న నిది యెక్కువ సుబోధకమై. సులభప్రచారము సాగించుకొనినది. ఎట్లన ద్విపదలో రచించుటచే వాల్మీకి రామాయణమున కుశలవులు పాడినట్లు రసావేశముతో పాడుకొనుటకుఁ గూడ వీలుగనున్నది. ఇఁక పండితులఁ గూడ

తృప్తిపఱచుటకు, నీమతమునకుఁ బ్రాశస్త్యమును, ప్రాచీనతయు, ప్రామాణ్యమును గూర్చుటకు (చతుర్వేదములనుండి యనుకూలమైన ప్రమాణ వాక్యములను గ్రహించి, చతుర్వేదసారరుద్రభాష్యముల రచించుటయేకాక,) బసవపురాణ పండితారాధ్య చరిత్రలలోఁ గూడ, శ్రుతిస్మృతి పురాణాదులనుండి ప్రమాణవాక్యముల గ్రహించి కూర్చెను. పురాణములలో ధర్మోపదేశార్థము నర్థవాదులకుఁ పూర్వుల చరిత్రల నుపాఖ్యానములుగ చేర్పఁబడఁగ బసవపురాణ పండితారాధ్యచరిత్రలలో భక్తి మాహాత్మ్యము నుపదేశించుటకై పూర్వులును, సమకాలికులు నగు వీరశైవభక్తుల నుపాఖ్యానములరీతి నర్థవాదములుగ నుపయోగించి యితఁడు కూర్చెను. బసవ పురాణమున,

'పూరితంబైయొప్పు పూసలలోన, దారంబుక్రియఁ బురాతన భక్తవితతి చరితలలోపల సంధిల్ల బసవ, చరితమేవర్ణింతు సత్కృతియనగ'

అనియు మఱియు పండితారాధ్యచరిత్రమున,

పరిశిష్టపరిమిత ప్రాక్తనభక్త - చరితంబు లితిహాస సంగతినొలయ,

సంధింపు పండితచరితంబునందు'

అనియు రచించెను.

ఈవిధముగ నితఁడు వీరశైవమతవాఙ్మయమునకు విశిష్ట లక్షణములతో యోగ్యతా గౌరవములఁ గూర్చుటేకాక, బ్రాహ్మణ వాఙ్మయముతో సమానమైన ప్రాచీనత, ప్రామాణ్య, ప్రాశస్త్యముల నాపాదించెను. అం దామతమూలపురుషులైన బసవ పండితారాధ్యులనే మహానాయకులఁ జేసి వారికి దైవత్వమారోపించి యవతార పురుషుల నొనర్చి వారిచరిత్రములకు పురాణపావనత్వమును గూర్చినాఁడు. విశ్వా మిత్రునివలె సృష్టికిఁ బ్రతిసృష్టిచేయుశక్తిగల ప్రతిభాశాలి సోమనాథుఁడు. బూకరింపు మాటలతో మాత్రమే పోనిచ్చువాడు గాడు. కార్యశూరుఁడు. నిజమైన వీరుడు. సూక్ష్మబుద్ధిశాలి, ఘటనాఘటనధురంధరుఁడు. మొండి పట్టుదల గలవాడు. తిమ్మిని బ్రమ్మిసేయగల సమర్థుఁడు. సంస్కారప్రియుడును తిరస్కారపరుడు. సాంకేతికముల కితడు దాసుడు గాడు. సంపూర్ణస్వతంత్రుడు. కావ్య లక్షణములను భాషాసంప్రదాయముల నితఁడు పూర్తిగ నెఱింగినవాడు. కాని తన కవితాప్రవాహమున



కవి యడ్డునిలిచినచో వాని నతిక్రమింప నెంతమాత్రము వెను తీయడు. అవి వీని చేతిలో కీలుబొమ్మలవలె నెట్లాడించిన యాట్లాడెను. 'నిరంకుశాః కవయః, యను నార్యోక్తి యితనియందు పూర్ణముగ నన్వర్థమగును. ఇతడు శాసించుటకేగాని, శాసింపఁ బడుట కిష్టపడువాడుగాడు. తన మతమునందు పట్టుదలయు నుద్రేకము నత్యధికము. దీనికిఁ దోడు శాస్త్రజ్ఞానము, బహుభాషా పాండిత్యము, సువాసనా బలముగూడ నుండుటచే మతవిషయములలోగాని, సారస్వత విషయములలోగాని యితఁడు ప్రపంచమున నెవరిని లెక్క చేయలేదు. ఇతడు బసవ పండితారాధ్యులవలె శివభక్తుడగుటయేకాక శాపానుగ్రహసమర్థుఁడువలెగూడఁ గనుపించుచున్నాడు. పాండిత్యమున పండితారాధ్యునకు తీసిపోడు. అందుచే ప్రపంచమున జనులందరు నితనికి వశ్యులై భయభక్తితో నుండిరి. ఇట్టి వాఁడగుటచేతనే వీరశైవమతవాఙ్మయము లీతనివలన నేఁటివఱకు నామరూపములనైన నిలచినవి. బ్రాహ్మణమత వాఙ్మయ మునకు వేదవ్యాసుఁడెట్టివాఁడో, వీరశైవమత వాఙ్మయములకు పాల్కురికి సోమన యట్టివాడని చెప్పవచ్చును. అందుచేతనే పిడుపర్తి బసవన తన పద్యబసవ పురాణమున నితనిఁగూర్చి యిట్లు వర్ణించినాఁడు.

**సీ. లిపిలిఖింపకమున్న యపరిమితార్థోక్తి, శక్తి యాతనిజిహ్వ జరుగుచుండు**
**ఛందోధికరణాది సరణిచూడకమున్న, మదినుండుఁ గావ్య నిర్మాణశక్తి,**
**భాష్యసంగతులుచెప్పకచూడకయమున్న, రుద్రభాష్యక్రియారూఢివెలయు**
**తర్కశాస్త్రాదివిద్యలు పఠింపకమున్న, పరపక్షనిగ్రహ ప్రౌఢివెలయు,**

**తే. నతని నుతియింప నాబోటి కలవియగునె, జైనమస్తకవిన్యస్తశాతశూల**
**కలితబిజ్జలతలగుండుగండ బిరుద, శోభితుఁడు పాల్కురికి సోమనాభిధుండు.**

ఇతఁడు సర్వతోముఖ పాండిత్యముగలవాఁడని యాతని కృతులె చాటు చున్నవి. ఈతనికి 'తత్త్వవిద్యాకలాప కవితావిచార' యనియు, 'అన్యవాద కోలాహల' యనియు 'ప్రత్యక్షభృంగీశావతార' యనియు బిరుదులు గలవని కన్నడకవులు తెల్పుచున్నారు.

**కవి జీవితము** : బసవ పండితారాధ్య చరిత్రలవలె నీతని చరిత్రము వీర శైవాంధ్రకవియు రచింపకపోవుటచే నీతని జీవితచరిత్ర వివరములన్నియు నెవరికి

విపులముగ తెలియవుగాని, కొన్ని ముఖ్యవిషయములుమాత్ర మీతని బసవ పురాణమును పద్యకావ్యముగా రచించినవాడును, నీతని శిష్యుఁడైన శివరాత్రికొప్పయ కారవతరమువాడై, వీరశైవమత గ్రంథముల ప్రచారముసేయు వంశీయుడగు పిడుపర్తి సోమన తన బసవపురాణముఁ దెలిపినాడు. కొంచెమెక్కువ తక్కువగా నావిషయములనే క్రీ.శ.1560 ప్రాంతమున, కర్ణాట సోమనాథపురాణమున 'విరక్తతొంటెదార్య' డను కవి తెల్పినాఁడు. పిడుపర్తి సోమన యా విషయములను సులభశైలిలో రచించుటచే నతని పద్యములనే నిచ్చుచున్నాడు.

సీ. **ఒకనాఁడు శివభక్తు లోరుగంటను స్వయం, భూదేవుమంటపమున వసించి,**
**బసవపురాణంబు పాటించి వినువేళ, హరుని గొల్వఁబ్రతాపుఁ డచటకేఁగి**
**యా సంభ్రమంబేమి యనుడు భక్తులు బస, వనపురాణంబర్థి వినెదరనిన**
**విన నా పురాణంబు విధమెట్లొకోయన్న, ధూర్తవిప్రుండొకకర్త చేరి,**

ఆ. **పాలకురికిసోమ పతితుఁడీనడుమను, బెనచె మధ్యవళ్ళు పెట్టి ద్విపద**
**యప్రమాణమిది యనాద్యంబు పదమన్న, నరిగెరాజు, భక్తులదియెఱింగి.**

చు. **కరముల కర్ణయుగ్మములు గ్రక్కున మూయుచు బ్రహ్మబంధువున్**
**బొరిగొనఁ జూచి యిట్టిఘనమూర్ఖులు భక్తులటుండ్రు వేగ పా**
**ల్కురికి పురీశ దేశికునకున్ వినిపించి తదభ్యనుజ్ఞ నీ**
**వెరవిడి విప్రుబట్టుకొని వే వధియింతమటంచు నందఱున్.**

క. **చని పాల్కురికిసోమే, శునితోనప్పాఱుపలుకు చొప్పడఁజెప్పన్**
**విని, యూరకున్న భక్తుల, కును తలవంపౌనటంచుఁ గుపితాత్ముండై.**

క. **భవి గాని వానితోడన్, వివాదమొనరింపఁ జూడ విధిలేదైనన్**
**శివభక్తిశక్తిఁ దృణమా, నవుచే గెలిపింతు దూషణపరుం బాఱున్.**

ఆ. **అని ప్రతిజ్ఞచేసి హరభక్తియుక్తుడై, లింగముద్రయెడ్ల సంగడించి**
**కూడగట్టినట్టి గూడారుబండిపైఁ, గదలిపోయి రోరుగంటిపురికి.**

ఉ. **వారలు వచ్చురాక పరవాదులెఱింగియు నేవపుట్టి యా**
**యూర వసించుముక్కిడుల నున్మదవృత్తుల మొండివాండ్ర నుం**



**జేరఁగఁ బిల్చి చంద్రధరు చిహ్నితదేహులఁ జేసి యందఱున్**
**బోరన మీరెదుర్కొనగఁ బొండని పంచిన దుండగంబునన్.**

తే. **ఎదురుగా వచ్చి వారు సోమేశ్వరులకు,**
**మ్రొక్కినంతనె యంగముల్ మొదలియట్లు**
**చక్కనై లింగచిహ్నల సహజమైన,**
**నర్థి వారలు గొలిచిరా నరుగునపుడు.**

తే. **గవనిపై లచ్చిప్రతిమయుఁ గరులురెండు**
**నుండఁ గాడికిఁ గట్టిన యక్షయుగము**
**గవనిఁ జొరకున్న సోమశేఖరు డెఱింగి,**
**తొలఁగుమని పంప నవి నేలఁ దునిసిపడియె.**

చ. **అది విని దూషకావళులు నాపురి యేలు ప్రతాపుఁడున్ భయా**
**స్పదులయి వచ్చి మ్రొక్కిన గృపామతి వారలఁగాంచి పంచి య**
**మ్మదనవిరోధి భక్తుల సమాదరణంబున గొంచుఁ బోయి సా**
**భ్యుదయమనస్కులై కొలుచుచుండఁగ నుండెను గొన్నిఘస్రముల్.**

వ॥ ఇట్లుండియు సోమేశ్వరుండు కాలత్రయవేదిగావున నాగామికాల్య కౌశల్యంబు నెఱింగి పిడుపర్తి శివరాత్రికొప్పయ్యగా రాదిగాగల తమ శిష్యుల నందఱఁ బిలిపించి యీదేశంబిఁకఁ దురుష్కులచే నాక్రాంతంబు గాఁగలదు, మాబోటి నియమస్థుల కిందునికి పొందుపడదని వారితో నిట్లనియె.

క. **ఈ రాజ్యంబున మాకిఁక, నారూఢిఁ జరించుచుండ ననువుపడదు, మీ**
**కీరాజసీమలో నొక, యూరు ఘటించిత్తు నందు నుండుండనుచున్.**

సీ. **తన శిష్యుఁడును నా ప్రతాపునిమంత్రియు,**
**నగు నిందుటూరి యన్నయ్యఁ బిల్వఁ**
**బనిచి నీవెప్పుడు భక్తితో నరవత్తు,**
**ముగుర నర్చింతువు ముఖ్యవృత్తి,**

తత్ప్రీతిగా మా వ్రతస్థుల కొకగ్రామ
మిప్పించు మీ ధరాధీశుచేత,
ననవుడు నతఁడు మహాప్రసాదంబని,
యిప్పించె దోకిపఱ్ఱిద్ధభక్తి,

ఆ. నందు ప్రతివసించి రరవత్తుముగురును, దాముప్రేమఁగనడ భూమికరిగి,
యచటభక్తులెల్ల నతిభ క్తిసేవింపఁ, గొంతకాలముండి యంతమీఁద.

ఆ. వార్ధకమ్ము గదియ వచ్చెనింద్రియముల, పాటవంబుడిగిన మద్వ్రతంబు
గడిదిగాన బాహ్యకర్మముల్మానిస, మాధినుందుననుచు మదిదలంచి.
క. నాపట్టిన వీరవ్రత, మేపట్టున వదలకుండ నిన్ని దినంబుల్
గాపాడిరి భక్తులిఁకన్, వ్యాపారము మానవలయు ననితలఁచిమదిన్.

చ. కలిమల భంగచంగ శివగంగకుఁ జెంగట కల్కెమన్పురిన్
బలకల గుంటిమాయిన సమాధి రచింపఁగఁ జేసి భూతిలోఁ
దలముగఁబోసి యందుపయిఁ దావసియించుచుఁ గావగ న్సుభృ
త్యుల నియమించి నిశ్చలతనుండె వృషేంద్ర పదాంతరంగుఁడై.

ఆ. అప్పుడీశ్వరుఁడు నిజాకృతిదాలిచి, పరమపురుషుకడకు నరుగుదెంచి,
రమ్ము కొనిచనియెద రజతాద్రికన విని, సోమధరునకనియె సోమగురుఁడు.

ఆ. ఈసమాధి లోకులిందఱు నెఱుగంగ, నిచ్చనన్నుశూలి యితరు లెరుగ
కుండఁ దలుపువెడలి కొనిపోవజనులెల్ల, బూటకీడు పాఱిపోయెనంద్రు.

క. నను నీసమాధి దెరవక, కొనిపోయిన నింతకతఁడు గ్రుళ్లకయున్నే
యనికొందు రితరులీనిం, దనుజెందక యుండనన్ను దగగొంపొమ్మా.

సీ. భవి చూడనంచు నాపట్టిన నియమంబు,కడమకాకుండఁగఁ బుడమిజనులు
నారూపనీరూపు నడుమగాంచుటదోఁప, నాకుఁబ్రియంబైన నందిరూపు
పటికంబుననుదాల్చి భర్గ, నీగర్భంబు, నందునన్నుధరించి సందియంబు
మానునట్లుగనీ సమాధిమీదటఁ గొంత, తడవుండి సద్భక్తతతినుతింపఁ



ఆ. గొంచుఁబొమ్ము రజతకుధరమ్మునకు నన్ను,
ననిన నట్లకొంచు నరుగు శివుని
సమ్ముఖమ్మునందు సమ్మదంబున నుండె,
సోమతుల్యుఁడగుచు సోమగురుఁడు.
(చూ.పద్య బసవపురాణము - I 28-46)

ఇఁక కర్ణాటసోమనాథ పురాణమున నీవిషయమె చెప్పఁబడెను. మరియు చక్రపాణి రంగనాథుడను వైష్ణవునితో సోమనాథునకు మతవిషయిక వాదము గలుగఁగ, నతనిపుత్రుడగు చతుర్ముఖ బసవేశ్వరునిచే నా వైష్ణవుని నోడించెను. పరాజితుడైన రంగనాథుడు శ్రీశైలమార్గగామియై మల్లికార్జునస్వామి దర్శనము చేయమిచే నతని నేత్రయుగ్మము పోవ నహోబిలనృసింహస్వామి ప్రేరణమున తిరిగి శ్రీశైలమునకు వచ్చి యందలి శివుని స్తుతించి నేత్రముల పొందగల్గి, పాల్కురికికిఁ బోయి సోమనాథుని క్షమార్పణవేడి, తత్పుత్రునివలన శైవదీక్షపొందెనని యందు వ్రాయబడినది. ఇంతకంటె నితనిగూర్చి యింకేమియు తెలియదు.

**ఇతని కులగోత్ర గురుమాతాపితరులు :** జంగమ వంశజుఁడైనచో వీరశైవ మతోత్కృష్టత వచ్చునని యెంచి, పాల్కురికి సోమనాథుఁడు సహజ వీరశైవజన్ముడైన జంగమకులజుడుగాని బ్రాహ్మణుడు గాడనియు, నందుచేతను బసవపురాణ పండితారాధ్యచరిత్రలో బ్రాహ్మణనింద చేసెననియు, సహజవీరశైవుల గోత్ర నామములగు వృషభ, నంది, భృంగి, వీర, స్కందులను గురుగోత్రములలో భృంగిరిట గోత్రికుడని యితడు తెల్పుకొనెననియు జంగములకు వేదాధ్యయనాధికారము గూడ గలదనియు, బండారు తమ్మయ్యగారు విశ్వసించుచున్నారు. (చూ. ఉగాదిసంచిక, దుందుభి- (1922), పుట 144 - విభూతి 111, 10 పుట 258; ఆంధ్రసాహిత్య పరిష్పత్రిక -XX 3-5). కాని యితఁడు రచించిన పండితారాధ్యచరిత్ర, చతుర్వేదసార, బసవరాజీయాదు లందు ప్రకటింపఁబడిన వేదమంత్ర, వైదికవిశిష్టాచార రహస్యములు బ్రాహ్మణేతరుల కగమ్యగోచరమగుటను బట్టియు, బ్రాహ్మణేతరులు వేదాధ్యయనార్హులుగారని, యీతఁడు సోమనాథభాష్యమున రచించిన వాక్యములఁ బట్టియు 'చతుర్వేద పారగుడ' నని పండితారాధ్యచరిత్రమున తాను తెల్పుకొనుట

చేతను, పండితారాధ్యచరిత్ర శ్రోతయగు పాల్కురికి సూరనామాత్యుఁడు సోమనకు మఱఁదియై, యాపస్తంబ సూత్రుఁడగుటను బట్టియు, వారి బాంధవ్యము వరుసకుఁ బెట్టికొనినదని విశ్వసించుటకు వీలులేని దగుటచేతను, పలువురు కర్ణాటకవు లీతని నారాధ్యనామముతోఁ బేర్కొనుటచేతను, సోమనాథ పురాణమునందితఁడు వేమ నారాధ్యుని వంశమువాఁడని తెల్పఁబడినపు డా వేమనారాధ్యుడు బ్రాహ్మణుడని, పండితారాధ్య చరిత్రమందొక భూవరుఁడాతని నమస్కారమున కాశీర్వదించ నందులకై నుడివిన (చూ.పం.చ.111 పురాణప్రకరణము)

**'మహాభక్తవరులు భూసురులు**
**హరవేషధరు లఘహరులు, చిత్పరులు**
**మీరని మ్రొక్కుడు మేలొందుమనక**
**యూరక యుండుట యుచితమె యెంచ,'**

ఈ వాక్యములఁబట్టి స్పష్టమగుటచే నితడు బ్రాహ్మణకులజుడని నిర్ధారితమగుచున్నది. మఱియు 'పాల్కురికిసోమన పతితు'డను నోరుగంటిలోని ధూర్తవిప్రుడుపల్కు నిందావాక్యములఁ బట్టియే నితఁడు విప్రుడని తేలుచున్నది. ఈతఁ డారాధ్యబ్రాహ్మణుడనియే పలువురు పండితశ్రేష్ఠులు తలఁచుచున్నారు. మఱియు వీరశైవ మతారంభకాలమగు సోమనాథుని కాలమున 'జంగమ' పదము 'చరలింగ' మను నర్థమున శైవమతదీక్షితులకు, గురువులకు, నాశ్రమ స్వీకృతులకు, యోగులకు మాత్రమే యుపయోగింపఁబడినదిగాని, జాతివాచకముగ వ్యవహారమున లేదు. ఇటీవల నది జాతివాచకముగ పరిణమించినది. జంగమపదము జాతి వాచకముగా ప్రాచీన శైవగ్రంథములందుగాని, శాసనములందుగాని లేదని వేటూరి ప్రభాకరశాస్త్రి, చిలుకూరి నారాయణరావుగార్లు గూడ బసవపురాణ పండితారాధ్య చరిత్ర పీఠికలందు తెలుపుచున్నారు. ఆరాధ్య బ్రాహ్మణపదముగూడ జాతిపరముగ పూర్వమెక్కడ లేదనియు, నది పూజ్యులు, గురువు లనునర్థమున నాఁడు వ్యవహరింపఁబడెడిదనికూడ నారాయణరావుగారు వ్రాయుచున్నారు. (చూ.ప.చ. పీఠిక. పుట80-82) కాని పూర్వపు టారాధ్యబ్రాహ్మణులు లింగధారులుగారని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాయుచున్నారు. (చూ.బ.పు.పీఠిక) నన్నెచోడుని కుమారసంభవ



కృతిపతియగు మల్లికార్జునయోగి 'జంగము'డని 'భూసురు'డని పెక్కుచోట్ల వ్రాయఁబడెను. కాన శైవ బ్రాహ్మణులలో గురుదీక్షఁబొందినవారు వీరశైవులై, గురుగోత్రమును స్వీకరించెడివారు; ఇతరులు పాల్కురికి సూరనామాత్యునివలె హరితస గోత్రాదులు గలవారు. కాని యట్టివారు భవులని తలంచ వీలులేదు. అట్లయినచో సోమనాథుఁడతనిని శ్రోతగా చేయునా? భవులదర్శనముగూడ చేయనివాడుగదా సోమన. కాన వీరశైవులలోఁ గూడ చాతుర్వర్ణ్యము లానాఁడు గలవని యెంచవలసియున్నది. వీరశైవులలో,

క. **భువిలో శివదీక్షితులగు,**
**శివభక్తుల పూర్వజాతి చింతించుట రౌ**
**రవ నరక భాజనం బా**
**శివు పాషాణంబుగాఁగ చిత్రించుక్రియన్.** 181

అని యనుభవసారమున సోమనయే రచించియు, నా గ్రంథముననే తన్నుగూర్చి

క. **భృంగిరట గోత్రుఁడను, గురు**
**లింగ తనూజుండ శివకులీనుఁడ దుర్వ్యా**
**సంగ వివర్జిత చరితుఁడ**
**జంగమ లింగ ప్రసాద సత్ప్రాణుండన్.** 32

అని తెల్పుకొనినాఁడు

ఆ సంప్రదాయము ననుసరించియే ప్రథమమున బసవపురాణమందు

**'భ్రాజిష్ణుఁడగు విష్ణురామిదేవుండు**
**తేజిష్ణువగు శ్రియాదేవియమ్మయును**
**గారవింపఁగ నొప్పు, గాదిలిసుతుఁడ'**

అని చెప్పికొనినాఁడు. అప్పటికీతని తలిదండ్రులు బ్రతికియే యుండవచ్చును. కాని పండితారాధ్యచరిత్రము రచించునాఁటికిఁ దన వీరశైవము పూర్తిగ ముదిరి,

**'పెనుపారుభక్తుల పెంపుడుకొడుక**
**బసవనిపుత్రుండు బసవగోత్రుండ,**
**బసవన యిలుబడ్డ బసవనికొడుక'**

అని భక్తితన్మయమున వ్రాసికొనెను. ఈ సత్యమును గుర్తింపలేక యాంధ్రకవుల చరిత్రమున, కందుకూరి వీరేశలింగముగారును, నాంధ్రుల చరిత్రమున చిలుకూరి వీరభద్రరావుగారును గూడ తికమకలు పడిరి. శివదీక్షితుఁడగుచే నితఁడు గులగోత్ర మాతాపితరుల నామముల స్పష్టముగాఁ జెప్పికొనలేకపోయెను.

ఈతని కవితాగురువు కరస్థలి విశ్వనాథుడని 'సకృపాత్ముఁడగు కరస్థలి విశ్వనాథు ప్రకటవరప్రసాద కవిత్వయుతుఁడు' అని బసవపురాణముననను,

**ఆ. 'విమల చిత్రపూర్తి విశ్వేశుకారుణ్య**
**జనిత విమల కావ్యశక్తియుతుఁడ'**

అని యనుభవసారముననను తెల్పుకొనెను. ఈతనికి శివదీక్ష నొసఁగిన మతగురువు గురులింగార్యుడు

**'గురులింగవర కరోదరజనితుఁడ' - బసవపురాణము**
**పేరెన్నఁబడిన శ్రీబెలిదేవ వేమ, నారాధ్యులకు పరమారాధ్యు దేవు,**
**మనుమని శిష్యుఁడ మద్గురులింగ, ఘనకరుణాహస్త గర్భసంభవుఁడ'**

అని పండితారాధ్యచరిత్రముననను జెప్పికొనెను.

మఱియొకగురువు కట్టకూరి పోతిదేవరట.

'కట్టకూరి! పోతిదేవుని పదాంబుజషట్పదుఁడ' **(బసవపురాణము I)**

**ఈతని నివాసస్థలము :** పాల్కురికి సోమనాథుని యింటిపేరును బట్టి యతని నివాసస్థలము పాల్కురికి గ్రామమైయుండు ననుటయేకాక, 'అన్యవాద కోలాహల' కర్తయగు శివయోగీంద్రుఁడు దన కావ్యమున పాల్కురికి సోమనాథున కంకితముచేసి యందు పాల్కురికి గ్రామ మతని నివాసస్థల మైనట్లు తెల్పినాడు. ఆ పద్యమిది -

**సీ. భవదీయ సంబంధ బంధురంబయ్యె నే, భాగ్యంబుచేసెనో పాలకురికి,**
**భవదంఘ్రిపూజనా పరులకిమ్మయ్యె నే, భాగ్యంబుచేసెనో పాలకురికి,**
**యుష్మద్విహారసంయుక్తమై వెలసె నే, భాగ్యంబుచేసెనో పాలకురికి,**
**యుష్మదీయాశ్రయాత్యున్నతిఁబొందె నే, భాగ్యంబుచేసెనో పాలకురికి,**



**ఆ॥ పాలకురికి యెట్టి భాగ్యంబు చేసెనో,**
**నీ స్వనామ పూర్వనిహితమయ్యె.**
**ఈహితానుషంగ, మేకామ్ర గురుచిత్త**
**నలినభృంగ, సోమనాథలింగ.**

కాని యీ పాల్కురికి గ్రామమెక్కడయున్నదో నిర్ధారణచేయుటకు బలమైన యాధారములు లేవు. పిడుపర్తిసోమన పద్య బసవపురాణమున తెల్పిన యోరుగంటిలో ప్రతాపరుద్రుడు - బవసపురాణ పారాయణకథ ననుసరించి, యీపాల్కురికి గ్రామము నైజామురాష్ట్రములో నోరిగంటికి సుమారు 12 క్రోసుల దూరమున, నల్లగొండజిల్లా, జనగామ తాలూకాలో నున్నదనియు, ప్రస్తుతమది పాలకుర్తియను నామముతో వ్యవహరింపఁ బడుచున్నదనియు, సోమనాథుని కాలములో దానికి పాలకురికియను పేరుండి యుండుననియు, నీ కవివంశీయు లిప్పటికీ నీగ్రామమున నివసించు చున్నారనియు, నీగ్రామమందలి శివలింగమునకు గల సోమేశ్వరుఁడనుపేరే, యీతని తలిదండ్రు లితనికిఁ బెట్టినారనియు, నీగ్రామమును బట్టియే యీతని యింటిపేరు సిద్ధించినదనియు పలువురు తలఁచుచున్నారు. (చూ.బ.పు.8వ పుట; విభూతి **Vol. III. X. 157** పుట) కాని వరంగల్లునకు 70 మైళ్లదూరములోనున్న పాలకుర్తి, పాలకురికి కాజాలదనియు నిది యాంధ్రకర్నాటకదేశ సంగమంబున నుండియుండ వలయుననియు, నట్టిది యనంతపురం జిల్లాలోని మడకసిరా గ్రామమునకు 20 మైళ్ల దూరములో, మైసూరు రాష్ట్రములోని తుమ్కూరుతాలూకాలో 'హాల్కురికి' పేర నున్నదనియు, కర్ణాటమున 'హ' కారము, తెలుఁగున 'ప'కారముగా మారును గాన, నిదియే సోమనాథుని నివాసస్థలమని డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు పండితారాధ్యచరిత్రోపోద్ఘాతమున 1-7 పుటలందు వ్రాసియున్నారు. మఱియు పాల్కురికిసోమన బసవపురాణ పండితారాధ్యచరిత్రములను శ్రీశైల ప్రాంతమందుండి రచించినట్లుగా తెలియుచున్నదని నిరూపించి, వార్ధక్యమున లింగైక్యమునకై పోయిన కర్ణాట దేశమునందలి 'కలికె' మనుగ్రామముగూడ దీనికి సమీపముగా నుండుట యీవాదమునకు ప్రోద్బలముగ నున్నదని వారనిరి.

ఈ రెండువాదములును సోపత్తికముగ నున్నట్లే కనఁబడుచున్నవి. కాని ప్రస్తుతపు టనంతపుర మందలి 'హాల్కురికి' గ్రామము ప్రాచీనమైనదా కాదా యనియు, వరంగల్లు ప్రాంతపు ప్రస్తుత 'పాలకుర్తి' ప్రాచీనపు పాలకురికి యగునాయనియు, వరంగల్లులో జరిగిన ప్రతాపరుద్రుడు, బసవపురాణ శ్రవణకథ ననుసరించి, యనంతపురము జిల్లాలో, పాల్కురికిలో, సోమన రచించిన బసవపురాణము స్వల్ప కాలములోనే యంత శీఘ్రముగ ప్రచారమొంది యోరుగంటిలో పారాయణ చేయఁ బడుటయు, సోమనశిష్యు లవమానితులై దూర దేశముననున్న సోమన నెడ్లబండిపై శీఘ్రముగా తీసుకొనివచ్చుటయు సంభావ్యముగను, సహేతుకముగ నుండునాయనుట విచార్యము. మఱియు హాల్కురికిలో సోమనాథుని వంశీయు లిప్పటికిని గలరా, యట్టివారు పాలకుర్తియందిప్పటికి నున్నమాట వాస్తవమా యని విచారింప వలయును. శైవక్షేత్రమైన శ్రీశైలమును పండితారాధ్యుఁడు వార్ధకముననే దాక్షా రామము నుండి రాఁగ, నైజాము ప్రాంతమునుండి యే శివరాత్ర్యాది యుత్సవములకో పలుమార్లు సోమనాథుఁడు వచ్చియుండుననుట యసంభావ్యము గాదు. అట్టిసమయములందు శివభక్తులసన్నిధి తనగ్రంథములవ్రాయ సంకల్పించుకొని తన స్వగ్రామమునకుఁ బోయి రచించి యుండవచ్చును. అంత మాత్రమున తనగ్రామము శ్రీశైలప్రాంతమే కావలయునని నిర్ణయింపనక్కరలేదు. శివభక్తులు సాధారణముగ శ్రీశైలమున కనేక పర్యాయములు వచ్చుచు పోవుచు నుండుట సహజమే. ఇఁక గ్రామపర్యాయవాచియగు 'కుఱికి' యనుకర్ణాటపదము తెలుఁగున 'కుఱ్ఱు' ఐనదని నారాయణరావుగారే వ్రాసియుండిరి. 'కుఱ్ఱు' ఔపవిభక్తి ప్రత్యయక్రమముతో 'కుర్తి' యగుట భాషాసంప్రదాయ విరుద్ధముగాదని తోఁచుచున్నది. ఉ॥ డోకిపఱ్ఱు - డోకిపర్తి; పిడపఱ్ఱు - పిడపర్తి, కాన ప్రస్తుతపు పాలకుర్తి ప్రాచీనకాలమున 'పాలకుఱ్ఱు' అనియు, తత్పూర్వము 'పాలకురికి' యనియు వ్యవహరింపఁ బడెడిదనుట సంభావ్యమే. బసవనమీఁదను వీరశైవమతముమీఁద నభిమానముచే పండితారాధ్యుఁడు కర్ణాటభాష నభ్యసించినట్లుగను, ప్రస్తుత కాలమున గాంధిమీఁదను, కాంగ్రెసుమీఁద నభిమానముగలవారు హిందీభాషనభ్యసించినట్లుగనే, సోమనాథుఁడుగూడ కన్నడభాష నభ్యసించి పాండిత్యము సంపాదించి యుండ వచ్చును. దానికొఱకై యితఁడు చిలుకూరి నారాయణరావుగారు తలంచినట్లుగా, కర్ణాటదేశ ప్రాంతమం దున్నవాఁడు గానక్కరలేదు.



మఱియొక చక్కనియుపపత్తినాకుఁ దోఁచుచున్నది. సోమనాథుని కృతులలో ననుభవసార మాదికావ్యమని దానిరచనను బట్టి యనేకు లంగీకరించిరి. మిగిలిన కృతులన్నింటి యందు ముందు బసవేశ్వరుని, తర్వాత పండితారాధ్యుని సోమన స్తుతించినాఁడు. బసవనిపేర మూఁడు నాల్గుకృతులు రచించినాడు. ఇట్టితఱి యనుభవసారమున పండితుని మాత్రముస్తుతించి బసవనామస్మరణమైనను చేయలేదు. సోమనాథుఁడు కర్ణాటదేశ ప్రాంతనివాసియైనచో పండితునికంటె బసవననే ప్రారంభమున నెఱింగి స్మరించి స్తుతించి యుండునుగాని విస్మరించియుడడు. కాన సోమన యోరుగల్లు ప్రాంతనివాస గ్రామమున ప్రారంభమున ననుభవసారమును వ్రాయుచు, తదీయ సమీప దేశవర్తియగు పండితునిపై భక్తిగల్గి దూరదేశవర్తియగు బసవనను గురించి యప్పటికి మాత్రము వినియుండక, తర్వాత క్రమముగా, పెద్దవాడై, వీరశైవ మతాభిమానమెక్కువైన తర్వాత, దూరకర్ణాటదేశీయుడైన బసవనను గూర్చి విని యతనిపై నెక్కువ భక్త్యభిమానములు నిల్పియుండవచ్చును. దీనినిబట్టి సోమన నివాసస్థలమును పూర్వ కథానుగుణముగ నోరుగంటి ప్రాంతమని తలఁచిన నిర్దోష మగునని నా యూహ.

**ఈతని జీవితకాలము** : పిడుపర్తి సోమన తనపద్యబసవపురాణమునఁ దెల్పిన ప్రతాపరుద్రు డోరుగంటి బసవపురాణ శ్రవణకథను బట్టియు పాల్కురికి సోమనాథుఁడు, ప్రతాపరుద్రుని మంత్రియు, తన శిష్యుఁడునైన యిందులూరి యన్నయచే పిడుపర్తి శివరాత్రి కొప్పయ కిప్పించిన డోకిపఱ్ఱగ్రహారము నడుమ నంకిలిపడగా కొప్పయ మనుమఁడు ప్రౌఢరాయునిచేఁ దిరిగి పడిసిన విషయ కాలమును (చూ.పద్య.బ.పు.ఆ.I పీఠిక, ప 54) బట్టియు,పాల్కురికి సోమనాథుఁడు క్రీ.శ.1292 నుండి 1326 సం॥ వరకు రాజ్యము చేసిన ప్రఖ్యాత ప్రతాప రుద్రుని కాలమువాఁడని కందుకూరి వీరేశలింగముగారు కవులచరిత్ర ప్రథమ ముద్రణమున వ్రాసిరి. కాని వారికింకేమియు నుపపత్తులు చూపలేదు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గూడ బసవపురాణ పీఠికయందట్లే మొదట తలంచియు, తర్వాత దీనికంటె బలమైనదని యెంచి వేరుకారణముతో దానిని పూర్వపక్షము చేసి పెడదారిని పట్టిరి. కందుకూరి వీరేశలింగంపంతులుగారుకవులచరిత్ర పరిష్కరణ ముద్రణమున తమ

పూర్వభావమును మార్చికొని ప్రభాకరశాస్త్రిగారివలె నీ కవి క్రీ.శ.1220 పూర్వము వాడని తెల్పిరి. ఆవాదమిది. కర్ణాటభాషలో నుద్భటుని కావ్యమందు వృషభస్తవము చేసిన సోమనను పొగడిన సోమరాజునుకవి క్రీ.శ.1222లో నున్నట్లు కర్ణాటకవి చరిత్రకారుడు వ్రాయుటచే పాల్కురికిసోమన యంతకుఁబూర్వుడుకావలయునట. దీనిని వేదప్రమాణము నంగీకరించి యితరాంతర బాహ్యప్రమాణములనుగూడ ప్రభాకరశాస్త్రిగారు తదనుగుణముగ వ్యాఖ్యానము చేసిరి.

బసవపురాణమున,

> **'పండితారాధ్య కృపాసముద్గతుఁడు....**
> **కరస్థలి సోమనాథయ్యగారు'**

అని సోమన రచించుటచే, కరస్థలి సోమనాథయ్యగారు పండితారాధ్యుని శిష్యుఁడైన సమకాలికుఁడనియు, బసవ పండితారాధ్యులు క్రీ.శ.1170 నాఁటికే లింగైక్యమొందుటచే వారి శిష్యులతో సంభాషించిన మనకవి 1190 సంవత్సరములు దాటి యుండుననియు, పండితారాధ్యచరిత్ర రచనాకాలమునకు పండితుని పుత్రపౌత్ర శిష్యులు సజీవులైయున్నారని భావించి, పాల్కురికి సోమన క్రీ.శ.1132 నుండి 1198 సంవత్సరము వరకు జీవించియున్న రుద్రదేవుని కాలమువాఁడని నిర్ధారణ చేసి, రుద్రదేవునే, చరిత్రజ్ఞానము విశేషముగా లేనట్టి పిడుపర్తి సోమన పాల్కురికి సోమనాథకవి కాలమునకు చాలా తర్వాత జీవించియుండుటచే తెలియక ప్రతాప రుద్రుఁడని పేర్కొనెనని సమాధానపఱచిరి. కాని యీమతమునకు ప్రతిబంధకములు చాలాయున్నవి. పండితారాధ్యచరిత్రమున,

> **'పేరెక్కఁదగిన శ్రీబెలిదేవివేమ**
> **నారాధ్యులను పరమారాధ్యదేవు**
> **మనుమని శిష్యుఁడ'**

అని రచించుటచే నీ వేమనారాధ్యుఁడు పండితారాధ్యుని సమకాలికుఁడు గాన నీకవి వారల తర్వాతవాఁడు కావలయునేకాని, బసవ పండితారాధ్యుల జీవిత కాలములో నుద్భవించియుండుటకు వీలులేదు. మఱియు పండితారాధ్య చరిత్రావసానమున, పండితుని కుమారుఁడైన కేదారయ్య పుత్రచతుష్టయముయొక్క



> **'గురుచతుష్క మాత్మసంతాన**
> **తనయపరంప రోత్తరపరంపరలు**
> **పరిచిత గురు పరంపర తేజరిలు'**

అనియు; పండితుని సమకాలమువాఁడైన ఇవటూరి సోమనాథయ్యగారి పుత్రత్రయము,

> **'గురుత్రితయాన్వయ తనయ**
> **తనయపరంప రోత్తర పరంపరలు**
> **ప్రభుతర గురుపరంపర తేజరిల్ల'**

అని సోమన రచించుటచే, పండితారాధ్య పాల్కురికి సోమనల మధ్య ననేకతరములు గడచినట్లు గనఁబడుచున్నది. కావున.

> **'పండితారాధ్య కృపా సముద్గతుఁడు**
> **కరస్థలి సోమనాథయ్యగారు'**

అనఁగా పండితు నుపాసించుటచే పుట్టిన యని యర్థము చెప్పవలయును.

మఱియు పాల్కురికి సోమనాథుఁడు క్రీ.శ.1180 సంవత్సరము తర్వాతి వాఁడు గానిచో, ననఁగా బసవ పండితారాధ్యులకు నితనికి సుమారు 20 సంవత్సరములు అంతరమున్నచో నితఁడు వారిని ప్రత్యక్షముగనే యెఱిఁగి యుండును. కాని వారి చరిత్రమును బసవపురాణమున తెల్పినట్లుగ,

> **'అసదృశంబై యొప్పు బసవపురాణ**
> **మెసకంబుతోఁ జెప్ప నిష్టమయ్యెడిని,**
> **వర కథాసూత్రంబు వెరవెఱింగించి**
> **చరితార్థుఁ జేయరే కరుణతో ననుచు'**

బసవనను గూర్చి తన యజ్ఞానమున వెలిబుచ్చుఁడు కదా. మఱియు నీతని ప్రథమ కృతియైన 'అనుభవసార' ప్రారంభమందు పండితుని స్తుతించినాఁడు గాని బసవని స్మరింపనైనలేదు. మిగిలిన కావ్యములందు పండితుని కంటె బసవని విశేషగౌరవ ప్రపత్తులతో స్తుతించినాఁడు. కాన ననుభవసార రచనాకాలమునకు పాల్కురికి సోమ

నాథుఁడు బసవని పేరైన వినియుండడు. అందుచేతనే బసవపురాణమున నట్లు వ్రాసియుండును.

ప్రస్తుతకాలమున గాంధికంటె 20 సంవత్సరములు చిన్నవారగు స్వదేశాభిమానులును, గాంధియందభిమానులు నతనినెఱుఁగక, చూడక యుండగలరా! అట్లే వీరశైవమాతాభిమానియు, బసవాభిమానియునైన సోమన యతనికంటె 20 సంవత్సరములు చిన్నవాఁడే యైనచో తానే ప్రత్యక్షముగా నతనిని దర్శించి యెఱిఁగియుండెడి వాఁడుగాని పరోక్షజ్ఞానముతో నతనికిఁ బనియుండెడిది కాదు. పండితారాధ్యుఁడు బసవన దూతలతో సంభాషించి, యతనిని ప్రత్యక్షముగాఁ జూచుటకు ప్రయత్నించెను కదా. కాన బసవనకాలమున సోమన జీవించియుండె ననుట పొసగదు.

మఱియు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, సోమనాథుని గురువును నిర్ణయించు నపుడు చూపిన ప్రమాణవాక్యమగు (చూ.బ.పు.పీ.14 పుట)

**'పేరెక్కఁదగిన శ్రీ బెలిదేవి వేమ**
**నారాధ్యులను పరమారాధ్య దేవు**
**మనుమని శిష్యుఁడ'**

అని పాల్కురికి సోమన, పండితారాధ్య చరిత్రమున రచించిన వాక్యము లతని కాల నిర్ణయముపట్ల ప్రభాకరశాస్త్రి గారేల గ్రహింపలేదో తెలియదు.గ్రహించినచో నితఁడు 1190 తర్వాతివాఁడు గాఁడని వ్రాయుట సాహసము, లేక యిది వారిమతమున, కాలనిర్ణయమునకు ప్రమాణముగ లేదేమొ. సోమన 1190 తర్వాతివాఁడు గానిచో పండితారాధ్య లింగైక్య కాలమగు 1170 సంవత్సరమునకు సోమన కథమపక్షము 30 సంవత్సరములు వయస్సుండును. అప్పటికి పండితునికి సుమారు 60 సంవత్సరములు వయస్సు గల్గిన వేమనారాధ్యుడు, 70 సంవత్సరములు వయస్సువాఁడై యుండు ననుకొనినచో, నతని మనుమడు 20 సంవత్సరములు వాఁడు కాఁదగును. ఇతఁడు 30 సంవత్సరములు వయస్సుగల సోమనాథునకు గురువగుట యసంభావ్యము. కాన గురువు 35 సంవత్సరముల ప్రాంతమున శిష్యుఁడు 15 సంవత్సరముల వాఁడగుట సుసంభావ్యము.



సోమనాథుఁడు ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమగు క్రీ.శ.1291-1323 మధ్య కాలమువాఁడగుచో, పండితారాధ్యుని లింగైక్య కాలమగు 1170 సంవత్సరమునకు 120 సంవత్సరములు పైగా జరిగి, పండితుని తర్వాత 5 లేక 6 తరములు జరుగును. కాన సోమన వేమనారాధ్యుని మనుమనికి శిష్యుఁడనుటకు, వేమనారాధ్యుని 5,6 తరముల మనుమఁడని యర్థము చెప్పికొనవలెను. బహిస్సాక్ష్యముకంటె సోమన వాక్యములగు నంతస్సాక్ష్యమే యెక్కువ ప్రమాణము. సోమనాథగురువుయొక్క తాతయగు వేమనారాధ్యుఁడు, పండితారాధ్యచరిత్రమున పేర్కొనఁబడినవాఁడు గాడని, డా.చి.నారాయణరావుగారివలె వాదించుచో (చూ.పం.చ.పీఠిక పుట 17) 'పేరెక్కఁదగిన శ్రీ బెలిదేవి వేమనారాధ్యుఁడ'ని సోమన తెల్పుటచే, నతడు తానురచించిన పండితారాధ్యచరిత్రమున ప్రసిద్ధుఁడై, పండితునకు సమకాలికుఁడైన వేమనారాధ్యుఁడేకాని, తత్పూర్వుఁడుగాని, తత్పరమందున్నవాఁడు గాని కాదగఁడు. అట్లే యగుచో నప్రఖ్యాతుని మనుమని శిష్యుఁడని చెప్పికొనుట కంటే, గురువు పేరును మాత్రమే చెప్పికొనును కదా.

పాల్కురికి సోమనాథుఁడు తన శిష్యుడైన పిడుపర్తి శివరాత్రి కొప్పయ్యకు ప్రతాపరుద్రుని మంత్రియు తనకు శిష్యుడునైన యిందులూరి అన్నయ ప్రెగ్గడచే నిప్పించిన డోకిపఱ్ఱగ్రహార మతని మనుమఁడగు పెద్దసోమయ్య కాలమున నంకిలి పడగా ప్రౌఢదేవరాయల సాయమున తిరిగి సంపాదించెనని పిడుపర్తి సోమనాథుఁడు తన పద్యబసవపురాణమున చెప్పెనుకదా. మొట్టమొదట నాయగ్రహారము బడసినది ద్వితీయ ప్రతాపరుద్రుని రాజ్యపరిపాలనా కాలమందలి క్రీ.శ.1309 సంవత్సరమగుచో, తరమునకు 30 సంవత్సరముల చొప్పున చూచినచో పెద్దసోమన కాలము 1399 లేక 1410 అగును. ఈ కాలముననే మొదటి ప్రౌఢదేవరాయలు విజయనగర రాజ్యము చేయుచుండెను. కాన నీకాలము గూడ తగ్గినట్లు సరిపోవుటచే పాల్కురికి సోమనాథుఁడు ద్వితీయ ప్రతాపరుద్రుని కాలము వాఁడనుట స్పష్టము. త్రికాలవేదియగు పాల్కురికి సోమనాథుఁడు ప్రతాపరుద్రుని దేశము త్వరలో తురుష్కాక్రాంతమగుననియుఁ జెప్పెను. మహమ్మదీయులు మొట్టమొదట కాకతీయ రాజ్యముపై దండెత్తివచ్చినది క్రీ.శ.1302-1303 సంవత్సరమున. అప్పుడు

కాకతీయులే గెలిచిరి. తిరిగి 1309 సంవత్సరమున తురకలు దండెత్తి రాఁగ ప్రతాప రుద్రుఁడు వారితో సంధి గావించుకొని కప్పముకట్టుట కంగీకరించెనట. కడకు 1323 సంవత్సరమున తురకలు మరల దండెత్తివచ్చి ప్రతాపరుద్రుని ఢిల్లీ నగరమునకు పట్టుకొనిపోయిరి. తురుష్కులు కాకతీయరాజ్యముపై దండెత్తి వచ్చిన కాలము గూడ పాల్కురికి సోమనాథుఁడు చెప్పిన కాలమునకు సరిపోవుటచే సోమనాథకవి ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమువాఁ డనుట రూఢియగుచున్నది. ఓరుగల్లున స్వయం భూదేవాలయమున బసవపురాణ శ్రవణమునకు వచ్చినది ద్వితీయ ప్రతాప రుద్రుఁడే యనుటయు దీనివలన నిశ్చయము.

ఇందులూరి అన్నయమంత్రి పెదతండ్రియగు సోమయ తనూజుడైన మనుమ గన్నయ వంశమునఁ బుట్టిన గణపతిదేవుఁడు రచించిన శివయోగసారమున నిందులూరివారి వంశము విపులముగా వర్ణింపబఁడినది. అన్నయమంత్రి పెద తండ్రియగు సోమయ కొలనిమండలికులను జయించుటచే నాతని వంశమునకు కొలనివారను పేరు వచ్చెను. అన్నయమంత్రి తండ్రి పెదగన్నయ, తల్లి గౌరమ. కాకతీయ గణపతిదేవుని కుమార్తెయగు రుద్రాంబకును, చాళుక్య వంశములోనివాఁ డగు వీరభద్ర మహారాజునకు గలిగిన రుయ్యాంబ నిందులూరి యన్నయమంత్రి వివాహమాడెను. కాన నితఁడు ద్వితీయ ప్రతాపరుద్రునకు పినతల్లి భర్తయై, రాజునకు మంత్రియు దండనాథుఁడునుగా నుండి మహమ్మదీయుల దండయాత్రల కాలమున నున్నవాఁడనుట స్పష్టము. ఈతఁడు పరమ శివభక్తుడై పాల్కురికి సోమనాథునకు శిష్యుఁడయ్యెను.

త్రిపురాంతక మందలి త్రిపురాంతకేశ్వరాలయమున చీకటిమిద్దె యుత్తర గోపురపు మేడమీద నీ యన్నయమంత్రి క్రీ.శ.1291 సంవత్సరమున త్రిపురాంత కేశ్వరుని కఖండ దీపారాధనము నిమిత్తము 50 ఆవులు దానము చేసినట్లు శాసన మున్నది. (Ep.Coll,238 of 1905) మఱియు నీ యిందులూరి యన్నయమంత్రియే భీమేశ్వరస్వామికి 500 నిష్కములను సమర్పించి దాక్షారామాలయమున శాసనము వ్రాయించినాఁడు. (S.I.I.Vol.IV. No.1307) ఇది క్రీ.శ.1293 సంవత్సరము నాఁటిది. గోదావరిజిల్లా పలివెల శ్రీ కొప్పేశ్వరస్వామి యాలయమున కాకతి ప్రతాపరుద్ర



మహారాజు రాజ్యము చేయుచుండ నాతని మహాప్రధాని యన్నయప్రెగ్గడ కభివృద్ధికి గాను క్రీ.శ.1317 సంవత్సరమున చేసిన దానమునకు శాసనము కలదు. (S.I.I.Vol.V. No.1) శివరాత్రి కొప్పయ్య కన్నయమంత్రి డోకిప ఙ్ఞగ్రహారమున నిప్పించిన శాసనముగూడ దొరకవచ్చును. ఈ శాసన ప్రమాణమును బట్టి గూడ పాల్కురికి సోమనాథుఁడు ద్వితీయ ప్రతాపరుద్రుని రాజ్యపరిపాలన కాలమున నుండెననుట స్పష్టము.

**కవి వైదుష్యము**: ఈతనిపాండిత్య మపారము, నపూర్వము, నసమానము. సర్వతోముఖమునై యితఁడు సర్వజ్ఞుఁడుగా గనిపించుచున్నాఁడు. ఈతనికి చతుర్వేదములు, షట్శాస్త్రములు, నష్టాదశ పురాణములు, చతుఃషష్టికళలు, విద్యలు, కావ్యనాటకాలంకార శాస్త్రములు, కవితామర్మము, వివిధవేదాంతశాఖలు, భాష్యములు, వివిధమత సిద్ధాంత, సంప్రదాయములు, బహుభాషలు, ననేకదేశ సాంఘికా చారములు, నానావిధాహార విహార వేషవైఖరులు, లోకవ్యవహారము మొదలైన వన్నియు తెలియునని యీతని సోమనాథభాష్యము, చతుర్వేదసారము, పండితారాధ్య చరిత్రము మొదలైనవి చాటుచున్నవి. ఇట్లని యీతఁడు కేవలము వైదిక ఛాందసుఁ డుగాక, పరమలౌకికుఁడు. ఒక విధముగా పండితారాధ్యునికంటె నెక్కువ ప్రజ్ఞా పాండిత్యములుగల కవిశ్రేష్ఠుఁడుగ నితఁడు గనిపించుచున్నాఁడు.

ఈ పాండిత్యమంతయు వీరశైవమతమునకుఁ బ్రామాణ్యముఁ గూర్చుటకును, పరమతముల ఖండించుటకు, నాయా గ్రంథములనుండి ప్రమాణ వాక్యముల నుదాహరించుటకు, కొన్నింటికి తన శైవమతానుకూలముగ ననువదించి వ్యాఖ్యానము చేయుటకు నిష్టమువచ్చినట్లు పయోగించుకొనెను. మఱియు బహు భాషలందు రసవత్కవిత్వము వ్రాయఁగలవాఁడు. ఇన్నింటియం దితనికి మిడిమిడి జ్ఞానముగాక లోఁతు వైశాల్యముగల కూలంకష పాండిత్యముగలవాఁడు. శ్రీనాథాదులకంటె గూడ నెక్కువ పాండిత్యము గలవాఁడితడు. దీనికిఁదోఁ డితఁడు పరమ నియమ నిష్ఠాగరిష్ఠుండు. ఇది బాహ్యాటోపమునకుఁ గాక త్రికరణశుద్ధమైనది. తాను విశ్వసించిన వీరశైవమతముపైనను, తా నారాధించు దైవమగు శివునిపైన గల భక్తికి మితిలేదు. వానికిఁ దన ప్రాణనాథులైన సర్వస్వము త్యాగము చేయగల

ఆవేశపరుఁడు. అసలు వీరశైవమతమే యుద్రేకభూయిష్ఠమైనది. ఈతని పాండిత్యమునకు పరవాదులు భయపడి వశ్యులయ్యెడివారు. ఈతనికి 'తత్త్వవిద్యా కళాకలాప కవితాసార' 'అన్యవాదకోలాహల, ప్రత్యక్షభృంగీశావతార' 'జైనమస్తక విన్యస్త శాతశూల కలితబిజ్జల తలగుండుగండ బిరుదశోభిత' యను బిరుదములు గలవు.

పాల్కురికి సోమనాథుఁడిట్టి యపార పాండిత్యమును శ్రీనాథునివలె పండితుల మెప్పునకు రాజాదరణమునకు స్వపాండిత్యమును, కావ్యశిల్పమును ప్రకటించి, కావ్యప్రయోజనములైన 'యశసే- ర్థకృతే' ఇత్యాదులకొఱ కుపయోగింపక, కేవల స్వార్థరహితుఁడై మతప్రచారార్థ ముపయోగించెను. కాన నీతని కావ్యములు ప్రజాసామాన్యములో నావేశముగల్గించి మతప్రచారము చేయుటకై రచింపఁబడుటచే, నా దృష్టితో వీనిని జూడవలయునుగాని, పాండిత్య ప్రకటనదృష్టితో విచారించినచో, నాంధ్రశబ్దరత్నాకర కర్తవలె నీతని నికృష్టకవిగా పరిగణింపవలసివచ్చును. ఈతని కవిత్వ ప్రౌఢిమ, రచనావిధానము, లేక కూర్పు భాషాశైలి మొదలైన వానియందుగాక, భావోన్మీలనము, అపూర్వకల్పన, పాత్రపోషణము, రసౌచిత్యపోషణములు, కథా భాగముల పుష్టి వివిధభాగముల వర్ణనతో విషయము నేత్రములకుఁ గట్టినట్లు చిత్రించుట కథావస్తువుతో విగళిత వేద్యాంతరత్వమునుగూర్చి, తన్మయపూర్వకమైన రసావేశమును గూర్చుట మొదలైన వానియందు కాననగును. ఈతఁడు రచనావిధాన భాషాశైలులందు ప్రౌఢిమఁ గూర్చలేని యశక్తుఁ డెంతమాత్రము గాఁడు. కాని యట్లు వ్రాయుట యాతని సంకల్పము కాకపోవుటయేకాక, తనముఖ్యప్రయోజనమైన సామాన్య జనులకు సులభగ్రాహ్యమై మత ప్రచారమునకు సాయపడు నుద్దేశము భంజకమగును. తన శక్తిని ప్రకటించుటకై మచ్చున కక్కడక్కడ నుద్రేక పూరిత సందర్భములందు ప్రౌఢముగ వ్రాసినాఁడుకాన నాదృష్టితో నీతని కావ్యములఁ బరీక్షింపఁదగదు. ఈతని కవిత్వాశయములు వేరు.

**ఈతని కవిత్వాశయములు** : పాల్కురికి సోమనాథుఁడు దన కావ్యములను మత ప్రచారమునకై తదనుగుణముగ రచించినను నందు కావ్యగౌరవ మేమియుఁ గొఱతపడనీయక బాగుగ పోషించినాడు. అతనికిఁ గవిత్వమును గూర్చి మంచి యాశయములు నాదర్శములు గలవు. ఇవి కొంతవఱకు నన్నెచోడుని యాశయములఁ బోలియున్నవి. నన్నెచోడుఁడు దన కుమారసంభవమున



**చ. సరళముగాఁగ భావములు జానుతెనుంగున నింపుపెంపుతోఁ**
**బిరిగొన, వర్ణనల్ ఫణితి పేర్కొన, నర్థము లొత్తగిల్ల బం**
**ధురముగఁ బ్రాణముల్ మధుమృదుత్వ రసంబునఁ గందళింప న**
**క్షరములు సూక్తులార్యులకుఁ గర్ణరసాయన లీలఁగ్రాలఁగన్ 1.35**

**సీ. 'దేశిమార్గంబులు దేశీయములుగా, నలంకారములఁ దానలంకరింప - 36**

అని తెలిపినాడు. కాని యితని కావ్యము మాత్ర మీ యాదర్శముల బరిగణింపక నన్నయాది కవులవలె మార్గఫక్కియైన సంస్కృతపద్ధతియందే నడచినది. పాల్కురికి సోమనాథుఁడు మాత్రము తా నుద్దేశించిన కవిత్వ నియమములను బసవపురాణ పండితారాధ్యచరిత్రలలోఁ దప్పక యవలంబించి చూపినాఁడు. ఇతఁడు బసవ పురాణమున,

**'ఉరుతర గద్యపద్యోక్తుల కంటె**
**సరసమై పరగిన జానుతెనుంగు**
**చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ**
**గూర్చెద ద్విపదలు గోర్కి దైవారఁ**
**దెలుఁగుమాట లనంగవలదు, వేదముల**
**కొలఁదియగాఁ జూడుఁడిల నెట్టులనినఁ'** 1.పుట 5.

అని తెల్పి మఱియు పండితారాధ్యచరిత్రమున,

**ఒప్పదు ద్విపదకావ్యోక్తి నావలవ**
**దారూఢ గద్యపద్యాది ప్రబంధ**
**పూరిత సంస్కృత భూయిష్ఠరచన**
**మానుగా సర్వసామాన్యంబు గామి**
**జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు**
**నట్టులుఁగాక కావ్యప్రౌఢిపేర్మి**
**నెట్టన రచియింప నేర్చినఁజాలు**
**నుపమింప గద్యపద్యో దాత్తకృతులు**

**ద్విపదయు సమము భావింప నెట్లనిన'** **దీక్షాప్ర.పుట.18**

**'తేటతెనుంగున ద్విపద రచింతు'** **దీక్షాప్ర.పుట 18.**

ఈతఁ డుపయోగించినఁ 'జానుతెనుఁగు' పదమునకు సమ సంస్కృతోక్తియని కర్ణాటక లాక్షణికు లుపయోగించుకొనిరి. పామరులకు దెలియుటకై యతనికిట్టి శైలి యవలంబింపవలసి వచ్చినది. కాని నన్నెచోడున కీ మతప్రచార ప్రయోజనము పట్ట లేదు. అతనిది కావ్యశిల్ప దృష్టి.

సంస్కృతభాషయం దనుష్టుప్ ఛందము రచించుటకు, చదువుటకు, నన్వయముచేసికొనుటకు గూడ బహు సులభముగ నుండును. మఱియు వాల్మీకి రామాయణము నీ ఛందమున వ్రాయుటచే నయోధ్యలో శ్రీరాముని యెదుట కుశలవులు గానముచేయుటకుఁ గూడ ననువుపడినది. అటువంటి లఘువైన ఛందముగల్గి పాడుటకనువైనది తెలుగుభాషలో ద్విపద. ప్రాచీన దేశీయ వాఙ్మయమగు తోలుబొమ్మల వాండ్రపాటలు, స్త్రీల పాటలు, పడవవాండ్రపాటలు, గొల్లసుద్దులు మొదలైన పామరజనుల రచనములును, పండితారాధ్య చరిత్రలోఁ జెప్పబడిన,

**'ఆనందగీతంబు లర్థిపాడుచు శి**
**వానందలీలల నలరి యాడుచును**
**శంకరగీతముల్ సరసఁబాడుచును'** **మహిమప్ర.పుట.176.**

ఆనందగీతములు, తుమ్మెదపదములు, ప్రభాతపదములు మొదలైనవి కూడ నీ ద్విపదలును తద్వికారములు మాత్రమే యైయున్నవి. కాన నీ ద్విపద సర్వసామాన్య మైనదే కాని క్రొత్తది కాదు. పూర్వ మీ ఛందమున పామరవాఙ్మయము మాత్రమే యున్నది. కాని యంతకుఁబూర్వము పండితుఁడెవఁడు నీఛందమున కావ్యముల రచించలేదు. మఱియు నన్నయాదుల భారతాదులు వృత్త రచనతోఁ గూడుకొని సంస్కృత భూయిష్ఠమైన రచన గలదగుటచే, నా ప్రాచీన వాఙ్మయమును గూడఁగప్పిపుచ్చినది. సంస్కారశూన్యమై, పండితానాదృతమై, ప్రాచీనకాలమునుండి దేశమున జీర్ణమైయున్న గేయరచనమును, సర్వ జనాదర పాత్రముచేసి, సారస్వతగౌరవము గూర్చి, యందు కావ్యరచనమును జేసిన ప్రప్రథముఁడు పాల్కురికి సోమనాథుఁడు. ద్విపద కవిత్వమున కీతఁడు



చేసినమేలిది. ఈతఁడు దీనివలన నాశించిన ప్రయోజనము వేఱొకటి గలదు. గేయమువలె పాడుటకై యీ ద్విపద యనేక ప్రదేశములందు జంగమకథలుగా పాడఁబడి మతప్రచారమున కుపయోగించును. గేయమున గానముకూడ మిశ్రమగునుగాన, జనసామాన్యము బహు సులభముగ వశ్యులఁజేసి యుద్రిక్తులఁ జేయునుగాన, మతప్రచారమునకిది బహువిశేషముగ ప్రయోజనకారియగును. దీనికి తోడు ద్విపదకు పావనతనారోపించి, పండితారాధ్య చరిత్రమున,

'ఐహికాముష్మిక ద్వి, పద హేతువగుట ద్విపదగాఁగ పఱఁగు' అని యతి శయోక్తి గూర్చినాఁడు.

ఇట్లని యితఁడు దేశీయపద్ధతి, దేశీయచ్ఛందమున రచించిన మాత్రమున కావ్యమర్యాదలను, నాలంకారిక, లక్షణములను వీటఁబుచ్చలేదు. ఈతఁడు పండితారాధ్య చరిత్రమున,

**'సత్కృతి యన నూత్నసంగతి దనర,**
**తొమ్మిది రసములు దొలుకాడు దాని,**
**యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణ**
**మగు నలంకారంబు లసలారు దాని,**
**ద్విగుణార్థ భావముల్ దీటుకొనంగఁ'**

ఈ యలంకారముల నన్నింటిని కవి తన కావ్యముల చక్కగ నుపయోగించు కొనెను. నన్నెచోడుఁడు గూడ నీతనివలె ముప్పదియారలంకారములనే పేర్కొనెను.

'దశప్రాణంబుల పరిపూర్ణంబై' నవరస భావభరితంబై షట్త్రింశ దలంకారా లంకృతంబై, రమణీయంబైన' (కుమారసంభవము 1.45.) మఱియు పాల్కురికి సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమున

**'జాతులు రచనాప్రణీతులు గావ్య**
**నీతులు రీతులు నేతు లుట్టంగ**
**వరకవు ల్గొనియాడ వర్ణనకెక్క**
**ధరఁజెప్పఁ గృతియు నుద్యత్కృతిగాక।**

అని రచించెను. ఇఁక సంస్కృతాలంకారికులు పది కావ్యగుణముల మాత్రమే వివరింపఁగ, సోమన యీ క్రింది విధముగా 49దింటిని పేర్కొనెను.

**'సరళత సరణి, ప్రసన్నతసెన్ను । పరిణతి గణపద పద్ధతి శబ్ద**
**శుద్ధి, ప్రయోగసిద్ధి, గళా । సమృద్ధి నానుడి, వడిమితి, రతి యర్థ**
**పుష్టి, నైజము, రసపుష్టి, వినూత్న । సృష్టి, విశేష్య విశేషణశ్లేష**
**సొంపు, సుకుమారత పెంపు, మాధుర్య । మింపు, మృదుత్వంబు నింపోజ ఋజువు,**
**యమకంబు గమకంబు, యతిగతి, గార - కము, పూరకము, గ్రియకాంతి, విశ్రాంతి**
**రంగు బెడంగు, మెఱుంగు సమాన । సంగతి యక్షరశయ్య సంఘటన**
**నిపుణత, రసికత, నెఱి, సమాధాన, ముపమానమవధానముత్ప్రేక్షలక్ష్య**
**లక్షణవ్యక్తి, యలంకారయుక్తి । దఱత, సుమతి, విచక్షత యనిన'**

ఈ విధముగ ప్రాచీనాలంకారికులు నిర్దేశించిన వానికి వీనికి కొన్ని బేధములున్నవి. అట్లే యాలంకారికులు కావ్యదోషములను పది తెల్పగా నితడు 25గా పెంచుటయే కాక గొన్ని మతభేదములఁ గూఁడ గూర్చెను. అందివి,

**'జల్లి, పూరక, మపశబ్ద మక్రమము । వొల్లవిక్రియ జడ్డువొడ, వసంఘ**
**టన గాకు, వ్యర్థం బసంగతి, విరసంబు । వైకల్య, మత్యుక్తి వైరిపదము**
**దల విరుపస మగ్రత శిథిలబంధమొులు, ప్రబంధమ్ము గ్రామ్యోక్తికంఠ।**

**కము, ద్రాస, ఛందోవిరుద్ధం బాదియగు,**

ఈ విధముగా నితఁడు కావ్యలక్షణములందు గూడ స్వాతంత్ర్య మవలంబించినాఁడు. ఇందుచేఁ దనకావ్యము నిర్దుష్టముగా నుండవలెనని యాశించినాఁడు. కాని యితఁడు బసవపురాణమున (పుట 5) దెల్పిన

**'అల్పాక్షరముల ననల్పార్థ రచన**
**కల్పించుటయె కాదె కవి వివేకంబు'**

అను ధర్మము కావ్యమునకు ప్రశస్తమై ముఖ్యముగా నుండవలసినదైనను, దీనిని మాత్రము తన కావ్యముల నితనికి సమన్వయించుకొన సాధ్యము కాకపోయినది. ఈ సూత్రము ప్రకారము కావ్యరచన సాగించినచో నుత్కృష్టమై, వ్యంగ్యప్రధానమై, పండితైకమాత్రానుభవ యోగ్యమగును కాని, సామాన్యజనులకు గ్రాహ్యము కాదు.



అందుచే తన ముఖ్య ప్రయోజనమైన మతవ్యాప్తి సిద్ధించదు. కాన తన ముఖ్య ప్రయోజనమునకు భంజనమైన యా యుత్తమ కావ్యధర్మమును త్యజించి తన కావ్యముల కేవలము వాచ్య ప్రధానముగానే రచించినాఁడు. అందుచే నితఁడు వర్ణ్య విషయములను సవిస్తరముగా, సంపూర్ణముగా తనివి తీరునట్లుగా, స్త్రీ బాలురకుఁ గూడ కళ్ళకుఁ గట్టి, శల్యాశల్యమునకు పట్టి యాకర్షించునట్లుగా వర్ణించినాఁడు. ఇట్టి రచనచే పాఠకుల కావేశము గల్గును. ఇది కావ్యమునకు జీవకఱ్ఱ. ఈ కవితావేశమున ధారావాహిని యెచ్చటను కుంటుపడకుండ సాగును. అంతియేకాక యీతని కవితాధార పరుగులెత్తునే కాని మందగమనము చేయదు. ఈ కవితావేశము భక్త్యుద్రేకము గలదై, గానప్రేరకముచే తనివితీర వర్ణించిన దనుక నాపుటకుఁ గూడ సాధ్యముగాదు. దీని వలన కావ్యోన్నత్యమునకు భంగము వచ్చినను నితఁడు లక్ష్యము చేయఁడు. ఈ విషయమున మాత్రమే యీతనికి పోతనకవి సామ్యము వచ్చును. కాని, పోతన కవిత్వమందుగల మృదుమధురరచన మీతనియందు లేదు. ఈతని కవిత్వమువలె కొన్నిచోట్లనైనను పోతన కవిత్వము పేలవముగ, రోకటిపాటగా నెప్పుడు నుండదు. ఈతని వర్ణనలు, ప్రబంధములందలి దీర్ఘమైన యష్టాదశ వర్ణనలవలె కథా వేగమునకుఁ గూడ నడ్డు తగిలినవి. కాని దానినిఁ గూడ నితఁడు లక్ష్యము చేయలేదు. ఇట్లు తన ముఖ్య ప్రయోజనమైన మతప్రచారమున కడ్డుతగిలిన ముఖ్య కావ్యలక్షణమై, కావ్యాత్మ యనఁబడు, 'వ్యంగ్య' రచనను గూడ తిరస్కరించినాఁడు. ఈతని జీవిత మందలి 'నిర్లక్ష్యభావమే' యీతని కావ్యలక్షణ, భాషాలక్షణములందుగూడ వ్యాపించినది.

**ఈతని కృతులు - వాని వివరములు :** పద్య బసవపురాణమున పిడుపర్తి బసవన పాల్కురికి సోమనాథుని కృతుల నిట్లు పేర్కొనెను.

సీ॥ **బసవపురాంణబు, పండితారాధ్యుల**
**చరితంబు, ననుభవసారమును, జ**
**తుర్వేదసార సూక్తులు, సోమనాథ భా**
**ష్యమ్ము, శ్రీరుద్ర భాష్యంబు, బసవ**
**రగడ, గంగోత్పత్తి రగడ, శ్రీబసవాఢ్య**
**రగడయు, సద్గురురగడ, చెన్న**
**మల్లు సీసములు, నమస్కారగద్య**
**వృషాధిప శతకంబు, నక్షరాంక**

**తే. గద్యపద్యముల్, పంచప్రకారగద్య,**
**యష్టకము, పంచకము, నుదాహరణ యుగము,**
**నాదియగు కృతుల్ భక్తహితార్థబుద్ధిఁ,**
**జెప్పెనని భక్తసభలలోఁ జెల్లుచుండు. పీఠిక, 27.**

ఇందులో (1) అనుభవసారము (2) చతుర్వేదసారము (3) చెన్నమల్లు సీసములు (4) వృషాధిపశతకము (5) ఒక బసవోదాహరణము (6) బసవపురాణము (7) పండితారాధ్య చరిత్రమును మాత్రము తెలుఁగుకృతులు. ఇంక (1) సోమనాథభాష్యము (బసవరాజీయము) (2) రుద్రభాష్యము (3) అష్టకము (4) పంచకము (5) నమస్కారగద్య (6) అక్షరాంకగద్య (7) పంచప్రకారగద్య (8) ఒక బసవోదాహరణమును సంస్కృతకృతులు. వీనిలో రుద్రభాష్య మింతవఱకు గానరాలేదు. మిగిలిన కృతులు కన్నడభాషలో వ్రాయఁబడినవి.

ఇవికాక తెలుఁగుబాసలో సోమనాథస్తవమని మఱియొక గ్రంథము గలదని బండారు తమ్మయ్యగారు వాదించుచున్నారు. కాని తద్రచనను బట్టియది సోమనాథ కృతి కాదని పలువురు విశ్వసించుచున్నారు. మఱియు కర్ణాటమందలి సోమేశ్వర శతకము గూడ సోమనాథకృతి యనుటకు వీలులేదు. మిగిలిన వేవియు నీతని కృతులని దృఢముగ చెప్పలేము.

**అనుభవసారము** : రచనాశైలీ విభేదములఁబట్టి యిది సోమనాథుని ప్రథమకృతిగా గోచరించుచున్నది. (చూ. రజతోత్సవ సంచిక 168. పుట) ఈ గ్రంథశ్రోత గోడఁగి త్రిపురారియను మిత్రుఁడును, భక్తుఁడును. ఇందు కథారూపమైన యితివృత్త మేదియులేక 234 పద్యములుగల్గి, గురుభక్తిమహిమ, భక్తిస్వరూపము, భక్తిలక్షణము, శివపూజావిధానము, ఇష్టలింగార్చనావిధి, జంగమసేవ, షట్స్థల వివరణము మొదలగు శైవధర్మములు దెలుపఁబడినవి. ఈ గ్రంథమును సోమనాథుఁడు, నన్నయ వలె వృత్తములతో రచించి, క్రౌంచపదము, మాలిని, వనమయూరము మొదలగు విశేష వృత్తములఁ గూడ నిందు వాడెను. ఇందుచేతను, కవితాశైలిని బట్టిగూడ చూడఁగ బవసపురాణ పండితారాధ్య చరిత్రముల రచించునాఁటికి భాషయందు, ఛందమందు గల్గిన దేశీయసంస్కార మనుభవసార రచనాకాలమునకు గల్గినట్లు



గన్పడదు. ఈ గ్రంథమున సోమనాథుఁడు మల్లికార్జున పండితారాధ్యుని మూఁడు సీసపద్యములలో స్తుతించియు, బసవనిపేరైన నెత్తకుండుట యొక విశేషము. ఇందుచే నీ గ్రంథరచనా కాలమునకు బసవనిగూర్చి యీతఁ డెరుగఁడని యూహింప వచ్చును. ఈ కృతియం దితని యితరగ్రంథములందు గానఁబడు కర్ణాటాద్యన్య భాషాశబ్దములుగూడ గానరావు. శైలి కొంచె మెక్కువతక్కువగ నన్నయశైలివలె సంస్కృతపద మిశ్రమముగా నున్నది. ఈతని సీసపద్యము లే పాదమున కా పాదము విడివడియుండి, శ్రీనాథునకు మార్గదర్శకములైనవి. మఱియు పోతన రచించిన సుప్రసిద్ధమగు పద్యమైన,

**" సీ. మందార మకరంద మాధుర్యమునఁదేలు,**
**మదుపంబు లరుగునే మదనములకు"**

అను పద్యమునకు మూలమనునట్లు పూర్వమే సోమన యీ క్రింది పద్యము నిందు రచించెను,

**సీ. సద్గురు కరుణా లసత్పద భద్రుఁ డస్థిరరాజ్యవైభవ స్థితికిఁజనునె?**
**విస్తార భక్తిసంవిత సుఖార్ణవమగ్నుఁ, డితర సుఖశ్రేణి కిచ్చగిలునె?**
**నిత్యప్రసాద వినిర్మలామృత భోగి, స్వర్గోపభోగానుషక్తుఁ డగునె?**
**ప్రథిత లింగత్ర్వాణమథన జీవన్ముక్తు,............**
**గీ. భక్తజన హితార్థ పరమయోగ, భవ్య సౌఖ్యయోగ పరమానురాగ**
**సంసారదుఃఖ నాశ సత్కవీశ.......... 163. పద్యము.**

ఈ విషయమునే యింతకంటె స్పష్టముగ బసవపురాణ తృతీయాశ్వాస ప్రారంభమున సోమనాథుఁడు ద్విపదలలోఁ గూర్చినాఁడు.

**"క్షీరాబ్ధిలోపలఁ గ్రీడించు హంస,**
**గోరునే పడియల నీరు ద్రావంగఁ;**
**జూతఫలంబులు చుంబించు చిలుక**
**బ్రాతి బూరుగుమ్రాని పండ్లు గన్గొనునె;**

**రాకామలజ్యోత్స్నఁ ద్రావు చకోర,**
**మాకాంక్ష సేయునే చీకటి ద్రావ;**
**విరిదమ్మి వాసన విహరించు తేటి;**
**పరిగొని సుడియునే ప్రబ్బిల విరుల;**
**నెఱుఁగునే యల దిగ్గజేంద్రంబు కొదమ,**
**యెఱపంది చనుసీక నెరుగవు గాక,**
**యరుదగు లింగ సదర్థుల యిండ్ల,**
**సరవుడ నాకొక సరకె యర్థంబు.**

ఈ విధముగ పాల్కురికి సోమనాథుని కవిత్వరచన యనేక భావికవులకు మార్గదర్శకమైనది.

**బసవపురాణ పండితారాధ్య చరిత్రములు** : ఆంధ్రవాఙ్మయము లక్షణ గ్రంథములందేకాక, పురాణకావ్యనాటకాది గ్రంథరచన మందు గూడ విశేషముగ సంస్కృత వాఙ్మయము మీఁదనే యాధారపడియున్నది. ప్రారంభముననే నన్నయ భారతమును సంస్కృతమునుండి ఆంధ్రీకరించినాఁడు. నన్నయకు బూర్వమందలి దేశీయ వాఙ్మయమగు పాటలు, పదములు, గేయములు మొదలైనవేవియు, నేఁడు గానరావు. తమిళాది భాషలం దట్టివి జాగ్రత్త పరుపఁబడినను, తెలుఁగున నవి గ్రంథస్థము గాలేదు. కాన రూపుమాసినవి. నన్నయ తర్వాత నాంధ్రకవులందరు నన్నయ మార్గమునే యవలంబించి, సంస్కృత పురాణములనో, తదంతర్భాగములనో భాషాంతరీకరించి, మూలకథనేకాక, మూలమందలి వర్ణనములు, భావములుగల పద్యములను సంస్కృత వృత్తములలోనే యాంధ్రీకరించి, సంస్కృతమునకుఁ బూర్తిగ, దాస్యముచేసి దాని ననుకరించిరి. అందుచే నాంధ్రవాఙ్మయమునకుఁ బ్రత్యేక వ్యక్తిత్వము లేకపోయినది. ఆంధ్రకవులలో స్వాతంత్ర్యమును జూపినవారు బహుస్వల్ప సంఖ్యాకులు. కేవలము భాషాంతరీకరణము మాని, పురాణాంతర్భాగ కథను గైకొని, యష్టాదశ వర్ణనలను నవరసంబులను గూర్చి, సందర్భోచితముగ పాత్రరస పోషణమును జేసి ప్రబంధముల వ్రాయుట కృష్ణరాయని కాలమున నల్లసాని పెద్దన మూలమున ప్రారంభమై, నూతనోత్తేజముగల్గినది. కాని యదియు సంస్కృత



మార్గమునే యవలంబించినది. అందు కథ, వర్ణనావిధానము, శైలి, వృత్తములు మొదలైన వన్నియు సంస్కృత పద్ధతినే గ్రహించినవి. కాని యాంధ్రవాఙ్మయమున సంపూర్ణ స్వాతంత్ర్యమును జూపి, యాంధ్రతా ముద్రనువేసి, జాతీయ చ్ఛందమున, దేశీయ మార్గమున గ్రంథరచనముచేసి, సమకాలీనుల తిరస్కారముల కెదురించి, వారి సంప్రదాయములకు, సాంకేతికములకు నెదురీది జాతీయముద్ర నొసఁగిన ప్రథమకవి పాల్కురికి సోమనాథుఁడే.

పాల్కురికి సోమనాథుఁడు భక్తియందు తన్మయము చెందిన కవితావేశపరుఁ డగుటచేతను, గొప్పపండితుఁడై. కవితామర్మమెఱింగిన వాఁడగుటచేత, యేరసమును వర్ణించి నది సహజముగ నుండి, యే యలంకారమును గూర్చినది యుచితముగనొప్పి, వస్తువర్ణనములన్నియు నేత్రములకుఁ గట్టినట్లుండి, యెంతమాత్రము కృత్రిమములుగ దోఁచక స్వభావసిద్ధములును, నప్రయత్న పూర్వకములునై, భావప్రవాహము నెక్కడ కుండుపడనీయకుండెను.

ఈ కవి కావ్యవస్తువైన కథనే సంస్కృతపురాణమునుండి గ్రహింపక దేశీయ చరిత్రనుండి గ్రహించి, యా కథానాయకులను మహానాయక లక్షణోపేతులఁ జేసినాఁడు. బసవేశ్వర పండితారాధ్యు లీశ్వరభక్తులు మాత్రమే కాక ప్రమథుల యవతారమట, శివునితో సమానమైన శక్తిగలవారట. శివబసవేశ్వరుల సంబంధ మును కవియిట్లు నిరూపించినాఁడు.

ద్వి॥ **“బసవండు కేవలభక్తుఁడే తలఁప**
**నసమాక్షుఁ డా రూపమై నిల్చెఁ గాక;**
**బసవఁడు వసుధపైఁ బ్రభవించు నంత**
**బసవని నరుఁడని పలుకంగఁదగునె;**
**హరుఁడు నిరాకారుఁడై నచో బసవఁ**
**డరయంగ సాకారుఁడై చరియించు;**
**హరుఁడు సాకారుఁడై యలరుట సూచి**
**శరణుఁడై బసవండు సందులే కుండు;**
**శరణుఁడై బసవండు సందుసేకొన్నఁ**

బరమ భక్తిస్థితి బసవన్న గొలుచు;
భక్తుఁడై లింగంబు ప్రకృతి సేకొన్న
వ్యక్తిగా బసవన్న వరవుఁడు సేయు;
పరమాత్మ రూప మా బసవఁడే యెఱుఁగుఁ,
బరమేశుఁ డెఱుఁగు నా బసవని రూపు.
సాలోక్య సామీప్య సారూప్య పదవు
లోలిని బొంద సాయుజ్యంబుఁజెంద
వచ్చుఁగా కిల బసవస్వామిగాఁగ
వచ్చునే పెఱపెఱవారల కెల్ల"...... బసవ పు.5-6

ఇఁక శివపండితారాధ్యుల సంబంధమును కవి యిట్లు వర్ణించినాఁడు.

ద్వి॥ 'చిరతమోగుణ పరిస్ఫీతుండు శివుఁడు,
వరసత్త్వగుణ వికస్వరుఁడు పండితుఁడు,
అరయ నచరలింగ మా లింగమూర్తి
యరయఁగాఁ జరలింగ మా పండితయ్య;
అసమ లోకాధీశుఁ డంబికాధవుఁడు;
అసమ లోకారాధ్యుఁడా పండితయ్య,
అఖిల లోకమయుండు హైమవతీశుఁ
డఖిల లోకాతీతుఁడా పండితయ్య;
లోకానుసారి త్రిలోచనుండిల న
లోకానుసార శీలుఁడు పండితయ్య;
అరుదగు లోకసంహారుఁడు శూలి,
కరుణమై లోకోపకారి పండితుఁడు;
అసితకంఠుండు దా నసమలోచనుఁడు,
భసిత కంఠుండు శ్రీ పండితేంద్రుండు;
ఊర్ధ్వైక లోచనుం డుడురాజమౌళి,

యూర్ధ్వ ద్విలోచనుం డొగిఁబండితయ్య;
భక్తైక దేహుండు పరమేశ్వరుండు,



భక్తసత్ప్రాణుఁడు పండితస్వామి;
మల్లికార్జుననామి మల్లికార్జునుఁడు
మల్లికార్జున కీర్తి మల్లికార్జునుఁడు;
మహిలోనఁ బండిత మల్లికార్జునుని
మహిమలు వర్ణింప మనుజుల తరమె ? పండి.చ.1. 5-7

భాషాంతరీకరణకర్తలు మూలమందలి భావములనే గ్రహింతురు గాన వారికి మూల గ్రంథము మార్గదర్శకముగనుండి విశేషసాయమొనర్చును. ఒకవేళ మూలమునకుఁ గొంతమెఱుగు పెట్టినను గూడ కవియుత్పాద్యశక్తి, ప్రతిభ మొదలైనవి విశేషముగ వ్యక్తముగావు. కవికల్పనాశక్తియు, భావనాసామర్థ్యమును కేవలముత్పాద్యకావ్యము లందలి వర్ణనావైచిత్రి, యలంకారరచనము, రసపాత్రౌచిత్యాదిపోషణములు, శైలి మొదలైనవానియందు ప్రకటింపఁబడును. ఈ విషయములందు తన గ్రంథములను రమణీయముగ రచించుచో కవి, భాషాంతరీకరణములకన్న శ్రేష్ఠమగును. కాన నా విషయములను ప్రత్యేకముగ పరిశీలించి పాల్కురికి సోమనాథుని శిల్ప నైపుణ్యమును నిర్ణయింపఁదగును.

**(1) బాహ్యాకారచిత్రణము** : సోమనాథకవి పాత్ర బాహ్యాకార రేఖలను బహుస్వభావ సిద్ధముగ చిత్రించును. పండితారాధ్యచరిత్రమున శివుని చండాల వేషధారణ వర్ణన మిట్టిది.

ద్వి. నలి దొడ్డరుద్రాక్షములు, దొడ్డపటిక
ములు, సూలమాని పూసలపేర్లుఁదాల్చి,
కుఱువెంద్రుకల వెడకొప్పులోపలను,
గఱకంతుఁగట్టిన కరిగానిపింప
బలువుగా శివసూత్రముల వడగట్టి
మొలనరవణిఁ దూఱి తలనఱఁ జుట్టి,
యూరెయుఁగత్తియు నట్టలమూఁపు
వారెనల్ మోకులు వలచేతనొక్క
సెంబళికోలయుఁ జెన్నొంద శివుఁడు
పంబిత యంత్యజ భావంబు దాల్చి. పండి.చ.;ప్ర. - II

ఇట్లే బసవపురాణమున శివుఁడు గొల్లవేషమును ధరించుట వర్ణింపఁబడినది.

**ద్వి. ములుకత్తినుచ్చు కోకలుఁ జూడఁ గొడుపు**
**లలి తిత్తినిడి దొడ్డమొలఁ గచ్చకట్టి**
**గాలిదప్పపువెండ్రుకలు దూలియాడ**
**నీలవెట్టుచు నిఱిమిఱిమి చూచుచును,**
**గుక్కలఁబిలుచుచు ఊిక్కవెట్టుచును**
**నెక్కొన నొరగాల నిలుచుచుఁజనుచు,**
**గొడ్డలి బరిగమ్మికూటి కుండయును,**
**దుడ్డుఁ గోలయుఁబట్టి తొడితొడికొన్ని**
**మేఁకపిల్లలఁ దనచాఁకటి నిఱికి**
**వీఁకదబ్బరవాటు విసిరివ్రేయుచును**
**కొన్ని మేఁకలరొప్పికొని వచ్చితుమ్మ**
**నున్నకాయల రాల్చియును నంతఁబోక' బసవ-III**

ప్రకృతివర్ణనమున నీతని కోడికూతను వర్ణించు నేర్పు రమణీయమైనది.

**ద్వి. తొలి కోడి కనువిచ్చి నిలిచి మైవెంచి**
**జలజల రెక్కలు సడలించి నీల్గి**
**గ్రక్కునఁ గాలార్చి కంఠంబు విచ్చి**
**ముక్కున నీఁకెలు చక్కొల్పి, కడుపు**
**వెక్కించి, మెడసాచి, నిక్కి మిన్సూచి**
**కొక్కొరో కుఱ్ఱని కూయకమున్న**
**పండితా.చరిత్ర-II**

ఇందు తెల్లవారుజామున కూయు కోడి వివిధావయవవిక్షేపముల వైఖరిని వర్ణించి కండ్లకు కట్టినట్లు చేసినాఁడు కవి. ఇట్టి వర్ణనలను బట్టి కవికిఁగల సూక్ష్మమైన కవితాదృష్టి గాంచనగును.

**(2) పాత్రపోషణము** : వీరశైవమతము భక్తిప్రధానమైనది కాన నీకావ్యము లందు వచ్చుపాత్రలు విశేషముగా భక్తులే. కాని వారందఱు నచ్చులో పోతపోసినట్టొకే మాదిరిగ నుండక, ప్రత్యేకవ్యక్తిత్వముతో, చైతన్యముగలిగి, వైవిధ్యముగూర్చి



పాత్రపోషణముచేసి చూపినాఁడు. సోమనాథుఁడు తాను భక్తుడగుటచేతనే భక్తుల హృదయమును యథావిధిగా వ్యాఖ్యానము సేయఁగలిగినాఁడు. ఈ విషయమున నీతఁడు పోతనకు మార్గదర్శకుఁడైనాడు. భక్తులలో స్త్రీ పురుషులు గూడఁగలరు. వారు మిండ, ముగ్ధ, మూఢ, మొండి, ప్రౌఢాదిబేధములతో నొప్పి తదనుగుణముగా పాత్రపోషణము చేయఁబడినారు.

బసవపురాణమున నాటవికుఁడగు కన్నప్పని ముగ్ధభక్తి యతిహృద యంగమముగా నొనర్పఁబడి, ధూర్జటికవి కాళహస్తిమాహాత్మ్యమందలి రచనకు వరవడి యైనది. ఈ కథావిషయముభయకవుల రచనలును పిడుపర్తికవులఁ గూర్చిన యధ్యాయమున నిరూపింపఁబడినవి. ఇటువంటి ముగ్ధభక్తియే బెజ్జమహాదేవి కథ యందును గానవచ్చును.

**ద్వి॥ ఎల్లనియోగంబు లెల్ల బాంధవులు**
**నెల్లవారలు గల్గ నిట్లు భర్గునకుఁ**
**దల్లి లేకుండుట దా విచిత్రంబు**
**దల్లి లేకది యెట్లు దా నుదయించె ?**
**దల్లి సచ్చెనొ కాక త్రైలోక్యపతికిఁ**
**జెల్లెబో! యిట్లేమి సేయంగవచ్చుఁ ?**
**తల్లి సచ్చినఁగాదె తానుడస్సితిని**
**ఎల్లవారికి దుఃఖమిట్టిదకాదె,**
**తల్లి గల్గిన నేల తపసి గానిచ్చుఁ?**
**దల్లి గల్గిన నేల తల జడల్గట్టు?**
**తల్లియున్న విషంబు ద్రావనేలిచ్చుఁ ?**
**దల్లి యుండినఁ దోళ్లు దాల్పనేలిచ్చుఁ ?**
**దల్లి పాములనేల ధరియింపనిచ్చుఁ ?**
**దల్లి బూడిద యేల తాఁబూయనిచ్చు ?**
**దల్లి పుచ్చునె భువిఁ దనయునిఁదరియఁ**
**దల్లి పుచ్చునె సుతు వల్లకాటికిని**
**తల్లి లేకుండిన తనయుండు గాన**

**ప్రల్లదుఁడై యిన్నివాట్లకు వచ్చెఁ**
**జన్నిచ్చి పలుమాఱు వెన్నయుఁ బెట్టి**
**పన్నుగా నిన్నియుఁ బాలునుబోసి**
**యాకొనఁగా గడుపరసి పాలిచ్చి**
**సాకించి పెనుపదే జనని గల్గినను**
**దానింతవాఁడయ్యెఁ దల్లి లేకయును**
**దానెంత వెరుగునో తల్లి గల్గినను ?**
**బెండ్లిండ్లనోముల బేరంటములను**
**బండువుదినములఁ బాటిజాతరలఁ**
**దగినపోడిమిసేయు తల్లి లేకున్న**
**వగవరే మఱి యెట్టి మగబిడ్డలైన**
**నూరకుపేక్షించి యుండంగ దగునె ?**
**ఆరంగ దల్లినై హరుని నేనైన**
**నరసెదఁకాక; యిట్లర లేక పెనుచు**
**తరుణియ కాదెట్లు తల్లిగా నగుచు**
**ననయంబు బెజ్జమహాదేవి దాన**
**జననియై పరమేశుఁ దనయుఁగావించి"** బసవ.-III,పుట 66-7

మఱియొక ముగ్ధభక్తి గొడగూచి పాత్రపోషణమునందుఁ గాననగును (బసవ. పుట. 70) ఇఁక దీపకళియారునియందు మోటభక్తి (తలవెండ్రుకల జడతో దీపమును శివునకుఁ బెట్టుట)తో పాత్రపోషణము చేయఁబడినది. (బసవ పు. పుట 75) ఇటువంటి భక్తియందు తమోగుణ మధికమని చెప్పవలసివచ్చును. అసలు వీరశైవభక్తియే తామసికభక్తియని చెప్పవలయును.

**(3) రసపోషణము** : పాల్కురికి సోమనాథుఁడు నవరసములను వీరశైవ భక్తిప్రాయముగఁ జేసి వర్ణించి, పోషించినాఁడు. కాని ప్రత్యేక భావములతో నితరకావ్యములందు చేయఁబడునట్లు చేయలేదు. ఈ భక్తి ప్రతిపాదనమున సోముఁ డనేకవిధములైన భక్తులనుగూర్చి, వైవిధ్యమును జూపి, వివిధరసముల పోషించి నిర్వహించుట కవకాశముగల్గించినాఁడు. భక్తులలో మిండభక్తులు, మొండిభక్తులు, మూఢభక్తులు, ప్రౌఢభక్తులు, శిశుభక్తులు, స్త్రీ భక్తులు మొదలైన వివిధములగు వారినిగూర్చి, తదనుగుణముగ రసపాత్రపోషణముల నిర్వహించినాఁడు. మానసిక ప్రపత్తులగు రసపాత్రపోషణము లవినాభావసంబంధ ముండుటచే నవి కవి రచనమున పరస్పరము పోషింపఁబడుచుండును కదా!



**శృంగారము** : ప్రబంధములలో వర్ణింపఁబడు శృంగారమువలె విప్రలంభ సంభోగాదులు కాకపోయినను, మిండభక్తుల శృంగారమును సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమున గురుభక్తాండారి కథలో హృదయంగమముగ వర్ణించి, రతిశాస్త్ర రహస్యములఁ గూడ వివరించి తెల్పినాఁడు.

**ఉవిద దృగ్రోచులో - యొడ్డినయురులొ,**
**ధవళాక్షిచూడ్కులో - దావాంకురములొ,**
**మెలఁతకన్మెఱుగులో - మెఱుగులగనులొ,**
**పొలఁతి దృగంశులో - పొలము దీపములొ,**
**ముదిత వీక్షణములో - మోహపాశములొ,**
**మదిరాక్షి చూపులో - మదనబాణములొ,**
**లోలాక్షి దృగ్రుచు - లో కట్టు బంట్లొ,**
**బాల వీక్షణములో - పన్నినవలలొ**
**యిల చోద్యమంచు నయ్యంతి దృగ్దీధి**
**తులఁ జిక్కులను బడియిలఁ దొట్రుకొనుచు,**
**బసరింప నొండేల భాగ గన్ గొనలఁ**
**గుసుమాస్త్ర హతికి దాఁ గుఱియైతి, నూకి**
**పోరాదు, వెనకకు రారాదు, గోలు**
**పోరాదు తాల్మి, బల్కరాదు సతికి**
**నేమిసేయుదు నంచు నీశు భక్తుండు**
**దా మది నూహించి తప్పేమి దీన**
**నదియును భక్తురా లట్లును గాక**
**వదిగొను మ్రోయుశైవ పురాణములను**
**నీతిదప్పక 'మైథునే రతా' యనియు,**

**సూత సంహితయందు సురుచిరంబుగను**
**మఱి 'యత్సుఖం తత్సమర్పిత' మ్మనియు**
**దఱిమ్రోయుగావునఁ దనుఁబొందినట్టి**
**సుఖము లింద్రియములఁ జోకకయుండ**
**సుఖమెర్గి శివునకా సుఖము లర్పించు**
**క్రమ మెఱిఁగినఁ జాలు, గాఁడు దుర్విటుఁడు,**
**శమ దమాదుల కంటెఁ జాల నుత్తముఁడు**
**వీక్షింప భక్తియం దిదియును నొక్క**
**పక్షంబు గావున భ్రాంతి యేలనుచు.**

**-        -        -        -**

**-        -        -        -**

**తక్కు వెక్కువ యని తన్నొల్లనేని**
**యొక్క ప్రాయము చూడు మొగి నీకు నాకుఁ**
**జదురుండు గాఁడని మది నొల్లలేని**
**మదిరాక్షి చూడు నా మాటలయంద,**
**మొకనికి వలచి తన్నొల్ల వేనియును**
**సుకుమారి తనుగూడి  చూడొక్కమాఱు**
**జానొంద గుణములు జాతు లిచ్చలును**
**యోనిదండమ్ముల న్యూనాధికముల**
**సమరతిగాక విషమరతి యైన**
**సమరతిఁ గూర్చు నాసనభేదములును**
**గరణముల్రతులును గాలవేళలును**
**బరగు మనోగత భావంబు లెఱిఁగి**
**జాలయౌవనప్రౌఢ లోల యనంగ**
**దా లలనల వయో ధర్మంబు లెఱిఁగి**
**నెరయఁ బాదాంగుష్ఠ మఱికాలుగుత్తి**
**సిఱుదొడ, గుహ్యంబు, మఱినాభి, రొమ్ము**
**సనుమూపుమెడచెక్కు సరి నధరంబు**



**గనురెప్పఫాలంబు గచభరంబందు**
**గటిక్రింద వ్రేలిడి యటక్రిందుఁ బెనుప**
**నిటు ద్రిప్పి వ్రేయఁజే నిరియంగబట్టి,**
**మూటరేఖలుసూప ముదమునరెంట**
**నాటనుగబళింప నలివేణిబట్టు**
**గళలు దా శుక్ల పక్షంబుననెక్క**
**వలపట డిగి మున్ను వామభాగమునఁ**
**బొటుచు మన్మథరసాం భోనిధిముంచి**
**మడఁతులఁదముదార మఱువంగఁజేత**
**యిది యెంతపెద్ద నా కిందీవరాక్షి**
**ముదమున నాకు సమ్ముఖమిచ్చిచూడు**
**మాలింగనాద్యుచి తాలాపములను**
**లోలత నీవల్పు గీలెడలంగ**
**నున్మీలితాక్షివై యొండేమి యచట**
**మన్మథరసవార్ధి మరులుగొనంగ**
**వెండి నిన్నెరుగకయుండంగ జేయ**
**కుండితినేని నీ కోడినవాఁడ'**

**(పండితా; పురాత పుట.332-336)**

**కరుణము** : కరుణరసమును స్వభావోక్తితో పామర హృదయాకర్షణముగ, పండితారాధ్యచరిత్రమున సుందరనంబెన్న జన్మాది చరిత్ర కథనమున, శిశువు కావేరినదిలో పడఁగ వానిని మొసలి లాగికొనిపోయినపుడు వానితల్లి పడిన హృదయావేదనమును కవి యిట్లు వర్ణించినాఁడు.

**"ఒక మొసలీడ్వంగ నువిద వీక్షించి**
**'యకటకటా', యంచు 'హా' యంచు గర్భ**
**మడఁచికొంచును 'దేవుఁడా' యంచు నేల**
**బడి పొరలుచు సుతు బనవుచు, వాయి**
**విడిచియేడ్చుచును గావేరిలో తాను**

బడబోవుచును శోకపారవశ్యమునఁ
బొడిఁబొడిఁబొక్కుచుఁ బొగులుచున్నంతఁ
దొడరంగఁబతియు బంధులు నేగుదెంచి
సంబరంబులుసేసి శైవోక్త వైది
కంబుగా నాముష్మిక క్రియల్ సలుప
'గనురెప్పమాటైనఁ గనలెడు తల్లిఁ
దనయుండ ? నినుఁబాసి తరియింపఁగలనె;
ప్రక్కఁ బాసిన భయము పడెడుతల్లి
నిక్కడ నినుబాసి యేనోర్వఁగలనె
వెస నిల్లువెడలిన వెతఁబడుతల్లి,
మొసలకొప్పించి యిమ్ముల మనగలనె ?
నెట్టిఁ జెమటయే నెత్తురన్ తల్లిఁ
బట్టి నిన్‌బాసి యే బ్రదుకంగఁగలనె?
యన నేల వేయు నా యన్న! నేరంబు
నినుఁబాసి నిలువంగ నేర్తునే" యనుచు
నున్న పుత్రునిమన్కి యున్కియు రూపు
సన్నపుత్రుడు నొక్క చందంబకాన
యేరాలి సుతుమాట లెప్పుడాలించు
గూరిమిసుతు పలుకులు నష్ట తలఁచు
నేరాలి సుతునెప్పు డెత్తిముద్దాడు
నారంగ సుతుముద్దు లాటదలంచు,
నేరాలి సుతునెప్పు డీక్షించునపుడ
మడతి వైరియనంగ మఱి యీ క్రమమున
నుడుగని పుత్ర వియోగదుఃఖాగ్ని
వందుచు గందుచు వనరుచునాత్మ
గుందుచు, డయ్యుచు, గ్రుయ్యుచు సుతుఁద
లంచి, తలంచి ప్రలాపించు నువిద
సంచలమతినట్లు చరియింపనంత'

(పండితా; మహిమప్ర, పుట.156-157)



**భయానకము** : ఆ కథయందే, యగ్ని మీఁదఁ బడినపుడు పుట్టిన భయమిట్లు రసవంతముగ వర్ణింపఁ బడినది.

"దందడి యగ్నిహోత్రము మీఁదఁబడుడుఁ
బందిరి గుబ్బనఁ బడి మంటలెగయ,
దిగ్గన లేచి నల్దెసలను గాల
నగ్గిలోననఁబడి యరిగెడివారు,
ఇండులపై నెక్కి యేగెడువారు
గండులదూరి వేగమ పాఱువారుఁ
జప్పరంబులనూకి చనియెడువారు
నెప్పాటఁజనలేక యీల్గెడువారు,
గోడలువడఁ ద్రొక్కికొని పాఱువారు,
గూడముట్టిన యగ్గిగొని కాలువారు,
గనుకని యొండొంట గడవంగ విప్ర
జను లివ్విధంబునఁ జక్కన నరుగ
మూకలోననఁ జొచ్చి మునుముట్ట నంబి
జాఁకిట నిడుకొని జడయారియరుగఁ
దనబిడ్డఁ డనుచు మా దాసిబిడ్డనిని
గొనిపోవుచున్నాడు గుటిలంపుటఱువ
సూడుఁడీ పౌరు లంచును బురి వాడ
వాడల మొఱయుచు వడిఁబాఱి పట్ట" (పం.చ.మహిమ.ప్ర.126-7)

బసవపురాణమునఁ గూడ నీ రసము చక్కగ పోషింపఁ బడినది. వాల్మీకేశుఁడు సాకారుఁడై మిరుమిండనికి వెఱచి యొడయనంబితోఁ బాటుగా పాఱిపోవుట గూడ బహు రసవంతముగా నున్నది. (బసవపురాణము - చతుర్థాశ్వాసము - పుట 130) మఱియు వైజవ్వకథ యందు గూడ భయానకరసము చక్కగ వర్ణింపఁబడినది. (బసవపురాణము, పుట 89) ఈ వర్ణనము నన్నెచోడుని కుమారసంభవ మందలి దక్షక్రతుధ్వంసమున దేవతలు పొందిన భయమును స్మరింపఁజేయును.

**అద్భుతము:** మల్లికార్జున పండితారాధ్యుఁడు వెలనాటి చోళుని యాస్థానమున తన కండ్లు పెరికికొనినప్పుడు మరల కండ్లు వచ్చుటయు, నట్లనేక పర్యాయములు జరుగుటను పండితారాధ్యచరిత్రమున వర్ణించి సోమనాథకవి యద్భుతరసమును పోషించినాఁడు.

**"అతుల మహాద్భుతో ద్యద్వీరభక్తి**
**యుత సమాహిత మహిమోపేతుఁడగుచు,**
**తచ్చక్షుర ప్ర సంధానావధాన**
**మచ్చెరువుగ మున్ను వుచ్చినయట్లు**
**వుచ్చెఁగన్నులు రెండు వుచ్చుఁ దోడ్తోన**
**వచ్చెఁగన్నులు రెండు, వచ్చుటజూచి,**
**పుచ్చఁబూనినకన్నుఁ బుచ్చియాకన్ను**
**పుచ్చులోనన, మున్ను వుచ్చినకన్ను**
**వచ్చెఁ గన్నిదె వచ్చె, వచ్చెఁదానదియు**
**వచ్చులోనన మఱి పుచ్చినకన్ను**
**వచ్చె గన్నిదె వచ్చె, వచ్చెనానట్లు**
**సెచ్చెర తడవగుఁ జెప్పనకాని**
**తడవింత లేదు నేత్రంబుల రాక**
**గడుచిత్రమంచు నొక్కట నరుల్వొగడ**
**---  --  --  --**
**మున్ను వుచ్చిన నేత్రములు వెన్క క్రొత్త**
**కన్నులు రెట్టింపఁగా జోడఁడాత్మ**
**గలసివచ్చుచునున్న కన్నులఁజూఁచి**
**తొలుతనేత్రంబులుఁ దొడిదొడిఁజూచు**
**మున్ను వుచ్చిననేత్రములు, వెన్కగ్రొత్త**
**కన్నులుఁగూడ దిగ్గద్రోచిచూచు**
**న ప్పండితుని నయనాబ్జములొ్సాచు**
**దప్పక నాల్గునేత్రంబులు సూచు,**
**దనుసూచు, మఱియు నేత్రంబులు సూచు,**



**మనుజావళిని జూచు, మఱినేలఁజూచు**
**ధర తలవంపయ్యెఁ దనకని చూచుఁ**
**బొరిగొన కీయల్క వోదని చూచు,**
**బండితుఁగ్రీగంట బలుమాఱు సూచు,**
**వెండియు నిట్లు తా వికలాత్ముఁడగుచు**
**నింతంత చోద్యంబు నినుమడి లజ్జ**
**యంతకంతకు నల్మడై కడలేని"**  **(మహిమ ప్రక.పుట.45-47)**

**రౌద్రము** : పండితుఁడు వెలనాటిచోడుని శపించు ఘట్టమున రౌద్రరస మిట్లు పోషింపఁ బడినది.

**"ఈ యసంఖ్యాత మాహేశ్వరోద్ధిత స**
**మాయత క్రోధోత్కటానలపటల**
**విరచితజ్వాలల వెలనాటిచోడ**
**ధరణీతలేశ్వరాధమ పతంగంబు**
**భస్మమయ్యెడును, తద్బంధులు. సుతులు**
**విస్మయంబుగ నిప్డ భస్మమై పోదు"**  **(మహిమ ప్రక.పుట.57)**

**బీభత్సము** : బెలిదేవ వేమనారాధ్యుడు రాజశవమును బ్రతికించు సందర్భమునం దాశవ వర్ణనమున బీభత్సరసము చక్కగ ప్రతిపాదింపఁబడినది.

**'అనుపమభక్తి గణా జ్ఞాపనమున**
**జనపతి శవముఁదెండని పంప నదియుఁ**
**దిరిగిన వెలిగ్రుడ్లు దెఱచిననోరు,**
**నరమొగిడ్చిన రెప్ప లురుతరోష్ఠములుఁ**
**గ్రుంగినకటము లెక్కువ మొత్తమగుచు**
**బొంగి దూలము విర్గి వంగిన ముక్కు,**
**బచ్చనిపండ్లు, వెల్వడి తీగచొల్లు,**
**విచ్చిన రంధ్రముల్, వీడినకొప్పు,**
**నంగవిచ్ఛాయయుఁ బొంగినకడుపు,**

వంగినవీపును - వ్రాలినశిరము
వొందరిసగ్గొంట్లు వోయిన సందు
సందులనెత్తురు - సచ్చినతోలు
గళదప్పి బలసి దుర్గంధంపుఁబ్రాయి
వలరుచుఁదునుపెక్కి - వాచినమేను
మూగుచు జుమ్మని వీగుచు మఱియు
మూగుచుముసరు నయ్యీగలు జూడ
గంపు నేవము భయంకరమును, దోఁప
గుంపిడిజనులు ముక్కులుపట్టికొనుచు
గటకటా, యనుచు, నెక్కడిదిఁక ననుచు
దొటుకున నుమియుచుఁ దొలఁగిపోవంగ'

(పండితా. పురాతన ప్ర - పుట 443-4)

ఈ విధమున నౌచిత్యముతోఁ జక్కగ ప్రతిరసమును బాల్కురికి సోమనాథుఁడు తన ద్విపదకావ్యములందు పోషించినాఁడు.

**అలంకారముల కూర్పు** : పాల్కురికి సోమనాథుని యాలంకారిక రచన యందొక వైలక్షణ్యమున్నది. ఇతరకవులు సామాన్యముగ నొక యలంకారమున నొకవిషయమునే గ్రహింతురు. కాని యితఁడొక యలంకారమున కనేకవిషయములను గ్రహించి, యనేక నిదర్శనములతో నలంకార మాలికను కుప్పలుకుప్పలుగాఁ గూర్చి రచించును. ఇందుచే సామాన్యజనులగు పఠితల హృదయమున నాభావ మచ్చువలె హత్తి యాకర్షించి యుద్రేకపూరితులఁ జేయును. ఇతఁడు ప్రసిద్ధాలంకారములగు నుపమ, యుత్ప్రేక్ష, నతిశయోక్తి, రూపకము, స్వభావోక్తి మొదలైన యర్థాలంకారములనే కాక, యంత్యప్రాస, ఛేకానుప్రాస, లాటానుప్రాస, ముక్తపదగ్రస్తము మొదలైన శబ్దాలంకారములను గూడ విశేషముగను, రసవంతముగను దన గ్రంథముల వాడినాఁడు.

**ఉపమ** :-

**"చెంచుభావంబున శివభక్తచిహ్న**
**నంచితంబై యుంచు కించుక దోఁప**



**భువి మసికప్పడమునఁ గప్పఁబడియు**
**నివిడి వెలుంగు మాణిక్యంబునట్లు;**
**మిక్కుటంపు నివుఱు మీఁదగప్పియును**
**నక్కజంబై మించు ననలంబునట్లు;**
**పొనరంగశుక్తిచేఁ బొదవంగఁబడియు**
**దనరు ననర్ఘ్య ముక్తాఫలంబట్లు**
**గమియ మీఁదం బ్రాచి గప్పియుండియును**
**సమలినంబైన గంగాంబువు లట్లు;"**
**దుర్మేఘపటలంబు దూరఁగప్పియును**
**నిర్మలరవి దివి నిలచినయట్లు**
**యసలార శబర చర్మావృతుఁడయ్యు**
**ననదృశైశ్వర్య సమగ్రత దనర"** **(పండిత, పురాతన, పుట 391-922)**

**మఱియు**

**"నెఱినంకురించు మ్రానికి నీరుమాని**
**నెఱవట్టి కొఱటికి నీరెత్తినట్లు;**
**గుతిలుఁడై జాతి నాగులఁ జంపుచుండి,**
**ప్రతిమనాగులకును బాల్పోయునట్లు;**
**వడిగొని భుజియించు వదనముండంగ,**
**గడిసేసి పెడతలఁ గుడుచుచందమున,**
**నొనర ముందటి శిరంబుండ మోకాలి**
**కిని సేసవెట్టంగఁ క్రియగొనినట్లు;** **(పండి, దీక్షా.పు.202)**

ఇట్లే బసవపురాణమున పుట 97, 210 మొదలగు చోట్లగూడఁ గలవు. కొన్ని చోట్ల నితఁడు పండితారాధ్యుడు శివతత్త్వసారమున వాడిన యుపమానములనే వాడినాడు. ఇది యట్టిది

**"ఆడంబరంపు దేవార్చనలెల్ల**
**నోడునఁబోసిన యుదకంబులట్లు"** **(దీక్షా ప్ర.పు.200)**

కొన్ని సమయములందు వేమనవలె నతికఠినముగ, నతి నీచవస్తువుతోఁ బోల్చును.

"కాన జంగమ భక్తిహీనుని పూజ
పీనుఁగుఁగై సేయఁ బూనినట్లు" (దీక్షా. ప్ర.పుట.201)

రూపకము :-

"జను సదానంద సంజనితాశ్రు సమితి
దన హృదయేశునకు మజ్జనవారి గాఁగ,
దనరు చిత్రాంగ్రంబు దడియొత్తుగాఁగ,
ఘనసత్క్రియారతి గంధంబు గాఁగ,
బొనరు మత్పునుకలు పుష్పముల్ గాఁగ,
వినుత తత్త్వవిభూతి మునుభూతిగాగ,
సతత నిజాత్మవాసన ధూపముగను,
నతిశయ జ్ఞానాంశు లారతుల్గాఁగ,
భరిత నివేదిత ప్రాణప్రదంబు
హరున కర్పించు పదార్థముల్గాఁగ,
శమితేంద్రియానురాగము విడియముగ
నమితవాఙ్మణులు పుష్పాంజలుల్గాఁగ, (దీక్షా.పుట.183)

మఱియు,

"పృథుతరంబై యొప్పు పృథ్వీపీఠముగ,
ప్రథితాంబరము దివ్య భవ్యలింగముగ,
గ్రన్న దిక్చయము మేఖలయుగా, దిశలు
వ్రన్నని దివ్యాంబరంబులు గాఁగఁ,
బొలుపారు నక్షత్రములు పుష్పములుగ
నలరు సూర్యేందు లుద్యద్దీపములుగ
నెఱయ ఁదత్త్వాతీత నిత్యచిన్మూర్తి
గొఱలు జటాజూట కోటీరముగను
నరుదగు సూక్ష్మతత్త్వాకారుఁడైన
హరుగళంబుననున్న హాలాహలంబు
నీలిమ దోఁచినలీల పర్వతుని
నీలవర్ణాకృతి నేత్రపర్వముగ" (పర్వత ప్ర.231)



ఉత్ప్రేక్ష :-

"తలఁప నా యమ్మ హృద్గత మూలమంత్ర
మిల మూర్తిమంతమయ్యెనొ కాక యనఁగ;
వనిత శివైక్యభావధ్యాన సుఖము
జెనసి ఘనీభవించెనొ కాకయనఁగ;
నా వామ పరమ శివాచారవల్లి
సేవ దానంకురించెనొ కాక యనఁగ;
బొనర భామిని సేయుఁ బుణ్యంబుప్రోక
దనరారి కరడుకట్టెనొ కాక యనఁగ;
జలజాయతాక్ష విశ్వాసంబు నివ్వ
టిల గండరింపఁబడెనొ కాక యనఁగ;
నలరారి సతిచేత కమరద్రుమంబు
ఫలము దా మహిఁదేజరిలె కాక యనఁగ
బనుగొన నాతిసౌభాగ్యాతిశయత
యెనయుచుఁ గరిగొనియెనొ కాక యనఁగ" (దీక్షా ప్ర.పుట.153)

మఱియు

"అరుగుదే కరుణించినట్టి ప్రచ్ఛన్న
హరుఁడ తానను శబరావతారుండొ;
వెస చెంచెతలలోన విహరింప వచ్చి
మసలిన శ్రీగిరి మల్లికార్జునుఁడొ;
నిచ్చలు మృగముల నిటలాక్షుపురికి
బుచ్చుఁ దెనుగుజొమ్మ భూవినుతుండొ;
యెప్పుడు తిరుకాళి నొప్పు కన్నప్ప
తప్పని యపరావతారుండొ మఱియు,
శివరాత్రిఫలము చెచ్చెరఁ జూరఁగొనుచు
శివపురికేగిన చెంచకో యనఁగ" (పురాతన ప్ర.పుట.393)

**అతిశయోక్తి :-**

"శివలింగ సౌఖ్యానుభవమ చన్బాలు,
దవిలిన గురుపదధ్యానంబు వెన్న,
వేదాంతసూక్తుల వెడఁదొట్టుఁబల్కు

లాదిమార్గమ తప్పు డడుగిడు నడుగు
గా, లింగపూజాత్మకక్రియా విలయ
లాలనం బమర బాలక్రీడలుగను" దీక్షా.ప్ర.పుట.209

ఇది బసవపురాణమున బసవని శైశవ వర్ణనమందలి యతిశయోక్తిని బోలియున్నది.
మఱియు

"ఊరగరాడ్ గ్రైవేయ కోద్యద్గళంబు
గరళంబు వచ్చెనో కాక యన్నట్టు;
లసమాక్షు నిటలనేత్రాగ్ని బోయలను
వసుధ నాహుతి గొన వచ్చిన యట్లు.
పాపి నిషాదుల బాడబవహ్ని
యాపోశనము గొందునని వచ్చెననఁగ" (దీక్షా.పుట.219)

**స్వభావోక్తి :-**

"ప్రశ్నోత్తరముల కా బౌద్ధుండు దగిన
ప్రశ్నోత్తరంబు లాపాదింపలేక
కనుగవ మంటలు గ్రమ్మ దన్దాన
కొని కాల ఁగూడ ముక్కున బొగల్వెడల,
దనువున చెమటయు, దాపంబు దనర,
మనసు గలంగ, బొమ్మలు ముడివడఁగ,
మొలక మీసలు రోమములు నిల్వబడగ
గళము బిగియ నూరువులు సందడింప
నురు కోపహతిఁ బండు లుఱి ముఱి గీఱ,
గరములు శిరమును గడగడ వణక,



కటములు పొంగ, మొగంబు కెంపెక్క,
తట తట డెందం బదర నోష్ఠ ముదర,
బలుకులు తొట్రిల పడఁగ నెంతయును
గలుషంబు ముదము బెన్గర్వంబు నదర" (మహిమ ప్ర.4 పుట)

మఱియు,

" సన్నుతి సేయుచుఁ జెన్నారు క్రొత్త
కన్నులు సూచుచు గడుచిత్ర మనుచు,
గారవించుచుఁ గేళికలు సేసికొనుచు
దారును గినియుచు దాళగించుచును,
బాడుచు, నొసగులు వీడుచు, గములు
గూడుచు, నలిరేఁగి యాడుచుఁ, జేరి
చూతము రండంచుఁ జూడరో యంచుఁ
జేతులు వీచుచు, చెలఁగి యార్చుచును
బొబ్బలు వొడుచుచు, పొంగుచు చెలఁగి,
యుబ్బుచు నందఱు నుత్సహింపుచును,
జాంగు, భళాయంచు, శరణంచు నుతుల
వీంగుచు నృపుఁ డాయ నేంగుచు మంది" (మహిమ ప్ర.38)

ఇట్లే బసవపురాణమున ప్రథమాశ్వాసమునందు 29వ పుటలోఁ గూడ వర్ణింపఁబడినది.

శబ్దాలంకారములు : పాల్కురికి సోమనాథుఁడు శబ్దాలంకారముల గూడ బహుసమర్థతతో వాడినాఁడు.

**ఛేకానుప్రాసము :-**

" రక్షణాపేక్షఁ బ్రత్యక్షత్రిచక్షు,
ద్ర్యక్ష ప్రసాద పంచాక్షు సాక్షాన్మ
హోక్షు, వాలాక్ష ప్రయుక్త ఫాలాక్షు,
శిక్షితప్రతిపక్షు, శివభక్తిదక్షు
నక్షీణ కరుణాకటాక్ష వీక్షణ సు

**రక్షిత స్వమయపక్షు, నానత ము**
**ముక్షు, సంస్కృత పాశమోక్షు దుర్జన ప**
**రోక్ష సితక్షార రుద్రాక్ష విహిత**
**పక్షు, క్రియాదక్షు, దక్షమహాధ్వ**
**ర క్షయ రక్ష సదృక్షు, జంగమ స**
**మక్షు, బసవగణాధ్యక్షు, నక్షణమ**
**వీక్షింతు నను వింత వేడ్కమై నంత"** **(మహిమ -పుట.177)**

**అంత్యప్రాస :-**

**"హరి విరించి సురా సురాద్య ప్రమాణ**
**చిరభక్తి రత్న ఘర్షిత మహాశాణ,**
**వ్యాపి తోదాత్త సర్వకళాప్రవీణ,**
**ఖ్యాపి తాంబుజ భవ కంకాళ వీణ**
**నిజ భక్తి విరచిత నిఖిల ప్రమాణ**
**సుజనైక సన్నుత, సురగిరిద్రోణ,**
**వృషభాధిపవిషాణ, వీక్షణప్రీణ**
**విషగళోద్య త్కాంతి విలసనాక్షీణ,**
**యురుతరాజాండ సంయుతగర్భకోణ,**
**నరనుతభోగ గణసహ ప్రయాణ"** **(మహిమ ప్ర.పుట.203)**

ఇట్టివే బసవపురాణ ప్రథామాశ్వాసమున 28,32 పుటలలో గూడఁ గలవు. ఈతని యంత్యప్రాస రచనమే పోతనామాత్యుని రచనకు మేలుబంతియై మార్గదర్శకమైనది. ఈ విధముగా పాల్కురికి సోమనాథకవి తన కావ్యారంభములందు జేసిన కవితాదర్శములకు లక్ష్యముగా నీ కావ్యముల రచించినాడు.

**ప్రబంధపు పోకడలు** : పాల్కురికి సోమనాథుఁడు తన ద్విపద కావ్యములందు రాఁబోవు నాంధ్రప్రబంధ కవులకు మార్గదర్శకుడయ్యె ననునట్లు కొన్నిటిపట్ల నట్టి రచనములు గావించినాఁడు. ప్రబంధములందు నాయికా నాయకుల యున్మాదమును, వర్ణించురీతిగ పండితారాధ్యచరిత్రమున, పురాతన ప్రకరణమందు



గురుభక్తాండారి కథను వర్ణించినాఁడు. (చూ. పుట. 426) ఇందు శ్లేషనుగూడ వాడినాఁడు. ఇట్టి రచన నన్నయ భారతమందలి నలచరిత్రయందు గూడ గలఁదు.

**"ఈ తప్పునకు విధి యెట్టిదో శ్రుతుల**
**జూతమా, యరసియో చూపుమా యంచు,**
**నో నారికేలంబ, యీ నారిగురుల**
**యానారి మదినెట్లు గారనేరమికి**
**శోకంబులేని యశోకంబ యేని**
**శోకిగా నేర్తునొకో, కర్మ మడఁచి;**
**ఓ ఘనసారంబ, యీ ఘనాఘంబు**
**మోఘంబుసేయుఁ గ్రియౌఘంబు గలదె,**
**నా చంద మిట్లయ్యె నోచందనంబ**
**యే చందమునుగాద యేమి సేయుదును,**
**భ్రమియింపుచున్న యో భ్రమరమా యిట్లు**
**భ్రమియింపుచున్న నా భ్రమలెట్లు వాయు,**
**నో కూయు కోకిలా యొడఁబడి గాఁగ,**
**నా కూయి యడఁగునే యే కాలమైన"** **(పురా.పు. 426)**

ఇట్టి శ్లేషరచనయే పర్వతప్రకరణమునఁ గూడగలదు. (చూ.పుట.293)

**"చూతము శ్రీగిరి చూతమన్వారిఁ**
**జూతమనెను ఫలాన్విత చూతములును;**
**(దివిరిదర్శనములీ దెచ్చిన యట్టి**
**బవిరి నొప్పగు ఫల భరిత చూతములు).**
**వినుఁడు మీమీ యూళ్ళ వెడలిననాడ**
**ఘనభక్తిమై దమ్ము గడచినా రింకఁ**
**దమ చింతలేల పోదండను కరణి**
**నమరి యంతంత నొప్పారు చింతలును**
**చెలఁగి వసంతుఁడు శ్రీగిరిచుట్టుఁ**
**గలయ ఫలావళుల్ గట్టినమాడ్కి**

నిలనొప్ప ద్రాక్షలనీడల మాది
ఫలముల నిమ్మల మంజరులను
నిల మల్లికార్జునుఁడెసఁగు మాపేరఁ
బొలుపుగానని విచ్చు బొడ్డుమల్లియలు
కుందంగనేల శ్రీగోత్రంబుఁ జెంది
కుందకుండని నవ్యకుందగుచ్ఛములు" (పర్వత ప్ర. 293-5)

మఱియు నింకొకవిధమైన వర్ణనలు :

"కడలేని నిర్మల గాఢ మహత్వ
జడతా విహార విస్తారోదకముల
నంగీకృతాయుతోత్తుంగ శృంగౌఘ
మంగళరంగ త్తరంగ సంఘముల
బటు శైలచూడావిభాసి నీహార
పటలప్రకార విస్తారఫేనముల
శైలాగ్రవిహరణాసక్త ప్రమథ వి
శాలదివ్యవిమాన చయ వహిత్రముల
నరనుత తద్విమాన ధ్వజదండ
గురువహిత్రోత్తాల కూపదండముల,
సంచిత నానాదిశాస్థానచయ స
మంచిత ద్వీపాంతరానీకములను (పర్వత -పుట 228)

ఈ విధముననే (పర్వతవర్ణనము గూడఁజేయఁబడినది)

" గిరిదర్శనము ముక్తికిని హేతువనినఁ
బురి దర్శనఫల మేపోల్కి వర్ణింప?
గిరిసెలయేరులు సురనదు లనిన,
పురనదీనదము లేపోల్కి వర్ణింప?
గిరిచుట్టు మ్రాకులు సురతరు లనిన
బురియుపవనము లే పోల్కి వర్ణింప?
గిరియందమైయుండు సురభుల కనినఁ
బురిపశురాశి నే పోల్కి వర్ణింప?



గిరిసమస్తంబును హరమూర్తియనినఁ
బురిలింగమహిమ నే పోల్కి వర్ణింప? (పర్వత ప్ర. 392)

శివరాత్రి జాగరణవర్ణన సందర్భము గూడ నిట్టే ప్రబంధరీతి వర్ణింపఁబడినది.

" మానిత ప్రాసాదమండప గోపు
రానీక దీపప్రభాభ్యంతరమున,
విలసిత వివిధ నవీనాంబర ప్ర
కలిత మండపమొప్పఁ గావించి, యందు
పరిచిత్రక్రముక రంభా స్తంభ ముకుర
భరితోత్తరంగ శుంభద్ద్వార తతులు
సంచిత నీలదృషత్కుట్టిమములు
సంచితోత్పల సమాయత తోరణములు
-- -- -- --
మానిత బహువర్ణ మహితో పవార్ధి
ఫేన పుంజంబులుఁ బృథుతరంగములు
-- -- -- --
భర్మాంబురంజిత పటచిత్రవస్త్ర
నిర్మిత బహుపక్ష నివహాతిశయము;
-- -- -- --
అరుణాబ్జ కర్ణికా రాశోక రక్త
కరవీర చంపక కైరవాద్యఖిల
సురుచిర ప్రసవ నిష్మ్యూత మాలాప్ర
కర బంధతత్పుష్ప ఘంటికావళులు,
-- -- -- --
వారక చీకటి వర్ణింత మంద
మారాదుదద్దీప మాలికాతతులు,
ప్రాసాదగోపుర బహుహేమకలశ
భాసురద్యుతులు, శుంభద్ధ్వజదండ
ఖచిత భాస్వద్రత్న కలిత దీధితులు
బ్రచుర ప్రభలపేర్మి రాత్రుల్పగళ్లు" (పర్వత పుట.419-422)

ఈ విధముగ పాల్కురికి సోమనాథుని బసవపురాణ పండితారాధ్య చరిత్రములు సర్వసుగుణశోభితములై యున్నవి. వీనినిగూర్చి పంచాగ్నుల ఆది నారాయణశాస్త్రిగారు (1919-20) ఆంధ్రపత్రిక యుగాదిసంచిక పదవ సంపుటమున, ద్విపద కవిత్వమను శీర్షిక క్రింద 199వ పుటలో నీ క్రిందివిధముగా రచించిన వాక్యములలో నతిశయోక్తులంతగా లేవని భావించి, యావాక్యముల నుదాహరించు చున్నాను.

"ఈ రెండు గ్రంథములెక్కడ చూచిన నక్కడ నవరసంబులు పొంగి పొరలి పోవునంతటి రసోదంచితములుగ ద్విపదలలోఁ గూర్పఁబడినవి. హిమవద్భూధర గుహాగ్రములనుండి యనర్గళముగా దుమికివచ్చెడు గంగా ప్రవాహమును బోలె నీ మహామహుని కవిత్వము పాఠకుల మనంబుల నానంద పూరమున నోలలాడించు చుండును. భక్తశిరోమణియగు పోతన భక్తిపారవశ్యపు కవిత్వమునకును, కవి సార్వభౌముఁడగు శ్రీనాథమహాకవి నుడికారముల గడుసుతనంపు చిన్నెలకును, కర్ణాటరాజ్య రమానాథుఁడు నాంధ్రభోజుఁడు, నాంధ్రకవియు నగు కృష్ణదేవరాయ మహారాజుల యాముక్తమాల్యద మున్నగు కృతులలోని యద్భుతవర్ణన పటిష్ఠములగు సందర్భములకును, దీనికి దానికనియేల యింతదనుక మన యాంధ్రసారస్వతమునఁ గల హృద్యములగు రసవద్వర్ణనోదంచితములగు కావ్యపు మెరుగులన్నింటికిని, యీ రెండు ద్విపదకావ్యములే మార్గదర్శకములై రాజిల్లినవని యనుటలో నేమియు సందేహము లేదు."

**చతుర్వేదసారము** : శ్రుతిస్మృతి పురాణములనుండి గ్రహింపఁబడిన యుక్తులతో శివపారమ్యమిందు 300 సీస పద్యములలో ప్రతిపాదింపఁబడినది. కాని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బసవపురాణ పీఠికలో 400 సీస పద్యము లిందు గలవని యేల వ్రాసిరో తెలియదు. ప్రతిపద్యము బసవసంబోధనముతో ముగియు చున్నది.

**"కడు శ్రుతిస్మృతులకును యుక్తంబుగా పురా**
**ణాగమాది సూక్తులతిశయిల్ల**
**భాష్యరీతిఁ దేటపరతు నుద్యద్భక్తి**
**పదము విస్తరిల్ల బసవలింగ"**



ఇందు విభూతి రుద్రాక్ష లింగధారణ మాహాత్మ్యములును (54-96) ప్రకృతి పురుషనామములును, (97-106), విష్ణుభక్తులు శివభక్తులుగా నగుటకుఁ గారణమును (107-114) అశుచికారణమును (115-143) చరస్తుతియు (144-157), శీలలక్షణమును (158-201) శివానుభవ సూత్రవివరము (202-300)నను విషయములు గలవు.

**ప్రారంభము :-**

సీ. **శ్రీగురవే నమస్తే, గురవే నమ,**
**స్తే గురుమూర్తి ప్రథితగుణాయ,**
**శ్రీశంభవే నమస్తే శంభవే నమ**
**స్తే శంభుసంచారచేతనాయ,**
**శ్రీ ప్రమథాయ తే, శ్రీప్రమథాయ తే,**
**ప్రమథావతార తారస్మరాయ,**
**శ్రీవృషభాయ తే శ్రీవృషభాయ తే,**
**వృషభాంశ వీరమాహేశ్వరాయ,**

ఆ. **అని నుతించి భవపాద నిర్యద్ఘృణా**
**మృతరసాబ్ధిఁ దేల మతిఁదలంచి**
**నిర్వికల్పరతి చతుర్వేదసారమన్**
**పద్యముల్ రచింతు బసవలింగ.**

**అంత్యము :-**

సీ. **భవ రక్షణాచల ప్రథిత నియమ ఘృణా,**
**పరిపాకకేళి విహరణములును,**
**భవదివ్య గురుపాదపద్మరజస్సమో**
**ద్భూతానుభావ విఖ్యాతినుతులు,**
**భవదంఘ్రిసరసిజ ప్రస్తుతపాంసు న,**
**ముత్తంస సీమానుమోదయుతులు**

**భవదనుభూత విస్ఫార సుఖామృత**
**రుచిర సర్వేంద్రియారూఢ మతులు,**

**ఆ.జేయు నీ స్తవంబుఁ జెవులార వినువారి**
**వ్రాయువారిఁ జదువువారి విస్త**
**రించువారి నీతిసమంచితమున బ్రోవు**
**పటు దయాతరంగ బసవలింగ !**

ఇందలి యీక్రింది పద్యము నన్నయభారతమందలి 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని' యను పద్యమును బోలియున్నది.

**'వైదికులిది శుద్ధవైదికంబని యెన్న,**
**శాస్త్రజ్ఞు లిది ధర్మశాస్త్ర మనఁగ**
**తార్కికులిది మహాతర్కంబనంగఁ బౌ**
**రాణికు లిదియె పురాణ మనఁగ,**
**ఆగమవిదులు దివ్యాగమంబిది యన,**
**తంత్రజ్ఞు లిది వీరతంత్ర మనఁగ**
**భక్తవారం బిది భక్తిమార్గంబన,**
**ముక్త్యర్థు లిది మహాముక్తిద మన,**

**ఆ. కవులు భువిని నిదియె గావ్యంబనంగ స**
**జ్జనుల కెల్లమిగుల సంతసముగ,**
**నిర్వికల్పరతి చతుర్వేదసారమన్**
**పద్యముల్ రచింతు బసవలింగ!** 22

పండితారాధ్యచరిత్రమం దుపపాదింపఁబడిన తత్త్వమును, యుక్తులే దీనియందుపయోగింపఁబడినవి. శ్రుతిస్మృతి పురాణములలోని విషయము శివపరముగా వ్యాఖ్యానము చేయఁబడినది. శైలికి, తత్త్వ ప్రదర్శనమునకు నుదాహరణముగా నీ పద్యములు



**సీ. శివశివా, కర్ణుండు గవచమిచ్చియుఁజెడె,**
**వస్త్రమిచ్చిన దాసి వరముపడసె,**
**అక్కట ఖచరేంద్రుఁ డంగమిచ్చియుఁజెడె,**
**వ్రేలిచ్చి మంచయ్య విజయుఁ డయ్యె,**
**కటకట, శిబి దన కండ లిచ్చియుఁజెడె,**
**మృగమాంస మర్పించి మెరసె నెఱుక,**
**చెల్లెఁ బో, బలి భువినెల్ల నిచ్చియుఁజెడె,**
**చోళుఁ డొ క్కూరిచ్చి సుగతిఁబొందె**

**ఆ. అట్ల లింగవిముఖ మగు దాన ధర్మ ప**
**రోపకార విక్రమోద్ధతముల**
**నిష్ఫలంబుగాక నెట్టన శరణుల**
**భక్తియుక్తి కెనయు బసవలింగ !**

ఇది బందరు భైరవ ముద్రాక్షరశాలయందు గుజలీ ప్రతిలో సుమారు 50 సంవత్సరముల పూర్వం ముద్రితమైనది. కాని తప్పులతడికగా నున్నది.

**వృషాధిపశతకము** : దీనిని సోమనాథుఁడు బసవపురాణ రచనాంతరమున రచించిన ట్లీ పద్యమువలనఁ దెలియుచున్నది.

**చ. బసవఁడు ప్రీతిమైఁ గొనియె భక్తిమెయిన్ వివరించినాఁడు మున్**
**బసవపురాణమంచు ననుఁ బ్రస్తుతి సేయుదు రట్లుగాన నీ**
**యసమ దయా ధురీణతకు నంకిలిపాటు ఘటిల్లకుండ న**
**న్నసిగొని బ్రోవుమయ్య బసవా, బసవా, బసవా, వృషాధిపా.**

హృదయాంతరాళమునుండి త్రిరావృత్తమై వెడలిన బసవసంబోధనము సోమనాథుని భక్తి పారవశ్యమును దెల్పుచున్నది. సోమనాథునికి బసవేశ్వరుఁడే శివుఁడు. విశిష్టాద్వైత మతస్థులు జీవేశ్వరులకుఁ గల్పించిన 'శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధురావస్థలకును, నాయక నాయకీ భావమును, సోమనాథుఁడు భక్తి భావమునఁ బ్రతిపాదించి నట్లీ పద్యమునఁ దెలియుచున్నది.

**ఉ. నా యొడయండ, నా విభుఁడ, నా హృదయేశ్వర, నా మనోరమా,**
**నా యిలవేల్పు, నా వరద, నా గురులింగమ, నాదు జంగమా,**
**నా యధినాథ, నా వరుఁడ, నన్నుఁ గృపామతి బ్రోవుమయ్య, దే**
**వాయమిబృంద వంద్య, బసవా,**

ఇట్టి నాయికానాయక భావము శివతత్త్వసారమున పండితారాధ్యుఁడుగూడ వ్యక్తీకరించినాఁడు.

**కం. దురితహరమనియు, శుభములు**
**దొరకొనుననియుం దలంచి దురితారి భవ**
**చ్చరణాబ్జ భక్తిలలనా**
**పరవశ భావమున నిన్నుఁ బ్రణుతింతు శివా.**

వృషాధిపశతకము, భాషయందు, భావములందు, భక్తిరసోదయమందు పెక్కు గ్రంథములకు మార్గదర్శకమైనది. ఈతఁడంత్య ప్రాసతో వ్రాసిన పద్యముల శతకారంభమున విశేషముగ నున్నది. పోతన యంత్యప్రాస నియమ రచనావిధానమున కీ శతకమే మేలుబంతియై యుండవచ్చును.

ఈ శతకమున మొదటనుండి 49 పద్యములవఱకు సామాన్యముగ శతకముల శైలితో శివపరమగు స్తోత్రములు చేయఁబడెను. ఇఁక 67వ పద్యమునుండి 79వ పద్యము వఱకు బసవేశ్వరుని లీలలును, బసవపురాణమున వర్ణింపఁబడిన బిజ్జల తిరస్కారము, రాజధనమును భక్తులకిచ్చుట, బ్రాహ్మణద్వేషము, వారితో చర్చించి మానవాతీత చర్యలుచేసి తన మాహాత్మ్యమును జూపుట మొదలగునవి యొక్కొక్క పద్యమున రచింపఁబడినవి. తర్వాత 79-102వఱకు 23 భక్తుల చరిత్రము లొక్కొక్క పద్యమున ప్రశంసింపఁబడినవి. వీరి చరిత్రము బసవపురాణమున నుపాఖ్యానములుగా వర్ణింపఁబడినవి. శైవమతము శైవకవిత్వము నావేశపూరిత మైనదని తెల్పుట కీవృషాధిపశతక మొక్కటియే చాలును.

ఇందు మొదట 58 పద్యములు ప్రాసాదిశబ్దాలంకారములతోఁ గూడి యున్నవి. ఇందులో మొదటి 34వ పద్యము ఛేకానుప్రాసముతోను, 35-40 వఱకు లాటానుప్రాసముతోను, 41-45వఱకు ప్రతిపాదాను ప్రాసముతోడను, 60-63 వఱకు ముక్తపదగ్రస్తముతోను రచింపఁబడినది.



మరియు నిందు 40-48 పద్యములు దీర్ఘసమాసఘటిత ప్రార్థన పద్యములు. మఱియొక విధముగ దీనిని మూఁడు భాగములుగ విభజింపఁదగును. ఒకటి శబ్దాలంకార స్తుతి, రెండు సంస్కృతభాషాధిస్తుతి, మూఁడు భక్తప్రశంస.

ఈ కవి బహుభాషలలోఁ, బండితుఁడగుటచే వివిధభాషలలో బసవేశ్వరుని స్తుతించిన ముక్తిదాయకమని యెంచి యట్లొనర్చి, తన బహుభాషా పాండిత్యప్రభల ప్రకటించినాఁడు. ఇట్లితఁడు సంస్కృత, ద్రావిడ, కర్ణాట, మహారాష్ట్ర, శుద్ధాంధ్ర, మణిప్రవాళాది భాషలలో పద్యరచన చేసి వృషాధిపశతకమును గూర్చినాఁడు.

సోమనాథుని ద్విపద కావ్యముల శైలి జానుతెలుఁగుతో పండిత పామర జనగ్రాహ్యమైయున్నను, వృషాధిప శతకశైలి మాత్రము సరళమైనను సంస్కృతపద భూయిష్ఠమై, కొంచెము కఠినముగ నున్నది. 'విరచిత శుద్ధసాళువ.... కేళివిలోల, సంగమేశ్వర' అను పద్యమంతయు నొక్క సమాసముననే నడచినది. అట్లే 43,46,47, సంఖ్య గల పద్యములు గూడనున్నవి. ఇట్లున్నను అర్థ స్ఫురణము సహజముగ గలుగుచు, పద్యములు సరళగతి గలిగి భావములు సులభముగ గ్రాహ్యము లగుచున్నవి. శైలికి కొన్ని పద్యములు, ముక్తపదగ్రస్తమునకు

**చ. సురవరపూజ్య, పూజ్యగుణశోభిత, శోభితరూప, రూపవి**
**స్ఫురతరశీల, శీలగుణ పుంగవ పుంగవసత్వ, సత్వసం**
**వర, పర వాద, వాద భయవర్జిత పాపవిచార, చార యీ**
**శ్వర సమ నీవె దిక్కు బసవా.....**

ఇట్టివే 66, 10, 108 సంఖ్యగల పద్యములు..

ఇంక అంత్యప్రాసగల పద్యములు.

**ఉ. ఉద్ధత, భక్త వృద్ధ, వినుతో త్తమసిద్ధ, పరీత జంగమ**
**శ్రద్ధ, సతాత్మ శుద్ధ, గణరాజి సమృద్ధ, విముక్త పాశస**
**న్నద్ధ, మహాప్రసిద్ధ, యగుణత్రయ బద్ధ, శరణ్యమయ్య భా**
**స్వద్ధత చిత్ప బద్ధ బసవా........**

**చెన్నమల్లు సీసములు :-**

ఇందు చెన్నమల్లు మకుటముగాఁగల 34 సీసపద్యములున్నవి. దీన భక్తస్థలము, మహేశ్వర, ప్రసాద, ప్రాణలింగ, శరణ, ఐక్య, అను షట్స్థలములు వర్ణింపఁబడినవి. సోమనాథుఁడు జీవ సమాధికేగుచు భూబిలమున కేర్పరచిన 32 మెట్లను దిగనెంచి, యొక్కొక్క మెట్టు దిగునపుడొక్కొక్క పద్యము చొప్పున 32 పద్యములు రచించినటుల వీరశైవులు కొందరు చెప్పుదురు. సోమనాథుఁడు సిద్ధి పొందినచోట ప్రతిసంవత్సర ముత్సవములు సేయునపు డీపద్యములు నేటికిని చదువుదురట.

**క॥ చెన మల్లేశ్వరు పేరిట**
**సునిశితముగఁ బాలకురికి సోమేశుఁడు దా**
**ఘనభక్తి వెలయఁ జెప్పెను**
**చెనమలు సీసంబు లెసఁగ చెలఁగ ధరిత్రిన్.**

**ప్రారంభము :-**

**సీ. శ్రీగురులింగ సంచిత కృపోన్నతిఁ జేసి**
**కంటి జంగమ పాదకమలసేవ,**
**జంగమ లింగ ప్రసన్నత్వమునఁ జేసి**
**కంటి ప్రసాద సుఖంబు నొంద,**
**తత్ప్రసాదప్రబోధ స్థైర్యమునఁ జేసి**
**కంటి సర్వాంగ ప్రకాశ భక్తి**
**భక్తి సౌభాగ్యాను భవ పూర్తి మైఁజేసి**
**కంటి జీవన్ముక్తి కడమలేక,**

**ఆ. ఇంకనేమి కొఱత యేల నీకాశింపఁ**
**బాడియాడి, దైన్యపడి, భజించి**
**మెచ్చి, పొగడిరేని మీఁద నొందెడి ఫలం**
**బెన్న నున్న దెట్లు చెన్నమల్ల.**



**అంత్యము :-**

**సీ. భక్త స్థలంబునఁ బదమూఁడు, మాహేశ**
**పదమున నైదు నేర్పడఁ బ్రసాద**
**పదమున మూఁడు, మత్ప్రాణ లింగికి నాల్గు**
**శరణ స్థలంబున నరయ నైదు**
**నైక్య స్థలంబున కలవడ రెండును**
**షట్ స్థలవిజ్ఞాన సరణి యొప్పి**
**క్షితిని ముప్పది రెండు సీస పద్యంబులు**
**సరసోక్తిగాఁ బాలకురికి సోమ**

**గీ. నాథుఁడన నొప్పు నారాధ్య నవ్యమూర్తి**
**యఖిల వేదపురాణ శాస్త్రార్థ విదుఁడు**
**వీరశైవ సభా యోగ్య విదితముగను**
**చెన్నమల్లేశుఁ బ్రీతిగాఁ జెప్పె నిట్లు.**

**బసవోదాహరణము :-**

**ఉదాహరణ నిర్వచనము**: పద్యము, కళిక, ఉత్కళిక యనుక్రమము చొప్పున ప్రథమమాదిగా సంబోధనముతోఁ గలసి యష్టవిభక్తులతో నెనిమిది పద్యములను, తుదకెనిమిది విభక్తులతో నొకపద్యమును నెనిమిది కళికలు, నెనిమిది నుత్కళికలు గలుగునట్లువ్రాసిన కావ్యమున కుదాహరణమని పేరు. ఇది సామాన్యముగా దేవతల గాని, మహాపురుషులగాని చేసిన స్తుతివిషయకముగా నుండును. బసవో దాహరణమున బసవేశ్వరుఁడు స్తుతింపఁబడెను. సంస్కృతమునఁ గూడ నిట్టివాని నితఁడు రచించెను. ఆంధ్రభాషయం దుదాహరణములు గొన్ని కలవు. (1) మచ్చ వెంకటకవి (1896) రచించిన ముఖలింగేశ్వరోదాహరణము, (2) రావిపాటి త్రిపురాంతకుని, త్రిపురాంత కోదాహరణము (3) తాళ్ళపాక తిరుమలయ్య వ్రాసిన వెంకటేశ్వరోదాహరణము (3) చిత్రకవి పెద్దన (లక్షణసార సంగ్రహము) యొక్క హనుమదుదాహరణము (5) అప్పకవి (అప్పకవీయము ఆ.4-1665) వ్రాసిన శ్రీకృష్ణో దాహరణము, (6) బాలకవి యనంతయ్య రచిత శేషోదాహరణము (7) ఏనుఁగు లక్ష్మణకవి బసవోదాహరణ ప్రారంభము :

ఉ. శ్రీ గురులింగ తత్పరుఁడశేషజగన్నిధి, శుద్ధ తత్త్వసం
యోగ సుఖప్రపూర్తి వృషభోత్తమ మూర్తి, యుదాత్త కీర్తి ది
వ్యాగమ మూర్తవర్తి, బసవయ్య కృపాంబుధి మాకు భక్తి సం
భోగములం బ్రసాద సుఖ భోగములం గరుణించు గావుతన్.

### కళిక

వెండియుఁ ద్రిభువన వినుతి సమేతుఁడు
మండిత సద్గుణ మహిమో పేతుఁడు,
సురుచిర శివ సమ సుఖసంధానుఁడు
పరమ పరావర భరిత జ్ఞానుఁడు,
విదితానందా న్వీత మనస్కుఁడు,
సదమల విపుల విశాల యశస్కుఁడు
శ్రీవిలసిత పద చిరతర భద్రుఁడు
గావున సాక్షా త్కలియుగ రుద్రుఁడు ॥

### ఉత్కళిక

భువనోపకారా భవమోద ధీరా
భక్తి సంయోగా ముక్తిసంభోగా
సౌఖ్యాబ్ధిలో నా ముఖ్యుఁడై తానా
వెలయు శుభవరుఁడూ, యిల విశ్వగురుఁడూ.

చ. పసిగొని యెవ్వఁడేని బసవాయను నీ సుకృతాక్షర త్రయం
బెసఁగఁ బఠించెనేని, గిరిజేశున కాతని వక్త్రగహ్వరం
బసదృశగేహ మన్న యవి యార్యుల వాక్యములట్ల గావునన్
బసవనఁ బుణ్యమూర్తిఁ దలఁపంగదె చిత్తమ పాయదెప్పుడున్.

అంత్యము :-

ఉ. నీవు దయాపయోనిధివి, నిన్ను నుతించినఁ గల్గుభక్తి, నీ
చే వరవీరశైవ నుతి చేకుఱు, నీకయి యిత్తు కబ్బముల్
నీవలనన్ గృతార్థత జనించును, నీకు నమస్కరింతు, నా
భావమునందు నుండి ననుఁ బాయకుమీ బసవయ్య వేడెదన్.



**బసవరగడ :-**

పిడుపర్తి సోమనాథుని బసవపురాణావతారికను బట్టి పాల్కురికి సోమన బసవరగడ, బసవాఢ్యరగడ, సద్గురురగడ, గంగోత్పత్తిరగడ, మొదలైన కొన్ని రగడల రచించినట్లు దెలియుచున్నది. కాని బసవరగడ మాత్రమే యింతవఱకు లభించినది. ప్రాచీనాంధ్ర జాతీయ గేయ వాఙ్మయమున రగడల కెక్కువ ప్రాముఖ్యత యున్నట్లున్నది. ఇవి కంద, అక్కర, ద్విపదలతోఁ బాటు జాతులుగా బరిగణింపఁ బడినవి. అల్లసాని పెద్దనకుఁ బూర్వులైన నన్నయాదు లెవ్వరీరగడల నాదరించలేదు. పెద్దన కాలమునుండి ప్రబంధములలో రగడలు తిరిగి తలయెత్తినవి. కాన పాల్కురికి సోమనాథుని రగడలు ప్రాచీన వాఙ్మయ స్వరూపమును దెల్పును. ఆంధ్రమున వివిధ రగడలు గలవు. అవి మధురగతి, ద్విరదగతి, తురగవల్గనగతి, రగడలు గలవు. ఇవి క్రమముగా కన్నడమందలి మందానిల, లలితోత్కవ రగడలతో సమానముగ నుండును.

ఈ బసవరగడకుఁ బ్రారంభమున నుత్సాహ వృత్తమును, ప్రతి పాదాంత మునను 'శరణు బసవ' యను మకుట మున్నది. కర్ణాటకవిచరిత్రకారుఁడు దీనిని కర్ణాటకృతియని పొరపాటు పడినాఁడు. కన్నడమునకు విలక్షణమైన యతి నియమ మిందుఁగలదు. దీనినే 'బసవోత్తరశతనామముల'ను నామముతోనున్నట్లు రగడనున్న కందపద్యము వలనఁదెలియుచున్నది. దీనిలో 108 పాదములున్నవి. రగడలు ద్విపదవలె ద్విపాదనియమము గలవి. కాని ద్విపదలవలె నొక్క యాది ప్రాస నియయమే కాక, వీని కంత్యప్రాస నియమము గూడఁ గలదని యనంతుఁడు, నప్పకవియుగూడఁ దెల్పిరి. కాని యా నియమ మీతని కృతియందుఁ గొంత విశిష్టముగ నున్నది. మొదటి 78 పాదముల వఱకీ ద్విపాదై కాంత్య నియమమును సోమన పాటించినాఁడు గాని తర్వాత ద్విపద యందువలనే యక్కడక్కడ ప్రాసయతిని గూడ నంగీకరించినాడు. తర్వాత 14 పాదముల వఱకు ప్రతి పాదమున నొక్కొక్క ప్రాసము చొప్పున యంత్యప్రాసమును పాటించెను. చివరి 8 పాదములలో నింకఁ గొంతమార్పు చేసినాఁడు.

ఇది బసవస్తుతి. ఆద్యంతములందు రెండు కన్నడ పద్యములున్నవి. కడపటి తెలుఁగుపద్యము గ్రంథములోనిది కాదేమో.

ప్రారంభము :-

శ్రీ వరాజ దేవరాజ, సిద్ధ సాధ్య యక్ష ర
క్షోవిహంగరాట్పతంగ సోమధూమ కరమరుం
జీవితేశ విధృతపాశ సేవిత ద్వయాంఘ్రి రా
జీవ నిన్నునాం సొగళ్వ శ్రీ వృషాధి నాయకా.

రగడ

శ్రీ వృషాధినాయక ప్రసిద్ధ భావ శరణు బసవ
తావకాంఘ్రిసేవకాఘ దాహ దాహ శరణు బసవ
నందిత ద్వితీయ శంభు నామధేయ శరణు బసవ
వందిత త్రిలోక విబుధవర నికాయ శరణు బసవ
అచల శైవ ధర్మనిర్ణ యావతార శరణు బసవ
ప్రచుర యగమితాంఘ్రి ధర్మపథ విహార శరణు బసవ
ప్రమథగణ పద ప్రసిద్ధ పట్టభద్ర శరణు బసవ
ప్రమథ శాశ్వత స్వలాభ భావశుద్ధ శరణు బసవ
సురవినుత శిలాద లబ్ధ సుకృత రూప శరణు బసవ
హరగణాభి జాత చిన్మయ ప్రథిత శరణు బసవ
కమలభవ శివ కరాబ్జ కాల రుద్ర శరణు బసవ
నియత విష్ణు శల్యాహార నీల రుద్ర శరణు బసవ
ఖ్యాత భూత పంచకాత్మ కాల రుద్ర శరణు బసవ
నారసింహ దళన శరభ నామరుద్ర శరణు బసవ
భూరి మత్స్య కూర్మ హరణ భూమరుద్ర శరణు బసవ
-- -- -- -- -- --
-- -- -- -- -- --
శరణు, శరణు, శరణు, బసవ, శరణు, శరణు, శరణు, బసవ.



అంత్యము :-

క. శరణ స్తవ కల్ప కుజాం
కురపద శాఖాభిజాత నవ కుసుమాష్టో
త్తరశత నామంగళ బస
వర నంగర్పి సిద్ధ పాల్కురికి సోమాంకం.

క. శరణస్తవ మేలొప్పవ
శరణ గణౌత్సాహ రగళియె, బరదొడె పరి శితుదె, వి
స్తరిశదపె, బసవనె కావం బసవర శిగర కప్పిన్
శుద్ధ పాలుకురికి సోమాంకం.

క. వావిరి బసవస్తుతి సం
భావనమైఁ జదివి చదివి ప్రమదంబున వా
పోవక బాబా సాసా
వావా యనకున్న నోట వాంబెట్లుడుగున్.

**సోమనాథుని వీరశైవమత స్వరూపము :**

బసవపురాణ పండితారాధ్య చరిత్రములందు, సోమన వీరశైవ సిద్ధాంతములను కాంతా సమ్మితమునఁ జేసి ప్రతిపాదించినాఁడు. ఈతఁడు ముఖ్యముగా భవులైన బ్రాహ్మణులను 'త్రాటి మాలలని, పచ్చిమాలల'ని (బసవ. పు.పుట.19, 209, 217, 240, 237) త్రాటకుక్కలు, మాలకుక్కలు (బస.పు.237, పండి.-II 242), గాడిదలనియు, (బసవ.పు.225, పండిత -II 85) చెడ తిట్టినాఁడు. ఇట్టి బ్రాహ్మణావమానమును వెక్కిరింతలను కందుకూరి వీరేశలింగము గారు బ్రహ్మసమాజోత్కర్షను దెల్పు గ్రంథము లందలి విషయమును బోలినది. వారి కిచ్చిన నామధేయములుగూడ నట్లే యున్నవి. ఇతని దృష్టిలో వేదము లనాదులు కావు. శివుఁడు మాత్రమే యనాది పురుషుఁడు. అతని నుండియే సర్వము సృష్టింపఁబడినది. వీరశైవులకు వేదాధ్యయనాధికారము గలదు. ఈతఁడు వేద

ప్రమాణముల నంగీకరించి, తన్మూలమున మతమును సమర్థించినాడు. శివపరముగా వేదములకు వ్యాఖ్యానము చెప్పెను. తన మాదిరి బ్రాహ్మణుల నితఁడు ద్వేషింపఁడు. పండితారాధ్యుఁడు, బెలిదేవ వేమనారాధ్యుఁడు నిట్టివారు. అగ్నిహోత్రాది కర్మల దూషించినాఁడితఁడు.

వీరికి ముఖ్యముగా జాతిభేదములేదు. భక్తియే ప్రధానము. కాని జాతి పంచముఁడు హీనవంశుఁడు గాఁడట. (పండి.1, 675-676). బ్రాహ్మణకులజుని శివభక్తుఁడైన పంచముఁడు చంపినను వానిని దండింపరాదట. దోషము లేదట. మఱియొక ముఖ్యవిషయమేమనఁగా వీరికి శీలము కన్నను భక్తియే యెక్కుడు ప్రధానమైనది. వీరవ్రతులలో నెక్కువ దొంగలు, జారులు మొదలైనవారు గలరు. శివప్రీతి కొఱకు చేసిన యేపని యైనను మంచిదేయట. సంకల్పముబట్టి, ఫలమును బట్టి కార్యమునకు గుణదోషము లుండునట. జంగమునికి లింగమునకు భేదములేదు. (పండిత 1.200) జంగమభక్తి యంత ముఖ్యమైనది. ఈ మతమునందు, జంగమూర్తియే లింగమూర్తియని యాచరించుట యుత్తమము. అతఁడు గురుమూర్తియని పూజించుట మధ్యమకక్ష. అతఁడు శివశాసన ధారుఁడని భావించుట తుది పక్షము.

వీరశైవుల భక్తి ప్రామాణ్యమున కాత్మార్పణమే గురుతు. వీరి భక్తి ప్రకటనార్థము నేత్రములు పెరికికొనుట, కాలుసేతులు నఱికికొనుట, మొదలైనవి చేయుదురు. ఇది వీరవ్రతమట. జంగముల కేది యడిగిన నది యిచ్చివేయ వలెనట. ఈ వీరభక్తి తామసిక భక్తియైనది. శివుఁడు తమోగుణుఁడైనచో వీరశైవ భక్తి తమోగుణ యుతమగుటయే గుణము కాఁబోలు. 'పురుషుఁడు శివభక్తి విరహితుఁడేని, పురుషుని మీరుట తరుణికి పథము' (బ.పు.190). దీనికొక కథ బసవపురాణమునఁ గలదు. ఈ విషయము శివతత్త్వసారమున సూత్రప్రాయముగ గలదు. వీరశైవ మతవ్యాప్తికై ప్రాణిహింసగూడఁ జేయవచ్చుననుట వీరి సిద్ధాంతము. ఈ విషయము బౌద్ధ జైన మతములకు విరుద్ధమైనది. బౌద్ధ జైన మతములు బ్రాహ్మణమతమువలె వీరికిఁ బరమశత్రువు.



వీరశైవ మతమున జీవేశ్వరులకు; నాయికా నాయక భావము గలదు. ఇది విశిష్టాద్వైత మతమందుగూడఁ గలదు. ఈ భావమును పండితారాధ్యుఁడు శివతత్త్వ సారమున వ్యక్తీకరించినట్లే, సోమనగూడ వృషాధిపశతకమునఁ దెలిపినాఁడు.

**ఈతని భాష** : పాల్కురికి సోమనాథుఁడు వెనుకఁ గనుగొనినట్లు బహు భాషలలో కూలంకష పాండిత్యము గలవాఁడైనను సాంకేతికములకు, సంప్రదాయములకు దాసుఁడుగాక సంపూర్ణ స్వాతంత్ర్యము గలవాఁడు. సంప్రదాయములు తన కవితా ప్రవాహమున కడ్డుపడినచో వాని నతిక్రమింప నెంతమాత్రము వెనుదీయఁడు. భాష నీతడు చేతిలో కీలుబొమ్మవలె నెట్లుకావలసిన నట్లాడించెను. 'నిరంకుశాః కవయః' యను నార్యోక్తి యితనిపట్ల పూర్ణముగ నన్వర్థమగును. ఇతఁడు సంస్కారపరుఁడు. ఆంగ్లభాషలో కార్లైలు పండితుని రచనా విధానమెట్టిదో, తెలుఁగున సోమనాథుని రచనావైఖరి యట్టిది. కాన వ్యాకరణ నిబంధన లితనిని బంధింప జాలకుండెను. అందుచే ననేక విధముల భాషా సంప్రదాయోల్లంఘన మొనర్చినాఁడు. ఈతని కవితా ప్రవాహమున కడ్డు తగలినపుడు చేయని విరుద్ధ ప్రయోగములు లేవు. వైరిపదము లనఁబడు దుష్ట విరుద్ధ మిశ్ర సమాసములు, గ్రామ్యపదములు, దుష్టసంధులు, లింగ వ్యత్యాసములును, కర్ణాట భాషా సంప్రదాయానుగుణముగ నాంధ్ర సంస్కృతముల నుపయోగించుటయు చేసెను. దీనికిఁ దోడు కర్ణాట భాషా పదముల విరివిగా ప్రయోగించెను. ఆంధ్ర పదముల విచిత్రముగా మార్చి ప్రయోగించెను; ఇష్టము వచ్చినట్లు శబ్ద మధ్యమున నచ్చుగాని, హల్లునుగాని లోపింపఁ జేసినాడు. ఈ ప్రయోగములు భాషా శాస్త్రజ్ఞులకు విశేషోపయోగము. ఇట్లే అర్ధానుస్వార, రేఫద్వయ భేదముల విషయమై లక్ష్యము చేయలేదు. ఇష్టము వచ్చినట్లు మిశ్రము చేసి వాడినాఁడు. ఈ వ్యత్యాసము లేఖకుల యందుగూడ నుండి యుండును. ఈ విధముగ నితఁడు భాషకు వశ్యుఁడుగాక, భాషనే తన స్వాధీనమం దుంచుకొనెను.

**ఈతని శైలి** : సామాన్యముగా శైలి వర్ణనా విషయముపై నాధారపడి యుండును. దీనికిఁ గవి వ్యక్తిత్వము గూడ సాయపడును. పాల్కురికి సోమనాథుఁనకుఁ దన యనుభవసార, చతుర్వేదసారాది మత విషయిక గ్రంథములందు

శైలీభేదము విశేషముగ ప్రకటించుటకు వీలుపడలేదు. అందు విషయ ప్రతిపాదనము మాత్రముండును. ఇఁక వృషాధిప శతకాది భక్తిప్రధాన వస్తుగ్రంథము లందు భక్త్యా వేశపరమైన రచన యుండును. కాని కథాప్రాధాన్యముగల బసవపురాణ పండితారాధ్య చరిత్రము లందు కథావిషయ భేదమును బట్టి రసోచితముగ శైలి మారుచుండును.

అసలు సోమనాథుఁడు బసవపురాణ పండితారాధ్య చరిత్రములను జన సామాన్యము కొఱకై రచించినాఁడు. కనుక తాను జానుతెనుఁగున సరళమైన శైలిలో వ్రాయుదునని మొదటనే తెల్పినాడు. కాన నతని కవితాశైలి బహు సులభగ్రాహ్యమై సరళమైనది. కాని యిట్లని యతఁడు వస్తు గాంభీర్యము పట్ల, రసోద్రేకకర సన్నివేశము లందు, పేలవముగ, నీరసముగ రచింపక, రసోచితముగ నన్నయవలె, గంభీర సంస్కృత సమాసయుతముగ రచించి రసమును చక్కగ పోషించినాఁడు. పండితారాధ్యుని శక్తిని వర్ణించునప్పుడు సోమనాథునకు సహజముగ గంభీరమైన శైలి బయలుదేరును. పండితుడు జైనునితో వాదించునపుడు చూపిన వాగ్ధాటి నిట్లు వర్ణించినాఁడు.

**'పండితారాధ్యుండు దండితవాది**
**ఖండన శాస్త్రతర్కప్రౌఢి, పేర్మి,**
**నతుల పురాణేతిహాసాగమాను**
**గత నిజోదాసీన కలితవాక్యముల,**
**సకలవేదానంత శాఖోపనిషద**
**వికలతర్కస్మృతి విహితసూక్తులను,**
**శిష్టానుమత హేతు దృష్టాంత సుప్ర**
**హృష్ట ప్రమాణ సమీహితోక్తులను,'** మహిమాప్ర, పుట.3

వీరశైవ భక్తుల వర్ణించునప్పు డిట్టి గాంభీర్యమునే చూపును. చేటల వేమయ్యగారి నిట్లు వర్ణించెను.

**'వెండియు చేటల వేమయ్య నాఁగ**
**ఖండేందుధర భక్తగణ మదేభంబు,**
**నాద్యస్థుఁ డణిమాది కాష్ఠైక గుణ స**
**ముద్యోతి తైశ్వర్యయుత యశోరాశి,**
**గహన భక్తిమహత్త్వ కౌక్షేయ కృత్త**
**బహురస సిద్ధనివహ ఘోణుఁ డనఘుఁ,**
**డపగత రస రసాయన భోగముఖ్య**
**విపుల రాజిత రాజ్యవిభవ సౌఖ్యుండు,**
**నిర్గత స్వర్గాపవర్గ మార్గుండు,**
**భర్గ నిరర్గళ భక్తి కాంతుండు మొ॥** పురాత ప్ర. పుట 475.



ఇఁక శ్రీశైల పర్వత వర్ణనమునఁ గూడ నిట్టి గంభీరమైన శైలియే యవలంబింపఁబడినది.

**'కడలేని నిర్మల గాఢ మహత్త్వ**
**జడతా విహార విస్తారో దకముల,**
**నంగీ కృతాయతోత్తుంగ శృంగౌఘ**
**మంగళ రంగత్తరంగ సంఘములఁ,**
**బటుశైల చూడావిభాసి నీహార**
**పటల ప్రకార విస్ఫార ఫేనముల,**
**శైలాగ్ర విహరణాసక్త ప్రమథ వి**
**శాల దివ్యవిమానచయ వహిత్రముల'** పర్వత ప్ర.228

ఇట్టి ఘట్టములు బహు స్వల్పముగనే యుండుటచే జనసామాన్యమున కుల్లాసము గల్గించునే కాని యన్వయక్లేశ కాఠిన్యముల గల్గించవు. ఇతర స్థలములందు సర్వసులభశైలిని వాడినాఁడు. కొన్నిచోట్ల మాత్రము వస్తువుల పేర్లను వివరించు పట్లను, పూర్వభక్తుల మాహాత్మ్య విశేష కథనము పట్లను పునరుక్తి శబ్దములతో నొకప్పుడు సారస్వత ప్రియులకు, పండితులకును విసుగు కల్గించు రోకటిపాటవంటి యూకదంపుడు కవిత్వమును రచించినాఁడు. గౌతమాది మునికృత శ్రీగిరి ప్రశంసనమున నిట్లు రచించెను.

**'పూజించి పడయరే పూజకుల్ తొల్లి,**
**యోజించి పడయరే యోగులు తొల్లి,**

**కామించి పడయరే కాముకుల్ తొల్లి,**
**నేమించి పడయరే నిస్పృహుల్ తొల్లి,**
**వర్తించి పడయరే వ్రతమతుల్ తొల్లి,**
**యర్చించి పడయరే యార్యులు తొల్లి,**
**చర్చించి పడయరే సన్మనుల్ తొల్లి,**
**స్తుతియించి పడయరే సుకవులు తొల్లి'** పర్వత ప్ర.273

ఇట్లనేక పంక్తులు వ్రాయఁబడినవి. కాని యివి పామరులకు గేయముగ పాడునపుడు మాత్రము వినుకుదల గల్గింపక, యొక విధమైన తూఁగుతోడను, స్వరము తోడ నుల్లాసము గల్గించుచునే యుండును. ఈ పామర హృదయతత్త్వమును గ్రహించియే, వారి ప్రీత్యర్థము, సోమనాథుఁడు మధ్యమధ్య నిట్టి రచనములఁ గావించెను. ఇట్టి రచనము పామరులు పాడు గొల్లసుద్దులు, జంగమకథలు, బొబ్బిలి పాట కథలందు విశేషముగ గాననగును. అద్యతన కాలమున వెంకట పార్వతీశ్వర కవులీమార్గమునే యవలంబించిరి. మఱియు బసవపురాణ పండితారాధ్య చరిత్రములు నిర్వచనద్విపద కావ్యము లగుటచే నందు వివిధ వస్తువులను వివరించు సందర్భమున నిట్లు వ్రాయక తప్పదయ్యెను. చంపూ గ్రంథములైన ప్రబంధములం దీ విషయము సామాన్యముగ వచనములలో రచింపఁబడును. అట్టి నీరస విషయములు ద్విపదలోఁ గూర్చినపు డిట్లుండక మఱి యెట్లుండును? పండితులకు మాత్రమిట్టి రచనలు చాల వెగటు పుట్టించును. అట్టిదే మఱియొకచోట,

**'పడగలుఁ బడగలు ముడిపడి గొనఁగ**
**గొడుగులు గొడుగులు దొడితోడి నడర**
**-- -- -- -- --**
**వినుకులు వినుకులు వినువీథి మ్రోయ**
**మనుకులు మనుకులు మానక తగుల**
**మదళీలు మదళీలు మచ్చరింపంగ మొ॥** పర్వత.ప్ర.పుట.395

ఇక పుష్పపత్ర ఫలవర్ణన విధానము. వివిధ ఫల పుత్ర పుష్పములని వ్రాయుటకు బదులుగా,



**'బిల్వ పత్తిరి, నావుమ పత్తిరి, మాచి**
**పత్తిరి, నేరేడు పత్తిరి, జమ్మి**
**పత్తిరి, కాంచన పత్తిరి, వచ్చపత్తిరి" మొ॥**
**గోగు పుష్పములు, నశోక పుష్పముల్, వొగడ**
**పుష్పముల్, సేవంతి పుష్పముల్, మొల్ల**
**పుష్పముల్, గరవీర పుష్పముల్, దుమ్మి మొ॥**
**పుష్పముల్ రేనుపండ్లును, మామిడిపండ్లును, నీడె**
**పండ్లును, నేరేడుపండ్లును, మొరలి పండ్లు** పర్వత ప్ర.355-7

**ఛందస్సు :-**

మత విషయములందెట్టి స్వాతంత్ర్యప్రియుఁడో పాల్కురికి సోమనాథుఁడు సారస్వత విషయములందు గూడ నట్టివాఁడే. అందుచేతనే పూర్వాంధ్ర కావ్యములు వృత్తములందు రచింపఁబడఁగ నితఁడు తన కావ్యములను తద్విరుద్ధముగ ద్విపదలో రచించి నూతన మార్గమును ద్రొక్కెను. అందులోఁగూడ విశేష స్వాతంత్ర్యము చూపినాఁడు. ద్విపద రచనయందు రెండు నియమములు సంప్రదాయానుగుణముగ పాటింపఁబడినవి. మొదటి ప్రాస యతి నిషేధము. రెండవది యే ద్విపద పాదమున కాపాదము విడివిడిగా నుండవలెకాని, ప్రథమ పాదాంతపదము మధ్య విరిగి రెండవ పాదమునకు నడవకుండుట. సోమనాథుఁ డీ రెండు నియమములను మీరి తన స్వాతంత్ర్యమును జాటినాఁడు. 'పాల్కురికి సోమన పతితుఁడు ప్రాసవళ్లు పెట్టి రచించిన యప్రమాణపు బసవపురాణమ'ను నిందా వాక్యములకు జవాబిచ్చువాడు వోలె పండితారాధ్యచరిత్రమున ప్రాసయతి నిట్లు సమర్థించినాఁడు.

'అనియతగణై' రనియు 'ప్రాసో వా' యనియుఁ, యతిర్వాయనియుఁ జెప్ప ఛందోవినిహితోక్తి గాన

**'ప్రాసమైనను యతిపై వడియైన**
**దేసిగా నిలిపి యాది ప్రాసనియతి**
**దప్పకుండఁగ ద్విపదలు రచింతు'** నని వ్రాసినాడు.

పైనఁ దెల్పిన రెండు నియములలో మొదటిదగు ప్రాసయతి ప్రయోగము బసవపురాణ పండితారాధ్యచరిత్రములందు సమముఁగా జేసినను, ద్వితీయ గుణమును బసవపురాణమందు కంటె పండితారాధ్యచరిత్రమందు విశేషముగాఁ మీరినాఁడు.

ఇఁక నన్నయ సీసపద్యముల నొక నియమముతో రచించెను కదా. ఆ నియమమునే సోమనాథుఁ డనుభవసార చతుర్వేదసారములందు పాటించినాఁడని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బసవపురాణ పీఠికయందు వ్రాసినారు. (చూ.పుట. 89) కాని నన్నయ సీసపద్యనియమము సోమనాథుఁడు పాటింపలేదనియే బండారు తమ్మయ్యగా రాంధ్ర సాహిత్య పరిషత్పత్రిక రజతోత్సవ సంచికలో ప్రభాకరశాస్త్రిగారి వాక్యములు సత్యసమ్మతములు గావని వ్రాసిరి. (చూ.పుట.171) విచారింపగా స్వాతంత్ర్య ప్రియుఁడైన సోమనాథుఁడు నన్నయ సీసనియమములు పాటించువాఁ డని భావించుట సాహసము. అందులో నన్నయ సీసనియమములు నన్నెచోడుని కాలము నాటికే సడలినవి. కాని క్రౌంచపదవృత్తము నీతఁడు నన్నెచోడునికంటె నెక్కువ నియమముతోఁ బాటించెను. నన్నెచోడుఁడు వృత్తపాద ప్రథమదళమున ప్రాసయతి వాడి, ద్వితీయ దళమునఁ దన కిష్టమువచ్చిన యతిని వాడఁగ, నీతఁడు పాద ప్రథమదళమున ప్రాసయతి వాడుచు, ద్వితీయదళమున యతిని, ప్రథమదళ ప్రథమాక్షరమునకు మైత్రి గలదిగనే వాడినాఁడు.

**ప్రాసవిశేషములు** : ఈతని కవితయందు సంయుక్తాక్షర ప్రాసమున కేదో యొక హల్లునకు మాత్రము సామ్యమున్నచో గూడ వాడెను. ఇది కర్ణాటభాషలో 'శాంత' ప్రాసమను పేరితో చెల్లినది. కర్ణాటభాషలో 'వర్గప్రాస' మను పేర వర్గాక్షరములకుఁ బరస్పరము ప్రాస చెల్లును. అట్లే 'సమీపప్రాస'మను పేర శ,ష, సలకు పరస్పరము ప్రాస చెల్లును. ఈ రెంటిని గూడ పాల్కురికి సోమనాథుఁడు



తెలుఁగు రచనమున వాడినాఁడు. ఈ విధముగ నితఁడు ప్రాసప్రయోగమున కర్ణాటసంప్రదాయము నవలంబించెను. మఱియు నితఁడు పూర్ణార్ధబిందు ప్రాసమును, బిందు నిర్బిందుప్రాసమును, రేఫద్వయ ప్రాసమునుగూడ నిరాటంకముగ వాడి తన స్వాతంత్ర్యమును ప్రకటించినాఁడు.

**యతి విశేషము** : ఈత డఖండయతిని వాడినాఁడు.

# తృతీయప్రకరణము

## పిడుపర్తి కవులు

పాల్కురికి సోమనాథుని తర్వాత పేర్కొనఁదగినవారు పిడుపర్తి కవులు. వీరు సోమనాథుని శిష్యపరంపరలోనివారై, యాతని గ్రంథములను ప్రచారములోనికిఁ దీసికొని వచ్చుటయేకాక, వీరశైవగ్రంథముల ననేకము రచించి తన్మతమునకు గురుపీఠ మలంకరించిరి. పద్య బసవపురాణ కర్తయైన పిడుపర్తి సోమనాథుఁడు తన వంశవృక్షము నిట్లు తెల్పెను.

### పిడుపర్తి వారి వంశవృక్షము

శివరాత్రి కొప్పనాథుఁడు

బసవయ్య

(క్రీ.శ.1422) పెనసోమన[2]   కొప్పయ్య   భువనయ్య

పినసోమన   దేవయ్య (భా.మల్లమ)   చిక్కయ్య   బసవయ్య   పాలకురికయ్య

నిశ్శంకయ్య   కొమరయ్య   నిమ్మనాథుఁడు

బసవన

సోమన   [3]బసవన(భా.నాంగాంబ) 1475 క్రీ.శ.

దేవయ   గుంటూరి వీరయ్య

1510-[4]సోమన   పాలన   గురువన   బసవన

బసవప్ప 1530



1. డోకిపఱ్ఱగ్రహారమును మొదట సంపాదించిన వాఁడు
2. డోకిపఱ్ఱగ్రహారము అంకిలిపడగా ప్రౌఢదేవరాయుల కాలమున తిరిగి సంపాదించినవాఁడు.
3. దీక్షాబోధ, పిల్ల నైనారుకథ, బ్రహ్మోత్తరఖండములకు కర్త.
4. పద్య బసవపురాణ, ద్విపద ప్రభులింగలీలల కర్త.

5) పద్య ప్రభులింగలీలల కర్త.

**వీరి దేశము** : పాల్కురికి సోమనాథునిఁబట్టి పిడుపర్తివారు నైజాము ప్రాంతము వారని శేషాద్రి రమణ కవులు రచించిన రీతిగ తలంప వీలులేదు. పిడుపర్తి వంశీయులగు జంగములు ప్రస్తుతము గుంటూరు జిల్లాలో కనగాల, గరుడాచలపాలెం మున్నగు గ్రామములందున్నారు. తెనాలి తాలూకాలో పిడుపఱ్ఱు గ్రామమున్నది. మఱియు డోకిపఱ్ఱు గ్రామము కృష్ణా జిల్లా గుడివాడ తాలూకాలోను, డోకిపఱ్ఱు గ్రామము గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలోను నున్నది. పద్య ప్రభులింగలీల కృతిపతి యగు చల్లపల్లి మల్లయార్యుఁడాగ్రంథమున 'చల్లపల్లి శాసన' యని సంబోధింపఁబడినాఁడు. ఈ చల్లపల్లిగూడ కృష్ణా జిల్లాలోనే యున్నది. కాన పిడుపర్తివారు తెనాలి తాలూకాలోని పిడుపఱ్ఱు గ్రామమువారై యుందురు. కాన వీరు గుంటూరు మండలము వారై యుందురు. నైజాము రాష్ట్రమందు గూడ నీ నామపు గ్రామము లేవైన నున్నవేమో విచారింపవలసియున్నది.

**వీరి వంశము** : పిడుపర్తివారు మొదట నాంధ్ర నియోగి బ్రాహ్మణులు. వీరి పూర్వులు పాల్కురికి సోమనాథుని వలన దీక్షపొంది యజ్ఞోపవీతాదులను త్యజించి వీరశైవ మతములోఁ జేరి జంగములైరి. మొదట వీరారాధ్య బ్రాహ్మణ శాఖకుఁ జెందినవారని కొందఱు తలంచుచున్నారు.

**వీరి కాలము** : ప్రతాపరుద్రుని మంత్రియైన యిందుటూరి యన్నయ్య సహాయమున రాజుచేత శివరాత్రి కొప్పనాథునికి డోకిపఱ్ఱు నగ్రహారమును పాల్కురికి సోమనాథుఁ డిప్పించె ననియు, నది యంకిలిపడగా నతని మనుమడైన పెదసోమన వలన ప్రౌఢదేవరాయల కాలమున తిరిగి యది సంపాదింపఁబడెననియు పిడుపర్తి సోమనాథుఁడు తన పద్య బసవపురాణ పీఠిక యందు రచించెను.

---

1.ఆం.సా.ప.ప. **XXIII.** 2-బండారు తమ్మయ్యగారి వ్యాసము.

క॥ ఆదిన్ ప్రతాపుఁడిచ్చిన
యా దోకిపురంబు నడుమ నంకిలి పడినన్
మోదమునఁ బ్రౌఢరాయ మ
హీదయితునివలనఁ దెచ్చె నెల్లరు నెరుగన్.

ప్రౌఢదేవరాయలు క్రీ. శ. 1422 మొదలు 1447 వఱకు పాలించెను. కాన నాతని సమకాలీనుఁడగు పెద్ద సోమన గూడ నాకాలముననే యుండఁ దగును. అందుచేత నీతని మనుమడును, దీక్షాబోధాది కృతుల కర్తయైన బసవన, యతనికి 50 సంవత్సరముల తర్వాతను, నీతని కుమారుడును, పద్య బసవ పురాణకర్తయునైన సోమనాథుఁడు 75 సంవత్సరముల తర్వాత కాలమునను, నతని తమ్ముడు కుమారుఁడును పద్య ప్రభులింగలీల కర్తయగు బసవప్ప మఱి 100 సం. తర్వాతను నుండఁదగును. అనగా

పిడుపర్తి బసవన - 1475- 1500. క్రీ. శ.
పిడుపర్తి సోమన - 1500- 1525
పిడుపర్తి బసవప్ప 1525- 1550 ... ప్రాంతములు గాఁదగును.

మఱియు పద్య బసవపురాణమున " సరవి శ్రీ నాథుఁడా చరిత (పండితారాధ్య చరిత) ప్రబంధము చేసె ద్విపదలు తఱుచు నిలిపి" యని పిడుపర్తి సోమనాథుఁడు రచించినాఁడు గాన, నతఁడు శ్రీనాథునకుఁ తర్వాతి వాడని తెలియుచున్నది. అందుచే వెనుక తెల్పిన కాలములు సమంజసముగఁ గనుపట్టుచున్నది.

## 1. పిడుపర్తి బసవన

ఈతనిఁ గూర్చి యితని జ్యేష్ఠ పుత్రుఁడును, పద్య బసవపురాణ కర్తయునగు పిడుపర్తి సోమనాథుఁడు తన గ్రంథమందిట్లు తెలిపినాఁడు.

సీ. గురునాథుఁడగు పాలుకురికి సోమేశుండు
చెప్పిన కృతునెల్ల నిప్పుడమిని
ప్రకటింప వచ్చిన ప్రత్యక్ష బసవేశుఁ
డని భక్తజనములు వినుతిసేయ



భక్తి మర్మములు తప్పక యుండ నర్థముల్
చెప్పి శిష్యులను రక్షింప నేర్చు,
నొనర దీక్షా బోధయును, పిల్లనైనారు
కథయు, బ్రహ్మోత్తర ఖండమునను

గీ. నాదిగాఁ గల శివరహస్యములు పెక్కు
శివకవులు మెచ్చ ద్విపదలు చేసి భక్తి
సభల వెలయించి మించిన సజ్జనుండు
బంధు సురమణి పిడుపర్తి బసవశౌరి.

ఈ విధముగ దీక్షాబోధకర్త పిడుపర్తి బసవన యని యతని కుమారుడే రచించి యుండ, దాని కర్తపేరు పిడుపర్తి సోమన యని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తన బసవపురాణ పీఠికయందు వ్రాయుట బహు విచిత్రముగ నున్నది.

మఱియు నీ కవి లబ్ధప్రతిష్ఠాచారములఁ గూర్చి యతని కుమారుఁ డెట్లు చెప్పినాఁ డాగ్రంథముననే.

సీ. ద్రవిడ కర్ణాటాంధ్ర యవన భూములఁబేర్లఁ
గొన్నాఁడు పెక్కును సన్నుతముగ,
తలయెత్తినది మొదల్ ధరఁ గల్గు దుర్గాధి
పతులచేఁ బూజలు వడసినాఁడు,
కాలకంధరుని పత్కమలంబుఁబూజించు
పంచాక్షరి జపించుఁ బాయ కెపుడు
భవిపాక వర్జిత ప్రవిమల వ్రతుఁడన్య
మంత్రాంగ దాహముల్ మానినాఁడు

గీ. కవిత భవులకుఁ జెప్పని సవినయుండు,
బంధుజనములఁబ్రోవఁ బాల్పడ్డవాఁడు
నిత్యజంగమ పూజనాన్విత సుబుద్ధి
వసమె పొగడంగఁ బిడుపర్తి బసవ ఘనుని.

ఈ కవి రచించిన మూఁడుగ్రంథములగు 1. పిల్లనయనారు కథ, 2. దీక్షాబోధ 3. బ్రహ్మోత్తర ఖండములను గ్రంథములలో

**ప్రన్ననఁ దెలుఁగునఁ బఱపితిఁగొన్ని**
**నడివయసునఁ బిల్లనయనారు చరిత"**

అని దీక్షాబోధ పీఠికయందు కవి వ్రాసికొనినాఁడు. కాని యీ గ్రంథ మిపుడు కానరాదు.

**పిల్లనయనారు కథ:-** పిల్లనయనారను నతఁడు బౌద్ధజైన మతముల నాశన మొనర్చి, కులోత్తుంగ చోళ, సుందర పాండ్యాది మహీపతుల శివభక్తులఁ గావించి, శైవమతప్రచారమొనర్చిన మహాభక్తుఁడు. ఇతఁడు శ్రీకాళి యను పురమున కుమారస్వామి యంశమున నొక శివ బ్రాహ్మణునకు జనించి నాఁడు. తమిళ సారస్వతమున నితనినే తిరుజ్ఞాన సంబధియని వ్యవహరింతురు. ఈతని చరిత్రము బసవ పురాణమున షష్ఠాశ్వాసములో క్లుప్తముగా వర్ణింపఁ బడినది. బసవన దానినే ప్రపంచించి ప్రత్యేకకావ్యముగ వ్రాసియుండును.

**బ్రహ్మోత్తర ఖండము:-** ఇది స్కాందపురాణ ఖండములలో నొకటి. పట్టమట్ట సోమనాథ కవియు, శ్రీధర మల్లెకవియు దీని కొనర్చిన పద్యాంధ్రీ కరణములు కవులచరిత్రమున కెక్క, ఇది దానియందు చేరకుండుటచే నా కావ్యములకు ముందే బసవకవి దీనిని ద్విపదగా తెనిగించి యుండుటను లోకమున కెరుగక పోవచ్చును.

**వీరశైవ దీక్షా బోధము:-** సంస్కృత గ్రంథము ననుసరించి కర్ణాటభాషలో రగడలుగా కెరయపద్మరుసను కవి రచించిన దీక్షా బోధమను గ్రంథమును తెలుఁగున పిడుపర్తి బసవన మూఁడాశ్వాసములలో ద్విపదగా రచించెను. సూర్యవంశ క్షత్రియుఁడును, భారద్వాజగోత్రుఁడును, వీరబాణావనీశుని మనుమఁడును, తిమ్మభూవరుని పుత్రుఁడు, వీరశైవాచార ధౌరేయుడు నగు వీర భూవరుని ప్రార్థనమున కవి దీనిని రచించి యాతనికే యంకితమిచ్చెను. ఇది గురుశిష్య సంవాదరూపమున వీరశైవ మతతత్త్వమును, గురు శిష్య లక్షణములను, దీక్షా విధానాదికమును దెలుపు నుత్తమ గ్రంథము. వీర భూపాలుని కాలముగాని, యాతఁడు పాలించిన దేశముగాని గ్రంథము వలనఁ దెలియరాదు. తత్కాలపు వీరశైవ మతసంప్రదాయములెల్ల నిందు గలవు.



**గ్రంథప్రారంభము:-**

**శ్రీ గురులింగంబు చిన్మయాంగంబు**
**యోగాంత రంగంబు యోగి సంగంబు**
... ... ... ...
... ... **పాల్కురికి సోమేశు పొగడి**
... ... ... ...
**పిన్న ప్రాయమునఁ జెప్పితి శివకథలు**
**ప్రన్ననఁ దెలుగునఁ బఱపితిఁ గొన్ని**
**నడివయసునఁ బిల్లనయనారు చరిత**
**నుడివితి ద్విపదగా నూతనోక్తులను**
**కాల మాసన్నంబుగా కటమున్న**
**నొక శివ కథ యింక నొనరింప వలయు.**
... ... ... ...
**తిన్నని తెలుఁగున ద్విపదకావ్యముగ**
**నున్నతంబుగ నని యూహించు తరిని**
... ... ... ...
... ... ... ...
... ... **భరద్వాజ గోత్రుండు** ...
... **వీర బాణావనీ నాథు** ... .
**పుత్రుఁడై** ... ... ...
... **చను తిమ్మ నృపతి వరేణ్యుండు**
... ... ... ...
**ధీనిధి పిడుపర్తి దేవనార్యునకు**
**మానిని పిల్లమాంబకుఁ దనూభవుని**
.... .... **పిడుపర్తి బసవనాహ్వయుని**
**ననుఁ బిలిపించి సన్మానంబుచేసి**
.... .... .... ....

**క్రితము దీక్షాబోధ కెరయ పద్మరుసు**
**రతిఁ గన్నడంబున రగడ గావించె**
**తెలుఁగున నాకృతి ద్విపదగా మీరు**
**అలవరింపుడు మాకు నభిమతం బనుడు**
**... .... .... ....**
**.... .... .... ....**

పైన తెలుపఁబడినట్లు గ్రంథకర్తయే 'పిడుపర్తి బసవాహ్వయుని నను బిలిపించి' దీక్షా బోధను తెలుగున వ్రాయుమని రాజు వేడుకొన్నట్లు' తెల్పగా, మహా పండుతులని పరిశోధకులని ప్రసిద్ధిగాంచిన వేటూరి ప్రభాకర శాస్త్రిగా రేలనో తన బసవపురాణ పీఠికయందు వీరశైవ దీక్షాబోధ యను గ్రంథమును పిడుపర్తి సోమనాథుఁడు రచించెనని వ్రాసిరి. ఇది బహు విచిత్రముగా నున్నది. ఇందువలన గ్రంథమునైన వారు చూడలేదని సుస్పష్టముగదా. గ్రంథములనైన మొదలు చివరయు చూడక విమర్శనలు సాగించుట కడు శోచనీయము.

ఇఁక దీక్షాబోధమూలమున గూర్చి కవి యిట్లు తెల్పుచున్నాడు.

**"... ... కిర్య పద్మర్సు తొల్లి**
**యకలంక వేద వేదాంత సిద్ధాంత**
**సకలాగమ గ్రంథసారముల్ గూర్చి**
**సరవి గావించె దీక్షావిధానంబు**
**గరిమ నా సంస్కృతగ్రంథార్థ మెల్ల**
**వారికిఁ దెలియంగ వశము గాదనుచు**
**బోరున నయ్యర్థములు కన్నడమున**
**వెరవార రగడ గావించి"**

**అంత్యగద్య:-**

ఇది పాల్కురికి సోమేశ్వరారాధ్య
సదమల శిష్య శిష్య ప్రశిష్య
...... ....... ...... ......
పిడుపర్తి బసవేశ్వరుండు (వనాహ్వయుఁడ)



రచియింప శైవపురాణతంత్రముల
...... ....... ...... ......
...... ....... ...... ......
వీరశైవ దీక్షాబోధయందు
ననుపమంబుగ తృతీయాశ్వాసమయ్యె.

వీరశైవ దీక్షాబోధయందలి కొన్నివీరశైవ తత్త్వ బోధలను, శైలిని తెలుపుటకై కొన్ని ముఖ్యభాగముల క్రింద నుదాహరింతును.

**"విను వత్స, శివుడు దేవికి చెప్పినట్టి**
**ఘన సదాచార లక్షణ మెఱిఁగింతు,**
**హరుదీక్ష గోరువాఁడాది తాఁ జేయు**
**విరస కృత్యంబులు విడువంగవలయు,**
**సందేహముడిగి దుస్సంగ దుర్వ్యసన**
**....... ....... .......... .......**
**దుర్గుణ, దుశ్శీల, దుర్బోధకములు**
**దుర్గమన, దుర్యుక్త, దుశ్చరిత్రములు**
**పరదేవ సేవయు, పరసతి రతియు,**
**పరధన కాంక్షయు, పలల భక్షణము,**
**పాన బుద్ధియు, మానబడని వాఁడేని**
**వానిఁ జేపట్టడ వరగురుస్వామి"**
**... ... ... ....**
**... ... ... ....**

**కులాచార ధర్మములు**

**జరిపినే నతని పూజలు నిష్ఫలంబు.**
**ధ్యానంబు జపము స్వాధ్యాయనములును**
**దాన సంధ్యా పితృ తర్పణంబులును**
**వృద్ధానుచారముల్ విడువ రాదనెడి**
**బుద్ధుండు లింగ సంబంధి గాఁడతఁడు.**

తాను పైతృక మిడ తగదు భక్తునకు
మానఁడేనది సురాపాన కృత్యములు
... ... ...
అంగమలింగుల నంటగరాదు
లింగహీనుల వాకిలియు నంటరాదు
... ... ...
లింగవంతుఁడు దీక్షలేని పుత్రకుల
నంగనలను చుంబనాలింగనముల
నంగఁజేసిన ఘోర నరకాగ్నిఁగూలు
భవికృత్యమగు నన్నపానముల్ మాని
భవులయిన తలిదండ్రుఁ బాయంగవలయు.

ఈ భావమునే శివతత్త్వసారమున 13-134 పద్యములలో శివ భక్తుఁడుగాని భర్తను భార్య త్యజింపవలయు నని తెల్పఁబడెను. తరువాత, గురుదీక్షా బోధయందు

తలి దండ్రులయిన బాంధవులైన నక్క
చెలియండ్రు లయినను శివదీక్ష లేక
చేసిన పాకముల్ శివున కీరామి
రోసి గోమాంసవద్రూప మండ్రు.
... ... ...
భక్తహీనుల కుల పాత్రులరయిన
యుక్తంబు విడుచుట యోగ్యులుగామి
... ... ... ...
హరుని ధరించి తా నన్యతీర్థముల
కరిగిన మోక్షంబు కదలి వ్యర్థంబు
... ... ... ...
భావింప నిమిషంబు ప్రాణలింగముల
బాయంగ నీరాదు బాసెనేనియును
వేయేల ప్రాణముల్ విడుచుట లెస్స



... ... ... ...
పరువు సదాచార పదమున కంటె
పరువన గురుపాద భక్తి యంతకును
పరమ జంగము భక్తి పరు దొడయునికె
నవసరోచిత మైన నర్ధాంగ మాన
యువతుల నయిన నీ నోపంగ వలయు
ధనము లేకున్న చిత్తం బియ్య వలయు.
... ... ...
కర మర్థి శివముద్ర గలవారలెల్ల
పరమ జంగమ మని భజియింపవలయు
... ... ...
శైవుండు నదీక్షిత సంగ దోషమున
పాలసుఁడయ్యును పతిత్వ మొందు
గాన దీక్షాహీన కాంతల సుతుల
తా నెందు గూడుట తగదు భక్తునకు.
... ... ...
ధర జనుల్ శివ సహోదరులను మాట
బొరిమి చెప్పుట కాని యొగి వారి తోడఁ
బుట్టువులును గారు పూర్వంపు వావు
లెల్లను మానవలె నెట్లన్న వినుఁడు
... ... ...
హరుడు భక్తుఁడు వివాహమునకు మొదల
పరమ భక్తుల నెల్ల ప్రార్థించి తెచ్చి
యతిభక్తి విభూతి వీడ్యము సమర్పించి
యతివయును దానును సాష్టాంగులై మ్రొక్క
నపుడు దంపతుల భక్తాళి రావించి
కృప దెలుపార వారికి భూతి పెట్టి
నలర యొండొరుల దేహముల ప్రాణములు

**గలసి యొండొరుల సౌఖ్యముల దుఃఖముల**
**సొలది నొండొరులగా మెలఁగుచు నుండు**
**వాక్కును మనసు భావము లిద్దఱకును**
**నొక్కటియై చరియింపుచుండుఁడీ యనుచు.**

బసవపురాణమున పాల్కురికి సోమనాథకవి బసవేశ్వరుని వివాహమును పైన దెల్పినవిధముగనే వర్ణించెను.

ఈ వీరశైవ దీక్షాబోధ గ్రంథము తప్పుల తడికగా గుజలీప్రతిలో జోస్యుల సుబ్బయ్య లింగేశ్వరారాధ్యుల వారిచే ముద్రింపఁబడినది. వారే దీనిని సంపాదించి పరిష్కరించిరట.

## II. పిడుపర్తి సోమనాథుఁడు

వీరశైవ దీక్షాబోధ కృతికర్తయైన పిడుపర్తి బసవన జ్యేష్ఠ కుమారుఁడగు సోమనాథుఁడు, పాల్కురికి సోమనాథుని బసవ పురాణమును పద్య రూపముగ రచించి, ప్రభులింగ లీలలను ద్విపదగా వ్రాసెను. తన పద్య బసవపురాణ కర్తృత్వమును గూర్చి కవి యా గ్రంథమున నిట్లు తెల్పుకొనెను.

**సీ. ఆ నాగమాంబకు నత్యంత శివభక్తి**
**యుక్తుఁడౌ బసవ నార్యునకుఁబుత్రు**
**లనుపమాన చరిత్రు లతిపవిత్రులు నల్వు**
**రైరి ధర్మార్థకామామృతములు.**
**మూర్తులు దాల్చె నా మొదల సోమన్నయు,**
**బాలన్న, గురువన్న, బసవనయును,**
**వారిలోనను నే నవరజుండ బహుకావ్య**
**నాటకాలంకార నటన వేదిఁ**

**ఆ. జెప్పఁదొడఁగినాఁడ శ్రీ బసవపురాణ**
**మవనిఁ బద్యకావ్యమై చెలంగ**
**మంజులోక్తియుక్తి మత్కులగురుఁడైన**
**పాలకురికి గురుని పతినిఁ జేసి.**



పై పద్యమున ‘వారిలోనను నే నవరజుండ’ నను భాగమునకు ‘నేను+ అవరజుండ’ నని యర్థము తీసి వేటూరి ప్రభాకర శాస్త్రి గారు పద్య బసవ పురాణకర్త, నల్వురి సోదరులలో కనిష్ఠుఁడగు బసవన యనియు, నాశ్వాసాంత గద్యములందు సోమన యని యుండుట ప్రమాదమని బసవపురాణ పీఠిక యందు వాదించుచున్నారు. కాని యీ వాదము ప్రమాద భ్రాంతిజనితము. పై పద్య భాగమునకు ‘నేన అవరజుడ’ నని యర్థమిచ్చుట కాకర్షణీయముగ నున్నది. ఐనను ‘నేన+వరజుఁడ’ నని యర్థమునుగూడ నిచ్చుచున్నది. ఇప్పట్టున నాశ్వాసాంత గద్యమును గూడ ప్రమాణముగ పరిగ్రహింప తగినదే కాని దానిని త్యజింపఁదగదు. అందు స్పష్టముగనే సోమనాథుఁడని యున్నప్పుడు పద్య బసవపురాణకర్త బసవనే యని వాదించుట తాను పట్టిన కోడి కొకటే కాలని వాదించుటయే. మఱియు ప్రభులింగ లీలలందు తత్కృతి పతియైన నెల్లూరి రామలింగయ్య పిడుపర్తి సోమనాథునిచే ప్రభులింగలీలల నాంధ్రమున వ్రాయింప నెంచి యిట్లు చెప్పెనని కవియే వ్రాసికొనెను.

**“ రసికుండు నెల్లూరి రామలింగయ్య**
**నన్ను రావించి మన్నన గారవించి**
**యున్నతాసనమున నునిచి పిడ్పర్తి**
**సోమయ దేవ, విశుద్ధ స్వభావ**
**శ్రీ మన్మహాదేవ సేవాను భావ,**
**కులగురుఁడగు పాలకురికి సోమేశుఁ**
**డెలమి చెప్పిన కృతు లిల వెలయించి**
**భవదీయ జనకుండు బసవనార్యుండు**
**సవిశేష భాష దీక్షాబోధ చెప్పె**
**బసవపురాణమ్ము పద్యకావ్యమున**
**రసికులౌననగఁ మీరలు చేసినారు.**

అని వ్రాసికొనుటచేతఁగూడ బద్య బసవపురాణ కర్త సోమనాథుఁడే యనుట తేటతెల్లము. పై నుదాహరించిన ద్విపదలఁ బట్టి వీరశైవ దీక్షాబోధకర్త పిడుపర్తి బసవనయే గాని, సోమన గాఁడని కూడ స్పష్టమే కదా. బహుగ్రంథ పరిశోధకుఁడని గర్వముతో విఱ్ఱవీగు పండితమ్మన్యులు గ్రంథముల

నామూలాగ్రముగ చూడనైన చూడక, గ్రంథకర్తృ నామములైన నెఱుంగక యా గ్రంథములపై విమర్శ చేయుట శోచనీయము. అట్టివారి వాక్యములనే ప్రమాణముగ స్వీకరించుట యాంధ్రుల దౌర్భాగ్యము. ఇది యాత్మవంచన, పరవంచన యను భావము గూడ లేక రచించుట.

పద్య బసవపురాణము:- పిడుపర్తి సోమనాథుఁడు తన తండ్రి కంకిత మిచ్చుటకై యొక కావ్యమును వ్రాయఁ బూనుకొనుట దెలిసికొని, బసవన తన కుమారునితో పాల్కురికి సోమన వ్రాసిన ద్విపద బసవపురాణమును పద్య రూపముగా రచించి, పాల్కురికి సోమనకే యంకిత మొనర్చినఁ దనకు పరమా నందమని యిట్లు పద్యబసవపురాణ పీఠికయందు కవి,

**కం. నీవును సోమేశుని ద్విప**
**దావళి యర్థములు సేయు మందుల యర్థం**
**బావంతయు దిగ వీడక**
**యేవియు మున్నందులేని విడక కుమారా!**

అని తెల్పెను. మఱియు కుమారునితో శివకవుల సంప్రదాయము నిట్లు తెలియఁ బఱచెను.

**కం. ఆ వేదార్థము ద్విపదలు**
**నీవిప్పుడు పద్యములుగ నిర్మించిన భ**
**క్తావళి మెచ్చున్ శివకవు**
**లీ విధ మంగీకరింతు రిష్టము మాకున్.**

**గీ. సోముఁ డేమి చెప్పె సోమేశు ద్విపదలే**
**పెట్టి పద్యములుగఁ బెనచెనంచు**
**నన్యు లనఁగవలదు; ఆ యయ్య శిష్యుల**
**మగుట మనకుఁ జెల్లు నవియు నిలుప.**

ఇట్లే పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రమును శ్రీనాథుఁ డును, బసవపురాణమును కన్నడమున భీమసుకవియు రచించెనని చెప్పి, యది గ్రంథ చౌర్యము గాదని సమాధానపఱచెను. అంత పుత్రుఁడైన సోమనాథుఁ డంగీకరించి బసవపురాణమును పద్యరూపముగ రచించెను.



ఇఁక పిడుపర్తి సోమనాథుని కవితాశైలితోఁబాటుగా నీ కవి పాల్కురికి సోమనాథుని ద్విపదల పద్యములలో గూర్చి మూలము కంటె నన్యూనాతి రిక్తముగ రచించెనో చూతము. బసవని బాల్యమును పాల్కురికి సోమన యిట్లు వర్ణించెను.

**" వెనుకఁ జీకటియుండఁ దనకేటి తేజ**
**మనుగతి దీపంబుఁ గనుగొని నవ్వు;**
**సన్నుత లింగప్రసాద మగ్నతన**
**యున్నట్లు చనుగుడ్పు నూరక యుండు;**
**శివసుఖామృతమును జేఁ గ్రుమ్మరించి**
**చవిచూచుమాడ్కి హస్తము లారగించు;**
**శివపదధ్యాన నిశ్చేష్టితావస్థఁ**
**దవులు చందంబునఁ దావెఱఁగందుఁ;**
**జిలిబిలి సంసార మిలఁ బాఱఁదోలి**
**చెలగి యాడెడుగతిఁ జేతు లాడించు;**
**మాయా ప్రపంచంబు డాయంగనీక**
**పాయఁ దన్నెడు రీతిఁ బాదంబులార్చు;**
**వడిమెయిఁ దనపూని వచ్చిన పనులు**
**దడవయ్యె ననుచు నుల్కెడు భంగి నలుకు;**
**భవుఁబాడ నానంద బాష్పంబు లొలుకు**
**పవిది నేడుచుఁ గనుగవ నశ్రులొలుక;**
**భవబాధలకు నగపడి మొఱవెట్టు**
**భవుల కుయ్యాలించు భాతి నాలించు;**
**నొడల యడుగులఁబడి మొరల్వెట్టు**
**వడువునఁ బుడమిపైఁ బడి బోరగిల్లు;**
**నిలమర పడ్డ నిర్మల శివభక్తి**
**తలయెత్తు వడువునఁదాఁదలయెత్తు;**
**నరుదొందఁ పద్మాసనాసీనవృత్తిఁ**
**బొరి నభ్యసించు పొల్పునఁ గూరుచుండు.**

పై భాగమును పిడుపర్తి సోమన రెండు సీసపద్యములలో నిట్లు గూర్చెను.

సీ. వెనుక చీకటి యుండఁ దనకేమి కళలను
చొప్పున దీపంబు చూచి నవ్వు;
సన్నుత లింగప్రసాద మగ్నత నూని
యున్నట్లు చన్నాని యూరకుండు;
శివ సుఖామృతమును జేతిలోఁ గొనుమాడ్కి
హస్తయుగం బొగి నారగించు
శంభుపాదధ్యానశక్తిఁ జొక్కిన రీతి
నొక్కొక్క తఱి వెఱఁగొంది యుండు

గీ. తుచ్ఛ సంస్కృతి దుప్పలఁ దూలదోలు
విధము దోఁపఁగఁ జేతులు విచ్చియాడుఁ
బ్రబలమాయాప్రపంచంబు వాయఁదన్ను
జాడఁ బాదంబు లల్లార్చి యాడు మఱియు.

సీ. శివుని పంపునను వచ్చినపని దడవయ్యె
నని యుల్కు గతి నల్కుఁ దనకుఁ దాన;
భవుఁబాడ నానందబాష్పము ల్దొరగు వై
ఖరిఁ గనుఁగవ నీరు దొరగనేడ్చు;
భవుని బోధకు మది దవిలి యాలించెడు
ననువున నెడ నెడ నాలకించు;
భక్తుల యడుగులఁ బడి మొఱల్ పెట్టెడు
పొలుపున నిలబడి బోరగిల్లు;

గీ. మఱుగు పడ్డట్టి శివభక్తి మార్గము దల
యెత్తులాగున ధర తలయెత్తియాడు;
నర్థిఁ పద్మాసనాభ్యాస మలవరించు
నొప్పు చొప్పడి యుండఁ గూర్చుండి యాడు.



మఱియు ద్విపద బసవపురాణమున,

“ పూని ద్వితీయ శంభుండను నంది
నేనను భావన నిలఁదోఁగియాడు,
నా వీర మాహేశ్వరాచారమెల్లఁ
బ్రోవయి నిల్చిన పోల్కి నిల్చుండు;
కడకతో నాది మార్గము దప్పకుండ
నడుగిడు లీలఁదప్పడుగులు పెట్టు;
మలహరుఁ బేర్కొను మాత్ర గద్గదము
లలరుకైవడిఁ దొక్కుఁ బలుకులు వలుకు;
బల్లిదు ల్మా శివభక్తులే యనుచుఁ
గ్రేళ్ళువాఱుచు నాడు క్రియఁబాఱి యాడు;
నంత వినోదంపు టాట ప్రాయమున
సంతతంబును శివార్చన మాచరించు.”

దీనినే పిడుపర్తి సోమన పద్యరూపమున,

సీ. భవుని వాహన వృషభంబు తానను బుద్ధి
దోఁపుచుండఁగ నేలఁదోఁగి యాడు,
వీర మాహేశ్వరాచారంబు ప్రోకయై
నిలిచెనా నొయ్యెయ్య నిలుచుచుండుఁ;
ప్రతిభతో నాది మార్గంబు దప్పక యుండ
నడుగిడు గతిఁ దప్పటడుగు లిడును;
శివుని బేర్కొని కంఠసీమ గద్గదిక దా
నలరె నాఁదొక్కు పల్కులు వచించు;

గీ. బల్లిదులు చూడ మా శివభక్తులనుచుఁ
గెల్లువారెడు క్రియఁ బాఱు నల్ల నల్ల
నంత నతనికి సమకూడె నాటప్రాయ
మప్పుఁ డతఁడయ్యె సతత లింగార్చకుండు.

తర్వాత సిరియాళుని కథయందు సోమనాథద్వయ మెట్లు రచించిరో చూతము. పాల్కురికి సోమన రచనయందు సంగళవ్వ సిరియాళ కుమారుని శివుని యానతి చొప్పున పిల్చు రీతి యిది-

“పూర్వ జన్మార్జిత భూరి కర్మములు
గుర్వణఁగించు నా కొడుక రావయ్య;
దక్షిణాధీశ్వరు దర్ప మడంచు
దక్షణ గల్గు నాత్మఁజుడ రావయ్య;
విరస పశ్చాజ్జన్మ మరణ దుఃఖములు
పొరిమాల్పఁ జాలు నా పుత్ర, రావయ్య;
ఉత్తరంబేలు నుదాత్త యోగీంద్రు
చిత్తంబునకు వచ్చు శిశువ రావయ్య;
అలరు నాకోపభోగాతీత పదము
లలవడె నేఁడు నా యయ్య, రావయ్య,
దండధరోద్దండ దండ ప్రశక్తి
శండింప నోపు పుత్రుండ, రావన్న,
పాయని వ్యామోహ పాశ బంధములు
కోయంగఁజాలు నాకుఱ్ఱ, రావన్న,
ద్రవిణాది కేషణ త్రయ విజృంభణము
తవులునఁబడని నా తండ్రి, రావన్న”

పై ద్విపదలను పిడుపర్తి సోమన సీసపద్యమున నిట్లు కూర్చినాఁడు.

సీ. పూర్వ జన్మార్జిత భూరి దుష్కర్మాళి
కుదు రణగించు నా కొడుక రార,
దక్షిణాధీశుని దర్పంబు దెగటార్చు,
దక్షుండ వైన నా తనయ రార;
భయద పశ్చాద్ధర్మ భావి దుఃఖంబులఁ
బరిమార్పఁగల్గు నా పట్టి రార,
ఉత్తర దిగధీశ్వరోపాత్త సఖ్యుని
వశపర్తి వైన నా శిశువ రార;



గీ. సర్వ సౌఖ్యాధిక పదస్థ, త్వరగ రార,
దండధర దండ ఖండనోద్దండ రార
ప్రకట సంసార పాశ మోచకుఁడ రార,
విత్తపత్ని సుతాసక్తి విముఖ రార.

తర్వాత పాల్కురికి సోమన యిట్లు రచించినాఁడు--

“ సురరాజనుతుడు విశ్రుత తపోవేషి
వరదుఁడై నాఁడు నావడుగ, రావన్న,
అంతకాంతకమూర్తి యగు తవరాజు
సంతసంబంద నా సామి, రావన్న,
ఘోర నిస్సార సంసార వారాశి
పార మీఁదించు పాపండ, రావన్న;
అంచితాగణ్య పుణ్యప్రాప్తి నమరు
కాంచీ విలాసు నగ్రజుఁడ రావన్న;
దివిజకన్యకలతో దివి ముక్తికన్య
కవయ నున్నది భక్తి కాంతుండ, రావె,
దండడి మీ యయ్య దక్షిణభుజము
నందంద యదరెడి నన్న, రావన్న;
భానుఁడెంతేనియు బడమట వ్రాలె
శ్రీ నిలయుండ, నా సీరాల! రావె,
స్వా దొంద నర్థేశ సఖుని సన్నిధిఁ బ్ర
సాదంబుఁ గొనఁగ నా గాదిలి రావె”
“అనుచు నాలుగు దిక్కులందు నందంద
తనయుని బిల్చు శబ్దంబులోపలను
జనితమై దిక్కుల సంజ్ఞలు దోఁప
వనితాలలామ పిల్వంగ నంతటను”

పై భాగమునకు పిడుపర్తి సోమన కూర్చిన పద్యము లివి.

సీ. దివిజలోకేశ్వరాధిక దేవదేవుండు
వరదుఁడైనాఁడు నా వడుగ. రార,
అంతరాంతరమూర్తియగు తపస్వివరుండు
సంతసంబంద నా స్వామి రార,
ఘోరనిస్సార సంసారపయోరాశి
పార మొందించు నా పట్టి, రార,
అర్ధేశ సఖవిభుండగు యోగివేషంబు
గోరి భజించు నా కుఱ్ఱ రార

గీ. దివిజకాంతాయుతామృత యువతి నిన్ను
గవయ నున్నది, సన్ముక్తికాంత, రార,
సారె సారెకు మీ తండ్రి సవ్యబాహు
వదరుచున్నది వేగ మా యన్న రార!

కం. హేళియు పడమట వ్రాలె, సి
రాలా! రాఁగదర యుత్తరంబేల జను
ర్జాలోన్మూలనశాలి వి
శాలయశుండైన తపసి సంతసమొందన్.

తే. కాంచికాపుర బాలాగ్రగణ్య రార,
యనుచు నలుదిక్కులను నిల్చి యా లతాంగి
కలమ్మృదూక్తుల నాశ్లేషకవి విధమున
సుతుని బిల్చెను నిజమది సూచకముగ.

శ్రీనాథుఁడు హరవిలాసమున సిరియాళుని కథను ప్రథమద్వితీయాశ్వాసములందు వర్ణించెను. అందు పై భాగమున కవి యిట్లు వర్ణించెను,

సీ. రారా వణిగ్వంశవారాశి హిమధామ,
రారా వికస్వరాంభోరుహాక్ష,
రారా మహాఘోర వీరశైవాచార,
రారా ఘనౌదార్య రాజరాజ,



రారా కుమార కంఠీరవేంద్ర కిశోర,
రారా సమగ్రధీరౌహిణేయ,
రారా మనోభవాకార రూపవిలాస,
రారా యసారసంసారదూర,

గీ. రార నా చిన్ని వడుగ రారా తనూజ,
రార సిరియాల రార నా ప్రాణపదమ,
రార, నా కుఱ్ఱ నా జియ్య రార యనుచుఁ
జీరెఁ గారాపుఁగొడుకు రాజీవనయన.

శ్రీనాథుని రచనయందు మూలమందుగల శ్లేషవ్యంగ్యములు పరిత్యజింపఁబడినవి. మూలమందలి రచన హృదయమును ద్రవింపఁజేయు నటులున్నది. మఱియొక ఘట్టమైన కన్నప్పచరిత్రమందలి తారతమ్యమును విచారింతము. పాల్కురికిసోమన రచన యిది. అరణ్యమున శివలింగమును గాంచి కన్నప్ప పలికిన పలుకులివి.

“బాస గాదింక నీ ప్రాణలింగంబుఁ
బాసిపోఁదగదు,మా పల్లియకితని,
గ్రక్కునఁగొనిపోయి కట్టుదు, బాక
నిక్కడ నునుపరా దెండఁగాలంగ,
బుద్ధులు సెప్పియు బుజ్జగించియును
తద్దయు గీడ్పడఁ దగ వెడ్డు పెట్టి
వలసిన వస్తువు లిలఁ దెచ్చి యిచ్చి
వలపించి కొనిపోవ వలె” నని తలఁచి
పరమ హర్షమున విస్ఫారాంగుఁ డగుచు
వరముగ్ధ భావన హరున కిట్లనియె
“అక్కటా! యిది యేమి హరుడ, యొక్కరుడ
విక్కడ నుండుట యేమికారణమొ
తలసూప కేయూరి తమ్మళ్లతోడ
నలిగివచ్చితి సెప్పు మలుక దీర్చెదను

గొరగ లుమ్మెత్త పత్తిరిఁ బూజసేయ
మరులెత్తి వచ్చితో యురుతరాటవికి,
పరసల త్రొక్కనఁ బడఁ జాలకీవు
సిరిగిరి నుండక సురిగి వచ్చితివొ?
జటలకు నొడలికి సవతులు వోర
నుడుపఁ జాలక వచ్చి యడవిఁ జొచ్చితివొ.
చెన్నయ్య గలసినఁజెడెఁ కులంబనుచు
నిన్ను లోకులు వెలియన్న వచ్చితివొ?
పలుమారు నంబికి బడి పనులేసేయ
సొలసి వచ్చితివొ యిచ్చోట డాగంగ;
నాఁటి బ్రహ్మయు నేఁడు నాయంబుదప్ప
వేటాడవచ్చితో వేయును నేల
నాతోడి మోహంబునన నన్నుఁ బ్రోవ
నేతెంచితో వేడ్కయెసఁగ నిచ్చటికి
ఎటనుండి వేంచేసి తెట్లు నీ బ్రదుకు
ఇట నుండజొచ్చి నీ వెంతకాలంబు
ఎక్కడుగోద నిన్నిక్కడ వైచి
యెక్కడ వోయె నే నేగెదఁజెపుమ?
ఒడల నర్ధమిగొన్నయుమ బోటి యెద్ది?
యెడరైన నవ్వరే యెక్కడివారు?
కట్టిన గోచి యెక్కడ నొల్వువడితి?
వట్టేలవచ్చితి వడవి కొక్కడవ?
చంక బొక్కసమును సడలియున్నదియు
శంకింప కొంటెట్లు చరియించెదయ్య!
కొండలలోన నొక్కండ వీవిట్టు
లుండంగ వెఱవవా ఖండేందుమౌళి?
మృగములు నురగముల్మితి మేర లేవు
నగవు గాదిచట నున్నను బ్రమాదంబు



ఎఱుకుఁబన్నలుగన్న నేఁతురు నిన్నుఁ
గఱకంఠ! మా పల్లెఁగల దెల్లసుఖము
అడవుల మనుబిళ్ల కడుమంచిపాలు
నొడిపిలిపొసెంబు నుడుపసేతులును
నిప్పపూవును, దేనె లెల్ల ఫలాదు
లొప్పెడు వెదురుఁ బ్రాలోగిరంబులును
మఱి యట్లుగాక నీ మనసు వచ్చినను
నెఱచులుఁగఱకుట్లు లెన్నేని గలవు
రావయ్య మ్రొక్కెద దేవదేవుండ,
ప్రేవులుమాడంగఁ జావఁదప్పినదె?
అనుచు పాదాక్రాంతుడైన నీశ్వరుఁడు
దనతోడఁబలుకమి మనసులోపలను"

ఈ భాగమును పిడుపర్తి సోమనాథు డిట్లు పద్యరూపము చేసినాడు.

మ. అనుచుంగన్నపదేవుఁ డీశునకు సాష్టాంగప్రణామంబు చ
యాన్యఁ గావించి యితండె పో నిజము మత్ప్రాణేశుఁడీ యీశునిన్
వనమధ్యంబున నుంచి పొసిచనఁగా న్యాయంబె? నా ప్రోలికిన్
గొనుచున్ వే చని పొకగట్టుదును సంకోచంబు గాకుండఁగన్.

ఉ. రానన నట్టెకొట్టియును రాజకలాపుని బుజ్జగించి యె
ట్లైనను బట్టి వేడుకొనియైనను బుద్ధులు చెప్పియైన నే
మైనను నిచ్చి మ్రోలఁబడియైనను బల్లెకుఁగొంచుఁబోక నేఁ
బోనని ముగ్ధభక్తుఁడభిభూషణుతో నను నీ క్రమంబునన్.

సీ. ఇక్కడ నడవిలో నొక్కండవై యుండఁ
గతమేమి చెప్పవే కాలకంఠ!
తిరిగి యుమ్మెత్తపత్తిరి పూజసేయంగ
మరులెత్తి వచ్చితో మారవైరి!
యే విధి తంబళ్లతో వాద మడచితో
కతచెప్పు మల్క చక్కంగ దీర్తు;

**పరుసనందడి ద్రొక్కువడలేక సిరిగిరి**
**విడిచివచ్చితివొక్కొ విపినమునకు?**

**తే. కాక మాదరచెన్నయ్యఁగలసి తనుచు**
**నిన్ను వెలియన వచ్చితో నీకు నింక**
**వలపటికి నొక్క వనిత గావలసివచ్చి**
**తొంటితప మిప్డు సేయంగఁ దొడఁగినావొ!**

**చ. పలుమఱు నీవు నంబబడివళ్లకుఁద్రిమ్మరలేక దాఁగఁగా**
**వలసితొలంగివచ్చితివొ వారిజగర్భుఁడు తొంటికైవడిన్**
**మెలకువఁదప్పవేటమెయి నేఁడును శిక్ష యొనర్పవచ్చితో**
**మలహర నన్నుఁ బ్రోవ నసమాదరణంబున నొచ్చివచ్చితో!**

**ఉ. ఎచ్చటనుండి యిచ్చటికి నేగెదు నీ బ్రతు కెట్టు లీ వనం**
**బచ్చుఁగఁ జొచ్చి యెన్నికకు మాసము నయ్యెను నెక్కుగిబ్బ ని**
**న్నిచ్చటఁద్రెళ్ళగావయిచి యెచ్చటికిన్ బరువెత్తెఁజెప్పు నేఁ**
**జెచ్చెరఁబట్టి తెచ్చెదను శీఘ్రమ శీతమయూఖశేఖరా!**

**క. ఒడల సగముగొన్నగజయు,**
**నెడవిడగనరాదు మాట లెన్నియు నేలా**
**యెడరైన నెవ్వరును నె**
**క్కడివా రెవ్వరికి వారె కాలము మాఱిన్.**

**ఆ. కటితటంబునందుఁగల గోచిపాతయు**
**నొలువఁబడితి విట్టులొంటి తిరిగి**
**చంకబొక్కసమును సడలిన దిఁకనైన**
**గొండలందుఁ దిరుగ కుండు మీవు.**

**చ. ఉరగములున్ మృగంబులును నుండు నసంఖ్యము లీవనిన్ వనే**
**చరులు నినుం గనుంగొనినఁజావఁగనేయుదు రింతకుం బరా**
**త్పర! యిటులుండ మా యెఱుకుపల్లెకు వచ్చిన నెల్ల సౌఖ్యముల్**
**వరుసగఁ గల్గు నెట్లనిన వ్యాళవిభూషణ! విన్ము చెప్పెదన్.**



**క. అడవులమను చిడియల పా**
**లొడిపిలి పాయసము తేనె యొడుములు నేతుల్**
**కడుమంచివెదురు టోగిర**
**మెడవక మా యిండ్లనుండు నివి యెల్లపుడున్.**

వ॥ మఱియు నట్లుగాక మీమనంబునకు నభిమతంబగు నేరుచులుం గరకుట్లు దఱుచు గలవీవిసినంబునఁ బ్రేవులుమాడం జావనేల, చచ్చి మీదవచ్చు ఫలంబు పుచ్చుకొనువారెవ్వరు? దేవా. తావక చరణంబులకు శరణుజొచ్చెద నిచ్చట నివసింపఁదగునే యనుచుం బాదా క్రాంతుండై నంగని యా కంతు సంతాపకారి విననియట్ల మిసిమింతుండు గాక మూకభావంబున నున్నఁగన్నప్ప తన మనంబున నిట్లని వితర్కించె.

ఈ విధముగ పిడుపర్తి సోమనాథుఁడు తన తండ్రి యుపదేశాను గుణముగ పాల్కురికి సోమనాథుని బసవపురాణమందలి ద్విపద పంక్తులను ముక్కకు ముక్కగా నన్యూనాతిరిక్తముగ పద్యములలో నిమిడ్చినాడు. పై కన్నప్ప కథయందు మూలమున కొన్ని యశ్లీలములు పామరభావములు నుండగ కాళహస్తిమాహాత్మ్యమున ధూర్జటికవి మూలమందలి పచ్చిపచ్చివిషయముల పరిత్యజించి ముగ్ధభక్తి నమాయికభక్తిగ మార్చి రసవంతముగను, హృద్యము గను రచించినాడు. ఈతని పద్యరచన పిడుపర్తి సోమనాథు పద్యరచనకంటె ననేక విధముల మిన్నయై భక్త్యుద్రేకమును వెలార్చుచు పరిశుద్ధమైన ధారతో గూడిన శైలియందున్నది. ఆ భాగమిది.

**శా. ఓ సామీ, యిటువంటి కొండదరిలో నొంటిన్పులుల్ సింగముల్**
**గాసింబెట్టెడు కుత్రనట్టడవిలోఁ గల్జువ్వి క్రీనీడ నే**
**యాసం గట్టితి వేటిగడ్డనిలు, నీ వాకొన్న చోఁగూడు నీ**
**ళ్ళే సుట్టంబులు దెచ్చిపెట్టెదరు నీకిందేటికే లింగమా!**

**ఉ. కొండలఁగానలందిరిగి క్రొవ్విన పందుల లేళ్ల దుప్పులన్**
**జెండిన పెక్కుచందముల సిన్నక పెద్దకగారు కమ్మగా**
**పండుదు రట్లు పిట్టలను వండుదు రిచ్చట నుండనేల నా**
**కొండొక టానతీక యుడుమూరికి రాఁగదవయ్య లింగమా!**

కం. ఓ లింగమ విను నివ్వరి
ప్రాలును నొడి పిళ్లఁగునుకుఁబ్రాలును వెదురున్
బ్రాలును సవరపు మెకముల
పాలును గలవచట నీకుఁబాయసమునకున్

తే. పుట్ట తేనియ యునుమఱి పుట్టజున్ను
తొఱ్ఱతేనియ గలవందు దోచిదోచి
కాలిదులదులనై పిండివోలెరాలు
నట్టి నింజెట్లుగలవు నీవారగింప ॥

సీ॥ ... ... ...
... ... ...

శా. ఇల్లో ముంగిలియో యనుంగుఁజెలులో యాడైన చుట్టంబులో
యిల్లాలో కొడుకో తరింపవశమే యే పోడుముల్ లేక మా
పల్లె న్గోరిన వెల్లనుంగలవు తెప్పల్గాగ నీ కిచ్చెదన్
చెల్లంబో యిట నొంటినుండ కటు విచ్చేయంగదే లింగమా!

తే. చుఱుకుఁజూపునఁగాలిన కొఱతనుఱుకు,
నుఱుకు జూపులఁబుట్టించు నెఱుకువారి
యిఱుకు వలిగుబ్బపాలిండ్ల యిగురుఁబోండ్ల
సేవ కిచ్చెద నీకు విచ్చేయు మయ్య!

మ. నను మన్నించెదవేని నీవిపుడు రా నావెంట, రాకుండినన్
నిను నేఁబాసి చనంగనోప నిచట న్నీతోడిదే లోకమై
మనువాడం గను వాఁడ నీ కరుణ, నీ మౌనంబు చిత్తంబు వ
చ్చినచో మానుదుగాని నిన్నిపుడు కష్టింబెట్ట నాకేటికిన్?

వ॥ అని యమ్మహాదేవు నుడుమూరికి రమ్మనుచుం బ్రార్థించినం బలుక కుండినం దదీయ భక్తిపరవశుండై, సంపెగతావిఁబ్రుంగిన భృంగంబు తెఱంగున నున్న యవసరంబున.



ఇంత రసవంతముగ వ్రాయుటచేతనే ధూర్జటికవి కాళహస్తి మాహాత్మ్య మందలి కథావైచిత్రిపై కవిద్వయ రచనలను మరుగుపఱచి, యతని కావ్యమున కంతకు నిదియే పేరు నిలిపినది. ఇతఁడు మూలమును స్వతంత్రరచనగా మార్చివేసినాఁడు.

## ప్రభులింగ లీలలు

పిడుపర్తి సోమనాథుఁడు రచించిన ద్వితీయాంధ్రకృతి ప్రభులింగ లీలలు. ఇది కన్నడభాషలో చామరుసనుకవి రచించిన వచనంబులను బట్టి ద్విపద రూపమునఁ దెలుగునఁ గూర్పఁబడిన యుత్తమ కావ్యము. బసవేశ్వరుని కాలమున అల్లమప్రభువను నిర్వికారనిర్గుణమూర్తి యొక్క లీలలు ప్రధానముగఁజేసి యితర శైవభక్తుల కథలుగూడ ప్రసక్తముగ కలిపి కవి రచించెను. దీనిని పిడుపర్తిసోమన యాంధ్రీకరించెను. ఈ విషయమునే కవి తన గ్రంథమున నిట్లు తెల్పుకొనెను. ఇందు 25 గతులు గల్గి యైదాశ్వాసము లున్నవి. అందలి యాశ్వాసాంత గద్యమిది.

"ఇరువదేనవగతి యీ గతి ప్రభువు
చరిత మీశుఁడు గిరిజకు నానతిచ్చె
సదమల పదవేది చామరసాదిఁ
పదములు వెయినూటపదులొకండింట
ప్రభులింగలీల నిర్వది యేనుగతుల
నభినవంబుగఁ జెప్పె నది తెనుంగునను
బిడుపర్తి సోమయాభిధుఁడఁజెప్పితిని"

\- - -

"ఇది పాలకురికి సోమేశప్రసాద
విదితాష్టభాషాకవిత్వ ప్రవీణ
భామిత్ర పిడుపర్తి బసవేశపుత్ర
సోమయదేవాఖ్య సుకవీంద్రముఖ్య
ఫణితమై విలసిల్లు ప్రభులింగలీల
ననుపమంబుగఁ బంచమాశ్వాసమయ్యె"

ఇది చిరుతొండనంబి వంశజుఁడగు నెల్లూరి రామలింగయ్య యను వైశ్యశిఖామణి ప్రేరణమున, నాతని దీక్షాగురుడును, దక్షిణామూర్తి యవతారమగు శ్రీ సిద్ధవీరేశ్వరుని స్తుతిపూర్వకముగ రచింపఁబడినది. కావ్యారంభమున,

**"శ్రీ వీరశైవ ప్రసిద్ధ సిద్ధాంత**
**కోవిద, శ్రీపాలకురికి సోమేశ**
**బసవపురాణాది భవ్యకావ్యములు**
**అసమాక్ష భక్తి మాహాత్మ్యంబు దెలిపి**
**ధారుణి శివభక్తి తగ నిల్పినట్టి**
-- -- --
**నగరసప్తకములోన ప్రసిద్ధమైన**
**నగరంబు కాంచికా నగర మాపురిని**
... ... ...
**రసికుండు నెల్లూరి రామలింగయ్య**
**నన్ను రావించి మన్నన గారవించి**
**యున్నతాసనమున నునిచి పిఢ్పర్తి**
**సోమయదేవ, విశుద్ధప్రభావ**
**శ్రీమన్మహాదేవ సేవానుభావ**
**కులగురుఁడగు పాలకురికి సోమేశుఁ**
**డెలమి చెప్పిన కృతు లిల వెలయించి**
**భవదీయజనకుండు బసవనార్యుండు**
**సవిశేషభాష దీక్షాబోధ చెప్పె;**
**బసవపురాణమ్ము పద్యకావ్యమున**
**రసికు లౌననఁగ మీరలు చేసినారు**
**తాతల తండ్రుల తరములనుండి**
**ఖ్యాతి గాంచినవారు కావ్యనిర్మితిని**
**వింటి నీవంటి వివేకులచేత**
**తొంటి ముక్కంటి భక్తుల కథలందు**
**ప్రభులింగలీలకుఁ బ్రతి చెప్పనరిది.**



-- -- -- --
**కలిత కర్ణాటక కావ్యంబు గాన**
-- ... ... ...
**తెలియ దెవ్వరికిని తెలుఁగున మీరు**
**సిద్ధ వీరేశదేశిక చక్రవర్తి**
-- ... ... ...
**మద్గురుస్వామికి మహితధీనిధికి**
-- ... ... ...
**అంకితముగ ద్విపదాభిధానముగ**
-- ... ... ...
**నాన తీయుండు నా కభిమతంబనిన.**

అని రచించెను.

**కథాసారము:-** కైలాసమున శివునిసభలో శివభక్తుల సన్నిధి పార్వతి గూడ నుండఁగ నొకనాఁడు అల్లమప్రభువు వచ్చిపోయెను. అతనిఁ గూర్చి గౌరి తన నాథు నడుగఁగ, నతని మాహాత్మ్యమును దెల్పును. అంత గౌరి యతనిని మాయలో వంచింతునని పతితో పంతమాడును. పిమ్మట గౌరి మాయను సృష్టించి యల్లమప్రభునిపై పంప నిశ్చయించుకొనెను.

**మూడవగతి:-** భూలోకమున బణవసిపురమందు మమకారుడను రాజునకు మోహినియను భార్య గలదు. వీరికి మాయ పుత్రికగా జనించెను. ఈమె పుట్టగనే తపముచేయు మునులకు క్షోభగలిగె. అప్పుడు దూర్వాస మహాముని యా మునులదగ్గరకు వచ్చి మాయచేష్టలను దెల్పును. మాయ క్రమముగ శైశవబాల్యములనుదాటి యౌవనమును చేరగనే రాజ పురోహితుఁడొకనాఁడు రాజునొద్దకు రాఁగ, మాయా వివాహ ప్రసంగ సందర్భమున నామె విద్యావిశేషమునకుఁ దగిన వరుడు శివుడు గాని యన్యుడు లేడని తెల్పగా మాయ శివభక్తితో నుండెను.

**నాల్గవగతి:-** ఒకనాడు అల్లమప్రభుఁడు మధుకేశ్వరుని ముఖ మంటపమునకు విట వేషమున వెళ్ళగ, స్వామి పూజకై పోయిన మాయయు

చెలులందఱు నాతనిని చోద్యముతోఁ జూచిరి. మాయ యతనిని మోహించెను. అల్లమప్రభుని సంగీత విద్యకు మెచ్చి చెలులు రాజుతోఁజెప్పి కొలువునకుఁ రప్పించిరి. మాయ యతనిపై మోహముతో నుండఁగ మధుమాని యను చెలికత్తె రాయబారము నెరపి యొక రాత్రి వారిద్దరను గూర్చును. కాని యల్లమప్రభుడు మాయకు లోఁబడక ప్రతిమాయచేసి మాయను భ్రాంతి గొల్పెను.

**ఐదవగతి:-** అల్లమప్రభుని మాయాప్రవర్తనములకు మాయ చీకాకుచెంది విరహబాధ చెందుచుండ తనతల్లి గుర్తించి యడుగగ చెలులు జరిగినదంతయు చెప్పిరి. తల్లియైన మోహినియు నల్లమతోఁజెప్పెను. అంత నతడు మాయతో రాజున కపవాదము రాకుండుటకై యట్లు చేసితినని చెప్పి తప్పించుకొనెను. తర్వాత మధుకేశ్వరుని యాలయమునకు మాయ పూజమిషచే పోవునపుడు వారిద్దరు కలియునట్లు చెలికత్తెలు సకల విధములైన యేర్పాట్లు చేసిరి.

**ద్వితీయాశ్వాసము-ఆరవగతి:-** మాయ యల్లమప్రభుని జయింప నాలస్యము చేసినందుల కైలాసమునుండి గౌరీదేవి తన చెలియగు విమలను భూలోకమునకుఁ బంపగా నామె వచ్చి మాయతో మాట్లాడును.

**అల్లమప్రభుని పూర్వ వృత్తాంతము:-** బనవసి యనియు బల్లిగాని యనియు రెండు పురములు గలవు. అందు బల్లిగాని యను పురమున సుజ్ఞానయను శివభక్తురాలికి నిరహంకారుడను భర్త గలడు. వారు సంతాన హీనులగుటచే పుత్రునికొరకై కరలింక భక్తిమై తపము చేయ తల్లింగము నుండి యొక మహానుభావు డుదయించెను.

**ఏడవగతి:-** నిజమైన శివభక్తితో నల్లమప్రభుని సేవించిన నతఁడు దొరకునని మాయతో విమల చెప్పగా నామె యా మాటలందు విశ్వాసముంపక, యల్లమప్రభుని వెదకుటకై పోయెను. దేవాలయమున నల్లమప్రభువు గానబడక నతఁడు వారికి హితోపదేశమును సేయును. మాయ నల్లమను కేవలము మద్దెలవానిని వలచినదని గుజగుజలాడుచుండిరి. మాయావిమలలు అల్లమ ప్రభునితో వాదోపవాదములు నయ భయములతోఁ జేసియు, చివరకు బలవంత పెట్టగా నతఁ డదృశ్యుడగును.



**ఎనిమిదవగతి:-** అంత మాయ దుఃఖంచుచుండ నామె తల్లిదండ్రు లచ్చటికి వచ్చి యోదార్చి వారును చింతించుచుందురు. అంత విమల మాయ పుట్టిన కారణప్రయత్నములనుదెలిపి, యామెను దోడ్కొని కైలాసమునకుఁ బోవఁగ, నామె తలిదండ్రులు పుత్రికావియోగమున దుఃఖించి చివరకు వారి రాజధానికి పోయి రాజ్యము సేయుచుండిరి. కైలాసమున శివుడు, మాయ విఫల ప్రయత్నయై మరలుటను గని పార్వతి యొద్దకుపోయి యామె నోదార్చును. ఆమె కోరికను నెఱవేర్చుటకై శివుడామెకుపదేశించును. పార్వతీ దేవి యొక్క సాత్విక నిర్మలకళను నిర్మించి భూలోకమునకు పంపి, భక్తి వైరాగ్య ములతో నల్లమప్రభుని సేవించినపు డాతఁడామెకు వశ్యుడగునని తెల్పెను. పార్వతి సంతసించి యట్లే చేయును. తర్వాత శివుడు తన శివ గణములను భూలోకములకు ఆమె సహాయార్థమై పంపెను. వృషభేశుని భూలోకమునఁ బుట్టుమని యాజ్ఞాపించి, యతని యొద్దకు అల్లమప్రభుడు వచ్చునని తెల్పెను.

**తొమ్మిదవగతి:-** తర్వాత శివగణములు భూలోకమున పలుచోట్ల పుట్టిరి. భూమికి శిరోభూషణమైన ''ఉడుతడి'' యనుపట్టణమున విమలుడను మానవునకు సుమతియను నతని భార్యయందు పార్వతీదేవి సత్వభక్తి కుమార్తెగా పుట్టినది. ఆమెకు 'మహాదేవి' యని పేరు పెట్టిరి. ఆమె శైవభక్తులతో నలరారు చుండెను. మిగిలిన ప్రమథగణ మక్కడక్కడ పుట్టి పెరుగుచుండిరి. నంది యవతారము బసవేశ్వరుఁడై పుట్టి పెరుగుచుండెను. బిజ్జలుడు బసవనకు మంత్రిపదమిచ్చెను. బసవన సోదరియైన నాగాంబికకు చెన్నబసవడు పుట్టెను. అంత కర్ణాట నగరమునందలి ప్రజలు అల్లమప్రభున కెదురు చూచుచుండిరి.

**పదియవగతి:-**అక్కమహాదేవి యౌవనప్రాప్తురా లగుచుండెను. అంత నొకనాడు 'ఉడుతడి' నేలు మండలేశ్వరుడీమెను చూచి మోహించి, వివాహ మాడనెంచి,యామెయే మి వేడిన నియ్య నిశ్చయించుకొనెను. కాని యామె యేమియు కోరక యతనిని శైవభక్తుడు కావలసినదని కోరగా దాని కతడు సమ్మతింపక పోవుటచే మహాదేవి యతనిని వదలిపోవుచుండగా నామె తలిదండ్రు లామెను తమయొద్ద నుండుమని వేడుకొనిరి. కాని యామె తన భర్తగా శివునిగోరి, యతని వెదుకఁ బోవుదుననియు, వారు తనపై పుత్రికా మమకారము వీడవలయుననియు చెప్పెను. అంత వారందరు శివుని వెదకుటకై బయలుదేరిరి.

తర్వాత నల్లమదేవుని మహాదేవి కలుసుకొనుటయు, వారికి వివాహ మగుటయు మిగిలిన గతులందు వర్ణింపఁబడినది. తృతీయాశ్వాసమున గొగ్గయ కథ, ముక్తాయకథ, సిద్ధరామయ్యకథ తెల్పబడిన తర్వాత నల్లమప్రభువు కళ్యాణ పురమునకు వచ్చుటయు, మునులు శంకర మాహాత్మ్యమును చెప్పుటయు గలదు. చతుర్థాశ్వాసమున ఇష్టలింగయ్య గతి, జ్ఞానోపదేశగతి, గోరక్షునిగతి, ప్రాణలింగైక్యగతి, మునులకుపదేశ గతి గలవు. పంచమాశ్వాసమున శూన్య సింహాసన గతి, బసవన్న ప్రభువు నెదుర్కొనుగతి, బసవడు ప్రభువున కాహారము నిచ్చుగతి, తత్త్వోపదేశగతి, ప్రభువు మహిమ పరమేశ్వరుడు పార్వతి కుపదేశ మిచ్చుటయు గలవు.

మహాదేవియల్లమదేవుల వివాహకథను బాలపాపాంబయను నామె 'యక్కమహాదేవిచరిత్ర' యను పేరుతో యక్షగానమును రచించెను. వీరశైవ వాఙ్మయమందు ప్రభులింగలీలలు బసవపురాణమువలె పవిత్రమును ముఖ్యమునై యున్నవి.

## 3. పిడుపర్తి బసవప్ప

పిడుపర్తి సోమన రచించిన ద్విపద ప్రభులింగ లీలను, నతని సోదరుఁ డగు పాలనార్యుని కుమారుడైన పిడుపర్తి బసవప్ప యను కవి పద్య ప్రబంధముగ గూర్చెను. ఈతఁడు తన కావ్యమును భృంగిరిట గోత్రుండును నాగనాథ వంశజుఁడును, వీరమాంబాపుత్రుడును, చల్లపల్లి శాసనుండు నగు చల్లపల్లి మల్లనారాధ్యునకు నంకితము చేసెను. ద్వితీయాశ్వాసారంభమున కవి యీ యంకిత పద్యమును రచించెను.

క. **శ్రీనగజాధీశ్వర కరు**
**ణానిత్య సమగ్రవిభవ నాళీకరుహా**
**జ్ఞానానూన పరాయణ**
**మానసరో చల్లపల్లిమల్లారాధ్యా॥**

ఈ కవి కావ్యారంభమున పాల్కురికి సోమనాథుని స్తుతించి, తర్వాత శైవభక్తులను పొగడెను. ఈ గ్రంథమందలి యంత్యగద్య యిది. "ఇది పాల్కురికి



సోమేశ్వర వరప్రసాదలబ్ధ కవితాచాతుర్యధుర్య, పిడుపర్తి పాలనార్య సత్పుత్ర, కులపవిత్ర, బసవప్ప నామధేయ ప్రణీతంబైన ప్రభులింగలీల యను శివ జ్ఞానంబునందు పంచమాశ్వాసము."

పాల్కురికి సోమనాథుఁడు ద్విపదగా రచించిన బసవపురాణమును పద్య రూపముగా పిడుపర్తి సోమనాథుఁడు రచించినట్లుగా ద్విపదరూపమున నీతఁడు రచించిన ప్రభులింగలీలలను పద్యరూపమున పిడుపర్తి బసవప్పకవి కూర్చెను. ఈ విధమైన రచన శివకవుల కిష్టమని పిడుపర్తి బసవన తన కుమారునకు చేసిన యుపదేశమని, పద్యబసవపురాణమునందు గమనించితిమి గదా! ఇఁక ద్విపద బసవపురాణ పద్యబసవపురాణ రచనము లనేక సందర్భమును గ్రహించి వెనుక పరీక్షించినట్లుగ ద్విపదప్రభులింగలీలలను, పద్యప్రభు లింగలీల లందు నేక కథా సందర్భమును గ్రహించి పరీక్షింతముగాక. పద్యప్రభులింగ లీలలు ముద్రితమైనది కాని ద్విపద ప్రభులింగలీల లింతవరకు ముద్రితము కాలేదు. పిడుపర్తి సోమనాథుని ద్విపదప్రభులింగలీలలనే తానను సరించి పద్యరూపమున రచించితినని కవియే యిట్లు గ్రంథాంతమున దెల్పు చున్నాడు.

ఉ. ... **... పిడుపర్తివాసుడౌ**
**సోమగురుండు దా ద్విపద**
**చొప్పడఁజెప్పె విచిత్రవైఖరిన్.**

క. **ఆ సోమగురుడు ద్విపదగఁ**
**జేసిన ప్రభులింగలీల క్షితి వెలయంగా**
**నాసక్తి పద్యకావ్యము**
**భాసురగతిఁ బాలనార్య బసవన చేసెన్.**

మోహినీ మమకారులకు మాయ పుట్టినపుడు మునులు క్షోభచెందగ దుర్వాసముని వారియొద్దకుఁ బోయి మాయయొక్క చేష్టలను వర్ణించిన రీతి ద్విపదలో సోమనాథుఁడిట్లు రచించెను.

**" గరుడ కిన్నర యక్షగంధర్వవరుల**
**నరసురాసుర సాధ్య నాగముఖ్యులను**

**కోమలులకు బారిగొరియలఁజేసి**
**దామెనకట్లకుఁదార్చు నామాయ,**
**వొంగి చతుర్దశ భువనపంక్తులను**
**ద్రింగుచు నుమియుచు మెరయు నామాయ,**
**పరమేష్ఠి దొరయని పరికింప మాయ**
**వరవాణికిని జిహ్వా వాసంబుచేసె,**
**హరి యధికుండని యరయంగ మాయ**
**యురమున నిందిర నుండఁగఁజేసె;**
**రుద్రుండు ఘనుఁడని రూపింప మాయ**
**రుద్రాణి నరమేన రూఢిగా నిలిపె;**
**వీరికన్నను ఘను ల్వెదకినఁగలరె?**
**యేరికి గెల్వరాదీ మహామాయ;**
**చూచి మరపు మాయ సుద్దులిన్నియును**
**బూచివిధంబునఁ బొలియు తన్నెఱుఁగ,**
**తల్లియై తనయయై తరుణియై మాయ,**
**యెల్లవారల భ్రమియింపుచు నుండు,**
**పరికింప నామాయ బాయుడెందములఁ**
**బొరి నల్లమప్రభుఁ బూని చింతించు**
**నని చెప్పి దుర్వాసుఁడరిగె నిజేచ్ఛ**
**మునులట్లు సేయుచు ముదమున నుండి**
**రిట మమకారుడు నింతి మోహినియు**
**పటుతరప్రేమనా బాలిక మాయ**
**గనువిచ్చి చూతురు కను మూయలేక**
**మనసుల దలఁతురు మరువరా రూపు**
**నక్కునఁ జేర్పుదు రదలంగ నీరు**
**పక్కలో నిడుదురు బాసిపోలేరు,**
**మాయగాకిది యేడ మన బిడ్డ యనుచు**
**మాయ పేరిడియె న మ్మమకార నృపతి.**



పై ద్విపదలను బసవప్పకవి యీ క్రింది విధముగా పద్యములందు గూర్చెను.

**సీ. గరుడ కిన్నర యక్ష గంధర్వులను మాయ**
**చెలులకు బారిగొఱ్ఱెలుగఁజేసి;**
**పొంగి చతుర్దశ భువనంబులను మాయ**
**ద్రింగుచు నుమియుచు మెరయుచుండె,**
**సూచింప బ్రహ్మవిష్ణు మహేశ్వరుల మాయ**
**గూర్మితో నింతులఁ గూడఁజేసె,**
**తల్లియై తరుణియై తనయయై యీ మాయ**
**యెల్లవారల భ్రమియింపుచుండు;**

**గీ. నేరికిని గెల్వవచ్చునే యిట్టి మాయ**
**యెల్లవారలఁదా భ్రమియింపుచుండు,**
**దనర నా మాయమీఁద డెందములఁ బాయ**
**ప్రభువు చింతించుఁ డని మౌని పల్కి యరిగె.**

వ॥ ఇవ్విధంబున దుర్వాసుం డానతిచ్చిన క్రమంబున నమ్మునీంద్రులు ప్రభువుం దలంపుచుండిరి. ఇట మోహినీమమకారులు నిజతనూజ యగు మాయను పోషింపుచు,

**సీ. కను విచ్చి చూతురు కను ముయ్యగాలేరు**
**మనసున దలఁతురు మరువరెందు,**
**నక్కునఁజేర్చుదు రలిగిపోనియ్యరు**
**పక్కలో నిడుకొని పాయలేరు**
**దాదులు చన్నిచ్చి తలయంటి నీరార్చి**
**తడి యొత్తి వెన్న నుగ్గిడుదు రెపుడు,**
**కన్నుల కాటుక చెన్నారఁగాఁ బెట్టి**
**భూతి బొట్టిడి చల్వపొత్తిఁ బరచి**

**గీ. యెలమి పవళింపఁగాఁజేసి యెలుఁ గులెత్తి**
**సుదతు లందరు జోకొట్టి జోలబాడి**

**గట్టి బంగారుగొలుసుల గట్టినట్టి**
**తొట్టి యూతురు నిద్దుర పట్టుదనుక.**

**గీ.** **తల్లి చంకనుండి తండ్రిపైఁబడి మెడ**
**బిగ్గఁ గౌఁగిలించుఁ బెట్టు ముద్దు**
**అందియలును మువ్వ లందంద మ్రోయంగ,**
**పుడమిమీఁద తప్పుటడుగు లిడుచు.**

**కం.** **బంగారు రావిరేకలు**
**నుంగరములు పసిడిగుండ్లు నొత్తుల దండల్**
**సంగతి మేనఁ జెలంగఁగ**
**బ్రాంగణముల నాడుచుండుఁ బడుచులతోడన్.**

**కం.** **ఈ రీతిఁ జెలఁగుసుత మమ**
**కారుఁడు వీక్షించి మాయ గాకిది బిడ్డా**
**యారయ నని తొలి జన్మము**
**ప్రేరేపఁగ మాయపేరు బెట్టిరి యంతన్.**

పై రచననుబట్టి, బసవప్పకవి తన పద్య ప్రభులింగలీలలను పిడుపర్తి సోమనాథుని ద్విపద ప్రభులింగలీల ననుసరించితినని తెల్పినను, పాల్కురికి సోమనాథుని ద్విపద బసవపురాణమును పిడుపర్తి సోమనాథుఁడు పద్యముగ చేసినట్లుగ చేయలేదని తెలియుచున్నది. ఎందుచే ననగా పైనిజూపిన భాగమున ద్విపదలోని పూర్వభాగమగు బ్రహ్మ విష్ణు శివుల విషయము విపులముగనుండగ పద్యరచనముగ బహుక్లుప్తపఱుపఁబడినది. ద్విపదలో నుత్తరభాగమగు మాయ యొక్క శైశవము బహుక్లుప్తముగ వర్ణింపఁబడగ పద్యరచనయందు ప్రపంచింపఁ బడి, మూలమున లేని వర్ణనలుగూడఁ జేయఁబడి మూఁడు పద్యములు విశేషముగ రచింపఁబడినవి. ఇందువలన బసవప్పకవి రచన, పద్యబసవపురాణ రచనవలె మూలమున కన్యూనాతిరిక్తముగ లేక స్వతంత్రముగ భారతాది పురాణముల భాషాంతరీకరణమువలె నున్నదని చెప్పవలసియున్నది. మఱికొన్ని ఘట్టములనుగూడ పరామర్శింతము.



అల్లమప్రభువు మాయను భ్రాంతిపెట్టి మోసగించినవిధము విచారింతము. ద్విపదరచన యిది,

**“ ఏకాంతగృహమున కెవ్వరి కెఱుఁగ**
**రాకయుండఁగ నర్ధరాత్రంబునందు**
**అల్లమ దెచ్చి శయ్యాస్థలి నునిచి**
**యల్లన దమ మాయ నచటకుఁ దెచ్చి**
**చెలులు చేతలపేరు చెప్పక చనిరి.**
**తలుపు చేరుచుకొంచుఁదదంతరమున**
**మదనభూతము సోకి మాయ యల్లమను**
**గదిసి పైకొని పొందగాఁబోవ నతడు**
**నీలమేఘంబులోని మెఱుఁగు భాతి**
**నాలోకనంబుసేయంగనేగాని**
**యాలింగనంబు సేయంగఁ గన్పడడు;**
**ఆకాశమువిధాన నలరుటే కాని,**
**యేకమై రతికేళి యెనసి యుండండు;**
**బత్తితో నధరంబు పట్టి పీల్చినను**
**రిత్తనోరే చప్పరించి నట్లుండు;**
**కరము కరంబునఁ గదియింప బయలు**
**పరికించి పట్టిన భాతియై యుండు,**
**నురమునఁ జన్మొన లొత్తిన బయలు**
**పరిరంభణము చేయు పగిదియై యుండు;**
**నీ రీతి మాయ తానెంత చేసినను**
**మారవిక్రియ లల్లమకు లేక యుండె.”**

పై ద్విపదభాగమును బసవప్పకవి యీ విధముగ పద్యములందు గూర్చెను.

వ॥ అని యొడంబరచి నరసనల్లాపంబుల ప్రొద్దుపుచ్చుచు నమ్మహాత్ముని నర్ధరాత్రంబునం దొడ్కొనివచ్చిన మధుమానినిం గాంచి సమంచిత

వస్తువులం ధరించి యేకాంత గృహంబులనున్న యల్లమప్రభు పుంగవుంగని మాయాంగన యంగజ వికారంబు నిలుపనోపక కదియంజని కలయం దలఁచి,

సీ. నీలమేఘంబులోని మెరుంగు విధమున
గనవచ్చు చిక్కఁడు గౌఁగిలింప
యాకాశమువిధాన నలరుటేకాని తా
నేకమై రతికేళి నెనయఁడెపుడు
రిత్తనూరక చప్పరించిన యట్లుండు
నధరామృతంబు దా నానబోవ;
కరము కరంబున గదియింపఁబోయిన
బయలు పట్టినయట్లు బరగుచుండు

గీ. నురమునను చన్నుమొనలు దా నొత్తఁబోవ
బయలు పరిరంభణముసేయు పగిదినుండు
నివ్విధంబున మాయ దా నెంతసేయ
ప్రభువు చలియింపకుండె నా భావజునకు.

ఈ భాగమును కవి మూలముననుసరించియే రచించెను. ఇఁక నీ కావ్యమందలి మహాదేవి యౌవనప్రాప్తి వర్ణనము సర్వవిధముల బసవపురాణ మందలి బసవేశ్వరుని యౌవనప్రాప్తివర్ణనమును స్మరింపఁజేయుచున్నది. (చూ.పు. 12) మూలకవి బసవ పురాణ రచనను చూచి దాని ననుసరించి యుండబోలు. పిడుపర్తి సోమనాథుని ద్విపద రచన యిది.

" ఆ మహాదేవికి నలరె బాల్యంబు
కోమలంబైనట్టి కొమరుప్రాయమున
నీలకంఠుని భక్తి నెగడెనో యనఁగ
బాలిక కచములు బారెడేసయ్యె;
హరునిఁ జూచెడి వేడ్క యధికమైనట్లు
కరియాన మొగమెల్ల కన్నులై దోఁచె;
ప్రమథేశుఁ బూజింప రతి హెచ్చెననఁగ



ప్రమదహస్తంబు లబ్జంబులంబోలె;
జ్ఞానవైరాగ్యముల్ సమకూరెననఁగ
మానినీమణి కుచమండలి చెలఁగె;
అతిసూక్ష్మవిజ్ఞప్తి యలవడెననఁగ
నతివ మధ్యంబు చిదాకాశమయ్యె;
గురుభక్తికింతయు గురుతయ్యెననఁగ
వరనితంబము గౌరవమ్ము వహించె;
మనసు చంచలవృత్తి మానిచె ననఁగ
వనజాక్షి నెన్నడవడి మందమయ్యె."

పై భాగమును బసవప్పకవి పద్యరూపమున నిట్లుకూర్చెను.

కం. ఆయక్క మహాదేవియు,
నాయెడ బాల్యంబు గడపి యంతట గొమరుం
బ్రాయమున నుల్లసిల్లెను
కాయజు పట్టంబు భద్రగజమో యనఁగన్॥

సీ. నీలకంధరుభక్తి నెగడెనో యనఁ గను
బాలిక వెంట్రుక ల్బారెడయ్యె
హరుని గన్గొను వేడ్క నధికమై యున్నట్లు
కన్నియ మోమెల్ల కన్నులయ్యె;
ప్రమథేశుఁ బూజింప రతి హెచ్చెనో యన
ప్రమదహ స్తంబు లబ్జంబులయ్యె;
జ్ఞాన వైరాగ్యము ల్సమకూడెనో యన
కాంత కుచంబులు ఘనములయ్యె;

గీ. లలనకతి సూక్ష్మ విజ్ఞప్తి గలిగె ననఁగ
కడగి నడుమంతయును చిదాకాశమయ్యె;
మనసు చంచలవర్తన మాన్పెననఁగ
మగువ యానంబు మిక్కిలి మందమయ్యె.

ఈ భాగమునుగూడ కవి మూలమున కన్యూనాతిరిక్తముగ రచించినాడు.

ప్రభులింగలీల రచనమందు పిడుపర్తి సోమనాథుడు బసవపురాణ పండితారాధ్య చరిత్రములందు పాల్కురికి సోమనాథుఁడు పోయిన పోకడలను పోయినాడు. అక్కమహాదేవి బాల్యవర్ణనము, బసవేశ్వరుని బాల్యవర్ణనముతో నెట్లు పోలియున్నదో పైన సూచించినాను. ఆ సందర్భమునఁ గూడ నలంకార ములను కుప్పలు కుప్పలుగా రచించినాడు. పాల్కురికి సోమనవలెనే కుప్పలు కుప్పలుగా యలంకారములను కూర్చి, యొకేపోలిక కనేక యుపమానములనుఁ గూర్చుటకు గాను ప్రభులింగలీలలం దీ క్రిందనొక యుదాహరణమును చూపుదును. అక్క మహాదేవి ' ఉడుతడిరాజు' శైవమతమును స్వీకరించుట కంగీకరింపకుండుటచే నతని పరిణయమాడ నంగీకరింపదు. అంత రాజు దుఃఖము నిట్లు పిడుపర్తిసోమన కుప్పలుకుప్పలుగా నుపమాలంకారముల నుపయోగించి వర్ణించినాడు.

**" అర్కతేజము గూబ కనువుగానట్లు,**
**మూగకు మాట లింపులు గానియట్లు,**
**ఈగకు సౌరభ్య మింపు గానట్లు,**
**కోపికి శాంతంబు గూడనియట్లు**
**పాపికి పుణ్యంబు ఫలియింపనట్లు,**
**ముక్కడి కర్థంబు మురువుగానట్లు,**
**కుక్కకు టెంకాయ గూడనియట్లు,**
**రోగి కౌషధమది రుచియింపనట్లు,**
**నాగకంకణభక్తి నరపాలమణికి,**
**ననుమతి గాకున్న నా మహాదేవి,**
**కిని వానికిని బొందు కీలూడి పడియె".**

ఈ విధముగ పిడుపర్తికవు లందఱు పాల్కురికి సోమనాథకవిని గురువుగా భావించి, వాని పాదములే యనేక పర్యాయములు పట్టుకొని, యనుసరించి, యతని యందు భక్తిగలవారైనను, ఛందో విషయమున మాత్రము వీరు పాల్కురికి సోమనాథునియంత స్వాతంత్ర్యమును జూపి వాని



ననుసరింపరైరి. ద్విపద ఛందములో తమ గ్రంథముల రచించి పాల్కురికి కవి గురు మార్గము ననుసరించినను పిడుపర్తి కవుల రచనలం దెక్కడను ద్విపదలలో ప్రాసయతిని వాడిన స్థలముమాత్రము గోచరింపదు. ఇది వీరి రచనలం దొక విచిత్రము. వీరి కాలమున కట్లు వ్రాయుట మహాదోషముగ పరిణమించి వీరిని గూడ భయపెట్టెనుగాఁబోలు. 'ప్రాసవళులు పెట్టి రచించిన పురాణమను' నిందా వాక్యము వీరిని కొంచెము చకితులుగఁ జేసి యుండ వచ్చును.

పిడుపర్తి సోమనాథ రచితద్విపద ప్రభులింగలీల లింతవఱకు ముద్రింపఁబడలేదు గాని, బసవప్పకవిరచితమైన పద్య ప్రభులింగలీలలు 1923 వ సంవత్సరమున చెన్న పట్టణమున శ్రీ రాజరాజేశ్వరీ నికేతన ముద్రాక్షరశాల యందు పమ్మి త్యాగరాయ శెట్టి కుమారులచే ముద్రితమైనది. కాని యీ ముద్రణము చాల తప్పులతో నుండి గోధుమకాగితములపై ముద్రితమై నపరిశుద్ధముగ నుండుటచే వ్రాతప్రతికంటె నేమియు నెక్కువగ లేదు. పరిశుద్ధముగ పై గ్రంథములురెండు ముద్రింపవలసియున్నవి. శివజ్ఞానమను నామాంతరము గల యీ ప్రభులింగలీలలను పై కవిద్వయమే కాక, కొచ్చెర్ల కోట రామకవియు, నడకుదుటి రామనకవియు పద్యరూపముల రచించిరి. వీరిద్దరు నర్వాచీనకాలమునకు చేరినవారు.

# చతుర్ధ ప్రకరణము

## శైవమతము

శివతత్వసారము, చతుర్వేదసారము, వీరశైవదీక్షాబోధ మొదలగు గ్రంథముల తర్వాత వీరశైవమతవిషయిక గ్రంథములలో పేర్కొనఁ దగినవి వీరమాహేశ్వరాచార సంగ్రహము మొదలైనవి.

## పర్వతమంత్రి లింగన - వీరమాహేశ్వరాచార సంగ్రహము

సంస్కృతమున నీలకంఠనాగనాథాచార్యుఁడను శైవాచార్యుఁడు రచించిన వీరమాహేశ్వరాచార సారసంగ్రహమను గ్రంథమును ద్విపద రూపమున తెలుఁగున పర్వతమంత్రి లింగనామాత్యుడు భాషాంతరీకరించెను. ఇది యముద్రిత గ్రంథము. చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమందలి లిఖతప్రతియందు బ్రౌనుదొరగారిక్రింద రీతిగ లఘువుగ సమీక్షచేసిరి.

"This is one of the Aradhya or semi jangama works labouring to reconcile the creed of Basava with the various superstitutions in vogue among Brahmins. Such treatises seem to aim at reconciling the smarthas to the Aradhyas, No wonder that the Jangamas reject such books as heritical. Basava endevoured to abolish the very customs herein inculcated particularly spells such as occur in page 424."

మూలగ్రంథము 10 ఆశ్వాసములలో నీ క్రింది 10 విషయములు వ్రాయఁబడెను. 1. విభూతిమహిమ, 2. రుద్రాక్షమహిమ 3. పంచాక్షరీమహిమ, 4. హరనామమహిమ, 5. శివరాత్రిమహిమ, 6. శంఖచక్రోత్పత్తి 7. మార్కండేయ చరిత్ర 8. విష్ణుశాపవిమోచనము, 9. శరభేంద్రమహిమ, 10. వ్యాసశిక్ష

ఈవిషయ వివరణమును కవి గ్రంథావతారికయందిట్లు తెలిపినాడు.

" చేకొని ద్విపదలు చేసి వర్ణింపఁ
గైకొన్న తత్పుణ్య కథలెట్టివనిన ---



1. భవదుఃఖదురిత దుర్భయములఁబాపి
వివిధకామ్యము లిచ్చు వీభూతిమహిమ;

2. క్షుద్రజీవునినైన శుద్ధాత్ముఁజేసి
రుద్రలోకముఁ జేర్చు రుద్రాక్షమహిమ;

3. విశదమై యొకమాట విన్నమాత్రమున
నసమాక్షుఁ జేర్చు పంచాక్షరీమహిమ;

4. పరగనే క్రియనైనఁబలుకు ధన్యులకు
హరుని రూపము లిచ్చు హరు నామమహిమ

5. శివరాత్రిమహిమ నీక్షించు మాత్రమున
శివునిలోకము గల్గు శివరాత్రిమహిమ;

6. శంభుఁడు కల్పించిన శంఖచక్రములు
అంబుజాక్షున కిచ్చునట్టి సన్మహిమ

7. మరణంబు లేకుండ మార్కండేయమునికి
నురగేంద్రకంకణుఁడొసఁగిన మహిమ

8. భృగుని శాపంబునఁ బొంది శ్రీధరుఁడు;
తగు తపంబునఁ జంద్రధరుఁ గొల్చుమహిమ:

9. సింహాశనుని మేను క్షితినుండనీక
సంహరించినయట్టి శరభేంద్రుమహిమ;

10. వనజాక్షుఁ డే దైవమని చేతులెత్త
నొనర వ్యాసుని చేతులొలిచినమహిమ;
అభిరమ్యముగ పది యాశ్వాసములను
శుభకరంబై లోకసుందరం బగుచు
శ్రీగిరీశ్వరుపేర శ్రీకంఠుపేర

-- -- --

**విరచించి గురునకు విన్నవించెదను"** అని వివరించినాడు.

పర్వతమంత్రి లింగనకవి యీ కావ్యమును వ్రాయుటకుఁగల కారణమును తన గురువైన శ్రీ మల్లికార్జునుడని గ్రంథావతారికయం దిట్లు తెల్పు చున్నాడు.

**" తలపోసి యొకనాఁడు తగుభావమందు**
**నే రీతిఁబాయుదు నెల్ల దోషములు**
**నే రీతిఁబొందుదు నెల్ల పుణ్యములు**
**భవముల నే రీతిఁ బాయనోపుదును**
**శివలోక మెబ్భంగి సిద్ధించు నాకు**
**అనియని తలపోయు నవసరంబునను**
**నొనర నయోనిజుండూర్ధ్వలోచనుఁడు**
**వివిధవేదజ్ఞుండు విజ్ఞానకరుఁడు**
**అవని లింగాకారుఁడైన నిర్మలుఁడు**
**సద్గుణాచార్యుండు సర్వపూజితుఁడు**
**మద్గురుండైన శ్రీమల్లికార్జునుఁడు**
**ముదమునఁబ్రత్యక్షమూర్తియై నిలిచి**
**సదమలాత్మక యేల శంకఁ బొందెదవు"**

అని చెప్పి, నీలకంఠనాగనాథాచార్యుఁడు సంస్కృతమున రచించిన వీరమాహేశ్వరాచారసంగ్రహము నాంధ్రీకరించుమని యిట్లు చెప్పెనట.

**" శ్రీ గిరీశ్వరహిత శ్రీ నీలకంఠ**
**నాగనాథాచార్య నామాంకుఁడెలమి**
**సకల శ్రుతిస్మృతి శాస్త్రపురాణ**
**నికరంబులందున్న నిటలాక్షుమహిమ**
**యధ్యాయములు దివిచి యాడి సంస్కృతము**



**హృద్యమై సకల వేదోక్తంబునందు**
**వీరమాహేశ్వరాచార సంగ్రహము**
**పేర ప్రవర్తిల్లుఁ బేర్మిఁబుణ్యులకు**
**దెఱగొప్ప విజ్ఞాన దీపంబు చేసి**
**యరుదారఁ బెంపొందు నప్పురాణంబు**
**ధృతి నంధ్రభాషల కృతి సేయుదేని**
**యతులితసుజ్ఞాన మది నీకుఁగలుగు**

... ... ...

... ... ...

**అనుచు శ్రీగురునాథుఁ డత్యంతకరుణ**
**ననురాగమునఁ బ్రీతి నభయ మిచ్చుటయు"**

... ... ... ..... .......

... ... ... ..... ......

గ్రంథమందు తెల్పఁబడిన నంశములఁబట్టి కవి వంశవృక్షమిది

**నాగయమంత్రి - (భార్య - గౌతమ)**
**!**
**పోతనమంత్రి - (భార్య - నాగమాంబ)**
**!**
**నాగవిభుడు - (ఔబళ)**
**!**
**పర్వతరాజు - (కామాంబ)**
**!**
**|----------------------------------------|**
**కృతికర్త లింగనమంత్రి (త్రిపురాంతక)                నారన**
**!**
**-----|---------------|---------------------|-----------------|--------**
**పర్వతేంద్రుడు    మల్లికార్జునుడు        వీరేశ్వరుడు      బసవేశ్వరుడు**

కవికాలము:-ఈ కవి మల్లికార్జునపండితారాధ్యుని శిష్యుడని కావ్యాదిని చేయఁబడిన గురుస్తుతివలనఁ దేలుచున్నది. అది యిది.

**కావ్యారంభము :-**

**శ్రీకాశిపురనాథు శ్రీశైలనాథు**
**లోకపూజితు సర్వలోకైకనాథు**
**కైలాసగిరినాథు కనకాద్రినాథు**
**శైలేయసుతనాథు సకలాధినాథు**

అని యిష్టదేవతాస్తుతి యైన తర్వాత కవి పండితారాధ్యుని నిట్లు స్తుతించినాఁడు.

**" బెరసి దాక్షారామ భీమేశ్వరమున**
**హరుఁ డయోనిజరూపుఁడై యున్నవాని,**
**వేదోక్తమార్గంబు వెసఁబ్రతిష్ఠించి**
**ఆది శ్రీగురుమూర్తియైయున్న వాని,**
**అజ్ఞానతిమిరంబు నవలీల వాపి**
**విజ్ఞానదీపంబు వెలిగించువాని,**
**వెలనాటి నృపుడాది వివిధదూషకుల**
**విలయంబుగాఁ జూచి విలసిల్లువాని,**
**ఉన్నత సత్కీ ర్తినుప్పొంగి నిలువు**
**గన్నులు వేడ్కతోఁగైకొన్నవాని,**
**రూపంబు మఱి లింగరూపమై నిలిచి**
**యేపారఁబూజ్యుఁడై యిల నున్నవాని,**
**అరూఢిఁదగు మల్లికార్జునపండి**
**తారాధ్యదేవుని నమర సేవించి,**
**సకలగణేంద్రుల సకలదేవతల**
**సకలమునీంద్రుల సంస్తుతిచేసి,**
**సర్వస్వరూపుఁడై సర్వాత్ముఁడైన**



**సర్వపూజితుఁడైన సర్వేశుమహిమ**
**వర్ణింతు నొక కొంత వసుధపై నిట్లు**
**వర్ణించునట్టి నా వంశమెట్లనిన"**

అని రచించుటచే నితడు మల్లికార్జునపండితారాధ్యుని ప్రత్యక్ష శిష్యుఁడే యైనచో నతని కాలముననే యనగా పండ్రెండవ శతాబ్దముననే యుండి యుండును. అట్లుగాక పండితుని కాలము తర్వాత నతనిని కేవలము గురుభావమున పూజించినవాడగుచో నతనికి తర్వాత జీవించి యుండును. అట్లె యైనచో నితనికాలమును స్పష్టముగ నిర్ణయించుట కష్టము.

ఈ పర్వతమంత్రి లింగనది శ్రీవత్సగోత్రమని యీ క్రింది కావ్యాంత గద్యను బట్టి తెలియుచున్నది.

**అంత్యగద్య :-**

**ఇది శ్రీ గిరీశ విశ్వేశ్వరధ్యాన**
**విదిత శివాచారవిహిత సుజ్ఞాన**
**పండితారాధ్య శ్రీపాదాబ్జ భృంగ**
**ఖండేందుధర భక్తికామ్యాంతరంగ**
**శివకృపాంచితగాత్ర శ్రీవత్సగోత్ర**
**ప్రవిమల నిగమోక్త భవ్యచారిత్ర**
**శైలజేశ్వర భృత్య, జనభృత్య, భృత్య**
**లీల పర్వతమంత్రి లింగనామాత్య**
**విరచితమై సర్వవేదాంత మగుచు**
**ధరణి నాచంద్రార్కతారకం బగుచు**
**శ్రీరమ్యమై, సర్వసేవ్యమై యొప్పు**
**వీరమాహేశ్వరాచార సంగ్రహము**
**నందుఁ బరాశరునందనుచరిత**
**మందమైఁదగు దశమాశ్వాసమయ్యె"**

ఈ కవి 'రుద్రాక్షమాహాత్మ్య' మను గ్రంథమును గూడ ద్విపదలో రచించెను. ఈ రెండు గ్రంథములు నముద్రితములే.

## II. కుంటముక్కల తిరుమలనాథుఁడు - శైవాచారసంగ్రహము

తిరుమలనాథకవి అహోబలమంత్రిపుత్రుడు. ఇది సైన్యాధిపతియైన పిల్లలమఱ్ఱి కన్నయామాత్యున కంకితమీయఁబడినదని యీ గ్రంథప్రారంభ పద్యమునుబట్టి తెలియుచున్నది. అది యిది.

శా॥ **శ్రీరమ్యాబ్జదళాక్షముఖ్యసుర సంసేవ్యుండు, కృష్ణానదీ**
**తీరస్థేముఁడు, మల్లికార్జునమహాదేవుండు, శ్రీశైల రా**
**డ్యారాముండు, శివామనోహరుఁడు, నిత్యానందచిద్రూపుఁ, డిం**
**పార న్విస్సయ గన్నధీమణి కభీష్టార్థంబు లిచ్చున్ దయన్.**

ఈ గ్రంథము పద్యరూపమున రచియింపఁబడినది. ఇందు మూఁడా శ్వాసములు గలవు. సంస్కృతమందలి శైవాగమములనుసరించి శైవుల శివపూజావిధానాద్యాచార విషయము లిందు వివరింపఁబడినవి. ఇందు సంస్కృత గ్రంథములను బేర్కొనుచు విషయము లాంధ్రీకరింపఁబడినవి. ఈ గ్రంథమందు గల విషయము లిందలి యంత్యగద్యయందు వివరింపఁబడినవి.

**అంత్యగద్య:-** ఇది శ్రీ దుర్గాంబాప్రసాదాసాదిత కవితావిలాస భాసుర శ్రీమదహోబలామాత్యపుత్ర, సుకవిజనమిత్ర, సకల విద్యావిధాన, తిరుమల నాథాభిధానప్రణీతంబైన శైవాచారసంగ్రహంబను కృతియందు, "నైవేద్య లక్షణంబును, కర్పూరయుక్తంబగు తాంబూలం బర్పించుటయు, ప్రదక్షిణ నమస్కారంబును, లింగార్చనకాలవిశేషంబును, ఆలింగోదక, పాదోదక, ప్రసాదోదక మాహాత్మ్యంబును, ప్రసాదసేవానర్హ లక్షణంబును, భక్త మాహేశ్వర ప్రసాద ప్రాణలింగ శరణైక్యషట్థ్సలంబుల ప్రకారంబును, సంసార హేయ స్థలంబును, గురు శిష్యలక్షణంబు నన్నది సర్వంబును తృతీయాశ్వాసము.



ఈ ప్రబంధకృతిపతియైన పిల్లలమఱ్ఱి కన్నయమంత్రి భారద్వాజ గోత్రుడు. అతని వంశవృక్షమిది,

**పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు**
**।**
**కన్నయ మంత్రి**
**।**
**విస్సయ మంత్రి (భార్య వీరాంబ)**
**।**
**కృతిపతి ... కన్నయ మంత్రి**

కృతిపతి కవిని పిల్చి యీ గ్రంథమును వ్రాయ నియోగించెనని తన్ను గూర్చి కవి గ్రంథమునఁ దెల్పుకొనిన పద్యములివి,

క. **అనుపమచరితుఁ బరాశర**
**మునిగోత్రజు నన్నుఁ గుంటముక్కలనిలయున్**
**ఘనుని నహోబల మంత్రీం**
**ద్రుని నందను దిమ్మనార్యు (తిమ్మలార్యుఁ) నుతతగాంభీర్యున్॥**

పై పద్యమునుబట్టి కవి కుంటముక్కల గ్రామ నివాసియనియు, నా గ్రామమును బట్టియే తన యింటిపేరు సిద్ధించినదనియు తెలియుచున్నది. కాని యీ కుంటముక్కల యే మండలములోనిదో విచారింపవలసి యున్నది. మరియు, కృతిపతి వంశచరితమును బట్టి కవికాలముగూడ నిర్ణయింపవలసి యున్నది. ఈ కృతిపతియైన కన్నయమంత్రి యే రాజువద్ద సైన్యాధిపతిగా నున్నవాడో స్పష్టముగలేదు. కాన కవికాలముగూడ స్పష్టముగ తెలియుటలేదు.

పిమ్మట కృతిపతి కవిని గ్రంథరచనకు పురికొల్పిన పద్యమిది-

ఉ. **నీవు మహానుభావుఁడవు, నిర్మలబుద్ధి జగద్ధితంబుగా**
**శైవపురాణ సంహితల సారము సర్వము సంగ్రహించి ధా**
**త్రీవిదితంబుగాఁగ నొనరింపుము పెంపున నాకు నంకితం**
**బై విలసిల్ల నొక్క కృతి నార్యులకెల్లను నమ్మతంబుగాన్.**

వ॥ అది శైవాచార సంగ్రహంబనుపేరఁ బ్రసిద్ధంబుగా వెలయ వలయునని--

ఈ కవి శైలి లలితమై రసవంతముగనున్నది. ద్వితీయాశ్వాసమున లింగోదక మాహాత్మ్య సందర్భమునందుండి శైలి కుదాహరణ నిత్తును.

క. శివపూజకు నర్హములై
భువి నెన్నఁగబడిన యట్టి పువ్వులు, పత్ర
ప్రవరములు వరుస చెప్పుదు
వివిధ పురాణోక్తసరణి వివరించి తగన్.

గీ. మొదలఁ గాలోత్తరమున షణ్ముఖున కభవుఁ
డానతిచ్చిన సరణి నుదాహరింతు
నేకపుష్పంబు శివుని యందిడిన ఫలము
సాధకులు మెచ్చ, మునిలోకసంతసముగ.

క. సురుచిరగుణశీల తపో
భరితుఁడు, నిగమాంతవిదుఁడు, పాత్రుఁడునగు భూ
సురునకిడు కోటి హాటక
గురు ఫలము శివార్పితైకకుసుమముననగున్.

గీ. పాత్రులకు కోటికన్యల భద్రదంతి
వర్యసాహస్రముల నిచ్చి వాజపేయ
శతము లొనరించు నరుఁ డే సుకృతమునొందు
ఫలము గలుగును నొక పువ్వు నభవు  కిడిన.

క. పశుపతికి నొక్క పువ్వు స
దృశమతి నర్పించిరేని త్రిభువనములు తా
దృశమగు నిజేచ్ఛను ఫలము
విశేష ఫల మింతకంటె వే రెద్ది ధరన్.

క. అందోళికాది యానము
లందును, హర్మ్యంబులందు, ననుపమ వనితా



నందీప్తకుచ ధరంబుల
యందును నరుఁడొందు పువ్వు హరునకు నిడినన్.

మ. సకలానర్ఘ్యమణి ప్రపూర్ణమగు  నీ సర్వంసహాచక్రమున్
ప్రకట స్వర్ణగిరీంద్రమున్ వరనిధిన్ పాత్రద్విజశ్రేణి కె
న్నికగా నిచ్చిన తత్ఫలంబునకున్ సరియె వెయ్యోపాలికిన్ దూచినన్
... ... ... ... ... ...

గీ. యజ్ఞకోటిసహస్రంబు లధికనిష్ఠ
నరుఁడు చిరకాల మచలయత్నమునఁజేయ
నేమి ఫల మది లింగదత్తైక పుష్ప
ఫలము వెయ్యగు పాలికి పాటికాదు.

క. ఇలలో నగ్నిష్టోమం
బులు వెయ్యిని, వాజపేయములు నూరు సమం
బులు గావు లింగపూజా
ఫలమున నొక పువ్వు కోటి భాగంబునకున్.

క. అవు ననఁగ కోటిగోవుల
నవనీనిర్జరుల కొసఁగునట్టి ఫలంబుల్
శివలింగార్పిత పుష్ప
ప్రవర సహస్రాంశమునకు ప్రతి గాదు మహిన్

క. జలమైన, పుష్పమైనను
మలహరునకు ప్రీతి మంత్రమార్గంబుల న
ట్లలవడ నిచ్చిన పురుషుఁడు
కులకోటుల నుద్ధరించు గురువరమహిమన్.

## III. శివరామలింగకవి - వీరశైవాచారసంగ్రహము

శివరామలింగకవి గోకర్ణమఠాధీశ్వరుఁడైన సోమశేఖరదేవుఁడని యీ క్రింది యాశ్వాసాంత గద్యవలనఁ దెలియుచున్నది.

**అంత్యగద్య:-** ఇది శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపూర్ణైక లింగైక్య నిష్ఠాపర, వీరమాహేశ్వర సందోహచరణ, కమలషండ మకరంద పాన మత్త ద్విరేఫా యమాన మానస, **తావ ద్గోకర్ణమఠాధీశ్వర పంచవర్ణిగయతి రాయ పట్టభద్ర** శ్రీసోమశేఖరదివ్య పాదారవింద బంభరుండైన శ్రీ నందికేశ్వర కరనీరజ గర్భోద్భవుండైన **శివరామలింగప్రణీతం** బైన స్కాంద పురాణోత్తర శంకర సంహితా ఖ్యానంబన వీరశైవాచారసంగ్రహంబున తృతీయాశ్వాసము.

వీరశైవాచార సంగ్రహము స్కాందపురాణాంతర్గత శంకరసంహితకు తెలుఁగు. ఇది మూడాశ్వాసముల సంపూర్ణగ్రంథము. ఈ విషయమునే కవి తన గ్రంథప్రారంభ పద్యములలో నిట్లు తెలుపుకొనెను.

గీ. **పరమ శివతత్త్వ శాస్త్రమేర్పడ వెలుంగు**
**నరయఁగా స్కాందమను పురాణాంతరమున**
**ఘనులు శంకర సంహితాఖ్యానమనఁగ**
**నది తెలుంగున రచియింతు నభినవముగ.**

దీని ప్రారంభ మిట్లున్నది.

క. **శ్రీపార్వతీశ, మాధవ**
**తాపసహృదయాబ్జ భృంగ, ధన్యార్చిత వి**
**ద్యోపాయ నిలయ నిర్మల**
**శ్రీపతి చిత్తాంతరంగ శ్రీగురులింగా॥**

ఈ గ్రంథము శక సం. 1655 న రచింపఁబడినట్లుగా గ్రంథకర్తయే యందు చివరపద్యమున నిట్లు తెలుపుకొనినాడు.

సీ. **చనినట్టి శాలివాహన శకాబ్దంబులు**
**పాటింప వేయునార్నూటిమీఁద**
**నిరవందగా నేబదేను ప్రమాదీచ**
**విమలవత్సరము నాశ్వయుజమందు**
**బహుళ తృతీయలో భానువాసరమున**
**రచియించినట్టి నిర్ణయచరిత్ర**



**వీరశైవుల సదాచార సంగ్రహత దా**
**పరిపూర్ణమయ్యెఁ బ్రబంధరీతి**

గీ. **సముచితాచార నిష్ఠలు సాధుజనులు**
**నంతరింద్రియ బాహ్యేంద్రియాదులెల్ల**
**నాత్మ లింగాభిమాన సాధ్యానుభవులు**
**శివ సమర్చకులై యభ్యసింపవలయు.**

## IV. చెన్నాప్రగ్గడ నాగేశ్వరకవి - శైవసిద్ధాంతశిఖామణి

వీరశైవ సిద్ధాంతశిఖామణి వీరశైవమత వేదాంతప్రతిపాదకమైన నాలుగాశ్వాసముల ద్విపదగ్రంథము. దీనిని చెన్నాప్రగ్గడ నాగేశ్వరకవి రచించెను. ఈతఁ డాత్రేయగోత్రుడు. ఈతఁడు తెల్పుకొనిన తన వంశానుక్రమమును బట్టి యితని వంశవృక్ష మిట్లున్నది.

**గోపనార్యుడు - (భార్య - గంగమాంబ)**
|
**మాదిరాజయ్య - (భార్య గంగమాంబ)**
|
**వీరభద్రుఁడు - (భార్య గురువాంబ)**
|
**గ్రంథకర్త - నాగేశ్వరకవి**

**"వారికిద్దరకును వరనందనుఁడను**
**నారూఢి నాగేశ్వరాభిధానుండ**
**గురుతరాత్రేయ సద్గోత్రసంభవుడ"**

అని కవి తెల్పుకొనినాఁడు. ఈతఁడు మల్లంపల్లి రామలింగారాధ్యుల శిష్యుడనని గూడ నిట్లు చెప్పికొనినాడు.

**" జగతిపై మున్ను నిశ్చలతగా నాల్గు**
**యుగములకును శైవయోగపీఠముల**

నలువురు శ్రీరేవణసిద్ధుఁడనఁగ
చెలువుగానా మరుల్ సిద్ధయ్య యనఁగ
వెలయ నేకోరామవిభుఁడని యనఁగ
బలు, మల్లికార్జునపండితు లనఁగ
గురువులు గలరు తద్గురువులలోన
గురులు ద్వాపరయుగ గురువనఁబరఁగు
గరిమ నేకోరామఘనుని వంశజుఁడు
హరితసగోత్రులు పరమానందయుతులు
ఒనర మల్లంపల్లి నుండుటఁజేసి
పనువడి మల్లము పల్లివాంద్రు
వీరశైవాగమ వేత్తలు గురులు
... ... ... ...
... ... ... ...
గురులింగమాచార్యకులవరేణ్యుండు
పరఁగ మల్లము పల్లిభవ్యవంశాబ్ధి
రాజబింబంబులో రామలింగంబు
రాజశేఖరుమూర్తి రాజితకీర్తి

ఈ గ్రంథరచనకు కవిని తన గురువు ప్రేరేచినట్లుగా తెల్పికొనినాడు. ఆ విషయమిది.

"అతిభక్తి ప్రణుతించి హర్షముప్పొంగ
సతతంబు శ్రీ పాదసలిలప్రసాద
ముల తృప్తిబొందుచు ముదమునున్న
ఫలమున నొక కథ పచరింప శైవ
గణముల కానందకరముగాఁజేసి
మునుకొని మద్గురుమూర్తికర్పింప
నగునని తలపోయునంతలో నతఁడు
వీరశైవాచార విస్తారమార్గ



కలిత సిద్ధాంత శిఖామణి యనఁగ
గలదది తెలిగించ గలనేని తత్త్వ
ఖని దానికన్న నొక్కటి లేదు మాకు
అనుకూల మఖిలవేదాంతసారంబు
గావున ద్విపద ద్రాక్షాపాక సరణి
గావింపు మనుఁడు మీ కరుణచే నాకు
గలిగినశక్తి యుత్కర్షింతు ననుచు
నెలకొని భక్తిచే నిండిన చిత్త
మున మద్గురున కభిముఖుఁడ నై వేడ్క
వినుపింతు నా కథావృత్తాంతమెల్ల.
గానప్రియుండు శంకరు డని ద్విపద
గా ననుభవరస గౌరవంబొంద
శ్రీ రామలింగదేశిక సార్వభౌమ
సార సంసార సంప్లవమునిస్తోమ
... ... ... ...
... ... ... ...
అవధారు, దేవ, సిద్ధాంతశై వంబు
వివరించి తెలుగున విన్నవించెదను".
ఈ కవి గ్రంథ ప్రారంభము నిట్లు చేసినాడు.
" శ్రీ గురుమల్లేశ చిన్మయోల్లాస
యోగిమానస పూర యుక్తవిచార
యకలంకగుణధుర్య యమితసౌందర్య."
... ... ... ... ... ...

ఈ గ్రంథమింకను ముద్రితము కాలేదు. ఇందు ప్రథమాశ్వాసమున పిండతామహత్త్వంబును, గోపిండ విజ్ఞానమహిమయు, సంసారగుణహేయ చరితమును, ఘోరసంసారహరము, దీక్షాప్రకారము, లింగధారణమహత్త్వంబు భూతిధారణము, రుద్రాక్షధారణమను నేడు విషయములు గలవు.

ద్వితీయాశ్వాసమున నాది భక్తస్థలవ్యాఖ్యానమను శైవపంచాక్షరీ మహిమ, భక్తప్రియాచరణము, గురులింగపూజ, జంగమపూజ, ప్రసాద లక్షణము, సాంగదానత్రయచరిత్రము లనెడి యంతరావాప్తస్థలాష్ట కాఖ్యాన మంతయును గలదు.

తృతీయాశ్వాసమున మాహేశ్వర స్థలము, నాంతర స్థలసప్త కాఖ్యాన మగుచు, ప్రసాదస్థలము, ప్రాణలింగస్థలము, నైక్యస్థలము గలవు. చతుర్థాశ్వాసాంతమున నిట్లుగలదు.

**" ఇది చెన్నాప్రగడ నాగేశ్వర రచిత**
**సదమల శ్రీ వీరశైవసిద్ధాంత**
**ఘనతర తంత్రశిఖామణి యందు**
**అనుభవరసపూరమై ప్రకాశించు**
**భక్తాది షట్థ్స లాభ్యంతర సుప్ర**
**శస్తమై గురులింగ జంగమస్థలము**
**లొక్కొక్క చోటన నొక్కొక్కమాటె**
**లెక్క పద్దెనిమిది లింగస్థలముల**
**పాలింప నవి మూఁడు పద్ధతు లగుచు**
**స్థూల సూక్ష్మతరప్రచురతవిభేద**
**ఘటితమై యుండు లెక్క కెనుబదేడు**
**పటుతరస్థలము విపర్యయముగ ని**
**రంతరాఖ్యాన సరసి దళుకొత్తు**
**నంతయు నిది చతుర్థాశ్వాసమయ్యె.**

ఈ కవి 'గణసౌజన్యాఖ్యాన' మను శతకమును గూడ రచించెను.

## V. సిద్ధనాథుఁడు షట్థ్సలదర్పణము

ఇందు శైవసిద్ధాంతము ప్రతిపాదింపఁబడినది. ఇది 23 సీస పద్యములు గల్గి తారావళివలె రచింపఁబడినది.



**ప్రారంభము:-**

**సీ.** **శ్రీరాజయోగప్రసిద్ధి కే మూర్తి వి**
**స్ఫూర్తియంతర్లక్ష్య సుఖతరంబు,**
**నయనాగ్ర చంద్రమండలవీధి కే మూర్తి**
**పరమాణుసదృశరూపప్రదంబు,**
**స్ఫటిక ఖాండస్థదీపమురీతి సత్కీర్తి**
**దేహమందే మూర్తి తేజరిల్లు,**
**జలకుంభసముదాయ జలజమిత్రునిమాడ్కి**
**పెక్కువై యే మూర్తి పిక్కటిల్లు,**

**గీ.** **అట్టి శివలింగమూర్తి నశ్రాంతసరణి**
**ధరణిఁ బ్రార్థించి షట్స్థలదర్పణంబు**
**లీల నొక సీసతారావళియు రచింతు**
**భక్తహృత్పద్మభృంగ శ్రీ(గురు) బ్రహ్మలింగ.**

**అంతము :-**

**సీ.** **ప్రణుత వేదాంతసారములైన శ్రీవీర**
**శైవ శాస్త్రార్థముల్ సంగ్రహించి**
**సిద్ధనాథ సమాఖ్యఁజెంది నే నిరతంబు**
**షట్స్థలదర్పణంబనఁగఁ గలిత**
**నూతన మృదువచోగతి నవవింశతి**
**సీసపద్యము లుల్లసిల్లఁజేసి**
**యాద్యంతములకు పద్యద్వయంబు లొనర్చి**
**క్రమ్మర నాద్యంతగణుతిఁగూర్చి,**

**గీ.** **సీసతారావళిని రచించితి ధరిత్రి**
**గురుతుమీరంగ దీని తక్కువలు దీర్చి**
**ధీరు లీ స్వానుభావంబు తెలియవలయు,**
**భక్తహృత్పద్మభృంగ శ్రీ బ్రహ్మలింగ.**

### సీసమాలిక

ఘన శివాచార జంగమభక్తసార సం
కలితంబు పరమ భక్తస్థలంబు;
పరజనార్పిత భర్మ పరభూమినీకర్మ
రహితంబు మాహేశ్వరస్థలంబు,
లింగార్పిత ద్రవ్యలీలాను భవభవ్య
ధీకృతంబును ప్రసాదస్థలంబు,
పరవశావిర్భూత భావలింగావధా
నత్వంబు శివ శరణస్థలంబు
ఘటికస్ఫుటజ్యోతి కర్పూరభాతి లిం
గాంగ కూటస్థ మైక్యస్థలంబు
మఱియు నాయమ నియమావళుల్ భక్తున
కిష్టార్థసనంబు మాహేశ్వరునకు;
దృఢత ప్రత్యాహార ధీరత్వమాసహ
జప్రసాదికి సుప్రసన్నమహిమ;
పరఁగ ప్రాణయామ పరిశీలనము ప్రాణ
లింగికి ననురాగలీల మెరయ;
ధ్యానధారణ యుతాంతర్లక్ష్యసాధనల్
శరణున కభిమతైశ్వర్యసరణి;
భంగశూన్యపయోధి భంగి లింగసమాధి
గురుతరజ్ఞాన మైక్యునకు ధరణి
శైవానుభూతిషట్ స్థలము లీ రీతి సూ
క్ష్మాష్టాంగయోగవిఖ్యాతి దనరు,

గీ. గాన మానవుఁడీ యారు గతులు దెలిసి
కలసి వర్తించునతఁడె సద్విలసితాంత
రంగ బహిరంగ పూరిత లింగమూర్తి
భక్తహృత్పద్మభృంగ శ్రీ బ్రహ్మలింగ.



## VI. నెప్పెల్లె అప్పనార్యుడు - శైవాగమశిఖామణి

నెప్పెల్లె అప్పనార్యుఁడు బ్రహ్మలింగార్యుని పుత్రుడు. ఈతనిది కౌండిన్యసగోత్రము. ఈతని గురువు ఇవ్వటూరి రామనారాధ్యుఁడు. పై విషయములు గ్రంథాశ్వాసాంతగద్యయందిట్లు నుడువఁబడినవి.

**ఆశ్వాసాంతగద్య:-** ఇది శ్రీమదివ్వటూరి రామనారాధ్య చరణాంబుజ సేవాధురీణ శైవశాస్త్రార్థపారీణ, సరసకవితాచాతుర్య, యనవరతగాంభీర్య వీరమాహేశ్వరాచారనిరత, సకలసద్గుణభరిత, కౌండిన్యసగోత్ర, బ్రహ్మలింగార్య సుపుత్ర, నెప్పెల్లె అప్పనార్యప్రణీతంబైన శైవాగమ శిఖామణియను ప్రబంధము నందు పంచమాశ్వాసము సర్వము సంపూర్ణము.

శైవాగమశిఖామణి యైదాశ్వాసముల పద్య గ్రంథము. ఇందు భస్మ, రుద్రాక్ష, శివలింగ మాహాత్మ్యములును, తద్ధారణమువలనగలుగు ఫలములును, శివపూజాదుల మాహాత్మ్యములును జెప్పఁబడినవి.

గ్రంథప్రారంభము:-

శా. శ్రీశైలేశుని మల్లికార్జునుని దిక్చేలున్ శివానాయకున్
నీశానీ భవరోగ భేషజుని లోకైకాధినాథున్ వియ
త్కేశున్ అవ్యయలోక భక్తవరదున్ గీర్వాణసంసేవితున్
దాశరదప్రదదున్ నిరంతరము సద్భక్తిన్ బ్రశంసించెదన్.

--- --- --- ---

గీ. అనఘు నివటూరివంశ మహాబ్ధిశశిని
వీరనార్యాత్మజుని సారవినుతయశుని
సకలపరవాదిమత్తేభశస్త్రహరిని
రామనారాధ్యు మద్గురుస్వామిఁగొల్తు.

ఈ గురువు పండితారాధ్య చరిత్రమున పేర్కొనఁబడిన ఇవటూరి సోమనాథయ్యగారి పౌత్రవర్గమువాఁడు గాదగును.

**అంతము :-**

మాలిని. **తరుణ శశికలాపా తాపసాదీశ.....పా**
**సురరిపుమదభంగా శుభ్రగంగోత్తమాంగా**
**శరనిధిగణతూణా శార్ఙ్గహస్తప్రమాణా**
**ధరణీధర నివేశా దక్షయాగప్రకాశా.**

ఈ గ్రంథ మముద్రితము. లిఖితప్రతియందు తప్పు లనేకములు గలవు.

## VII. గణపనారాధ్యుఁడు - మనోబోధ

ఈకవి శైవవేదాంతగ్రంథమైన దీనిని మంజరీద్విపదలో రచించెను. ఇదికూడ నముద్రితమే.

**ప్రారంభము :-**

**శ్రీపార్వతీనాథు శ్రీనాథనాథు**
**నలినసంభవనాథు నగవైరినాథు.**
--- --- --- ---

**అంత్యము :-**

**ఉర్విపై ఁగాంతాసహోదరుండనఁగ**
**గణపనారాధ్యులం గరుణించు శివుఁడు**
**ఆచంద్రతారార్కమై యొప్పు భక్తి**
**వెలయు మనోబోధ వేడ్కమైఁజెప్పె.**

## VIII. సోమన - గురుబోధ

ఈ కవి శివకవి వీరభద్రుని పుత్రుడు, రేవణుని శిష్యుఁడు. గురుబోధ నీతఁడు ద్విపదలో రచించెను. ఇందు మూఁడాశ్వాసములుండి శివయోగ రహస్యములు వెల్లడింపఁబడినవి. తన్ను గూర్చి కవి తన గ్రంథమున నిట్లు తెల్పికొనినాడు.



**" గురు రేవణేశ్వరు కూర్మి శిష్యుండ**
**పరగ శివకవి వీరభద్రతనయుండ**
**సువిధానమతి సుతుడ సోముడన్వాడ"**

**ప్రారంభము :-**

**" శ్రీగురుమూర్తి సంచిత పుణ్యమూర్తి**
**భోగమోక్షార్థి సత్పుణ్యజనార్థి**
**నిర్మలహృదయేశ నిత్యప్రకాశ**
... ... ... ...
... ... ... ...
**చిరదయాపర సర్వసిద్ధాంతనికర**
**వరశిష్యప్రేమ రేవణ నా స్వామి**
**నీవె పరశివుఁడవు నీవె పరముఁడవు"**
... ... ... ...

**అంత్యము :-**

**"కలుగు శివలోకంబు, కల్గు సర్వంబు**
**చెలఁగి మంగళమహాశ్రీలొనరించి"**

## IX. పరమానందయతి-శివజ్ఞానమంజరి

ఈ కవి దత్తాత్రేయయోగి శిష్యుఁడని తను తెల్పుకొనిన యీ వాక్యములఁబట్టి తెలియుచున్నది.

**ప్రారంభము :-**

**"గురువరమూర్తి...........వర్తి**
**భోగమోక్షస్ఫూర్తి, భూరిసత్కీర్తి**
**నతిరమ్యగుణహారు నబ్ధిగంభీరు,**
... ... ... ...
... ... ... ...

**నొనర దత్తాత్రేయ యోగిపుంగవుని**
**మనసున వాకున మరి కాయమునను**
**భావించి" .................**

**అని రచించి, మఱియు**

... ... ... ...

**"ఆముదంబునఁ బరమానందతీర్థ**
**యతి నామధేయుండ నింపు దలిర్ప**
**మహితశివజ్ఞానమంజరి యనఁగ**
**మహిలోనఁ బ్రాజ్ఞసమ్మతిగాఁగఁబూని**
**రచియించెదను లోకరక్షణార్థముగ"**

ఇందు శైవయోగవేదాంత విషయోగవేదాంతవిషయములు ప్రతిపాదింపఁబడినవి. ఇది ద్విపదలో రచింపఁబడినది. ఇది కూడ నముద్రిత గ్రంథమే.

**అంతము :-**

**" మఱియు శివజ్ఞానమంజరి యనఁగ**
**కరమొప్ప జగతి విఖ్యాతముగాఁగ**
**పరమయోగీంద్రులు భళియంచుఁబొగడ**
**ధరలోన నాచంద్రతారార్కముగను".**

## X. రేవణసిద్ధనలు - ప్రభుదేవరవాక్యము

అల్లమప్రభువని నామాంతరముగల ప్రభుదేవరయు, సిద్ధ రామయ్యయు శిష్యులకుఁ జేసిన తత్త్వోపదేశమున కిది యాంధ్రవ్యాఖ్యానము. రేవణ సిద్ధనాదులు దీనిఁ దెలుగున వ్యాఖ్యానముచేసిరని యిందు గలదు. ఇందు స్థూలశరీర నిర్మాణ రీతి వివరింపఁబడినది. పిండచక్రనిర్ణయ మనియు దీనికి పేరు కలదు. ఇది నాఁటికాలపు వ్యవహారికభాషలో వచనమున వ్రాయఁబడినది.



**ప్రభుదేవరవాక్యము - ప్రారంభము:-** గురుకరుణా సమ్యక్ జ్ఞానము వల్లను, అఖండలింగప్రసాదం ప్రత్యేకం చేయించుకొని ఆసమ్యక్ జ్ఞానమువల్ల లింగాన్ని యెరిగి, శివమంత్రయుక్త మైధ్యానీచరేధ్యానయోగమని షట్స్థలలింగాన యోగమగ్నుండై, అనుభవిస్తుండేదే దారుణం యోగమనిన్నీ అట్టి లింగాంగంవల్ల ఆ లింగాన్ని యెరిగిన యెరుక ఆణంగి నిలిచిన దేవసమాధి యోగమని ప్రభుదేవర యుపదేశంశాయను, సిద్ధరామయ్యదేవ కరుణించి యెత్తుకొని, షట్స్థల బ్రహ్మోప దేశాన్ని అతి రహస్యంగా 27 పదాలుగా ఉపదేశించినారని ఈ మంత్ర గోప్యం అంతపర్యంతం గోప్యంగా ఉన్నది. మంత్రగోప్యమై యుండిన్నీ, మంత్రానకు అర్థమును, శివశరణుల కందరికిన్నీ జ్ఞానగోప్యమై వుండరాదని నాటి చిత్ప్రభువ నేతామేప్రకాశం చేసినారు.

**అంతము:-** ముఖ్యవాయువుచేతుల యెముకలు రెండు, కదురు యెముకలు రెండు కూడిన దిక్కుననుండి దేహతత్త్వాల నెల్లావక కడకుతెచ్చును. అంతర్యామి వాయువులు ఆత్మపురుషునికి నావాసమైవుండి ప్రాణాలు తెప్పించును. ప్రపంచవాయుపుదేహాన కడగావుండును. వజ్రడ దేహాన్ని అంచుగా వుండును. అంచుశిలలుచెడితే దేహంచెడును. ఇది పిండచక్ర నిర్ణయం.

## XI. శివయోగీంద్రుడు-అన్యవాదకోలాహలము

శివయోగీంద్రు డన్యవాదకోలాహలమను గ్రంథమును సీస శతకముగ 108 పద్యములలో రచించినాడు. ఇది పాల్కురికి సోమనాథున కంకితము చేయఁబడినది. ఈ కవి పాల్కురికి సోమనాథునకుఁ బరోక్షశిష్యుఁడైయుండనోపు. కాని యితని కాలము స్పష్టముగ తెలియరాదు.ఈ కవి సిద్ధరామేశ్వర వంశసంభూతులని బందరు పట్టణమున మల్లంపల్లి భైరవమూర్తిగారిచే భైరవముద్రాక్షరశాలయందు ముద్రితమైన యీ గ్రంథముఖపత్రమందు వ్రాయఁబడినది. ఇందలి ప్రతి పద్యమును.

**" నే నుపన్యసింతు నేకామ్రగురుచిత్త**
**నలినభృంగసోమనాథలింగ"**

యను మకుటముతో వ్రాయఁబడినది. ఇది శతకమని కవియే వ్రాసినాడు.

"వరుసగూర్చి యన్యవాద కోలాహలం
బనెడు సీసశతక మతిశయిల్ల
నే నుపన్యసింతు"
అనియు, మరియు

"ఎనయ నెవ్వరేని యిది వ్రాసి జదివిన
సీసశతక మతివిశేషముగను
యేల గలుగకుండు"

అనియు రచించుటచే నిది శతకమై యొప్పినది.

ఇందు భస్మమహిమ, రుద్రాక్షమహిమ, లింగధారణమహిమ, శివ శ్రేష్ఠత్వము, పూజనీయత్వము, భక్తచర్య, శంకరుడు బ్రాహ్మణుఁడగుట, శివుడు నిత్యుడగుట, మొదలైన యనేకవిషయములు గలవు.

గ్రంథప్రారంభము:-

సీ. శ్రీగురులింగసంచితదయావిస్ఫూర్తి
శరణైకవర్తి విస్తారకీర్తి,
విరహితాశాబంధు పరతత్త్వసంబంధు
హర్షసుధాసింధు నార్తబంధు,
శరణాగతత్రాణు సద్భక్తకల్యాణు
మహితప్రవీణు నిర్మలధురీణు
వేదార్థనిస్సీము విశ్రుతగుణధాము
శోభనోద్దాము భక్తాభిరాము

గీ. నిన్ను నాశ్రయించి నెరి నన్యవాద కో
లాహలంబు వేదలాలితముగ
నే నుపన్యసింతు నేకామ్రగురుచిత్త
నలినభృంగ సోమనాథలింగ.



దీనితర్వాత ననేక వీరశైవభక్తులు స్తుతింపఁబడిరి. ఈ గ్రంథరచనకు కవి యనేక వేదాదిగ్రంథములను పరిశీలించినట్లుగా నీ క్రింది పద్యమునఁ దెల్పికొనినాడు.

సీ. వేదాంతవేద సంవేదితార్థంబుల
నఖిల శాస్త్రేతిహాసార్థములను,
సంచితోపపురాణ సమ్యగర్థంబుల
నాదిపురాణ సారార్థములను,
మోదిత మూలాగమోదితార్థంబుల
నపురుష పౌరుషేయార్థములను,
భ్రాజితామేయ సంపాదితార్థమ్ముల,
నంచిత శివరహస్యార్థములను

ఆ. వరుసఁగూర్చి యన్యవాదకోలాహలం
బనెడు సీసశతక మతిశయిల్ల
నే నుపన్యసింతు"

ఈ గ్రంథము వివిధాన్యమతముల నన్నింటిని ఖండించి యాయా మతస్థుల కందరికిని భయోత్పాదకమైనదని కవి తెల్పుచున్నాడు.

సీ. వేదవాదులకును, భేదవాదులకు దు
ర్మదబౌద్ధులకు గుండెబెదురనంగ,
నాత్మైకవాద మాయావాదులకును లో
కాయతులకు కంటి కసువనంగ,
కాలవాదులకును కర్మవాదులకుసాం
ఖ్యులకు నుద్ధతి గట్టుగుదియనంగ,
శాక్తేయవాదవైష్ణవ వాదులకు సంత
రాళికులకు నెత్తిగాలమనఁగ,

ఆ. జై నవాదులకును సన్యాసులకు మహో
గ్రముగ ముక్కుమీఁద కత్తియనఁగ
నీ కృతి రచియింతు నే"

## XII. భద్రారాధ్యుఁడు: అఖండ బ్రహ్మానందవీరశైవరహస్యపదవి

ఇది వీరశైవ వేదాంతగ్రంథము. ప్రారంభమున దీనికి 'ముక్తికాంతా వివాహ' మని పేరున్నది కాని, గ్రంథాంతమున మొదటిపేరు మాత్రమే కలదు. ఇది అసమగ్రము. ఎనిమిదాశ్వాసములు మాత్రము గలవు.

ప్రారంభము:-

**సీ॥ సకలేంద్రియాపార సందడుల్ మదిఁగరఁగి**
**అతులశివభావ నిరంకుశమున,**
**నాదబిందుకళత్ర నాడి నొక్కటఁగూర్చి**
**సూక్ష్మరంధ్రంబున సుస్థిరముగ**
**స్వానుభవ ఘనయోగ సారవిస్తారముల్**
**తెలియ దేదీప్యమౌ దివ్యరుచుల**
**ఆత్మగుహా మందిరాకాశ భూతివికాస**
**చక్షురగ్రంబులఁ జెలఁగి పర్వ**

**గీ. చేరి తత్తుద సామ్రాజ్య చిత్తువనఁగ**
**నాదపరిపూర్ణ ని ష నాదరతుల**
**కేవలోత్కృష్ట దర్పణ ఖేచరమున**
**సుప్తిసవికల్ప నిద్రయు శుభతరమున॥**

**అంత్యము :-**

వ॥ ఈ విధముగా గౌరీవల్లభుండగు రుద్రుండు శిఖివాహనునకుం దెల్పిన విధంబున శౌనకాది మహాఋషులకున్ నారదుండు విస్తరించిన కారణ గురుండు శిష్యునకుం దత్త్వబోధ విస్తరించెనంత,

**ఉ. వీరమహాప్రతాప శరభేశ్వర రుద్రగణప్రతీప శృం**
**గార రసజ్ఞరూప బహు బాహు సమగ్రత దీప్తచాప దు**
**ర్ఘోరకఠోర పాపగిరి క్రూరతరంగ వీక్షకోప వి**
**స్తార దయానులేప నతనాయక సర్వజగద్ధరాధిపా ॥**

... ... ...

... ... ...



**అంత్యగద్య :-**

"ఇది సకలమత సద్భక్త మనోరంజిత విస్తారపద బ్రహ్మ రాజ్యా నంద రచన **నంజయారాధ్య శిష్యప్రశిష్య,**భద్రారాధ్య విరచితంబగు అఖండ**బ్రహ్మా నంద వీరశైవ రహస్యపదవీ** మహాప్రబంధంబునందు పార్వతీపతి సేనానికిం జెప్పిన రీతి శౌనకాది మునులకు నారదు డెఱిగించి నట్లు గురుండు శిష్యునకుం దెల్పె. తత్త్వమస్యాది మహాద్వైత బ్రహ్మసాక్షాత్పరిపూర్ణ యోగంబునన్ ఆగమ భేదంబును, అష్టాంగయోగస్వభావంబును,...రతిరహస్య గర్భాధాన వినోదంబును, అత్యద్భుతాకాశ మహత్త్వంబగు కైవల్య నిర్వికల్పప్రకాశలింగ, సమరరసకూటస్థ నిరవయంబున నొప్పి, అఖండ బ్రహ్మానంద వీరశైవ రహస్య పదవి యగు మహా ప్రబంధంబునన్ శాశ్వత శుభసౌభాగ్య విచిత్రమయ సాంఖ్య బ్రహ్మయోగ శివపాదార్పణంబుగా అష్టమాశ్వాసము.

# పంచమప్రకరణము

## పురాణములు

### I. కొచ్చెర్లకోట రామకవి - ప్రభులింగలీల -3

కన్నడమున చామర్సు రచించిన ప్రభులింగలీలలను పిడుపర్తి సోమన ద్విపద రూపమునను, పిడుపర్తి బసవప్ప పద్యరూపమున నాంధ్రీకరించిరని వెనుక తెలుపఁబడినది. పిడుపర్తి సోమనాథుఁడు ద్విపదగా రచించిన ప్రభులింగ లీల ననుసరించి కొచ్చెర్లకోట రామకవి పద్యకావ్యముగా రచించినాడు. ఈ విషయమునే కవి కావ్యప్రారంభమునఁ జెప్పికొనినాఁడు.

**సీ.** **చామర్సురూపున సరసంబు మీరంగఁ**
**గర్ణాటవచన సంగతులు మెరయ**
**ప్రభులింగలీల నిబ్బరముగా రచియించె**
**నది పిడుపర్తి సోమన్నగారు.**

**గీ.** **తేట మీరునట్టి ద్విపదకావ్యము గాఁగ**
**తెనుగుబాసతోడ వినుతికెక్కఁ**
**జేసె నట్టిదాని భాసురముగ పద్య**
**కావ్యభణితిఁజేయు గౌరవమున.**

ఈ గ్రంథము గోదావరిమండలమందలి పాలకొలను (క్షీరారామము పంచారామములలోనొకటి. ఇది కవినివాస గ్రామము) గ్రామమున వెలసిన **శ్రీరామేశ్వరస్వామికి** కృతిగా సమర్పితము. ఈ విషయమును కవి యిట్లు చెప్పినాడు.

**గీ.** **కోర్కి మీరంగ శ్రీపాలకొలనిరాయ-**
**శంకరునిపేర భక్తితో నంకితంబు**



**సేయఁగలిగిన నిఁక నేమి చెప్పవచ్చు**
**ననుగుణంబుగ వర్తిల్లు నవనియందు.**

కొచ్చెర్లకోట రామకవి కాశ్యపగోత్రజుండు. అతని రచనను బట్టి కవి వంశవృక్ష మిట్లున్నది.

**గీ.** **అట్టి కాశ్యపగోత్రజుండగుచు భూమి**
**నలరు కొచ్చెర్లకోట మల్లన్న మంత్రి.**
**ఆ మల్లన వంశమున**

**అంబరాజు**
|
**ప్రెగ్గడనార్యుడు (భార్య -లింగమాంబ)**
|
**అక్కన (భార్య - వీరమాంబ)**
|
**రామరాజు** **లింగన (భార్య - నరసమ్మ)**
|
**5-కూతులు** **రామరాజు** **చినరామకవి గ్రంథకర్త**

ఈ గ్రంథమున నాశ్వాసాంత గద్య మిట్లున్నది.

"ఇది శ్రీరఘుపతి గురుకటాక్షదర్శిత రామేశ్వరపాదారవింద వందన కొచ్చెర్లకోట లింగనామాత్యనందన, విద్వజ్జన విధేయ రామయనామ ధేయ ప్రణీతంబైన ప్రభులింగలీల యను మహాప్రబంధంబునందు సర్వంబును పంచ మాశ్వాసము."

పై గద్యనుపట్టియేకాక యీతఁడు కావ్యారంభమున

" శ్రీ **విష్ణువజ్జలకు** సుధాబ్ధిచంద్రు **రఘుపతి** వరదేశికేంద్రుదలఁతు" నని వ్రాసికొనుటచే నితని గురువు "రఘుపతి"యని తెలియుచున్నది. ఈతడు

కావ్యారంభమును సంస్కృత శ్లోకముతోఁజేసెను. తర్వాత నితఁడు త్రిమూర్తులను స్తుతించి పిమ్మట గురువందన మాచరించినాడు. తదుపరి శైవభక్తులను స్తుతించినాడు. పిమ్మట నాంధ్రకవులను నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథులను, పింగళి సూరన, పోతన, అల్లసానిపెద్దన, మూర్తికవి, రామ భద్రులను దలంచి, వర్తమాన భావికవులకుఁ బ్రణుతిగావించెను. అందుచే నీ కవి క్రీ.శ. 16 వ శతాబ్దము తర్వాతవాడని యూహింపఁదగును. ఈగ్రంథ మింకను ముద్రింపఁ బడలేదు.

## II. నడకుదుటి రామనకవి -ప్రభులింగలీల 4

నడకుదుటి రామనకవి యారువేల నియోగి. ఆపస్తంబ సూత్రుడు. కౌశిక గోత్రుడు. బుచ్చనామాత్యుని పుత్రుడు. కవి క్రీ.శ. 1821 సం॥ న జన్మించి 1887 సం॥ మరణించెను. ఇతఁడు గోదావరి మండలమున రామచంద్రపురం తాలూకాలోని శహపురమునకు కరణముగనుండెను. తర్వాత పెద్దాపుర ప్రాంతమున గల తిరుపతికి 1873 సం॥ న భార్యవైపు ఆస్తిని చూచుకొనుటకై పోయి యందే కాపురముండెను. కొచ్చెర్లకోట రామనకవి వలె నితడును పిడుపర్తి సోమన రచించిన ద్విపద ప్రభులింగలీల ననుసరించి పద్యకావ్యమును రచించెను. ఇది 1885 సం॥ న వ్రాయఁబడెను. ఈతని కవిత్వమున నక్కడక్కడ దోషములున్నను శైలి రసవంతమైనది.

## III. మహాదేవుడు-బసవపురాణము - 3

ఈ కవి మహాదేవారాధ్యుని పౌత్రుడు. శంభులింగారాధ్యుని పుత్రుడు. ఈతని బసవపురాణము పద్యాత్మకమైనది. ప్రస్తుత మసంపూర్ణముగా నున్నది. ప్రథమాశ్వాసమున కొంత భాగమునుండి సప్తమాశ్వాసమువరకు నున్నది. మధ్య మధ్య కొన్ని పత్రములు గూడ లేవు. ఈ గ్రంథము విజయవాటి (బెజవాడ) యందలి మల్లికార్జునస్వామికి కృతిగా నీయఁబడినది. ఇందలి యాశ్వాసాంత గద్యను బట్టి శ్రీపతిపండితారాధ్య సింహాసనారూఢుండీకవియే యని నిర్ణయింప రాకున్నది. కృత్యాది పద్యములేవియు లేకపోవుటచే విశేషించి యేమియు తెలియరాదయ్యెను.



**అంత్యగద్య:-** ఇది శ్రీమద్విజయవాటికా మల్లేశ్వర కరుణా ప్రసిద్ధలబ్ధ కవితాధురీణ **శ్రీపతి పండితారాధ్య సింహాసనారూఢ,** జగన్నిరూఢ సంప్రదాయార్ణ వరాకాసుధాకర, మహాదేవారాధ్యపౌత్ర, శంభులింగారాధ్యపుత్ర, శివభక్తజన విధేయ, మహాదేవనామధేయ సత్కవిప్రణీతంబగు బసవపురాణంబునందు బసవేశ్వరుండు శివనాగుమయ్యను సేవించుటఁగని విప్రులుగూడి యంత్యజుని గలసెనని బిజ్జలునికిఁజెప్పుటయు, .....అనంతరంబు మర్త్యంబునఁ గీర్త్యన్వితుం డగుచునున్న భక్తగణంబులందఱు బసవేశ్వరుని మహత్త్వంబు చెప్పికొనుచుఁ బరమ శివానందభరితులైయుండుటయు నన్నది సర్వంబును సప్తమాశ్వాసము.

**ప్రారంభము:** వ-- భాగుండవగుచు, నగణ్యప్రామాణ్యలావణ్యతారుణ్య కారుణ్యధురీణుండవై కోటిసూర్యప్రకాశమానుండవై........మిమ్ముఁదలంచి ప్రణుతించి ప్రార్థించి, పూజించి నమస్కరించెద.

గీ. **అనుచు నిబ్భంగి వినుతించునట్టి విబుధ**
**సంయమీంద్రుని కరుణాలసత్కటాక్ష**
**దృష్టిఁజూచుచు హరుఁడుమాదేవితోడ**
**నిపుడు గనుసన్న చేసిన నా భవాని.**

శా. **నానాలోకవిహారనారదమునీంద్రా, నీవు సద్భక్తి సం**
**ధానాంతఃకరణంబుతో నిచటికేధాత్రీ వలాశ్చర్యముల్**
**అనందంబుగఁ జూచివచ్చితిపుడా యా వార్త లుద్యన్మతిన్**
**జా (నొందన్)...వినుతింపుమన్నఁదదనుజ్ఞాయోగసంపన్నుఁడై.**

**అంత్యము :-**

క. **అనువుగ బసవపురాణం**
**బెనసిన మతి నెవ్వఁడైన నిలఁదమ యింట.**
**బనిబూని యునిచెనేనియు**
**ఘనముగ నిహముం బరంబు గలుగు సులభతన్.**

క. **శ్రీమజ్జయవాటీ పుర**
**ధామగ్రామాధిరాజ తనయావిలస**
**ద్వామాంగ మల్లికార్జున**
**నామప్రఖ్యాతకీర్తి నానామూర్తీ.**

## IV. తుమ్మలపల్లి నాగభూషణకవి- బసవవిజయము - 4

తుమ్మలపల్లి నాగభూషణకవి త్రిపురాంతకుని పుత్రుడు. హరితస గోత్రుఁడు. ఇవటూరి భోగయ్య యను నామాంతరము గల మల్లన శిష్యుడీ కవి. ఈ కవి కృతమగు బసవవిజయము పాల్కురికి సోమనాథుని బసవపురాణము ననుసరించి మూఁడాశ్వాసములలో పద్యప్రబంధముగా రచింపఁబడినది. ఈ గ్రంథకథార్థము ప్రతాపరుద్రునకు తన్మంత్రియగు శివదేవయ్య చెప్పినట్లుగా నిందున్నది. ప్రతాపరుద్రుడు సోమనాథుని తన యాస్థానమునకుఁ బిలిపించి సత్కరించినట్లున్నది. ఇది అముద్రితగ్రంథము. ఈవ్రాతప్రతియందనేక దోషములు గలవు. గ్రంథాంతమున నిట్లుగలదు. "అని శివదేవుండు నా ప్రతాపరుద్రునకు బసవన్న మాహాత్మ్యము వినిపించిన నీతడును విని సంతసిల్లె. శివ దేవునకు వివిధాంబరంబులును వివిధ వస్తువులును ప్రతాపరుద్రుఁడొసంగి యతని సంతుష్టుఁజేసి సుఖంబుండిరి"

**గ్రంథ ప్రారంభము :-**

ఉ. **శ్రీగురుమూర్తి పాదములు చిత్తములోనఁదలంచి, భక్తితో**
**నాగమవేదతత్త్వవిదు నగ్రవరేణ్యుడు, నివ్వటూరి శ్రీ**
**భోగ విశేషధీరగుణపూర్ణుఁడు, నాశ్రితభక్తవత్సలుం**
**డీగురు మల్లునిన్ భజన యేను ససంభ్రమలీలఁజేయుచున్.**

తర్వాత శివుని, జంగములను, గణేశ్వరుని స్తుతించి, పిమ్మట బ్రహ్మ విష్ణులను గూడ స్తుతించెను, తదుపరి,

గీ. **భారతీదేవి శారదఁబ్రస్తుతించి**
**యంబ జగదంబయగు తల్లి ననుసరించి**
**క్షీరసాగరకన్యను చెలువుమీఱఁ**
**దలఁచి బసవన్న విజయంబు తగ రచింతు.**

సీ. **బిజ్జల విరసము ప్రీతి దలిర్పంగ**
**వృషభేంద్రుమహిమలు విశదముగను,**
**నెన్న నెవ్వరికిని నిలలోన వశమగుఁ**
**బన్నుగా బ్రహ్మ యేర్పరుపలేఁడు,**



**బసవని మహిమంబు పాల్కురిసోమన్న**
**కర్ణామృతంబుగాఁ గలియుగమున**
**వర్ణించి చెప్పెను వరుసతో...**
**భక్తులు నానందపదవినొంద,**

గీ. **నాంధ్రదేశంబునందున నమరియున్న**
**ప్రాభవంబైన గుడివాడ పట్టణమున**
**ప్రబలమైనట్టి తుమ్మలపల్లివంశ**
**సంభవుండను నాగభూషణుఁడనంగ.**

గీ. **బసవవిజయంబు రచియింతుఁ బద్యకావ్య**
**ముగను కవివరుల్మెచ్చియు మోదమందఁ**
**పిన్న బెద్దలు వినియును బ్రీతిసేయ**
**భువిని ప్రఖ్యాతమైనట్లు పొందుపఱచి.**

పై విధమున కవి తన యింటిపేరు 'తుమ్మలపల్లి' యని వ్రాసికొనంగ, కందుకూరి వీరేశలింగముగారు తన కవుల చరిత్ర తృతీయ భాగమున 'మల్లంపల్లి' యని రచించుటకుఁ గారణము తెలియదు. ఈ కవి 200 సం. క్రిందట యనగా క్రీ.శ.1750 ప్రాంతమున నున్నట్లు తెలియుచున్నది. ఈతని కవిత్వ ముత్తమ మైనదికాక వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములతోఁ గూడి యున్నది.

**అంత్యగద్య:-** ఇది శ్రీమన్మహామల్లేశ్వర వరప్రసాద లబ్ధదివ్యసౌరభ షట్స్థల జ్ఞానవర్య, వేదసదాచార, జంగమలింగై క్యాపస్తంబ సూత్ర, హరితస గోత్రోద్భవ, తుమ్మలపల్లి వంశాబ్ధి సుధాకర, త్రిపురాంతకవరపుత్ర నాగభూషణ నామధేయప్రణీతంబైన బసవవిజయమను మహాపురాణము.

**కథాసారము- ప్రథమాశ్వాసము:-** ఓరుగంటి పురంబునకు పాల్కురికి సోమన్నగారు వచ్చుటయును, నతని బ్రాహ్మణుల వివాదంబును, రజకుండు

వారితో సంభాషించుటయును, సోమేశ్వరుని విజయంబును,సిలార మహాముని ప్రభావంబును, నందికేశ్వరుని జన్మంబును, అనిమిషుని చరిత్రంబును, బసవన జన్మంబును, తామ్రపట్టు విఖ్యాతా వ్యాఖ్యానంబును, బిజ్జలునకు బసవన తేట పరుచుటయును, శివుని నేత్రంబున మన్మథుండు హతం బౌటయును, కుమార స్వామి జన్మంబును, చెన్నబసవన్న పుట్టుటయును.

**ద్వితీయాశ్వాసము:-** చిత్తరుబొమ్మలను కథయు, ప్రహరి సోమన్న మాహాత్మ్యంబును, నీళ్ళకడవలు వరదప్పి పారిన చరిత్రంబును, మిండజంగమ కథయును, ముక్కవ్యాధుల కథయును.

**తృతీయాశ్వాసము:-** బిజ్జలరాజు చరిత్రమును, నొక్క జంగమంబుచేత బసవన్న మాహాత్మ్యంబు చోళరాజు విని కల్యాణంబునకు బసవని గొలువ వచ్చుటయు, చోళనరేంద్రుండు కైలాసంబునకు బోవుటయు, బసవన్న యుంగరంబు దీసి మ్రొక్కుటయు, శ్రీశైల మాహాత్మ్యంబును వర్ణించుటయు, చామంతిరాజు కథయును, దరునమారయ్య నిమిత్తంబు శివుడు సెట్టి వేషము దాల్చి భూలోకమునకు వచ్చి, మారయ్యను కైలాసమునకుఁగొని పోవుటయు, చోరశంకరుండు సత్యశంకరుండై గురునియం దైక్యంబగుటయు నున్నది.

## V. నల్లనగండ్ల నాగనారాధ్యుడు:- బసవవిజయము-5

ఇందు బసవన మాహాత్మ్యము ద్విపదయందు వర్ణింపఁబడినది. ఈ కథగూడ వెనుకటి బసవవిజయమువలె ప్రతాపరుద్ర మహారాజునకు నాతని మంత్రియగు శివదేవయ్య చెప్పినట్లు గ్రంథకర్త చెప్పినాఁడు. తప్పులెక్కువగా నుండుటచే కవినిగూర్చి విశేషములెవ్వియు తెలియరాకున్నవి. ఇదిగూడ మూఁడా శ్వాసముల గ్రంథమే. తుమ్మలపల్లి నాగభూషణ, నల్లనగండ్ల నాగనా రాధ్య కవులందు, నొక రింకొకరికావ్యమును జూచి ప్రారంభించియుందురు. కాని వీరిలో నెవరు ముందు రచించిరో మాత్రము తెలియరాదు. ఈ రెండు గ్రంథములు గూడ నముద్రితములే.



గ్రంథ ప్రారంభము :-

ద్వి. **శ్రీగురుమూర్తి నాశ్రితపుణ్యమూర్తి**
**నాగకుండలకర్ణు నాగేంద్రకర్ణు**
**నాగాసురహరణు నాగేంద్రభరణు**
**వాగీశనుతచరణు వనజాతకిరణు**
**షణ్ముఖప్రియదేవు శ్రీశైలదేవు**
**మృణ్మయరథనిత్యు మునిజనభృత్యు.**
... ... ... ...
**మంగళమూర్తి తా మల్లికార్జునుని**
**పాదపద్మములకుఁ బ్రణమిల్లి నిలిచి**
**యాదట మఱి పండితారాధ్యుఁ దలఁచి,**
**పాల్కురిసోమేశు ప్రస్తుతిఁజేసి**
**మేల్కొన్న రీతి యేనర్మిలి పొగిడి**
**బసవవిజయమునేఁ బ్రఖ్యాతిగాను,**
**నొసపరి కథలతో నుర్వి రచింతు**
**బిజ్జల నిరసనము ప్రీతిదలిర్ప**
**నిజ్జగంబున వృషభేంద్రుని మహిమ**
**నెన్న నెవ్వరివశం బే నేర్చుభంగి**
**పన్నుగా నెన్నెద బసవవిజయంబు."**

ఈ కవిగూడ సర్వవిధముల నాగభూషణకవి తన బసవవిజయ మందు తెల్పినరీతిగనె వ్రాసెను.

గ్రంథాంత్యము :-

**" అనుచు నా శివదేవుఁడా ప్రతాపునకు**
**వినిపించె బసవయ్య విఖ్యాతమహిమ,**
**విని సంతసిల్లి యా వీర ప్రతాప**
**జనవరేణ్యుఁడు తన సయ్యనమంత్రి**
**శివదేవునకు మహా శ్రీలుల్లసిల్ల**

**వివిధాంబరంబులు, వివిధవస్తువులు**
**రూపింపఁగా నిచ్చె రుద్రనరేంద్రు**
**చే పట్టియుండె సు స్థిరకాలమెల్ల**
**అదియును శ్రీ మల్లికార్జును నంఘ్రి**
**సదమల దివ్యసౌరభ చంచరీక**
**సూర్య సూరంపల్లి నమశ్శివాయకును,**
**పార్య మనఃపద్మ తత్పదాచార్య?**
**భక్త జంగమలింగ ప్రణుతాబ్ధిసార**
**సిక్తార్కయాన్వయశీలవ్రతాది**
**నమిత నల్లనగండ్ల నాగనారాధ్య,**
**భ్రమరాంబ వరలబ్ధ ప్రణుతప్రభావ**
**బిరుదు బసవని మహిమ బిజ్జలనిరస**
**విరచిత ప్రబంధ వేదానుసార**
**విరచితంబగు తృతీయాశ్వాసమయ్యె."**

ఈ విధముగ బసవవిజయ ద్వయగ్రంథకర్త లిరువురు నొకే విధముగ గ్రంథారం భాంత్యములందు తమ కావ్యరచనా సందర్భములఁ గూర్చి తెల్పుకొనిరి. కాన వీరిలో నొకరు మఱియొకరికి మార్గదర్శకులై యుందురు.

## VI. బచ్చు సిద్ధకవి (మఱి) బసవపురాణము (లేక) బసవచరిత్ర

బచ్చు సిద్ధకవి చరలింగ **మర్దల పర్వతార్యుని** శిష్యుడు. సిరిపురి వీరసంగయ్య యీతనికి దీక్షాగురుఁడు. ఈతడు తన బసవపురాణమును సంగయ్యకుఁ గృతియిచ్చినాఁడు. ఈ కావ్య మైదాశ్వాసముల ద్విపదగ్రంథము. ఇందు బసవనయు నితర భక్తులయు చరిత్రములు వర్ణింపఁబడినవి. ఈ గ్రంథాంత్యగద్య యిట్లున్నది.

**అంత్యగద్య :-**

ద్వి. **" ఇది సర్వ వీరమాహేశ్వర నికర**
**సదమల ఘనపాద జలజసౌరభ్య**



**సానుభవోత్తమ షట్పదీకరణ**
**లీనాత్మ నిత్యశివానందయుతుఁడు**
**ప్రకటిత గురుకరోద్భవ బచ్చు సిద్ధ**
**సుకవి ప్రణీతమై శోభితంబగుచు,**
**చరలింగ మరదల సత్పర్వతార్య**
**వరకృపోన్నతి కవిత్వప్రౌఢిచేర్చి**
**వరకీర్తి మఱి బసవపురాణమునను**
**హరుభక్తుకథ పంచమాశ్వాసమయ్యె.**

ఈ గ్రంథారంభము నిట్లు చేసినాఁడు కవి

**"శ్రీగురుమూర్తి నంచిత దయాస్ఫూర్తి,**
**యాగమార్థంబుల నలరు సత్కీర్తి,**
**యాదికి నాదియై యఖిలలోకముల**
**కాదరంబునఁ గర్తయైన సన్మూర్తి**
... ... ... ...
**కొలఁది మీరిన పాలకురికి సోమేశు**
**సలలిత శ్రీ పాదజలజముల్ దలఁచి**
... ... ... ... ...
**అను వొందమఱి బసవయ్యసుచరిత**
**తెనుఁగున ద్విపదగాఁ దెల్లమిఁబఱతు**
... ... ... ... ...
... ... ... ... ...
**ఇల గురుమూర్తియై విలసిల్లునట్టి**
**విరివిగా సిరిపురి వీరసింగయ్య**
**కరగర్భజనితు శ్రీకరభక్తియుతుఁడు**
... ... ... ... ...
**బచ్చు సిద్ధుండనఁ బ్రబలినవాడ**
**నా నేర్చుకొలఁది విన్నపమాచరింతు,**
**బూనిక వినరయా బుధవరులార**

... ... ... ... ...
ఘనశీలుఁ డితఁడని గారవింపంగ
జను శీలవంతుల సంగాఖ్యుఁడయ్యె
అలరంగనట్టి సంగాఖ్యునిఁజూచి
తలకొని సంప్రీతి దనరంగ నేను
నిట్టి శీలవ్రతి యీ మహాకృతికి
నెట్టన శ్రోతగా నెఱి నొప్పుననుచు
... ... ... ... ...
వరకీర్తిమఱి బసవపురాణమునకు
నరయంగ శ్రోతగానర్హుఁడ వీవ
యని బహువిధముల నలరంగనేను
వినయోక్తిశ్రోతఁగావించి సద్భక్తి
తప్పకుండగ నీకథాసూత్రమంత
నొప్పుగా వినిపింప నొగిబూనిమహిని
ధరచరలింగ మర్దలపర్వతార్య
చరకృపాకార్య సుస్థిరవరంబునను
.... .... ....
వినయంబు దనరంగ వినుము సంగాఖ్య"

గ్రంథాంతము :-

"మఱి బసవేశ శ్రీమన్మహామూర్తి
సరవితో నీయొక్క చారిత్రమన్న
హరిముఖ్యసురులకు నలవియె మఱియు
శిరములు వేగల శేషునకైనఁ
దరమె వర్ణింపఁగా ధరలోన ననుచు
నారూఢ చిక్కవీరాచార్యఘనుఁడు
శ్రీ రమ్యమతితోడఁ జెప్పినయట్ల
నాటకాలంకార చారుశబ్దార్థ
... .... ... ... ...
... ... ... ... ...
ఇల పాలకురుకి సోమేశుండు మున్ను
తొలఁగక ప్రాసయతుల్ ద్విపదందు
లలి రచించుట యది లక్ష్యంబుగాను



నల ఘురేఫఱకారములు శివకావ్య
ములయందుఁ జెల్లుఁ దప్పులు గావుగాన
నా పాల్కురికి సోము ననుమతి నేను
దీపిత ప్రాసయతిచ్ఛంద సరణి
నా మహాగురుదేవు నానతి యట్ల
శ్రీ మెరయంగ రచించితి నిపుడు
శోభిల్లు తత్కథాసూత్రమంతయును"

ఈ విధముగ కవి పాల్కురికి సోమనను గురువుగా భావించి, యాతనిని గ్రంథారంభమున స్తుతించి, యాతఁడొనర్చిన ఛందోవ్యాకరణ భాషా విశేషములను సమర్థించినాఁడు. ప్రథమాశ్వాసమిట్లు ప్రారంభింపఁబడినది.

ద్వి. కారణమై యొప్పె కళ్యాణమనఁగ
నట్టి పురంబున నలరారుచుండు
నెట్టన సద్భక్తినియమవర్తనుఁడు
అట్టి మహాభక్తుఁడతఁడెవ్వరనిన
పట్టుగాఁ జెప్పెదఁబాయక వినుఁడు
ప్రభువు విరక్తియు, బసవయ్య భక్తి
ఉభయంబునేకమై యొనర యేతెంచె
వరదివ్యమూర్తియై వసుధలోపలను
హరభక్తి మఱి బసవాఖ్యుఁడై తనరె

ఈ గ్రంథము గూడ నింకను ముద్రితము గాలేదు. ప్రఖ్యాత బసవేశ్వరుడు గాక మఱియొక బసవేశ్వరుని చరిత్రమిందు వర్ణింపఁబడుట చేతనని కొందరు, బసవచరిత్రమున వర్ణింపఁబడని యితర కథలిందుండుటచే నీ కావ్యమునకు మఱి బసవపురాణమను పేరిడెనని మఱికొందరును తలంచు చున్నారు. కన్నడవాఙ్మయములో 'మల (లె)బసవపురాణ'మను గ్రంథమును 'మలెయ బసవరాజ' అనే వ్యక్తియు నుండుటచే నతడే తెలుగున 'మఱి బసవడు'గా వ్యవహరింపఁబడి మఱి బసవేశ శ్రీమన్మహామూర్తి యని కవిచే నీ గ్రంథ మందొకచోట సంబోధింపఁబడినాఁడు.

## VII. అత్తలూరి పాపకవి - చెన్నబసవపురాణము

అత్తలూరి పాపకవి సుందరాంబికా శ్రీగిరి మంత్రుల కుమారుడు. ఇవటూరి బసవేశ్వరుని శిష్యుడితడు. ఇతనిది కౌశికగోత్రము. ఈ కవి క్రీ.శ. 1750 ప్రాంతమువాడు. కవి తన్ను గూర్చి గ్రంథమున నిట్లు చెప్పికొనెను.

చ. **అనవుడు మందహాసవదనాంబుజుఁ డై యపు డత్తలూరి పా**
**వనకుల జక్కిరాజునకు పౌత్రుఁడు, శ్రీగిరిమంత్రిమౌళికిన్**
**ఘనమతి సుందరాంబికకు నందనుఁ డబ్బసవేశుఁడే యనం**
**జను బసవేశు మంత్రికనుజన్ముని పాపన సత్కవీంద్రునిన్.**

పాపకవి చెన్న బసవపురాణమును శ్రీశైలఖండమును రచించెను. శ్రీశైల ఖండమునకు శ్రీశైలమాహాత్మ్యమను నామాంతరము గూడ గలదు. చెన్నబసవ పురాణము కందుకూరి యమృతలింగామాత్యునకంకిత మీయంబడెను, శ్రీశైల మాహాత్మ్యము కందుకూరి మూర్తిరాజున కంకిత మీయఁబడెను. ఈ కృతిపతి కందుకూరి వీరేశలింగమున కన్న. తమ్మునిప్రేరణచే నీ కృతి సమర్పణ మన్నకుఁ గలిగినది, కృతిపతి వంశమునఁగొందరు పూర్వులు ఢిల్లీ, గోలుకొండ, నవాబులచే బిరుదములు, బహుమానములు పొందినవారట. ఈ విషయమును కవి యీ క్రింది పద్యమునఁ దెలిపెను.

శా. **ఢిల్లీనాయకుచేత దంతిహయశాటీ ముఖ్యవస్తు వ్రజం**
**బెల్లంగైకొని, కాశికాప్రముఖగౌరీశానునుల్గాంచి ని**
**త్యోల్లాసంబున శంకరార్చనలు దివ్యల్మెచ్చఁ గావించి సం**
**పుల్లాంభోరుహలోచనామదనుఁడై పూషప్రభన్ వర్ధిలెన్.**

మఱికొందఱు శంభపురి, క్రొత్తపల్లి, వేలేటిపాడు, సింగవరము, అయితముపూడి, మినుమంచిలిపాడు మొదలగు నగ్రహారముల దానము చేసినారని యీక్రింది పద్యమున కవి తెల్పినాడు.

క. **ఘనముగ నైతముపూఁడియు,**
**మినుమించిలిపాడు, సిరులు మించఁగను నొసం**
**గెను గురు చరవరులకు బస**
**వనితో నెనయైన మంత్రి వసుధం గలఁడే.**

ఆ వంశమున మఱికొందఱు కువలయాశ్వచరిత్ర, పంచాక్షరీ మాహాత్మ్యము, సత్యవతీపరిణయము, మున్నగు కావ్యములఁ గృతిగొన్నవారట.



వీరిలో భూషణరాయడు హేలాపురము (ఏలూరు), మల్లనమంత్రి యేలూరు, రాజమహేంద్రవరము, కొండపల్లి యను మూఁడు దుర్గములను పాలించిరట.

**చెన్నబసవపురాణము:-** బసవేశ్వరుని సోదరియైన నాగాంబకు చెన్నబసవన్న కుమారస్వామి యంశమునఁ బుట్టినాఁడట. రేణుకుడగస్త్యునకు చెన్నబసవన చరిత్రమును చెప్పినట్లు గ్రంథమున నున్నది. ఈ చెన్నబసవేశ్వరుని చరిత్రము కర్ణాటరచనమున తెలుగుదానికంటెఁగొంత భిన్నముగ నున్నది. ఇది యైదాశ్వాసముల పద్యప్రబంధము. ఇందలి యంత్యగద్య యిట్లున్నది.

**అంత్యగద్య:-** "ఇది శ్రీమచ్చెన్నమల్లికార్జున కరుణాకటాక్ష లబ్ధకవితా మాధురీ ధురీణ కౌశికగోత్రపవిత్ర, సుకవిజనస్తుత్య, పాపయామాత్య ప్రణీతంబైన చెన్నబసవ పురాణంబను మహాకావ్యంబు నందు సర్వంబును పంచమా శ్వాసము."

చెన్నబసవ పురాణములో నక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయో గములు గానఁబడుచున్నను, కవి మిక్కిలి ప్రౌఢుడై హృద్యముగా పద్య రచనము చేసియున్నాడు. అతని కవిత్వశైలి కీ క్రింది పద్యము లుదాహృతములు.

గీ. **అంత గిరిధన్వి పరిచారికాళి సత్వ**
**రముగ నుంచిన సింహాసనమునఁ గూరు**
**చుండి, నుతు నంకతలమున నుంచికొని శి**
**రంబు మూర్కొని బొజ్జమొగంబు దువ్వి.**

మ. **తనయా, యాటలుమాని వేఱెపనిమీఁదన్నిల్పు చందంబు దో**
**చినదే, కార్యము దెల్పుమా యనిన నే సృష్టిక్రియారూఢ వ**
**ర్తనచే నుంటినటన్న పద్మజుని గాదా మున్ను తత్సృష్టి చే**
**య నియోగించినవార మిప్పుడిటుసేయం గారణంబేమొకో!**

శా. **ఏరా, చిన్న కుమార నీరజభవుండేనేరముల్ జేసెరా**
**సారోదారుఁడు వజ్రముఖ్యసుమన స్సంసేవ్యుఁడౌ నాతనిం**
**ఘోరంబౌ చెఱనుంచ నీకుఁ దగునా కోపించి నీ వట్లనన్**
**ధీరత్వంబున బాహులేయుఁడును తండ్రింగాంచి కేల్మోడ్చుచున్.**

పై పద్యములందు కవి చక్కగ తండ్రి కుమారుని ప్రేమపూర్వకముగ మందలించు వైఖరిని చిత్రించినాడు. కవిభావనయు స్తవనీయము. తర్వాత, నీతని ప్రౌఢశైలికి,

మ. అహహా! యీ పతగాధినాథుఁడు మదీయంబైన తాపంబు పెం
పు హరించెన్ ఘటియించె నాకు త్రిజగత్పూతాపగా దివ్య వా
ర్లహరీ సంతతఖేలనోత్సుక రమారాజేషు రత్నోల్ల స
ద్గృహశృంగాగ్రవినూతనాకపటదేదీప్యప్రభాలోకమున్.

చ॥ అని యిటు లానతిచ్చి శరణాగ్రణి శ్రీగిరికేగి మల్లికా
ర్జుని పదముల్ భజింపుము మరుల్లలనాకరచామరౌఘవీ
జన భవవాతలోల విలసద్భ్రమరన్ భ్రమరన్ సదా మనం
బున నిడి కొల్చుచుం భువనపూజితు డచ్చటనుండె నంతటన్.

ఈ విధముగ నీ కవిరచన మనోహరముగ నుండును. దీనిని వావిళ్లవారు ముద్రించిరి.

**2. శ్రీశైల మాహాత్మ్యము:-** స్కాందపురాణ మందలి సనత్కుమారసంహిత లోని శ్రీశైల ఖండమునకిది తెనిగింపు. ఈ కాలముననే రచింపఁబడిన శేషనారాధ్యుని గ్రంథమునకును దీనికిని బహుభేదము గలదు. అందు లేని విషయము లిందెన్నో గలవు. ఇది పురాణముగానే కాక శ్రీశైలస్థల సన్నివేశాదికము గూడ స్పష్టముగా దెల్పునదిగా నున్నది. ఈ గ్రంథమున భారవి మాఘాప్పయ దీక్షితాదులును, నన్నయ తిక్కన శ్రీనాథాదులును స్తుతింపఁబడిరి. ఇందు నాల్గాశ్వాసములు గలవు. గ్రంథమముద్రితము. కందుకూరి వీరేశలింగము తన యన్నయగు మూర్తిరాజునకు కృతిగా దీనిని జెప్పించెను. కందుకూరివారి వంశమున పూర్వులు కువలయాశ్వ చరిత్ర, పంచాక్షరీ మాహాత్మ్యము, పంచాక్షరీ మహత్త్వము, (మరియొకటి), శంతనువిలాసము, చెన్నబసవకథ యను కృతులను కొనిరను విషయము నీ పద్యము చాటుచున్నది.

సీ. మెచ్చుగాఁ గృతినందె మీ తాత మల్లికా
ర్జునమంత్రి కువలయాశ్వుని చరిత్ర
మహిత పంచాక్షరీ మాహాత్మ్య కృతిగొని
వెలసె మీ పెదతండ్రి వీరమంత్రి



వేడ్క మీ పెదతండ్రి వీరేశలింగము,
కృతినందెఁ బంచాక్షరీమహత్త్వ
మతిదాత మీ తండ్రియగు బసవామాత్యు
డందె శంతనువిలాసాది కృతులు
కొనియె మీ పెదతండ్రి కొడుకగు నమృతలిం
గము చెన్నబసవనకథ సుకృతిగ,

సీ. శివలీల యాదియౌ ప్రవిమల కృతులిచ్చి
మా తండ్రి బసవనామాత్యుచేత,
ఘోటిక శాటికాహాటక భూషణా
ద్యనుపమ వస్తుసంతతులు గొంటి,
వెసకంబుతోఁ చెన్నబసవపురాణ మి
చ్చితివి మా యమృతన్న కతులితముగ
మున్ను మా మూర్తి రాజన్న చెప్పించిన
శరభాదిశతకముల్ చాల చెప్పి

గీ. తీవు పూర్వాశ్రితుండవు మొ॥

మఱియు చెన్నబసవపురాణమందుగూడ నిట్లే వ్రాయబడెను.

ఉ. ఆతతకీర్తికై కువలయాశ్వచరిత్రకృతిన్ గ్రహించి ప్ర
స్ఫీతములైన క్రొత్తపలి, యేలేటిపాడన నగ్రహారముల్
ఖ్యాతిగఁజేసి బంధులకు గ్రాససమృద్ధు లొసంగి శాంభవ
వ్రాతము కోర్కులిచ్చి విభవంబున మల్లనమంత్రి వర్ధిలెన్.

సీ. మహిత పంచాక్షరీ మాహాత్మ్యమును గృతి
నంది త్రైలోక్య విఖ్యాతిగాంచె. --మొ॥

క. తన మేనల్లుం డాకృతి
వినయుండగు బుద్ధిరాజు వీరనచేతన్
గొనె సత్యవతీపరిణయ
మను కృతి శ్రీ బసవమంత్రి యతిసంప్రీతిన్.

శ్రీశైల మాహాత్మ్యమందలి యంత్యగద్య యిట్లున్నది.

అంత్యగద్య:- ఇది శ్రీ మచ్చెన్న మల్లికార్జున కృపాకటాక్షలబ్ధ కవితా మాధురీ ధురీణ, కౌశికగోత్ర పవిత్ర, సుకవిజన స్తుత్యవిధేయ పాపయనామ ధేయప్రణీతంబైన శ్రీశైలఖండంబను మహాపురాణమునందు సర్వము చతుర్థాశ్వాసము.

## VIII. వింటి ఔబళకవి,శివరహస్యఖండము - (1)

వింటి ఔబళకవితండ్రి సిద్ధన. స్కాందపురాణమందలి శివరహస్య మునకిది తెలుఁగు. ద్విపదలో రచింపఁబడినది. అసమగ్రముగా దొరికినది. ఇందు సంభరాసుర, వీరమాహేంద్రయుద్ధ దేవకాండములు గలవు. అందును కొన్నింటి కాద్యంతములు లేవు. కృత్యవతరణిక లేదు. దాని యంత్యగద్య యిట్లున్నది.

ద్వి. "అని జానకీహృదయాధీశ పాద
వనజమరంద సేవన వరభృంగ
మగువింటి సిద్ధనయాత్మ సంభవుండు
సుగుణాఢ్యుఁడౌబళ సుకవి శేఖరుఁడు
నైమిశారణ్య పుణ్యస్థలి మునుల
తో ముదంబునను సూతుఁడు చెప్పినట్టి
స్కందపురాణ శంకర సంహితనెడు
అందును శివరహస్యాఖ్యఖండమున
దేవకాండముఁజెప్పె ధీయుక్తిచేత
భావించి బుధజనుల్ ప్రస్తుతిసేయ
... ... ... ... ...
ఎందాక గుహకీర్తి యెసఁగుచునుండు
నందాక నీ కథ యవనిఁబెంపొందు.

ఈ గ్రంథప్రారంభమిట్లు సేయఁబడినది.



ది. శ్రీమించు కాంచీపురీప్రదేశమున
ప్రేమ దైవార వారిజసంభవుండు
... ... ... ...
మునులార మీ తపంబున కర్హమైన
వనము నైమిశమని వలనుగాఁదెలుప.
... ... ... ... ...
అందువారలు సహస్రాబ్దసంజ్ఞకము
జెందిన యజ్ఞంబు చేయుచున్నంత
వ్యాసశిష్యుఁడు సూతుఁడను తపోధనుఁడు
ఘనత నా యజ్ఞంబు గనుగొను మమత
... ... ... ...
తదాశ్రమవాసమౌని
పరభాగ్యమన యజ్ఞవాటికఁజేర
... ... ... ...
తగుప్రేమ గుహచరిత్రము సమస్తంబు
నొగిఁ దెల్పి మమ్ము ధన్యులఁజేయుము
.... ... ... ... ...
అని విన్నవించిన నా శౌనకాది
మునులకు సూతుఁడింపుగ నిట్టులనియె
... ... ... ... ...
సప్తకాండల కాధారమగుచు
దనరిన యట్టి స్కాందపురాణమందు
మునుపు వేదవ్యాసమునివరుచేత
గుహచరిత్రమును తద్గురు విక్రమములు
విహితవైఖరులచే వివరింపఁబడియె
నది మీకుఁదెలిపెద నతివేడ్కననుచు
సదయుఁడైరో (శా) మహర్షణి యిట్టులనియె.

**అంతము :-**

**మోదంబుతో నంత ముచికుందు ననిచి**
**యాదరమున గుహుఁడఖిలలోకములు**
**పాలించెనంచును పరమసంతోష**
**శీలుఁడై సూతుండు చెప్పెనటంచు**
**మునులంద రానందమునఁ జెందిరంత.**

## IX. వంకాయలపాటి వీరభద్రకవి - శివరహస్యఖండము -2

ఈ కవి రంగనామాత్యుని పుత్రుడు, ఆర్వేలనియోగి, కౌండిన్య గోత్రజుడు. ఇతఁడు గోదావరి జిల్లావాఁడు కాదగును. కవిమాతామహుడు మోచర్ల వంశీయుడు. ఈ కవి సూర్యవంశపురాజైన మండపాటి రామచంద్రరాజుచే గౌరవింపఁబడినాడు.

ఈతని శివరహస్యఖండము స్కాంద పురాణాంతర్గతమైనది. సప్త కాండలు గలది. చివరదగు నుపదేశమను కాండమిందు లేదు. అందులోఁ జేరిన దక్షకాండమునకిది తెలుగు. ఇందు సంస్కృతమునకుంబోలె నధ్యాయ క్రమము గూర్చఁబడినది. ఇందు 40 అధ్యాయములు పైగా కొంతభాగము గలవు. కాని యిది యసమగ్రము. ఇందు దక్షాధ్వరధ్వంసము గలదు.

**ఉపదేశకాండము:-** స్కాందపురాణాంతర్గత శివరహస్యమున నుపదేశమను కాండమునకిది యాంధ్రీకరణము. ఇందు 7 అధ్యాయములు గలవు. అవి సంస్కృతక్రమముననే చేయఁబడినవి.

**అంత్యగద్య:-** "ఇతి శ్రీమత్ స్కాందే శంకరసంహితాయాముప దేశకాండే పంచాశీతి తమో - ధ్యాయః".ఇదిశ్రీమదుమామహేశ్వర కరుణాకటాక్షవీక్షణ పవిత్రీకృతచరిత్ర రంగనామాత్యపుత్ర వీరభద్రాభిధేయ ప్రణీతంబైన శ్రీమత్ స్కాందమహాపురాణంబున, శంకరసంహితయందు శివరహస్యఖండంబున, శంబరాసుర వీర మాహేంద్ర యుద్ధదేవ దక్షోపదేశంబులను సప్త కాండంబుల సప్తంబును పంచా శీత్యధ్యాయ సమన్వితంబునగు నుపదేశకాండంబు సంపూర్ణము.



**ప్రారంభము :-**

**"శ్రీ మత్కైలాసనగ**
**స్థేమ విజితకామ, భీమ, ధీమహితముని**
**స్తోమ పరిపుల్లహల్లక**
**సోమ సతీధామ రామ సోమలలామా!**

ఇందు విశేషములేమియు గానరావు.

## X. కోడూరు వెంకటాచలకవి - శివరహస్యఖండము -3

ఈ కవి కోడూరి యల్లనార్యుని మనుమడును, లక్ష్మాంబా శంకరామాత్యుల పుత్రుడును, ఈతఁడార్వేల నియోగిబ్రాహ్మణుడు. కాశ్యపగోత్రుడు. ఆపస్తంబ సూత్రుఁడు. వెంకటాచలకవికి బాలసరస్వతి యను బిరుదము గలదు. ఈతని గురువు ఎడవల్లి వెంకటకవి. ఈ గురువు అభిరామ వాసుదేవాది గ్రంథ కర్తయట.

**తే.** **అవని నభిరామవాసుదేవాది కావ్య**
**ములను రచియించి ప్రఖ్యాతి నలరినట్టి**
**ఘనుని నెడవల్లి వెంకటకవివరేణ్యు**
**నస్మదీయ విద్యాగురు నభినుతింతు.**

పతితపావన చరిత్రమును రచించిన యెడవల్లి వెంకటకవి యీతఁడే యగునేమో. ఇంక కోడూరు వెంకటాచలకవి మాతులుడు గునుకుటూరి వెంకట కృష్ణకవి, శ్లేషకవితాపితామహ బిరుదాంకితుడును నలరాఘవ యాదవ పాండవీయాది గ్రంథకర్తయునట.

ఈతని శివరహస్యఖండమునకు మొదలు తుద దొరకలేదు. ప్రథమాశ్వాస షష్ఠ్యంతములనుండి చతుర్థాశ్వాస భాగమువఱకుఁ గలదు. స్కాంద పురాణాంతర్గత శంకరసంహితయను శివరహస్యఖండ మందలి సంభవ కాండమున కిది తెలుఁగు. సంభవకాండ కూడ పూర్తిగా లేదు. వివిధ కాండలందలి యాశ్వాసము లిట్లున్నవి.

సీ. సంభవంబైదు నాశ్వాసము ల్సర్వంబు
నాసురకాండ రెం డభినుతింప,
నాశ్వాసమొక్కటి, యలరు వీరమహేంద్ర
కాండకు, మఱి యుద్ధకాండ నాల్గు
ఆశ్వాసములు రెండు నమరును దేవకాం
డకు నాల్గు దక్షకాండకును దగును;
ఒనరఁగఁ బదియొప్పు నుపదేశకాండకు
ఇరువది యెనిమిదౌ నివియు నిట్లు

గీ. సప్తకాండమ్ములకును నాశ్వాసనిర్ణ
యంబుగాఁగను శివరహస్యాఖ్యఖండ
స్కాందమున నాంధ్రభాషచే సకలసుకవి
నుతుఁడు బాలసరస్వతి కృతియొనర్చె.

అంత్యగద్య ..........శివరహస్యఖండంబునం దుపదేశకాండంబునందు సర్వంబును దశమాశ్వాసంబు.

సంభవకాండ యంత్యగద్య యిది:- "ఇది శ్రీమత్సకలసుకవి జనాను గ్రహపాత్ర, కాశ్యపసగోత్ర, కోడూరి యల్లనామాత్యపౌత్ర, శంకరామాత్యపుత్ర, లక్ష్మాంబాతనయ, వినయవిధేయ, బాలసరస్వతీ నామాంక వేంకటాచలకవి ప్రణీతంబైన శ్రీస్కాందంబను మహాపురాణం బందు శంకరసంహితయను శివరహస్యఖండంబునందు సంభవకాండంబున ప్రథమాశ్వాసము.

**ప్రారంభము :-**

క. జననుత నా దేవాంబా
తనయనుఁదను జూచి రాకాసుధాకర బింబా
స్యను నగ్గలూరి వంశా
గ్రణి...............రాయఘయనుండు వరించెన్.



**అంతము :-**

క. యాగం బుపక్రమించుచు
భాగాలంభన మొనర్ప భాగంబొండున్
వేగమ జనించి దైవ వి
యోగంబున జగములెల్ల నుద్ధతిగల చెన్॥

ఇంక నుపదేశకాండారంభము:-

శా. శ్రీకంజాస్యు, నుమాసతిన్, గుణమణింజెన్నొందఁ బాణిగ్రహం
బై కల్యాణవితర్దికన్ భువననేత్రానందముంజేయు నా
లోకాధ్యక్షుఁడు మాధవుండు కరుణాలోకంబునంబ్రోచు సు
శ్లోకున్ శ్రీముళువాగలు ప్రభునిఁ దేజోధైర్యధౌరేయునిన్.

**అంత్యము :-**

వ॥ అని సూతుండు పల్కిన మునివర్యులు విని సంతోషవార్ధిలహరీ నిమగ్నచిత్తులగుచు, సూతుని సంభావించి, యతని వీడ్కొని విప్రులందఱు నిజాశ్రమపదంబులు చేరిరి.

ఈ శివరహస్యఖండము శ్రీముసురుముళునాగళు ప్రభువున కంకితము సేయఁబడినది. ఇతఁడు బళ్లారి యందున్న లింగబలిజ ప్రభువని తోఁచుచున్నది. కృతిపతి పూర్వులలో నొకని కవి వర్ణించుచు నిట్లు తెలిపినాడు.

క. ధరణీస్థలి నా పరశివ
చరణోద్భవులందు సకలసామ్రాజ్యరమా
భరణుఁడు వీరనృపాలుఁడు
వరభింగక గోత్రుఁడగుచు వర్ధిల్లెఁగడున్॥

అని కవి యతనిని శివపాదోద్భవకులజు'గాఁజెప్పినందున తద్వంశము శూద్రవర్ణమునకుఁ జెందినదైయుండును. కృతిపతి యొక్క పితామహుని మాతామహుఁడైన చిక్కరాజను నామాంతరముగల 'ముళువాగళు' నృపతి యీక్రింది పద్యములలో మథురాపురీశ్వరుని జయించినటులును, శ్రీ వెంకట పతి రాయలకాలములోనుండినట్టును కవి వర్ణించినాఁడు.

మ. ప్రకటారాతి విదారితార్గళ భుజాప్రావీణ్యమింపార వా
రక యెంతే మధురాపురీ విభుని దర్పంబెల్ల వారించి భూ
రికృపాణోద్ధతిచేత వేంకటపతి శ్రీరాయసన్మాన్యుఁడై
చికరాజాఖ్య వహించె భాసురజయశ్రీధుర్యుఁడై వేడుకన్.

క. ఆముళువాగళు నృపతి ధ
రామండలిఁగీర్తిఁగాంచె రాజత్కార్యో
ద్దామ బలావార్యజయ
స్తోమ మహైశ్వర్యధుర్య శూలాన్వితుఁడై.

ఈ పద్యమువలన కృతిపతి పూర్వులు విజయనగర సంస్థానాధీశ్వరుల సేనాపతులై యుండి, ప్రభుత్వము సంపాదించిరని మాత్రమేకాక, వేంకటపతిరాయలు క్రీ. శ 1585 వ సంవత్సరము- 1614 వఱకు రాజ్యము చేసిన వాడగుటచే నాతనికి నాలుగుతరములతర్వాతనున్న కృతిపతియు కృతికర్తయు గూడ క్రీ.శ 1700 ప్రాంతమునందున్నట్లు నిశ్చయింపవచ్చును. ఇది కాక యాంధ్ర కవి స్తుతులలోని యీ క్రిందిపద్యములలో పింగళిసూరన్నను పూర్వకవిగా వర్ణించి యుండుటచేతఁగూడ నీత డాధునికుడని చెప్పవచ్చును. నన్నయ తిక్కన శ్రీనాథాదులను వర్ణించిన పిదప కవి ఇట్లు స్తుతించినాఁడు.

గీ. భూరి సత్కళాద్విజరాజు పోతరాజు
శుభమనోరథు పింగళిసూరవిభుని
మరియు నాంధ్రోక్తి విశ్వనిర్మాణపటిమ
ఘటిత కమలోదయుల మహాకవుల నెంతు.

ఈతడు ప్రౌఢకవి. నిరర్గళ కవితాధార గలవాఁడు. ఈతని గ్రంథ మముద్రితము.



## XI. ముదిగొండ బ్రహ్మయలింగారాధ్యుఁడు శివరహస్యఖండము:- (తత్త్వబోధిని) (4)

ఈ కవి యర్వాచీనుడు నాధునికుడు. ఈతని గ్రంథము ముద్రితమైనది.

## XII. భద్రకవి లింగ (కవి) భూవిభుడు, దేవాంగపురాణము-(1)

భద్రకవి లింగకవి రామయప్రభుని కుమారుడు - సంగమేశ్వర గురుని శిష్యుడు. పదవీటి దేవాంగప్రభువుల కోరకపై నీ గ్రంథమును ముదునూరి రామేశ్వరస్వామి కంకితము చేసెను. ఈ గ్రంథమున కొమరేంద్రుఁడను నొక దేవాంగుని వంశావతారము వర్ణింపఁబడినది. దేవాంగపురాణము ఏడు ఆశ్వాసముల ద్విపద గ్రంథము. బ్రహ్మాండ పురాణాంతర్గతమైన భాగమును బట్టి యిది రచితమయ్యెను.

**1-వ ఆశ్వాసము:** మనుమహాముని యీశ్వరునకు దేవాంగ ఋషిగా జన్మించుటయు, దేవతావస్త్రముల నిర్మించుటయు, మొదలైన విషయము లున్నవి. విద్యాధర, పుష్పదంత, బేతాళ, వరరుచి. దివసాళి, దేవరదాసి నామములతో నితడు మఱి యా రవతారములనెత్తు వృత్తాంత మా రాశ్వాసము లందు వర్ణితము. ఈ యవతారములు ఇంద్రజాల, రసవాద, వైద్యాది విషయములను పెంపొందించుట ప్రయోజనముగా నేర్పడినట్లు గలదు. చివరియవతారము దేవాంగ కులమున నెత్తెనట. దేవరదాసి జైనులను ఖండించి శైవమతమును పెంపొందించెనట. ఈ దేవరదాసి వంశీయుడే మన కవి.

**అంత్యగద్య :-**

ద్వి॥ విశ్వనాయకుపేర, వినుతబృందార
కేశ్వరుపేర, రామేశ్వరుపేర
నిది వీరభద్రమహిష్ఠప్రసాద
విదిత సత్కావ్యప్రవీణ ధురీణ,
సంగమేశ్వర గురుచరణారవింద

**సంగత గంధ పుష్పంధాయమాన**
**ఘనయశోనిధి భద్రకవిలింగధీర**
**వినుతమాధుర్య వాగ్విరచితంబైన**
**ప్రకట దేవాంగపురాణంబునందు**
**నకలంకముగ సప్తమాశ్వాసమయ్యే.**

**ప్రారంభము :-**

**" శ్రీరజతాచల శృంగవిహార**
**హారకర్పూర నిభాంచితాకారు,**
**... ... ... ...**
**కామారి ముదునూరి కటకాభిరాము**
**రామేశ్వరుని భక్తరసికతాప్రవరు**
**వరదేవతా చక్రవర్తి గీర్తించి**
**స్థిరమనోరథములు సిద్ధింపఁగొలిచి.**

తర్వాత శైవకవులు, భక్తులునగు పాల్కురికి సోమన, పిడుపర్తి బసవన, శివశేషయోగి, రంగనాథుని, గోవిందభట్టారకుని, ధవళేశు నామయ్య, శివ నాగమయ్య మొదలైనవారిని స్తుతించి,

**ద్వి. ధరణిపై దేవరదాసయ్యవంశ**
**వరనిధిసంపూర్ణ వార్ధిచంద్రుండు**
**... ... ... ...**
**పరగిన రామయప్రభు గూర్మిసుతుఁడ**
**వినుత శబ్దబ్రహ్మ విద్యానిరూఢి**



**ఘనత మించిన భద్రకవిలింగవిభుఁడ**
**... ... ... ...**
**మానితద్రావిడ మధ్యదేశమున**
**నడరి మర్త్యస్వర్గమగు మధుర రస**
**పడవీడు సకలసంపదలకు వీడు**
**... ... ... ...**
**ఇరవొప్పఁ గాళహస్తీశ్వరుఁ డనెడు**
**పురుషాగ్రగణ్యుఁడప్పురికధీశ్వరుఁడు**
**... ... ... ...**

ఈతని ప్రేరణమున నీ గ్రంథము వ్రాయఁబడినది

## XIII. రొచ్చి వీరభద్రకవి, దేవాంగపురాణము -(2)

వీరభద్రకవి విశాఖపట్టణ మండలమందలి జామి పురమువాఁడు. దాసుమయగోత్రుడు, సాహెబుపౌత్రుడు, రామలింగార్య పుత్రుడు. ఈయన మతగురువు బూరుగుపల్లి మఠాధికారియైన చెన్న మల్లికార్జునుడు. కవితాగురువు గంగ్రేటి గురువయ్య. పై విషయము లీ క్రిందిరచనలంబట్టి తెలియనగును.

**అంత్యగద్య:-** శ్రీ మత్సకలజనానుగ్రహపాత్ర, దాసమయ పవిత్రగోత్ర, సాహెబు వర్యపౌత్ర, రామలింగార్యపుత్ర, వీరభద్రప్రణీతం బైన దేవాంగమను బ్రహ్మ ప్రతిపాదకమగు వేదోక్తమూలస్తంభమను పురాణంబునందలి, వ్యాసప్రోక్త బ్రహ్మాండ పురాణంబునంగల దేవాంగ పురాణంబున సర్వంబును సప్త మాశ్వాసము.

పద్యరూపమున రచింపఁబడిన యీ పురాణమును, భద్రకవిలింగకవి గ్రంథమును నొకదాని కొకటి మార్గదర్శకముగాని మూలకారణముగానియై యుండనోపు.

గ్రంథప్రారంభము :-

క. శ్రీ జామిపురవిహార, సు
ధీజన మందార, పార్వతీ విమల హృదం
భోజ దివాకర, శుభకర
రాజిత ఫణిహార, రాజరాజహిత హరా.

తర్వాత నీ కవి నన్నయ, తిక్కన, సోమనాథ, భాస్కర, పెద్దనాదికవులను స్తుతించినాడు.

## గురుస్తుతి

సీ. వసుధ బూరుగుపల్లి వంశమహోదధి
రాకాసుధాకరు రాచయార్యు,
పత్ని నీలాంబ, యా పరమసాధ్వి సుతుండు
చన్నమల్లయ యను సద్గురుండు,
వారలు మామక వంశ పరంపర
సద్గురుశ్రేష్ఠులు శైవశాస్త్ర
కోవిదు లార్య సద్గోష్ఠి శైవాచార
సత్తమోత్తములు సద్వర్తిహితులు,

గీ. మహిని బూరుగుపల్లిమఠాధికారి
యనఘునా చన్నమల్లికార్జునవరేణ్యు
చరణ కారణకర్తలు సచ్చరితులు
శివపదధ్యానరతులు విశిష్టమతులు.

వ॥ అస్మద్గురువర్యునకు వందనంబులొనర్చి



గీ. గుణగణాఢ్యుఁడు గంట్రేటి గురవయాఖ్యు
డాదికవులతో సమ మగునట్టివాఁడు
తెలుఁగు సంస్కృత కవితకు ధీయుతుండు
నస్మదీయవిద్యాగురు నభినుతింతు.

# షష్ఠ ప్రకరణము - మాహాత్మ్యములు

## నాగులూరి శేషనారాధ్యులు, శ్రీశైలమాహాత్మ్యము (లేక) పర్వతపురాణము - (2)

అత్తలూరి పాపకవి రచించిన శ్రీశైలఖండమునకుఁగూడ శ్రీశైల మాహాత్మ్యమను నామాంతరము గలదు. దీనియందు దానియందు కూడ విషయము కొంత సామాన్యమే. సంస్కృతస్కాందపురాణాంతర్గత శ్రీశైలఖండమున కిది యాంధ్రీకరణము. ఇందారాశ్వాసములు గలవు. ఇందు కర్నూలు మండలమందలి శ్రీగిరి యందు వెలసిన మల్లికార్జునదేవుని మాహాత్మ్యము వర్ణితము. దీనిఁగూర్చి సి.పి. బ్రౌనుగారిట్లు వ్రాసిరి.

"This Volume contains two tales translated from Scanda Purana - probably that part called Sri Saila Khandam, - though this is not named. It is a silly stupid book, utterly worthless, yet written by a man of learning and in a good style of poetry. 'The name of it is Sri Parvata Puranam'. "The second poem is the legend of Sananda, who was one of the Ganas or angels". He also writes,

"This poem, the Parvata Purana, is written in a classical, and learned style, but the story is a parcel of odds and ends. In the 3rd canto, a new tale commences regarding a father who is in love with his own daughter."

ఇది 1888 వ సం. న చెన్నపురిలో శైవసిద్ధాంత ముద్రాక్షరశాల యందు ముద్రింపఁబడినది.

**అంత్యగద్య:-** ఇది శ్రీ మల్లికార్జునకృపాలబ్ధ మేదురాష్టభాషావిశిష్ట శివ యోగ వర్య, శేషనారాధ్య ప్రణీతంబైన శ్రీ పర్వత పురాణం బాద్యంతమును షష్ఠాశ్వాసము.



**ప్రారంభము :-**

 మ. **శ్రీ మత్పర్వత రాజరాజ్యపదవీ సింహాసనస్థుం జగ
ద్గ్రామగ్రామణి మల్లికార్జును నపాంగవ్యాప్త లోకక్రియా
సామాన్యుం డు హిమాద్రిజాకుచతటీ సంలిప్తపా
ద్రామోదాంచిత వామభాగు శివు నారాధింతు డెందంబునన్ ॥**

శా. ..........నాగులూరి (టివన) పుర వీరస్వామి గీర్తించెదన్.

కవి వీరశైవుఁడగుటచే తన కులగోత్రముల నిట్లు తెలియఁబఱచినాఁడు.

క. **శివజన్ముఁడ, శివ గోత్రుఁడ
శివలింగధ్యాన రతుఁడ శీలవ్రతుఁడన్
శివపూజా పరతంత్రుఁడ
శివయోగసుధానుభవుఁడ శేషాహ్వయుఁడన్.**

తన పాండిత్యప్రకర్షను కవి యిట్లు చెప్పుకొనినాడు.

మ. **ప్రణుత శ్రీ గిరినాథలబ్ధకవితా ప్రజ్ఞాకళాభిజ్ఞుఁడన్
గణభుద్గ్రంథమతప్రయోగవిలురద్గాఢార్థ సంవేత్తఁ ద
త్ఫణిభాష్యాయత ఫక్కి కాదృఢ పదప్రౌఢీ సమాఢౌకిత
ప్రణిపత్యస్ఫుటశబ్ద శాస్త్రనివహ ప్రామాణ్యపారీణుఁడన్.**

శా. **చేతశ్శుక్తికయందు నిల్చి కళలంజేకూర్చి, శాస్త్రోదక
వ్రాతం బక్షరమూర్తి మౌక్తికముపై వర్ధిల్లుడున్ సత్ప్రభు
ఖ్యాతోపేతగుణ ప్రయుక్తి సదలంకారాంగ హారాళిగా
రీతిన్ సత్కవి గూర్పనేర్చును బుధశ్రేణీగళాగ్రంబునన్.**

కవితావిషయమున కవి సంస్కృతాభిమానియైనను భాషావిషయమున తెలుగునందే యాదరము గలవాఁడు.

క. **తెనుగైననేమి కవితా
జనితాలంకార చిత్ర సంగత పద వ**

ర్ణన వచన రచన చతురత
విన యోగ్యంబైన కృతియె విం(డ్రు మహాత్ముల్.

సంస్కృతాంధ్రములఁగూర్చి కవి యిట్లు తెల్పినాఁడు.

క. భూషణలీలల దేశ వి
భాషలు తత్తత్ప్రదేశ భాసురములగున్
భూషించు వస్త్ర మట్లు సు
భాషితమై సంస్కృతంబు బహుదేశములన్.

చ. జనని సమస్త భాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్
ఘన లలితార్థ గౌరవ వికాసి తెనుంగభిరామ మంతకున్
గనుఁగొనఁజూతబీజమునకంటెను గోమలపత్రపుష్ప శో
భన మృతుపల్ల వాభినవ బాలరసాలము సొంపునింపదే.

ఉ. జల్లియు నక్రమంబు, నపశబ్దము, వైరిపదంబు, సంధులున్
బొల్లును, ద్రాక్ష, కంటకము, పూరకమున్, విరసంబు, జోలిగా
నల్లికనల్లు కబ్బములు నాదరణీయమె, వాక్యచాతురీ
సల్లలితార్థదృష్టి గల సత్కృతి సేవ్యతపొందు కైవడిన్.

పైనఁ దెల్పఁబడిన యీతని కవిత్వాశయములకుఁ దగినట్లుగనే యీ కవి రచనము సరసమైనది. ఈతని కవితాశైలి నీ క్రింది పద్యములు స్పష్టపఱచును. చతుర్థాశ్వాసమునుండి,

శా. కర్ణాలంకృతకుండలీశ్వర వియద్గంగా తరంగావళీ
ధుర్ణశ్చంద్రకళా కలాపవిలసత్కోటీరపాటీర వా
గ్వర్ణాడంబర దివ్యదేహయని నా వాక్కాయ కర్మంబులన్
వర్ణింతున్ నుతియింతు నిన్ను మహదేవా! దేవచూడామణీ!

సీ. మాధవీ నవపుష్పమంజరి చూచితె,
యభిరామ నవకలహంసయాన,
అభిరామ, నవకలహంసను జూచితె
కేలాభినవ రాజకీరవాణి,
కేలాభి నవరాజ కీరాళిఁ జూచితె
నీలకంఠకలాప నిభశిరోజ
నీలకంఠకలాప నిచయంబు చూచితె
కలమృదుస్వర కలకంఠనాద

ఆ. కలమృదుస్వర కలకంఠంబుఁ జూచితె
నిబిడ కోమలాళి నీలవేణి
నిబిడకోమలాళి నిచయంబు చూచితె
యనుచు క్రీడసల్పి రతివలంత.



ఈరీతిగ నీ కవిరచన యలంకారములతో ప్రౌఢిమగల శైలితో నొప్పుచున్నది.

నాగులూరి శేషనారాధ్యులఁగూర్చి యాంధ్రకవుల తృతీయ భాగమున కందుకూరి వీరేశలింగముగారు, "ఈతఁడాధునికుఁడేయైనను నే కాలము నందుండెడివాఁడో సరిగా తెలియదని" వ్రాసిరి. కాని యీతఁడు 16 వ శతాబ్దమునకుఁ బూర్వుఁడని, పెదపాటి జగ్గన తన ప్రబంధరత్నాకరమున నుదాహరించిన యీ క్రింది పద్యమును బట్టి తెలియుచున్నది. ఈ పద్యము శ్రీ శైలఖండ ప్రథమా శ్వాసమున నవతారికయందు గలదు.

ఉ. తత్తరపాటుతో నిరులు తద్దయు మాన్పగఁజాలు కన్నులు
వ్వెత్తున వేల్పుమూకలకు విందులు వెట్టెడు కన్ను దమ్మియున్
మొత్తము వత్త లచ్చికిని మున్మను బుట్టిన ముద్దుపట్టి మే
నెత్తిలఁ జూచు కన్నుగలవెట్టెడు వేలుపుగొల్తు నిచ్చలున్.

జగ్గన తన ప్రబంధరత్నాకరమున నుదాహరించిన కవులందఱు 16 వ శతాబ్దమునకు బూర్వులే యగుటచే శేషనాథుఁడుగూడ 16వ శతాబ్దమునకుఁ బూర్వుడని నిశ్శంకతోఁ జెప్పవచ్చును.

శేషనాథునకుఁ జిన్నతనమున నలవడిన శివభక్తియే తన కవితాభివృద్ధికిఁ గూడ కారణమైనదని యిట్లు తెల్పికొనినాడు.

శా. నావారున్ గడుచిన్న ప్రాయముననే 'ఓనామ'యన్ వాక్కులున్
'శివా' వాక్కులు చెప్ప నాటఁగొలె నే సేవింతు నీ యాన, నా
భావంబందున నిన్నె యెన్నుదును విభ్రాజ ద్భవద్భక్తి స
ద్భావజ్ఞాన సుధానుభావరతుగా భావింపు మల్లేశ్వరా॥

ఈ కవి తన కావ్యమునకు శివభక్తియే మూలకారణమని యిట్లు తెల్పినాడు.

మ. శివ చారిత్రము బీజ, మంకురము నీ సేవావివేకంబు, స
త్కవితాశ్రేణులు పల్లవంబులు, సమాఖ్యావ్రాతముల్ పుష్పముల్
భవదీయస్తవముల్ ఫలావళులు, సద్భావంబులే కీరముల్
భువి మత్కావ్యమహీరుహంబునకు శ్రీభూభృత్పురాధీశ్వరా.

ఈ కవి వీరశైవ కవియయ్యు పాల్కురికి సోమనాథుని స్తుతించిన పద్య మొక్కటియు నీతని గ్రంథమందు గానరాదు. ఇది యొక మహా విచిత్రము. కాని యీతని గ్రంథమునందు, పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్ర యందలి పర్వతప్రకరణమునఁగల ద్విపద పాదములే పద్యరూపము దాల్చినవి. ఇందుల కుదాహరణముగ, పండితారాధ్య చరిత్రమున, పర్వతప్రకరణమున నీ ద్విపదలు గలవు.

" ఘనతర ధర్మార్థ కామమోక్షములు
దనరు శ్రీ పాద పద్మంబు లనంగ
కన్నులు దీప వృక్షంబు లనంగ
చెన్నగు శృంగముల్ శృంగము లనఁగ,
గుహలు నాసాపుట కుహరంబు లనఁగ,
మహితభూజములు రోమంబు లనంగ,
... ... ... ...
వరచతుర్ద్వార నివాసలింగములు
సరసత నొప్పారు చన్ను లనంగ,
దొరగు పుణ్యంబులందుల దుగ్ధ మనఁగ,
వరపరిషత్కోటి వత్సంబు లనఁగ
... ... ... ...



నందితంబైన శ్రీనగ కామధేను
నందె కాకెవ్వి యిష్టార్థము ల్మరియు."

ఈ భాగమునే శేషనాథుడు, తన గ్రంథమున,

మ. పురుషార్థంబులు పాదముల్, శుభము తత్పుచ్ఛంబు తచ్ఛృంగముల్
గిరిశృంగంబులు, రోమరాజితరువుల్, క్రేపుల్ దిదృక్షాపరుల్
వరపుణ్యంబులు దుగ్ధధారలు, చతర్ద్వారస్థలింగంబు లు
ద్ధురవక్షోజము లీ నగంబు నుతులొందున్ కామధేనుక్రియన్.

ఇట్టివే యనేకములు గలవు. కాని యీతఁడు సోమనకుఁ బూర్వుడెంత మాత్రము గాజాలడు.

## శ్రీశైలమాహాత్మ్యము, (శ్రీశైలఖండము) (3) కవి పేరు తెలియదు

ఇదియు శేషనారాధ్యుల గ్రంథమును వేరు. ఇందు మొదలు తల లేదు. కృతికర్త పేరు లేదు. గ్రంథమందు శ్రీశైలమందలి తీర్థములు, క్షేత్రములు, మాహాత్మ్య మిందు వర్ణింపఁబడినవి. ఆ యా తీర్థములకు మాహాత్మ్యములకుఁ బోవలసిన దారియు, చేయవలసిన విధులును, తత్ ఫలములు నిందు తెలుపఁబడినవి. ఇందు చెప్పఁబడిన ప్రకారము పోయిన యెడల శ్రీ పర్వతమున కొక్క ప్రదక్షిణమగునట. ఇందు సంస్కృత పురాణ శ్లోకములుగూడ చేరియున్నవి. వ్యావహారికభాషలో సంస్కృత శ్లోకములసందర్భములు తెలుపఁబడినవి. ఇది పద్యములలో వ్రాయఁబడినది.

గ్రంథ ప్రారంభము :-

సీ. శ్రీ రత్నమయమైన సింహాసనంబున
శివుఁడు గౌరియు సుఖాసీను లగుచు
నున్నచో నంబికా యువతి ప్రాణేశ్వరు
శంకరుఁజూచి హస్తములు మొగిచి
యడిగె దర్శనమాత్ర నపవర్గఫలదమై
చెలఁగు శ్రీ పర్వత శిఖరమహిమ
చెప్పి యా గిరి ప్రదక్షిణముచేసిన జంతు
తతికి మోక్షము హస్తగత మటంచు,

గీ. నానతిచ్చితి రదిసేయు నట్టిక్రమము
తెలుపరే యన్న శంభుఁ డా దేవి కనియె
విను ప్రదక్షిణవిధి రెండువిధము లతివ
రామ పద్మ ప్రదక్షిణ నామములను.

ఉ. రావణు, బ్రహ్మపౌత్రు, రణరంగమునందు వధించి బ్రహ్మహ
త్యావినివృత్తికై ధశరథాత్మజరాముఁడు సేతుబంధ తీ
రావని రామలింగముఁ బ్రియంబున మున్ను ప్రతిష్ఠచేసి యా
త్రోవను పాపమంతయును దూలకయున్న తదంతరంబునన్.

క. ప్రేమ వశిష్ఠాదిముని,
గ్రామణు లెఱిఁగింప శ్రీ నగంబున కతఁ డు
ద్దామముగఁ బ్రదక్షిణవిధి
గామించి యొనర్చి విగతకల్మషు డయ్యెన్.

క. రామప్రదక్షిణంబది
భామాదురితముల కెల్ల ప్రాయశ్చిత్తం
బై మెరయుఁ గామితంబుల
ధీమంతుల కొసఁగు కామధేనువుకరణిన్.

అంత్యము :-

శ్రీశైలోత్సాహంత్త
విముక్తాస్సర్వపాపే భ్యో
గచ్ఛంతి పరమాం గతిం
శ్రీగిరి కోపాసవో యే తు
వాతేన సముదీరితా.

య స్సంస్పృశంతి గాత్రాణి, రుద్రలోకే మహీయతే
దేవదేవ మహాదేవ శూలపాణే వృషధ్వజ
జ్ఞాతా భక్తిం మమై దేహి షడంగాం॥



## శ్రీశైలమాహాత్మ్యము (4) (కవి పేరు తెలియదు)

ఇది అసమగ్రము. 14 పద్యములు మాత్రమున్నవి. తుది మొదళ్లు లేవు. గ్రంథకర్తపేరు తెలియదు. శ్రీ శైలమాహాత్మ్యమును దెలుపు నీ పద్యము లే గ్రంథములోనివో తెలియదు. శేషనాచార్యుడు రచించిన శ్రీశైలమాహాత్మ్యమున నీ పద్యములు గనుపట్టవు.

ప్రారంభము:-

శా. తారుణ్యంబున నమ్మహీసురుఁడొగిన్ ధర్మార్థ కామక్రియా
సారంబుల్ సరిగాఁజరించి తుద మోక్ష శ్రీనపేక్షించి సం
సారాంభోనిధి యానపాత్రమగు శ్రీశైలంబుమీదం దపం
బారంభింపఁ దలంచి నందనుల డాయం బిల్చి తా నిట్లనెన్.

గీ. దేవ శ్రీమన్మహాదేవ దేవదేవ
నాగమణిహార కృష్ణ వేణ్ణావిహార
సత్కృపాపాంగ శాంభవీసంగతాంగ
పాలితాఖిల జగదీశ పార్వతీశ!

అంత్యము :-

సీ. పొలుపొంద నెలనెలఁ బూని వెన్నెలఁజల్లు
చిన్నిపూఁదలదాల్పు వన్నెకాని,
మెఱవడిఁగమ్మ దెమ్మెరలాని మెఱుగెక్కు
పడిగెల తొడవులు తొడుగువాని,
మురియుచుంగులు దీర్చి మువ్వన్నెపులితోలు
గట్టి పుట్టము మొలగట్టువాని
వడకుగుబ్బలిరాచవారి ముద్దులపట్టి
సామేన నిడికొన్న బూమెకాని,

గీ. నేచి తెల్లని గిబ్బపై నెక్కువానిఁ
బొసఁగు ముమ్మొనకైదువుఁబూనువాని
మించి యన్నియుఁ దానైయై మెఱయువాని
వేల్పులకునెల్ల పెద్దయై వెలయువాని.

## శ్రీశైలస్థలవివరణము:- 5 (కవి పేరు తెలియదు)

ఇది యసమగ్రముగా నున్నది. వ్యావహారిక భాషలో వచనమున రచింపఁబడినది. కర్నూలుమండలమందున్న శ్రీశైల మాహాత్మ్యమును నక్కడి తీర్థక్షేత్రాదుల వివరణమును వాని మాహాత్మ్యాదులును నిందు తెలుపఁబడినవి. శ్రీశైలపర్వతము చుట్టుగల వివిధ నదులు, చెరువులు, గుంటలు, చెట్లు, దేవాలయములు, ఋషులు మొదలైన విందు వర్ణింపఁబడినవి. ఈ గ్రంథమునకు చివర మొదలు లేదు, కాన గ్రంథకర్త పేరు తెలియదు.

**ప్రారంభము:-** శ్రీపర్వతమహిమ నాకు సవిస్తారంగా కృపచేసి కృతార్థురాలిని జేసి రక్షింపుమా.... పార్వతికి శివుడు చెప్పఁదొడంగెను. శ్రీమల్లికార్జున దేవరకు దక్షిణ దిక్కున రెండు పర్వుల ........ర్థన చేసేది మంత్రం హ్రాం, హ్రౌం, హ్రీం, భగవతే నమః అని 25000 జపం చేయగాను ఆ భగవతి వచ్చి అవి అన్ని చూరయిచ్చును. అవి బయలు వెళ్లేటందుకు శలవు ఇచ్చును.

**అంత్యము:-** మరిన్నీ ఆ చెరువు వెనుక ఒక చెలిమె కలదు. అందులోను విద్రుమ లతలు గలవు. అది కార్తిక పౌర్ణమినాడు..... ఆ చెరువు నిండా అలుముకొని పారును.

## II. పర్వతమంత్రి లింగన - రుద్రాక్షమాహాత్మ్యము

వీరమాహేశ్వరాచార సంగ్రహమును ద్విపదలో రచించిన పర్వత మంత్రి లింగన కవియే రుద్రాక్షమాహాత్మ్యమును గూడ రచించెను. ఇది గూడ ద్విపదలోనే రచింపఁబడెను.



**ప్రారంభము :-**

**శ్రీవిశ్వనాథుండు శ్రితశంకరుండు
దేవాదిదేవుండు దేవపుంగవుఁడు
పద్మాక్షవరదుండు పద్మార్చితుండు,
... ... ... ...
నే యెడఁజూచిన నెల్ల రుద్రాక్ష
ఫలమహత్త్వంబది ప్రబలమైయుండు
పొలుపార నవి యెట్లు భువి నుద్భవించె
వదలక ధరియించువారికి ఫలము.**

**అంత్యము :-**

**ఖండేందు ధరశక్తి కామ్యాంతరంగ
శివకృపాంచితగాత్ర, శ్రీవత్సగోత్ర,
ప్రవిమల నిగమోక్త భవ్యచారిత్ర
... ... ... ...
లీల పర్వత మంత్రి లింగనామాత్య
విరచితముగ సర్వవేదోక్తమగుచు
శ్రీరమ్యమై, సర్వసేవ్యమై యొప్పు
వీరమాహేశ్వరాచార సంగ్రహణ
మందులో నొప్పు రుద్రాక్షమాహాత్మ్య
మందమై యొప్పును నఖిలలోకముల
ధరణిని నాచంద్రతారార్కముగను.**

## III. అమలాపురపు సన్యాసికవి - రుద్రాక్షఫలమాహాత్మ్యము -2

ఇది మూఁడాశ్వాసముల పద్యప్రబంధము. కవి కుమ్మరకులము వాడు. విశాఖపట్టణమందలి సాలూరుపుర సమీపమున వేగవతీ నదీతీరమున వెలసిన పంచముఖేశ్వరస్వామికి నీ గ్రంథమును సమర్పించెను. ఈతడు కట్టమూరి కామేశ్వరార్యుని శిష్యుఁడు. కవి తండ్రిపేరు కాసన. ఈ గ్రంథము సమగ్రముగాగలదు.

**అంత్యగద్య :-**

ఇది శ్రీమత్పంచముఖేశ్వర చరణారవింద నిష్యం దన్మరందధారాభినందితేందిందిరాయ మాణమానసవైభవ, **కాశయాఖ్య** తనూభవ, **శ్రీమదమలా పురాన్వయపయః** పయోధిరాకాసుధాకర, సమస్తగుణాకర, సకల సుకవిజనవిధేయ, సన్యాసి నామధేయ విరచింతబైన రుద్రాక్షఫలమాహాత్మ్యం బను శైవకథయందు తృతీయాశ్వాసము. ఈతని రచనను బట్టి యీ కవి వంశవృక్ష మిట్లున్నది.

**అమలాపురపు మల్లికార్జునుడు (భార్య - అంకమ్మ)**

**నారాయణమూర్తి (భార్య - లక్ష్మి)**

**మల్లన (భార్య - సుభద్ర)** | **కాశన (భార్య - గంగమాంబిక)**

**చిన్నయ** | **సోముడు** | **సన్యాసి (భార్య - కన్నమ్మ)**

ఈ కవి ప్రమథమాలికయును, శివశతకము నను గ్రంథములనుగూడ రచించెను.

**గ్రంథప్రారంభము :-**

శా. **శ్రీమద్భూధర వల్లభప్రియ సుతాచేతోభిరామున్ గుణో**
**ద్దామున్ సోము జటాభరార్పిత సుధాధామున్ బృహన్నాము, ని**
**ష్కామున్ నిస్తులపాద భక్తపటలీకల్పద్రుమారాము, సు**
**త్రామారాతి విరాముఁ గోటిఖరరుగ్ధామున్ బ్రశంసించెదన్.**

క॥ **కళ్యాణగుణోద్దామున్**
**కళ్యాణాన్వయలలాముఁ గళ్యాణ కుభృ**
**త్తుల్యోజ్జ్వల ధీరున్, సా**
**కల్యతఁ ద్రిపురారిదేశికప్రభునెంతున్.**



క. **శ్రీ కట్టమూరి కుల ర**
**త్నాకరరాకాశశాంకు, నభినవపుణ్య**
**శ్లోకున్ విద్విద్యాప్రదు**
**శ్రీకామేశ్వరగురున్ భజించెద నిష్ఠన్.**

క. **చారుకులాల కులాలం**
**కారున్ గౌరీశ్వరాంఘ్రికమల మిళిందా**
**కారున్ నిరహంకారు ను**
**దారున్ మజ్జనకుఁగాశనాఖ్యు నుతింతున్.**

కవి తన్ను గూర్చి యిట్లు తెలుపుకొనెను.

సీ. **పొన్నమండ కులాబ్ధిపూర్ణేందుఁడగు గర**
**వయ్యకు నంకమ యను సతికిని,**
**దనుజన్ములిర్వురు జనియించి రుర్విలో**
**పల వినాయక వీరభద్రు లనఁగ**
**గంగాధరయ్య శ్రీకరశరభయ్యయు**
**నా దయాకరులలో నగ్రజుండు**
**గంగాధరయ్య నన్నుంగనె మహదమ**
**లాపురీవంశ ప్రదీపసద్గు**

గీ. **ణాఢ్యు సన్యాసి సుకవి రుద్రాక్షఫలమ**
**హత్వమింపుగ పద్యకావ్యము వచింపు**
**మని యనుజ్ఞ యొసంగఁదదాజ్ఞఁబూని**
**చెప్పఁదొడఁగితి నే ముక్తిసిద్ధికొరకు.**

క. **భూలోకనాకమనదగు**
**సాలూరు పురోపకంఠ సద్వేగవతీ**
**కూలోద్యానవనాంతర**
**ఖేలనరతుఁ బంచముఖుని గిరిధరసఖునిన్.**

**అంత్యము :-**

**మాలిని. అమృతకరకిరీటా యార్యదీనారకూటా**
**సమధిక వృషఘోటా స్వర్ణదీసిక్తజూటా**
**కమలభవకరోటా గాఢదీవ్యల్లలాటా**
**సమరజితనిశాటా జాంబవత్కాలకూటా.**

కులాలకులజుఁడైనను నీతని కవిత్వముత్తమ లక్షణములతో నొప్పి, చక్కని ధారాశుద్ధి కలదై యున్నది. ఈతడు చక్కని వేదాంతజ్ఞానమును, పాండిత్యముగూడ సంపాదించి, పలువురు శిష్యులకు బోధించుచునుండెను.

## IV. పోచిరాజు వీరయకవి (యను) కొలకలూరి వీరన: విభూతి రుద్రాక్షమాహాత్మ్యము

ఈ గ్రంథ మసగ్రమైనది. బ్రహ్మోత్తర ఖండమునఁ గల విభూతి రుద్రాక్ష మాహాత్మ్యముల నీ కవి ద్విపదరూపమున నాంధ్రీకరించినట్లు తానే యీ గ్రంథమున నిట్లు తెలుపుకొనెను.

**"కడఁగి బ్రహ్మోత్తరఖండ మధ్యమున**
**నలరు విభూతి రుద్రాక్ష మాహాత్మ్య**
**ములు రెండు ద్విపదగాఁ బూని రచింప**
**యోజించితిని సజ్జనోపకారముగ**
**రాజిల్లు త త్కథారంభమెట్లనిన**

వీరనకవి తన విభూతి రుద్రాక్ష మాహాత్మ్యమును బెజవాడలో నద్భుత మహిమలు చూపిన శ్రీపతి పండితారాధ్యుల కంకిత మిచ్చెను.

**గ్రంథప్రారంభము :-**

**శ్రీగురునాథు, సచ్చింతా సనాథు**
**యోగమార్గవిచారు, నుజ్జ్వలాచారు,**
**సాగర గంభీరు, జపతపోభీరు,**



**రాగదోషవిరాగుఁ, బ్రణవానురాగు,**
**భవకానన కృశాను, భావితేశాను,**
**భువనప్రసిద్ధు, విస్ఫుటమంత్రసిద్ధు,**
**కౌశికగోత్ర సంకలితు, నిస్తులితు,**
**దేశికోత్తమపూజ్యు, దృఢగుణప్రాజ్యు,**
**నాగలింగారాధ్యునకుఁ బుత్రుఁడైన**
**ధీగరిష్ఠుని, మహాదేవునిపౌత్రు**
**శంభులింగ సుపుత్రు సశివాక్షగాత్రు**
**శంభులింగార్చనాసక్తు నసక్తు**
**భసితని స్తంద్రు శ్రీపతి పండితేంద్రు**
**నసమప్రభావు, మహాదేవుఁదలఁచి,**
… … … …
**శ్రీశుభసంకాశు శ్రీభవానీశు**
**నీశు నీవని యగస్త్యేశ స్వరూపు**
**రూపు భావించి యారూఢిఁ గేల్మోగిచి,**
… … … …
**శాండిల్య తాపసేశ్వరగోత్ర భవుఁడు**
**పండితపౌత్రుఁ డాపస్తంబసూత్రుఁ**
**డాచరిత త్రినేత్రాచార విదుఁడు**
**పోచిరాజాన్వయాంభోధి చంద్రుండు**
**ఈవనిపురవాసుఁ డిష్టదైవముగ**
**శ్రీవీరభద్రుని సేవించు ఘనుఁడు"**

తాను చేసికొనిన వంశవర్ణనమునుబట్టి యీ కవివంశవృక్ష మిట్లున్నది.

**భద్రన మంత్రి (భార్య - ఎల్లాంబ)**
|
**వీరయామాత్యుఁడు (భా. కొండమాంబ)**
|
|------------------------------------------|
**వీరభద్రుడు** **భద్రుడు**
|
**వీరభద్రుడు (భార్య మూర్తిమాంబ)**
|
**వీరయకవి**

కవి తన్నుగూర్చి యిట్లు తెలుపుకొనెను.

**"ఉదిత శివోపాసకుండ**
**వీరకవీంద్రుండ, విశ్రుతాత్మకుఁడ**
**సార శైవాచార సంగ్రహపరుఁడ**
**నగుచు శివానుగ్రహ ప్రమోదమున**
**జగదీశ్వర కథాప్రసంగోక్తిఁదగిలి--**

భళ్ళాణ చరిత్రాదులను రచించిన కొలకలూరి వీరనకవియే యీ పోచరాజ వీరనకవి. పోచరాజు వీరి మూలపురుషుడు కానోపు. కొలకలూ రనునది యీతని నివాసగ్రామమైయుండి తన్మూలమున నీతిని వంశనామమున గూడ నేర్పడియుండును, ఈ కవినిగూర్చి విశేషముగ భళ్ళాణచరిత్ర సందర్భమునఁ దెలుపఁబడినది.

**కవివిషయము :-**

" **అని యి వ్విభూతి మాహాత్మ్యమిబ్భంగి**
**ననుదిన శివ సపర్యాసక్తుపేర,**
**నభియుక్తివీరశైవాచారుపేర,**
**శుభకరోద్యద్గుణ శోభితుపేర.**
**విజయవాటీపుర విభు కృపాలబ్ధ**
**నిజమహత్వోదార్య నిర్ణయుపేర,**
**పటుశమిశాఖా నిబద్ధ వస్త్రాంత**



**ఘటిత వైశ్వానరకల్పనుపేర**
**పంచాక్షరీమంత్ర భావనుపేర,**
**సంచిత భవ సమాచార మత్తద్వి**
**పాంకుశ భావు మహాదేవుపేర**
**నంకితంబుగ ప్రథమాశ్వాసమయ్యె".**

గ్రంథాంత మిట్లున్నది

**"వచ్చిన య మ్మునీశ్వరు గురున్ జూచి**
**యచ్చటివారితో నతిభక్తి మ్రొక్కి**
**యుచితాసనంబున నునిచి భూనాథుఁ**
**డుచితోపచారంబు లొనరించి పలికె**
**మునినాథ త్రైలోక్యమున మీ రొకింత**
**గనిన యద్భుతమేమి గలదది మాకుఁ**
**దెలుపుఁడు మీ వాక్యమది"........**

ఇట్లసంపూర్తిగానున్నదీ గ్రంథము. ఈ కవిది యీవనిగ్రామమని కొందరు భావించుచున్నారు. కొలకలూరున కీవని యని నామాంతరము గలదేమో. ఈ కవియు, ధర్మగుప్తాభ్యుదయ, భద్రాయుశ్చరిత్రల కర్తయగు కాశీనాథుని వీరారాధ్యుడును, ఈవని వీరభద్రకవియుగూడ శ్రీపతి పండితవంశ్యులని తెల్పికొనినారు.

## V. రెంటాల వీరనారాధ్యుఁడు - పంచాక్షరీమాహాత్మ్యము

రెంటాల వీరనారాధ్యకవి పంచాక్షరీ మాహాత్మ్యమును రచించి కందుకూరి వీరేశలింగమున కంకితమొనర్చెను. కృతిపతి వంశవర్ణన మిందధికముగా గలదు. ఈకవి పాలనారాధ్యుని పుత్రుఁడు. పట్టస వీరభద్రేశ్వరుని భక్తుఁడు. ఈ గ్రంథము పంచాక్షరీమంత్ర మాహాత్మ్యము నెఱిఁగించు కథాంశమైదాశ్వాసములలోగలదు. ఇందు మొదటి యిరువదినాలుగు పత్రములు పోయినవి. తర్వాతగూడ కృతిపతి వంశ వర్ణనము తుది పట్టును, కథారంభము పట్టును వ్రాయక విడువఁబడినవి, గ్రంథ భాగము కడవరకు గలదు. పొత్తము శిథిలమగుటచే కవినిగూర్చి యింతకంటె విశేష మెరుగరాదు.

అంత్యగద్య యిట్లున్నది -- " ఇది శ్రీమత్పట్టసాచల వీరేశ్వర కృపాకటాక్ష వీక్షణ సమాసాదిత సరసకవితా ధౌరేయ, సజ్జన విధేయ, రెంటాల కులపవిత్ర, పాలనారాధ్య పుత్ర, నిరంతరకృత పరమేశ్వరసపర్య, వీరనార్య ప్రణీతంబైన పంచాక్షరీ మాహాత్మ్యంబను మహాప్రబంధమునందు సర్వంబును పంచమాశ్వాసము.

**ప్రారంభము :-**

క. **భ్రమరాంబికా వధూమణి**
**రమణీయ గుణంబు లాత్మ రంజిల జేయున్**
**విమలమత(తి) మల్లి కార్జున (ను)**
**దమి....................**

శా. **మా వంశంబు పవిత్రమయ్యెను జగన్మాన్య స్ఫూర్తియౌ**
**శ్రీ వర్ధిల్ల సపత్ని నీకనుటచేఁజెల్వొందె నిద్ధాత్రిపై**
**దేవీ యక్కమ నీవు వచ్చుటకు నుద్దీపించె మద్భాగ్యముల్.**

వ॥ అని సన్నుతించి యేతచ్ఛుభకార్యంబున కంగీకరించి యా దంపతు లా పురంధ్రీ రత్నంబునకు బహుమానపూర్వకంబుగ ననేక దివ్యాంబరాభరణంబు లొసఁగి వీడ్కొలిపిన, నమ్మహాసాధ్వియును నిజపురంబు ప్రవేశించె, తదనంతరంబ వీరేశలింగంబు సకలవైభవ సమేతంబుగా వివాహమహోత్సవంబునకుఁ దరలివచ్చినఁ బరమానందభరితుఁడై నరసింహ సచివేంద్రుడు నమ్మంత్రికులగ్రామణికిఁ దన దుహితృమణి యగు బుచ్చమారమణిం బెండ్లిచేసిన...

**అంత్యము :-**

క. **సారతరధీర జనక**
**ల్హార సుధాధామ, షట్థ్సల జ్ఞానకళా**
**పారీణ వీరశైవా**
**చార మహానిపుణశీల, శౌర్యవిశాలా!**

కృతిపతికాలము చెన్నబసవపురాణ సందర్భమున నిర్ణయింపఁబడినది.



## VI. అక్కనార్యుఁడు, శివరాత్రిమాహాత్మ్యము

అక్కనార్యుఁడు విశ్వకర్మకులజుఁడు. ఇతఁడు తన శివరాత్రి మాహాత్మ్యమును శ్రీశైలమల్లికార్జునస్వామి కంకితమొనర్చెను. ఇతని తండ్రి మృత్యుంజయుఁడు; తల్లిపేరు అక్కమాంబ. ఈతని తమ్ముడు రాముడు. శివరాత్రిమాహాత్మ్యమునం దైదాశ్వాసములు గలవు. అందలి

**అంత్యగద్య :-**

" శ్రీమత్పరబ్రహ్మప్రతిభ నిశ్శంక నిరంకుశశ్లిష్ట యిష్ట ప్రాణభావైక ప్రసాద నిష్ఠాగరిష్ఠ లబ్ధ కవితావిశేష విశ్వజ్ఞ గోత్ర పవిత్ర, మృత్యుంజయబ్రహ్మ సత్పుత్ర, అక్కనార్య ప్రణీతంబైన శివరాత్రి మాహాత్మ్యంబను పురాణ కథయందు సర్వంబును పంచమాశ్వాసము"

ఈ కవి పునర్జన్మమును బాపుకొనుటకై ఈ గ్రంథమును రచించెనట.

ఉ. **లాలిత మోక్షదీక్ష శివరాత్రి మహత్త్వముఁ జెప్పఁబూని శ్రీ**
**శైలపు మల్లికార్జున విశాల యశస్సవిశేష వైభవో**
**ద్వేలిత శ్రీమహామహిమ దీప్యము విశ్రుతమొప్ప నాదిగన్**
**వైళమె చెప్పగావలయు వచ్చు పునర్జననంబు గప్పగన్.**

ఈ కావ్యమున తృతీయాశ్వాసమునందు సుకుమార చరిత్రము వర్ణింపఁబడెను.

గీ. **కాముకుండయ్యు ప్రాయపు కళలఁబొదలి**
**చేష్టలొక గొన్ని బన్నంగ చెలువలెల్ల**
**నరిగి దముఁదామె బొందంగ నభిలషించు**
**బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రాంగనలును.**

వ॥ ఇవ్విధంబున సకల సుకుమార కామినీజన విమోహ నిరతరతి ప్రచారుండునై సుకుమారుండు, మఱియు,

క. **పంచమ మహిళలు మొదలుగ**
**గొంచించక మోహమెనయఁ గోరికె దనపై**

మించగ పైఁబడ రతులను
వంచించక దేల్చు హీనవర్ణంబనకన్.

సీ. సంధ్యవార్చెడి హస్త సంజ్ఞలు చాలించి
చెలువల చేసన్న చేయనేర్చె;
మానాప్తి "ఓం భూర్భువస్స్వరోం" యన మాని
పొలతుల పంచల పొందనేర్చె;
అరుణోదయంబున నర్ఘ్యమిచ్చుట గూల్చి
యెదురు పడతుల రాల్లేయనేర్చె
గాయత్రి జపియించగాదని స్త్రీ వశ్య
కరవిద్య పారంబు సరణి నేర్చెఁ;

గీ. గోరి శివపాద తీర్థంబు గ్రోలు టుడిగి
యంగనాధరామృతపాన మాననేర్చె;
నాది యష్టాంగయోగము లడవిఁగడపి
సతుల చౌసీతిబంధముల్ సలుపనేర్చె.

చ. నగరమునందునుండు నెలనాగలు మోహపరిభ్రమావళిన్
దగిలి, పతివ్రతాచరణ ధర్మముదప్పియు, దమ్మునేలికొ
మగలను బొందు భోగములు మాని, మునింగి యనంగుఁజూచెడిన్
వగసుకుమారునిన్ మరఁగివచ్చి, రమించఁగఁ గాంచుభర్తలన్.

చ. దమదమ భార్యలందమరుదండనఁజేయఁగ నోడి తత్పురం
బమర వసించు సజ్జనులు నార్తమనంబుల భూమిపాలకున్
దమకముతోడఁ గాంచియు నుదగ్రతఁబల్కిరి, నీవునేలెడీ
క్రమమగు రాజధానిలొ నఘంబు ఘనంబుగ మించె వింటిరా.



క. ఎఱిఁగింపరాదు నీకును
నెఱిఁగింపక నూరకున్న నెఱుఁగవు, రాజ్యేం
దిరమదగరింత జడతను
నెఱిఁగింపఁగ వలసెఁబురికి నేలిక వగుటన్.

వ॥ అదియెటులంటేనియు గట్టలుకఁ జిట్టాడుచునెట్టకేలకు గుట్టు విడిచి మట్టులేక నిట్లనిరి.

చ. మదమున పోతరించి భవమంత్రితనూభవు మన్మథాకృతిన్
బొదలుచుఁబ్రోలిలోపలను బొంగుచు జారవినోదవిద్యచే
వదలక మా యశంబు లభిమానము, ధర్మము, రాణివాసమున్
జెదరఁగఁజేసె నెంతకని చెప్పను నెమ్మది సిగ్గుబుట్టెడున్.

ఈ కావ్యమున మనుచరిత్రాది గ్రంథములందలి యనుకరణములు గలవు.

## VII. తుమ్మలపల్లి నాగభూషణకవి -సోమవారవ్రతమాహాత్మ్యము -1

బసవవిజయమును రచించిన తుమ్మలపల్లి నాగభూషణకవి సోమవార వ్రత మాహాత్మ్యమును గూడ రచించెను. ఇది యేకాదశా శ్వాసములలో సంపూర్ణముగాఁ గలదు. మాధ్వుల కేకాదశివ్రతమెట్లు ముఖ్యమైనదో శైవులకు సోమవారవ్రతమంత ప్రధానమైనది. ఈ కవిని గూర్చి తద్రచిత బసవవిజయమందు తెలుపఁబడినది. సోమవారవ్రతమాహాత్మ్యమున నంత్యగద్య యిట్లున్నది.

"ఇది శ్రీపార్వతీసారంగేశ్వర వరప్రసాదలబ్ధసకలపండిత సుకవిజనసమ్మత, వీరమాహేశ్వరాచార, షట్థ్సలజ్ఞానవర్య, త్రిపురాంతక వరపుత్ర, నాగభూషణ నామధేయ ప్రణీతంబైనసోమవారమాహాత్మ్యంబను మహాప్రబంధంబునందున.. కథావృత్తాం తంబులు పద్యకావ్యంబు సర్వంబును నేకాదశాశ్వాసమయ్యె॥

**ప్రారంభము :-**

**ఉ. శ్రీపరమేశుపాదములు చిత్తములోనఁ దలంచి......**
**పాపవిదూరకాహ్వయుని, భక్తజనాశ్రయు, భర్గు, నీశ్వరున్**
**భూపతిసార్వభౌము, సురపూజితు, బాలశశాంకశేఖరున్**
**శ్రీపతిసేవితున్ విమలచిత్తయశోనిధి, ఫాలనేత్రునిన్.**
... ... ... ... ... ...

**గీ. ఆంధ్రదేశంబునందున నమరియున్న**
**ప్రాభవంబైన గుడివాడ పట్టణమున**
ప్రకటితంబైన తుమ్మలపల్లి వంశ
సంభవుండను నాగభూషణుఁడనేను
ఈ గుడివాడ పట్టణము కృష్ణాజిల్లాలో నున్నది.

## VIII. శ్రీ గిరిమల్లికార్జునస్వామి - సోమవారమాహాత్మ్యము-2

ఇది ద్విపదలో వ్రాయఁబడి సమగ్రముగానున్నది. పెక్కుచోట్ల ద్విపద, మంజరీ వికారమనదగు గేయరచనముగాఁ గానవచ్చుచున్నది. వ్రాతగూడ గానఫణితిని బట్టి చరణాంతములందు దీర్ఘస్వరములు వ్రాయఁబడినవి. అన్ని సోమవారముల కంటె మాఘ సోమవారము లధికమహత్త్వముగలవని యిందు నిర్దేశింపఁబడెను.

**ప్రారంభము :-**

**శ్రీసోమనాథుని శ్రీసదాశివుని**
**శ్రీమహాదేవుని శ్రీధరప్రియుని**
... ... ... ...
**పంచాక్షరీమంత్రఫలమిచ్చు శివుని**
**పదివేలభంగులఁ బ్రస్తుతిఁజేసి,**



**అని సూతముని ఋషులకంతయు నేను**
**తేటతెల్లంబుగా తెలిపెద వినుము,**
**ఘన సోమవారంబు ఘనత వర్ణింతు**
**వేదశాస్త్రములందు వెలసిన వ్రతము**
**అది సంస్కృతమౌట యంతయు నేను**
**తెలియంగ లెస్సగాఁదెలుఁగు చేసెదను**
**ఫాలాక్షుభక్తులు పాటించి వినుడి**
**కర్ణామృతంబైన కథలు చెప్పెదను**
**ఆ కథాసూత్రంబు నదియెట్టి దనిన.**
... ... ... ...

**అంత్యము :-**

**తల్లియుఁదండ్రియు నయలన్నయపుడు**
**శివుని సాలోక్యంబుఁజేరి తానద్రీ**
**అని నంది నాథుండు నా వశిష్ఠునకు**
**వినిపించె నయలన్న వృత్తాంతమంత**
**ఘనసోమవారంబు కథ విన్నవారు**
**ధరణిఁగృతార్థులై ధరయేలు మఱియు**
... ... ... ... ...
**అని సూతమహాముని యార్యులకెల్ల**
**వినిపించె సోమవారవిఖ్యాతచరిత**
**మఱియు శ్రీగిరిమల్లికార్జునస్వామి**
**వెలయంగఁజెప్పెను విఖ్యాతచరిత**
**ధరణిలో నాచంద్రతారార్కముగను.**

## IX. సోమవారవ్రతమాహాత్మ్యము:- 3 (గ్రంథకర్త పేరు తెలియదు)

ఇది గూడ ద్విపదలోనే గలదు గాని శ్రీమల్లికార్జునకవి కృతికంటె భిన్నమైనది. ఇది యాద్యంతరహితముగ నుండుటచే దీని కర్త యెవరో తెలియరాదు ఇందు కార్తీక సోమవారమాహాత్మ్యము ప్రతిపాదింపఁబడిన కథలు గలవు.

ప్రారంభము :-

ద్వి. **"గంధపుష్పాక్షతల్ కరమొప్పఁబూని**
**యేకార్తి పంచార్తి యెలమి ధూపార్తి,**
**సవినయంబుగలెస్స యవిచేతఁబూని**
**పంచమహావాక్యప్రభలు మ్రోయఁగను"**

... ... ... .... ...

**అంత్యము :-**

ద్వి. **" వెనుకకుఁబోరోరి వెఱ్ఱిరాకాసి**
**వెరతునా నీ వాడు వెఱ్ఱిమాటలకు,**
**తలదుంటెను తలబ్రద్దలౌనె (?)**
**మఱుమాయజోగివై మహిమీద నీవు**
**బ్రతుకకుండఁగ నిన్ను భస్మంబుగాను**
**శపియింతుఁజూడరా శివుకృప నాకు ॥మొ॥**

## IX. ఈవని వీరభద్రకవి - 4 (సీమంతినీకథ) అను సోమవారమాహాత్మ్యము

ఈ కవి శ్రీపతిపండితారాధ్యుని వంశములోనివాఁడని తెల్పుకొనినాడు. శ్రీపతి పండితుడు విజయవాటీపురవిదితసంచారుడు. కృష్ణవేణీతీరకేళీవిహారుడు, ఇంద్రకీలాఖ్య పర్వతముఖ్యానవ్యశృంగాలో కననిలోలలోకుడు, నాగలింగారాధ్య



పౌత్రుడు, శ్రీమహాదేవుని పుణ్యతనూజుడునని కవి వర్ణించినాడు. పోచిరాజు వీరకవి గూడ శ్రీపతిపండితుని గురించి పై విధముగనే వర్ణించినాడు. ఈవని పురవాసియైన పోచిరాజు వీరకవియు, ప్రస్తుత కవియైన ఈవని వీరభద్రకవియు బందుగులేమో విచారింపవలసియున్నది.

వీరభద్రకవి బ్రహ్మోత్తర ఖండములోని సోమవారమాహాత్మ్య కథనే (సీమంతినీ కథ) యను నామాంతరముతో ద్విపదకావ్యముగ రచించెను. ఈకవి తండ్రి పేరు శంభుసద్గురుడు, తల్లిపేరు లింగాంబ.

# సప్తమప్రకరణము - ప్రబంధములు

## గౌరన: నవనాథచరిత్రము

ఈ కవి క్రీ. శ. 1440 -50 ప్రాంతమున శ్రీనాథుని యంత్యకాలములో జీవించియుండును. ఈతని నవనాథచరిత్ర శివకథలతోనిండి ద్విపదలో వ్రాయఁబఁడినది. ఈ కవిది గౌతమగోత్రము. ఈతఁడు సింగయమాధవనృపాలుని మంత్రియైన పోతరాజుకు తమ్ముఁడైన అయ్యలు మంత్రి కొడుకు. ఈతడు హరిశ్చంద్రచరిత్రమును నవనాథచరిత్రమును ద్విపదలో రచించెను. నవనాథులనగా 1. శివుడు 2. మీననాథుడు, 3. చౌరంగి, (సారంగధరుఁడు) 4. గోరక్షనాథుఁడు, 5. మేఘనాథుడు, 6. నాగార్జునుడు,7.సిద్ధబుద్ధుడు, 8. విరూపాక్షుఁడు, 9. కణికుడు, అను నవసిద్ధులు. పైవారిలో చివరి అరుగురు దేశాటనము చేసి శిష్యులకు దమవిద్యల నను గ్రహించిరట.

నవనాథచరిత్రమును గౌరనకవి శ్రీగిరి రచించిన పద్యప్రబంధము నను సరించి ద్విపదగా వ్రాసెనని చెప్పుకొనెను. కాని యాగ్రంథము గూర్చిగాని యాకవిని గూర్చిగాని తెలియరాదు. నవనాథచరిత్రము కుహనాబిరుద జైనకోలాహల రాయగురు శిఖామణి; బిజ్జలరాయమానమర్దన, సన్నాహగజపతి సప్తాంగహర, అను బిరుదులు గలిగినట్టి శ్రీశైలమల్లికార్జునస్వామి, సర్వసామ్రాజ్యభారనిర్వాహకుడు, శైవదీక్షాగురుడు, సకల కర్ణాటకమండలాధీశరమా విలసనుడు, సర్వభాషావిశేషకోవిదుడు నగు నట్టిముక్తి శాంతి భిక్షావృత్తిరాయడనే వీరశైవగురువుమీఁది భక్తితో, నతనికి ననవరతాభ్యు దయాభివృద్ధియును, తపోరాజ్యసౌఖ్య ప్రసిద్ధియును, గలుగునట్లు రచించి గ్రంథము శ్రీగిరి మల్లికార్జునస్వామి కంకిత మొనర్పఁబడినది. ఇందైదాశ్వాసములు గలవు. దీనిని చెన్నపురి విశ్వకళాపరిషత్తువారు ప్రకటించిరి. ఈ గౌరనకవి హరిశ్చంద్రచరిత్రమును గూడ ద్విపదలో రచించెను.

**గ్రంథప్రారంభము :-**

ద్వి. శ్రీసర్వమంగళాంచితవామ భాగు
భాసురభక్తాను పాలనోద్యోగు
పరమయోగీంద్ర హృత్పద్మషట్చరణు,



నుడుజటా (జూటాగ్రయుతశీతకి) రణు
నిగమాంత సంస్తుత్య నిత్యస్వరూపు
ధగధగిత ప్రభాతతమేరుచాపు
.... ..... ..... .....

**ముక్తి శాంత భిక్షావృత్తిరాయప్రశంస:-**

"శ్రీమహనీయ ప్రసిద్ధిపెంపెసఁగు
శ్రీమల్లికార్జున శ్రీమహాలింగ
సర్వలోకోత్తమ సామ్రాజ్యభార
నిర్వాహకప్రౌఢి నీతికోవిదుఁడు
కుహనాంబరధ జైనకోలాహలుండు
మహితబిజ్జలరాయ మానమర్దనుఁడు
సన్నుతశైవదీక్షాగురుండసమ
సన్నాహగజపతి సప్తాంగహరు
... ... ... ...
... ... ... ...
అవిరళ యోగవిద్యానిధి యపర
శివమూర్తి సంతతాశ్రిత కల్పతరువు
ఘన ముక్తిశాంత భిక్షావృత్తిరాయఁ
డనుపమంబైన మహావైభవంబు
... ... ... ...

**కృతికర్తప్రశంస :-**

ఇప్పుడు గల సుకవీంద్రులలోన
సరససాహిత్యలక్షణ వివేకముల
సురుచిర మధురవచోవిలాసములఁ
గులశీలములను సద్గుణకలాపముల
నలవడ్డవాఁడెవ్వఁడని విచారించి

సింగయమాధవక్షితిపాలమంత్రి
పుంగవుఁడై యొప్పు పోతరాజునకు
ననుజాతుఁడగు నయ్యలామాత్యుకూర్మి
తనయు డుత్తముఁడు గౌతమగోత్రజుండు
భ్రమరాంబికావర ప్రాప్తవిచిత్ర
విమలసాహిత్య ప్రవీణాధికుండు,
ననఘచిత్తుఁడు గౌరనాహ్వయఖ్యాతుఁ
దనసముఖమునకుఁ దగఁబిలిపించి
... ... ... ...

అంకితము :-

సన్నుత నవనాథచరితంబు ద్విపద
కావ్యంబుగాఁజెప్పి కమలజవిష్ణు
సేవ్యమానునకును శ్రీశైలపతికి
శంకరునకు బాలశశిశేఖరునకు
నంకితం బొనరింపు మనుచు
... ... ... ...

కథాప్రారంభము :-

శ్రీమల్లికార్జున శ్రీమహాదేవు
పేర నే నొనరించు ప్రియకథాసూత్ర
మేరీతి ననిన మున్నెల్ల కాలమును
శ్రీకరంబై, సుప్రసిద్ధమై, సర్వ
లోక సంస్తుత్యమై, లోచనానంద
జనకమై, బహుసుఖాస్పదమై, విచిత్ర
వినుత నానామణి విస్ఫురత్కోటి
విమలకుందాది సువికచప్రసూన
సముదయనర పారిజాత సుజాత
... ... ... ...



గ్రంథాంత్యము :-

ఘన ముక్తిశాంత భిక్షావృత్తిహృదయ
వనజప్రభాత దివాకరుపేర,
నభిమతార్థప్రదాయకుపేర, నిత్య
శుభమూర్తి మల్లికార్జునదేవుపేర,
నారవితారశశాంకమై వెలయు
గౌరనా మాత్యపుంగవ కృతంబగుచు
నను వొందు నీ నవనాథ చరిత్ర
మనుకావ్యమునఁ బంచమాశ్వాసమయ్యె

మచ్చునకు శైలిని మేఘనాథసిద్ధుని కథనుండి చూపుదును.

"పొలఁతియుఁదానును బుత్రుఁడుఁగూడి
కొలనిలోపలికి డిగ్గుచునుండ వచ్చి
పెలుచ గర్జించుచుఁ బెటపెట మొరసి
పడు మహీసురు తలపైఁబడి నురికి
వడి విప్రకుని (మెడ) వాతనుబట్టి
గడువాడి కోరల గఱచిన నొగుల
నొడలు నెత్తుటఁదోఁగి యో మహాదేవ
యనుచు నేలకు వ్రాలునాత్మేశు నార్త
నినదము న్విని భీతినెక్కొనఁబాఱు
పణఁతిఁ జంపఁగ వెంటఁబడు వాలుమృగము
కణఁక వీక్షించి దిగ్గన నమ్ముదొడగి
యనువొంద దృఢముష్టినమరించి విల్లు
కొనలుమోవఁగఁదెగఁ గొని దృష్టి నిలిపి
మాఁగి తానొక మ్రానుమాటుననుండి
తూఁగనేయుటయు నద్భుతముగా నిగిడి,
... .... ... ... ...
మనుజనాయకుఁడు బ్రాహ్మణున కిట్లనియె

యేనొక్క నృపుఁడ మహీదేవతిలక
పూని కొలనిజలంబులను నేఁగ్రోలఁ
గొలనిలో, దిగఁబోయి కూలకుంజమునఁ
బులిఁబొడగని యేయఁబూని యున్నంత
నీవు పుత్రుండును నెలఁతయు నీరు
ద్రావ నేతెంచి ముందటఁబరికించి
కనుగొననేరక ఘనతరవ్యాఘ్రు
మున కెదురై తి రా పులి యంతఁబోక
వెస నీవధూమణి వెంటఁబట్టుటయు
మసల కేసితి దాని మహిమీఁదఁగూల,
నీవంటి బహుపుణ్యనిధి కిటువంటి
చావయ్యెనే యని సంతాపమందు
భూవరుఁజూచి యా భూసురోత్తముఁడు,
చావులు లేవనఁజనదు చర్చింప
దేవతలకునైన దీనికి నడల
నీ వాలుమృగముచే నిట్టి దుర్మరణ
మగుటకు వగచెద నాత్మలో ననుచుఁ
దగిలి యేడ్చుచునున్న తనయు వీక్షించి
తనయుఁడగ్గరఁబిల్చి తన్ముఖాంబుజము
తనయురంబునఁజేర్చి తార్కొన నెత్తి
యన్న నే నడిపెడి యాచారవిధులు
సన్నుతమతిఁ బూని జరుపుమీవింక
నలయక వేదశాస్త్రాభ్యాస నిరతి
సలుపుము, దినమును సజ్జనగోష్ఠిఁ
బాయక యతిథి సపర్య లెప్పుడును
జేయుము, సుకృత సుతృప్తులఁబొంద
నెల్లభూతంబులయెడ దయ మీఱ
నుల్లసిల్లుము"



శ్రీ కృష్ణదేవరాయల కాలమందలి యాంధ్రకవులు పురాణాంతర్భాగములైన యుపాఖ్యానములను, కథలను ప్రపంచించి ప్రబంధములు రచించినట్లుగ, బసవపురాణాది వీరశైవ పురాణాంతర్గత కథలను గైకొని తర్వాత కవులు కొందఱు మూల కథను విపులీకరించి ప్రబంధములుగ రచించిరి. ఇట్టి కథలలో విశేషముగ రసవంతములైనవి శివలీలలైన గంగావివాహము, భల్లాణచరిత్రము, సిరియాళ చరిత్రము మొదలైనవి. వీనియం దంతటను భక్తియే ప్రధానముగ నుండును. ఈ కథలనే మఱి కొందరు కవులు యక్షగానములుగాఁగూడ రచించిరి. విశాలాంధ్ర వాఙ్మయమున ప్రబంధముల కెట్టి గౌరవము చెల్లినదో వీరశైవాంధ్ర వాఙ్మయమున వీనికి నట్టి గౌరవము గలదు.

## II. కూచిమంచి తిమ్మనకవి

ఈ కవి యనర్గళమైన కవితాధార కలవాఁడై బహుగ్రంథములను రచించినాఁడు. ఆధునిక కవులలో సలక్షణమైన యిన్ని గ్రంథములను మృదుమధుర శైలియందు రచించిన యితరులు లేరు. ఈతడు రచించిన యితరశైవకావ్యములు శివలీలావిలాసమను గంగావివాహమును, రాజశేఖర చరిత్రమును భల్లాణ చరిత్రమును ఇవికాక నీలాసుందరీ పరిణయము, అచ్చ తెలుగు రామాయణము, రసికజనమనోభి రామము, మొదలైనవి రచించినట్లుగా నీ క్రింది పద్యమున కవియే యిట్లు చెప్పి కొనినాడు.

సీ. ప్రౌఢిమై రుక్మిణీ పరిణయంబును, సింహ
　　శైల మాహాత్మ్యంబు, నీలపెండ్లి
కథయును, రాజశేఖరవిలాసంబును
　　నచ్చతెనుంగు రామాయణంబు;
సారంగధర సరేశ్వర చరిత్రంబు స
　　ర్పార్ణవ సంగమాహాత్మ్యము మరి
రసిక జనమనోభిరామంబు, లక్షణ
　　సారసంగ్రహమును సర్పపుర స

గీ. మంచిత క్షేత్రకథనంబు, మఱియుఁ బెక్కు
శతక దండక సత్కృతుల్ ప్రతిభఁ గూర్చి

యుల్లమలరార పార్వతీవల్లభునకు
భక్తి నర్పణఁజేసిన భవ్యమతిని".

అని శివలీలావిలాసారంభమునఁ దెల్పుకొనెను. ఈతడు రచించిన గ్రంథములలో మొదటిది రుక్మిణీ పరిణయముగను, చివరిది శివలీలావిలాసముగను గనఁబడుచున్నది. రుక్మిణీపరిణయము తర్వాత భల్లాణచరిత్రమును రచించెను.

ఇతడు A.D. 1690 ప్రాంతమునఁ బుట్టి 1757 ప్రాంతమున మరణించి దాదాపు 70 సం॥ జీవించియుండవచ్చును. ఈ కవి గోదావరి మండలములోని పిఠాపుర సంస్థానములోని కందరా గ్రామమునకు కరణమైనట్లు లక్షణసారసంగ్రహ మందలి యీ క్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

సీ. కౌండిన్యగోత్ర విఖ్యాతుండఁ గూచిమం
చ్యన్వయాంభోధి నీహారకరుఁడ.
గంగనమంత్రి శేఖరునకు నంగనా
మణియగు లచ్చమాంబకును సుతుఁడ
బహుకావ్యనిర్మాణ బంధురప్రతిభుఁడఁ
గుక్కుటేశ్వరకృపాంకూరలబ్ధ
సత్కవితామహా సామ్రాజ్య భారధౌ
రేయుఁడ బుధజనప్రియచరితుఁడ.

గీ. దెందులూరిలింగారాధ్యదేశికేంద్ర
దత్త మాహేశ్వరాచార్య వృత్తిరతుఁడ
కందరాడ ఘనగ్రామ మందిరుండ
తిమ్మకవి చంద్రుఁడను జగద్వినుతయశుఁడ॥

పై పద్యమునుబట్టి యీ కవి కౌండిన్యగోత్రుడనియు, గంగన తండ్రియని, తల్లి లచ్చమాంబయనియు, దెందులూరి లింగనారాధ్యుని శిష్యుడనియు, వీరశైవ దీక్షను గ్రహించినవాడనియు, కుక్కుటేశ్వరస్వామి కృపచే కవిత నేర్చినవాడనియు దెలియుచున్నది. "పీఠాపుర మందిరునకు శ్రీ కుక్కుటేశ్వరునకున్" సమర్పణంబుగా



నని శివలీలావిలాస షష్ఠ్యంత పద్యములలో రచింపఁబడుటచే నీ దేవుని దేవాలయము పిఠాపురమందున్నదని తలంపవలయును.

ఈ కవి గ్రంథరచనా ప్రారంభకాలమున పిఠాపురమునకు రావు మాధవరాయ నృపతి రాజుగానుండెను. ఈతఁడే కవిసార్వభౌమ బిరుదమిచ్చినట్లు రసికజన మనోభిరామములోని 'సీ॥ నిఖిలవిద్యాభ్యాసనిపుణుడు' అను పద్యమువలన దెలియుచున్నది. పిఠాపుర సంస్థానములో నున్నను నీ కవి యొక గ్రంథమైనను రాజుల కంకితము సేయకుండెను, తన కావ్యమును నరాంకితముచేయుట యందలి విముఖత్వమును సింహాచలమాహాత్మ్యమందలి "క॥ నృపులకుఁ గావ్యంబు లొసగిన" అను పద్యమున దెలిపియున్నాడు. కాన నితఁడు శివభక్తుడై పిఠాపురమందలి కుక్కుటేశ్వరస్వామికే తన గ్రంథముల నన్నియు నంకితమిచ్చెను. ఇతఁడు శివభక్తుఁడైనను శివకేశవ భేదమును పాటింపని స్మార్తుఁడే.

ఈతని రచనలో నచ్చు తెలుగు పదములు విశేషముగా నుండును. ఈతని ప్రథమ కృతియగు రుక్మిణీపరిణయ మెక్కువ ప్రౌఢముగ నున్నను, మిగిలినవి పురాణపాకమున నున్నవి. ఈతని కవిత్వమున శబ్దాలంకారములు శ్లేషలు విశేషముగ నున్నను చమత్కారకల్పన లంతగాలేవు. ఈతఁడు గ్రంథరచనమున సుమారు నలుబది సంవత్సరములు గడపెను. ఈ కవికి సంతతిలేదు. ఇతడు కడపటికాలములో నింగ్లీషువారికి ఫ్రాంసువారికిఁ గలిగిన యుద్ధములలో కందరాడ మీదుగా సేవలు రాకపోకలు చేయుటచే భయపడి యా యూరు విడిచి చంద్రమపాలెమును నివాసముగాఁ జేసికొనెను. ఈ కవి వంశమువారిప్పటికి నీ పట్టణముననే కలరు.

## 1. శివలీలావిలాసము

కవి దీనిని శాలి శ. 1678 లేక **A.D.1756** సంవత్సరమున 31 దినములలో రచించెనట. ఇది రెండాశ్వాసముల పద్యకావ్యము. ఇందు శృంగారము ప్రధాన రసము. ప్రథమాశ్వాసమున శివుడు గంగను శిరమందుంచుకొనుటకును, గంగ విష్ణుపాదమున జనించుటకును గల కారణములు తెలుపఁబడినవి. తర్వాత గంగ జాలరికన్యయై యామెను శివుడు వివాహమాడుట వర్ణింపబడినది.ఏలూరుపురమున శంఖదేవుడను జాలరి గలడు. అతని భార్య చక్రమదేవి. వారలకు గంగ తనయ.

ఒకనాడు జాలరి సముద్రతీరమున వేటాడఁబోగా నా ప్రాంతమునఁ దపముచేయు గంగాకన్యను గాంచి, యింటికిఁ దెచ్చి తనయఁగా బెంచికొనును. యౌవనవతియైన యామె యొకనా డుద్యానవనమందుండగ శివుడు జంగమవేషమున నామెను గాంచెను. వారు పరస్పర ప్రేమగలిగి వివాహమాడుదురు.

ద్వితీయాశ్వాసమున గంగను వివాహమాడినందులకై కినిసి పార్వతి, కైలాసమునకుఁ దిరిగివచ్చిన శివుని నిష్ఠురోక్తులాడును. ఈ యాశ్వాసమందలి పార్వతీపరమేశ్వరుల సంభాషణమును, గంగా గౌరుల సపత్నీ కలహమును బహు రమణీయముగను, చమత్కారముగనున్నవి. ఇట్టి రమణీయ కవిత్వమును కూచిమంచి తిమ్మనార్యుడు తన కావ్యములం దెక్కడను వ్రాయకపోవుటయేకాక, మిగిలిన యాంధ్ర వాఙ్మయమునఁ గూడ నిట్టి చమత్కార రచనము స్వల్పముగనే యున్నది. తిమ్మనార్యుని కవిత్వము క్రమముగా పరిణతికివచ్చి చివరికావ్యమైన దీని యందు పరిపక్వము నొందినదని చెప్పవచ్చును. వీరశైవాంధ్ర వాఙ్మయమందు మాత్ర మిట్టి చమత్కారమైన రచన యరుదే. లేదనియే చెప్పవచ్చును. ఈ క్రింది పద్యములు పార్వతీ పరమేశ్వరుల సంభాషణమందలివి.

క. "పర్వేందువదన విను నే
సర్వజ్ఞుఁడ, నహహ మేలు, సర్వజ్ఞునిపై
నుర్విని జను లెవ్వారు న
ఖర్వమతిం దలగిపోరు కద పరికింపన్.

గీ. నీలకంఠుఁడ నే హరినీలవేణి
నీ చెలిమిఁ గోరుకొనివచ్చి నిలిచినాఁడ
నౌర మేల్నీలకంఠుడ వైతివేని
కేక లిడుకొంచు వేగంబె గిరికిఁజనుము.

క. క్రీడాకిరాతుఁడను నే
చేడియ యటులైన నీవు జింకలు, పులులున్
క్రోడంబులు గల యడవికిఁ
బోడిమితో వేటలాడఁ బొమ్మా నెమ్మిన్.



సీ. అబల నే పశుపతి, నహహ నీవట్లైన
నాలమందకు అంకె లడరఁజనుము;
స్థాణుఁడ నేను కంజాక్షిరో, యబ్బబ్బ
మోడు మాటాడుట చూడమెందు;
ఖురసంహరుఁడ నేను బొలఁతి, నీవట్లైనఁ
మా వీట నుండక మరలిపొమ్ము;
పన్నగధరుఁడను బడఁతి నే, నట్లైనఁ
బడిగెఁలెత్తుచు నూళ్ళ బడి తిరుగుము;

గీ. భూతనాథుఁడ నేను బూఁబోడి, యట్టు
లేని, నల ప్రేతభూముల కేగు మిపుడె;
కుటిలకుంతల నేఁ మహానటుఁడ, నట్టు
లైన ప్రభువులకడ కేగి యాడుమెలమి.

క. చిగురాకుఁబోడి వినుఁ నే
నగవాసుఁడ, నట్టులౌదవినన్ ఱెక్కలతో
గగనమున కెగసి చెట్లకు
జగతస్థితి నిలువఁబోక చనుమా వేగన్.

గీ. విను విరూపాక్షుఁడను నేను, వనజవదన,
అహహ బుధులు విరూపాక్షుఁడై నవానిఁ
జూడరాదని తఱచుగ నాడుచుంద్రు,
తొలఁగి వేంచేయుమిఁకఁ బెక్కు పలుకులేల?

సీ. ననబోడి నా మాట నమ్మకుండితివేనిఁ
జెనకిఁ బెబ్బులివాతఁ జెయ్యినిడెద,
గట్టిగాఁబెనుపాము పట్టి యాడించెద
విషమైన మ్రింగెద వెరపు లేక,

కొరుగక వడి పెద్దగుడిసొచ్చి నిలిచెద,
నవలీల గోపదం బంటుకొనెద,
నంకిలి లేకుండ నగ్గి ధరించెదఁ
బట్టుగా ద్విజరాజు ముట్టుకొనెద;

గీ. మఱియు నే బాసయైన నేమమునఁజేతు,
గాన నిఁక నీ తలంపులో మాని మాని
నీశిరోమణి నన్ను మన్నింపు మిప్పు
డెలమి తోడుత గదియించి యేలుకొనుము."

ఈశ్వరుడు లోనికి వచ్చినతర్వాత పార్వతి యాతని వైవాహికచిహ్నములఁ జూచినపుడు వారి సంభాషణమిది.

క. పసుపును, కుంకుమ, గంధము
నసమాంబక నీదు మేన నట్టువదలి యే
బిసరుహముఖి యంటించెనొ
కసరక నాతోడ నిపుడు గట్టిగ చెపుమా!

క. విను మానిని జను లందరు
వెనకయ్యను బూజసేయ వెస నాతఁడు నన్
బెనఁగి కవుంగిటఁ బొదవిన
తనువున నవి యంటుకొనియె దప్పే నాకున్?

క. హాటకగిరి నీ మెయినీ
గాటుక యంటిన ద దేమి కారణ? మబలా
కాటుక కాదిక లత్తుక
గాటపు గరళ ప్రభావికాసము సుమ్మీ!

గీ. కాలకంధర నీ మోవిగంటులేమి
కారణంబున నొదవె, నా గౌరి వినుము,
మరునితోడ నెదిర్చి సంగరమొనర్చు
తఱిని గోపించి కీరంబు కఱచెఁజుమ్మి!



క. పన్నగ రాజాంగద నీ
కన్నుల కెరుపేలఁ గలిగె? గౌరీ! భక్తుల్
నన్నర్ధరాత్రివఱకున్
నన్నున జాగరణమునిచినం బొసఁగె నిటుల్.

## 2. భల్లాణచరిత్ర (రాజ శేఖరవిలాసము) -1

కవి యీ కావ్యమును కవిత్వరచనారంభకాలములో రచియించి యుండును. అందుచేఁగాఁబోలు కవిత్రయేష్టములుగాని ప్రయోగములు గొన్ని యిందుగలవు. ఇది మూఁడాశ్వాసముల గ్రంథము. కవి యీ భల్లాణరాజుకథను బసవపురాణము నుండి గ్రహించెనని మూడవయాశ్వాసమున యిన్నూటమూడవ పద్యమున నిట్లు రచించెను.

సీ. రమణీయ బసవపురాణోక్తమైన యీ
భల్లాణరాయ భూపాలచరిత
వినిపించు క్రమమును బని మీర నా నేర్చు
విధమున రచియించి విమలభక్తిఁ
దనర మీకొసఁగితి".......

క. నరులకు కృతులిడి తామి
ద్ధరణిం గవివరులు సంపదల బొందుదురొ
నెఱి నిహపర సుఖములకై
యురుబుద్ధిని నీకు కావ్య మొసగితి నభవా" -- ఆ III. 204

పారమార్థిక చింతగల యిట్టి కవి నీతిబాహ్యమైన యతిశృంగారభూయిష్ఠమైన యీ కథనేల గ్రహించెనో తెలియరాదు.

**కథాసారము:-** సింధుదేశాధీశుడును, పరమశైవుడు నైన భల్లాణుడనువాడు తన గురువు ననుమతితో నిష్ఠదానమను నొక వ్రతమును జేసి జంగముల కేది యడిగిన దాని నిచ్చుచుండెను. అంత వివిధ దేశములనుండి యనేక జంగములు వచ్చి వారి కోరిక లన్నియు రాజు వద్దనుండి నెరవేర్చుకొనుచుండిరి. ఈ వృత్తాంతమును నారదునివలన విని శంకరుడు కైలాసమునుండి బయలుదేరి భల్లాణరాజును

పరీక్షించుటకై వచ్చెను. వచ్చిన యా జంగముని రాజు భక్తితో పూజించిన పిమ్మట నా కపటజంగముడు తలకొక వేశ్యను కోరెను. రాజెంత బ్రతిమాలినను నట్టి కోరికె మానడయ్యెను. రాజ్యమంతయు నిచ్చెదనని చెప్పినను వినడయ్యె. అంత ప్రతిజ్ఞా భంగభీరువగు నా రా జతనికోర్కె నెరవేర్చుటకై వేశ్యకొరకై నా యూరంతయు వెదకి శివమాయచే నెక్కడ నెవరినప్పుడు గానక తన భార్యను నమ్మించి, ఒప్పించి యామె నా జంగముని యొద్దకు వేశ్యగాఁబంపును. మాయాజంగముడాతని సత్య సంధత్వమునకు భక్తికి మెచ్చుకొని ప్రత్యక్షమై వారందరకుఁ గైలాసమిచ్చును.

ఈ కవి పూర్వకవుల రచనల ననుకరించెనని ఈ క్రిందిపద్యములు దెల్పును

**మ. అరవిందోదర తుల్య పుణ్యయుత కార్యారంభసంరంభ వి**
**స్ఫురితాకీర్ణ దృఢాంతరంగ మితరంబుల్ గోరుటల్ నేర్చునే**
**చిరగీర్వాణ తరంగిణీవిమల వీచీజాల లీలా నిరం**
**తర సంతోషిత రాజహంస మిరవొందంజేరునే వాఁగులన్.**

పైపద్యము పోతనార్యుని ' మందారమకరంద' యను పద్యభాగమును పాల్కురికి సోమన బసవపురాణమందలి తృతీయాశ్వాసారంభ ద్విపదపంక్తులను బోలియున్నది. మఱియు, ద్వితీయాశ్వాసమందలి 133-142 పద్యములు మనుచరిత్ర, విజయవిలాసాది కావ్యములందలి పద్యముల ననుకరించినట్లు గనబడుచున్నవి.

ఈ క్రిందిపద్యమునుబట్టి యితడు చక్కని కల్పనాశక్తిగల కవి యను భావమును గల్గించుచున్నాడు.

**మ. గురుపత్నిన్ వరియించు ద్రోహి తను గన్గొరాదటంచున్ సుధా**
**కరు రాకల్ మదినెంచి పద్మిని సువక్త్రంబుంగడు న్వంచె న**
**ట్లరయం బుణ్యవధూమణుల్ ధరణి నత్యంతో గ్రదోషాత్మునిన్**
**సరవి న్గన్గొన నొల్లకుందురుగదా చర్చింప నెంతేనియున్.**

ఈ కవి చేసిన వృద్ధ వేశ్యావర్ణమెంతయు స్వభావోక్తితో నొప్పి హాస్యరస భూయిష్ఠముగ నున్నది.



**సీ. ఇల ప్రాతచెప్పు టట్టలఁబోలి వ్రేలాడు**
**కుచముల రవికచేఁ గుదియబట్టి;**
........... ......... .............. ........

**గీ. అడుసు కన్నులఁ గజ్జలం బడరదిద్ది**
**బోసి నోటను తమలంబు పూని యిటుల**
**విటుల పలుమారు నగఁజేయు వృద్ధవేశ్య.** III. 71

ఈతని కవితాశైలికి పైనఁజూపిన పద్యములు చాలు ననుకొందును.

## II. వాలేశ్వరుడు - భల్లాణచరిత్ర - 2

వాలేశ్వరకవి పాకనాటినియోగి, గౌతమగోత్రుడు, పోలయామాత్యునికిఁ బుత్రుడు, పోతరాజు పౌత్రుడు, ఇవ్వటూరి రామనారాధ్యునికితఁడు శిష్యుడు. ఈ కవి నివాసస్థలము కృష్ణామండలములోని విన్నకోట సీమ యందలి మల్లవరమైనట్లీ క్రింది పద్యము తెల్పును.

**మత్తకోకిల. సన్నుతంబగు నట్టివేల్పు ప్రసన్నుఁడై మముఁ బ్రోవఁగా**
**విన్నకోట విలాతిలో కడువేడ్క మల్లవరంబునన్**
**పన్నగేశ్వర సుప్రతిష్ఠను భక్తరక్షణ చేయుచున్**
**వన్నెమీరఁగ నాగలింగమనన్ వసించు మహోదయన్॥**

ఈ కవిత భల్లాణ చరిత్రమును మల్లవరమందలి నాగేశ్వరస్వామి కంకిత మిచ్చెను. ఈ గ్రంథారంభమున విఘ్నని, విఘ్నేశ్వర సరస్వతులనుగూడ స్తుతించెను. ఈ కవి యే కాలమువాడో నిశ్చయముగాఁ దెలియదు. కందుకూరి వీరేశలింగముగారు తమ యాంధ్రకవుల చరిత్ర తృతీయ భాగమందితడు క్రీ. శ 1700 ప్రాంతమువాఁడై యుండునని వ్రాసిరి. భల్లాణచరిత్రయందలి యంత్యగద్య యిట్లున్నది.

**అంత్యగద్య :-**

"ఇది శ్రీమదివ్వటూరి రామనారాధ్య గురుచరణ సరసీరుహ షట్పదాయమాన, సరసకవితాచాతుర్య, విద్యాను సంధాన, పరమమాహేశ్వరాచార పక్ష, మల్లవరపు

రాధ్యక్ష, గౌతమ గోత్రపవిత్ర, పోలయామాత్యపుత్ర, పోతరాజపౌత్ర, సంతతానంద విధేయ వాలేశ్వరనామ ప్రణీతంబైన భల్లాణ చరిత్రంబను మహాప్రబంధంబు నందు సర్వంబును పంచమాశ్వాసము.''

ఈకవి తన్నును, తన వంశాదులనుగూర్చి కావ్యమున నిట్లు వర్ణించుకొనెను. గురువునుగూర్చి,

గీ. **అనఁగ వెలసెను మిగుల ప్రఖ్యాతిగరిమ**
**నెంచ నారాధ్యమాత్రుఁడే యివ్వటూరి**
**రామనారాధ్య మౌళి సర్వజ్ఞమూర్తి**
**యట్టి సద్గురునాథున కంజలెత్తి.**

సీ. **అనఁ, బాడ, జదువఁజెప్పనునేర్చు సర్వజ్ఞ**
**భోజుండు మా తాత పోతరాజు**
**బహుపురాణజ్ఞుండు బాంధవాశ్రితకల్ప**
**భూజంబు మా తండ్రి పోలమంత్రి,**
**పరమ శాంతుఁడు కృపాపాథోధి మాపిన**
**తండ్రి విరూపాక్ష దండనాథుఁ**
**డఖిల విద్యానిధి యర్థార్థితతిఁ బ్రోచు**
**దాత మత్సుతుఁడు సదాశివుండు**

గీ. **నే వితర్కింప వరకవితావిశేష**
**వదనుఁడను బాకనాటింటివాఁడ శుద్ధ**
**శైవుఁడను, గౌతమసగోత్ర సంభవుండ**
**నెంచఁదగు మల్లవరపు వాలేశ్వరుఁడను.**
… … … … …
… … … … …

క. **స్వర్గధునీమస్తున కప**
**వర్గ ఫలప్రదున కధికవాత్సల్యునకున్**
**భర్గునకు మనస్తోత్రా**
**నర్గళునకు మల్లవరపు నాగేశునకున్.**



వ॥ నమస్కార పూర్వకంబుగా నే సమర్పింపఁబూనిన భల్లాణ చరిత్రమను మహాప్రబంధంబునందు, విభూతిధారణఫలంబును, పంచాక్షరీ మాహాత్మ్యంబును, గాశీక్షేత్ర ప్రభావంబును, గంగోత్పత్తియు, తారక బ్రహ్మనామ నిరూపణంబును, రుద్రాక్ష మాహాత్మ్యంబును, శివార్చనా ప్రకారంబును, హరనారదసంభాషణంబును, సదాశివుడు గౌరితో బల్లహు జన్మంబును, వివాహంబును, రాజ్యపరిపాలనంబును నెఱింగించుటయు, మిండజంగమ వేషమున భల్లాణునికడకు నీశ్వరుండేతెంచి, వనితా సంగమం బభిలషించి వచ్చితిననుటయును, బుణ్యాంగనాజనమార్గంబును, ధనాభిరామంబును, వీరచోడవు చరిత్రంబును, మహాదేవునకా నృపుడు తన సతిందెచ్చి యిచ్చుటయు విరచింపఁబడియె.

పై వచనమునుబట్టి కవి భల్లాణచరిత్రయందు వీరశైవమతప్రధానములైన విభూతిధారణఫలాదివిషయములను గూడ నిందుకూర్చినాడు. ఈతని కావ్యమందు కొన్ని చమత్కారకల్పనలుగల ఘట్టములఁ జొనిపినాడు. విభూతిప్రభావ వివరణమున కవి యీ క్రింది కథనుగల్పించి చమత్కరించినాడు. ఈతని కవితాశైలికూడ రసవంతముగనున్నది.

క. **ఆ రాజధానియందున**
**చోరుం డొకరుండు గలఁడు, శూరుఁడు, భయదా**
**కారుఁడు, జైనకులోద్భవుఁ**
**డారూఢిగ పరధనాపహారుం డనఁగా.**

సీ. **తలపుతాళంబులు తరలించుమాలికల్**
**వాగ్బంధనక్రియావరణభూతి,**
**తలముల్లశిఖనుమెత్తని మైనములుబంతి**
**కన్నంబు వాతికి గాలిచీరె,**
**దేహవంచనమును దివియార్పుపురువులు**
**కుక్కలకును బొక్కుకూటికళ్లు,**
**గాలి నంజనమును గత్తెరరంపంబు**
**కన్నంపుఁ గత్తియు గద్దగోరు**

**గీ.** **రాకడయు పోకడయు గానరానియట్టు**
**పాదరక్షలు తేలును బామునెదుట**
**మసలకుండంగ జంపేటి మంత్రములును**
**జోక గావించి యెలమిని చోరుఁడుండె.**

**ఉ.** **కాటుకకొండ చందమున గాఢతమః ప్రబలత్వమొందె నల్**
**చోటులనీర్లు గప్పుకొని సూక్ష్మతగౌరవమిఱ్ఱుపల్ల మే**
**పాటునెఱుంగరాక బహుభంగులదోఁచు నమాస చీఁకటిన్**
**గ్రేటుచునేగుదెంచె నడురేయిని చోరుఁడు కన్నపెట్టగన్.**

**గీ.** **ఇట్లు చనుదెంచి పురవీథులెల్లఁదిరిగి**
**ధనికుగేహంబులంద మంతనము లరసి**
**కటికవానిల్లు నాఁటికి గన్న పెట్ట**
**వాఁ డు మేల్కాంచి యొయ్యనవచ్చిగడను.**

**ఉ.** **కన్నపుమూఁతగాంచి తమకంబున చోరుఁడు గేహమంతయున్**
**సన్నకుఁజన్నమ్రుచ్చిలి వెసంజన డగ్గరి వాడికైదువం**
**కన్నులరక్తధారలొగి క్రమ్మరఁగ్రమ్మి ధనంబు గ్రమ్మరన్**
**చిన్నము పోవకుండ పరిశీలత చేకొని వానినుద్ధతిన్.**

వ. కొరప్రాణంబులతో ధరణింపొరలంగనుంగొని

**గీ.** **రాచదొంగ చంపెరావిండటని తన**
**ధనము ప్రాణమునకుఁ దగదె గంగ**
**జూడ గూఢచరులు జూచి రాజుకుఁజెప్ప**
**నని దలంచి వాని నతిరయమున.**

**గీ.** **దాలిగుంటతిరము త్రవ్వచక్కగ పాతె**
**చోరువరధనాపహారి గడఁగి**
**యచట భూతిసోకినంత పవిత్రుఁడై**
**శివపురంబుకరిగె చెలఁగి యతఁడు.**



ఇట్టి రచనయందు దేవతామాహాత్మ్యములేకాక, కవితాలక్షణమైన చమత్కారము గూడ గలుగుటచే, కావ్యసిద్ధియునేర్పడినది. మరియు ధారాశుద్ధి గలిగి యుండుటచే వివిధకవులు రచించిన భల్లాణచరిత్రములలోనిది యుత్తమమైన దనియుఁ జెప్పవచ్చును. ఇది గూడ నింక ముద్రింపఁబడలేదు.

## III. పోచిరాజు వీరనకవి లేక కొలకలూరి వీరన భల్లాణచరిత్రము -3

కొలకలూరి వీరన కృష్ణా మండలమందలి కొలకలూరుగ్రామనివాసి, ఈతఁడు వీరభద్రమంత్రిపుత్రుడు, తల్లి మూర్తిమాంబ, ఇతడు పోచిరాజవంశ్యుడు. ఈతడు క్రీ. శ 1700 సంవత్సరము ప్రాంతమువాడుగాదగును. ఈతనిది కౌండిన్య గోత్రమని కందుకూరి వీరేశలింగముగారు వ్రాసిరిగాని, భల్లాణ చరిత్రాంత్యగద్యయందు శాండిల్యసగోత్రమని యిట్లువ్రాయఁబడినది.

**అంత్యగద్య :-**

ఇది శ్రీమదగస్త్యేశ్వరవరప్రసాద లబ్ధకవిత్వ ప్రసిద్ధ శాండిల్యసగోత్ర ప్రవిత్ర, వీరభద్రమంత్రిపుత్ర సహజపాండిత్య వీరనామాత్య ప్రణీతంబైన భల్లాణచరిత్రంబను మహాప్రబంధంబునందు తృతీయాశ్వాసము.

ఈతఁడు వ్యాసకాళిదాసాది సంస్కృతకవులను నన్నయాది తెలుగు కవులను స్తుతించెను. వీరనకవి తన భల్లాణచరిత్రమును బందరుపురములో నున్న చిత్రకార (ముచ్చి) కులజుఁడైన నాము మొగ్గన్న ప్రేరణమున నీశ్వరాంకితముచేసినాఁడు. ఈతఁడు క్రీ.శ 1775-1800 ప్రాంతము వాఁడైయుండును. ఈ కవి **ఖండక పాలాఖ్యానమని** నామాంతరముగల **మనువంశపురాణమును** రచించి బెజవాడలోని మల్లేశ్వరస్వామి కంకితమిచ్చెను. కవి బందరు నిట్లు భల్లాణచరిత్రమున వర్ణించెను.

**సీ.** **శ్రీకంఠవైకుంఠ సేవావికుంఠవం**
**దారుమందిరము బందారుపురము,**
**నిరతోత్సవైశ్వర్య నికరాభిభూత బృం**
**దారకపురము బందారుపురము**

సంతతాయాత యాచకజన వ్రాతమం
దారభాసురము బందారుపురము
సకల వర్ణాశ్రమాచార సంపత్సమం
దారతి భరము బందారుపురము

గీ. శిల్పినర్తక వర్తక చిత్రకార
సూత్రకారాది వివిధ విచిత్రకృత్య
దానధర్మ పరప్రజోత్కర చకోర
కార విందారకరముబృందారపురము.

ఉ. ఆ పురి నుంద్రు దాముకలజాఢ్యులుఁ మౌక్తిక సంప్రదాయు లు
ద్దీపితకీర్తిలోలు, రతిథిప్రియశీలురు, శూలిపాదపూ
జాపర తంత్రమంత్రగుణశాలు, లఘాటవికీలు, లర్థధ
ర్మోపకృతి స్వభావమతి యుక్తులు చిత్రవిధానశక్తులున్.

కవివంశమును దెల్పు పద్యములివి.

సీ. శాండిల్యగోత్ర సంజనితుఁ డాపస్తంబ
సూత్రపావనుఁడు, భూసురుఁడు నగుచుఁ,
పోచిరాజనుమంత్రి పుంగవుఁ డుదయించె
నాతఁ డీవనిపురం బాదిగా, ద
శగ్రామములకధిప గ్రామణిత నొందె
నతనిపేరఁదదన్వయజులు పోచి
రాజువారన నొప్పి రోజమై నతని వం
శంబున భద్రాఖ్యసచివుఁ డుదితుఁ
గీ. డయ్యె నా ఘనుఁడెల్లాంబయందు వీర
నాహ్వయునిఁ గాంచె నతఁడు కొండాంబయందు
వీరభద్రుఁడు భద్రుఁడునా రసజ్ఞు
లగు కుమారులఁ గనియె నుదారమతుల.



క. ఆ వీర భద్రమంత్రికి
నా విమలమతి సాధ్వీమూర్తిమాంబికకును నే
నా వీరభద్రుపేరను
మావరు కృపఁబుట్టితిం గుమారాగ్రణినై.

గీ. ఎవనికింగ్రోశయుగమున నెనయు కొలక
లూర వెలసినయట్టియా వీరభద్రుఁ
డాత్మకులదైవమగుఁగాన నతని పేర
నలరితినిఁ గొల్కలూరి వీరన్నయనఁగ.

ఈ కవి శ్రీనాథునివలె చిన్నతనమునుండి యనేక కావ్యములు రచించినట్లుగ నీ క్రింది పద్యమువలనఁ దెలియుచున్నది.

సీ. పదునాలుగగు నేట మొదల కృష్ణార్జున
సంవాదము ప్రబంధసరణినయ్యె,
పదునెన్మిదగునేటఁ బంచకావ్యము లాంధ్ర
పద్యకావ్యములుగాఁబరిఢవిల్లె,
ఇరువదిరెండవయేట విభూతిమా
హాత్మ్యంబు ద్విపదకావ్యముగ నొప్పె
ఇరువదియారగునేట మార్కండేయ
చరితంబు రచితమై సంఘటిల్లె,

గీ. ముప్పదగునేట మనువంశముఖ్యనృపపు
రాణము ప్రకల్పితంబయి ప్రకటితమయె
ముప్పదారగునేట శ్రీముక్తదేవు
కథ కథితమయ్యె నాచేత కౌశలమున.

తే. సంస్కృతంబైన శంకరాచార్యవిరచి
తంబు నానందలహరి, సౌందర్యలహరి,

భర్తృహరికృతమైన సుభాషితమును
శతకములుగాఁగ మత్రృకల్పితములయ్యె.

కాని పైన తెల్పిన కావ్యములలో ననేక మిప్పుడు గానరావు. ఈతని కవిత్వ శైలి కీ క్రింది పద్యములు.

సీ. కురులు చక్కగ దువ్వి శిరమున సిగవేసి
కనకంపుతాయేతుల్ గట్టి పొగడ,
పూదండ సవరించి భూతిరేఖ యమర్చి
కస్తూరితిలకంబు తీర్చి, దిద్ది
వలపులభసితంబు వన్నెగా మెయిఁ బూసి
పసిఁడి యంచుల దట్టిపొగజుట్టి
యురుసజ్జలింగంబునుతి జన్నిదములును
మురువుముద్రలు తియ్యమోవికాట్లు,

గీ. వక్కలాకులు, సచ్చి శాల్వల్లెవాటు
చెక్కునునుగోటి జీరలు, చెంపలందు
గంధమును కజ్జలపు చుక్క కాలగజ్జె
యందె పెండెరమును దాల్చియంత మఱియు.
.... .... ..... ..... .... ....

ఉ. వచ్చు విటస్వరూపుఁడగు వాని శివున్ బురవీథిచూచి పౌ
రోచ్చయమెల్ల నచ్చెరువునొంది, ధరాస్థలి నిట్టివాని మే
మెచ్చటఁ జూడ మీ హొయలు, నీ సొగ సీ వగ, యీవిలాస మీ
గ్రచ్చుతనంబు నీ తనువికాసము నెవ్వరికైనఁ గల్గునే?

ఉ. అంకము లేక షోడశకళాన్వితవిగ్రహుఁడయ్యేనేని యే
ణాంకునితోడ నీ సురుచిరాంగుని బోల్పఁగనర్హమౌ, నిరా
తంకత నీశనేత్రశిఖిదగ్ధుఁడుగాక శరీరియైన మీ
నాంకుని తోడ నీ విలసితాత్ము సమానునిఁజేయ నొప్పగున్.



క. భూకల్పతరువు నీసు
శ్లోకుని సౌందర్యమనెడి సుమనోగుచ్ఛం
బాకర్షింపుచునున్నది
లోకములో సతులచిత్తలోల మధుపముల్.

సీ. ఈ పల్లవునిఁ జూచి యే పల్లవాధరి
యైన పైఁబడి వెంట నరుగకున్నె?
దృఢచిత్తయైన నారీమణి యయ్యెనా
యది యేల యొరువెంట నరుగ దలఁచు?
సుందరుండగు పురుషునిఁజూచి యే పువ్వు
బోడి దా మోహంబు పొందకుండు?
మనుజమాత్రునికింత మహిమమేటికిఁ గల్గు?
కేవల మీతండు దేవుఁడరయ,

గీ. వేధయో, మాధవుండో, యుమాధవుండొ
యింద్రుఁడో, చంద్రుఁడో, కుసుమేషుఁడొక్కొ
ఈతఁ డెవ్వఁడొ యే యందు యెరుగరాదు
సన్నుతశ్రీ ప్రకాశింపుచున్నవాఁడు॥

సీ. అబ్జ జుఁ డందుమా హంసవాహము లేదు,
పరికింప నీతఁడు బ్రహ్మ గాడు,
జలజాక్షుఁడందుమా శంఖచక్రములు లే
వరయంగ నీతండు హరియు గాఁడు
పశుపతియందుమా ఫాలనేత్రము లేదు
చింతింప నీతఁడు శివుఁడు గాఁడు,
విబుధేశుఁడందుమా వేయిగనులు లేవు
వర్ణింప నీతఁడు వజ్రి గాఁడు,

గీ. **కమలరిపుఁడందుమా కళంకంబు లేదు**
**రూఢిగా నీతఁడమృతకరుండు గాఁడు,**
**దర్పకుండందుమా యిక్షుధనువు లేదు,**
**తలఁపనీతఁడు మీనకేతనుఁ డు గాఁడు.**

వ॥ అదియుఁగాక మఱియొక విచారంబు గలదు వినుఁడు.

క. **భల్లాణవిభుని భక్తియుఁ**
**దెల్లమ సత్యంబునరయ శివుఁడిబ్భంగిన్**
**తెల్లముగ వచ్చినాఁడని**
**యుల్లంబున నిపుఁడు దోఁచుచున్నది తనకున్.**

వ. ఇది తథ్యంబ యని యిట్లు పౌరకామినులు పరస్పరంబు బహు విధంబుల భాషింపుచుండ నమ్మాయావిటుండైన మహానటుండు మహావిభుకొల్వు మొగసాల రయంబునఁ బ్రవేశించి నిలిచిన -- ఆ II.

## IV. బసవన్న:- భల్లాణచరిత్రము (4)

ఈ గ్రంథప్రతి కాకినాఁడ యందలి యాంధ్రపరిషత్ పుస్తకభాండాగారమందు మాత్రమే గలదు. మరియొక ప్రతి యున్నట్లు గానరాదు. ఇది ద్విపదలో రచింపఁ బడినది.

## V. నింబాద్రిదాసు:- భల్లాణచరితము (5)

ఇది కూడ ద్విపదలోనే వ్రాయఁబడినది. వ్రాతప్రతి కాకినాడ యందలి యాంధ్రపరిషత్ పుస్తకశాలయందు మాత్రమే గలదు. ఇతరత్రా దీని ప్రతి గానరాదు.

## VI. చిత్తారు గంగాధరుఁడు, భల్లాణచరిత్రము- (6)

గంగాధరునకు పెనువెళ్ళ, చిత్తారుపదము లుప పదములుగాఁ జేర్పఁ బడినవి. ఇందులో నొకటి గ్రామనామమును నింకొకటి యింటిపేరు నైయుండును. ఇతడు జాలరి కులజుడు. ఈతడు భల్లాణ చరిత్రము, సిరియాళ చరిత్రము, గంగా



వివాహమును ద్విపదలలో రచించెను. కాని యితని రచన చాల పేలవముగను నీరసముగ నున్నది. కవిత్వ మర్మము గాని ఛందో వ్యాకరణ విశేషములుగాని యీతనికిఁ దెలియనట్లు తోచును. పాండిత్యము, కవితాశక్తి లేని ఛందోబద్ధరచన యీతని కావ్యములందు గనఁబడును. ఈతని రచనను గూర్చి సి.పి. బ్రౌనుదొరగారు భల్లాణచరిత్ర వ్రాతప్రతియం దిట్లు వ్రాసినారు. "ఈ కావ్యము జబ్బుగానున్నది. యతులు, ప్రాసలనుగురించి సూత్రములు తెలియని కవి చెప్పినది పనికిరాదు."

ఈ కవి తల్లితండ్రులు మల్లమాంబికావీరయ్యలు. భల్లాణచరిత్రమును శ్రీ రాజవీటియందలి వీరభద్రస్వామి కంకితమిచ్చెను. ఈతడు 17 వ శతాబ్దమువాడుగా గనుపించుచున్నాడు.

**గ్రంథప్రారంభము :-**

ద్వి. **శ్రీగురు లింగసంచిత నిర్మలాంగ**
**భోగీంద్రకేయూర పుణ్యసంచార**
**పరమకృపాలోల భక్తవిలోల**
**కరిరాజమదభంగ కామభస్మాంగ**
... ... ... ... ...
**కరమర్థి బసవన్న గనుగొని మ్రొక్కి**
... ... ... ... ...
**హర్షించి వీరేశు కర్పించుకొఱకు**
**పురణింప భల్లాణభూవరుచరిత**
**తెనుఁగున ద్విపదగా తెల్లమిపరతు**
... ... ... ... ...
**మరునిభ వీరయ్య మల్లమాంబికకు**
**వరపుత్రుఁడగువాఁ డు వంశవర్ధనుఁడు**
**ఘనమైన చిత్తారు గంగాధరుండ"**
... ... ... ... ...

**అంత్యము :-**

**భల్లాణరాయ భూపాలుని చరిత**
**... ... ... ...**
**విరివైన శ్రీ రాజవీటి నివాసు**
**పరమాత్ము శ్రీ వీరభద్రుని పేర**
**కరమర్థి నిర్మించె గంగాధరయ్య**
**విరచితంబైనట్టి విఖ్యాతమైన**
**యీ పుణ్యచారిత్ర మెవ్వారు విన్న**
**కైలాసపురిని నివాసులై యుంద్రు"**

కాని యీ గ్రంథ మతి రమణీయముగ మద్రాసులో గంటి సూర్యనారాయణ శాస్త్రిగారిచే చాలాకాలముక్రిందటనే ముద్రితమైనది. రచనావిధానమును దెలుపుటకై యీ కావ్యమునుండి కొన్ని ఘట్టముల నిచ్చి యాయా భాగములనే కూచిమంచి తిమ్మనకవి తన పద్య భల్లాణ చరిత్రయం దెట్లు వ్రాసెనో స్పష్టపఱతును. మాయా జంగముడు భల్లాణుని వేశ్యనడుగుట,

**"జననాథ నా మాట చక్కగా వినుము,**
**పనికిమాలినదాని, బానిసదాని,**
**నుర్వీశ తెప్పింప నొల్లను సుమ్మి,**
**గర్వాంధురాలైన కాంత నేనొల్ల**
**మిక్కిలి పొడవైన, మిగులఁగుర్చైనఁ**
**బెక్కుమాటలదైన, బోదగొట్టైన**
**ఇచ్చ యెరుగనిదైన, నెడ్డెదియైన,**
**నిడుదపండ్లదియైన, నిద్రపోతైనఁ**
**బడు చండ్లదైన,దూబరదిండియైన**
**పద పుడిగినదైన, బడుగుదియైన,**
**గొడవపోతైన, నింకుడు చండ్లదైన**
**చెండిపోతైన, ( దుచ్చెపులాగుదైన,**



**గండ క్రొవ్వినదైన, గడుసురాలైనఁ**
**జిఱ్ఱుతలైనను చెమటకంపైన,(**
**దెఱ్ఱినోటిదియైన తిండిపోతైన,**
**చొల్లు నోటిదియైన, సోమరి యైన**
**నల్లరూపుది యైన, నాతి నే నొల్ల**
**వినయంబులేనిదై వేడ్కలు మాని,**
**ధనవంతురాలైన దాసి నే నొల్ల,**
**విటునిచే ధనమంది వేమఱి యొక్క**
**విటునికిఁ జేసాచు వేశ్య నేనొల్ల,**
**కలహించి విటునకుఁ గౌఁగిలీయకయ,**
**మలకలుపెట్టెడు మగువ నే నొల్ల,**
**చెక్కిటఁ జెయిసేర్చి చిన్నపోవుచును**
**మొక్కలంబైయుండు ముదిత నే నొల్ల,**
**బసరమ్మువలెఁ బర్వుపైఁ బవ్వళించి**
**బుసకొట్టుచున్నట్టి పొలఁతినే నొల్ల మొ.** **- ఆ I**
**... ... ... ... ...**
**... ... ... ... ...**

ఈ భాగమునే కూచిమంచి తిమ్మనార్యుడు తన భల్లాణ చరిత్రమున నెట్లు పద్యములలో రచించెనో తిలకించెదముగాక.

**సీ. ధనగర్వమునఁ బల్లవునిఁ దృణాకృతిలీల,**
**గణనసేయని, పెట్లకత్తెగాక,**
**కలహించి వేడుకకాని నెంతయు నెగ్గు**
**లాడుచునుండు గయ్యాళిగాక,**
**నెమ్మది యొరునిపై నిల్పి మారుని కేళి**
**నలరఁదేలింపని తులువగాక,**
**ప్రేమచేఁ బిలిచిన బేల యట్టుల బల్క,**
**నొల్లని మాయలం బెల్లిగాక,**

గీ. యొకనిచే విత్తమంది వేఱొకనితోడఁ,
గలిసి వర్తించు బల్దోసకారి గాక,
పూని యేప్రొద్దు నిద్దురపోతు గాక,
మదటయునుగాక, పరికింప మలినగాక.

గీ. విటునితోఁగూడి యున్నట్టి వెలఁది గాక,
బానిసయు రోగియును గాక, పాపి గాక,
బేలయును గాక తగ మగనాలుగాగ,
యున్న వాల్గంటిఁదెప్పింపు ముర్వినాథ.

గీ. విను చిత్తిని, శంఖిని, హ
స్తిని, పద్మిని, యనెడు నాల్గుతెఱఁగుల సతులం
దునఁ బేరెన్నికయగు ప
ద్మిని గావలెఁజుమ్ము మాకు మిహిరకులేశా! -అ III(40-42)

మఱియొక ఘట్టమును పరామర్శించుదము. భల్లాణరాజు మాయా జంగముని యొద్దకుఁ దన భార్యనే వేశ్యగాఁజేసి పంపునపుడు జనులనుకొను మాటలివి. ఈ క్రిందిది గంగాధరుని ద్విపదరచన.

ద్వి. భూనాయకునిబుద్ధి పూరినిమేసె,
నేనాటి జంగమో యీ ప్రొద్దు వచ్చి,
లంజెనడ్గినఁదాను లంజె లేదనక
కొంజకాతనిభక్తి కొదువకాకుండ,
నిల్లాలి వేశ్యగా నిచ్చుచున్నాడు,
చెల్లునా, యిది యేమి? చిత్రమన్నారు,
నొక్కతయైన నేఁడుర్వీశ్వరుండు
నక్కటా, జంగాని కతఁడేల యిచ్చు,
నిద్దరుగాక నా యిరువురియందు,
నొద్దిక చాలక యుండగాఁజూచి,
ఇచ్చుచునున్నవాఁ డిపు డిటువంటి



కుచ్చితభక్తియుఁగొనసాగఁ గలదె
ఇచ్చిన నిద్దరి నీవలెఁగాని,
యొచ్చంబు గాదటె యొకతెనీయంగ,
ననుచు నిట్టుల కొంద రాడుచునుండ
మనకేల యీ మాట మానుఁడన్వారు,
నా జంగమయ్యయు నా జనవరుని
దేజీలు గజములు దివ్యాంబరములు
నన్నంబు సొమ్ములు నడుగనొగాక,
యెన్నఁగ వేశ్య దా నెటువలె నడిగె,
నీ రాజవరుడు దా నీయకొంటెట్లు
వారకామిని లేక వచ్చి యీవేళ
నాలిని దానిచ్చు టది యెంత ఘనత
ఆ లతాంగియు నేమి నడ్డగింతలును
వేయక పతివెంట వేశ్యయై నడవ
నా యింతి భక్తి యెంతని యాడువారు
... ... ... ...
... ... ... ...

ఈ భాగమును కూచిమంచి తిమ్మనార్యుడు పద్యరూపమున తన భల్లాణ చరిత్రమున నిట్లు రచించినాఁడు

సీ. ధారుణీశ్వరుబుద్ధి పూరి మెసంగెఁబో,
సరఁగ నెందుండియో జంగ మొకఁడు
చేరి వారాంగనఁగోరిన తఱినియ్య
గొనగొని యెచ్చటఁ గొరవకాని,
తన భక్తి చెడకుండ పనివడి వేశ్యగా
నిల్లాలిని నొసంగె నిట్టి చిత్ర
మొప్పెడు ననువారలొక కొందఱును భళా,
చాన యొక్కతయైన మానవేంద్రుఁ

గీ. డేటికి నొసంగు ముద్దియ లిద్ద అగుటఁ
జేసి వారలు తమలోనఁ జెలఁగిపోరు
చున్నఁ గన్గొని యిపుడిచ్చుచున్నవాఁడు
గాని నిక్కంపుభక్తి కా గలదె యిటుల?

క. ఇచ్చిన నిరువుర నొక్కట
నచ్చంబగు భక్తితోడ నర్పింపక యీ
కుచ్చితములు తగవనుచున్
మెచ్చక యొకకొంద ఱేమి మేలనువారున్.

చ. పురములు వాహనంబులును భూషణముల్ధనధాన్యము ల్నవాం
బరములు పాడిధేనువులుఁ బ్రార్థనసేయక జంగమయ్య యే
తెఱఁగున వేశ్యఁగోరె, నతిధీరత నట్లతఁ డింతిఁ గోరినన్
ధరణిపుఁడెట్టు లియ్యకొనె దానని పల్కెడువారు కొందఱున్.

క. ఇయ్యకొని వారసుందరి
యెయ్యెడలం గల్గకున్న నిల్లాలి నిటుల్
చయ్యన నొసఁగుట ఘనతయె
యి య్యిల పతికనుచుఁగొంద ఱెన్నెడువారున్.

సీ. ఆ సరోరుహనేత్రయైన గాదన కిట్లు
పతివెంట వేశ్యయై భవ్యగతిని,
జనినంత భక్తియే యనువారు గొందఱు
గట్టిగా భక్తిమార్గంబు పూని
నప్పుడే భక్తుండు చెప్పినవిధమెల్లఁ,
జేసిన నిల్లాలు సేయకున్న,
యదియ పో చిత్తిని యనువారు గొందఱు,
సతికి భర్తకు నొకమతియ యైన



గీ. గల్గు నభిమత మిది కల్లగాదు నృపుఁడు
నీల నీజంగమునకు నిల్లాలినెసగు
హరుని మెప్పించి బొందితో నరుగఁగలఁడు
సరఁగ గైలాసమున కెల్లజనులు నెఱుఁగ.

క. అనువారును గొందఱునై
కనుగొన నవ్వేళనృపతి కాంతామణిఁ దో
డ్కొని చని యల జంగమ రా
యని సన్నిధి నునిచి యిట్టులనియెన్ బ్రీతిన్".--

**III(146- 151)**

పై విధమున రెండు గ్రంథములందలి భావములు నొకే తీరుగ నున్నట్లు స్పష్టమగుచున్నది. దీనినిబట్టి యొకరి గ్రంథము నింకొకరు చూచియుందురని యూహింపవచ్చును. అందు గంగాధరుడు విద్యావంతుడైన కవిగా గనుపింపడు గాన కూచిమంచి తిమ్మనార్యుని రచనను గంగాధరుడే చూచి ద్విపదరూపమునఁ గూర్చెనని యూహించుటయును సంభావ్యముగనే తోఁచును. మనకు దొరికిన యైదు భల్లాణ చరిత్రలలోను వాలేశ్వరుని రచన యుత్తమమైనదిగను, గంగాధరుని వ్రాత యధమమైనదిగను, మిగిలినవారి కూర్పులు  సాధారణమైనవిగను గనుబడుచున్నవి.

## 2. గంగావివాహము

గంగావివాహమను  నీ మంజరీద్విపదకావ్యమును చిత్తారు గంగాధరుడు రచించి చరిచకోడూరి పురమున వెలసిన రామేశ్వరస్వామి కంకితమిచ్చెను. ఈ కథనే కూచిమంచి తిమ్మనకవి శివలీలావిలాసమను పేర పద్య ప్రబంధముగా రచించెను. ఈ కథ స్కాందపురాణాంతర్గతమైనదని కవి యిట్లు తెల్పుచున్నాడు.

"స్కాందపురాణాది కథల నున్నట్టి
యీ గంగకళ్యాణ మెవ్వరునైన"

గ్రంథ ప్రారంభము :-

ద్వి. శ్రీకర సత్పూత్ర శంభువరపుత్ర
కాకోదరస్తోత్ర కాళికాపుత్ర
సోమార్క శశినేత్ర సుస్థిరగాత్ర
బ్రహ్మాండ చారిత్ర పరమ పవిత్ర
కామిత ఫలదాక్ష కరుణాకటాక్ష
దక్షగర్వితశిక్ష ధర్మసంరక్ష.
... ... ... ... ...
శైవమార్గములన్ని చేకొని తెలిసి
గంగావివాహంబు గలదు సంస్కృతుల
తెలుఁగున ద్విపదగా తెల్లగఁబఱచి
శాస్త్రయుక్తముగాను జాణత తనర
చరిచి కోడూర్పురీ క్షేత్రనివాసు
రామేశ్వరుని కృతిరాజుగాఁజేసి
వినిపింతు మద్వంశవిధమెట్టిదనిన ---

అంత్యము :-

ద్వి. "ఈ పుణ్యచారిత్ర మీశ్వరుపేర
శివకోడూర్పురక్షేత్రనివాసి
కరమర్థి నర్పించె రామేశ్వరునిపేర
కరమొప్ప చిత్తారు గంగాధరయ్య
విరచితంబుగ సర్వవేదోక్తమైన
స్కాందపురాణాది కథలనున్నట్టి
యీ గంగకళ్యాణ మెవ్వరునైన
చదివిన విన్నను సర్వేశుకృపను
సిరియు నాయువు గల్గి చెన్ను మీరుచును
... ... ... ... ...
... ... ... ... ...
ఆచంద్రతారార్కమై యుండునెలమి.



## 3. సిరియాళ చరిత్రము

ఈ ద్విపదకృతిని గంగాధరకవి రాచవీటి వీరభద్రున కంకితమిచ్చెను.

ప్రారంభము :-

ద్వి. శ్రీకరంబైనట్టి సృష్టిభాగమున
ప్రాకటంబుగ బ్రహ్మపదమును మీరి,
పురణింప వైకుంఠపుర మవనిఁగూడు
మురియుచు కైలాసమునకు సమానము
కడురమ్యమగు శివకంచియు గలదు
పుడమిలోపల మహాపుణ్యక్షేత్రంబు
... ... ... ... ...
... ... ... ... ...

అంత్యము :-

ద్వి. సంతోషమున నుండె సత్యకాలమూను
అని యిట్లు సూతుండు ఆ శౌనకాది
మునులకు వినిపించె, ముదముతో నేను
నాపాలి శ్రీగురునాథునిపేర
... ... ... ...
... ... ... ...
విరివికెక్కిన రాచవీటి నివాసు
పరమాత్ముఁడగు వీరభద్రునిపేర
సిరియాల కథ నేను సేవ్యమానమూన
కరమర్థినర్పింతు ఘనమైనవాఁడ
మరునిభూరీరయ్యమల్లమాంబికాకు
వరపుత్రుఁడగువాఁడు వంశవర్ధనూడు
కరమొప్ప వెనవెళ్ల గంగాధరుండ
విరచితంబిది సర్వ వేదోక్తమైన

యీ పుణ్యచారిత్ర యిష్టమయ్యేవారు

... ... ... ... ...

... ... ... ... ...

ఆచంద్రతారార్కమై............

... ... ... ... ...

సఫలమైయుండును సద్భక్తులిండ్ల.

గంగాధరుని సిరియాళచరిత్రము, గంగావివాహము గూడ నింతవరకు ముద్రితములు గాలేదు. వ్రాతప్రతులుమాత్ర మున్నవి.

## VII. గరికిపాటి తమ్మయ్య, సిరియాళ చరిత్రము - 2

ఇది మూఁడాశ్వాసముల పద్యప్రబంధము. చిఱుతొండఁడను వీరశైవభక్తుని చరిత్ర మిందు వర్ణితము. గరికిపాటి తమ్మయ్య లింగనామాత్యుని పుత్రుడు. సిద్ధ వీరేశ్వరుని శిష్యుఁడు.

**అంత్యగద్య:**-ఇది శ్రీమద్గురు సిద్ధ వీరేశ్వర వరప్రసాద లబ్ధకవితా సామ్రాజ్య ధురంధర, ఘనయశో బంధుర సమధిక వీరశైవాచార నిదాన, గరికిపాటి లింగనామాత్య పుత్ర, తమ్మయ నామధేయ ప్రణీతంబైన సిరియాళచరిత్రంబన్న కావ్యంబున సర్వంబును తృతీయాశ్వాసము.

**ప్రారంభము :-**

ఉ. శ్రీనగమందిరుం, దనుజ శిక్షు, మహోన్నతుఁ బార్వతీశ్వరున్
భాను మహోగ్రదీప్తు నతభక్త గృహాంగణ పారిజాతమున్.

... .... .... .... ..... ....

... .... .... .... .... ....

ఈతడు తనకుఁ బూర్వులైన వీరశైవ కవులతోఁబాటు స్మార్తకవులను గూడ స్తుతించినాడు.

సీ. శివకవీశ్వరులను చిత్తంబునంగొల్చి
నందిసోమేశు నమస్కరించి,



పిడుపర్తి బసవన్నఁ గడుఁ బ్రస్తుతులుచేసి,
తత్పుత్రు సోమయ్యఁ దలఁచి దలఁచి
బాణమయూరులఁ బ్రస్ఫుటాంజలి జేసి
కాళిదాసాదులఁ గాంక్షచేసి,
శ్రీ హర్షమళువను సేవించి పూజించి
వాల్మీకులకు చేసి వందనంబు

గీ. పూని కొలిచెద బమ్మెరపోతవిభుని.

... .... .... ....

### తమ్మన - సిరియాళచరిత్ర

ఉ. భైరవయోగి యిట్లనియె-భక్తుఁడు, పుత్రులు లేని యింట నా
హారము గొంటలేదు సుతులందున బిల్వగ విన్నవాడవో
ధీరత నీదు పుత్రునకు తెల్లముగాగను దాచినావు నీ
కూరిమి పుత్రరత్నమును కోరికమీరఁగఁ జీరి తెమ్మనెన్.

మ. కడు నేనెప్పును భక్తమాన్య నిను నే కాపాడితిన్ నీ సుతున్
పుడమిన్ దాచెద తప్పులెన్నకు మదిన్ పూర్ణాత్ముడౌనంచు నో
కడిమిన్ భక్తవరాగ్రగణ్య భళిరా కంటిన్ నినున్ మెచ్చితిన్
వడిగా బిల్వుము నీ కుమారవరునాన్ వామాక్షి జీరెన్ వడిన్.

సీ. ఇంద్రాది సురలార యిన చంద్రవరులార,
కణగి మా పుత్రుని గానరయ్య;
బృందారమునులార పుణ్యవర్తనులార
కణగి మా పుత్రుని గానరయ్య;

వరుణ పావక యక్ష - హరిహయ తతులార,
కణగి మా పుత్రుని - గానరయ్య;
కిన్నర కింపురుష గీర్వాణపతులార,
కణగి మా పుత్రుని - గానరయ్య;

గీ. వనిత ఘోషింప నీరీతి వారు బెదరి
నలరి శివభక్తి నీయందు నలరియున్న
నపుడు మా కేల నడిగెదో నబ్జవదన
స్థిరతనున్నాడు సిరియాళు చెలువుమీర.

**వెండియు :-**

గీ. అంతకుండును భైరవుం డనుచు మదిని
వడిగ మరియేమి ఔను తడవాయెననుచు
యెంత బిల్చిన రాడు సిరియాళు నిపుడు
అనిన భూకాంత బల్కె నాశ్చర్యముగను.

**అంత్యము :-**

" దేవదేవ మునీంద్ర వందిత, ద్విరదచర్మవిచేల నాభావజాంతక, త్రిపుర భంజన, భక్తమానస రంజనా, జీవితేశ్వరా, భూతనాయక, సింధుతూణగరీశ్వరా, కోవిదస్తుత వృజినదూరిత, కోటి సూర్యప్రకాశితా!!

## VIII. అజ్జరపు పేరయలింగము - ఒడయనంబి విలాసము

ఈకవి యొడయనంబివిలాసమును సారంగు తిమ్మయ వైజయంతీ విలాసమును చూచి రచించినట్లు తోఁచుచున్నది. ఇందలి కథ దాని కంటెను నీతిబాహ్యమైనది. కవిత్వమునకు దానియందున్న సారస్యము గూడ లేదు. ఇందు తండ్రియే యొడయనంబికి వలసినంత ధనమిచ్చి వేశ్యలపాలుచేసి, దాని నెప్పుడు విడువలదని కొడుకునకు బోధించును. మఱియు నిందు పాతివ్రత్యముకంటె వేశ్యావృత్తియే మేలని ఈశ్వరుఁడు బోధించును. ఇందు వేశ్యావాటికలో రంకని పలికినవారిని యముడు దండించునని వ్రాయఁబడినది. ఇంతకంటె నీతిబాహ్యమైన



గ్రంథము లేదు. ఈశ్వరుడు బోగముదాని చంటిలోనే ప్రత్యక్షమైనట్లు చెప్పఁబడినది. ఇది యారాశ్వాసముల ప్రబంధము. ఒడయనంబియను వీరశైవునియు, పరమ నాచియను వేశ్యయు చరిత్రములు వర్ణింపఁబడినవి. ఈ కథ యాదిత్య పురాణమునఁ గలదట.

**అంత్యగద్య :-**

ఇది శ్రీమదివటూరి పెదరామనాథ గురూపదిష్ట శైవ పంచాక్షరీ జప పరాయణ, లింగప్రాణి పాదారవింద వందనానంద, భారద్వాజ గోత్ర, పేరయామాత్య పౌత్ర, కొండమంత్రి బాపమాంబా సుపుత్ర, యెల్లమాకళత్ర, అజ్వరపు కులపవిత్ర, పేరయలింగనామ ప్రణీతంబైన యొడయనంబి విలాసంబను మహాప్రబంధము నందు షష్ఠాశ్వాసము.

ఈతఁడు ఒడయనంబి విలాసప్రబంధమును ఆచంట రామేశ్వరస్వామి కంకితము చేసెను.

కవి తన వంశమునుగూర్చి తెల్పుకొనిన పద్యములివి.


ఉ. బమ్మెర వంశమందునను ప్రౌఢ సరస్వతి పద్దుగాంచి తా
నెమ్మిదలిర్పఁ గేసన కవీశ్వరు లప్పమ నామ సాధ్వియం
దిమ్మహి గూర్మిగన్నసుత యెల్లమయందును బేరయాఖ్యుఁడ
న్సమ్మతిగంటి వీర నరసమ్మను గంగనమంత్రి యుగ్మమున్.

క. ధర నా భారద్వాజుని
గురు గోత్రమునందుబుట్టి కొండన ధైర్య
స్ఫురణయు, సత్పక్షంబును
గరిమ మహోన్నతియు గల్గి ఘనసంగతుఁడై.

శా. శ్రీరంజిల్లఁ జెలంగుచున్న గజరాట్సింహాసనాధ్యక్షునిన్
ధారాళంబుగ వేదశాస్త్రఘన విద్యారూఢి మెప్పించి యా
వీరాగ్రేసరుఁడీయఁ గొండన మహావిఖ్యాతిగా గౌతమీ
తీరక్షోణిని నజ్వరంబనఁగఁ దాఁ దెచ్చెన్ మహాగ్రామమున్.

**చ.** **అతఁడు ముగుళ్ళవంశమున నర్థి జనించియు రాజదత్తమై**
**క్షితిఁజెలువొంద న జ్వరము చేకొని పాలనమొప్పచేయు భా**
**సితగతి నజ్వరంపుగుల సింధు సుధాకరుఁడై చెలంగె నా**
**శ్రితులును బాంధవుల్ హితులు ప్రేమ నుతింపఁగఁ గొండమంత్రియున్.**

ఈ కవి వంశవృక్షమీతీరున నున్నది.






ఈ కవి మూలపురుషుడైన కొండన,గజపతిరాజైన వీరనృపాలునిచే గోదావరి మండలమందలి యజ్వరపురమును నగ్రహారముగా పొందెనుగాన, నా వీరనృపాలుడు కృష్ణరాయనిచే నోడింపఁబడినవాడెగాన (చూ. మనుచరిత్ర - మ॥ “ధర కెంధూళి” ), కవి వంశమూలపురుషుఁడగు కొండన 16 - వ శతాబ్దమందున్నచో నతనికి 7 వ తరమువాడైన మన కవి, తరమునకు 30 సం. చొ॥ చూచినచో 1750 సం॥ ప్రాంతమువాఁడగును.

ఈతని కవిత్వమందక్కడక్కడ వ్యాకరణదుష్టమైన ప్రయోగములున్నను నీతని కొక కవనచాతురి యున్నదని చెప్పవలయును. ఇది పూర్వమొకసారి ముద్రితమైనది. ఈ కథనే రెగళిగ నిమ్మనాథుడు యక్షగానముగా రచించెను.

## IX. కాశీనాథుని వీరారాధ్యుఁడు - ధర్మగుప్తాభ్యుదయము

ఈ కవి శ్రీపతి **పండితారాధ్యుని వంశపరంపరలోనివాఁడు**. దీనిని కవి శ్రీశైలమల్లికార్జునస్వామి కంకితముచేసెను. కానియిది యసంపూర్ణముగనున్నది. రెండవ యాశ్వాసమునుండి పోయినది. ప్రారంభము గూడ లేదు. ఇతఁడు భద్రాయుశ్చరిత్రను గూడ రచించెను. ధర్మగుప్తాభ్యుదయకథస్కాందపురాణాంతర్గత బ్రహ్మోత్తరఖండమున నుండి గ్రహించెను. దాని

**అంత్యగద్య :-**

ఇది **శ్రీమచ్ఛ్రీపతి పండితేంద్రాన్వయపయః** పారావారసుధాకర, శ్రీ గిరిభ్రమరాంబామల్లికార్జున కృపాలబ్ధకవితాప్రబుద్ధ **శ్రీకాశీనాథవీరారాధ్యపుత్ర,** సుకవిమిత్రవీరదేశికప్రణీతంబైన ధర్మగుప్తాభ్యుదయమను మహాప్రబంధంబునందు ప్రథమాశ్వాసము.

ధర్మగుప్తాభ్యుదయమునందును, భద్రాయుశ్చరిత్రమునందును తెల్పఁబడిన కవివంశవృక్షము క్రింది విధముగనున్నది.

**శ్రీపతిపండితుడు (వంశమున)**

**లింగన**

**అనంతనాముడు**

**కాశీనాథుఁడు**

**సోమేశుడు సోమేశుడు లింగయ బసవన కోటిపల్లివిభుడు**

**కాశీనాథుడు తమ్మన పండితుడు**

**అనంతగౌతముడు**

**అనంతగురుడు**

**మల్లికార్జునుడు**

**లింగన**

**కాశీనాథుడు**

**అనంతుడు గౌతముడు**

**శరభయ్య అయ్యయ్య**

క. **ఆత్రేయ సగోత్రద్విజ**
**పాత్రాపస్తంబసూత్రపటుయాజుషశా**
**ఖాత్రయ్యధ్యయనుడ (స**
**చ్ఛా) త్రాధ్యాపకుడ వీరశైవగురుండన్.**



**ప్రారంభము:-** అని యిష్టదేవతాప్రార్థనంబును, ప్రమథగణ స్తోత్రంబును, సుకవికీర్తనంబును, ప్రమథగణ స్తోత్రంబును, సుకవికీర్తనంబును, గుకవిపరిహా సౌన్నత్యంబును,..... **శ్రీమద్ధర్మ గుప్తాభ్యుదయంబను**మహాపురాణేతిహాసంబు రచించి శ్రీమద్భ్రమరాంబా హృత్కమలకర్ణి కానిష్యందమకరంద బిందుసందో హాస్వాదనేందిందిరాయ మాణమానసుండగు శ్రీగిరిమల్లికార్జునదేవునకునర్పించెద. మద్వంశ ప్రభావంబు మున్ను **భద్రాయుశ్చరిత్రంబున** సవిస్తరంబుగాఁ జెప్పఁబడియె. ఐననది యెట్లనిన.

వ॥ ఇట్లుండి యొకనాడు మదీయాంతరంగంబున దశసంఖ్యాక శైవపురాణోత్తమ స్కాందపురాణ సకలమణి గణహారమధ్యంబున తరళంబైన హారంబు వడువున నొప్పు బ్రహ్మోత్తరఖండంబున పఠ్యమానంబగు ధర్మగుప్తాభ్యుదయంబు నిరుపమపుణ్యవిలాసాలవాలంబు.

నైమిశారణ్యంబున మునులు సూతుని పై కథను తెల్పుమనికోరిరి.

సీ. **అరయ సాత్యవతేయుఁడష్టాదశపురాణ**
**ములు చెప్పె నాల్గులక్షలు గడంగి,**
**యందులక్షాత్రంబభవుని నొకలక్ష**
**విధిమాధవాదుల వినుతిసేయు,**
**రెండు సూర్యాగ్నుల రెండువిధాతను**
**నాల్గుమాధవుఁ బది నాగహారుఁ**
**బొగడు పురాణముల్ భూతేశ...**
**స్కాందంబు లక్షచే గరిమ మెరయ**

గీ. **దానఖండంబులేబది దనరె, నారు**
**సంహితలు ఖండతతిలోన సారసాఖ్యు**
**........ ఖండంబువరచరి తాళినమరు**
**నందులో పెద్ద ధర్మగుప్తాఖ్యుమహిమ.**

అంత్యము:-

మ. సతి తాఁబుట్టిన యింటనుండి విభుఁ గాంచన్ వచ్చుచోఁగట్నమం
చితలీలన్ గొనివచ్చురీతిఁదటినుల్ శ్రీమీర పూజావళీ
సతతానందఫలప్రసూనలతికాసందోహముందెచ్చె భూ
ర్యతులోత్తుంగతరంగభంగకలనన్ హర్షంబుతో వార్ధికిన్॥,

మ. ధరణీ నీ కమృతంబు గావలయునంతన్ బట్టుమంచాపయో
ధరగోరత్నము పల్క మిక్కిలికి సాంద్రంబంచు భూతాశ్వవై
ఖరిగా నిండితటాక దీర్ఘికలవేగన్ మించి పాఱెన్ పరి
స్ఫురణన్ వారిద వారివారినిధికై పుంఖానుపుంఖక్రియన్॥

గీ. పొన్న పువ్వులలో లతల్ పుట్టిమింట
దవులఁబ్రాకినగతి వర్షధార లుకము..........

కాశీనాథుని వీరారాధ్యుని కవితారీతిని తెల్పుటకై మచ్చున కతని ధర్మగుప్తాభ్యుదయమునుండి యీక్రింది పద్యములఁజూపుచున్నాను.

చ. అనుపమదివ్యలాంఛన జనార్తిహరంబు మహావిభూతియున్
ధనదనిరాసకారి నిరతస్ఫుట శోభనమందిరంబు, పా
వనవనసంభృతంబు మణివారసువర్ణ విరాజితంబునై
తనరెడు సౌఖ్యదంబగు విదర్భపురంబు ధరాతలంబునన్.

చ. వరగుణశీలుఁడర్థిజన వారచకోర సుధాకరుండు దు
స్తరరణ కాననోగ్రతరదావహుతాశను, డార్యసేవితా
నిరతుఁడపారధైర్యజిత నిర్జరభూధరుఁ డిద్ధతేజుఁడి
ద్ధరణిని ధర్మగుప్తుఁడను ధన్యుఁడు తత్పురమేలువేడుకన్.

ఉ. ఈ గతులన్ శుచివ్రతుఁడు నిద్ధగుణుండగు ధర్మగుప్తుఁడన్
రాగముతోడ సద్విధుల రంజిలుచుండఁగ నొక్కనాఁడు దా



వేగ నృపాత్మజున్వదలి విప్రసుతుం డవగాహనార్థమై
శ్రీగిరిజాధినాథుకృపచేత మహానది కేగె నున్నతిన్.

క. ఇహఫల మొసఁగుటయ ధరన్
సహజము, వరఫలమునిచ్చు సాక్షి యనంగా
నహిభూషణుఁ డెదనుంచిన
విహితమనన్ బుట్టెనొక్కవింత యెటులనన్.

గీ. నదికి నావిప్రుఁడేగి సమ్మదముతోడ
స్నాన మొనరించి పద్మినీనాయకునకు
నర్ఘ్య మొసఁగుచు తద్దీర్ఘి కాంబుమదన
మున తటంబున బైల్పడు ధనఘటమును.

క. కాంచి, యకుంఠితమోహో
దంచితుఁడై విప్రసుతుఁడు, తద్ధనకలశం
బించుక లోనుగఁ గొని మెయిఁ
బెంచుచు నిజచేలకమున బిగగ్రమ్మి వెసన్.

మత్తకోకిల.
చాలబల్మిన నెత్తినెత్తుక సంభ్రమంబలరారఁగా
మేలుదెచ్చితినంచు నింటికి మీరుచున్ చనుదెంచి స
ల్లీలతోడుతఁదెల్ప, నంబ, భళీయటంచుఁగుమారుతో
పాలుమాలకపల్కెఁబెంచినభావమింపుచెలంగగాన్.

చ. వినుము కుమార యీ ధనమువేడుక మీరఁగ ధర్మగుప్తుఁడున్
దనరఁగనీవు బుచ్చుకొని ధర్మమునన్ సుఖియింపుడన్న న
మ్మనుజనరాత్మజుండనియె మానుగ నన్నకు నిమ్ము శంకరుం
డనువుగ నివ్వడే తనకునందులఁబాల్గొనబోలదంబికా.

వ॥ మఱియు

సీ. **ధనమివ్వఁగాలేడె ధనదమిత్రుండైన**
**భూతేశుఁడష్టవిభూతినాథుఁ**
**డభయం బొసంగఁడె, హాలాహలము మ్రింగి**
**దేవరక్షకుఁడైన దివ్యమూర్తి**
**కోరికల్ గూర్పడే గురుదుగ్గనధిప**
**మన్యున కర్పించు మాధవాస్త్రుఁ**
**డాయువునిడడె యొప్పార మార్కండేయుఁ**
**బాలించు భక్తౌఘపాలకుండు**

గీ. **కాన నో తల్లి, యిప్పు డీ కాంచనంబు**
**పరఁగ మీ యన్నతోడను బాలుగొమ్ము**
**లెమ్మటంచును బలుకుట యిమ్ముగాదు**
**నిజముగను బ్రోచు భారంబు నీదె కాదె.**

వ॥ అనిన కుమారు నుదారభావంబునకు మెచ్చుచు నానంద కందళిత హృదయారవిందయై, య య్యుమావధూటి యట్ల యగుగాక యని, ధర్మగుప్తుని దీవించి, కౌగిలించుకొని, పూర్వప్రకారంబున వర్తించుచుండె. శుచివ్రత ధర్మగుప్తు లెప్పటియట్ల యుమామాహేశ్వరార్చ నంబు గావింపుచుండి రత్యంత భక్తివిశేషంబున, నంతట.

## X. మఱింగంటి వెంకటాచార్యుఁడు, మల్లారి చరిత్రము

ఇది యసంపూర్ణ గ్రంథము, నాల్గాశ్వాసములుమాత్రము గలవు. ఇందు కొంత ద్విపద భాగమును, మఱి కొంత మంజరియుఁగలదు. గోడె సూర్యప్రకాశరాయల భార్యయగు జానకమ్మ యాజ్ఞానుసారము ఎఱ్ఱకుల్లి పేరాజకవి యక్కడక్కడ సంస్కరించి, పెంచి కూర్చినట్లు తాను చెప్పికొనినాఁడు. గ్రంథమందలి ద్విపదభాగము వెంకటాచార్యునిదియు, మంజరీభాగము పేరాజకవిదియు గావచ్చును. ఇందు కర్ణుని వంశపురాజుల చరిత్రము చెప్పఁబడినది. కర్ణుఁడొక ఋషి చెవినుండి పుట్టెనట.



ఈరాజ పూర్వుఁడు గిరిరాజు, మల్లారి (మలహారి) కరుణచే రాజ్యమును సంపాదించెనట. మల్లారి కథ స్కాందపురాణమున నున్నది.

**గ్రంథ ప్రారంభము :-**

**శ్రీనివాసంబైన శ్రీగోడె వంశ**
**కలశవారధి సుధాకరుఁడు గాంభీర్య**
**వీర్యధైర్యస్థైర్య విశ్రుతౌదార్య**
**కలిత సాహస శౌర్య ఘనతరైశ్వర్య**
**యుతుఁడురు సత్కృపాయుతుఁడు సూర్యప్ర**
**కాశరాయఁడు దానఘనుఁడని జగతి**
**బ్రణుతికెక్కిన మేటిప్రభువున కెలమి**
**సద్ధర్మపత్ని యా సరసాంతరంగ**
**పరమ పాతివ్రత్య భవ్యగుణశీల**
... ... ... ...
**అలరిన శ్రీ జానకమ్మగా రెలమి**
**రహి నెఱ్ఱమిల్లి పేరాజును నన్ను**
**దమ యాశ్రితులలోన దద్దయునెపుడు**
**గారవించుచు నుండి కరుణచే నిట్లు**
**దెలియఁజేయించిరి, విలసితంబైన**
**స్కందపురాణ సంగతమయి యుండ**
**మల్లారిచరిత మిమ్మహిమీద వెలసి**
**ద్విపద కావ్యంబుగాఁ దేటపడంగ**
**నక్కావ్యమం దొప్పు నతిశయంబైన**
**కర్ణకులీనుల ఘన చరిత్రంబు**
**అది మత్కులాచార మంతయు నుండు**
**గ్రంథంబు గావునఁ గడిమి మీరంగ**
**మున్నున్న పుస్తకమునఁ జాలదప్పు**

లున్నవి గావున నన్నియు మీరు
సవరించుటే కాదు, సరసంబుగా౽గ
మఱికొన్ని పట్టుల నరసి రచింప
వలసిన గ్రంథంబు౽ దెలియ౽జేసెదను
అదియును రచియించి ముదమున మీరు
వ్రాసి యొప్పింప౽గ వలయునటంచు
నీరీతి తెలియ౽జేయించిన పిదప
సంతసమంది యా సాధ్వీలలామ
సెలవుచొప్పున నేను చిత్తంబులోన
మ దభీష్టదైవంబు గుదురున నిలిపి
పూనితి నక్కథ బోడిమి మీరు
దిద్ది లిఖింప౽గ౽ దీరుగా నిపుడు
శ్రీరమ్యధవళాంగ శ్రీశంభులింగ
చారు తరాపాంగ సదయాంతరంగ
అవధరింపుము బాదరాయణ మునికి
సవిశేషమతి శరజన్ము౽డిట్లనియె.
కృతయుగంబున మున్ను గిరిరాజనంగ
మతిమంతు౽డాసక్తి మల్లారి౽గొలిచి
యతని సత్కృపచేత నతులితైశ్వర్య
యుతవై శ్రవణు౽డయి యుర్వి వర్ధిల్లె.

అంత్యము :-

" పనిచిన నప్పుడు పరశురాముండు
అతివయు దానును నానందమొప్ప౽
దాతకు౽బ్రణమిల్లి తనరారువేడ్క
వందిమాగధులు కైవారముల్ సేయ
ఘనరథారూఢు౽డై కళ్యాణ విభవ
మలర౽గ౽ జతురంగ బలములు గొలువ
మాహరిపురి కే౽గె మహి కర్ణకులులు



ఈ రీతి సిరి మీఱి యింపలరంగ౽
జిరకాల మవనిలో౽ జెల్వున౽గీర్తి
చెందియుండెడి మీ౽ద౽ జెల్వగ వృద్ధి౽
బొంద నున్నారని పొల్పుగ సూతు౽
డెలమితో శౌనకాదులకు౽ దెల్పంగ
విని ముదమందుచు వేడుక నవలి
కథ౽ దెల్పుమని సూతు౽గని పల్కిరంత.
ఈ రీతి వివిధలోకేశుని పేర
హీరప్రకాశ గౌరీశునిపేర,
రమణీయ వృషభతురంగుని పేర
ప్రముదిత సదయాంతరంగునిపేర౽
జారు లక్ష్మీనాథ సాయకు పేర
... ... ... ... ...
గురులీల మఱిగంటి కులపవిత్రుండు
సరసు౽డౌ వెంకటాచార్యుండు ఘను౽డు
ద్రావిడ గీర్వాణ ..................
వివరించి చెప్పెను విశ్వంబునందు
సారస సంగీత సాహిత్యగరిమ
ధారుణిలో౽ బ్రసిద్ధముగ మల్లారి
చరితంబునందు .......... ప్రౌఢి
నరుదందగా౽ జతుర్థాశ్వాసమిదియు."

ఇది ఆర్.338 నెంబరు గల చెన్నపురి ప్రాచ్యలిఖితగ్రంథాలయప్రతి. ఇది కాక మఱియొక మల్లారి చరిత్రము గలదు. అది పద్యకావ్యము. మొదలు చివర లేకపోవుటచే౽ గర్తపేరు తెలియదు. అది ఆర్. 338 (ఎ) నెంబరు గల పొత్తము.

## XI. పోలిశెట్టి లింగన, నవచోళ చరిత్రము

ఈ ద్విపదకావ్యము కరికాళ చోళ, విక్రమచోళాదు లను తొమ్మండ్రుగుర చోళరాజుల చరిత్రములు వర్ణింప౽బడినవి. బగిరాముపల్లి మృత్యుంజయేశ్వరున

కంకితముగా చికిరాల లింగప్ప ప్రేరణమున నీ కృతి రచింపఁబడినది. కవి కుమ్మరవంశమువాఁడు.

"పరమాత్ముఁడుద్దామ బగిరాముపల్లి
గురుపదధ్యానుండు, గురుపూజరతుఁడు
సంగత భక్తిభూషణుఁడు, చకిరాల
లింగప్ప సద్భావ లీలలనొప్ప
నన్ను రావించి మన్నన గారవించి
మున్నుగా భూతి తాంబూలంబు లొసఁగి
విరివొప్ప నీవులు వేడ్కతో నొసఁగి
యరుసంబుతోడుత నప్పు డిట్లనియె."

ఈ కవి 'శంకరదాసయ్యచరితము, వీరసంగయ్య దేవ చరిత్రము; మల్హణ చరిత్రము, శిష్యప్రబోధము' లను గ్రంథములు రచించిన ట్లీ నవచోళ చరిత్రమున చెప్పుకొనెను.

" ఇరవొంద మునుముక్తి యీశు రామేశు
వరలబ్ధమున భక్తవరు లవుననఁగఁ
గరమర్థి వెలయ 'శంకరదాసయ్య
చరితంబు నవ్వీర సంగయ్య దేవు
చరితంబు, మల్హణ చరితంబు మఱియు,
నరుసంబు దనర శిష్యప్రబోధంబు
నచలితప్రీతిఁ బరానురాగమున
రచియించి వరభక్తిరచన నిష్పాపి
కావున నట్టి సంస్కారివిగాన
భావజ్ఞులగు భక్తిపరులు కారబులు
రసికులు నవచోళరాజులు మున్ను
అసలారఁబూజించి యాధ్యత మించి
వలనొప్ప మోక్షంబు వడసినమహిమ



యల కన్నడముచేసి రాధ్యులు మున్ను
వెలయగా నీవును విజ్ఞానమునకు
దెనుగున ద్విపదగా తేటతెల్లముగ
ఘనకీర్తిప్రియపూర్వకమ్మున మెరసి
శ్రీగురుమూర్తిదేశిక చక్రవర్తి
పరమాత్మ శ్రీ (బగి) రాముపల్లినివాసు
ధ్రువయశస్కరుఁడు మృత్యుంజయేశ్వరుఁడు
అవిరళభక్తిసామ్రాజ్యపూజ్యుండు,
సద్గుణనిధి, సత్యసంధుఁడు, మహాయశుడు,
మద్గురునాథుండు, మన్మనోహరుఁడు,
అనురక్తినట్టి మహాత్మునిపేరఁ
దనరారఁగా నంకితముసేయవలయు
అని యానతిచ్చిన నమ్మహామౌని
వినయోక్తులను ......అంటి."

తన గురువైన గార్లపాటి లక్ష్మణుఁడను కవీశ్వరుఁడు భక్తిపరుల నుతించి నట్లుగ, పాటలను రచించి ప్రఖ్యాతికెక్కెనని యీకవి స్తుతించినాఁడు

" కరుణాత్మ మిమునుండి గలిగెఁగా మాకు
శరణుల కొనియాడు సచ్చరిత్రంబు
పాటలసద్భక్తివరుల నుతింప
పాటికెక్కిన గార్లపాటి లక్ష్మణుని
వెలయఁగా వినుతించి విజ్ఞానమునను
గలుగు నాదిమశివకవుల భజించి
విమలశివాచార విభవసంప్రీతి
రమణతో నవచోళరాజుల మహిమ
నిర్ణయంబుగఁజేసి నిపుణత మెరసి
వర్ణించునట్టి నా వంశమెట్లనిన"

ఈ కావ్యమందాశ్వాసాంతగద్యయిట్లున్నది.

ద్వి. "ఇది వరవీరమహేశ్వరదివ్య
పదపద్మమకరంద పానమధూక
భవ్యజంగమలింగ భక్తినిష్ఠైక
దివ్యసదానంద ధీయుతయుక్తి
కన్నరమతసదాగార గురుశిష్య
చన్న బస్వన్న ప్రసాదసత్కావ్య
వరలబ్ధభాసురవాక్పౌఢి దనర
నిరతమై శోభిల్లు నిత్యసౌభాగ్య
సారశంకరజాతసద్వంశజాత
వీరవ్రతాచార వినయప్రచార
మూలమౌ శ్రీగురుఁబూజించు శ్రీల
లీలల పోల్శెట్టిలింగాఖ్యసుకవి
రచితమౌ నవచోళరాజుల చరిత
మచలితంబుగఁబంచమాశ్వాసమయ్యె."

ఈ గ్రంథప్రారంభము :-

ద్వి. " శ్రీగురుమూర్తి, భ్రాజితయశస్ఫూర్తి
నాగమార్థవిచారు, నఖిలోపకారు
వరకరస్థల పద్మవాసుమహేశు
పరమేశు నాత్మలోఁ బ్రస్తుతిచేసి
.. .. .. .. ..
అభినవమల్లేశు నఖిలైకగురుని
నభిమతసిద్ధిగా నాత్మలో నిల్పి,
.. .. .. .. ..
గురుమూర్తి శ్రీపాలకురికి సోమేశు
.. .. .. .. ..
చరణంబులకు జాగిలి మ్రొక్కి
వీరభద్రేశ్వరు విజయసాహసము
వీరరసంబున విరచించి తాసె.



గ్రంథాంత్యము :-

ద్వి. ఆ మహాభైరవుఁడతని పత్నియును
క్షేమస్థులై యుండ్రి శివునిసన్నిధిని
... ... ... ... ...
ఈ మహాత్ముని చరిత మెవ్వరేనియు
ప్రేమతోఁజదివిన .....................
..................................కెల్ల
నీశానుఁ డొసఁగు మహేష్టసంపదలు"

ఈ కావ్యము నాంధ్రపత్రికకార్యాలయమువారాంధ్రగ్రంథమాల క్రింద ప్రకటించినారు.

పోలిశెట్టి లింగకవి 15 వ శతాబ్దిచివరివాఁడు. ఈ నవచోళచరిత్రము కన్నడగ్రంథమున కాంధ్రీకరణము. కాని యా మూలగ్రంథమేదో స్పష్టముగాఁ దెలియదు. కృతిప్రేరణమున చకిలాల లింగప్ప యిట్లనెను.

"రసికులు నవచోళరాజులు మున్ను
నసలారఁ బూజించి యాద్యత మించి
వలనొప్ప మోక్షంబు వడసిన మహిమ
నల గన్నడముచేసి రార్యులు మున్ను
వెలయఁగా నీవును విజ్ఞానమునను
తెలుఁగున నద్దాని ద్విపద గావించి ॥"

నవచోళరాజుల చరిత్రమును సొసల పురాధీశ్వరుడగు భైరవరాజునకు పండితారాధ్యులు చెప్పినట్లుగా నిందు మొదట తెల్పఁబడినది. ఇందు మొదటి యాశ్వాసమున కరికాలచోళుని చరిత్రమును, రెండవ దానియందు విక్రమచోళుని కథయు, మూఁడవదానియందు ఉత్తుంగచోళుడు, అహివరచోళుడు, వరధర్మచోళుడు, సత్యేంద్రచోళుడు ననువారి కథలును, 4-వ దానియందు మనుజేంద్రచోళుడు,

వీరచోళుడు, ఉత్తమచోళుడు ననువారి కథలును కూర్పబడినవి. వీనిలో కరికాళ, విక్రమచోళుల కథలు విపులముగా వర్ణింపఁబడినవి. 5-వ ఆశ్వాసమున భైరవరాజు కథయు నతని లింగైక్యమును వర్ణింపఁబడినవి. ఇది సోమనాథుని పండితారాధ్య చరిత్రము తర్వాత మత, వేదాంత, కవిత్వ విషయములలో మేటియైన గ్రంథము. ఇది కావ్యశిల్పమునఁ గూడ నుత్తమ కావ్యమే యగును.

## XII. ఎడపాటి ఎఱ్ఱనార్యుఁడు-మలహణచరిత్రము

ఈ శృంగార పద్యప్రబంధమున మల్హణుఁడను శివభక్తుని చరిత్రము వర్ణితము. ఎఱ్ఱనకవి యీ గ్రంథమును కృష్ణరాయల కొసఁగక, దాఁచి, చుండికరణమగు కాళయమంత్రికొసఁగినట్లు చెప్పుకొన్నాడు. ఈ కృష్ణరాయఁడు విద్యానగరపు కృష్ణ రాయడు, మూరురాయరగండాంకుఁడు గావచ్చును.

ఉ. **ఇట్టి మహాప్రధానపరమేశ్వరమూర్తివిగాన నీవు చే**
**పట్టితి, మేలు, చుండిపురపాలక, కాళయమంత్రిచంద్ర, మున్**
**గట్టిగఁ గృష్ణరాయజన కాంతునకీయక దాఁచినట్టి యా**
**రట్టడియైన యెఱ్ఱకవి రాజత మల్హణకావ్యకన్యకన్.**

ఎఱ్ఱనకవి పూర్వకవుల నీవిధముగ స్తుతించె

చ. **వినతులొనర్తు నాంధ్రసుకవిప్రభు నన్నయభట్టు, తిక్కయ**
**జ్వను, శివదేవు, భాస్కరుని, జక్కన, నాచనసోము, సర్వదే**
**వుని భవదూరు వేము నల పోతనఁబిల్లలమఱ్ఱి వీరభ**
**ద్రుని శరభాంకు, వీరకవిధూర్జటిఁగేతన, భట్టబాణునిన్.**

ఈ గ్రంథమందలి యంత్యగద్య యిట్లున్నది.

" ఇది శ్రీమత్సకలసుకవిమిత్ర, సోమయామాత్యపుత్ర, సరసకవిత్వధుర్య, యెఱ్ఱయనామధేయప్రణీతంబైన మల్హణచరిత్రంబను మహాప్రబంధంబునందు సర్వంబును తృతీయాశ్వాసము".



ఈ కావ్యము శృంగారరసప్రధానమై మూఁడాశ్వాసములుగలది. ఇందు సంస్కృతకవియైన మల్హణకవికిని, పుష్పగంధియను వేశ్యకుగల ప్రణయగాథ వర్ణితము. ప్రాసంగికముగ శ్వేతిని వృత్తాంతముగూడ నిందు గలదు. కవి యీ రెండుకథలను పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్రము నుండి గ్రహించెను. మల్హణుఁడు శివభక్తుడు. వేశ్యాసక్తుఁడైన యితఁడు శివభక్తిగలవాఁడగుటచే పరమేశ్వరాను గ్రహమును బడసెను. మూలమున పుష్పగంధికి మదనసేనతార్చిన విటుఁడొకరాజకుమారుఁడైనచో, ఎఱ్ఱన ధనదత్తుఁడను నొక లుబ్ధవైశ్యకుమారునిగ మార్చెను. తర్వాత శ్వేతుఁడనువాఁడుగూడ వారాంగనాసక్తుఁడై యనేక విధముల దుష్టుఁడయ్యును నొకనాఁడు దనప్రేయసికై పుష్పములుకొని పోవుచుండ నొకటి జారి క్రిందపడెను. దానినతఁడు శివార్పణముసేయఁగా, తత్ఫలముగా నతనికి స్వర్గమున రంభాసంభోగము గల్గెను. రంభ యాతనిని శివభక్తుని గావించి శివరాత్రిజాగరణము చేయింపగ నాతఁడు మోక్షము పొందెను.

కృతిభర్తయైన 'చుండికాళుఁడు' శివభక్తుఁడు. చుండియనునది నెల్లూరుమండలమందలి చిన్నసంస్థానము. కాళనమంత్రి యా సంస్థానాధిపతి కడ మంత్రియై యుండెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుడు. సోమాంబారామయా మాత్యుల పుత్రుఁడు, విస్సమాంబాపతి తనకుఁగల యైశ్వర్య, రసజ్ఞతలచేత కవిపోషకుఁడై మల్హణచరిత్రమును కృతినందియుండును.

కవియైన యెఱ్ఱనార్యుఁడు గూడ నియోగిబ్రాహ్మణుఁడు, శివ భక్తి పరుఁడు. కృతిపతియైన కాళనమంత్రికి బంధువు, ఎడపాటిపురాధిపుఁడనుటచే నా గ్రామమనకుఁ గరణమైయుండును. ఈతఁడు సోమయామాత్యునిపుత్రుఁడు, కౌండిన్యసగోత్రుఁడు. ప్రబంధరత్నావళియందీతని యింటిపేరు 'పెదపాటి' వారనియుండ, మల్హణచరిత్ర కృతిపతి యీ కవిని 'ఎడపాటి' పురాధిపా! యని సంబోధించినట్లున్నది. ఆశ్వాసాంతగద్య యందుగూడ 'నెడపాటి' యనియేకలదు. కాననదియే యథార్థమై యుండును.

ప్రబంధ రత్నావళి వలన నీ కవి 'కుమారనైషధ' మను కావ్యమునుగూడ రచించినట్లు తెలియుచున్నది. ఈ కవి పూర్వకవులవైన యనేకపద్యములను దనకావ్యములందనుకరించెను. అట్టివానిలో శ్రీనాథునిపద్యములు ముఖ్యములు. మల్హణకావ్యమును కుమార నైషధమునకుఁ బూర్వమే రచించెను.

ఈ కావ్యమున నతిశృంగారము వర్ణింపఁబడి నవీనాభిరుచికి నసభ్యముగా నున్నది. మల్హణపుష్పగంధుల శృంగారవ్యాపార నిమిత్తమునఁ గవి నాయికా నాయకుల జాతిభేదములు, శృంగారనాయికాలక్షణములు, సంభోగ శృంగారపద్ధతి, వేశ్యా, పరస్త్రీ, విధవా, దాసీసంగమంబులఁగూర్చి రచించెను. ఇది కావ్యమున నీతిబోధకు ప్రతిబంధకముగ నున్నది. ఈ కవిరచన సర్వసామాన్యముగ నున్నది. తార్కాణమునకు పద్యములివి. పుష్పగంధినాట్యవర్ణనము --

**చ. ఉరమున రత్నకంచుకము, నొప్పుల పెండెము, వజ్రమౌక్తికా**
**భరణములుం ధరించి చెలిపైఁ గరపల్లవమల్లనఁజేర్చి యా**
**నిరుపమరంగమధ్యమున నిల్చెను వేడుకఁబుష్పగంధి తొ**
**ల్కరిమెఱుపుంబలెన్ జనుల కన్నులకున్ మిఱుమిట్లుగొల్పఁగన్. II పుట 39**

**ఆ. యువతి సురతవేళ నొప్పె జన్నులకును**
**మోమునకును నడుమ మురియుసరులు**
**చంద్రచక్రవాక సమరంబు వారింప**
**నడ్డగించు తారకాళి యనఁగ. II పుట 43**

పై పద్యమువలన కవికిఁజక్కని భావనాశక్తియుఁ గల్పనా చాతుర్యమును గలవని నిర్ణయింపఁదగును. ఈతఁడు చక్కని లోకోక్తులను దేశీయపు పలుకు బడులను కవిత్వమున వాడెను.

## గట్టు ప్రభువు - సురాభాండేశ్వరము

స్కాందపురాణాంతర్గత కాశీఖండమందలి సరాభాండేశ్వరోపాఖ్యాన కథననుసరించి యీ యేకాశ్వాస శృంగార ప్రబంధమును గట్టు ప్రభువను కవి రచించెను. ఒక భక్తురాలిని పరీక్షించుటకై బ్రహ్మచారి యొక కల్లుకుండలో లజ్జావిహీనుడై మునిగిపోయి శివలింగరూపమైన కథ కాశీక్షేత్రమాహాత్మ్యమును తెల్పును. ఘట్టు ప్రభువు ఎల్లామాత్యుని పుత్రుడు, యాజ్ఞవల్క్య నియోగి బ్రాహ్మణుడు. ఈతడు 1800 ప్రాంతమున నెల్లూరి మండలమున నుండెను. ఈతని కవనశైలి ద్రాక్షాపాకమున నుండి లోకోక్తులతో గూడి యుండును. ఈ కవి కుచేలోపాఖ్యానము, యాజ్ఞవల్క్యచరిత్రముగూడ రచించెను.



శ్రీగిరిమల్లికార్జుని భక్తుడు ఇతడు. భ్రమరాంబా వరప్రసాద లబ్ధకవితగలవాడును, చిత్రాశుకవిత్వములందు సమర్థుడునని కుచేలోపాఖ్యానమునఁ జెప్పికొనెను. సురాభాండేశ్వర కావ్యప్రారంభమిది.

**క. శ్రీమత్కాశీపట్టణ,**
**ధాముఁడు విశ్వేశ్వరుండు ధరణీధరజా**
**భామాకుచకుంభయుగ**
**స్థామలవక్షుండు మముఁగృతార్థులఁజేయున్.**

**సీ. బ్రాహ్మభాగవతాది పదునెనిమిది పురా**
**ణములలో స్కాందంబురమణఁ గాంచుఁ**
**గలవందుఁగాశికాఖండంబు మైలార**
**ఖండంబు కేదారఖండమాది**
**యేబది యందులో నెక్కుడు కాశికా**
**ఖండంబు ముకిక్తిఁగారణంబు**
**పరగునందుల సురాభాండేశ్వరంబను**
**పుణ్యచరిత్రంబు భూరిమహిమ.**

**గీ. నట్టికీ తేటతెల్గున నతులమృదుల**
**సరసమాధుర్య వాక్యముల్ సంఘటించి**
**కవుల కరుణావిశేషంబు కలిమికతన**
**విశ్వపతికంకితంబుగా విన్నవింతు.**

**క. భ్రమరాంబాకరకలితో**
**ద్యమవిలసద్వర్ణ సముదయాంకిత జిహ్వా**
**సుమహితుడ నంధ్రకవితా**
**ప్రమదాజనకుండ, గట్టుప్రభ్వాఖ్యుండన్.**

## షష్ఠ్యంతము

క. ధరణీధరకన్యాకుచ
పరిరంభణవివిధనిఖిలబంధురసౌఖ్యో
త్తరపరశివమానసునకుఁ
గరుణారసవీక్షణునకుఁగాశీపతికిన్.

**అంత్యము :-**

సీ. పులుగుమొత్తంబులు భూరుహంబులు చేఱె
జక్రవాకములు విరసమున దాఁటెఁ
దామరసాప్తకాంతగ్రావములు పేరె
వనజపత్రంబులు వాడఁబారె
గల్హారములకు సత్కాంతులు చేకూఱె
నెండమావుల పోడిమెల్ల జాఱె
నపరభాగమ్మున.................................
................................................

ద్రుత. భవభంజననిర్జితభావభవా
వివిధాగమసన్నుతవిశ్వభవా
శివదేవసుధాంబుధిసింధుభవా
భవనాశనశంకరగర్భభవా.

గద్య :-
ఇది శ్రీమద్భ్రమరాంబికావరప్రసాదలబ్ధకవితాధురంధరరస కవిమిత్ర యల్లయామాత్యపుత్ర గట్టుప్రభునామధేయప్రణీతంబైన సురాభాండేశ్వరోపాఖ్యానంబునందు సర్వంబును నేకాశ్వాసంబు.

## మేడూరి అప్పనకవి, వరుణాత్మజా కుంభేశ్వరచరిత్రము

ఈ సురాభాండేశ్వరకథనే మేడూరి అప్పనకవి రెండాశ్వాసముల పద్య కావ్యముగా రచించెను. ఈతని తండ్రి జగ్గయ్య కాశ్యపగోత్రుడు. ఇది గణుతూరి నరసరాజునకంకిత మీయబడెను. ఈ కవి గురువు పీసపాటి తిర్వెంగళాచార్యులు.



**కావ్య ప్రారంభము :-**

శా. శ్రీరమ్యోజ్జ్వలసానుదేశమనఁగాఁ జెల్వొందు వక్షంబుపై
హారాకల్పిత పద్మసంభవ కపాలాళుల్ నిరీక్షింపుచో
హేరంబుం డవి మోదకంబులని యూహించంతఁబైఁ జూచినన్
స్మేరంబందు శివుండు దా నరసభూమీనాయకున్ బ్రోవుతన్.

సీ. శ్రీమద్వివేకి వాల్మీకిని భజియించి
భవభూతి భవభూతిఁ బ్రస్తుతించి,
మహితవిద్యామోఘమాఘు నెమ్మది నిల్పి
భారవి భారవి గౌరవించి,
భూరిగుణాధారుఁజోరుసన్నుతిఁజేసి
వరరూపసుమబాణు బాణుఁదలఁచి
యమితపురాణేతిహాసు వ్యాసుఁదలంచి
కాళిదాసుండగు కాళిదాసుఁ

గీ. దలఁచి మృదుపదంబుల దండి దండిఁగొలిచి
వైరిసర్పమయూరు మయూరుఁబొగడి
యాత్మ దోఁచినగతిఁగృతినాచరింతు
మత్కవిత్వప్రవీణత మహి నెసంగ.

మ. అనయంబున్ నుతుఁజేతు మద్గురుని శిష్టాచారసంచారునిన్
ఘనపాండిత్యవిశిష్టధీరకవిరాట్కంఠీరవాకారునిన్
ఘనదక్షుల్లక పీసపాటి కులరాకాచంద్రమోమూర్తినిన్
దిననాథప్రతిమానధామసహితున్ దిర్వెంగళాచార్యునిన్.

మ. నను శ్రీమద్గిరిజాపదాబ్జ భజనానందైకసంపాదితా
ఖినవానూనకవిత్వరీతి రచనావిఖ్యాతచాతుర్యునిన్
ఘనమేడూరికులాబ్ధిసోముని బుధక్ష్మాదేవసంస్తుత్యునిన్
వినయాధారచరిత్రు నప్పనకవిన్ వే పిల్చి పల్కెంగృపన్

అంతము :-

సీ. అని కౌశికుఁడు రామజనపతితోడను
భవ్యంబుగాఁ దెల్పు దివ్యమైన
యీ సురాభాండేశ్వరాసురచారిత్ర
మివ్వసుధాస్థలి నెవ్వరైన

మాలిని: నిరుపమగుణభాసా నిత్యకల్యాణవాసా
స్థిరతరసుఖభోగీ శ్రీమదత్యంతరాగీ
కరధృతశరచాపా కామినీ కామరూపా
తరణిజ సమదానా దానవాద్యాఖ్యగానా.

గద్య :-

ఇది శ్రీమచ్ఛ్యామలాంబానిరంతర కరుణావలంబి కటాక్ష వీక్షాసంపాదిత వితతకవితావైభవ మేడూరి కులకలశాంభోరాశిపూర్ణిమాకైరవ బాంధవ భాషాధిప సమాన మనీషా విశేషాఖ్యాసిత జాతకసిద్ధాంతాది జ్యోతిశ్శాస్త్రధౌరంధర్య జగ్గయార్యతనూభవ కాశ్యపసగోత్ర పవిత్ర బుధజన స్తోత్రపాత్రచరిత్ర సుగుణగణ రత్నరత్నాకర యప్పనకవీశ్వర ప్రణీతంబైన వరుణాత్మజాకుంభేశ్వరచరిత్రంబను ప్రబంధంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

## రావులపురము గురవయ్య, సురాభాండేశ్వరము -(3)

ఈ కవి వెంకటనరసింహుని యగ్రపుత్రుడు, బాదరాయణగోత్రుడు. ఇతడు ద్విపదలో సురాభాండేశ్వర కథను రచించెను. ఇందు సుమారు 220 ద్విపదలలో కామశాస్త్రవిషయములు వివరింపబడినవి.

గ్రంథప్రారంభము :-

శ్రీగణనాథు నాశ్రితగణనాథు
నాగమగణనాథు నామరున్నాథు
నే మదిఁగీర్తించి యెలమిఁబూజించి
..... ..... ..... .....
..... ..... ..... .....



..... ..... ..... .....
కవితార్థధుర్యు వాగనుశాసనార్యుఁ
గవితావిరాజిఁదిక్కనసోమయాజి
మొదలగు కవిరాట్సమూహంబు దలఁచి
పదపడి శ్రీగురుపదముల కెఱఁగి
లలి సురాభాండేశ్వరంబును ద్విపద
దెలుఁగుసేయఁగఁగొంత తివిరియున్నంత
..... ..... ..... .....
..... ..... ..... .....
రాముఁడు సీతాభిరాముఁడు కరుణ
దా మది నెమ్మదిఁదగ నిట్టులనియెఁ
గలలోన వచ్చి నా కలలోనగల్లు
కళవళంబాపి నీకలవడఁబాప
డాయనికృతికి నే డాయగాఁబోదు
సేయగా నీ చింత సేయగానేల
పొలుపొంద రావులపురపౌరుషేయ
నలినారివేంకటనరసింహతనయ
అరయంగ బాదరాయణమునిగోత్ర
గురుతరసన్మిత్రగురునామగోత్ర
సుకృతి నీ కృతి వేగ శోభితరం బలరఁ
బ్రకృతంబు మదినెంచి బాగ రచించి
మత్ప్రీతిగాఁజేయ మా ప్రీతిగాన
సత్ప్రసాదతను నిమ్మహనీయగరిత
..... ..... ..... .....
..... ..... ..... .....
ప్రమదంబుతో సురాభాండేశుకృతికిఁ
గ్రమమెట్లు ..... ..... .....

గ్రంథాంతము :-

అని చెప్పె శివుఁడు గోహయముననెక్కి
తనవెంట దేవతాతతినుతు ల్సెలఁగ
ఘనముగ శాంభవీగణసమేతముగ
తన నిజపుణ్యైకధామంబు కరిగె
అని కాశికాఖండమం దొప్పియున్న
ఘన సురాభాండేశు కథయును ద్విపద
నలఘు శ్రీబాదరాయణగోత్రవార్ధి
నళినారిరావులనగరాఖ్యపౌరు
షేయుండు వెంకటశ్రీనరహరిసు
ధీయగ్రసుతుఁడు విధేయుండు
అతిప్రీతితో గుర్వయాఖ్యుండు ప్రీతి
వితతహృద్యంబుగా వేడ్క రచించి
రహి మించు జానకీరామునిపేర
నహిమాంశుపేరఁగాత్యాయనీదేవి
..... ..... ..... .....
అవని నీ కథనాజ్ఞసంతతము
దవిలి వర్ధిల్లు నాతారార్కముగను.

## పులిగడ్డ నారనమంత్రి, సురాభాండేశ్వరీయము - (4)

సురాభాండేశ్వరీయకథను ద్విపదగా రచించిన మఱియొక కవి పులిగడ్డ నారనమంత్రి. ఈతడు అన్నయ్య కుమారుడు.

గ్రంథారంభము :-

శ్రీపార్వతీనాథు శ్రీవిశ్వనాథు
శ్రీపాదములకు నేఁ జేరి మ్రొక్కెదను
..... ..... ..... .....
పనివినియే సురాభాండేశ్వరంబు



వినుపింతు జగములో వినువారికెల్లఁ
బులిగడ్డవంశాబ్ధిపూర్ణచంద్రుఁడను
వెలయంగ నారనాఖ్యసత్కవిని
పరువొప్ప నీ సురాభాండేశ్వరంబు
నిరవొంద శివకథ నీ పుణ్యచరిత

గ్రంథాంతము :-

అనుచు నంతర్ధానమయ్యె నీశ్వరుఁడు
ఎనసినవేడ్కతో నీడిగెగౌడు
పరగఁగా నటు సురాభాండేశునకును
గరమొప్పగాఁ గుడిగట్టించి యపుడు
నిత్యనైవేద్యంబు నిత్యభోగంబు
నత్యంతభక్తితో నభవున కొసఁగె
..... ..... ..... .....
పులిగడ్డ యయ్యనపుత్రుఁడైనట్టి
కలితంపుకవినొప్పు కవినారమంత్రి
కాశిమాహాత్మ్యపుఁగథ యెవరైన
వ్రాసిన విన్నను వడిఁజదివినను
విశ్వనాథుండిచ్చు విభవసంపదలు
శాశ్వతంబుగ ధాత్రిజనకోటికెల్ల

## పచ్చకప్పురపు తిరువెంగళకవి - చొక్కనాథచరిత్ర

చొక్కనాథచరిత్ర తొమ్మిదియాశ్వాసముల ద్విపదప్రబంధము. ఇందు మధురాక్షేత్రమున చొక్కనాథ సుందరేశ్వరస్వామివారి యరువది నాల్గు లీలలు వర్ణిములైనవి. ఈ కథలు హాలాస్యమాహాత్మ్యమని, మధురాఖండమనియు నామాంతరముగల సంస్కృత పురాణమునుండి గ్రహింపబడినవి. తిరువెంగళకవి భట్టుకులమువాడు. తండ్రి తిప్పరాజు. ఈతని తాత తిమ్మరాజును, పిన్నతాత అయ్యలును కర్ణాటాధీశ్వరుడగు ప్రౌఢరాయలచే సత్కృతులై పచ్చకప్పురము వారని బిరుదందిరి. కాన నీ కవి క్రీ.శ.1550 ప్రాంతమువాడని తోచును. ఈ

కావ్యము గోళ్ల చిననృపాలుని ప్రేరణమున తన యన్నయగు పెద్దరామ నృపాలునకు నంకీత మీయబడినది. కృతిపతి కమ్మవంశీయుడు, అచ్యుతదేవ రాయలకు దక్షిణ బాహువుగనున్నవాడు. నన్ననందలి (?) పురాధ్యక్షుడు ఉపనూరి సింహ బిరుదాంకితుడు వ్యాసతీర్థుల వారి శిష్యుడు, ఈ కావ్య విషయములు తమిళమున గూడ కలవు.

గ్రంథప్రారంభము :-

శ్రీగణనాథుఁబూజిత లోకనాథు,
బ్రాగల్భ్యబుద్ధిసంప్రాప్తసిద్ధి
..... ..... ..... .....
బిరుదు వేములవాడభీము, నన్నయను,
నరయ తిక్కన నెఱ్ఱనార్యు శ్రీనాథు
నిల గల్గు కవులను నెల్ల సద్భక్తి
విలసిత సద్వాక్యవితతి నుతించి
..... ..... ..... .....
నిటలాక్షపదభక్తినియతిఁ బెంపొంది
భటువంశమున మెచ్చు పచ్చకప్పురము
తిప్పరాజసుతుండు తిరువెంగళుండు,
చెప్పంగనేర్చుఁ బ్రసిద్ధంబు గాఁగ
నని విన్నవించిన నా చిన్న రామ
మనుజేంద్రుఁడధిక సమ్మదముతో నపుడు
ననుఁబిలిపించి మన్నన గారవించి,
వినుతించి కర్పూరవిడియంబులిచ్చి
యనఘుండు మీ తాతయగు తిమ్మరాజు
తన తమ్ముడయ్యలు దాను నిమ్మహినిఁ
బ్రౌఢుఁడై చదువుల పరగ మెప్పించె
ప్రౌఢరాయలచేతఁ బచ్చకప్పురము



రాజనంగాఁ దిమ్మరాజుకుఁ దిప్ప
రాజుదయించె విరాజితమ్ముగను
రాజుల మెప్పించె రసికుఁడాతని త
నూజుఁడవార్యసన్నుతకవీంద్రుఁడవు
..... ..... ..... .....
మధురాపురేశు నిర్మలపుణ్యచరిత
చౌషష్టిలీలావిలాసంబు లాంధ్ర
భాషను బెదరాముపార్థివుపేర
సుచరిత్రవైభవసుత్రాముపేర
రచియించి విఖ్యాతిరాజేయు మర్వి
నని యానతిచ్చిన నా మహారాజు
..... ..... ..... .....
చెలగుచును పనూ (నూ)రిసింహంబుపేర
..... ..... ..... .....
..... ..... చినరామునికి జ్యేష్ఠునిపేర
దీపించునచ్యుతదేవరాయప్ర
తాపదక్షిణబాహుదండాంకుపేరఁ
జతురత నీ కావ్యసారంబునకును
బతియైన పెదరామపార్థివుపేర
..... ..... ..... .....

కావ్యాంతము :-

పచ్చకప్పుర సౌరభ్యకలితనామాంక
తిప్పరాజసుపుత్ర తిరువే గళేంద్ర
విరచితంబు లోకవిఖ్యాతమైన
సరసలక్షణకావ్యసత్కవీంద్రాభి
నందితశ్రీచొక్కనాథచరిత్ర
మందున నిది నవమాశ్వాసమయ్యె.

## సిద్ధేంద్రయోగి - యోగీశ్వరవిలాసము

ఈ కవి బాలబ్రహ్మలింగ విగ్రహవిశాల కృపాలబ్ధసత్కవిత్వంబు శ్రీమతి గైకొన్నవాఁడని చెప్పికొనినాడు. ఈతడు యోగీశ్వరవిలాసమను ద్విపద కావ్యముగా రచించినాఁడు. అల్లమప్రభువు అక్కమహాదేవి కుపదేశించినట్లుగా వీరశైవసిద్ధాంతము లిందు వర్ణింపబడినవి.

## సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, రేణుక విజయము

ప్రాచీన వీరశైవమతాచార్యులగు రేణుకునిచరిత్ర మిందు కావ్యముగా వర్ణితమైనది. రేణుకుఁడు వివిధకాలములందే యే రూపముల నవతరించి శ్రీరాముడు, రావణుడు మొదలైనవారికిఁ గూడ శైవభక్తి భోదించినట్లును కలి యుగంబున కొలనిపాక యందుద్భవించినట్లు దీనియందు తెల్పబడినది.

ఈ కావ్యమును సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు రచించిరి. ఇది సికింద్రాబాదులో శివధర్మగ్రంథమాలలో 10వ బిల్వముగా ప్రచురింపఁ బడెను. ఇందైదాశ్వాసములు కలవు. అందుండి కొన్ని పద్యము లుదాహరింతును. తృతీయాశ్వాసమునందు, విక్రమార్కుడు రేణుకునర్చించు ఘట్టము (పుట 121)

**ఉ.** **ముప్పిరిగొన్న బత్తిని విభుండెదురేఁగి నమస్కరించి యా**
**యప్పకు నర్ఘ్యపాద్యముల నప్పనచేసియు స్వప్నవృత్తముం**
**జెప్పి మహాత్మ! విస్మృతినిఁజెందితి నీ యుపదిష్టమంత్రముం**
**దప్పక క్రమ్మఱందెలిపి ధన్యునిఁజేయుము నీదుదాసునిన్.**

**ఆ.** **ఆడఁబోవు తీర్థమది యెదురైనట్లు**
**వెదకుతీవ కాళ్లఁ బెనఁగినట్లు**
**నిన్నుఁ గాంచుపాంటె నేఁదపించుచునుండ**
**దేవునట్ల వచ్చితివి మహాత్మ!**



**ఉ.** **నా సుకృతంబు పండినది నాదగు జన్మము సార్థకంబు; నా**
**దోసము లగ్నితప్తమగు తూలచయంబటు రూపడంగె, సం**
**తోసమునందు నా మనసు తొప్పఁగదోఁగుఁ; ద్వదాగమంబునన్**
**నా సదనంబు వేల్పుసదనంబనిఁబూతమునయ్యె సద్గురూ!**

**క.** **అని పలుక విక్రమార్కుఁడు**
**మనమున హర్షించి గురుఁడు క్ష్మాపతి నీ బ**
**త్తిని మెచ్చితి, నీ కా శివు**
**ననుగ్రహము కలిమి నీప్సితార్థము దీఱున్.** **(పుట 122)**

సంస్కృతమున సిద్ధనాథుఁడను కవి రేణకవిజయమను నొక కావ్యమును క్రీ.శ.960 ప్రాంతమున రచించెను.

# అష్టమప్రకరణము

## శతకములు

ఆంధ్రభాషయందు శతకవాఙ్మయము భక్తి జ్ఞాన వైరాగ్యనీతి శృంగార హాస్యభావములు గల్గి రసవంతముగ నున్నది. ఇది యొకే విషయమునుగాని, వివిధ విషయములఁగాని, మనోరంజకముగ వర్ణించును. ఆంధ్రమున సుమారు 600 శతకములకుఁబైగానున్నవి. అందులో భక్తి ప్రధానములైనవి యధికము. వానిలో గొన్ని శైవపరముగను, మఱికొన్ని వైష్ణవపరముగ నున్నవి. సంపూర్ణ శతకలక్షణములుగల శతకముల కన్నింటికి పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకమే తెలుఁగున తొలుతటిది.

భావగీతములకు శతకములకుఁ గొంత సాదృశ్యమున్నను గొంత భేదముగూడఁ గలదు. భావగీతములందు కవి ప్రకృతి స్వరూపముల గుణ సౌందర్యములనుగాని, మనోభావములనుగాని మనోహరముగ వర్ణించుచు భావవికాసమును గలుగఁజేయును. భావగీతములు గలుగఁజేయు భావ వికాసము మానసికానందమును మాత్రము గలుగఁజేయును. కాని యాత్మానందమును గలుగఁజేసి పురుషార్థమునకుఁ బ్రయోజనకరము కాదు. ఇంక శతకములు భావగీతముల కతీతమైన యాత్మానందమును గలుగఁజేయు పురుషార్థమును బడయఁజేయుటకు సాధకములుగ నున్నవి. శతకములు సామాన్యముగ భక్తి ప్రధానముగ నున్నవి. పురుషార్థమునకుఁ బరమావధియైన మోక్షప్రాప్తియే శతకమునకుఁ బ్రయోజనము. అనంతమైన శృంగార కరుణావిలాసముల యానందానుభవమున కేకాగ్రత గల భక్తి సాధనము. అనన్యమైన భక్తిపారవశ్యానందమును వర్ణించుటకు శతకములు యోగ్యము లైనవి. ఇందలి స్తవములు భక్తి రసానందమును గలుగఁజేయుచు మోక్ష మార్గమును బోధించుచున్నవి. కవులు తమ గ్రామములందు వెలసిన పరమేశ్వ రావతరములను శతకరూపమునఁ బ్రార్థనచేయుచు కవిత్వమును సార్థకమును చేసిరి. భక్తహృదయావేశమును దెలిపెడి శతకము లాంధ్రభాష యందనేకము గలవు.



శైవవైష్ణవపరములగు భక్తిశతకములలో రామాంజనేయాది శతకములు వైష్ణవములని పరిగణించినచో శైవశతకములకంటే వైష్ణవ శతకములే యధికములు. మరియు వేదాంతశతకములు గలవు. ఇవి వేమన, ఆత్మలింగ, అప్పాలయోగి మొదలైనవారివి. ఇందు వేదాంతబోధకు లాంధ్రమున నిర్వచించు నద్వైత మతమునకు బోధకములైన పద్యములుండును. ఆంధ్ర శతకములు విశేషముగా స్వతంత్ర రచనములే కాని, కొన్ని భాషాంతరీకరణములును గలవు. ఇవి సూర్యశతకము, భర్తృహరి శతకము మొదలైనవి. కొన్ని యను కరణములు సుమతీశతక కాళహస్తీశ్వరశతకాదులు. కొన్ని సంకలితములు భాస్కర దాశరథీశతకాదులు. ఇఁక స్వతంత్ర రచనలు వేమన, కవి చౌడప్ప, వేణుగోపాల శతకాదులు. మరియు రాజనీతి, సేవకనీతి, లోకనీతి, బాలకబాలిక నీతిని ప్రతిపాదించునవి కొన్ని గలవు.

భక్తి శతకములందు స్వీయ సంక్షోభములను భక్తులు వ్యక్తీకరించుకొనిరి. శృంగార శతకములలో గొన్ని కాంతాలలామ, లావణ్య చంద్రవదనశతకాదులు కేవల కాముక జనార్హములుగనుండినను, తాడిమళ్ళ రాజగోపాల, మల్లికార్జున కలువాయి శతకములు పరమేశ్వరునిమీద చెప్పిన భక్తిశృంగార శతకములుగా ఉన్నవి. ఇఁక శాస్త్రములుగూడ శతకములలో రచింపఁబడినవి. ఈ శతకము లందు కవి తన యిష్టదైవమును గూర్చిగాని, ప్రభువును గూర్చిగాని చేసిన సంబోధనము మకుటముగా చేర్చును. ఈ మకుటమును బట్టియే శతకనామ మేర్పడును. ఈ మకుటము నాశ్రయించి శతకమంతయు నొక విధమైన ఛందమునందే వ్రాయవలసిన బాధ్యతయు నేర్పడుచున్నది.

శతకములలో రచయితయగు కవియే పాత్ర. శతకమునందలి భక్తుడును, శతకము వ్రాసిన కవియు వేరని చెప్పవలయును. పరమాత్మ కవి, జీవాత్మ భక్తుఁడు. భక్తుడే శతకమందలి పాత్ర. శతకములు సామాన్యముగ కవి యుద్రిక్తభావమున బుట్టినవగుటచే భక్తి,శృంగారము, క్రోధము, భయము, అద్భుతము మొదలగు భావముల యుద్రేకము గలిగినపుడే శతకములు వ్రాయఁబడినవి. కవి భగవంతునితో ప్రత్యక్షముగా నీ శతకమూలమున మాటలాడును. అందుచే వీనియందు కవి హృదయము స్పష్టముగ గ్రహింపనగును.

భగవన్నామావళియు, భగవత్ స్తోత్రములు నష్టోత్తర నియమిత సంఖ్యతో నుండుటచే, నీ శతకములు గూడ భగవత్ స్తోత్రపూర్వకము లగుటచే నివియుగూడ నా నియమిత సంఖ్యతోడనే కూర్పఁబడినవి. అదే యన్ని విధములైన శతకములకు సంప్రదాయమైపోయినది. ఇవి దశ విభాగములుగా దశకములనియు గూడ యాంతరవిభాగము చేయఁబడినవి. ఈ యాచారము సంస్కృత ప్రాకృత శతకములలో గూఁడ గనిపించుచున్నది.

ఆంధ్రమున క్రీ.శ.12వ శతాబ్దమునకుఁ బూర్వము శతకము లున్నట్లుగా గానరాదు. 12వ శతాబ్దమునందలి పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకమే తెలుఁగున ప్రథమ శతకమని చెప్పవలయును; దీనికి బూర్వయే యున్న పండితారాధ్యుల శివతత్త్వసారము 'శివా'యను మకుటముగలదైనను నీ మకుటము మారుచుండుటయే కాక, యది పద్య మధ్యమున కూర్పఁ బడుటయు నిందు గలదు. దీనికిఁదోడు దీని యందు 108 పద్యములే కాక 400 లేక 500 పద్యములవరకు గూడ కలవు. కాన సర్వసంపూర్ణ శతక లక్షణములు గల ప్రథమశతకమాంధ్రమందున వృషాధిప శతకమే. దీని తర్వాతది 13వ శతాబ్దమందలి యథావాక్కుల యన్నమయ్య రచించిన సర్వేశ్వర శతకము. ఇందుచే నాంధ్రమున శతకవాఙ్మయమున కాదిభిక్ష పెట్టినవారు వీరశైవులనుట స్పష్టము. ప్రాకృత భాషలో బౌద్ధ జైన వాఙ్మయములందలి శతకములు వీరశైవ కవులవలన నాంధ్రభాషలోనికి వ్యాపించినవని విశ్వసింపవలసియున్నది. క్రీ.శ.1380 సంవత్సరములో రావిపాటి త్రిపురాంతకుడు వ్రాసిన యంబికా శతకము చిక్కలేదు. సుమతి శతకము యొక్క కర్తృత్వముగాని కాలము గాని నేటికి స్పష్టముగ తెలియరాదు. అట్లే భాస్కరశతకము గూడ కాల నిర్ణయమునకు కష్టముగా నున్నది. ఇది కృష్ణరాయనికిఁ బూర్వమే రచింప బడియుండును. ప్రాచీన కాలమునకుఁ జెందినది దేవకీనందన శతకము. ఇది తిక్కన కృతము మాత్రము కాదు. 16వ శతాబ్దమునకు బూర్వపు శతకములలో శైవశతకములు హెచ్చును, వైష్ణవ శతకములు స్వల్పమును. ఇంక 16వ శతాబ్దమునకుఁ బిమ్మట శైవశతకములకంటె వైష్ణవ శతకముల సంఖ్య హెచ్చయినది. 15వ శతాబ్దాంతమున 16వ శతాబ్దియందు కడప మండలములో నొంటిమెట్ట రామ చంద్రమూర్తి మీద జానకీవర శతకమను నామాంతరముగల 'ఘువీర శతకము



బయలుదేరినది. సుమా రీ కాలముననే పోతన నారాయణ శతకమును రచించెను. కృష్ణదేవరాయల కాలమున బయలుదేరిన ప్రథమశతకము కాళహస్తీశ్వర శతకమే. ఇది శివానందలహరి, సర్వేశ్వర శతకముల ననుకరించి నట్లు గనఁబడుచున్నది. శతకము ధూర్జటి కవిచేతిలో పరిపక్వ స్థితికి వచ్చినట్లు దీనివలన తెలియుచున్నది. సర్వేశ్వర శతకము వలెనే దాశరథీ శతక నిర్మాణమును గూర్చి కొన్ని విచిత్ర కథలును గలవు. కృష్ణదేవరాయని కాలమున శతకములు మాత్రము విశేషముగ గనఁబడవు.

రాయల తర్వాతను నప్పకవికి మధ్యకాలములో వజ్రపంజర శతకము, మరున్నందనశతకము, గువ్వలచెన్నశతకము, బాలగోపాలశతకము మొదలైనవి కలవు. వేణుగోపాల, చంద్రశేఖర, కుక్కుటేశ్వర, రామలింగ, కవి చౌడప్ప శతకములు 16-17శతాబ్దములందు పుట్టినవి. ఇఁక 17వ శతాబ్దమునందు శతకవాఙ్మయ మధికముగ వర్ధిల్లినది. పెద్దాపుర సంస్థానాధిపతులగు భద్రగజపతిగారు రామశతకమును, రాయగజపతి రాజుగారు భద్రాద్రిరామ శతకమును వ్రాసిరి. చింతలపల్లి వీరరాఘవ కవి తన మధురవాణీవిలాసమునందు

**"జాములో శతకంబు సంధించి కంకణా**
**దులు గొంటి వల రాయ దుర్గమునను"**

అని తన్ను గూర్చి వ్రాసికొనినాడు. వీరరాఘవకవి పెదతండ్రి గోపాలకవి యార్యాశతకమును రచించినాడు. ఆ కాలమునందు శతకముల నాశువుగ చెప్పి బహుమానములందుకొను వాడుక గలదు. గణపవరపు వెంకటకవి కఠినప్రాస శతకమును, యమకశతకమును, కస్తూరిరంగకవి సాంబ నిఘంటువు సీస శతకమును రచించిరి. హంసవింశతికర్త అయ్యలరాజు నారాయణకవి 'నఖగర్తపురాంజనేయ నతజనగేయా' యని కంద శతకమును రచించెను.

15, 16, 17 శతాబ్దములలోని వగు తాళ్ళపాకవారి శతకము లే డెనిమిది దొరికినవి. ఈ కవులు వైష్ణవభక్తులు. శతకము లకారాదిగ నియమముతో రచింపబడినట్లు సుమతి, భాస్కర వేణుగోపాల శతకములు తెల్పుచున్నవి. ఇందుచే కవి వ్రాసిన పద్యముల వరుసఁగూడ గుర్తింపవచ్చును.

17వ శతాబ్దము తర్వాత పుట్టిన శతకములకు మితియేలేదు. విశాఖపురి మండలమందలి పాలతేరులో నమలాపురపు సన్యాసియను నొక కుమ్మరి నూరు శతకముల రచించెనట. ఏనుగు లక్ష్మణకవి సమకాలికుఁడగు సత్యవోలు భగవత్కవి,

క. **'ధీరత శతశతకంబులు.............. చెప్పినవాడన్'**

అని చెప్పికొనినాడు. రానురాను చీపురుపుల్ల శతకములు, సోడాబుడ్డి శతకములు కూడ బయలుదేరినవి. పై విధముగ నభివృద్ధి పొందిన శతకములను నా కవులను కవిచరిత్రలలోఁ జేర్పకుండుట బహుశోచనీయము.

## యథావాక్కుల అన్నమయ్య, సర్వేశ్వర శతకము

వృషాధిప శతకము తర్వాత పరిశీలింపతగిన శతకమిది. ఈ శతకకర్త యగు అన్నమయ్య కవి దూదికొండ సోమేశ్వరారాధ్యుల శిష్యుఁడనని తానే యిట్లు శతకమునఁ దెల్పుకొనినాడు.

మ. **అభిరమ్యంబుగ దూదికొండ మహనీయారాధ్య సోమేశ్వర**
**ప్రభు కారుణ్య వసంతసంజనిత మద్వాక్యప్రసూనావళిన్**
**విభవంబొప్పగ భక్తియుక్తులను వాణీవ్యాప్తి సంపత్కళా**
**ప్రభవంబైన భవత్పదద్వయము నారంబూన్తు సర్వేశ్వరా.** 131

దూదికొండ గ్రామము కర్నూలు జిల్లాలోని ప్రత్తికొండ తాలూకాయందు గలదు. పాల్కురికి సోమనాథుఁడు శ్రీశైలమునఁ దన కవితా ప్రాభవమును వెలయించి యా ప్రాంతమునఁ గొంతకాలము నివసించి యుండును గాన, అన్నమయ్య తొలుత గోదావరీమండలమున పుట్టి స్వక్షేత్రవాసి కాగ, శ్రీశైల యాత్రకుఁ బోయి సోమనాథుని కలుసుకొని యాతని శిష్యుఁడుగా దగుననియు 'దూదికొండ మహనీయారాధ్య సోమేశ్వర ప్రభు' వనఁగా పాల్కురికి సోమ నాథుఁడే యనియు నిడదవోలు వెంకట రావుగారూహించుచున్నారు.(చూ. భారతి 1945 సంవత్సరము మార్చినెల సంచిక, పుట 225) ఈ విషయము



పరిశీలింపదగినది. అన్నమయ్య కవి శక సంవత్సరము 1164 అనగా క్రీ.శ.1242వ సంవత్సరమున నీ శతకమును రచించినట్లుగ

శా. **శాకాబ్దంబులు వార్ధి షట్కపుర భిత్సంఖ్యం బ్రవర్తింప శు**
**శ్లోకానందకరంబుగాఁగ మహిలో శోభిల్లు సర్వేశ్వర**
**ప్రాకామ్యస్తవ మొప్పఁజెప్పె శుభకృత్ప్రవ్యక్త వర్షంబునన్**
**శ్రీకారావ వసంతమై మహిమతోఁ జెన్నొంద సర్వేశ్వరా.** 127

పైకాల విషయమును బట్టి యీ కవి తిక్కయజ్వకు సమకాలమువాఁ డనియు, పాల్కురికి సోమనాథుని వార్ధక్యములో నితఁడు యువకుఁడై యుండునని గూడ భావింపవచ్చును.

ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ప్రకటించిన యీ శతకపీఠికయందు కవినిగూర్చి, పల్నాడు (గురుజాల) తాలూకాలోని చెర్లగుడిపాడు గ్రామమునకుఁ గరణమైన కవివంశజుఁడగు సోమరాజు వెంకటశివుఁడను నాయన తెల్పిన విషయము నిట్లు ప్రకటించిరి - యథావాక్కుల అన్నమయారాధ్యుఁ డాత్రేయస గోత్రోద్భవుఁడు. యజుశ్శాఖాధ్యాయి, గోదావరీ తీరవాసి. రాజమహేంద్రవర సమీపమున నున్న 'పట్టెస'మను గ్రామమున నున్న వీరభద్రేశ్వరస్వామి యితని యిలువేలుపు. ఈ మహనీయుఁడొకప్పుడు శ్రీశైలయాత్రకు వెడలి శ్రీమల్లికార్జున స్వామిని సేవించి తిరిగివచ్చుచుఁ బల్నాడుతాలూకాలోఁ జెట్టిపాలెము దాపునఁ గృష్ణాతీరమందు విశ్వామిత్రాశ్రమ మనఁబడు సత్రశాలయను పుణ్యస్థలమున శ్రీమల్లికేశ్వరస్వామిని సేవించుచుఁ గొంతకాలముండి యచటనే యీ సర్వేశ్వర శతకమును రచించెను. 'ఒక్కొక్క పద్య మొక్కొక్క తాటియాకుపై వ్రాసి యా యాకును గృష్ణలో వైచి యది ప్రవాహమున కెదురీది వచ్చెనా దానినిఁ దీసి సూత్రము నెక్కించెద. అట్లే యాకైన రాక క్రిందికిఁ గొట్టుకొని పోయెనా యప్పుడే నా శిరము ఖండించుకొనియెదనని శపథముచేసి, మెడకు గండకత్తెర వైచికొని యాకుమీఁద పద్యముల వ్రాసి నీళ్ళలో విడిచిపెట్టగా నవి తిరిగివచ్చుచుండెడివి. కొంతసేపటికి,

మ. తరులం బువ్వులు పిందెలై యొదవి తత్తజ్జాతితోఁ బండ్లగున్
హర మీపాద పయోజ పూజితములై యత్యద్భుతం బివ్విరుల్
కరులౌ, నశ్వములౌ, ననర్ఘమణులౌ, గర్పూరమౌ, హారమౌ,
తరుణీరత్నములౌ, బటీరతరులౌఁ దథ్యంబు సర్వేశ్వరా. 87

అను పద్య మెదురుగారాక కొట్టుకొనిపోవుటఁ జూచి కంఠమును గత్తిరించుకొనఁ బోఁగా నీశ్వరుఁడే యొక పసులకాపరి రూపమున నీ క్రింది పద్యమును రచించిన యాకునిచ్చి యదృశ్యుఁడయ్యెను.

మ. ఒక పుష్పంబు భవత్పదద్వయముపై నొప్పంగ సద్భక్తి రం
జకుఁడై పెట్టిన పుణ్యమూర్తికిఁ బునర్జన్మంబు లేదన్నఁ బా
యక కాలత్రితయోపచారముల నిన్నర్చించుచోఁ బెద్ద నై
ష్ఠికుఁడై యుండెడివాఁడు నీవగుట దాఁ జిత్రంబె సర్వేశ్వరా! 88

కవి యీ పద్యమునుగూడ గ్రహించి, తన పూర్వ నియమము ప్రకారముననే శతకమును బూర్తిచేసి కొంతకాలమునకుఁ బిదప నా సత్రశాల యందే సిద్ధిఁ బొందెను. అన్నమారాధ్యుని వంశవృక్షమిది.

**యథావాక్కుల అన్నమయ్య (క్రీ.శ.1242)**
|
**వీరమరాజు**
|
**నాగరాజు**
|
**చిట్టెమరాజు**
**(క్రీ.శ.1422 ఈయన పల్నాడుసీమకు వచ్చి యారు గ్రామములకు కరిణీకమును సంపాదించెను)**
|
**గోపరాజు**
|
**సోమరాజు**

ఈయన సుప్రసిద్ధుఁడగుటచే నీతని నాఁటినుండి యా వంశమునకు యథావాక్కులవారను 'పేరు మారి సోమరాజువారను 'పేరు గల్గినది' పై



విషయములను దెలిపిన సోమరాజు వెంకటశివుఁడను నాయన యీ సోమరాజు వంశీయుఁడే. అన్నమయ్య కవి యమోఘ కవితాధారా సంపన్నుఁడు. నిర్దుష్టమైనది యితని కవిత. తన శతకమునుగూర్చి కవియే యిట్లు యథార్థముగ చెప్పికొనినాఁడు.

శా. ధాత్రిన్ దాసజనానురంజనముగాఁ, తత్త్వప్రకాశంబుగా;
చిత్రార్థాంచిత శబ్ద బంధురముగా, సేవ్యంబుగా, సజ్జన
శ్రోత్రానందముగా, శుభాన్వితముగా, శోధించి సర్వేశ్వర
స్తోత్రం బన్నయసెప్పె నీ జగములో శోభిల్ల సర్వేశ్వరా. -133

ఈ శతకమందు కొన్ని ప్రతులలో 123 పద్యములును, మఱికొన్ని ప్రతులలోఁ గొన్ని యధికమై 142 పద్యముల వఱకుఁ గూడ పెరుగుచు వచ్చినవి.

**ప్రారంభము :-**

శా. శ్రీకంఠుం,బరమేశు, నవ్యయు, నిజశ్రీపాద దివ్యప్రభా
నీకోత్సారిత దేవతానిటల దుర్నీతాక్షర ధ్వాంత చి
త్ప్రాకామాంగు నపాంగమాత్ర రచిత బ్రహ్మాండసంఘాతుఁ జం
ద్రాకల్పున్ బ్రణుతింప నిన్ను మది నాహ్లాదింతు సర్వేశ్వరా! -1

మ. ఒకమాటున్ సకలంబు నీ మహిమగా నూహించుచున్ వెండి, యిం
కొక మాటొద్దియు నీవు గావనుచు నేయుక్తి బ్రశంసింప నే
రక వేదంబులు చిక్కుపడ్డవనినన్ ప్రవ్యక్తమైయుండి భా
వకుఁడై నీ నిజరూప మిట్టిదన నెవ్వండోపు సర్వేశ్వరా! 2

ఈ సర్వేశ్వర శతకము వీరశైవ మత సంప్రదాయానుసారము భక్తిరస ప్రధానమై,శైలి హృద్యమైయున్నది. పద్యరచనాశిల్పమునకిది ముఖ్య లక్షణము. పద్యముల నడకనుబట్టియు, గల్పనములబట్టియు నీ శతకము గొన్ని చోటులందు సంస్కృతములోని శివమహిమ్న స్తోత్రమును, గన్నడములోని సోమేశ్వర శతకమును, తెలుగులోని కాళహస్తీశ్వర శతకమును దలంఁపునకుఁ దెచ్చును. ఈ శతకము శైవులలో మిక్కిలి వాడుకగా నుండెననుట కీతని

ననుకరించిన పోతన నారాయణ శతకమున గొన్ని పద్యములలో పోలికలు గనఁబడును. శైలికి, భక్తికి, మంచి భావములకుఁ దరువాత శతక కవులకు భిక్షముపెట్టి, మన వృత్త శతక వాఙ్మయమును మంచి మార్గముల నడిపించుట కీ శతకము చాలా తోడ్పడినది. తన కాలమును దానే చెప్పుకొనిన శతక కవులలో నీతఁడు ప్రథముఁడు. శైవాగములే గాక, శాస్త్రములుగూడ నెఱిఁగిన పండితుఁ డన్నమయకవి. ప్రౌఢ శతకములలో వృషాధిపశతకమునకుఁ బిమ్మట నిది ప్రధానమైనది. ఇతఁడు పూర్వకవుల ననుకరించెననుట కీతఁడు శివతత్త్వ సారాదులనుండి గ్రహించిన భావములు చూపవచ్చును. ఈ శతకమందలి 117వ పద్యమగు 'శా॥ ఏ దేశంబున' మొ॥ పద్యము శివతత్త్వ సారమందలి 20 పద్యమున కనుకరణము. అట్లె యిందలి 50,61 పద్యములందలి 126, 134, 191, 192 పద్యముల కనుకరణములు.

ఈ శతకమును క్రీ.శ.1884 సంవత్సరము నందే చెన్నపురి శ్రీశైవ సిద్ధాంత ముద్రాక్షరశాలయందు ముద్రించిరి. తర్వాత 1910 శ్రీ శివధర్మవర్ధనీ రామలింగేశ్వర ముద్రాలయమున వరంగల్లులో మఱియొక మారు ముద్రింపఁ బడినది. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తువారు దీనిని 1916లో చక్కగ సంస్కరించి ముద్రించిరి. పిమ్మట వావిళ్ళవారి భక్తిరస శతక సంపుటమున (1926)ను ఆంధ్ర గ్రంథమాల శతకమంజరి 1926లోను ముద్రితమైనది.

అన్నమయ యీ గ్రంథమును స్తవమని వ్యవహరించినాడు గాని శతకమని యెక్కడను వాడలేదు. 'సర్వేశ్వర స్తోత్రం బన్నయ చెప్పె'నని 133వ పద్యమున వాడినాడు కాని యీ పద్యముల కన్నింటికి 'సర్వేశ్వరా' యను మకుట ముండుటచే, శతాధిక సంఖ్యగల పద్యములున్నను నిది శతకముగనే వ్యవహరింపఁబడుచున్నది. అన్నమయ కవి సంస్కృతము నందలి మహిమ్నము, మల్హణము, అనామయము, హలాయుధము నను స్తవములనుండియు, మల్లికార్జుని శివతత్త్వసారము, పాల్కురికి సోమనాథుని యనుభవసార, పండితారాధ్య చరిత్రములనుండి భావముల గ్రహించెను.

'అన్నమయ్య యీ కృతియందు ప్రతిపాదించినది యారాధ్య సంప్రదాయానుగుణమైన సవైదిక వీరశైవమేయైనను, మోక్షమునకు భక్తియే



మూలమనియు, భూతసేవాపరమైన జంగమభక్తి శ్రేష్ఠమనియు నిరూపించెను. విధ్యుక్తకర్మల నాచరించుచు గురులింగ, జంగమజ్ఞాన సంపత్తిఁబడసి, తత్సేవాధర్మముల నిర్వర్తింపుచు, నిశ్చల భక్తితో ధ్యానమార్గమున శివానంద మనుభవించుననియు కవి యుద్దేశము. కర్మ, భక్తి, జ్ఞాన, ధ్యానమార్గములలో భక్తియే మిగిలినవానికిఁ బ్రాణమని తెలిపినాఁడు. సహజైక భక్తి నిష్ఠాగరిష్ఠునకు బాహిరములగు ప్రకృతి విషయములతోఁగాని, యన్యదేవతా విషయములతోఁ గాని ప్రసక్తియే లేదు. కాన అన్నమయ్య కృతియందు పండితారాధ్యుల శివతత్త్వసారమున వివరించిన శివాపచారులను చంపవచ్చుననుటయు, శివభక్తులకు పరలోక విధులు వలదనుటయు, శివభక్తు లే విధముగ ప్రవర్తించినను బూజ్యులనుటయు మొదలగు విషయములు గానఁబడవు. మరియు పాల్కురికి సోమనాథుని కావ్యములందు శివభక్త్యుద్రేకమునఁ జేయఁ బడిన యన్యదేవతా దూషణము, బ్రాహ్మణనింద మొదలైనవి యీతని గ్రంథమునఁ గానరావు. అన్నమయ్య కృతియందు ప్రతి స్థలమునను శివమహత్త్వము, నిశ్చల భక్తిభావము, శుద్ధ శాంతస్వభావము, సాత్త్విక ప్రవృత్తి, వైరాగ్య ప్రకృతి మొదలైనవి గోచరించును. కాన వీరశైవ మతభావములం దీతనికిని పండితారాధ్య సోమనాథులకుఁ గల భేదమిది.

శైలికిగాను శతకమునుండి కొన్ని పద్యములు -

మ. **అతి వాగ్జాలమునై, యజాండ నిలయంబై, యాదిమధ్యాంత వ**
**ర్జిత రూపాధిక నిష్కళంక పదమై, సిద్ధాంతమధ్యాత్మ సం**
**యుతమై కోటి రవిప్రకాశయుతమై, యోంకార మంత్రాది సం**
**స్తుతమై యేచి యచింత్యమై నెగడు నీ సూక్ష్మంబు సర్వేశ్వరా!-104**

ఇది పోతన 'నారాయణశతకము' "ధర సింహాసనమై" మొదలైన పద్యములఁ బోలియున్నది.

మ. **సతి వేడ్కన్ దన ప్రాణవల్లభునితో సంయోగ మాశించుఁగా**
**కతనిం బ్రార్థనచేసి సొమ్ముఁగొని పోనఙ్గాడునే తద్జ్ఞుఁడీ**
**క్షితి నీ భక్తియ వేఁడుగాక మరి నీ శ్రీ పాదముల్గొల్చి కు**
**చ్చిత కామార్థములొంద వేడుకొనునే చింతింప సర్వేశ్వరా!** 45

మ. భ్రమరధ్యానము దాల్చి కీటకము సద్భావాది సంయుక్తిఁదా
భ్రమరంబై ఖగవీథినాడునని నిన్భావించి నిన్నాత్మ నె
య్యముతో ధ్యానముసేయు మర్త్యుఁడును నీయట్లె పరవ్యోమత
త్త్వమునం దవ్యయలీలనుండు టరుదే తర్కింప సర్వేశ్వరా! 46

శా. ఎచ్చో నీ పదభక్తుఁడుండు మది నింపెక్కం బ్రయత్నంబుతో
నచ్చో నీ వనిశంబునుండుదు త్వదీయధ్యాన చిన్మూర్తులై
యచ్చో సన్మునులెల్ల నుండుదురు మత్రాంగాక్షరాయుక్తులై
యచ్చో తీర్థములెల్లనుండు నిది వేదార్థంబు సర్వేశ్వరా! 54

మ. భవదాకారమె గాంచు నీ స్తవకదంబ శ్రేష్ఠ సద్వాక్యముల్
చెవులారన్ విను, నిన్నె చెప్పుమది దుశ్శీలేంద్రియాటోప దు
ర్వ్యవసాయాత్ములఁగాంచుచో, వినెడిచో, వర్ణించుచోఁ జీకునుం
జెవిటిన్మూకయునై చరించు మహి నీ శీలుండు సర్వేశ్వరా! 05

## II. శ్రీగిరి విరూపాక్షకవి, కాళహస్తిలింగశతకము

ఇది బ్రౌను దొరగారి కాలమందే ముద్రింపబడినది. కాని ముద్రిత శతకములలో నీతని పేరున్న కడపటి పద్యమే లేదు. ఈ కడపటి పద్యము అడయారు పుస్తక భాండాగారమున 32-8-9 ప్రతిలోను, ప్రాచ్యలిఖిత గ్రంథ భాండాగార మందలి 15-7-7న్ను, 11-2-26 సంఖ్యగల ప్రతులలో మాత్ర మున్నట్లు తర్వాత గుర్తింపఁబడినది. ఈ శతకర్త తండ్రిపేరు పాపయ్య - ఆ పద్యమిది.

సీ. శంకర త్రైలోక్య శంకర యోంకార
కేశవప్రియ వియత్కేశవేశ,
భూతేశ నిఖిల విభూతేశ గౌరీశ
యఖిలసమగ్రాగ్ర యనుపమాగ్ర;
పురవైరిసన్నుత గిరివైరి మదనారి
శూలి దయాశాలి సుప్రశీల,
దేవపల్లవ వామదేవ మహాదేవ
పావనశ్రీగిరి పాపవిభుని.

గీ. యాత్మజాతుండ, విరూపాక్షాహ్వయుండ
చెలఁగి చెప్పితి ఁగైకొమ్ము సీసశతక
ప్రణుత ధవళాంగ! మౌనిహృత్పద్మభృంగ,
అమిత భవభంగ, శ్రీకాళహస్తిలింగ... 100

ఇందు 100 పద్యములలో, లోకనీతి, శివస్తుతి చేయబడినది. ఇందు కవి వీరశైవాచారముల నుగ్గడించెను, శివభక్తి ప్రాశస్త్యమును తెలిపెను. కాని విష్ణువుపేరు తలపెట్టకపోలేదు. శైలి చాలా మంచిది. ప్రతి పద్యము చాలా రసవంతముగ ఉన్నది. కవిత హృద్యమైనది. ఈ శతకమున నుత్త మాధమ క్షత్రియుల గుణములు వివరింపఁబడినవి. దీనియందు కొన్ని పద్యములు వేమన, వేణుగోపాల, నరసింహ, కుక్కుటేశ్వర శతకముల బద్యములఁ బోలి యున్నవి. పోతన పద్యములకుఁ గల బోలికలు గూడ గలవు. కాని యీ కవికాలము నిశ్చితముగ తెలియరాదు. దీని వ్రాతప్రతులు 200 సంవత్సరములు ప్రాచీనమైనవిగా గనఁబడుటచే నీ కవి క్రీ.శ.1700 సంవత్సరములకు పూర్వము వాఁడుగా దోఁచును. ఈ శతకమున నీతఁడు 'కులము గోదావరి కూలఁజేయు' నను సామెత వాడినందున, నీతఁడు గోదావరి మండలము వాఁడేమో యని యూహకు తావిచ్చుచున్నది. కాని యిది ప్రామాణికము గాదు.

కాళహస్తీశ్వరునిపై నీ శతకముగా ధూర్జటికవి 'కాళహస్తీశ్వరా' యను మకుటము గల శతకమును, బాణాల వీర శరభేంద్రుడు 'సాంబశివా, మహాప్రభో' యను మకుటము గల శతకమును, బొడ్డపాటికొండల 'తిరుకాళహస్తిలింగ' శతకములును ప్రాచీనములు గనఁబడుచున్నవి. ఈ శతక ప్రారంభము :-

సీ. శ్రీధరార్చిత, భర్గ, చిత్తజాంతక, యీశ,
నిర్జిత గజదైత్య, నీలకంఠ

నతదివ్యకోటీర, నవ్యరత్నప్రభా
భానుకరోత్ఫుల్ల పాదపద్మ
ధాత్రీధరేంద్ర కోదండ మండిత హస్త
దహన తారాధిప తరణినేత్ర
సకలలోకాధార, శాశ్వత, సర్వజ్ఞ
సచరాచరాకార శైలభర్త;

గీ. యవధరింపుము నా నేర్చినట్లు నీకు
విన్నవించెద శతకంబు వేడ్కలలర, ప్రణుత....... ॥

శైలికి, భావములకుఁ గొన్ని పద్యములు చూపెదను.

సీ. ధనవంతుఁడై యుక్త దానహీనుండైన
నరుని వర్తనఁజూచి నగును ధనము
తనయునిఁ బ్రేమతోఁ దండ్రి ముద్దాడంగఁ
జూచి నవ్వును జారసుదతి మదిని
అవని నాయది యని యనిశంబు గర్వించు
ధరణీపతినిఁజూచి ధరణి నగును;
వెన్నిచ్చి రణరంగవిముఖుఁడై చనువాని
నలి మృత్యు వెంతయు నవ్వుఁగాన;

గీ. లోభితనమున నిందకు లోనుగాక
మెలఁ గఁ నేర్చిన నరునకుఁ గలుగు శుభము॥ ప్రణుత॥ 6

సీ. తనయుపైఁ గల భక్తి తల్లిదండ్రులమీఁదఁ
గలుగనేర దదేమి కారణంబొ?
ఇంతిపైఁ గల ప్రేమ యిష్టదైవముమీఁద
లేదు నరుల కెట్టి లిఖితఫలమొ
ధనముపైఁగల బాళి ధర్మమార్గములందుఁ
దలఁపఁగూడ దదెట్టి దైవఫలమొ



తన ప్రాణముల మాడ్కి ధరణిజీవులనెల్లఁ
గలయచూడ రదేమి కర్మఫలమొ

గీ. సరసిజానను(డీరీతి సర్వజనుల
మోహజలరాశిలో సదా మునుఁగజేయు॥ప్రణుత॥ 8

పై పద్యములనుబట్టి కవికెట్టి సూక్ష్మజ్ఞానము లోక వ్యవహారము లందు గలదో స్పష్టము. ఈ కవి సోమవారవ్రత మాహాత్మ్యమును ద్విపదలో రచించిన శ్రీగిరి మల్లికార్జునస్వామికవి బందుగుడేమో.

## III. చెన్నాప్రెగ్గడ నాగరాజు, గణసౌజాన్యాఖ్యాన శతకము

చెన్నాప్రెగ్గడవారిది చాలా ప్రాచీన కుటుంబము. వీరిలో ప్రాచీనులు మంత్రులుగా నున్నట్లాంధ్ర చరిత్ర తెల్పుచున్నది. వీరిలో రెండు మూడు వందల యేండ్లక్రిందట కొందఱు శుద్ధ శైవులుగానుండిరి. కొందఱిటీవల వైష్ణవమత ప్రియులైరి. నాగరాజకవి సుమారు క్రీ.శ.1750 ప్రాంతమువాడు. ఈతఁడార్వేల నియోగి - ఆపస్తంబసూత్రుడు; గోదావరి మండలములోనివాఁడు. ఇతఁడు మల్లంపల్లి రామలింగగురునిచే లింగధారుడై దీక్ష స్వీకరించెనని యీ శతకమందలి యీ ప్రారంభపద్యమువలనఁ దెలియుచున్నది.

శా. శ్రీమన్మల్లముపల్లి వంశకరు వాక్ప్రీవల్లభప్రేరిత
ప్రామాణ్యాక్షర నైజభావదళ సప్రఖ్యాత శ్రీరామలిం
గామర్త్యప్రభులోకపావనుని లింగాంగైక్య సౌఖ్యాన్వితున్
శ్రీమంతున్నుతియింతుఁగొల్తుఁదలఁతున్ సేవింతు దీక్షాగురున్. 1

తాళలింగము కొడుకగు బ్రహ్మలింగ మీతని మతగురువు గాఁబోలు

ఉ. అల్లమదేవు సత్కృపయు, నా బసవేశు మహోన్నతత్వమున్
దెల్లమిగాఁగ మీఁద సరిదేవయ ప్రాక్తన భృత్యభావమున్
బెల్లుగ సిద్ధరాముని గభీరశివత్వము నొక్కటైన మ
ద్వల్లభుదాళమాన్యసుతుఁ దల్చి భజించెద బ్రహ్మలింగమున్. 2

ఈ శతకమున 108 పద్యములున్నవి. ఈ శతకమునకు మకుటము లేదు. ఉత్పల, చంపక, శార్దూల, మత్తేభములలో నిది వ్రాయఁబడినది. ఒక్కొక్క పద్యమున నొక్కక్క శివభక్తుని చరిత్ర యిందు ప్రస్తుతింపఁబడినది. ఈ కవి మరియొక కృతి, శైవాగమశిఖామణియను శైవ వేదాంతగ్రంథము.

శా. **చెన్నాప్రెగ్గడ నాగరాజ రచిత శ్రీమద్గణస్తోమ సౌ**
**జన్యాఖ్యాన సువృత్త పద్యశతక జ్ఞానార్థ సద్భక్తి సం**
**పన్నుండైన ఘనుండు శంభుని దయాపాత్రుండునున్ ముక్తి సం**
**పన్నుండై సుఖియించుచుండుఁ ద్రిజగత్ప్రఖ్యాతిఁ జెన్నొందుచున్.**

## IV. అమలాపురపు సన్యాసికవి - శివశతకము - (1)

అమలాపురపు సన్యాసికవి శివశతకములను వ్రాసెనని జనశ్రుతి కలదు. కాని ముఖలింగశతకము, పంచముఖేశ్వర ప్రభుశతకము, గౌరీ రమణ శతకము, శివశతకము, విశ్వనాథశతకము మాత్రమిప్పుడు కనఁబడుచున్నవి. ఇవికాక యీ కవి రుద్రాక్షమాహాత్మ్యమును రచించెను. రామాయణమునుగూడ రచించెనని యతని శిష్యుఁడగు దేవులపల్లి చంద్రశాస్త్రిగారి సీసమాలిక తెల్పుచున్నది. ఈ కవి విశాఖపుర మండలంలోని పాలతేరు వాస్తవ్యుఁడు. కుమ్మరి కులమువాఁడయ్యు విప్రులీతని శిష్యులుగా నుండి రనుటవలన నీతని పాండిత్య మెట్టిదో విశదము. ఈతఁడు క్రీ.శ. 1760 సంవత్సరములో మృతి నొందెను. ఈతని కవిత్వమునందు భాష యనవసరముగ నియమ బద్ధమగుటచే ధార కుంటుపడినది.

**శివశతక ప్రారంభము :-**

క. **శ్రీక్షితి జలనిధితూణ, మ**
**హోక్షకులాధ్యక్ష జవ వదురుకంఖాణా,**
**యక్షీణ కరభృతైణ ఋ**
**భుక్షావనతాధురీణ పోషింపు శివా!**



క. **ధన్యామలాపురాన్వయ**
**మాన్యుఁడ శ్రీకేశవాఖ్య మహితాత్మజుఁడన్**
**సన్యాసి సమాఖ్యుఁడ గిరి**
**కన్యారమణీశ నన్నుఁ గరుణింపు శివా॥**

క. **దుష్కరమగు ప్రాసంబులఁ**
**బుష్కలవాక్పటిమఁ గందములఁ జెసెద శో**
**చిష్కేశనయన చయ్యన**
**నిష్కప కములొసఁగి ప్రోవు నిఖిలేశ శివా॥**

**అంతము :-**

క. **బత్తిమహాసష్టావింశ**
**త్యుత్తర శతకందమాల నొనఁగూరిచి దే**
**వోత్తమ నీ కొసఁగితిని యు**
**దాత్త కృపా స్ఫూర్తిఁగొనుము, ధర్మజ్ఞ శివా॥**

ఈ కవి గురువు కట్టమూరి కామేశ్వరకవి. సన్యాసకవినిగూర్చి యాతని శిష్యుఁడే దేవులపల్లి చంద్రశాస్త్రి రచిత సీసమాలిక భాగమిది.

సీ. ....... ............ .............
**'అమలాపురాన్వయామ్బ**
**తాంబోధిరాకాసుధాంశుండు నాగ ను**
**ద్భవమంది మదిని సద్భక్తి మెఱయ**
**గట్టమూరి కులాగ్రగణ్యుఁడై మించు కా**
**మేశ్వరాఖ్య కవీంద్రువలన**
**సకలంకవృత్తిని సకలాంధ్రభాషా వి**
**శేషజ్ఞుఁడై నిజశిష్య సంచ**
**యమునకునెల్ల మహా ముదమొదవంగ**
**గరతలామలకంబుగాఁగ నన్ని**
**విద్యలఁగఱపి వివేకాత్ముఁడగుచుఁగా**
**శీప్రముఖాఖిల క్షేత్రములను,**

గ్రమమున సేవించి రామాయణగ్రంథ
మమరంగ వ్రాసి పట్టాభిషేక
మొనరించి ధరణీసురోత్తములలర రు
ద్రాక్ష మాహాత్మ్య ముఖ్య ప్రబంధ
ములు మూఁడొనర్చి నిచ్చలు సోమవారమ
హావ్రతుండయి యనయంబు నటుల
నలరు సన్యాసి నామధేయాన్వితుఁడు స
ముజలంబగు లింగైక్యమొందె నౌర,
తలపఁగా నిట్టి పురుషుండు ధాత్రిఁ గలఁడె
యనుచు జనులెల్ల నొక్కటై యభినుతింప'

పై వాక్యములనుబట్టి సన్యాసి కవి జీవితము బహుపవిత్రమైనదని భావింపవచ్చును. శివశతకమునుండి మఱికొన్ని పద్యములు.

క. వాఃపూరము దిగనాడి ప
యఃపాన మొనర్చు రాజహంసగతి, మదా
హఃపుంజ మడఁచి సుకృత మ
నః పరివృతుఁ జేయవయ్య నను సాంబశివా!

ఈ విధముగా దుష్కరప్రాసముల గైకొని రచించినాడీ కవి.

## శివశతకములు - 2 (గ్రంథకర్త పేరు తెలియదు)

శివనామమకుటముగల యీ శతకము కందపద్యములలో వ్రాయఁబడెను. ఇందు కవి చెన్నబసవన, బసవేశ్వర, శివనాగుమయ్య, నిమ్మవ్వ, ధూర్జటి, ఉద్భటారాధ్యులు మొదలగు వీరశైవుల స్తుతించుటచే నీ కవి వీరశైవుఁడని



తెలుచున్నది. ఈ కవిపేరుగాని, కాలముగాని తెలియరాదు. ఈతఁడు ధూర్జటికవి నిట్లు ప్రశ్నించెను.

క. చెలిచంటిమీఁదఁ జేయిడి
చెలువొప్ప శివా యటన్న చేడియ నవ్వన్
చలపట్టి శివునిఁ జూపిన
చెలువుని ధూర్జటిని దలఁతు చెన్నొంద శివా!

కాన నీ కవి 16వ శతాబ్దము తర్వాతవాఁడు గావలయును. శతకమందలి పద్యములు శివలీలలు, శైవుల ప్రభావములు తెలుపుచున్నవి. పద్యములు భావములతో నిండి, మంచినడకతో నొప్పుచున్నవి. ఇందు లక్షణ లోపములు మాత్రమక్కడక్కడ గానవచ్చుచున్నవి. అత్వఇత్వములకు యతి గూర్పఁబడినది. గణనియమముగూడఁ గొన్నిచోట్ల పాటింపఁబడలేదు. భక్త్యతిశయముచే కవి యిట్లు రచించియుండును. దీనియందలి వీరశైవుల లీలాదికములు. అన్యవాదకోలహలములోని పద్యముల ననుకరించుచున్నవి. ఈ శతకము వావిళ్లవారు ప్రచురించిన శతకసంపుటముల ద్వితీయభాగములో ముద్రిత మైనవి. శైలికిఁ గొన్ని పద్యములు.

క. నీవే తల్లివి తండ్రివి,
నీవే నా తోడు నీడ, నీవే సఖుఁడౌ,
నీవే గురుఁడవు, దైవము,
నీవే నే నన్యునెఱుఁగ నిజమిదియు శివా!

ఇదే కొంచెము మార్పున కృష్ణశతకమునఁ గలదు.

క. ఓ కారుణ్యపయోనిధి
నాకాధారంబవగుము, నమ్మితి నెపుడున్

నీ కేల యితరచింతలు
నాకాధిప, సర్వలోకనాయకుఁడ, శివా!

క. నీ పాదకమలసేవయు
నీ పాదసరోజభక్తినిరతులయెడలన్
స్నేపార నిష్టజనదయ
నే పావనమౌదు నన్ను నెనఁగూర్చు శివా!

క. కందర్పహరుఁడు నరుతోఁ
బందికినై పోరిపోరి పరిపూర్ణకృపన్
గ్రిందైన హరుని జూటపుఁ
జందురులో నిత్తి నేల చంగలి మేసెన్.

## గుహేశులింగ శతకము- (కర్త పేరు తెలియదు)

ఘనశివరాజయోగవిలాసమను నామాంతరము గల యీ శతకము 105 పద్యములు కలిగి వీరశైవభక్తులను, శివుని స్తుతించుచున్నది. గ్రంథకర్త పేరు తెలియరాదు. పాల్కురికి సోమనాథుని చతుర్వేదసార సూక్తులు, బసవ పురాణము, పండితారాధ్య చరిత్రములు ప్రధానముగా నీ శతక రచనమునకుప కరించినవి.

సీ. గుడిలోనఁ బ్రతిశబ్దగుంభన నాలోన
పలికినవాఁడవై ప్రబలుచుంటి
చంటిలోపలనుండి సరవి నోహోయని
పల్కినవాఁడవౌ ప్రభువ తలఁప
అట్లు నాలోనుండి అతడిన్ని భంగులఁ బల్కినాడని....
ఘనశివరాజయోగవిలాసమను పేర
సీసశతంబు నేఁ జెప్పినాఁడ.



## V. పరిమి వెంకటాచలకవి - సంగమేశ్వరశతకము

ఈ కవి సూరమరఘునాయకులపుత్రుఁడు. హరితసగోత్రుఁడు, ప్రథమ శాఖానియోగి బ్రాహ్మణుఁడని తన పద్యమువలననే తెలియుచున్నది. అది యిది

చ. నరహరిభక్తి మించు రఘునాయకమంత్రికి సూరమాంబకున్
హరిసుతుడన్ ధరంబరిమివంశజుడన్, భవదీయదాసుఁడన్
హరితసగోత్రజుండ జెలువొంద జనించితి నాదిశాఖ యం
దరయఁగ వెంకటాచలసమాఖ్యుఁడఁ గూడలిసంగమేశ్వరా॥

ఈతఁడు తుంగభద్ర సమీపమందలి జాగర్లమూడి నివాసి. ఈ జాగర్ల మూడి గుంటూరు మండలముననున్నది. అందువెలసిన 'కూడలిసంగమేశ్వరు' నిపేర శతకముకలదు. రెండునదులుగల స్థలమునకు గూడలి సంగమేశ్వరమని పేరు. అక్కడి దేవునకదేపేరు. కృష్ణా తుంగభద్రా నదుల సంగమ స్థలమున నీ జాగర్లమూడి గలదు. కర్నూలు జిల్లాలోని తుంగభద్ర వేరు, ఈ తుంగభద్ర వేరు.

ఉ. మేలుగఁదుంగభద్రకు సమీపమునందమరావతీపురిం
బోలినయట్టి జాగరలమూడి పురిం దగ సర్వమంగళా
లోలుఁడవై వసించి సిరులు న్నిజభక్తులకిచ్చుచున్ దయా
శీలత నొప్పుచుందువు ప్రసిద్ధి గఁగూడలి సంగమేశ్వరా!

ప్రారంభము :-

ఉ. శ్రీగిరిజాపయోధరపరిస్ఫుట చర్చితసారగంధగం
ధాగరుకుంకుమాంకిత సమంచదురస్క, జగత్త్రపాలనో
ద్యోగమనస్క శారదపయోద సమానయశస్క, సంతతా
భోగవయస్క, సర్వమునిపూజిత, కూడలిసంగమేశ్వరా!

ఈ శతకమున 108 పద్యములు గలవు.

ఉ. నెయ్యము మీఱఁదొల్లి కరుణింపవె సత్కృపతోడ మాదిరా
జయ్యను, బండితార్యు, బసవన్నను, శానియమాదికోటకో
టయ్యను, దేశిరాజు, సిరియాళునిఁ జోళమహీశు సిద్ధరా
మయ్యను, బాచిరాజు, దరసయ్యను గూడలి సంగమేశ్వరా!

**అంత్యము :-**

చ. చిరకృప మంగళాద్రినరసింహుఁడు నా మదిపాదులోన సు
స్థిరముగ నాటనంత భవదీయకటాక్ష సుధాప్రవృష్టిపైఁ
గురిసిననెచ్చి నల్దెసలఁగూడిన మామకకావ్యకల్పవ
ల్లి రహిబుధాళి మెచ్చగ ఫలింపదె కూడలిసంగమేశ్వరా!

మంగళాద్రినరసింహుఁడనఁగా ప్రస్తుతము గుంటూరు జిల్లా యందలి మంగళగిరిలోని పానకాలరాయుఁడని పేరుగల నరసింహస్వామియే. అందుచే నీ కవి గుంటూరుమండలవాసి యనుట ధ్రువము.

## VI. తటవర్తి కొండయ్య - మల్లేశ్వరశతకము

తటవర్తివారు తణుకుతాలూకా మల్లేశ్వర గ్రామప్రాంతమునఁ జాల ప్రసిద్ధిగలవారు. వీరిలోఁ జాలమంది తెలుఁగున ప్రసిద్ధపండితులుండిరి. తెలుఁగు భారతమును వీరిలోఁ గొందఱు కంఠపాఠము చేయఁగలవారట. అందులకై వీరికి బొబ్బిలి పిఠాపుర సంస్థానములలో భూములు, వార్షికములు నొసంగిఁపబడినవి. రామచంద్రపురము తాలూకా మసగపల్లి గ్రామమున మల్లేశ్వరస్వామియుండనోపు. ఆ స్వామిమీదనే యీ శతకము కవి వ్రాసి యుండును. ఈ శతకము 100 సీసపద్యములు గలది. ఈ కవి 1850 ప్రాంతము వాఁడు గాఁదగును. ఈతఁడు తన్నుఁగూర్చి శతకమున నిట్లు తెల్పుకొనెను. ఈతనిది కౌండిన్యసగోత్రము. ఈతఁడు రామశతకమును గూడ రచించెను. అందు రామాయణకథ గలదు.

కవి తన వంశమును గూర్చి చెప్పికొనిన పద్యమిది.



సీ. గురుతర కౌండిన్యగోత్ర పవిత్రులు
ధరణిలో మిక్కిలి ధర్మపరులు,
తటవర్తి వంశాబ్ధితారకామణులును
కృష్ణమరాజాఖ్య కూర్మిసుతులు,
కొండయ్య, చలమయ్య, గుణి కామరాణ్మంత్రి
సీతన్న, సుందన్న చెలువుగాను
వెంకటామాత్యుఁడున్ విలసిల్లిరార్యులు
షట్చక్రవర్తుల సరణిగాను,

* * * * * * *

సీ. ఆ మహామహులలో ననుజన్ముఁడై నట్టి
వెంకటామాత్యుండు వేడ్క మమ్ము
ముగ్గురు తనయుల ముదమొప్పఁగనియెను
సాంబయ్య, కొండయ్య, సరణితోడ
సుబ్బరాయాఖ్యులన్ సుజనవిధేయులు
వారిలో రెండవవాని నన్ను
తన కగ్రజన్ముఁడై తనరుచుండినవాని
కొండయామాత్యుని కోర్కె దీర్ప
దత్తపుత్రునిగాఁగ దయతోడ నిచ్చెను
కొండయాహ్వయుఁడను కుజనదమన

గీ. దాసదాసుండ నాయందు దయ దలిర్ప
నీదుపదమును దయచేయు నిగమవినుత
పండితోల్లాస మస్కరపల్లివాస
భవభయవినాశ! మల్లేశ! పార్వతీశ!

ఇది ఇట్లుండగా శతకవులచరిత్రమునందు (చూ.పుటలు 462, 463) తటవర్తి కొండయ వెంకటకవి దత్తపుత్రుడని వ్రాయుట బహు విచిత్రముగ నున్నది. పై సీసపద్యములనుబట్టి వారి వంశవృక్షమిట్లుండును.

**తటవర్తి కృష్ణమరాజు**

**కొండయ్య చలమయ్య కామరాజు సీతన్న సుందన్న వెంకటమంత్రి**

**సాంబయ్య కొండయ్య కవి సుబ్బయ్య**

వీరిలో పై పద్యమునుబట్టి నన్ను తన కగ్రజన్ముఁడై తనరుచుండిన కొండయామాత్యుని కోర్కెదీర్ప దత్తపుత్రినికాగ దయతోడ నిచ్చెను అని కవి తెల్పుకొనుటచే కొండయ్యకవి, వెంకటకవి కౌరసపుత్రుఁడనియు, వెంకటకవి యగ్రజుడైన కొండయమంత్రికి దత్తపుత్రుడనియు స్పష్టము కదా! కాన నీ కవి వెంకటమంత్రికి దత్తపుత్రుడని వ్రాయుటలో శతకకవులకర్త భ్రాంతిపడినాడు.

## పండితారాధ్యుల వీరేశలింగము - భవానీశతకము

ఇందు 50 పద్యములున్నవి. ఇది కందపద్యశతకము.

**ప్రారంభము :-**

క. **శ్రీకరదివ్యపదాబ్జా**
**పాకారి ప్రముఖ దేవపంక్తిస్తుత్యా!**
**(లోకేశ) సూతరాణీ**
**చేకొనుము మదీయకవితక్షితిని భవానీ!**

క. **పలుమరు నీ పాదంబుల**
**గొలుతును నా కోర్కులిమ్ము గురుతరకరుణా**



**జలనిధివై వసియింపుము**
**వెలయఁగ నా యెడద తమ్మివిరిని భవానీ!**

**అంత్యము :-**

క. **ఎన్ని విధంబుల వేడినఁ**
**గన్నడ చేసెదవుగాని కరుణింపవు నీ**
**కన్న మఱి వేల్పు లేయెడ**
**నున్నారా, తెల్పుమందు నొకని భవానీ!**

## VII. వేల్పూరి విస్సన్న, సాంబశివుఁడు - శ్రీవిశ్వేశ్వరశతకము

109 సీసపద్యములు గల యీ శతకము ఔరంగజేబు పాదుషా దండెత్తివచ్చి కాశీపట్టణమును ధ్వంసపఱచి, విశ్వేశ్వరాలయాది సన్నివేశములను గోరీలనుగాను, మసీదులనుగాను మార్చినప్పటి దుస్థితిని వెల్లడించుచున్నది. విస్సన్న యిందు 73 పద్యములు చెప్పగా, నతని మనుమడైన సాంబశివకవి మిగిలినవి చెప్పెను. పూర్వభాగమున, తురుష్క సైనిక దుర్నయవర్ణన పూర్వకముగ విశ్వేశ్వర ప్రార్థనమున్నది. ఉత్తర భాగమున కాశికాపట్టణమును తురుష్కుల దుండగములనుండి తప్పించి, సుస్థితి సమకూర్చి సంరక్షించినట్లు విశ్వేశ్వరస్వామి స్తుతింపఁబడియె.

సీ. **శ్రీకరగౌరీవిచిత్రపత్రాలేఖ**
**భాసురాంచన్నఖ బహుపరాకు**
**బహుతర బ్రహ్మాండ భాండసంరక్షణ**
**భద్రాసనాసీన బహుపరాకు**
**రంభోర్వశీముఖ్యరమణీరసోచిత**
**ప్రకటలాస్యాలోక బహుపరాకు**

ప్రణుతదిక్పాలకోద్భటజయజయనాద
లహరీముఖామోద బహుపరాకు

గీ. దేవ యవధారు బహుపరాకే వహించి
యంటదగునయ్య యిపుడు నీ బంట నేను
విన్నవించెద నా మాట విన్నలెస్స
విజితపరయూథ! కాశికావిశ్వనాథ!

సీ. మితిలేని లింగాలు చితుకఁగొట్టెడివేళ
మండపంబులు రూపుమాపువేళ
చమరిమతాల్ గుమ్మటములు గట్టెడువేళ
గుళ్ళలో నావులఁ గోయువేళ
విగ్రహంబులఁజూచి విరుగఁవేసెడువేళఁ
దివిరి సాధువుల బాధించువేళ
జపహోమకృత్యముల్ సాగనియ్యనివేళ
నుపచారమంతయు నుడుపువేళ

గీ. చేరి గుడియె మసీదుగాఁ జేయువేళ
మఱచియున్నావొ యవనుల మదమడంచఁ
దామసించిన దిది నీకు దంటతనమె ॥విజిత॥

సాంబశివుని పద్యములివి :-

సీ. గంగానదీ తటక్ష్మాజమూలంబుల
తపముసేయుచునున్న తపసు లలర
నీ పురాంతర్గత నిఖిల విప్రక్షేత్ర
విట్ఛూద్రులానందవిధి వహింప,



ఆరామసీమలయందు సుస్థిరలీల
గన్న యోగులు సౌఖ్యగరిమ చెంద
వెలఁదులు, శిశువులు వృద్ధులు నిర్భయ
సహితులై నీ కీర్తి సంస్మరింప

గీ. మ్లేచ్ఛబలముల సమయించి స్వేచ్ఛచేత
నిష్టభృత్యుల రక్షించి వృద్ధిగన్న
నీ పరాక్రమ మేను వర్ణింపఁగలనె ॥విజిత॥ 74

"ప్రమాదీచ.సం.శ్రావణ శుక్రవారము 6 సరికి వేల్పూరి సాంబ శివుఁడు తన ప్రపితామహుఁడైన వేల్పూరి విస్సన చెప్పిన కాశికావిశ్వేశ్వరు మీఁది శతకము సీసపద్యాలు పూర్ణముగాఁ జెప్పి వ్రాసెను." అని చివరనున్నది.

## VIII. దెందులూరి పద్మనాభుఁడు - అల్లమప్రభుశతకము

ఈ శతకమున 99 పద్యములున్నవి. ఈ కవిది యజుశ్శాఖ, కౌశిక గోత్రము. ఇది అల్లమప్రభున కంకితము సేయఁబడినది. కవి తన్ను గూర్చి చెప్పికొనిన పద్యమిది.

చ. జననుతమౌ యజుర్నిగమశాఖ సుకౌశికగోత్ర సంభవుం
డను, మదిలో సదాశివుని దల్చెడివాఁడగు దెందులూరి గం
గనకును...... గాదిలిపుత్రుఁడఁ బద్మనాభుఁడన్
ఘనముగ వృత్తపద్యశతకంబు రచించితి నల్లమప్రభూ!

ఇది ప్రౌఢరచన కాదు. అసమర్థునిచే వ్రాయఁబడినది.

## IX. మల్లంపల్లి బుచ్చయ్యశాస్త్రి - మహిషాసురమర్దనీశతకము

ఇందు 108 పద్యములున్నవి. గోదావరీమండలంలోని ఏలూరులో వెలసిన 'జలాపహారీశ్వరస్వామి' దేవియగు మహిషాసురమర్దని స్తుతిగా నీ

సీసపద్యశతకము విరచితము.

సీ. వీరవల్లి యనంగ వెలయు నూర వసించి
యంబికాలిఖిత బీజాక్షరుఁడయి,
మృదుకవిత్వము చేసి మెప్పించె మమ్ము మా
పూరుష మీ తాత భోగలింగ
మెల్లవేళలయందు, మల్లమపల్లి బు
చ్చికవీంద్ర యటు మీకు క్షేమముగను
వచియింపుమని రచింప నొనర్చెఁ దానె నా
చేత నీపై మేలి సీసశతక.

గీ. మంబ గీర్వాణి సంసేవితాంఘ్రిపద్మ,
దుర్గహేలాపురాంతరస్తుత్యపద్మ
వరజలాపహరీశ్వర వశ్యదార
మహిమ దానవ దుర్వార మదవిదార. -97

## సోమకవి - సోమేశ్వర శతకము

ఈకవి 'ఉట్కోటపుర' వాస్తవ్యుఁడు. ఈ శతకము కోశాలపురమున వెలసిన సోమేశ్వరస్వామి పేర సీసపద్యములో రచింపఁబడెను. ఇందు 111 పద్యములున్నవి.

సీ. కలియుగాచార్యుండు ఘనపండితారాధ్య
పుంగవుండూట్కోట పురనికేత
నుండు, పురాణవర్యుండు, పావనవీర
సింహాసనుఁడు, బహు శిష్యగణ వి
రాజితస్తుత సిద్ధరాము, సద్గురుమూర్తి



కరపద్మజుఁడు, కళంకంతుభక్తి
గలుగు పింబాలి లింగము శివమాంబకు
ననుఁగు పుత్రుఁడు కారణాన్వయుండు

గీ. సోమకవి చెప్పె నీ కృతి సుముఖులెల్ల
విని ముదంబందఁ గృపఁజూడవే మదీశ
'బుధజనాధీశ కోశాలపురనివేశ
చిరకృపావేశ సోమేశ చిత్ప్రకాశ.'!

సీ. పండితారాధ్యుల ప్రస్తుతి గావించి
వేమనారాధ్యుల వినుతిఁజేసి
సోమనారాధ్యుల ప్రేమతోఁ గొనియాడి
గణపనారాధ్యుల ప్రణుతిచేసి,
మాకనారాధ్యుల మేకొని భజియించి
బసవనారాధ్యుల నెసఁగఁదలఁ చి
రేవనారాధ్యుల భావంబులో నెంచి
శంకరారాధ్యుల స్మరణచేసి

గీ. మఱి శివకవుల పదముల కెఱఁగి మిమ్ము
నలరఁ గీర్తింపనే పాత్రుఁడైతి నిపుడు ॥బుధ॥

# నవమ ప్రకరణము

## యక్షగానములు

ఆంధ్రాలంకారికు లాంధ్రకవిత్వము 'ఆశు, మధుర, చిత్ర, విస్తరమ'ను చతుర్విధ బేధములు విభజించి, యక్షగానములను మధుర కవిత్వమునం జేర్చిరి. ఇది భాష, భావము, ఛందము, మొదలైన వానియందు దేశిగానుండి సంగీత సహాయమును గోరును. యక్షగానములకు 'జక్కులపాట'లని దేశీయ వ్యవహారము. ప్రాచీనాంధ్రులలో జక్కులు, బవినీడులను జాతివారు సంగీత సాహిత్యములందేకాక చిత్రకళా కౌశలము నందును నేర్పరులు. వారి యక్ష గానము లాంధ్రదేశమున బహు ప్రాచీనములైనవి. ఈ జక్కులవారిని గూర్చి శ్రీనాథుడు తన క్రీడాభిరామమున నిట్లు వర్ణించినాడు. ఇది క్రీ.శ. 14వ శతాబ్దపు విషయము.

**సీ.** **కోణాగ్ర సంఘర్ష ఘుమఘుమధ్వని తార**
**కంఠస్వరంబుతో గారవింప**
**మసిబొట్టుబోనాన నసలుకొల్పిన కన్ను**
**కొడుపుచేఁదాటించు నెడపఁదడప,**
**శ్రుతికి నుత్కర్షంబుఁ జూపంగవలయుచోఁ**
**జెవిత్రాడు బిగియించు జీవకఱ్ఱ,**
**గిల్కుగిల్కున మ్రోయు కింకిణీగుచ్ఛంబు**
**తాళమానంబుతో మేళవింప**

**గీ.** **రాగముననుండి లంఘించు రాగమునకు**
**నురుమ యూరుద్వయంబుపై నొత్తిగిల్లి**
**కామవల్లీ మహాలక్ష్మి కైటభారి**
**వలపుఁ బాడుచు వచ్చె జక్కులపురంధ్రి.**

ఈ యక్షగానములు నన్నయ కాలముననే యుండి యుండవచ్చును గాని, దానికిఁ దగిన ప్రబలములగు నాధారములు లేవు. కాని పాల్కురికి సోమనాథుడు



పండితారాధ్య చరిత్రమున పర్వతప్రకరణమున శివరాత్రి జాగరణమునఁ జేసిన వర్ణనలఁబట్టి యాకాలముననే యక్షగానము లుండెడివని యనుమానింపవలసి వచ్చుచున్నది. ఆ వర్ణన యిది.

**"ప్రమథ పురాతన పటు చరిత్రములు**
**క్రమమొంద బహు నాటకములాడువారు,**
**లలితాంగ రసకళాలంకార రేఖ**
**లలవడ బహురూప మాడెడువారు,**
...... ...... ..... .......
**అమరాంగనలు దివి నాడెడు మాడ్కి**
**నమరంగ గడలపై నాడెడువారు,**
**ఆ వియద్గతి యక్షులాడెడునట్టి**
**భావన మ్రోకులపై నాడువారు;**
**భారతాది కథలు చీరమఱుంగుల**
**నారంగ బొమ్మల నాడించువారు**
**కడునద్భుతంబుగఁ గంభసూత్రంబు**
**లడరంగ బొమ్మల నాడించువారు,**
**నాదట గంధర్వ విద్యాధ**
**రాదులై పాత్రల నాడించువారు"**

మరియు యక్షగానము లందుపయోగింపఁబడు పదవాఙ్మయమును గూర్చి కూడ సోమనాథు డిట్లు తెలిపినాడు వాదప్రకరణమున.

**పదములు, తుమ్మెద పదముల్ ప్రభాత**
**పదములు, పర్వతపదము, లానంద**
**పదములు, శంకర పదముల్, నివాళి**
**పదములు వాళేశు పదములు, గొబ్బి**
**పదములు, వెన్నెల పదములు, సంజ**
**వర్ణన మఱి, గణవర్ణన పదము**
**లర్ణవ ఘోష ఘూర్ణిల్లుచునుండఁ**
**బాడుచు నాడుచుఁ బరమహర్షమున**
**గూడి సద్భక్తి సంకుల మేగుదేర"**

పై విషయములఁ బట్టి యక్షగానములు ప్రాచీన కాలమున నుండెనని విశ్వసింపవచ్చును కదా. కొంద ఱాంధ్రనాటక పరిణామమును సూచించుటలో యక్షగానములు ప్రారంభదశగా నిర్ణయింతురు. కాని యా విషయము విచార్యము.

ద్రావిడదేశమున, 'కురవంజు'లని కొన్ని దృశ్యకావ్యములున్నవి. ఈ పదమున కాటవికులైన చెంచులు, కురవలు, (కారవ, కోవ, కోయ) జాతివారి, అంజె, అడుగు నృత్య విశేషమని యర్థము. చిందు, గంతు, గొండ్లి, అంజ, అంగ మొదలైనవి జాతీయ నృత్య పరిభాషలోనివి. బహుకాలమునుండి శ్రీశైలము, మంగళగిరి, నృసింహక్షేత్రము, వెంకటాద్రి మొదలగు పర్వత ప్రదేశము లందు జరుగు జాతరలు, నుత్సవములు మొదలైన వానియం దాటవికులు రాత్రులందు నృత్యముచేసి నాగరిక జనుల నాకర్షించి ధన మార్జించు నాచారము గలదు. కాన నాటవికులైన కొరవలు చేయు నృత్యములకుఁ గొరవంజులని పేరు ప్రసిద్ధమయ్యెను. కొరవంజియను పేరు మొదట వారి నృత్యమునకు, తర్వాత వారి నృత్య ప్రధానమైన గేయ రచనలకు, పిమ్మట నా జాతికి రూఢియైనది. కాలక్రమమున నీ నృత్య విశేష మాయాపర్వత స్థల మాహాత్మ్య కథలతోను, విష్ణు శివలీలా విలాస కథలతో నిండిన గేయ నాట్యరూపములఁ బడసెను. ప్రారంభమున మాయాకిరాతవేషులగు పార్వతీ పరమేశ్వరులతో నున్న కిరాతార్జునీయము, నృసింహస్వామి చెంచెతను బెండ్లాడు చెంచుకథలు కురవంజలుగా నున్నవి. ఇవి సింగి, సింగడు నను నిద్దరు పాత్రలతో నొప్పినవి. వీరు సంస్కృత నాటకములందలి నటీసూత్రధారులను బోలి యున్నారు. కొన్ని రచనములందు కథాసంధాయకుడు విదూషకునివంటివాడు, కోణంగి యనువాఁ డుండును. సంస్కృత నాటకములలోని ధ్రువాగానమే కురవంజులలో దరువుగా మారెను. ఈ యాటవికులరణ్యములనుండి నగరముల కప్పుడప్పుడు వచ్చునప్పుడు తమ నృత్య ప్రదర్శనములను జేయుచు జనుల నాకర్షించుచుండిరి.

పై నృత్యముల నాంధ్రదేశమున జక్కులవా రనుకరించి నృత్యముతోఁ బాటు గేయవచనరూపములఁ బ్రవేశపెట్టిరి. వీరి రచనలలో సింగికి సింగడుకు బదులుగా రామ, నలహరిశ్చంద్రాదులు ప్రవేశింతురు. కాని యీ రచనలలో



'ఎరుకసాని' పాత్ర మనివార్యముగ నుండును. ఇందు నృత్యధర్మముకంటె గేయధర్మ మధికముగా నుండును గాన నివి 'యక్షగాన'ము లనఁబడెను. ఇందు రగడలుగ మార్పునొందిన, త్రిపుట, జంపె, ఏక, ఆట మొదలైనవి తాళాను గుణములుగా కల్పింపఁబడి ప్రవేశపెట్టఁబడినవి. ఇంకను నిందులో దేశీయ రచనలైన ఏలలు, జోలలు, ఆరతులు, ధవళములు, వెన్నెలపదములు, తుమ్మెద పదములు, అల్లో నేరేళ్ళు, మొదలైనవెన్నో చేరినవి. ఈ యక్షగానములు దేవతల యుత్సవములందు సామాన్యముగా ప్రదర్శింపబడుచుండెడివి. ఇవి మధుర, తంజావూరు రాజుల కాలమునందును వీరశైవుల చేతులలో నధికముగా ప్రబలినవి. వీనిని 17వ శతాబ్దిలో కృష్ణాజిల్లా యందలి కూచిపూడి గ్రామమున సిద్ధేంద్రుడను యోగీంద్రుడు భాగవత కథలను పారిజాతము, గొల్లకలాపము మొదలగు పేర్లతో యక్షగానములుగా రచించి భరతనాట్య సంప్రదాయములతో, కేవలము పురుషులచేతనే స్త్రీ పాత్రలు గూడ ధరింప చేసి నాట్యాచార్యుడయ్యెను. వీరి కథలలో పారిజాతాపహరణ కథ హృద్యతర మైనది. దీనిఁబట్టి యక్ష గానములకు పారిజాతమను పేరుగూడ రూఢియైనది. ఇందు సవతుల కలహము ప్రధానమైనది. ఆంధ్రమున సుమారు 300 యక్ష గానములు కలవు.

ఆంధ్రమున నోబనమంత్రి రచించిన గరుడాచల నీలాచలములను రెండు యక్షగానములు బహు ప్రాచీనములైనవి. ప్రాచీన యక్షగానములు అనగా శైవమత విజృంభణమునకుఁ బూర్వమం దివి సంస్కృత భాషలో గూర్పఁ బడిన మంగళశ్లోకములతో నొప్పెడివి. జంపెలతో కథారంభమగును. ఇందు కథారంభమునకుఁ బూర్వము జంపెలతో షష్ఠ్యంతములు చేయఁబడినవి. ఇఁక రచనా విధానమందుత్తమ పాత్రల ప్రవేశపెట్టునపుడు ద్విపదయు, కవి విషయమును చెప్పవలసిన చోట జంపెలు, పాత్రల పరస్పర సంభాషణమున కందములను, స్తుతులందు దండకములు, సీసములు కూర్పఁబడెను. తర్వాతి యక్షగానములందు హాస్యము నసభ్య శృంగారమును బలసి వెగటు పుట్టించు నవైనవి.

యక్షగాన ప్రారంభదశ ఇంకొక విధముగా భావింపఁబడినది. తమిళ దేశమున కొరవంజులను, మలయాళ దేశమున 'కథకళి' యను శుద్ధ దేశీయ

ప్రక్రియ సాగుచుండగా, నాంధ్రదేశమున జక్కులవాండ్ర పాటలను గ్రహించి తమ స్వీయవచనములను సంధివాక్యములుగాఁ గలిపి గొల్ల భాగవతుల గుంపులు నాటకమాడ ప్రారంభించిరి. ఇదియే యక్షగానముల ప్రాతిపదిక రూపమని కొందఱూహింతురు. ఈ స్థితిలో నేర్పడిన నాటకములు కృష్ణుని గూర్చిన లీలలు, జలక్రీడలు మొదలైనవి. సంస్కృత నాటక వాఙ్మయమునఁ గూడ కృష్ణ సంబంధగాథలే మొదట గ్రహింపబడినట్లు పతంజలి భాష్యమునఁ దెల్పఁబడిన కంసవధ, బలిబంధనమను వానిని బట్టి యూహింపఁదగును. సంస్కృతమున వలెనే తెలుగునఁ గూడ శ్రీకృష్ణజలక్రీడాదులే ప్రాథమిక యక్షగానములకు వస్తువగుటయు సమంజసము. గొల్లలు యాదవులనియు శ్రీకృష్ణుడు దమవాఁడనియు భావించుటే గొల్లభాగవతుల గుంపులే మొదట నీనాటకముల నాడి యుందురనుటకు హేతువుగూడ నగుచున్నది. ఇట్లే, పైన దెల్పిన గరుడాచల నాటకమును చెంచుజాతికి చెందిన యానాదులు ప్రకటించిరి. ఈ నాటకమందు నృసింహస్వామి చెంచుకన్యను వివాహమాడును. ఇందు 'చెట్టులెక్కగలరా, హరి' అను చెంచుకన్యమాట లెంతయు పాత్రోచితముగ నుండి, మనోజ్ఞముగ నున్నవి. కొందరీ గరుడాచల నాటకమే యక్షగానముల ప్రారంభ రూపముగ భావింతురు.

ఈ యక్షగానములందు జక్కుల పాటలకు సంధివచనము గలుపుటే కాక క్రమముగ చిన్న ద్విపదలును, తోహరులును, పద్యములును చేర్పఁబడినవి. ఈ విధముగ 16వ శతాబ్దమువరకీ వాఙ్మయము పండితుల చేతను, కవులచేత నాదరింపఁబడక పామరజనులకొరకే రచింపబడుచునున్నవి. 16వ శతాబ్దాంత్యముననో లేక 17వ శతాబ్దారంభముననో పండితకవులీ యక్షగానములపై శ్రద్ధ వహించిరి. వారిలో సుగ్రీవ పట్టాభిషేకమును రచించిన రుద్రకవి యొకడు. 1656వ సంవత్సరములో అప్పకవీయమున 'అంబికావాదనామక యక్షగాన కృతియు చేసితి కాకునూరి కుల యప్ప' యని యప్పకవి వ్రాసికొనినాఁడు. మరియు నిందు చతుర్థాశ్వాసమున యక్షగాన లక్షణమును గూర్చి గూడ రచించినాడు.

ఇంతియ కాక ప్రాచీన యక్షగానములు సంస్కరింపఁబడుచుండెను. అట్టివానిలో విజయరాఘవుని కాళీయమర్దనమును, మహారాష్ట్ర రాజైన శహజీ



'జలక్రీడలు' నెన్నదగినవి. సుకవులు రచించిన యక్షగానములందు గూడ సుప్రసిద్ధ గ్రంథములందలి పద్యములు చేర్పఁబడుచుండెడివి. తంజావూరిలో వెలసిన యక్షగానములందు వివిధ వృత్తముల కంటె సంగీతమున కనువుగా నుండుటకై ద్విపదలు మాత్రమే చేర్పఁబడినవి. వీరీనాటకములను ప్రదర్శనార్థమే వ్రాసిరి. ఈ యక్షగానములు శృంగార రస ప్రధానములై, యెరుకసాని ప్రవేశము గల్గి, కొరవంజి లక్షణముతో నొప్పియున్నవి. ఈ కాలమున రంగాజమ్మ పాత్రోచిత భాషనుగూడ వాడెను.

17వ శతాబ్దమునకుఁ బూర్వము యక్షగానములఁ బ్రదర్శించువారు విద్యావిహీనులైనను, తర్వాత కూచిపూడి భాగవతులీ యక్షగానములకు భరత విద్యను ధనంజయుని యభినయ దర్పణజ్ఞానమును కూడ గలిపి ప్రదర్శించుటచే నివి పండిత పామర జనాదరణ పాత్రములైనవి. వీరి యక్ష గానములు రెండు విధములు. కలాపము, కథయని. కలాపములు జయదేవుని గీతగోవిందము వంటివి. అనగా శృంగారభావములలో నేదో యొకదానిని సర్వతో ముఖముగ ప్రదర్శించుచు కవిత్వమూలమున భరతశాస్త్రము మూలమున నభినయించుట. సత్యభామా కలాపమిట్టిది. ఇందు మంచి కవిత్వము, భరత విజ్ఞానము నుండును.

18వ శతాబ్దమునందు కంకంటి పాపరాజు రచించిన విష్ణుమాయా విలాసము, గోగుపాటి కూర్మకవి రచించిన మృత్యుంజయ విలాసము, మొదలైనవి వెనుకటి వానివలె ప్రదర్శన యోగ్యములుగానే వ్రాయబడినవి. కాని 19వ శతాబ్దమున బయలుదేరినవి యక్షగానములుగను, హరికథలుగ గూడ నుపయోగపడునట్లు రచింపఁబడినవి. ఇట్టిది నరహరి రచించిన తిరుమంగయాళ్వారు చరిత్రము. 19వ శతాబ్దాంత్యమునను, 20వ శతాబ్దా రంభమునను రచింపబడిన యక్షగానములన్నియు హరికథలుగనే వ్రాయఁ బడినవి. అట్టివానిలో నారాయణదాసు, బాలాజీదాసుల రచనలు ముఖ్యమైనవి.

ఆంధ్రదేశమున యక్షగానములు చిరకాలమునుండి విశేష జనా దరణముతో ప్రచారమొందుటచేతనే దశరూపక నాటక లక్షణ నిబంధనలతో సంస్కృత నాటకముల ననుకరించుటగాని, సంస్కృత నాటకముల నాటక

రూపమున నాంధ్రీకరించుటగాని 19వ శతాబ్దివరకు జరుగలేదు. సర్వ విధముల సంస్కృత వాఙ్మయము ననుకరించిన యాంధ్ర వాఙ్మయమునందిట్టి విలక్షణ ముండుట విచిత్రముగ నున్నది. అందుచేతనే సంస్కృతమునందలి నాటకములైన యభిజ్ఞాన శాకుంతలము, శృంగార శాకుంతలమను పేర పిల్లలమఱ్ఱి పిన వీరనయు, సంస్కృత ప్రబోధ చంద్రోదయ నాటకమును నంది మల్లయ్య ఘంట సింగనలు శ్రవ్య కావ్యములుగ వ్రాయుట సంభవించినది. అవి నాటక రూపమున నాంధ్రీకరింపఁబడినచో యక్షగానములతో పోటీకి నిల్వలేవని భావించిరేమో. ప్రాచీన కాలమున నీ యక్షగానములకు పండితుల యాదరణము లేకుండుటచే గాబోలు వీనిని ప్రదర్శించుటకు మంచి రంగస్థలములున్నట్లు గానరావు. మనుచరిత్రమందలి 'చిలకలకొల్కి' యను పద్యమును బట్టి యాకాలమున నాట్యశాలలుండెడివని యూహింపనగును గాని, యవి యీ యక్షగానములకో, కాక సంస్కృత నాటక ప్రదర్శనములకో, లేదా భరతశాస్త్ర ప్రదర్శనమునకో తెలియరాదు.

## I. రెగళిగె నిమ్మనాథుఁడు, నిజలింగ చిక్కయ్య కథ

విభూతి పత్రికలో నొకచోట శేషాద్రిమణకవులు పిడుపర్తి కవులను గూర్చి వ్రాయుచు పిడుపర్తి నిమ్మనాథుఁడు నిజలింగచిక్కయ కథ వ్రాసెనని రచించిరి. పిడుపర్తి సోమనాథుఁడు తన పద్య బసవపురాణమునఁ దన పెదతాత తృతీయ కుమారుడగు నిమ్మనార్యుని గూర్చి యొక సీస పద్యమును వ్రాసి, యందతఁడు కవి యని తెల్పినాడు.

**శుద్ధాత్మ పిడుపర్తి సోమయదేశిక**
**సత్పుత్రుఁ డష్టభాషావిదుండు**

**గీ. భవులకెన్నడు కవిత చెప్పని ఘనుండు**
**........ ......... ........... ...............**
**జగతిఁ బెంపారు నిమ్మయాచార్యవరుఁడు.**

కాని సోమనాథుఁడీతఁడు రచించిన గ్రంథముల నేమియు దెల్పలేదు. వీనినే యాధారముగ గ్రహించి శేషాద్రి రమణకవులు తాము భ్రాంతి చెందుటయే



కాక లోకమును గూడ భ్రాంతిపెట్టిరి. కాని చిక్కయ్య కథను గురునంబి చరిత్రమును యక్షగానములుగా రచించినది రెగళిగె నిమ్మనాథుఁడు గాని పిడుపర్తి నిమ్మనార్యుడుగాఁడు. ఈ రెగళిగె నిమ్మనాథుఁడు శంకరపిడుపర్తి శిష్యుఁడును, పర్వతలింగసుతుడును, పిడుపర్తి నిమ్మనాథుని తండ్రి సోమనయని పద్య బసవపురాణమందలి పై పద్యమునఁ గలదు గాన నిరువురు నొక్కరు గాదనుట స్పష్టము.

రెగళిగె నిమ్మనాథుఁడు తన్నుఁ గూర్చి గురునంబి చరిత్రాంత్య గద్యయం దిట్లు తెల్పుకొనెను.

**ద్వి. ................. శ్రీరాచవీటినివాస**
**ఘనభద్రకాళికాకాంతునిపేర**
**నంకితంబుగ సదాచారైక వర్తి**
**శంకరపిడుపర్తి సద్గురుమూర్తి**
**కరజాతుఁడగు చుండికలికేశుపేర**
**వరకవీశ్వరుఁడు పర్వతలింగసుతుఁడు**
**నిరుపమ రెగళిగ నిమ్మనాథుండు**
**నరసురాద్భుత గురునంబిచరిత్ర**
**యక్షగానముచేసె ననుపమప్రీతి.**

ఇఁక చిక్కయకథయందు గూడ నట్లే వ్రాసికొనెను. అది యిది.

**ద్వి. అని చతుర్దశభువనాధీశుపేర,**
**వినుత వేదాగమవేద్యునిపేర,**
**పంచవింశతి తూపాదిదేహిత్ర**
**యంచితయస్తోత్ర యక్లేశరహిత**
**సగుణ నిర్గుణ తత్వసచ్చిదానంద**
**గగనరూపుఁడు చుండికలికేశుపేర**
**శంకరపిడుపర్తి చతురకవిత్వ**
**పారాయణుండు పర్వతలింగసుతుఁడు**
**నెరజాణుఁడనుపేర నిమ్మనాథుండు**

చిరతర నిజలింగ చిక్కయ్యచరిత
మనుపమప్రీతిచే యక్షగానంబు
రచియించి మీకు సమర్పణ చేయఁదలఁచి,
కరమొప్పె నాచంద్రతారార్కమునను.

పై విషయములనుబట్టి యీతఁడు రచించిన రెండు యక్షగానములను గూడ చుండి కలికేశునకే యంకిత మిచ్చెనని తెలియుచున్నది. ఇంతకంటె కవినిగూర్చి యేమియు తెలియరాదు. ఈతఁడు పర్వతలింగ సుతుఁడనుట వలన 'వీరమాహేశ్వరాచార సంగ్రహమును' రుద్రాక్ష మాహాత్మ్యమును ద్విపదలుగా రచించిన 'పర్వతమంత్రి లింగ' కవి సుతుఁడేనా యని సందేహము కలుగుచున్నది.

## I. నిజలింగ చిక్కయ కథ, యక్షగానము

కల్యాణపురమున చిక్కయను మున్నూటికులజుండు వేశ్యలకై ధనమంతయు వెచ్చించి చివరకు ధనహీనుఁడై చోరవృత్తిని బూని సంచరించుచు నొకనాడు చౌర్యమునకై బసవమందిరమున ప్రవేశింపఁగ నందు శివభక్తులు శివపూజాదులు సేయుచుండిరి. వారిని గాంచఁగనే యీతని బుద్ధి మారి పోయినది.

### ఏకతాళి

కన్నుల మును గనుగొన్నఘములు బస
వన్నను గనునగొన్నప్పుడే పోయెన్. 1

చెవులను మును విని తవిలిన
శివమంత్రము వినినవి దెగిపోయెన్. 2

తనువున బెనగొని తాకిన కర్మము
లనుభవ మంటపమంటినఁ దొలఁగెన్. 3

నాసిక మును దానాశినకర్మము
నాశనమయ్యె సువాసనచేతన్. 4



ఘనులని తనలో ననుకొన జి
హ్వనుగొను దోషము లప్పుడే కడకేగెన్ 5

ఘనులను వీరిని పొడగన్నను మఱి
ఘనదుష్కృతములు గ్రక్కున నడగెన్. 6

ద్వి॥ అజ్ఞానతిమిరంబు లణఁగి వేవేగ
సుజ్ఞాన దీపంబు శోభిల్లఁ దొడఁగె
చెవుల వినుటవలన చెందు పాపములు
శివమంత్రములు విని శిథిలమైపోయె
కన్నుల మును జూడఁగలుగు దోషములు
హరుగణములఁజూడ నవియెల్ల నరిగె;
నాసికంబున మును వాసనాపేక్ష
చేసిన దురితముల్ శివభక్తు లచట
హరునకు ధూపంబు లర్పించుచుండ
నా వాసనలవలన నవి దూరమయ్యె.
ఘనులని యయ్యలఁ గొనియాడుచుండు
మును జిహ్వ బలుకఁగా చనుదెంచినట్టి
ఘనదుష్కృతములు శ్రీఘ్రముననె యణఁగె
ఉత్తము లీ మహాత్ములె యని తలఁచ
చిత్తంబుచేత నార్జితమైన కర్మ
మొత్తములన్ని నిర్మూలమై కదలె
ఈ రీతి ద్రోహంబు లెల్లను బోవ.

చిక్కయ్య బసవనను దీక్షనివ్వమని ప్రార్థించి పొంది లింగధారి యయ్యెను. బసవన మరియు చిక్కయకు వేయి వరహాలివ్వగ నతఁడు దానితో వర్తకము చేయుచు జంగమసేవ సలుపుచుండెను. ఒక దినమున చిక్కయ్య లింగకేళిపురమునకుఁ బోగా నచట గంగాధరుడను భక్తుఁడు గలఁడు.

పూర్వమతఁడొక రాజు, దారిద్ర్యము నొంది తలారివాఁడై భక్తుఁడై యుండెను. అతని భార్య నీలకుంతల. తలారి గంగన్న తోటలో చిక్కన్నను కలుసుకొని తన యింటికిఁ దీసికొనిపోయెను. నీలకుంతల చిక్కన్నను ప్రేమించెను. తర్వాత తలారి చిక్కన్నకు భోజనముపెట్టి రాత్రి గదిలోఁ బరుండఁబెట్టి, తాను తలారివృత్తికిఁబోగా నీలకుంతల చిక్కన పరుండిన గదిలో ప్రవేశించి తన్ను భోగింపుమని వేడెను. అంత నతఁడామెను తల్లిగా భావించెను. వారిద్దరి సంభాషణమిది. ఈ సన్నివేశము చిత్రాంగీసారంగధరుల కథను స్మరింపచేయుచున్నది.

**త్రిపుట**

**బల్లెములు నాటించినట్లుగ భామమాటలు వినియు చిక్కయ**
**తుళ్లిపడి మూర్ఛాగతుండై దొరయదెలిసెన్** 1

**తల్లి యెటువలెఁ బలికితివి నీ తనయుఁడను నేననుచు మనమున**
**తల్లడింపుచు హరహరా యని దైన్యపడుచున్** 2

**ప్రణుతభక్తులఁజూస్తి మిటువలె పాపమెరుగఁ బట్టి గా**
**రణమేమి పుట్టెను అల్లమప్రభురాయఁ డనుచున్.** 3

అని మరి న్నేమనుచున్నాఁడు.

**జంపె**

**ఉరులింగమును గట్టి గురుపుత్రురాలవై**
**పరమపాతకమేల పలికితివి తల్లీ ॥**
**పరసతిని తల్లిగా భావింతునమ్మ, నా**
**కరలింగమెరుఁగు నిది కల్ల నిజములకూ ॥** 2

**చెలియ యీ పాపంబు జిహ్వఁబలికినట్టి**
**కలముక్తి ఫలము పంచాక్షరి పఠించూ ॥**

అనిన విని చిక్కన్నతో నా నీలకుంతల యేమనుచున్నది.



**జంపె**

**ఉరులింగమూర్తియును గురుదేవుకరుణ యీ**
**సరణిఁబుట్టించె దోషము లేదు లేరా ॥** 1

**కోడెపాయపు ముద్దుగుమ్మ నా కబ్బెనని**
**సూనమరుకేళి నను జూరఁగైకొనరా ॥** 2

**పరసతిని తల్లిగా భావింతునంటివి**
**పరసతి గాను నీ భార్యననుకోరా ॥** 3

**మనమిద్దరము హాళి మరుకేళి దేలుచును**
**యెనయ పంచాక్షరి పఠింతాములేరా ॥** 4

**ఈలాటి సుఖము నీ కేలోకమునఁ గల్గు**
**నాలసింపక మదనకేళికిని లేరా ॥** 5

అంత చిక్కయ్య లేచి పారిపోయెను. కాని యతని మంచము మీద తన సంచిని మరచిపోగా, దానిలో నీలకుంతల తన లింగమునువేసి యతనిపై నిందమోపి, యతనిని జంపింతునని యామె ప్రతినపట్టెను. ఇక్కడ కథ చిత్రాంగీ సారంగధరుల కథవలె సాగినది. చిక్కయ్య పారిపోయి యొక దేవళమున నారాత్రి పరుండెను. పిమ్మట నీలకుంతల విరహబాధతో నిలువుటద్దముదరి కేఁగి, తన ప్రతిబింబమును తన చెలికత్తెగా భావించి యామెతో చిక్కన్నను తనకుఁ దెమ్మని బ్రతిమాలుకొని, చివరకు కోపముతో నద్దమును క్రిందవేసి పగులఁగొట్టెను. తెల్లవారినపుడు భర్త వచ్చిన తర్వాత చిక్కయ్యపై వ్యభిచార దోషమారోపించి కృత్రిమము చేసెను. తలారి గంగన్న స్నేహితులను బిలిచి సకలము తెల్పగా, వారు ముష్టివీరునొకరిని చిక్కన్న నెదుర్కొనుటకై పంపిరి. ముష్టివీరుఁడు చిక్కన శిరమును దేగవ్రేయఁగ నది రెండు నిలువుల యెత్తున నెగిరి క్రిందపడకయే యాకాశవాణి మూలమున జరిగిన కథనంతయు వివరించెను. అప్పుడు జంగమ శ్రేష్ఠులందఱు వచ్చి తమ తప్పిదమునకుఁ దమశిరముల నఱికికొనగా నవికూడా వ్రేలాడుచుండెను. సత్యమెరిగిన గంగన తలారి శిరమును నరికికొనబోఁగా శివుడు ప్రత్యక్షమై చిక్కయ్యను వరముల వేడుకొనుమనెను. అతఁడు వీరందఱిని

కైలాసమునకుఁ గొంపోవుమని ప్రార్థింపఁగల శివుఁడు నీలకుంతలకుఁ గైలాస మిచ్చుటకు వెనుదీయఁగ చిక్కయ మహౌదార్యముతో నామెయే తన మోక్షమునకుఁ గారణమగుటచే నామెకు మొదట నిచ్చినగాని తాను కైలాసము నకురానని చెప్పఁగా, శివుఁడంగీకరించి యందఱను చివరకు కైలాసమునకుం గొంపోయెను.

## II. గురునంబి చరిత్రము

ఇందు ఉడయనంబియను నామాంతరముగల సుందరమూర్తి నాయనారను భక్తుని చరిత్ర వర్ణితము. పార్వతీ పరమేశ్వరుల యవతారమే సుందరమూర్తి నాయనారులు. వీరి యనురాగ విలాసములను తిరునావలూరి వాల్మీకేశ్వరుఁడు వీరికి కుంటెతనముసేయును. చివరకు వారు కైలాసమున కేగుదురు.

**ప్రారంభము :-**

క. **ధవళగిరి సన్నివాసుని**
**ధవళోరగ భూషితాంగు ధవళాంశుధరున్**
**ధవళభసితత్రిపుండ్రుని**
**ధవళాంగునిఁజూండి కల్కిదైవము గొలుతున్.**

వ॥ అట్టి దేవుకారుణ్యమున రాజవీటిపట్టణంబు నభవర్ణించెద ఎటు వలెను.

**జంపె**

**సారమగు తనువేడ, సజ్జనుల మదివేడు**
**కారూఢినిడుజోడు శ్రీరాచవీడు**
**భజసరంబులకీడు భజియింపనౌనఁగూడు**
**శివభక్తతతిజోడు శ్రీరాచవీడు**
**ఆగమంబులజోడు అఘముల నురుమాడు**
**శ్రీగిరికి సైదోడు శ్రీరాచవీడు ॥**



వ॥ అట్టి దేవుని కారుణ్యంబున రాచవీటి పట్టణంబున కధీశ్వరుండైన వీరభద్రేశ్వరుఁ గీర్తించెద. నెటువలెను.

**జంపె**

**కరుణాసముద్ర యస్ఖలిత విజయోన్నిద్ర**
**స్థిరతర మహారౌద్ర శ్రీవీరభద్రా,**
**మారట శ్రీరుద్రమహిమాదికాచ్ఛిద్ర**
**శ్రీరస్తు శతరుద్ర శ్రీవీరభద్ర ॥**

............. శ్రీవీరేశునకు...... అంకితంబుగా నా యొనర్పంబూనిన వడయనంబి చరిత్రయను యక్షగానంబునకుఁగథా క్రమంబెటువలెను.

సీ. **శ్రీరజతాచల సింహాసనస్థుఁడు**
**గౌరీవివాహసంకల్పితంబు**
**చేసిన హర్యజ జీమూతవాహన**
**ప్రమథాదుల తుల సంభ్రమముతోడ,**
**పదునాల్గులోకముల్ ముదమొందఁ బార్వతీ**
**పరమేశ్వరుల పెండ్లి ప్రకటితముగ**
**వేదోక్తిఁ గావించి విశ్వేశు పెండ్లికు**
**మారుచేసిన ముఖమంటపమున**

గీ. **నిల్వుటద్దంబు కెదురుగా నిల్చునంత**
**పార్వతీశుల ప్రతిబింబ భావములకు**
**ప్రాణ మొసఁగియు సుందర ప్రమథు లనుచుఁ**
**గూర్మి పేరిడి సేవఁ గైకొనుచునుండె.**

...... ........ ........ ........ ........
...... ........ ........ ........ ........

## త్రిపుట

సుందరుఁడొకరుద్రకన్యకఁజూచి శృంగారంపువనతరు
బృందమధ్యమునందుఁబొందిన చందమెఱిఁగి
దేవదేవుండనియె నత్తిరువానకూరను పురమునను
భూవిభుఁడు పాలించు మర్త్యంబునను వేడ్కన్

హాళినచటను మీరు మానవులై జనించి సుఖింపు డని శశి
మౌళి సుందరి సుందరులకామహిమ దెలిపెన్.

......... .................. ......... .............

......... .................. ......... .............

## ఎరుకల జంపె

ఆరునెలలు మళ్లనేని యూరిలోకి వచ్చి జడా
యూరి యింటికరుగ నా కొమారు వడుగుసేయ
యత్నపెట్టినారు చూడు పాపకర్ములెల్ల రాజ
రత్నమా పరామర్శించు రమణ! మా మొరాలకించు,
మనఁగ నంతలోనె బాపలల్ల వచ్చి రాజ సముఖ
మనక రోషమునను గినిసి యతనిఁదిట్టి కొట్టఁబోవ ॥

## పాళిరేకులు

తాళములు మద్దెలలు ఢక్కియుఁదాంబరల్ వాయింపఁగా
తాళమాన మొకింత దప్పక వాలుగంటి నటింపఁగా
ధిమికి, ధిమికి, హాధిమికి, ధిమికిత, ధిన్నతోంగణీ దివిజు లంబరపదమునా
నమరిచూడఁగ పరమనాంచా రాడె నతులిత ముదమునా ధిమికి, ధిమికిహో,
వనిత చక్కదనాల కుప్పని వరులు పురజను లెంచగా
కనిన రుణమే తీరదనుచును జనులు తన్ను నుతించగా ॥
॥ధిమికి॥



## జంపె

ఆ వనముచెంతఁగల కావేరి యుదకమున
కై వచ్చె బ్రాహ్మణస్త్రీ యొక్కతయును,-
నొడయనంబెన్న నా యొడయనంబెన్నగా
కొడుకనంబెన్న యెక్కడ దాగియున్నా
..... .... .... ..... ... ...... .. ..... ....
ఆటల కుమార నిను యేటిపాల్సేసి యే
నాఁటికిని మఱతునని బోటి వెతపడఁగా,
కని నంబి సతిదుఃఖమునకు వివరము దెలిసి
కొనెను పరిచారకులఁ బిలిచి గ్రక్కునను,

వ॥ అంత నా కావేరీతీరంబున నున్న పురాంగనలు ధవళంబు పాడిరట. ఎటువలెను -

## ధవళం

జయ, జయా, జ్ఞానసంపన్నా! జయ, జయా, నిన్ను బుధులెన్నా,
జయము నీ పదములూ గన్నా; జయమౌను నొడయనం బెన్నా. ॥

## జంపె

పరసతుల వరియింప నరకమని మొరపెట్ట,
దొరయు శాస్త్రములెల్లఁ దుంగలోఁద్రొక్కెన్, ॥
పరనారి చంటిలోఁ బరమేశు పరికించి,
పరమజారుఁడు నంబి పరమపదమేగెన్ ॥
శిశుహత్యచేసి మును చిఱుతొండభక్తుండు
పశుపతిని గూడెఁదన పట్టణముతోడన్ ॥
కోటండు తండ్రి తలఁగొట్టి కైలాసము క
వాటములఁ దెఱవ శశిజూటులోఁ గలసెన్ ॥

**అంత్యము :-**

ద్వి. **పరమనాంచారియు, పైనమై వచ్చి**
**నరపతివెంటనే నంబెన్నఁ గలసె ॥**
**ఆ రాయఁడును నసంఖ్యాతమాహేశ్వ**
**రారాధనముల నిహము మఱచి యుండె**
**నని దక్షయజ్ఞాపహారునిపేర.... మొ॥**

## II. వాలె కోటయ్య, చిరుతొండభక్త కథానిధానము

దీని యంత్యగద్యను బట్టి కవినిగూర్చి కొన్ని విషయములు స్పష్టపడును కాన దానిని మొదట గమనింతము.

'ఇది శ్రీమద్గురుమహాదేవర ప్రసాద లబ్ధ నిగమాగమోక్త వీర శైవాచార సిద్ధాంతప్రవీణ, వాలెవంశ సుధాపయోనిధి శీతకిరణ, బుచ్చయాభిధాన పౌత్ర, రాచయపుత్ర, షట్స్థల, షల్లింగావధాన, ఇష్టప్రాణ భావైక్య, సుఖానూన గురు లింగజంగమ భక్తి ప్రధాన, కోటయాభిధాన విరచితంబైన బసవపురాణోక్త చిరు తొండభక్త కథానిధానంబను యక్షగానంబు సర్వంబును సంపూర్ణము.'

**ప్రారంభము :-**

శా. **శ్రీకాంచీ పురమధ్యగేహ విలసత్సింహాసనాధ్యాసియై**
**పాకారి ప్రముఖామరార్చిత పదద్వంద్వుండునై యెప్పు నా**
**యేకామ్రేశ్వర లింగమూర్తి, సకలాభీష్టంబు లిచ్చున్ కృపా**
**సేకంబింపుగ మంచికంటి కులజ శ్రీనాగలింగయ్యకున్.**

ద్వి. **గురుతోటమర బోదకుర్తి నివాసుఁ**
**డురుతర శివభక్తి యుక్తుండు నాఁగ**
**లింగదేవర శిష్యుఁ డింగిత జ్ఞాని**
**యంగద మంచికట్యన్వయాంభోధి**
**పరిపూర్ణచంద్రుఁడై భాసిల్లుచున్న**
**వర నాగలింగయ్య చరణలింగమునకు॥**



కవి తెలుపుకొనిన విషయములఁబట్టి కవివంశ వృక్షమిట్లున్నది.

**వాలె బుచ్చయ్య**
|
**రాచయ్య (భా.లింగమాంబ)**
|

| నాగలింగయ్య | చెన్నమలయ్య | ముసలయ్య | కోటయ్య (కవి) | (మహాదేవి) |
|---|---|---|---|---|

ఈ కవి వెనుకనే 'కోటీశ్వర రగడ' రచించెనని, తానా గ్రంథమున రచించుకొనిన యీ క్రింది పద్యమునుబట్టి తెలియుచున్నది.

క. **నీవును మును కోటీశ్వర**
**దేవుని దివ్యోత్సవంబు తెనుఁగున రగడన్**
**గావించినావు, భక్తుని**
**యావిధమున శైవగణము లానందింపన్.**

క. **చిరుతొండ భక్త మహిమము**
**గరిమంబున నొక్క యక్షగానము గాఁగన్**
**వివరించియు నేకామ్రే**
**శ్వరునకు నంకిత మొనర్పు సత్కవివర్యా!**

**కథావిషయము :-**

సీ. **భక్తహితార్థమై పరఁగు చిరుతొండని**
**మనసు ద్రచ్చియు శైవమండలంబు**
**కడతేర్చి రక్షింప కరుణారసము వచ్చి**
**ఘనతరమహిమ ప్రఖ్యాతిసేయ**
**తలఁచియు శంభుండు తాత్పర్యభావుఁడై**
**తన మహత్త్వంబున తక్షణమున**
**వారధు లుప్పొంగి పడి నేకమైయుండి**
**మేఘగర్జనములు మిన్ను ముట్టోయ,**

గీ. నేర్లు నదులును కాలువ లేకముగను
పిడుగులును తీఁగ మెరుపులు పిక్కటిల్ల
బహుళతరముగ జనులెల్ల భయమునొంద
ఘోరతర వర్షమంతట గురియసాఁగె.

క. భూరితరంబగు వర్ష మ
పారంబై రాత్రిపగలు పరికింప గ రా
కీరీతి యిరువదొక దిన
మారూఢిగఁ గురియసాగె నంతట మఱియున్.

క. ఈదురుగాలి చినుకులకు
నాదరువును లేక పశువు లంభో యనుచున్
ఏదరిఁబోద మనుచును
కాదరి నిలువంగలేక గడగడ వణకెన్.

క. చెరువులు బావులు గుంటలు
సరయఁగ కోనేర్లు నిండి యతిభయమొందెన్
వరదలు బొరలఁగ మద్రో
దరములు మొరలిడఁగ ధరలు తల్లడపడగన్.

ద్వి. ఆ చిరుతొండఁ డత్యానందమొంది
యేఁచిన భక్తిపై నెలమి జంగములు
నెంద రేతెంచిన నిష్టాన్నచయము
లందించి వారిమహాప్రసాదంబుఁ
గొనుచుండు నటు వాన గురియుచునుండ,
పనుగొనునప్పుడు పాకంబునకును
వంటకట్టెలు తన యింట లేకున్న
ఇంటింట వెదకిన నెచటఁగానకను
సతిని దగ్గరఁ బిలిచి జంగమకోటి
కతిశయం బలర ప్రొద్దాయె నింకెట్టు



లనవుడు వినియు ఉత్ఫుల్లాబ్జవదన
మనకేటి చింతయు మాధవుకరుణ
సకల వస్తువులును సమకూడియుండ
నొకట తక్కువ యను టుచితమె మనకు
నూనియ వస్త్రవితానంబుదడిపి
మానుగా నగ్నిని మందరికొల్పి
పాకయత్నంబు లేర్పాటుగాఁ జేసి
చేకొని దమ భక్తి చెల్లించుకొఱకు.....
........ .............. ................
........ .............. ................
........ .............. ................

ఆ. దయయుంచి తల్లి తనయుని బిలువంగ
రాకయుండు నట యేలోకమునను
కల్లలాడి కాలమెచ్చబుచ్చక వేగ
సొంపుఁదనర బిలువు జూతమిపుడు

వ॥ ఇవ్విధంబున - నీశ్వరుండాడు - వాక్యంబులకు తిరువ నాంగ మనంబున నిట్లనియె.

క. ఎచ్చట నీ వున్నాఁడవొ, నిచ్చటికిని పేరు గూర్చియే నిప్పుడు నా
వత్సా రారమ్మనుచును, ముచ్చటగా నెట్లు బిలుతు మోదంబలరన్

వ॥ అని పూర్వద్వారంబున నిలిచి, నల్దిక్కులంగాంచి యాననంబు నాకసంబునకునెత్తి, హస్తంబుఁజూచి, ప్రమథగణంబుల పాదంబులు మనంబునం దలఁచి తనయునిఁ బిలువఁదొడగె.

## ఏలలు

పూర్వకర్మార్జితమైన భూరికర్మములనెల్ల
గర్వమడఁచిన కొడుకా, రావయ్యా నా చిన్నితండ్రి,
శర్వునాజ్ఞ మీరఁబోకయ్యా ॥ - 1.

దక్షిణాధీశుని పట్టి దర్పమడఁచినట్టి శివుఁ
డీక్షణాన వచ్చియున్నాఁడు, ఓ ముద్దులతనయ,
మోక్షమొంద వేగ రావయ్యా ॥ - 2.

పశ్చిమాశాంతరమున భాసురముగ శివుని
నిశ్చయముగఁ గలసినావేమో, యో సిరియాలసెట్టి
నిశ్చయమొందింపరావయ్య ॥ - 3.

ఉత్తరాధీశుని సఖుఁడొచ్చి లింగ తృప్తిఁగొంచు
పొత్తుగుడువఁబిలుచు చున్నాఁడు, ఓ నాయనయ్య, వేగ
చిత్తము రంజిల్ల రావయ్య॥ - 4.

పున్నమ వెన్నెలబైట - చిన్నబాలలతోఁ గూడి
చెన్నుగా నాడుచున్నావేమో, ఓ ముద్దులతండ్రి,
యిన్నాళ్ళవలెనె రావయ్య ॥ - 5.

పాద తీర్థప్రసాదము మోదమలరఁగావించి
నీదు రాకఁ గోరుచున్నారు, ఓ నా చిన్నిబాలా,
నాదరమున వేగరావయ్య॥ - 6.

వాద భేదములు మాని - యాది మధ్యాంతరాళమున
పాదుగా నీవు వసించినావేమో, ఓ సిరియాళసెట్టి,
మోదమలరంగ రావయ్య ॥ - 7.

పాయని వ్యామోహ పాశబంధములు దెగటార్చి
యేయెడల యాడుచున్నావో - ఓ ముద్దులగుమ్మా
కాయజారి కడకు రావయ్యా ॥ - 8.

ఎంచరాని పాతకములఁద్రుంచి శివ కాంచిశివుని
సంచితముగ మదిని నమ్ముచు, ఓ నా చిన్ని బాల,
కాంచి జనులు జూడరావయ్య ॥ - 9.



వ॥ అని యివ్విధంబున జనని పిలుచు సమయంబున,

సీ. మోమున ముంగురుల్ ముద్దుగా నెనయంగ,
మెడరత్న హారముల్ మెరయుచుండ,
సంది బొందియలు పెంపొంది దూఁగుచునుండ,
మొలగజ్జెలందెలు మ్రోయుచుండ,
చెక్కిళ్ళయందున చిఱుచెమట లొదువంగ
కనకంపు రావిరేకయుఁ జెలంగ;
బంగరు జల్తారు పట్టుకండువ చెంగు
లంగుగా మేన చెలంగుచుండ,

గీ. చూపరులకెల్ల నత్యంత చోద్యమంద
సురలు గీర్తింప, తాపసవరులు వేడ
పుష్పవర్షంబు గురియ పెంపొంద, జనని
శబ్దమాలించి బాలుండు సరఁగ వచ్చె.

ఈ భాగము శ్రీనాథ పాల్కురికి సోమనాథ శ్రీపిడుపర్తి సోమనాథ రచనలతోఁ బోల్చినచో తారతమ్యము గ్రహింపనగును.

## III. అనుమోద సన్యాసి, బసవకల్యాణము

**అంత్యగద్య** : ఇది శ్రీభక్తమాహేశ్వరపాదారవింద మకరందపానానంద మిళిందమానస శ్రీమద్గరిమత **మళియ భగిచంద్రశేఖరాహ్వాయ** హస్తాం బుజ సంభూత భక్తుల యెరుకాహ్వాయ కరుణాకటాక్ష వీక్షణ అనుమోద సన్యాసి నామప్రణీతంబైన శ్రీబసవకల్యాణయక్షగాన ప్రబంధంబునందు సర్వంబు నేకాశ్వాసంబు సంపూర్ణము.

ప్రారంభము :-

శ్లో. శ్రీగంగానందకందాయ, చిదానందస్వరూపిణే ।
నందితామర బృందాయ, వృషభాయ నమో నమః ॥

ఉ. శ్రీలలితంపువీరవ్రత సింధు సుధాకరులౌ పురాతనుల్
లాలిత రుద్రులున్ ప్రమద లక్షణవంతు లనేక కోటులన్
జాల నుతించెదన్ మహిత సౌఖ్యముతో బసవాది ముఖ్య సం
స్ఫాలన పాదపద్మములు భక్తిని మ్రొక్కి నుతించి కొల్చెదన్.

బసవేశ్వర జననము :-

సీ. ఫాలాక్షునంశచే బసవన్న యిలమీఁద
హింగుళిసీమలో నిరవుమీర
నగ్రహారమునందు నలరారు మండంగి
మాదిరాజయ సతిమాదమాంబ
కల్యాబ్ధిలోపల ఘనసోముఁ డుదయించె
సంగమేశుఁడు వచ్చి లింగదీక్ష
చేసిన బసవన్న స్థిరబుద్ధినుండంగ
వరుషాష్టకంబున వడుగుసేయఁ
బూనిన తండ్రినిఁ బోనాడి భక్తుల
గూడియున్నాఁడన్న గురుఁడు దెలిసి,

గీ. తలఁచినప్పుడు బలదేవ దండ నాయ
కుండ తన కూతునిచ్చెడి కోర్కెతోడ,
వచ్చి తోడ్కొని గంగాంబ నిచ్చి వేడ్క
పెండ్లిగావించె జగమెల్లఁ బ్రీతినొంద.

వ॥ ఇట్లు కల్యాణంబై కూడలి సంగమేశ్వరు సన్నిధికిఁజని నాద పూరితుండై త్రికాలంబుల గురుపూజఁ గావింపుచుండె, నంత నక్కడ,

గీ. బసవనికిఁ గూతునిచ్చిన భావమునను
ప్రమథగణముల లోక సంప్రాప్తుఁడయ్యె
నంత బిజ్జలుఁ డా మాటలాలకించి
మంత్రి యా యంశమున లేని మాటఁదలఁచి.



రగడ

వారి వంశమునందు ఎవ్వరు తీరుగా గలరా యటంచును
కోరి యడిగెను, బిజ్జలునకును గోర్కెలలరన్
వానికల్లుఁడు బసవరాయఁడు - జానుగా గురుసన్నిధినుండిన
వాని దెమ్మని మంత్రులను దా వరుసబంపెన్.
దెచ్చి బసవని రాజుతోడను - ముచ్చటలాడంగగా
మతి వొచ్చమంతయు లేక, మంత్రుల కెచ్చంగా నుంచెన్.

వ॥ ఇట్లు మంత్రిపాలనంబుచే నలరుచు, నిరంతర గురులింగ జంగమార్చనలు చేయుచున్న సమయంబున,

వ॥ తదవసరంబున యవసర నైవేద్యంబులు చెల్లించియున్న యత్తఱిని,

"దీక్షా మంటపంబు గావించి, పంచకలశపూజలు గావించి, నీలాంబను రావించి, భస్మధారణ గావించి, భక్తిమాహేశ్వరులకు నమస్కరింపఁజేసి కూర్చుండ నియమించి, యప్పంచకలశసూత్రంబు చేతికిచ్చి, భక్తమాహేశ్వరాను మతంబున సింహాసనంబు గైకొని, సంగమేశ్వరుండు, ఆ నీలాంబకు బ్రహ్మవాతఁ దుడిచి, భసితరేఖ ధరించి, దీక్షావిధానంబు గావించిరట - ఎటువలెను.

గీ. మూలపీఠంబు బిందువు, ముఖ్యనాద
మూర్ధ్వపీఠంబు, గోముఖ మొనర కళయు
గోళకంబును పరమాత్మ గుదిరియుండ
నలరి దీక్షలొసంగి నీలాంబకపుడు.

క. ఈ విధమున లింగార్చన
గావించియు కరమునందు ఘనకళ లొనరన్
భావించి నీల కొసఁగెను
గావున మంత్రం బొసంగి కరుణాత్మకుఁడై.

### హిందూస్థాని, తోడిరాగము - దరువు

బసవరాయనిఁజూడ - భామలారా వేగ రారె,
మసలకఁ గొల్చువారి మహితభోగము లిచ్చువాఁడట॥ ॥బసవ॥

పరధర్మముచేత పామరులు బడగొట్టువాఁడట
పరమార్థచింతచేత ప్రాజ్ఞులఁ జేయువాఁడట,
పరమకామంబుచేత - పరంజ్యోతిఁ జూపువాఁడట,
పరమమోక్షంబుచేత - పరమునొందించువాఁడట ॥బసవ॥

బహిరంతర వాళమున బ్రహ్మతేజంబట
ఇహాముత్ర ఫలభోగ మించుక లేనివాఁడట,
సహిత శమాది షట్కసాధనము మెండట,
అహహ చెప్ప చిత్రము, అతని ప్రభావములు నేఁడు ॥బసవ॥

అష్టాంగయోగములనుభవపరుఁడట
దుష్టకష్ట కర్మదూరీకృతుండట
దుష్టజనులను బ్రోచు సృష్టికరుండట,
ఇష్టలింగము నందు దృష్టి నెనసినవాఁడట ॥బసవ॥

ఎల్లస్త్రీలనెల్ల తల్లిభావంబట,
ఎల్లవేళల భక్తోల్లాసపరుఁడట,
పల్లవించిన జ్ఞాన సల్లీల సిద్ధుఁడట,
కల్ల కా దీ మాట కనులఁజూచినఁ దెలసు ॥బసవ॥

### భూపాలరాగము - ఆదితాళము

శోభనమే బసవనికి - సుప్రకాశునకు
శోభనమే నీలనమ్మకు - మా సుందరాంగికినీ ॥శోభనమే॥
అల్లమప్రభురాయఁడంచితకృపను
సల్లీలకృప మీకు సరణి బోధించి,



ఎల్లలోకముల కీర్తి వెల్లామిగాను,
పల్లవించుకు సుజ్ఞాన భరితులౌ మీకు ॥శోభనమే॥

సమపదము జీవనమని మది నాటంగఁజెప్పి,
యమరంగ శివపదము పరమాత్మ తేజమును,
సమకూర్చి యా యొంపదము సరణిఁ దెల్పగను,
మమతలు బోకార్చిన మహితమూర్తులకు ॥శోభనమే॥

అష్టదళముల యా హంస వార్వనచె,
యష్టాంగముల యందు యష్టాత్ములకును,
దృష్టిచే సమకూర్చి దృఢమైన నిష్ఠ,
ఇష్టలింగము పూజ యెడలేని మీకు ॥శోభనమే॥

వ॥ఇవ్విధమున శోభనపరంపరలు గావించి, గూడలి సంగమేశ్వరుఁడు మహాప్రమథులు, బసవన, గంగాంబ, నీలాంబ సమేతుఁడై, తమ శిష్యులైన చెన్నబసవన్న మొదలైన వారలచేత నిరంతర ప్రణిపత్తి మంగళం గైకొనియుండి రంత॥

## IV. కానూరి వరవీరభద్రుఁడు - బసవ మహిమామృతవిలాసము

ఈ కవి కొలనుపాక సోమేశ్వరస్వామి భక్తుఁడగు సీతారామశాస్త్రి శిష్యుఁడు. ఇందు బసవేశ్వరుని చరిత్రము వర్ణితము.

ప్రారంభము :-

ఉ. శ్రీగురు సోమనాథు వరశ్రీ చరణాంబుజముల్ దలంచి..

........................................................

తర్వాత వీరశైవ భక్తుల స్తుతి, బసవస్తుతి, గురుస్తుతి కలదు.

సీ. ............................................

కొలనుపాక పురీశు నలిసోమనాథుని

**గలిమిగా నమ్మిన ఘనుఁడనంగ,**

**..............................................**

**సీతారామశాస్త్రి పరఁగ నెమ్మదినెప్పుడు ప్రస్తుతింతు.**

'బసవగీతము, పద్యములు, వచనములు, నేలలు ననేక విధములఁ గూర్చి బసవమహిమామృతవిలాసంబు, శ్రీసోమేశ్వర స్వామికిఁ గృతియిచ్చి రచింపఁబడెను.

**అంత్యగద్య :-**

**ఇది బసవనాది మాహేశ్వర దివ్య**
**పదపద్మసౌరభ భ్రమరాయమాణ**
**లింగజంగమ పాదలీనమనస్క**
**సంగత సుఖ సుధాశరనిధి మగ్న**
**కరమొప్ప కానూరి వరవీరభద్ర**
**వరనామ వియన్న సరస సద్భక్త**
**సుకవి ప్రణీతమై శోభిల్లి తనరి**
**యకలంకగుణనిధి యాదిబసవేశు**
**వరకృపాంచిత కవిత్వస్ఫూర్తిఁ బేర్చి**
**పరము సద్భక్తినే వర బసవేశు**
**మహిమామృత విలాస మహి విలసిల్లి**
**సహజజంగమలింగ సత్కృపచేత**
**చను పురాతనభక్త మన మహత్వంబు**
**అనుపమభక్తుల కానందమయ్యె.**

## V. బాల పాపాంబ - అక్కమహాదేవి చరిత్రము

ఇందు వీరశైవభక్తురాలైన అక్కమహాదేవి చరిత్రము వర్ణింపఁబడినది. కవయిత్రి యీ యితివృత్తమును అల్లమప్రభులింగలీలల నుండి గ్రహించెను. ఈ యక్షగానము నీమె కాశీవిశ్వనాథున కంకితమిచ్చెను. ఇందీమె వ్యాస, వాల్మీకి, కాళిదాస, శ్రీహర్షులను స్తుతించినది. ఈ తన వంశ చరిత్రమును అంత్య గద్యయైన ద్విపదలో నిట్లు తెల్పుకొనెను.



ద్వి. **శ్రీమన్మహాకారు శ్రీజనాధారు,**
**సామవేదోద్ధారు, సన్నుతాచారు,**
**పరఁగు పరబ్రహ్మ భవ్యవంశమున**
**వరబలోన్నతశాలి వసుమతియందు**
**వీరశైవాచారు విలసితాకారు,**
**మేరుధీరుఁడు జంగమేశుండు పుట్టె**
**అతనికి సతియగు నతివ పాపాంబ**
**ప్రతిభచే శ్రీ విశ్వపతి వరంబునను,**
**వరవీరభోజుండు వంశమే మనిన,**
**మతి దక్షిణామూర్తి మహనీయకీర్తి,**
**సిద్ధ విద్యలకెల్ల సిద్ధుఁడైనట్టి**
**సిద్ధప్ప యన సత్యశీలుండు ఘనుఁడు,**
**మల్లమ్మ, కనకమ్మ మగువ నాగమ్మ**
**.... రుద్రమ్మ సతుల నల్వురిని**
**సరవితోఁ గావించె సప్తసంతాన**
**మరుదంద లోక హితార్థంబుగాను,**
**ముదముతోడుత నందు ముఖ్యశీలుండు,**
**..... అష్టయోగాది విద్యాప్రవీణ**
**వ్రతుఁడు వీరవసంత వసుమతీశునకు**
**సకియ కామాక్షమ్మ సకియ గర్భమున**
**ఆ మహేశ్వరికరుణ పాపమకరుణ**
**కామించి యొసఁగిన ఘనవరంబునను,**
**ప్రథమపుత్రిక బాల పాపాంబ యనఁగ**
**నధికతేజంబుల నపు డుద్భవించ,**
**సంగీత సాహిత్య సరస లక్షణల,**

రంగు మించిన యట్టి రమణి దానగుచు,
నల భద్రకాళి నా యాత్మలోపలను,
బలికించురీతి నేఁబలికెదను.
అవనిలో యక్షగానావళికెల్ల,
రవళి మించిన శిరోరత్నమో యనఁగ
మంగళప్రదమగు మహాదేవి చరిత
యింగితజ్ఞానినై యీ కృతిఁజేసె".

ఈ యక్షగానమునఁ గవయిత్రి షష్ఠ్యంతములు వాడెను.

వ॥ అని యప్పరమేశ్వరునకు షష్ఠ్యంతములు (చెప్పెనట) ఎటువలెను.

### అర్ధచంద్రికలు

కమలజుఁగొట్టిన ప్రమథేశునకున్
చన్నునఁ బల్కిన చిన్మయమునకును
పార్వతినేలిన పరమేశ్వరునకున్.

వ॥ అంకితంబుగా నా రచియింపఁబూనిన యక్కమహాదేవి బోధోల్లాసంబను యక్షగానంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన -

ద్వి. ఆయెడ నామాయ - యరుగుచున్నెడను,
శ్రీయుతంబైనట్టి శ్రీగిరి గలదు,
ఆ శైలమునకు దక్షిణభాగమందు,
భాసురకళలచే ప్రజ్వరిల్లుచును,
దనరుచుండెను ఘనవశి యను పురము
జనులెల్ల సంతోష సహితులై పొగడ,
మమకారుఁడను రాజు మహి యేలుచుండె,
అమితవైభవముల నలరి యావేళ,
మోహిని యను జగన్మోహిని నపుడు



వాహినిగాను వివాహంబులాడె
నా యిరువురకును నతివ మాయాఖ్య
పాయక పుత్రియై పరఁగ జనించె.

వ॥ అని పలికిన వృషభేశ్వరునకు దండప్రమాణంబుఁజేసి యేనూట డెబ్బండ్రు ప్రమథులతోఁ గూడి ధరాతలంబునకు వచ్చి, కల్యాణ కటకంబు నందు భక్తిసంయుక్తుండై జంగమారాధనంబు సలుపుచుండె నంత ఎటువలెను,

### జంపె

ధరణిదేవికి నూతన కిరీటంబనఁగ
మెరయు 'నుడితడి' యనెడు పురమొకటి గలదు.
*** *** ***

క. ఇటువలె నలరెడు పురమునఁ
బటుతరముగ 'విమలుఁడ' వని పతి దానగుచున్
'కుటిలాలక' యను సుందరి
దిటమునఁ బెండ్లాడి యుండె ధీరుం డగుచున్. ॥
*** *** ***

### జంపె

అల సదాశివుపత్ని యౌ మహాదేవియును
తిలకించు సుత మహాదేవి పేరిడిరి ॥
*** *** ***

### జోలపాట

ఘన వజ్రమాణిక్యఖచిత మయలీలఁ
దనరు నుయ్యాలలోఁ దనయనిడి చాలఁ
బనిపూని శ్రీగౌరిభామ వనిలోల
తనమునను బాడెదరు తరుణులొగి జోల ॥జోజో॥

జో, జో, జగత్కుక్షి, జో సుజనరక్ష
రాజశేఖరు సుజనరంజితావేక్ష ॥జోజో॥
పరమేశ్వరునితోడ ప్రతిన గావించి,
ధరణిలోపల మాయ తనువు ధరించి,

గురుఁడల్లమచిక్క కున్న చింతించి,
తిరిగి యంబిక మ్రోల తిరిగి యేతెంచి ॥జో, జో॥

ఉన్న యత్తఱి గౌరి హృదయమున చింత
తిన్నగా దీర్తునని త్రిపురారి యంత,
సన్నుతాంగిరో నీదు సాత్వికమంత,
పన్ని వసుధకు ననుపు పణతి యనునంత ॥జో, జో॥

అనిన శ్రీకంఠునకు నతిభక్తితోను,
వినుతి సేయుచు మ్రొక్కి విశదంబుగాను,
ననిపె నిన్నపుడు సుర లతివేడ్కతోను,
చనువొందఁ బుష్పవర్షము గురియ గాను ॥జో, జో॥

ఈ రీతితో వచ్చి హితవు మదినుంచి
వీరత్వమున విమల విభునకు జనించి,
సారదయతో మమ్ము సరగ రక్షించి,
గారవించితి వౌనె కరుణచే మించి ॥జో, జో॥

*** *** ***

అంత్యము :-

మంగళహారతులు

పసిడిపళ్లెరములో పంచదళపద్మమున
పంచరత్న ప్రభలు భాసిల్లఁగా,



విశదముగఁ బాడెదరు విశ్వసనంబుచే
శశివదనమహాదేవి సరసి చెలఁగి ॥జయమంగళంసదాశుభమంగళం॥

ప్రభునిఁ బట్టెదననుచుఁ బంతమున శివుకరుణ
భ్రమ మించ వసుధలోపల జనించి,
విభవంబుతో జైనవిభుని నగరముఁజొచ్చి,
సభ సమ్మతింప నా సమయముననను ॥జయమంగళం॥
వాని భ్రమయించి నిర్వాణవృత్తిని ఘోర
కాననంబుల ఘన కానలందు,
సానువులయందు, నా సరసుఁ డల్లమవిభుని
బూని వెదకినయట్టి పూఁబోణికి ॥జయమంగళం॥

వెదకుచుండెడువేళ - వీరుఁ డల్లమగురుఁడు
మదిలోనఁ దెలిసినపుడు - మమతతోను,
సదమలాకృతితోడ - సరగ ప్రత్యక్షమై,
యుదయార్కు భావమున నుండి యపుడు ॥జయ॥

మోదమున శాంభవీ ముద్రోపదేశంబు
ఆదిగా నీ కొసఁగినటుల యిఁకను,
మేదినీజన జను లాదిగాఁ బొగడగను,
నీ దయను మమ్మేలు నీరజాక్ష ॥జయ॥

*** *** ***

జంపె

అనిన శ్రీగౌరితో ననియె భూతేశుండు,
విను నీదు సాత్విక వివరమంతయును
అక్కమహాదేవియై యవనిలో జనియించి
చక్కగా ప్రభువుచే సంతసంబొందవన్.

ఉపదేశమంది తా నుత్సాహలీలచే,
నిపుడు శ్రీగిరినున్న దింతిరో యనినన్.

అంత శ్రీగౌరి పరమానందమున మొదటి
పంతంబుఁబూని సంభ్రమవృత్తినుండెన్.

*** *** ***

### ఏకతాళము

ధనము పుత్రశ్రీ విభవము
నొనరఁగ భోజున కొసఁగెను ప్రభువున్.

## VI. లింగమూర్తి - శివపారిజాతము

శివుడు గౌరిని వివాహమాడుట యిందలి కథ. గంగాగౌరుల సాపత్న్య వివాదాది విషయములు సాధారణ యక్షగానములందుండునవి యిందు గలవు. కూచిమంచి తిమ్మనార్యుని శివలీలావిలాసమందలి కథనే యీ కవి యక్ష గానముగా రచించినాఁడు. ఇది పారాజాతాపహరణ కథ ననుసరించి వెలసినది గావున యక్షగానములు గొన్ని పారిజాత నామాంకితములుగా నున్నవి.

ప్రారంభము :-

ఉమాశశాంక, యురగభూషణ
కామిత ఫలదా, గంగాధరా. ॥
సోమకళాధరా, శృంగారవైభవా,
కామరూపజిత, కామహరే. ॥
ఇందేల వచ్చేవు, అందేల వచ్చేవు,
రమ్మనవే వాని; రమ్మనవే.॥



అంత్యము :-

భక్తజనార్తినివారణ, శూలధారణ,
యోగీంద్ర హృదయవిహార, జయ, జయ. ॥
రమణీయ ఫణిరాజ భూషణ, పాపశోషణ,
కాంచనశైలవాసా, జయ, జయ. ॥

*** *** ***

కైలాసశైలనికేతనా, వృషభకేతనా,
కరి చర్మకలిత శరీరా, జయ, జయ. ॥
శ్రీలింగమూర్తికవేరిదం కురుతే,
ముదముజ్జ్వల మంగళశతం, జయ జయ॥

### శివపారిజాతము (కర్తపేరు తెలియదు)

వెనుకటిదానికంటె నిది వేరైనది. ఇది మఱియొక కవికృతము కాని కవి పేరు తెలియరాదు. ఇందు సంస్కృత శ్లోకము లక్కడక్కడ గలవు. గ్రంథము సంపూర్ణముగ లేదు.

ప్రారంభము :-

........ ........ ........ .........
........ ......... చక్కదనముల సౌజన్య శైలకన్య,

సీ. పగడాల జిగడాల - పగడాలతోఁ జేయు
తావి మించిన కావి మోవిగలది,
తెలిదమ్మి వెలిజిమ్మి బలునెమ్మితొగల
నీడుగా నాడు కెంజాడగలది,
పండ్లతో గజనిమ్మపండ్లతో బంగారు
గిండ్లతో బెరయు పాలిండ్లు గలది,
సిరిమించి నీలాల సిరివుంచి తమ్ము
పెన్నురులు గలది

గీ. ఇంతి, ముత్యాలదొంతి చామంతిబంతి
కంతుమద దంతి చెలుల మేల్బంతి యూప
డంతి .... ....... ....... .......

అంత్యము :-

చూర్ణిక

శ్రీమద్వరశరదభ్రవిభ్రమ భ్రమాపాదిత
రంగద భంగ శృంగారాంగ. ॥

## VII. గంగా గౌరీవిలాసము, పెదకెంపరాయఁడు

వెనుకటి కథయే యీ యక్షగానములకుఁగూడ వస్తువు.

ప్రారంభము :-

శా. శ్రీగౌరీపతి చంద్రశేఖర సతీ చిత్తాబ్జరోలంబ ప
న్నాగాధీశ్వరహార మారమథనా నాకేశ సంసేవితా
యోగీంద్రార్చిత పాద పద్మయుగళా యోషామయార్థాంగ
........ హిరియ కెంపనృపతిన్ రక్షించు సోమేశ్వరా.

క. ............ ద - గంగాగౌరీవిలాసకథ మృదువచనా
సారంబులుద్ది జడన - ట్లారజముగఁగవులు పొగడ నతుల ప్రౌఢిన్. ॥

క. సుకవులకు సారమై, బహు
కుకవులకెద శూలమై, యకుంఠిత ధారై,
చకిత చకిత వాద్యములై
వికసించును పెద్దకెంప విభుసత్కవితల్.

క. గంగాగౌరి విలాసము
సంగతి పద పద్యములకు సరసత మీరన్
రంగద్భాషణములు చెలన్
గంగా పెదకెంపరాయ ఘనుఁడొనరించెన్.



క. తన ప్రాణేశుని వెదకుచు
వనితామణి గంగ వచ్చువైఖరి యేలా
గన నెల్ల నాఁడునేఁడనఁ
గనుగొనవలె సకలజనులు కాంక్ష రహించన్.

ఆటతాళం - అర్ధరేకు

శంకారునిఁ జూపరె నవ మీనాంకునిఁ జూపరె ॥ - 1
ఈశునిఁ జూపరె నా ప్రాణేశునిఁ జూపరె ॥ - 2

అంత్యము :-

క. అంగజుకేళిని మదియు,ప్పొంగఁగ రతినేలి సోలిబోటి రహిల్లన్
బంగారుగిండి పట్టుక, ముంగిటికిని వెడలెఁజాల మురిపెం బలరన్.

## సాంబశివవిలాసము - (గ్రంథకర్త పేరు తెలియదు)

ఈ గ్రంథము పూర్తిగనే యున్నదిగాని గ్రంథాంతరమున కర్తపేరు తెలుపఁబడలేదు. ఇందలి వస్తువు పై మూఁడు యక్షగానములందలి కథయే. వసిష్ఠాసాగర సంగమ ప్రాంతమునఁ గల లక్ష్మణేశ్వరమను గ్రామమున వెలసిన లక్ష్మణేశ్వరస్వామి యేతత్కృతినాయకుడు. వసిష్ఠ, గోదావరీ నది పాయలలో నొక్కటి. లక్ష్మణస్వామి దాని కోర్కె దీర్ప వచ్చిన వాఁడు నా స్వామికి లక్ష్మణేశ్వరుఁ డని పేరయ్యెనట.

ప్రారంభము :-

'శ్రీలు మెఱయఁగ భక్తజన
పాలుఁడనఁదగు పట్టిసాచల
మేలు సామిని భద్రకాళీలోలుఁదలతున్.
*** *** ***

వ॥ అని యిష్టదేవతా ప్రార్థనంబు చేసి నా పచరింపఁ బూనిన సాంబశివ విలాసంబను సంగీత ప్రబంధమునకుం గథాక్రమం బెటువలెను,

........ ............ ........ ...

ద్వి. ....... ...... ....... ............

ఉన్న లక్ష్మణుకోర్కి నొనగూర్పఁదలఁచి

వన్నెమీఱఁగ నందివాహనారూఢుఁ

డై వచ్చి యతనిఁ గృతార్థుఁగావించి

యీ వసుంధర లక్ష్మణేశ్వరుం డనఁగఁ

జను వసిష్ఠాతీర సంగమప్రాంత

మున నొప్పు పట్టణంబున శ్రీలక్ష

ణేశ్వరంబనఁగఁ బేరెన్నిక కెక్కి

శాశ్వతైశ్వర్య ప్రశస్తి మీరంగ

*** *** ***

అనిశంబు దుర్గాసమన్వితుం డగుచు

ననురూపభోగంబు లందుచునుండె.

అంత్యము :-

'ఈలాగు కలహించు నిర్వురఁజూచి

శ్రీలక్ష్మణేశుండు చిరునవ్వు నవ్వి

యేల వాదించెద రెలనాగలార,

మీలోన మీకిట్లు మెఱమెఱల్ దగునె

ఒకచోట జనియించి యొక్కనిఁ జెంది

యకట మీ రొద్దికయై యుండవలదె?

అనుచు నిద్దరును గాఢాలింగనమున

*** *** ***



తప్పక గంగను దలయందు నిలిపి

యప్పుడు గౌరికి నర్ధాంగ మొసఁగి

యెలమితో నర్ధనారీశ్వరవేష

మలరారఁ గ్రీడించె నాశ్చర్యలీల.

వ॥ ఇట్లు లీలావినోదపరాయణుండైన సాంబశివునెదుట రంభాది కాంతలు వినోదంబున నృత్యంబులు సలిపిరందు నవతాళకు ఎటువంటిది.

**గోపీకాంభోది**

తానెల్లా దధిమి ధిమికి తక్కడకుందధికిటతక్క ॥తానెల్లా॥

వారణ దనుజ నివారణ మోక్షకారణ

హాలహల విదారణ తక్కతం తందాన తందాన

తందానా హరి నందనా తనుభూతి చందనా

పావనము నీ కృప భావనా నందివాహనా

విలసిత పావనా ॥తానెల్లా॥

గీ. గౌరికిని గామవైరికిఁ గలహ మొకటి

తారసిలఁజేసి యంతటఁ దనివి సక

గంగ నెసకొల్పి గౌరిపై గవయఁజేతు

నను తలంపున నారదుం డతిరయమున

వ॥ గంగసమీపంబునకు వచ్చుచు,

* * *

నిను నిట్లు మోహాంబునిధిపాలుచేసి

చనిన యా మాయల జంగంబు తెఱఁగు

తెలుప వచ్చితి నీకుఁ దేటతెల్లముగ

లలనరో యాతండు లక్ష్మణేశ్వరుఁడు

కపట వేషమున నీకడ విహరించి

ఇపుడల చోటను హిమగిరి కన్యఁ

దవిలి యున్నాఁడు నిన్ దలఁపడింతైన

నవుఁగాని యా యమ్మ యతఁడేమిసేయు

నా గౌరి మాట గాదనఁగ శక్యంబె
యా గర్వమేమని యనవచ్చుఁ దనకు
నెనవచ్చు వనిత లే దెల్లలోకముల
ననుచుఁ గేరుచుఁ బగ్గెలాడుచునుండు
నదిగాన నీ విపు డచటికి నేఁగి
మదిరాక్షి గర్వంబు మాన్పి నీ ప్రియుని
వేగమే వశముగావించు కొమ్మింక
జాగు వద్దని చెప్పి చనియె నా తపసి.

ఈ గ్రంథమునుబట్టి కవి వంశాదికములేమియు దెలియరావు. ఇందీతడేమియు వ్రాసికొనలేదు.

## VIII. కురవంజి - గురుసిద్ధలింగము

కవి యీ కురవంజి యక్షగానమున శ్రీమహాదేవుఁడు హిమవంతుని పుత్రియగు పార్వతిని వివాహమాడు కథను రచించెను. గ్రంథకర్తయగు గురుసిద్ధలింగమునుగూర్చి యీ గ్రంథమున విశేషములు లేవు.

ప్రారంభము : -

క. శ్రీశైలనాథుప్రేమను,
నాశైల జ్యేష్ఠపుత్రు నభినుతిచేసెన్
భాసిల్లి ప్రమథ వర్యుల
వాసిగ వినుతింతు భక్తివాంఛాప్రౌఢిన్.

క. సిరిగిరి భ్రమరయు కరుణను,
చరమూర్తిన్ హరికంద సద్గురు కృపచే
వర సిద్ధలింగ మింపుగఁ
గురవంజి రచించె సభలఁ గొనియాడంగన్.

క. సోమేశ్వరు నవ కవులను
భీమన్నను, శేషనాథుఁ బ్రియమునఁ దలఁతున్



సామజదైత్య విభంజన
వామాంగము గల్గు నార్యవరు లబ్ధముగాన్.

అంత్యము :-

అని యిట్లు భ్రమరాంబికామనోనాథుఁ
గొనియాడుచున్నది గోరిక లలర,
హరిత కందాహ్వయుండగు సిద్ధలింగ
గురుకర జనితుఁడా గురుసిద్ధలింగ
మతిభక్తి (?) శ్రీగిరి కురవంజి
హితవుగా రచియించె నీప్సితార్థములు
కరుణించు శ్రీమల్లికార్జున స్వామి
కురవంజి వ్రాసినఁ గూర్మిఁ జదివినను
హరుషోక్తి విన్నను నంబికానాథు
స్థిరతరైశ్వర్యంబు చెన్నొందుమనుచు
నాయురారోగ్యంబు లభివృద్ధియును
దా నిచ్చి యాచంద్రస్థాయిగాఁ జూచు

## IX. బుక్కమ సాంబయ్య - భల్లాణచరిత్ర

ఈ యక్షగానమందలి యంత్యగద్య యిట్లున్నది.

ద్వి. శ్రీకరంబైనట్టి శ్రీవీరశైవ
ప్రాకట మతధర్మ పారీణమతుఁడు,
ధర గుహేశ్వరలింగ వరకృపాలబ్ధ
పరమార్థ శివకవిత ప్రఖ్యాన్వితుఁడు,
శ్రీగురు బోధ విశేషశోభితుఁడు
నాగమ నిగమోక్తి నభిరమ్యమైన
యనయంబు యోగ విద్యాభ్యాసరతుఁడు,
ఘన 'నేతినేతి' వాక్యస్ఫూర్తియుతుఁడు,

ఘన సచ్చిదానంద కవితాత్మరతుఁడు,
పనిగొని శివనామ పఠనాభిరతుఁడు,
వలనొప్పి బుక్కమ వంశవర్ధనుఁడు,
నలువొంద సాంబయ్య నామధేయుండ,
భయభక్తితో నిట్లు భల్లాణచరిత
నయమొప్ప యక్షగానంబు చేసితిని
చక్షుఃశ్రవాభరణు, చంద్ర కిరీటు
అక్షయుఁడగు నీకు నర్పితంబుగను

ప్రారంభము :-

క. శ్రీగురుదేవు గుహేశ్వర
వాగీశ్వర కమలనేత్ర, వాసవవంద్యున్,
భోగి విభూషణుఁ గొలిచెద,
ధీగరిమ వచింతు దేవదేవునిఁ బ్రీతిన్.

శా. ఓ గౌరీపతి, యో పురాంతక, శివా, యో భర్గ, యో శాశ్వతా,
యో గంగాధర, యో లలాటనయనా, యో చంద్రచూడామణీ,
యో గోరాడ్ధ్వజ, యో సురేంద్రవినుతా, యో సర్వభూతాధిపా,
వేగ న్నా మది నోలలాడుచు దయన్ వీక్షించవే వేడెదన్.

## త్రిభంగులు

గిరికావాహనమెక్కి గిరికన్య మ్రోలముద్దు
పరుగులిడు గణాధి పతికి ॥జే, జే॥
గుజ్జురూపముతోడ గజ్జెలందెలు మ్రోయ
బొజ్జ త్రిప్పుచు నాడు రజ్జుకు, జేజే ॥
మింట చంద్రుని జా ఘంటగాఁజేసిన
యొంటి కొమ్ముగణాధి పతికి, జే, జే ॥



## రామభిల్లి

మిండా జంగమ లింగమూర్తి
ఇది మేర కాదు, విను మీ కపకీర్తి ॥మిండా॥

ధనధాన్యములిత్తునయ్యా నీకు
ఘనవాహనాభరణ, గ్రంథప్రసూనా
కనకాంబరములిత్తునయ్యా, అయ్య,
దినదినమును పళ్ళు దెప్పింతునయ్యా ॥మిండా॥

మళ్ళూ మాన్యాలిత్తునయ్యా పెళ్ళి
పెళ్ళికి నిప్పింతు పిన్న టంకంబు
ఇళ్ళు గట్టించెదనయ్యా, మారి
కళ్ళుకింపుగ మేడ గట్టింతునయ్యా ॥మిండా॥

మంచి మఠాలు గట్టింతు,నీకు
మంగళద్రవ్యసామగ్రి దెప్పింతు

*** *** ***

జో, జో, సచ్చిదానంద, ఓ, చిన్మయాంగా,
జో, జో, భవా ధీశ, జో, సుప్రకాశా ॥జో॥
జో, జో, గణాధ్యక్ష, జో, గరళభక్షా,
జో, జో, పరంధామ, జో, దివ్యనామా ॥జో॥

సరవితో నిప్పునను జదలంటనట్లు,
కరమొప్పు షడ్వికారములు లేకా,
పరమపురుషుఁడవైన ప్రభులింగమూర్తీ,
చిర చిన్మద చిత్కళామూర్తీ.

## X. ఆలపాక పెద్ది - భల్లాణ నాటకము (2)

ఈ కవి కుమ్మరి కులమువాఁడు, వీరశైవుఁడును, సంతోష శివజ్ఞాన స్వామి శిష్యుఁడును. ఈతని కిష్టదేవత కోకిలాంబ. ఈ యక్షగానము బిల్వేశ్వర స్వామి కంకితమీయఁబడెను. వీరిది ఆలపాకగ్రామము. ఈతని వంశాను క్రమమిది.

**ఆలపాక పెద్దు (భార్య - లింగమాంబ)**
|
**వై దెప్ప (భా. పాపాంబ)**
|
**పెద్ది**

**అంత్యగద్య :-**

అని సూతముని మౌనులకుఁ బల్కెననుచు,
విని కోకిలాంబికా విభు శంభుపేరఁ,
గనక బిల్వార్చితకామేశుపేర,
ననుఁబ్రోచు నా వైద్యనాథునిపేర
*** *** ***

ముందుగా సద్గురుమూర్తి యైనట్టి,
సంతోష శివజ్ఞానస్వామిని మదిని
సంతతముఁ దలంచు సద్భక్తిపరుఁడు
అంగలింగాంగ శివాచారధరుఁడు,
జంగమ తీర్థప్రసాద సేవకుఁడు,
శాలివాహనవంశ చరితుఁడీ భువిని,
ఆలపాకను నూర నమరిన పెద్దు
పెద్దన లింగమాంబిక సుతుఁడయిన
వైద్దెప్ప పాపాంబ వరపుత్రు పెద్దు



లలితమై తనరు భల్లాణుని చరిత
వెలయు నాటకముగా వినిపించె దీని
సుకవులెల్లను విని సొంపొంది ధరను,
బ్రకటింపు డాచంద్ర పరిపాలనముగ.

**మంగళహారతి**

మంగళం జగదేక మాతకును మంగళం
మంగళం బిల్వవన మందిరకును,
మంగళం బాలేందుమౌళికిని మంగళం
మంగళం కామేశు నంగనకును
జయమంగళం నిత్య శుభమంగళం.

**ప్రారంభము :-**

క. శ్రీగురుకృప నెలయఁగ వే
దాగమయుతమైన శివకథామధురోక్తుల్
గాఁగ రచింపఁగఁ బూనెద
రాగరసంబుగ భల్లాణరాయని చరితన్.
*** *** ***

ద్వి. శ్రీపార్వతీశు దర్శించి సేవించి,
నాపాలి శ్రీగణనాథుఁ బూజించి
శరజన్ముఁ బ్రార్థించి సద్భక్తి గాంచి,
వరదుఁడౌ మాధవు వర్ణించి మించి,
భారతి నర్చించి పరఁగ గీర్తించి,
యారూఢి సత్కవులను నుతియించి,
కులదేవతయిన యా కోకిలాంబకును
వలనొప్ప మ్రొక్కి యా వరము గైకొనియు
బరవసంబుగఁ బూని భావంబులోనఁ

బరగంగ నా బిల్వపతి కంకితముగ
సరసమౌ భల్లాణచరిత నాటకము
వెలయింతుఁదత్కథా విధమెట్టిదనిన.

**అంత్యము :-**

ద్వి. భల్లాణ మెచ్చితి భళిర నీవలెను,
నిల్లాలి నిటు నిచ్చు టెవ్వరో భువిని,
అని మదిఁ గొదవగా ననుమానపడకు,
మనఘాత్మ మా తల్లి యా చల్లమయును,
నీకును గులసతి నేను మీ సుతుఁడ
మీకు నేనిఁక మోక్షమిచ్చుటే లెస్స.

## XI. గుబ్బము చినకపోదయ్య - వీరచోడవ్వ చరిత్ర

ప్రాచీన గేయముల ననుసరించి కవి వీరచోడవ్వయను శివభక్తురాలి చరిత్రమును యక్షగానముగా రచించెను. దీనిని రొంపిచెర్ల శంకరేశ్వరున కంకిత మొనర్చెను. ఈకవి తండ్రిపేరు గణేశుడని కావ్యారంభముననను, కప్పయ్యయని యంత్యగద్యయందును గలదు. ఈతని గురువు పేరు రేవణ సిద్ధదేవుఁడు.

**అంత్యగద్య :-**

ద్వి. చిరతరస్థితి రొంపిచెర్ల నత్యర్థి
నిరవుగైకొను శంకరేశ్వరుపేర,
వరగుణోదయుఁడు రేవణసిద్ధదేవ
గురుసేవకుఁడు, శైవకులపవిత్రుండు,
అసమశీలుండు గప్పయ గూర్మిసుతుఁడు
యవిరళ భక్తిఁ జోడవ్వ చరిత్ర



కవిజనంబులు మెచ్చగా రచియించె
నీ చమత్కృతి శంకరేశ్వరు కరుణ,
నాచంద్రతారార్కమై యుండుఁగాత
నిది విన్న వ్రాసిన నీప్సితార్థములు
సదమలమతులకు సమకూర్చు శివుఁడు.

ఇఁక కావ్యారంభమున నిట్లున్నది.

ద్వి. సకలాధిపతియైన శంకరేశ్వరుని
వరలబ్ధముననను రేవణ సిద్ధగురుని
కరుణచే నెల్ల సత్కవులు గీర్తించ
వీరచోడవగారి విమలచారిత్ర
మారూఢ మతిఁబూని యక్షగానంబు
గావించెదను సుధాకర మౌళివంశ
పావనోదయుఁడైన ఫాలాంకవిభుని
సుతుఁడు, గుబ్బము గణేశునికి సౌభాగ్య
వతి సోమమాంబకు వర్ణితలీల
నుదయించినాఁడఁ గులోద్ధారుఁడైన
పెదకపోదయ్యకుఁ బ్రియసహోదరుఁడ,
ననఘవర్తనుఁడ రాచయ్యకగ్రజుఁడఁ
జినకపోదాఖ్యుండ, శివకవీంద్రుండ,
గురులింగ యతిగణ గుణసౌరభంబు
లెరిగించు చందంబు లెల్లనుగూర్చి
కారుణ్యనిధికి శంకరునికిఁ బుణ్య
చారిత్ర యొసఁగితి సద్భక్తి వినుఁడి.

*** *** ***

ప్రారంభము :-

సీ. శ్రీరాగలలిత సుస్థిర భావకల్యాణ
చరిత, గౌరీప్రియ, సలలితాంగ,
శంకరాభరణ, భుజంగ నీలాంబర,
సన్నుత భైరవ జనక భర్గ
మలహర, యభవరామ, క్రియాన్వితదేవ
గాంధార యక్షలోక ప్రసన్న
కాంభోజ సౌరాష్ట్ర గౌళ భూపాల సం
సేవిత పాద రాజీవయుగళ,

గీ. యనుచు ననురాగమతిఁ గొనియాడ విబుధ
జన మహీజాత నివహ వసంతుఁ డగుచు
సిరులు దయసేయుచును రొంపిచెరలపురిని
నిరవు శోభిల్లు శంకరేశ్వరునిఁ గొలుతు.

వ॥ అని..... రాచవీటి వీరభద్రుని నేమని కొనియాడుచున్నాఁడు.

వ॥ అని సుకవీంద్రుల నేమని పొగడుచున్నాఁడు.

**ఆటతాళము**

ఫాలలోచనుఁ గొలుచు శరణుల లీలలెల్లఁ జెప్పిన
పాలకురికి సోమనాథునిఁ బ్రస్తుతింతున్.

ఈ కథ బసవపురాణమున నొక యుపాఖ్యానముగా పాల్కురికి సోమనాథునిచే రచింపఁబడెను. దానినే యీ కవి గ్రహించి యిట్లు యక్షగానముగా రచించెను.



కథా ప్రారంభము :-

సీ. కైలాసగిరిమీఁదఁ గఱకంఠుఁడొకనాఁడు
వేడుకతో జూదమాడుచుండి,
నవ్వివ, హిమశైలనందన వీక్షించి
యెత్తుదప్పుదు నవ్వ నేటి కనిన,
నిందులకై కాద యేణాక్షి నిను దక్ష
వాటిలోపల సానెవారలెల్ల
బాలికామణులతోఁ బరిణయం బొనరించి
నను నల్లుఁడని కొల్వ నవ్వువచ్చె

గీ. ననియెఁ గేలుమొగిచి యభవ మామీఁదటఁ
బరిణయంబునకును వెఱపు గల్గు
నట్టి వంశమందుఁ బుట్టి మీ చిత్తంబు
వచ్చినట్లు మెలఁగ నిచ్చ గలదు.

వ॥ అని యమ్మహాదేవుని కీలెఱింగి శైలతనయ తన నిజాంశంబునఁ గన్యచోడుకు వీరచోడునకుం బుట్టించెనట.

*** *** ***

ద్వి. అని యిట్లు పురజను లభినుతిసేయ
ననిశంబు వీరచోడవ్వ చాళుక్య
భీమేశు కథలును, బిరుదు గద్దియలు
నేమించి చదివి బన్నినునెఱింగి;
వలనొప్ప నిట్టి దైవతసార్వభౌముఁ
డిలువేల్పు తనకని యిచ్చలో నమ్మి
యతనికిఁ దనదు ప్రాయముమీఁదు కట్టి

**యతిమోదమున నున్న యవసరం బెఱిఁగి**
**పెనుపరి మదనుండు భీమేశుమీఁది**
**కినుకఁ జోడవ్వపై గెరలెనో యనఁగ**
**సాహసంబున నిక్షుచాప మెక్కించి**
**మోహనాస్త్రము వేసి ముదలకించుటయు -**

వ॥ ఇట్లు శోభనంబులు పాడ నత్యంత వైభవమున నన్యచోడు అల్లుని కరణంబు లిచ్చి కూతు నొప్పగించి, బంధునివహంబులతో గృహంబునకుఁ జనియె.

**త్రిభంగులు**

**చోడకా సానెవాడకై యొక్క**
**వేడుకకాఁడు విచ్చేసెన్.** 1

**ఎమ్మెలే కావు సొమ్మెల్లఁ బెట్టు**
**నిమ్ముల నమ్మికలియఁ బూనెన్.** 2

**వేవేగ భీమభావకుఁ జెప్పి**
**నీవు నావెంట నేతేవే ॥** 3

**వ॥ అని యిట్లు పలికిన తల్లికి నక్కలికి యేమనుచున్నది.**

**జంపె**

**భీమనాయకుఁ డింక నా మనోనాయకుఁడ**
**సీమ నాయకులనేఁ గామింపనేరన్.** 1

వ॥ అటుమీఁదట వీరచోడు దృఢంబుగని భీమేశ్వరుఁ డిచ్చలో మెచ్చి విటరూపంబు మాని యెప్పటియట్లు వర్తింపుచుండె; మఱికొన్ని దినములకు వీరచోడు మంచి ముహూర్తంబున సమర్తాడిన వార్త విని పూజారులు చెలువుగాఁ



జలువచప్పరంబుఁ బన్ని యందునిచి, యుచిత కృత్యంబులు నడుపు సమయంబున, మునుపటి కపటంబు లుడిగి, బంధు జనంబులుం దల్లియు నపరిమిత సంతోషంబునఁ బరిచర్య చేయ వచ్చిరంట ఎటువలెను.

వ॥ ఇట్లు హితజనంబులు దెచ్చునవి యిష్టలింగంబున కొప్పించి, తనవారల కభీష్టంబు లిప్పింపఁదలంచి, యెప్పుగా నప్పులగంబు తన మధురాధరంబునం గీలుకొలుపి, జిహ్వాగ్రంబున శుచిగొని యా సింహ మధ్య యొక్క నెచ్చెలింజూచి మచ్చికలతో నేమనుచున్నది.

**తే. రావె యో చెలి మీ బావగారు**
**ఎంత యాలసించి యుండునో యిందులకును**
**అప్పులగంబు పంపిన దనుచు నిమ్ము**
**ఆస యెఱిఁగిన దని కొనియాడుగాని.**
*****  ***  *****

**ద్వి. అని యిట్లు నెచ్చెలి యాడువాక్యములు**
**విని భీమలింగంబు వికవిక నగుచు**
**వీర బోడవగారి వీరశైవ ప్ర**
**చారంబు భువి ప్రకాశంబు చేయంగఁ**
**దలఁపుచుఁ దలుపు చెంతకుఁ జేరి హస్త**
**జలజాతములు వాని సందుగాఁజాపి**
**కోర గైకొని వట్టి గుజగుజల్మాని**
**యారగించుచుఁ జాల నాలసించుటయు**
**మరఁదలు తలుపుల మాటుగాఁ జూచి,**
**కరమర్థితో భావగారికిట్లనియె.**

వ॥ .......... నెచ్చెలి వెండియు గడుగంగా నా వెండికోరతో నారగించు వాఁడై యుంచుకొని చోడుమీఁది వేడుకను, భీమేశ్వరుఁడు తన పూజారులు పూజింపఁ దెచ్చిన బంగారు గిన్నె కంగున బైట వేయుటయుఁ బొడగని, పుచ్చుకొని యచ్చెలువ యేమనుచున్నది.

*** *** ***

వ॥ అని నేరంబు లెంచు పూజారులఁ వీక్షించి చిరునవ్వు నగి వీరచోడు ఏమనుచున్నది.

మటిమెరేకులు

అన్నలారా నన్ను నేరమెన్న నేలా మంచి వెండి
గిన్నెఁ బుచ్చుకొన్నవాఁడు మున్నె భీమలింగము
గిన్నెఁ దెచ్చి గిన్నె యడుగుకొన్న మేలుగాక దొంగ
వన్నెవెరసి యిచ్చినపుడు విన్నవారు మెత్తురా,
దొంగతనము సొనెవారి వంగడమున లేదు
లింగమునకుఁ గద్దు ఏను గొంగులి(?) ఇచ్చి తెలిపెద.

*** *** ***

ద్వి. అని కొనియాడెడు నవ్వీరచోడుఁ
గనుఁగొని భీమశంకరుఁ డిట్టులనియె,
జలజాతగంధి నీ సద్భక్తిఁజూచి
పులగంబు నే భుజింపుట నిక్కువంబు,
భక్తవత్సలుఁడనై పరగెడు నాకు
శక్తియుఁ గలిమి వంశంబు కారణమె.

*** *** ***



అటుగాన నీవు మహాభక్తురాల
విట నీ చరిత్రంబు లెల్లను జూచి
మెచ్చితి నోహూహు మేలుమే లింక
నిచ్చెద నీకోర్కు లేమైన నడుగు
మనుటయు వీరచోడవ్వ కారుణ్య
వనధి యా పార్వతీశ్వరుని వీక్షించి

*** *** ***

మెచ్చి వేడుమటన్న మేలయ్యేనిపుడు
ఇచ్చోటఁ గూడిన యీ పౌరజనము
లందరుఁ గొలువ నత్యర్థి కైలాస
కందరంబున నుండగా వేడ్క గలదు.

*** *** ***

తో కొని పొమ్మన్న ధూర్జటి యప్పు
డాకాంక్ష వీరచోడవ్వను బౌర
జనులను దోకొంచు సంభ్రమలీల
ననిమిషు ల్గొలువఁ దారాద్రికి నరిగె.

*** *** ***

క. చాతుర్యంబగు నీ కథ
గీతార్థములందు మిగుల గీర్తనకెక్కన్
ఆ తెఱఁగెల్లను నేను పు
రాతన నివహంబు కరుణ రచయిస్తిఁ జుమీ.

## XII. శివలెంక మల్లనారాధ్యుఁడు - వీరభద్ర విజయము

వీరభద్రవిజయమను నీ యక్షగానమున శివకథలనేకము చక్కగా వర్ణింపఁబడినవి. శివలెంక మల్లనకవి మహాదేవరాధ్యుని కుమారుడును, రామాయరాధ్య దేశికుని శిష్యుఁడును. ఇది ఏలూరున వెలసిన జలాపహారీశ్వరున కంకితము చేయఁబడినది.

**గ్రంథాంతగద్య :-** "ఇది శ్రీమద్ భద్రకాళీ వీరేశ్వర వరప్రసాద లబ్ధ వాగ్విభవ, శివలెంకవంశ రత్నాకర రాకానిశాకర, మహాదేవయారాధ్య వరతనూ భవ, మల్లనారాధ్య ప్రణీతంబైన శ్రీవీరభద్రవిజయంబను శృంగార నాటకగేయ ప్రబంధ కథయందుఁ దారకాసుర ప్రహార ప్రతాపంబును నిలువలేక యింద్రాదులు.....జనకాను మతంబునఁ దారక, సింహ, వక్త్ర సూర పద్మా సురుల వధించి లోకంబులకు సుఖంబొనరించుటయు నన్నది తృతీయాశ్వాసము."

**గ్రంథ ప్రారంభము :-**

క. **శ్రీలలనాధిపమిత్రా**
**ఫాలలసద్వీతిహోత్ర, భవ్యచరిత్రా,**
**పాలిత తారక గోత్రా,**
**బాలా హృదయాబ్జమిత్ర, పరమపవిత్రా !**

### దర్వు - ఆదితాళము

**జయ జలాపహారీశా, శమన వినాశా,**
**జయ జయ వ్యోమకేశ, జగదీశా,**



**శరణ మనోబ్జభృంగా, సలలితాపాంగా,**
**పరమసుఖానుషంగా, భవ భంగా,** ॥జయ॥

వ॥ అని యిష్టదేవతా ప్రార్థనంబును, సనాతన నూతన సంస్కృతాంధ్ర కవితాభినందనంబును, గుకవి తిరస్కారంబునుంగావించి యప్పుడు

సీ. **శివతత్త్వ భావాను భవభవ్య విద్యావి**
**భవ మల్లనారాధ్య పరమపౌత్రుఁ**
**డార్య సన్నుత రామయారాధ్య దేశిక**
**చరణపాథోరుహ షట్పదుండు,**
**శివలెంక వంశసంభవ మహాదేవాత్మ**
**భవ మల్లనారాధ్య కవివరుండు,**
**పరతర శ్రీ వీరభద్ర విజయముఖ్య**
**కథ యక్షగానంబుగా రచించి,**

గీ. **వినత పండితకవులెల్ల వినుతిసేయ**
**భాసురంబైన యేలూరి పట్టణంబు**
**నేలుచుండు జలాపహారీశ్వరునకు**
**నర్పితముచేసె వినుడిది యార్యులార!**

# దశమప్రకరణము

## పరిశిష్టము

### పాటలు, రగడలు, దండకములు, వచనములు మొదలైనవి

### I. రంగనమంత్రి - శివభక్తిదీపిక

చక్రపాణి రంగనాథుఁడను వైష్ణవునితోఁ బాల్కురికి సోమనాథునకు మతవిషయ కలహము వాటిల్ల, నతని పుత్రుఁడగు చతుర్ముఖబసవేశ్వరు డతనితో గొప్ప వాదముచేసి జయించెను. పరాజయదుఃఖముతో రంగనాథుడు శ్రీశైల మార్గముననే తిరిగి పోవుచు శ్రీశైల మల్లికార్జునునిఁ జూడక ద్వేషబుద్ధితోఁ బోవుటచే నాతని కన్నులు గ్రుడ్డివయ్యెను. అంత నత డహోబిలమున కరిగి నరసింహస్వామిని ప్రార్థింప స్వామివలన స్వప్నమున శివాధిక్య బోధనమును బడసి లజ్జితుఁడై తిరిగి శ్రీశైలమునకు వచ్చి మల్లికార్జునస్వామిని బహువిధముల స్తుతింప నొక కన్ను వచ్చెను. తర్వాత పాల్కురికి వచ్చి సోమనాథుని క్షమాపణ వేడఁగ రెండవ కన్ను వచ్చెను. అంత సోమనాథుని ప్రార్థించి యతని తనయునిచే రంగన శివదీక్షఁ బడసి, వీరభద్ర విజయ, శరభ చరిత్రాదుల రచించి గురు పాదముల కర్పించెనట.

శ్రీగిరి మల్లికార్జునునిమీఁదఁ జేసిన శివస్తుతియే యీ 'శివభక్తిదీపిక' యను 'నయనరగడ'

ప్రారంభము :-

క. **శ్రీపార్వతీశుఁ జూడక**
**పాపాత్ముఁడ నగుచుఁబోవ పథమునఁ జక్షుల్**
**దీపించు దృష్టి తొలఁగిన**
**శ్రీపతి నడుగంగఁజెప్పె శివుఁడేకీర్తిన్.**

#### రగడ

**శ్రీశైలవల్లభుని శిఖరంబుఁ బొడగంటి,**
**కాశికా పురాధీశు గౌరీశుఁ బొడగంటి,**



**సర్వలోకేశ్వరుని సర్వేశ్వరుఁ బొడగంటి**
**సర్వ సంరక్షకుని సర్వంబుఁ బొడగంటి**
**పరమాత్ము నీశానుఁ బరమేశుఁ బొడగంటి**
**పరమయోగీంద్ర హృత్పద్మనిలయుఁ బొడగంటి**

*****  ***  *****

అంత్యము :-

**కడఁగి సంసారంబు కడగంటి నని కంటి,**
**కడఁగి శ్రీగిరి చెన్ను కారుణ్య మది కంటి,**
**ఘనుఁడు రంగన దూషకరగండ డని కంటి,**
**జనకల్ప తరులలో జయశాలి యని కంటి**
**తవిలి రంగనమంత్రి ధన్యకృతి యని కంటి,**
**భువిలోనఁ బ్రోలాంబ పుణ్యవతి యని కంటి,**
**ఇంక శ్రీగిరిచేర నేఁగందు నని గంటి,**
**శంకరుని కృప వడయ సమయమిది యని కంటి**
**ఇంక నా యెత్తు కృతు లిత్తునని పొడగంటి.**

*****  ***  *****

**మృడుఁడింక నాకృతుల్ మెచ్చునని పొడకంటి,**
**తనర శ్రీరంగకవి దాత యని పొడకంటి,**
**భువిలోపల బ్రసిద్ధపుణ్యుఁ డనఁగాఁగంటి**
**శివభక్తిదీపికా చంద్రార్క మని కంటి,**
**శ్రీగిరీశునకు నర్పింతునని పొడగంటి**
**శ్రీగిరీశ్వరుని కృపచెన్నలరునని కంటి**

## II. నడిమింటి రామయోగకవి - భల్లాణ దండకము

ఈ కవి తండ్రి లక్ష్మీనరసింహుఁడు. ఈ దండకము సమగ్రముగా గలదు.

ప్రారంభము: శ్రీ జానకీమానసాంభోజధామా, నవశ్యామశోభాపరాభూత నీలాంబుదస్తోమ, భామామనఃకామ, కామాంతకస్తుత్య భాస్వద్గుణారామ, రామాభిరామా, మహావీర కోదండరామా, సముద్దామ సంగ్రామరంగ స్ఫురద్భీమ,నా నేర్చు నందంబునన్ నైమిశారణ్య భాగంబునన్ శౌనకాది ద్విజశ్రేణితో సూతుఁడెద్దాని భాషించె నద్దివ్య చారిత్రమున్ పార్వతీభర్త భల్లాణ భూవల్లభున్ బ్రోచుచందంబు పూదండగా దండకం బొప్పగాఁ జెప్పి నీ కంకితం బియ్యమైకొంటి, నా తప్పు సైరించి యాలించవే, తత్కథామాధురీ సాధురీతుల్ ధరామండలం బిందు నా దివ్యమాణిక్యసౌధంబులా, పుష్పితారామ యూధంబులా, రత్నసాలాంబులా, యంత్రజాలంబులా, రాజమార్గంబులా, పౌర వర్ణంబులా దేవభూదేవ భూవల్ల భార్యాంఘ్రి సంజాత గేహంబులా, రమ్య వాహంబులా గంధనాగంబులా, కేళికాగంబులా, మంజురత్నావళీశ్రేణులా ........

**అంత్యము :-** నీ యిష్టసంసిద్ధి గావింతు లెమ్మంచు, నా లోకనాథుండు శ్రీ మల్లమా చల్లమాంబా సమేతంబుగాగన్ రథారూఢుఁ గావించి, భల్లాణ భూపాలుఁ దోడ్కొంచు, రంభానటీనాట్యముల్ మీరగా దుందుభిధ్వానముల్ మ్రోయఁగా, నాత్మకైలాసముంజేర్చి, భృంగీశ్వరా భీష్టవర్గంబులో నొక్కనింగా గటాక్షించి, సర్వప్రపంచావళీ రక్షణాక్షీణ దాక్షిణ్యదీక్షాత్ముడై యుండె దాక్షాయణీప్రాణ నాథుండు శ్రీమధ్య సద్మాన్వయోత్పన్న కౌండిన్య గోత్రాఢ్య లక్ష్మీనృసింహాత్మ భూరామ యోగిప్రణీతైతదుత్తుంగ, భల్లాణరాడ్దండకంబొప్ప నాచంద్రతారార్కమై, శ్రోతృగాతృప్రజాంచచ్ఛుభోదర్కమై, శ్రీమతే వీరకోదండ రామాయ, పట్టాభిరామాయ తుభ్యం నమస్తే, నమస్తే, నమః॥



ఉ. రాణ దలిర్పఁజెప్పి రఘురాముని కంకితమిచ్చినాఁడ భ
ల్లాణ చరిత్రదండక మలక్ష్యము సేయఁగఁబోక యాంధ్ర గీ
ర్వాణ రసజ్ఞులైన కవివల్లభులార పరీక్షసేయుఁ డ
క్షీణ పదార్థ గర్భ రససిద్ధ మదీయ కవిత్వతత్త్వమున్.

## III. పెద్ది వెంకటాచల కవి - సిద్ధేశ్వరస్వామి దండకము

ఈ కవి తండ్రి రమణయామాత్యుఁడు. ఈ కవి 'సిద్ధేశ్వరవసంత విలాసమ'ను పదరచనమును గూడ చేసినాడు. అందు సిద్ధేశ్వరస్వామి యుత్సవ విశేషాదులు వర్ణితములు.

కడపమండలమున సిద్ధవటమునకు యిరువది క్రోసుల దూరమున బాహుదా నది (చెయ్యేరు) దక్షిణతీరమునఁ గల కల్కుడ గ్రామమున వెలసిన సిద్ధేశ్వరస్వామి మాహాత్మ్యప్రతిపాదకమైన దీ దండకము. ఇందు చంద్రగుప్తుని కుమార్తె కల్లు కుండఁ బెట్టుటచే నా గ్రామమున కాపేరు వచ్చినదని మాహాత్మ్యము దెల్పుచున్నది.

**ప్రారంభము:-** శ్రీమన్మహాదేవదేవుండు వామాంకగౌరీవిలాసుండు, వాసుక్య భూషాంగదాంగుఁడు, వాణీశ గర్వాపహారుండు, దైత్యేంద్ర సాంద్ర ప్రతాపాటవీ ధ్వంసవైశ్వానరుండై, సదా భక్తకల్ప ద్రుమాఖ్య ప్రియుండై, వెలుంగీయు శ్రీకుల్కుడగ్రామ శ్రీసిద్ధలింగేశునిన్ సన్నుతుల్ జేతు, శ్రీకేశవస్వామి సంపూర్ణ కారుణ్య వాత్సల్యతన్ దోచు నారీతినే విన్నవింతున్, ధరన్ పూర్వ కాలంబు త్రేతా యుగంబందు, ఇక్ష్వాకువంశోద్భవుండైన శ్రీరామచంద్రుండు, తా పుష్పకారూఢుఁడై వచ్చి, రామేశునందున్ ప్రతిష్ఠించి, కావేరి దర్శించి, కాంచీ పురంబున్ ప్రవేశించి, సౌవర్ణవర్ణావలి న్నొలలున్నాడి, సద్బంధువర్గములు న్గొల్వగా వచ్చి, బాహూనదీప్రాంత భూమిన్ ....... మనోరామమై యొప్పు..........

**అంత్యము:-** వెసన్ శౌనకుండంతయున్ దెల్పఁగా నా కపిల్మౌని సమ్మోదముంజెంద, నిట్లంచు నీ పుణ్యచారిత్ర మెవ్వారలున్విన్న, దీర్ఘాయురారోగ్య వంశాభివృద్ధుల్ తగన్ గల్గునంచున్ మహిన్నొప్పు పెంపారఁగా, దోట్టపల్గ్రామ వాసాఢ్యుఁడై నట్టి, నందాపురీవంశ పాథోధిచంద్రున్, భరద్వాజ గోత్రుండు వెంగన్నకున్ పుత్రుఁడన్ పుత్రుఁడన్, రమణయామాత్య పుత్రుండనే వెంకటాచల్మనేవాఁడ, సిద్ధేశ్వరప్రీతిగా నెమ్మి, నిర్మించితీదండకంబున్, నమస్తే, నమస్తే నమః ॥

**-శ్రీ కల్కుడ సిద్ధేశ్వరదండకం సంపూర్ణము-**

## IV. శంకరవచనాలు - గ్రంథకర్త పేరు తెలియదు

ఇది సమగ్రముగ నున్నది. మొదటి రెండు మూఁడు పంక్తులు నష్టమైనవి. కాని చివరవరకుఁ గలదు. ఇది శైవాద్వైత సంప్రదాయ బోధకమైన యొక వచన గ్రంథము. ఇందు 84 భాగములుగా శివసంబోధనము గలదు. కర్త తెలియదు. ఇందు ప్రతీ భంగికయందును మహాదేవు సంబోధించి ముముక్షువు చెప్పుకొన్నట్లుగాఁ దత్పౌరాణిక విషయ ముఖరమైన వర్ణనము గలదు. ఇందలి రచనములు వేదాంత విజ్ఞానము గలిగి, కవితావిలాసముతో మెరుఁగు పెట్టఁబడినవి. దీని శైలినిబట్టి యీ కవి 14-15 శతాబ్ద మధ్యస్థుఁడని తలంపఁదగును.

**ప్రారంభము :-** ......... నీవు సమస్త లోకోపకారార్థంబుగా సంపాదించిన సాధనంబులు నాకుఁ దొరుకుటంజేసి, నిర్భయస్వాంతుఁడనైతి, ఎట్లంటేని బ్రహ్మహత్యా, సురాపాన, గురుతల్పగమన సువర్ణస్తేయ, తత్సంగతులను మహాపాతకంబు లైదింటినిం గెలువ నై దక్షరంబుల మంత్రం బొక్కటి నాలుకం గీలుకొని యె....... వే భవానీ మనోహరా॥ --(1)



మృత్యుంజయా, నీవు నాకు నకారణ బంధుండవై, చనవిచ్చి నన్ను మూర్ధాభిషిక్తుం జేసితివి. ఎట్లంటేని భవదీయ పాదాభిషేక జలబిందుకణంబులు నా శిరంబు సోకుటంజేసి, యది నాకు, మంగళస్నానం బయ్యె.

**అంత్యము:-** భవదీయ మృదుపాదాంభోజాతాంకిత మహోదార పావన పరాగ పటల క్రాంత మధుర తోయావగాహన నిర్మలదేహినై, యామీఁద గైవల్య బింబాధరీలసత్పయోధరద్వయ కుంకుమ పరాంకిత వక్షస్థల హేలాలోక కౌతూహలుండనై, సుఖం బనుభవించెద. నన్ను నీ వాదరించితివేని అపరాధుం కృతార్థునింజేసిన నన్నాక్షేపించి పలుకనెందైన, నెవ్వరైనఁ గలరే. నన్ను కటాక్షించు. ఇహపరసుఖ ప్రదాయివై రక్షింపవే భవానీ మనోహరా ॥ -(82)-॥

# ఉపసంహారము

వీరశైవాంధ్రవాఙ్మయమునఁ గొన్ని యుత్తమ గ్రంథములున్నవి. వానిని రచించిన కవులు బహు సమర్థులు. అట్టివారిలో పాల్కురికి సోమనాథుఁడు, పిడుపర్తి కవులు, యథావాక్కుల అన్నమయ్య, శ్రీగిరి విరూపాక్షుఁడు, అమలాపురపు సన్యాసకవి, నాగులూరి శేషనార్యుఁడు మొదలైనవారు. వారిని వీరశైవేతర కవులుగూడ ననుకరించి మెచ్చుకొనిరి. ఇఁకఁ గొందఱు పాండిత్యశూన్యులై, పేలవమైన కవిత్వమును భక్తిపరతంత్రులై ద్విపదలో మాత్రము గణబద్ధరచన చేసిన చిత్తారు గంగాధరుఁడు మొదలైన బ్రాహ్మణేతర కవులు గలరు. వీరంతగాఁ బరిగణింపఁదగినవారు గారు.

వీరశైవవాఙ్మయమం దొక విలక్షణ మున్నది. ఇందలి గ్రంథములు విశేషముగా ద్విపదలో వ్రాయఁబడినవి. ద్విపద యిహపరసాధనమని పాల్కురికి సోమనాథుఁడు రచించిన వాక్యము వేద ప్రామాణ్యమై పలువు రీతని మార్గమునే యనుసరించిరి. కాని యితఁడు ద్విపదలో నవలంబించిన 'ప్రాసయతిని' యితని ముఖ్య శిష్యులు, భక్తులునైన పిడుపర్తికవులు మాత్రము దమ ద్విపదలో ననుకరించలేదు. ఈ కారణముచే నీ మతవాఙ్మయమున ద్విపదగ్రంథజాల మధికమైనది. ద్విపద రచనమునకుఁ బ్రాణముపోసిన దీ వీరశైవమత వాఙ్మయమనియే చెప్పవలెను.

ఈ వాఙ్మయమున పురాణ మాహాత్మ్యాదు లందలి కథ లతిశయోక్తులతోఁ గూడికొని యౌచిత్యమును గోల్పోయినవి. అనౌచిత్యము రస భంగమునకుఁ గారణమని పండితులు నాలంకారికులు నుపదేశించినను వీర శైవుల కది యాదర్శప్రాయము గాక పోయినది. ఒక భక్తుని మూలమున నా గ్రామమందలి జను లందఱుగూడ విమానముపై కైలాసమునకుఁ బోవుట, విభూది తాకుఁడుచేత, ఎంగిలి యైన ప్రసాదమును దినుట చేతను చచ్చినవారు బ్రతికిరని చెప్పుట మొదలైనవి యెంత యుత్ప్రేక్షాతిశయోక్తులతోఁ గూడికొనినను, శీఘ్రముగ శివుఁడు మోక్షమొసఁగునని ప్రతిపాదించినను మూఢవిశ్వాస సహితములై మాహాత్మ్యమును బ్రకటించినను, కావ్యకళాదృష్టిలో మాత్ర మవి పరిహాసపాత్రములై నిరాదరణపాలగుచున్నవి.



వీరశైవదీక్షాది మతగ్రంథములందు భక్తులకుఁ బవిత్రమైన శీలము ప్రధానమని చెప్పఁబడి యా శీలలక్షణములు వివరింపఁబడినవి. అంతవఱకు బహుప్రశంసా పాత్రముగనున్నది యీ మతము నీ వాఙ్మయమును గూడ. కాని యీ మతప్రచారమునకై దండనీతినుపయోగింపవచ్చుననెడి శివతత్త్వ సారమందుఁ దెల్పఁబడిన సిద్ధాంతముల నంగీకరించుటకు సరసులెంత మాత్రమంగీకరింపరు. దీనికిని బౌద్ధుల 'అహింసా పరమధర్మము' నకు సాటి యేమి? అంతియకాక వీరశైవభక్తు లే కులమునకుఁ జెందినను, నే వృత్తిచేసినను బాధలేదనెడి భావ మంగీకార్యమే కాని, భక్తుఁడై నంత మాత్రమున శీలమును దోషభూయిష్ఠముగ నున్నను నంగీకార్యమని యెంచి, జార, చోర, హత్యాది శీలముగలవారైనను, శ్రేష్ఠులనియు, భక్తులై యెట్టి ఘోరకార్యమైనను చేయవచ్చుననెడి భావము మాత్రము విరసముగను, విరుద్ధముగ నున్నది. ఈ బోధ కావ్యమున దుర్నీతిని బోధించుచున్నది. కావ్యమున లోకశ్రేయముకొఱకు నీతిని బోధింపవలయునని పండితులందఱునన్ని దేశభాషలందు నంగీకరింపఁ గ నీ శాఖావాఙ్మయ మిట్లుపదేశించుట బహుశోచనీయము.

**బసవపురాణమున, (చూ. పుట, 150)**

**ద్వి.** **ఇల జూదంబునఁ బాండవులు భ్రష్టులైరి,**
**నల జూదమున మూర్ఛ నగజేశుఁగూడె,**
**పరసతీవశ్యులై నరపతుల్ ద్రుంగఁ**
**బరసతీవశ్యుఁడై హరుఁగూడె నంబి,**
**వేటాడి రాముండు వెలఁదిఁగోల్పడియె,**
**వేటాడి యెఱుకు దా విశ్వేశుఁగలసె,**
**చంపి మాండవ్యుండు సరిఁగొర్తఁబడియెఁ**
**జంపి చండుండు ప్రసాదంబుఁగనియె,**

**బొంకినబ్రహ్మకు భువిఁ బుట్టుమాలె,**
**బొంకి చిర్తొండండు బొందితోఁజనియె,**
**గొఱియ ముచ్చని శూద్రకుఁడు నఱకువడియెఁ,**
**గఱకంఠుగణవంది గలగెడెర్వడిచి,**

ఇట్లగుచో శిష్టరక్షణమును, దుష్టశిక్షణమును లేక జగము తారుమారగును; కాన నీ మతవాఙ్మయములు దుర్నీతిభూయిష్ఠములై దుర్గ్రాహ్యములైనవి.

ఇఁక భాషావిషయమునఁ జూచిన నీ వాఙ్మయప్రారంభముననే పాల్కురికి సోమనాథుఁడు భాషను నిరంకుశముగ, నియమరహితముగ వాడినాఁడు. తక్కిన శైవకవులుగూడ నీ మార్గమునే యవలంబించుటచే నీ వాఙ్మయమున భాష కూడ నుత్తమమైనది కాకపోయినది. తర్వాత రచనావిధానము నాలోచించినచో నీ వాఙ్మయమున విశేష భాగ మూకదంపుడు రచనయేకాని, బిగువుగల్గిన ప్రౌఢమైన భావములతోఁగూడిన రచనము గాదు. అందుచే సారస్వతప్రియులు నేర్చుకొనఁదగిన దేదియు లేదు. కాని యీ మతమందు మూఢవిశ్వాసము గలవారికి మాత్ర మీ సారస్వతము వేదప్రమాణమై యుండును. ఇవి దోషములుగ వారికిఁ గనఁబడవు.

పిమ్మట మతదృష్టితో విచారించినచో వీరశైవుభక్తి తమోగుణప్రధానమై, యుద్రేకముతోఁ గూడికొనినది. అసలు శివుఁడే తమోగుణుఁడు. వీరశైవభక్తునకు, మారామ మధికము. కన్నులు పెరికికొనుట, కాళ్లు నఱికికొనుట మొదలైనవి యధికము. ఇవి యొక గారడీ విద్యగా ప్రదర్శింపఁబడెను. అందుచే నీ మతమునకు, వాఙ్మయమునకు గూడ క్రమముగ గౌరవము తగ్గినది. సారస్వత దృష్టిలో, విగళిత వేద్యాంతరమును, బ్రహ్మానందమును గూర్చు రమణీయ ప్రతిపాదకము దీనియందు చాల తక్కువ.

ఇఁక ఆంధ్రమున శతకవాఙ్మయమునకు మార్గదర్శకులే వీరశైవకవులని చెప్పవలసియున్నది. పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకమును, యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వరశకతకమును. శివతత్త్వసారముతోఁబాటు, వీరశైవాంధ్ర శతక వాఙ్మయముననేగాక, యసలాంధ్ర శతక వాఙ్మయముననే ప్రప్రథమములు. ఇవి చక్కని భక్తిద్యోతకములై బహు రసవంతముగా నుండి ధారాశుద్ధితో నొప్పుచున్నవి. పిమ్మట యక్షగానములతో వీరశైవాంధ్రవాఙ్మయము తన వైవిధ్యము చాటుటయే కాక, ప్రదర్శనార్హతగల దృశ్యకావ్యముల



నిర్మింపజేసి తన వ్యక్తిత్వమును బ్రకటించినది. నిమ్మనాథుని నిజలింగ చిక్కయకథయు, వాలె కోటయ్య రచిత చిరుతొండ భక్తకథానిధానమును, అనుమోద సన్యాసికృత బసవకళ్యాణమును, బాలపాపాంబ రచించిన అక్కమహాదేవి చరిత్రయు పేర్కొనదగినవి. నిజలింగ చిక్కయకథయందు చిక్కయ పాత్రపోషణము చక్కగ నిర్వహింపఁబడినది. చిరుతొండని కథయందు శివునిపై భక్తి రమణీయముగఁ బోషింపఁబడినది. సామాన్యముగ ప్రాచీన కాలమున శివరాత్రిజాగరణ సమయమున శైవు లీ యక్షగానముల ప్రదర్శించి యుందురు. కడకు దండకములు, కీర్తనలు, వచనములు మొదలైనవి యీ వాఙ్మయమున శివభక్తిప్రధానములై ప్రశంసాపాత్రములుగనే యున్నవి.

# అనుబంధము-1

## వీరశైవాంధ్రకవులు - వారి గ్రంథములు

1. మల్లికార్జునపండితారాధ్యుఁడు :- శివతత్త్వసారము.

2.పాల్కురికి సోమనాథుఁడు:- (1) బసవపురాణము (2) పండితారాధ్య చరిత్రము

(3) అనుభవసారము (4) చతుర్వేదసారము

(5) బసవోదాహరణము (6) వృషభాధిపశతకము

(7) బసవరగడ (8) చెన్నమల్లు సీసములు

3. పిడుపర్తి బసవన:- (1) గురుదీక్షాబోధ (2) పిల్లనయనారుచరిత్ర

(3) బ్రహ్మోత్తరఖండము.

4. పిడుపర్తి సోమన:- (1) పద్యబసవపురాణము (2) ప్రభులింగలీలలు (ద్విపద)

5. పిడుపర్తి బసవప్ప:- (1) పద్యప్రభులింగలీలలు.

6. యథావాక్కుల అన్నమయ్య:- సర్వేశ్వరశతకము

7. ప్రర్వతమంత్రి లింగన:- (1) వీరమాహేశ్వరాచార సంగ్రహము

(2) రుద్రాక్షమాహాత్మ్యం

8. కుంటముక్కల తిరుమలనాథుఁడు:- (1) శైవాచారసంగ్రహము

9. శివరామలింగకవి :- వీరశైవాచారసంగ్రహము

10. చెన్నాప్రగ్గడ నాగేశ్వరకవి:- (1) శైవసిద్ధాంతశిఖామణి

(2) గణ సౌజన్యాఖ్యానశతకము.

11. శెప్పెల్ల అప్పనార్యుఁడు:- శైవాగమశిఖామణి

12. సిద్ధనాథుఁడు:- షట్థ్సలదర్పణము

13. సోమన:- గురుబోధ

14. గణపనారాధ్యుడు:- మనోబోధ

15. పరమానందయతి :- (1) శివజ్ఞానమంజరి (2) శివముకుందశతకము

(3) సంపంగిమన్న శతకము

16. రేవణసిద్ధనలు :- ప్రభుదేవరవాక్యము

17. మహాదేవకవి:- బసవపురాణము

18. తుమ్మలపల్లి నాగభూషణకవి :- (1) బసవవిజయము

(2) సోమవార వ్రతమాహాత్మ్యము

19. నల్లనగండ్ల నారనారాధ్యుఁడు :- బసవ విజయము

20. బచ్చు సిద్ధకవి :- మణిబసవపురాణము.

21. అత్తలూరి పాపకవి:- (1) చెన్న బసవపురాణము (2) శ్రీశైలమాహాత్మ్యము

22. వింటి ఔబళకవి:- శివరహస్యఖండము

23. వీరభద్రకవి:- శివరహస్యఖండము

24. కోడూరు వెంకటాచలకవి :- శివరహస్యఖండము

25. ముదుకొండ బ్రహ్మయలింగారాధ్యుడు :- శివరహస్యఖండము

26. భద్రకవి లింగకవి :- దేవాంగపురాణము

27. రొబ్బి వీరభద్రకవి:- దేవాంగపురాణము

28. నాగులూరి శేషనారాధ్యుఁడు :- శ్రీశైలమాహాత్మ్యము

29. అమలాపురపు సన్యాసికవి:- రుద్రాక్షఫలమాహాత్మ్యము (2)శివశతకము

(3) ప్రమథగణమాలిక

30. పోచిరాజు వీరయకవి:- (1) విభూతిరుద్రాక్షమాహాత్మ్యము (2) భల్లాణచరిత్ర

31. అక్కనార్యుఁడు:- శివరాత్రిమాహాత్మ్యము

32. రెంటాల వీరనారాధ్యుఁడు:- పంచాక్షరీమాహాత్మ్యము

33. కూచిమంచి తిమ్మకవి :- (1) శివలీలావిలాసము (2) భల్లాణచరిత్ర

34. వాలేశ్వరుడు :- భల్లాణచరిత్రము

35. చిత్తూరు గంగాధరుఁడు:- (1) భల్లాణచరిత్ర (2) గంగావివాహము (3)సిరియాళచరిత్రము (4) చెన్న మల్లేశ్వరశతకము

36. గరికిపాటి తమ్మయ్య :-సిరియాళచరిత్ర

37. అజ్జరపు పేరయలింగము:- ఒడయనంబివిలాసము

38. కాశీనాథుని వీరారాధ్యుడు:- ధర్మగుప్తాభ్యుదయము

39. మరింగంటి వెంకటాచార్యుడు:- మల్లారి చరిత్రము

40. ఎడపాటి ఎఱ్ఱన్న:- మలహణచరిత్రము

41. పాలిశెట్టి లింగన :- నవచోళచరిత్రము

42. గౌరన:- నవనాథచరిత్రము

43. సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి :- రేణుకచరిత్రము

44. దెందులూరి పద్మనాభుఁడు :- అల్లమప్రభుశతకము

45. వేల్పూరి విస్సన్న-సాంబశివుడు:- విశ్వేశ్వరశతకము

46. శ్రీగిరి విరూపాక్షుఁడు :- శ్రీకాళహస్తిలింగశతకము

47. పండితారాధ్యుల వీరేశలింగము:- భవానీశతకము

48. మల్లంపల్లి బుచ్చయ్య శాస్త్రి:- మహిషాసురమర్దనీశతకము

49. పరిమి వెంకటాచలకవి:- సంగమేశ్వరము



50. సోమకవి:- సోమేశశతకము

51. తటవర్తి కొండయ్య:- మల్లేశ్వరశతకము

52. శివదేవ మంత్రి:-

53. రెగళిగ నిమ్మనాథుఁడు :- (1) గురునంబిచరిత్రము (2) నిజలింగ చిక్కయకథ

54. కానూరి వరవీరభద్రుఁడు :- బసవమహిమామృతవిలాసము

55. వాలె కోటయ్య :- చిఱుతొండభక్తకథానిధానము.

56. అనుమోదసన్యాసి :- బసవకల్యాణము

57. బాలపాపాంబ :- అక్కమహాదేవిచరిత్ర

58. జక్కన సాంబయ్య :- భల్లాణచరిత్ర

59. లింగమూర్తి :- శివపారిజాతము

60. అలపాక పెద్ది :- భల్లాణనాటకము

61. గుఱ్ఱము కపోతయ్య :- వీరచోడవ్వచరిత్రము

62. శివలెంక మల్లనారాధ్యుఁడు :- వీరభద్రవిజయము

63. రంగనమంత్రి:- శివభక్తిదీపిక

64. నడిమింటి రామయోగి:- భల్లాణదండకము

65. పెద్ది వెంకటాచలకవి:- సిద్ధేశ్వరస్వామిదండకము

66. సాంబయ్య:- వీరచోడప్పకథ

67. అల్లమరాయఁడు:- మహాదేవిచరిత్రము

68. శంకుల చోడయ్య:- వీరభద్రవిజయదండకము

69. కొమ్మరాజు రామలింగకవి:- వీరభద్రశతకము

70. విశ్వనాథకామయ్య:- అమరావత్యుమామాహేశ్వరశతకము

71. శివయోగీంద్రుఁడు:- అన్యవాదకోలాహలము

72. పెద కంపరాయఁడు:- గంగాగౌరీవిలాస యక్షగానము

73. గురుసిద్ధలింగము:- కురవంజి

74. భద్రారాధ్యుఁడు:- అఖండ బ్రహ్మానంద వీరశైవరహస్యపదవి

75. బసవన్న :- భల్లాణచరిత్రము

76. నింబాద్రిరాజు:- భల్లాణచరిత్రము

77. ఈవని వీరభద్రకవి:- సోమవారమాహాత్మ్యము

78. సిద్ధేంద్రయోగి :- యోగీశ్వరవిలాసము

79. శ్రీగిరిమల్లికార్జునస్వామి :- సోమవారమాహాత్మ్యము



## అనుబంధము - 2

## వీరశైవాంధ్ర ద్విపదగ్రంథములు - తత్కర్తలును

1. బసవపురాణము :- పాల్కురికి సోమనాథుఁడు
2. పండితారాధ్యచరిత్రము:- పాల్కురికి సోమనాథుఁడు
3. గురుదీక్షాబోధము :- పిడుపర్తి బసవన
4. ప్రభులింగలీలలు:- పిడుపర్తి సోమనాథుడు
5. వీరమాహేశ్వరాచారసంగ్రహము :- పర్వతమంత్రి లింగన
6. రుద్రాక్షమాహాత్మ్యము :- పర్వతమంత్రి లింగన
7. శైవసిద్ధాంతశిఖామణి :- చెన్నాప్రగడ నాగేశ్వరకవి
8. గురుబోధ :- సోమన
9. శివజ్ఞానమంజరి :- పరమానందయతి
10. బసవవిజయము :- నల్లనగండ్ల నారనారాధ్యుఁడు
11. మరిబసవపురాణము :- బచ్చు సిద్ధకవి
12. శివరహస్యఖండము:- వింటి ఔబళకవి
13. దేవాంగపురాణము :- భద్రకవి లింగకవి
14. విభూతిరుద్రాక్షమాహాత్మ్యము :- పోచిరాజు వీరయకవి
15. సోమవారమాహాత్మ్యము :- శ్రీగిరి మల్లికార్జునస్వామి
16. భల్లాణచరిత్రము :- చిత్తారు గంగాధరుడు

17. గంగావివాహము:- చిత్తారు గంగాధరుడు

18. సిరియాళచరిత్రము:- చిత్తారు గంగాధరుడు

19. మల్లారిచరిత్రము :- మఱింగంటి ఎఱ్రనార్యుడు

20. నవచోళచరిత్ర :- పాలిశెట్టి లింగన

21. నవనాథచరిత్ర :- గౌరన

22. సిద్ధేశ్వరచరిత్ర:-

23. సోమవారమాహాత్మ్యము :- ఈవని వీరభద్రకవి

24. యోగీశ్వరవిలాసము :- సిద్ధేంద్రయోగి

**అనుబంధము -3**

**ఏక కథావిషయము నాశ్రయించి చేసిన వివిధరూప రచనలు - తత్కర్తలు.**

| 1 | 2 | 3 | 4 | 5 |
|---|---|---|---|---|
| **కథావిషయము** | **పద్యకావ్యము** | **ద్విపద** | **యక్షగానము** | **దండకము** |
| 1. బసవపురాణము | 1.మహాదేవకవి<br>2 పిడుపర్తిసోమన | 1.పాల్కురికిసోమనాథుడు | | |
| 2. బసవవిజయము | 1.తుమ్మలపల్లి నాగభూషణము | 1. నల్లనగండ్ల నారన | 1. అనుమోద సన్యాసి<br>2. కానూరువర వీరభద్రకవి | |
| 3. శివరహస్యఖండము | 1.వీరభద్రకవి<br>2.కోడూరువెంకటాచలకవి | 1.వింటి ఔబళకవి | | |
| 4. దేవాంగపురాణము | 1.రొచ్చి వీరభద్రకవి | 1.భద్రకవి లింగకవి | | |
| 5.వీరశైవాచారసంగ్రహము | 1. కుంటముక్కల తిరుమలార్యుడు<br>2. శివరామలింగకవి | 1. పర్వతమంత్రి లింగన | | |
| 6. శ్రీశైలమాహాత్మ్యము | 1. నాగులూరి శేషనాచార్యులు<br>2. అత్తలూరి పాపకవి | 1. కర్తపేరు తెలియదు | | |
| 7. రుద్రాక్షమాహాత్మ్యము | 1.అమలాపురపు సన్యాసి | 1. పర్వతమంత్రి లింగన | | |
| 8. సోమవారవ్రతమాహాత్మ్యము | 1.తుమ్మలపల్లి నాగభూషణకవి | 1.ఈవని వీరభద్రకవి<br>2. శ్రీగిరి మల్లికార్జునకవి | | |

## అనుబంధము - 4

## కర్తృనామములు తెలియని వీరశైవాంధ్రగ్రంథములు

1. శ్రీశైలమాహాత్మ్యము
2. శ్రీశైలఖండము
3. శ్రీశైలస్థలవివరణము (వచనము)
4. సోమవారవ్రతమాహాత్మ్యము
5. సిద్ధేశ్వరచరిత్రము
6. శివశతకము
7. గుహేశలింగశతకము
8. శివపారిజాతము (యక్షగానము)
9. సాంబశివవిలాసము (యక్షగానము)
10. శంకరవచనాలు



## అనుబంధము - 5

## నష్టగ్రంథములు - తత్కర్తలు

1. పిల్లనైనారుచరిత్ర:- పిడుపర్తి బసవన
2. పండితారాధ్యచరిత్ర:- శ్రీనాథకవి (పద్యకావ్యము)
3. నవనాథచరిత్ర:- శ్రీగిరికవి (పద్యకావ్యము)

